శ్రీ మాలోల గ్రంథమాల

తొమ్మిదవ పుష్పము

శ్రీ మద్వేదాంత దేశిక ప్రణీత

# పాదుకా సహస్రమ్

శ్రీ కె. వి. రాఘవాచార్య విరచిత

రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యా సహితము

సంపుటము - 4 VOLUME - 4

శ్రియై నమః

శ్రీవేదాంత దేశిక ప్రణీత

శ్రీ రంగనాథ

# పాదుకా సహస్రమ్

**శ్రీ కె.వి. రాఘవాచార్య విరచిత**

రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యా సహితము

నాలుగవ సంపుటము

ప్రచురణ

శ్రీ మాలోల గ్రంథమాల

శ్రీ అహోబిలమఠం, హైదరాబాదు.

శ్రీ వేదాంత దేశిక ప్రణీత
శ్రీరంగనాథ

# పాదుకాసహస్రమ్

శ్రీ కె.వి. రాఘవాచార్య విరచిత
రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యా సహితము
(తెలుగు మరియు నాగరలిపిలో మూలము)

నాలుగవ సంపుటము

ప్రథమ ముద్రణము 2001

ప్రతులు : 1000

ప్రచురణకర్తలు
శ్రీ మాలోల గ్రంథమాల
శ్రీ అహోబిల మఠం, హైదరాబాదు

© సర్వస్వామ్యములు
ప్రచురణకర్తలవి

వెల : రు.100/-

ప్రాప్తిస్థానము
శ్రీ మాలోల గ్రంథమాల
శ్రీ అహోబిల మఠం,
దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ,
హైదరాబాదు - 500 013.
ఫోను : 7612043

అక్షర కూర్పు
వివేక్ గ్రాఫిక్స్
నల్లకుంట, హైదరాబాద్.

ముద్రణ
సరస్వతీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
నల్లకుంట, హైదరాబాద్-500 044.
ఫోన్ : 7612180

**Sri Vedanta Desika's**
**Sri Ranganatha**
**Paduka Sahasram**
**with**
**Telugu Commentary**
**by**
**Sri K.V. Raghavacharia**
(with Text in Telugu and
Devanagari Scripts)

Vol. 4

First Edition 2001

Copies : 1000

Published by
**Sri Malola Granthamala**
**Sri Ahobila Muth**
Hyderabad

© **Publishers**

Price : **Rs.100/-**

Copies available at
**SRI MALOLA GRANTHAMALA**
Sri Ahobila Muth
Durgabai Deshmukh Colony
Hyderabad - 500 013.
Tel : 7612043

Laser Composing by
**Vivek Graphics**, Nallakunta,
Hyderabad - 500 044.

Printed at
**Saraswathi Offset Printers**
Nallakunta, Hyderabad - 500 044.
Ph : 7612180

# ప్రకాశకుల విజ్ఞప్తి

శ్రీమదహోబిలమఠం 44వ పట్టమున వేంచేసియుండిన శ్రీ శ్రీవణ్ శఠకోప శ్రీవేదాన్తదేశిక యతీంద్రమహాదేశికులవారి మంగళాశాసనముచే హైద్రాబాదులో అహోబిలమఠం స్థాపింపబడినది. దానికి అనుబంధముగా శ్రీ మాలోల గ్రంథమాల ఆదేశికులవారి అనుగ్రహము చేతనే ప్రారంభింపబడింది. ఇంతవరకు శ్రీమాలోల గ్రంథమాల అనేక సంప్రదాయగ్రంథములను ప్రచురించిన సంగతిని భక్తజనావళికి ఎప్పటికప్పుడు విన్నవించు కొనుచున్నాము.

పదమూడవశతాబ్దిలో పవిత్రభారతావనినలంకరించిన శ్రీమద్వేదాన్తదేశికులవారు అనుగ్రహించిన వివిధ గ్రంథములలో 'శ్రీరంగనాథ పాదుకాసహస్రము' అను స్తోత్రకావ్యము సంసారులను సులభంగా తరింపచేయు గొప్ప ప్రభావముకలద'ని విజ్ఞులకు తెలిసినదేకదా!

'పాదుకాసహస్రము' నకు 700 సంవత్సరాల కాలములో తెలుగు వ్యాఖ్యానము మాత్రము ప్రచురింపబడలేదు. ప్రస్తుతము శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యస్వామి వారు ఈ స్తోత్రకావ్యమును, అందరికి అర్థమగునట్లు సులభశైలిలో, రమణీయాంధ్ర టీకాతాత్పర్యవ్యాఖ్యాన సమీతముగా రచించి అహోబిలమఠ మునకందజేయుట దైవనిర్ణయముగా భావించుచున్నాము.

ఈ ఉద్గ్రంథమును ఐదుసంపుటములుగా వెలువరింపదలచి, ఇదివరకే మూడు సంపుటములను ప్రచురించి ఆంధ్రభాషాబాషీయులైన భాగవతోత్తములకు శ్రీమాలోలస్వామి కృపచేత సమర్పించుకొన్నాము.

శ్రీ శ్రీవణ్శఠకోప శ్రీనారాయణయతీంద్రమహాదేశికుల 45వ పీఠాధిపతుల - కరకమలాలచే శ్రీపాదుకాసహస్రమ్' మొదటి సంపుటము తేది 18-2-1996నాడు, రెండవసంపుటము తేది 22-2-1998 నాడు ఆవిష్కరింపబడినవి. మూడవసంపుటముకూడ వెలువడి సంవత్సరార్థమైనది.

శ్రీ మాలోల గ్రంథమాల సంచాలకులు, గొప్పమేధావులు, తలచిన కార్యమును నిర్ణీతసమయములో నిర్వహించు సర్వసమర్థులైన శ్రీమాన్ వి.పి. రాఘవాచార్యుల వారు శ్రీమాలోల స్వామి ఆజ్ఞచే వారి ఆచార్య తిరువడిని చేరుకొని ఒక సంవత్సర కాలమైనది. వారి అధ్యక్షతలో సుశిక్షితులైన కార్యవర్గ సభ్యులు, ప్రకాశకులు ఇప్పుడు 'పాదుకాసహస్రమ్' నాల్గవసంపుటమును, 20 నుండి 29 అనగా 10 పద్ధతులు, 681 నుండి 910 అనగా 230 శ్లోకములు కలదానిని కూడ శ్రీవైష్ణవ జనసందోహమునకు సమర్పించుకోగలగడం భాగ్యవిశేషము.

ఈ సంపుటమునకు కూడ మంగళాశాసనమును అనుగ్రహించిన శ్రీశ్రీ అళగియశింగర్ గారికి సాష్టాంగ ప్రణామములు.

విద్వాంసులు, శ్రీమాన్ ఆసూరి మాధవాచార్యులు ఈసంపుటమునకు తమ అభిప్రాయమును ప్రకటించినందువలన వారికి మాహార్దిక అభివందనములు.

ప్రతిసంపుటమునకువలె, ఈ సంపుటమునకు కూడ తమ 'రివ్యూ' ను ప్రకటించుటకనుమతించిన శ్రీమతి డా॥ ప్రేమానంద కుమార్ (శ్రీరంగం) గారికి మాకృతజ్ఞతాపూర్వకవందనములు.

ఈ సంపుటమును ముద్రించుటకై ఉదారవిరాళాలొసగిన దిగువ ప్రకటనకర్తలకు మా కృతజ్ఞతాభివందనములు.

| | | |
|---|---|---|
| 1. | స్వామి శివానంద చారిటబుల్ ట్రస్ట్, పట్టమాడై, తిరునల్‌వేళి. | 47,800/- |
| 2. | శ్రీ టి.యన్. రామక్రిష్ణన్, సికింద్రాబాద్ | 10,000/- |
| 3. | శ్రీ ఎ. ప్రకాశ్, గగన్‌మహల్, హైదరాబాద్ | 5001/- |
| 4. | శ్రీ ఎన్.వి. రంగనాథన్, అడ్వకేట్, హైదరాబాద్ | 2000/- |
| 5. | శ్రీ యం.యస్. సంపత్, చెన్నై | 2000/- |
| 6. | శ్రీ యం. పాండురంగారావు, అడ్వకేట్, హైదరాబాద్ | 1116/- |
| 7. | డా॥ పి. శశిరేఖ, విద్యానగర్, హైదరాబాద్ | 1116/- |
| 8. | శ్రీ వి. కోదండ రామారావు, హైదరాబాద్ | 1116/- |
| 9. | శ్రీ యం. రాఘవరెడ్డి, బేగంపేట్, హైదరాబాద్ | 1006/- |
| 10. | శ్రీ ఎ. రామారావు, కాంట్రాక్టర్, సికింద్రాబాద్ | 1116/- |
| 11. | శ్రీ మంగరాజు శ్యామ్‌కుమార్ | 1116/- |
| 12. | శ్రీ టి.ఆర్.వి. సత్యనారాయణ | 516/- |
| 13. | శ్రీ పి. లక్ష్మినారాయణ | 500/- |
| 14. | శ్రీ వి.యల్. నరసింహారావు | 251/- |
| 15. | శ్రీ బి. సత్యనారాయణ | 200/- |
| 16. | శ్రీ యం.యస్. మూర్తి | 200/- |
| 17. | శ్రీ సుబ్బారావు | 131/- |
| 18. | శ్రీ టి.యస్.యన్. మూర్తి | 101/- |
| 19. | శ్రీ కె. శ్రీనివాసన్ | 101/- |

ఈసంపుటమునకు కూడ ముఖచిత్రమును సమకూర్చిన చిత్రకారులు శ్రీ జి. శివరాంగారికి, ఈ గ్రంథమును కూడ అందముగా అచ్చువేసి ఇచ్చిన శ్రీ సరస్వతి ఆఫ్ సెట్ ప్రింటర్స్ (నల్లకుంట) గారికి మాధన్యవాదములు.

గ్రంథముద్రణ విరాళాలు సేకరించుటకు తోడ్పడిన మఠం మేనేజర్ పి. శ్రీనివాసాచార్యులకు మా ప్రశంసలు. ఆచార్య యం.వి. సౌందర రాజన్ సలహా సహకారములిచ్చి తోడ్పడినారు. వారికి మరియు టీకా తాత్పర్య వ్యాఖ్యానములు సమకూర్చుటయేకాక ప్రూఫులు దిద్ది, ముఖ్య ప్రతిని సరిచూచి సహకరించిన శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులకు కృతజ్ఞతాభివందనములు. శ్రీ అహోబిలమఠం కార్యవర్గ సభ్యులు, మరియు ఎందరో ప్రోత్సాహసహకారాలు అందజేశారు. వీరందరికి మా ధన్యవాదములు.

ఐదవ (5) సంపుటము ముద్రణకు సిద్ధముగా ఉన్నది. దీని ప్రచురణకు ఒక లక్షరూపాయలు వెచ్చించ వలసియున్నది. కాబట్టి భక్తులు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు త్వరగా చివరిసంపుటం ముద్రణకు ఉదార ధనసహాయమును అందచేసి శ్రీమాలోలుని కృపకుపాత్రులుకాగలరను విశ్వాసముతో విజ్ఞప్తి చేయుచున్నాము.

శ్రీఅహోబిలమఠం,
2-2-20/బి,దుర్గాబాయిదేశ్‌ముఖ్‌కాలనీ,
హైద్రాబాదు. 500 013
తేది : 25-1-2001.
శ్రీఅహోబిలమఠం.

విక్రమ మాఘశుక్ల ప్రతిపద, గురువారము.

ఇట్లు
మాలోలగ్రంథమాల
ప్రకాశకులు,

# ఈ నాల్గవ సంపుటములో...


| | | | పుట |
|---|---|---|---|
| మంగళా శాసనములు, ప్రకాశకుల విజ్ఞప్తి | | | |
| 1. | ఇంద్రనీల పద్ధతి | (20) | 1 |
| 2. | బింబప్రతిబింబ పద్ధతి | (21) | 28 |
| 3. | కాంచన పద్ధతి | (22) | 44 |
| 4. | శేష పద్ధతి | (23) | 67 |
| 5. | ద్వంద్వ పద్ధతి | (24) | 79 |
| 6. | పాదుకాసంనివేశపద్ధతి | (25) | 98 |
| 7. | యంత్రికా పద్ధతి | (26) | 116 |
| 8. | రేఖా పద్ధతి | (27) | 124 |
| 9. | సుభాషిత పద్ధతి | (28) | 132 |
| 10. | ప్రకీర్ణ పద్ధతి | (29) | 143 |
| అనుబంధము | | | |
| 230 శ్లోకాలు | | నాగరలిపి | 219 |
| 230 శ్లోకాలు | | తెలుగులిపి | 242 |
| Review | | | 269 |

॥ श्रीः ॥

SRIKARYAM

**SRI AHOBILA MUTT**

ஸ்ரீ அஹோபில மடம்

Camp MUMBAI

Sri K. Devanathan
Chairman,
Sri Ahobila Muth,
~~2-2-20/B,~~
D.D. Colony,
HYDERABAD

Date 23.1.200199

॥ श्रीमते श्री लक्ष्मीनृसिंह परब्रह्मणे नमः ॥

॥ श्रीमते श्री लक्ष्मीनृसिंह दिव्यपादुकासेवक श्रीवण्शठकोप श्री नारायण यतीन्द्र महादेशिकाय नमः ॥

రమణీయాంధ్ర టీకాతాత్పర్య వ్యాఖ్యా సహితమైన పాదుకాసహస్ర గ్రంథము శ్రీవారిచే కటాక్షించి అనుగ్రహించబడినది.

ఆచార్య సార్వభౌములైన శ్రీవేదాంతదేశికులవారు శ్రీరంగనాథునిమీద వారికి ఉన్న భక్తి పరివాహంగా రచియించిన స్తోత్రరూపమహా కావ్యము ఈ గ్రంధము. ఇందులో సకల వేదాంతార్థములున్ను పొందుపరచబడియున్నవి.

భక్తిరసభరితమైనది. భావప్రధానమైనది. ఒకరాత్రి యందు ఒక యామకాలములోనే సృష్టించిన ఆశ్చర్యమిందులో కలదు. ఈ స్తోత్రమునకు ఎన్నో వ్యాఖ్యానాలు కలవు. అయినను ఆధునిక భక్తులను అనుసరిస్తూ తెలుగు భాషా వ్యాఖ్యానము శ్రీమాన్ గౌరవనీయులగు కె.వి. రాఘవాచార్యులచేత రచించబడి నాల్గవ సంపుటముగా ఇప్పుడు ప్రకాశితమగుచున్నది. అందుచేత ఆంధ్రదేశస్థ భక్తాదులకు ఇది చాలా ఉపయోగకరము. విశదార్థ జ్ఞానదాయకము. భగవద్భక్తవర్యులందరు దీనిని చదివి తరించవలసిందిగా శ్రీవారి ఆశయము. తత్ఫలితముగా పాదుకాదేవి దివ్య కటాక్షపాత్రులు కాగలరని తిరువుళ్లము.

ఇట్లు శ్రీవారి నియమనానుసారం.

व. दे. रङ्गराजाचार्यः

व.दे. रङ्गराजाचार्यः
SRI KARYAM
(Principal Secretary to H.H. Jear)
Sri Ahobila Mutt

శ్రీమతే వేదాన్త రామానుజ మహాదేశికాయ నమః

శ్రీమతే నిగమాంత మహాదేశికాయ నమః

శ్రీరంగనాథ దివ్యమణి పాదుకాభ్యాం నమః

శ్రీమాన్ నిగమాంత మహాదేశికులు మనటువంటి చేతనులు మోక్షము చెందుటకై ప్రచురించిన గ్రంధములు అనేకములు. వాటిలో గొప్పనైనది పెరియ పెరుమాళ్ళ పాదుకల విషయము అనుగ్రహించుటచే శ్రీ పాదుకా సహస్రము మిక్కిలి సుప్రసిద్ధమైనది. ఈ పాదుకా సహస్రము వాల్మీకిచే రచింపబడిన శ్రీమద్రామాయణమునకు సమానమైనది. ఈ స్వామి "ధత్తేముకుంద మణిపాదుకయోః నివేశాత్ వల్మీక సంభవగిరా సమతాం మమోక్తిః" అని అనుగ్రహించినారు.

శ్రీమద్రామాయణముకన్న మిక్కిలి ప్రభావము గలది శ్రీ పాదుకా సహస్రము. వాల్మీకిచే రచింపబడిన శ్రీమద్రామాయణము కుశలవులచే శ్రీరామచంద్రుని ప్రభువుముందు గానము చేయబడినది. ఆ సమయమున సీతాదేవివారి సన్నిధిలో లేదు. ఐనను శ్రీపాదుకాసహస్రము స్వామి వేదాంత దేశికులవారు రచించి గానముచేయగా శ్రీరంగనాథులు మరియు రంగనాయకి అమ్మవారు శ్రవణము చేసిరి. ఈ విశేషం రామాయణమున కనపడదు. "పరిషది సహలక్ష్మ్యాపాదుకే రంగనాథః", అన్నదే ప్రమాణం.

శ్రీ పాదుకా ప్రభావమును 1008 శ్లోకములచే శ్రీవేదాంత దేశికులవారు అనుగ్రహించిరి. భగవంతుని సేవించుటకన్న అతని పాదుకలు సేవించుట మిక్కిలి ఉత్కృష్టమైనవని అంతరార్ధము.

శ్రీరాముడు అయోధ్యను పరిత్యజించి వెళ్ళినపుడు, భరతాళ్వారులు రాముని శరణాగతి వేడి అయోధ్యకువచ్చి పట్టాభిషేక మొనర్చుకొని రాజ్యమేలుమని ప్రార్థించినపుడు అతని విన్నపమువిని శ్రీరామచంద్రస్వామి భరతునలకు అనుగ్రహ పూర్వకముగా తనపాదుకల నొసంగెను. అట్టి పాదుకలను శిరస్సున నిడుకొని రథారూఢుడై మిక్కిలి సంతోషమున సకల లోకాచార్యుడైన శ్రీరామచంద్రస్వామి పాదుకలు లభించెనని అయోధ్యకు తరలినాడు. పాదుకలన ఆచార్యుడనియే యాతని భావము. అందులకే నిశ్చింత - ఆచార్య కటాక్షము లభించెనను ఆనందముతో నందిగ్రామము చేరుకొనినాడు. శ్రీరామచంద్రుడు రాకున్నను ఆచార్యానుగ్రహము కలిగిన శిష్యుడు సంతోషముతో తృప్తినొందు రీతిగా మిక్కిలి ప్రభావము గలవి శ్రీవారి పాదుకలని రాచకార్యములు నిర్వహించెను.

ఉపనిషత్తులలో భగవానుని పొందుటకై ముప్పదిరెండు ఉపాసనములు తెలియపరచుట జరిగినది. అదేమాదిరి ముప్పదిరెండు పద్ధతులు పాదుకా సహస్రమున సమగ్రమున చూపింపబడినవి - శ్రీ పాదుకా సహస్ర పారాయణము, శ్రీమద్రామాయణ పారాయణ ఫలమునిచ్చు ప్రభావము గలది. ఇట్టి పాదుకా సహస్రము ప్రతులు హైదరాబాదు శ్రీ అహోబిల మఠం, శ్రీ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అందరికి లభ్యమగునట్లు ప్రచురించుట జరిగినది. కావున భక్తులు శ్రీరంగనాథుని అనుగ్రహము శ్రీ అహోబిల లక్ష్మీనృసింహుని అనుగ్రహ ప్రాప్తికై ఎల్లరూ పఠించి శ్రీవారి మంగళా శాసనములు బడయుదురుగాక.

శ్రీ పాదుకా సహస్ర ముద్రణకు అవసరమగు ఆర్థిక సహాయము చేసిన వారలందరును శ్రీ లక్ష్మీనృసింహస్వామి కృపకు పాత్రులగుదురుగాక.

ఆడూర్, ఆసూరి మాధవాచార్యః

విక్రమ మకర సంక్రాంతి
14 జనవరి 2001
ఆదివారం

శ్రీ రంగనాథ దివ్యమణి పాదుకాభ్యాంనమః
శ్రీమతే రామానుజాయనమః

శ్రీమన్నిగమాన్త మహాదేశికాయనమః

# శ్రీరంగనాథ పాదుకాసహస్రమ్

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ ।
వేదాన్తా చార్యవర్యోమే సన్నిధత్తాం సదాహృది ॥

రామానుజ దయాపాత్రం జ్ఞానవైరాగ్య భూషణమ్ ।
శ్రీమద్వేంకటనాథార్యం వందేవేదాన్త దేశికమ్ ॥

శ్రియైనమః

## 20. ఇంద్రనీల పద్ధతి

681. హరిణా హరి నీలైశ్చ ప్రతియత్నవతీం సదా ।
అయత్న లభ్య నిర్వాణా మాశ్రయే మణిపాదుకామ్ ॥ 1

శ్రియైనమః

# 20. ఇంద్రనీల పద్ధతి

*681. హరిణా హరి నీలైశ్చ ప్రతియత్నవతీం సదా ।*
*అయత్న లభ్య నిర్వాణా మాశ్రయే మణిపాదుకామ్ ॥ 1*

**అర్థం:-** హరిణా = శ్రీ రంగనాథునిచేత; హరినీలైః, చ = ఇంద్రనీలమణుల చేతను; సదా = ఎల్లప్పుడు; ప్రతియత్నవతీం = అలంకారయుక్తయైన / ప్రయత్నంకలదైన; అయత్న లభ్య నిర్వాణాం = శ్రమపడకుండా పొందదగిన సుఖం కలదైన / ప్రయత్నంలేకుండా లభ్యమయ్యే ముక్తి కలదైన; మణిపాదుకాం = రత్నపాదుకను; ఆశ్రయే = ఆశ్రయిస్తాను.

**తా॥** శ్రీ రంగనాథునిచేతనూ, ఇంద్రనీలమణులచేతనూ నిత్యం అలంకారంతో కూడుకొన్న / ఎల్లప్పుడు ప్రయత్నం కలదైన, అనాయాసంగా పొందదగిన సుఖం కలదైన / ప్రయత్నంచేయకయే లభ్యమయ్యే మోక్షం కలదైన మణిపాదుకను సేవిస్తాను.

**రమణీయ వ్యాఖ్య :-** అప్రయత్నంగా లభించే సుఖంకల పాదుక ప్రయత్నవతి అని విరోధాభాసగా వర్ణన.

ఇది ఇంద్రనీల మణులతో మాత్రమలంకృతయైన పాదుకను వర్ణించే పద్ధతి. అలంకారాలు లేకుండా సుఖశాంతులు సిద్ధిస్తున్నప్పటికీ అనేకాలంకారాలయందు ఆసక్తి కలిగియుండడం లోకపరిపాటి. శ్రమలేకయే సుఖం లభించే అవకాశం ఉండగా శ్రమ పడడం ఎందుకు? అనుకుంటాం. కానీ, పాదుకాదేవి నిత్యం అలంకారయుక్తయై భగవత్పాదసేవకోసం పాటుపడడం చూస్తే, జనులు ఆలసించక సర్వదా పాటుపడుతూ ఆచరణ శీలురై ఉండాలి అనీ, లోకసంగ్రహం కోసం ప్రయత్నించడం ఆవశ్యకమనీ, ఉపదేశిస్తున్నట్లుంది.

పాదుక ఆచార్య స్వరూపం. భగవంతుని ఆశ్రయించే వారికి భక్తి ప్రపత్తులు ఆవశ్యకం. కానీ, ఆచార్యులనాశ్రయిస్తే, ఆచార్యులే అన్నిపాట్లు పడడంవల్ల, జనులు ఏప్రయత్నంచేయకయే మోక్షఫలం పొందగలరనీ, పాదుక స్వయంగా పాటుపడుతూ బోధిస్తున్నది. కాబట్టి, పాదుకను సేవించడం శ్రేయస్కరం. అనుష్టుప్ఛందం.

*682. హరిరత్న మరీచయస్తవైతే*
*నవనీలీరస నిర్విశేష వర్ణాః ।*
*శ్రుతి మూర్ధని శౌరిపాదరక్షే ।*
*పలితానుద్భవ భేషజం భవంతి ॥ 2*

**అర్థం** :- హే శౌరి పాదరక్షే = భగవత్పాదుకా! నవనీలీరస నిర్విశేష వర్ణాః = క్రొత్తనీల వర్ణ ద్రవంతో భేదంలేని కాంతులుగల; తవ = నీ యొక్క; ఏతే = ఈ; హరి రత్నమరీచయః = ఇంద్రనీలమణుల కిరణాలు, శ్రుతి మూర్ధని = వేదాలతల మీద; పలిత+అనుద్భవ భేషజం = నెరయకుండా చేసే ఔషధంగా; భవంతి = ఉంటాయి.

**తా॥** ఓ శౌరి చరణావనీ! క్రొత్త నీలిరసంతో సమానకాంతి కలిగిన ఈ నీ ఇంద్రనీల మణుల కిరణాలు వేదాల తల నెరయకుండా ఉండే ఔషధమవుతాయి.

**వ్యాఖ్య :- ఇంద్రనీలాలకాంతి శిరోజాలు తెల్లబడకుండా చేసే నీలిరంగుగా ఉత్ప్రేక్షితం**

ముసలితనం వల్ల తలవెంట్రుకలు తెల్లబడుతుంటే, నీలిరంగుగల ద్రవరూప ఔషధాన్ని తలకు పులిమినప్పుడు తెలుపుపోయి వెంట్రుకలు నల్లగా కనబడడం లోకంలో పరిపాటి. ఇలాంటి నీలీ ద్రవం ఔషధశాలలో లభిస్తుంది.

శ్రుతులు తొలి పలుకులు - ప్రాబలుకులుకదా! శ్రుతి కాంతల తల వృద్ధాప్యం వల్ల తెల్లగా నెరసినట్లు కనబడకుండా పూసే ఔషధంగా ఇంద్రనీల రత్నాలకాంతి ప్రసరిస్తుంది. వేదాలకుగానీ వేదాంతానికి గానీ ముసలితనమే లేదు. అవి అజరామరంగా - స్థిరంగా - ఉంటాయి. "పలితం జరసాశౌక్ల్యమ్" (అమరం)

శ్రుతులకు అజరత్వం లేదా నిత్యత్వం ఇంద్రనీలమణులకాంతి ప్రభావంవల్లనే కలుగుతుందని కవి సంభావించాడు. భగవత్పాదుకలకు అలంకారంగా ఇంద్రనీల మణులను భక్తులు సమర్పించే ఆస్తిక్యం వ్యాపిస్తుంటే, ఇక వేదాల తలపండుతుందా? వేదాలు, వేదాంతం ఎప్పుడూ గౌరవింపబడుతుంటాయని సారాంశం. ఔపచ్ఛందసికం.

*683. అలకైరివ బింబితైః శ్రుతీనాం*
*హరినీలైః సృజసి త్వ మున్మయూఖైః ।*
*కమలాదయితస్య పాదరక్షే!*
*కరుణోదన్వతి శైవల ప్రరోహాన్ ॥* 3

**అర్థం** :- హేపాదరక్షే = ఓ పాదుకా! త్వం = నీవు; బింబితైః = ప్రతిబింబించే ; శ్రుతీనాం = శ్రుతికాంతలయొక్క; అలకైః, ఇవ = ముంగురులవలె; ఉన్మయూఖైః = పైకి ప్రసరించే కిరణాలు కలిగిన; హరినీలైః = ఇంద్రనీలాలచేత; కమలా దయితస్య = శ్రియఃపతి యొక్క; కరుణా+ఉదన్వతి = దయ అనే సముద్రమందు; శైవల ప్రరోహాన్ = నాచు మొక్కలను; సృజసి = కల్పిస్తావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! ప్రతిఫలించే శ్రుతికాంతల ముంగురులను పోలిన పైకి ప్రసరించే కిరణాలు గల ఇంద్రనీల మణులచే లక్ష్మీనాథుని దయా సముద్రమందు నీవు నాచు మొక్కలను సృష్టిస్తావు.

**వ్యాఖ్య :- ఇంద్రనీల మణులకాంతి, కమలాపతి కరుణాపయోనిధి యందు నాచు పరచుకున్నట్లున్నదని ఉత్ప్రేక్షితం**

మరకత పద్ధతిలో (665 శ్లోకం) నాచు నీటిని నిర్మలంగా ఉంచుతుందని వర్ణితం. ఇక్కడ నిగమకాంతల కుంతలాలుగా శోభించే ఇంద్రనీల మణులకిరణాలు శ్రీనాథుని దయాసాగరంలో నాచు మొక్కలుగా కల్పింపబడినాయి. హరినీల మణులకిరణాల ప్రభావంవల్ల భక్తుల పాపం నశించి, వారిమీద భగవంతుని స్వచ్ఛమైన దయ ప్రసరిస్తుంది. వేదశాస్త్ర బోధచేత సర్వదోషాలను తొలగించి నిర్మలాంతఃకరణులను చేసేది భగవంతుని అపారకారుణ్యమే.

"దర్పణం తే స్వశాస్త్రమ్" (దయాశతకం 47)

అజ్ఞాన పాపాది పంకిలాన్ని క్షాళనంచేసే భగవత్కృపకు వేదశాస్త్ర సముదాయం అద్దం అని దేశికులు చిత్రించారు. ఇక్కడ శ్రుతియువతులు పాదుక(ల)కు వంగి నమస్కరిస్తున్నప్పుడు మణులయందు ప్రతిఫలించిన వారి ముంగురులను పోలియున్న ఇంద్రనీలాలు, భగవత్కరుణాపయోనిధిలో పరుచుకపోయిన నాచులాగా కనబడడం చమత్కారం ఔపచ్ఛందసికం.

*684. అనఘైర్హరినీల పద్ధతీనాం*
*ప్రథమానై ర్మణిపాదుకే! మయూఖైః ।*
*అధరీకురుషే రథాంగపాణే*
*రమితా మూర్ధ్వ మవస్థితస్యకాంతిమ్ ॥ 4*

**అర్థం** :- హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! అనఘైః = రమ్యమైన; ప్రథమానైః = వ్యాపిస్తున్న; హరినీల పద్ధతీనాం = ఇంద్రనీల మణిపంక్తులయొక్క; మయూఖైః = కాంతికిరణాలచేత; ఊర్ధ్వం = మీద; అవస్థితస్య = నిల్చియున్న; రథాంగపాణేః = చక్రం చేతియందుగల శ్రీరంగనాథునియొక్క; అమితాం = అత్యధికమైన; కాంతిం = తేజస్సును; అధరీకురుషే = క్రిందుపరుస్తావు.

**తా॥** ఓ మణిపాదుకా! నీపైన నిల్చియున్న చక్రపాణియొక్క అమితమైన తేజస్సును రమ్యంగా ప్రసరించే నీ ఇంద్రనీల మణిపంక్తుల కిరణాల కాంతిచేత అధఃకరిస్తావు.

వ్యాఖ్య :- శ్రీహరికాంతి కంటె హరినీలమణిమయ పాదుకాకాంతి ఉత్కృష్టమైనదని విరోధాభాసగా వర్ణన.

శ్రీరంగనాథుడు నీలఘనశ్యాముడు. ఉత్సవ విగ్రహం చతుర్భుజోపేతం. ఆయన సహస్రారజ్వాలలతో కోటి సూర్యులవలె ప్రకాశించే సుదర్శనం అనే చక్రాన్ని ఒకచేతిలో ధరించాడు. అది అప్పడప్పుడు ఆయుధంగా ఉపయోగపడినా, ఎల్లప్పుడు ఆభరణంగా అలంకృతమై నీలఘన శ్యాముణ్ని నిరతిశయంగా ప్రకాశింపజేస్తుంది.

ఉజ్జ్వల తేజోరాశియైన శ్రీరంగనాథుని పాదాలక్రిందఉన్నా, పాదుక తన ఇంద్రనీల మణుల కాంతిచే ఆయన కాంతిని ఆవరిస్తుంది. పాదుకాదేవి తాను ప్రకాశిస్తూ, భగవంతుణ్ని కూడా నిరవధికంగా ప్రకాశింపజేస్తుంది.

పైన ఉన్న కాంతిని క్రిందుపరచడం విరోధం. మణులకాంతి ఎగసి భగవద్రూపాన్ని క్రమ్ముకోవడం విరోధ పరిహారం. ఔపచ్ఛందసికం.

685. చరణావని! భాతి సహ్యకన్యా
హరినీల ద్యుతిభిస్తవాను విద్ధా ।
వసుదేవ సుతస్య రంగవృత్తే
ర్యమునేవ స్వయ మాగతా సమీపమ్ ॥ 5

**అర్థం** :- హే చరణావని = ఓ పాదుకాదేవీ! తవ = నీయొక్క; హరినీల ద్యుతిభిః = ఇంద్రనీల మణులకాంతులతోడ; అనువిద్ధా = వ్యాప్తమైన; సహ్యకన్యా = కావేరీనది; రంగవృత్తేః = రంగ విమానమందున్న; వసుదేవ సుతస్య = వసుదేవుని పుత్రుడైన శ్రీ కృష్ణుని యొక్క; సమీపం = దగ్గరికి; స్వయం = తానే; ఆగతా = వచ్చిన; యమునా; ఇవ = యమునానదిలాగా; భాతి = భాసిస్తుంది.

**తా॥** ఓ పాదావనీ! నీ ఇంద్రనీలాలకాంతులచే వ్యాప్తయైన కావేరి, రంగవిమానమందున్న వాసుదేవుని దగ్గరికి తనంత తానే వచ్చిన యమునగా భాసిస్తుంది.

వ్యాఖ్య :- ఇంద్రనీల మణులకాంతిచే కావేరి యమునగా ఉత్ప్రేక్షితం

కావేరీ జలం తేటతెల్లగా, యమునా జలం నీలంగా ఉంటుంది. శ్రీకృష్ణుడు యమునా సైకత శ్రోణియందు క్రీడించేవాడు. ఆ కృష్ణుడే ఈనాడు కావేరీ మధ్యన తామరమొగ్గ వికసిస్తున్నట్లున్న విమానమందు శ్రీరంగనాథుడుగా వెలుగుతున్నాడు. కాబట్టి, యమునా స్రవంతి శ్రీకృష్ణునిపట్ల ఉండే ప్రేమతో విహారార్థమై స్వయంగా వచ్చిందో అన్నట్లు, ఇంద్రనీలాలకాంతి వ్యాపించడం వల్ల నీలవర్ణంగా మారిన జలంతో కావేరి ప్రకాశిస్తుంది.

'వసుదేవసుత' శబ్దంవల్ల బలభద్రుని దగ్గరికి పూర్వం యమున వచ్చినట్లు ఇట గోచరిస్తుంది. ఔపచ్ఛందసికం.

686. అవధీరిత దేవతాంతరాణా
మనఘై స్త్వం మణిపాదుకే! మయూఖైః ।
హరినీల సముద్భవై ర్విధత్సే
హరిసారూప్య మయత్నతో జనానామ్ ॥ 6

**అర్థం** :- హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! త్వం = నీవు; హరి నీల సముద్భవైః = ఇంద్రనీల మణులనుంచి ఉదయించిన; అనఘైః = రమ్యమైన; మయూఖైః = కిరణాలచేత; అవధీరిత దేవతా + అంతరాణాం = పూజింపని అన్యదేవతలుకల; జనానాం = ప్రజలకు; అయత్నతః = సులభంగా; హరిసారూప్యం = భగవంతునితో / నీలమణులతో సమానమైన రూపాన్ని / వర్ణాన్ని; విధత్సే = కలిగిస్తావు.

**తా॥** ఓ మణిపాదుకా! నీవు ఇంద్రనీలాల నుంచి ఉద్భవించే రమ్యకిరణాలచే, వేరే దేవతలను ఆరాధించని జనులకు హరిసారూప్యాన్ని అనాయాసంగా కలిగిస్తావు.

వ్యాఖ్య :- హరినీలమణులకాంతిచే జనులకు హరిసారూప్యం కలుగుతుంది.

సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం అని మోక్షం నాలుగు విధాలుగా ఉంటుంది.

"నిరంజనః పరమం సామ్య ముపైతి" శ్రుతి.

'సర్వకర్మ సమారాధ్యుడు శ్రియః పతి' అని సమ్యక్ జ్ఞానంకల వారు అన్య దేవతలను ఉపాసించరు. "అథయో ఽన్యాందేవతా ముపాస్తే ప్రస్వాయై దేవతాయై చ్యవతే, న పరాంప్రాప్నోతి" (శ్రుతి). ఒక దేవతను పూజించే వ్యక్తి మరొక దేవతను పూజిస్తే ఉభయ భ్రష్టుడవుతాడు. మొదట పూజింపబడిన దేవత అభిమానాన్ని కోల్పోతాడు. తర్వాత కొత్తగా పూజింపబడే దేవత విశ్వాసాన్ని కోల్పోతాడు. నియమరహితుడని ఏ దేవత కూడా పట్టించుకోనందున ఆ వ్యక్తి సద్గతిని పొందలేడని శ్రుత్యర్థం. అనన్య మనస్కులై మోక్షదాతయైన ముకుందుణ్ని కొలిచే పరమైకాంతులైన జనులకు మాత్రమే హరిసారూప్యం అంటే భగవంతునితో సమానమైన ఆకారం కలుగుతుంది. అన్య దేవతలను భజించక శ్రీహరిని ఆరాధించే పరమభక్తులకు కలిగే హరిసారూప్యాన్ని జనులందరికీ, పాదుకాదేవి తన హరినీలమణుల రమ్యకాంతులను ప్రసరింపజేసి సులభంగా కలిగిస్తుంది.

ఇంద్రనీల మణులకాంతి ప్రసరించడంవల్ల ప్రజలు భగవంతునితో సమాన వర్ణంతో ప్రకాశిస్తారు. అనాయాసంగా మోక్షాన్నీ ప్రసాదిస్తుంది పాదుకాదేవి. శ్లిష్ట రూపకం. ఔపచ్ఛందసికం.

*687. నేత్రేషు పుంసాం తవపాదరక్షే !*
*నీలాశ్మభాసా నిహితాంజనేషు ।*
*శ్రియాసమం సంశ్రిత రంగకోశో*
*నిధిః స్వయం వ్యక్తి ముపైతి నిత్యమ్ ॥ 7*

**అర్థం** :- హే పాదరక్షే = ఓ పాదుకా! తవ = నీయొక్క; నీల+అశ్మభాసా = ఇంద్రనీలమణుల కాంతిచేత; పుంసాం = జనులయొక్క; నేత్రేషు = కన్నులు; నిహిత + అంజనేషు = పెట్టబడిన కాటుక కలవికాగా; శ్రియా = లక్ష్మీదేవితోడ; సంశ్రిత రంగకోశః = కూడియున్న శ్రీరంగ విమాన మనే ధన గృహంకల; నిధిః = నిధియైన శ్రీరంగనాథుడు; నిత్యం = ఎల్లప్పుడు; స్వయం = తానే; వ్యక్తిం, ఉపైతి = అభివ్యక్తమవుతాడు.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీ ఇంద్రనీల మణులకాంతిచే జనుల నేత్రాలకు కాటుక పెట్టగా లక్ష్మీదేవితో కూడియున్న శ్రీరంగమనే ధనాగారనిధియైన శ్రీరంగనాథుడు నిత్యం తానే స్పష్టంగా కనబడుతాడు.

వ్యాఖ్య : ఇంద్రనీలమణులకాంతి అంజనంగా ఉత్ప్రేక్షితం

జనులు అంజనం (కాటుకను) కన్నులకు పెట్టుకొని నిధిని (పాతినధనాన్ని) కనుగొన్నట్లే పాదుకలయందున్న ఇంద్రనీల మణులకాంతి కన్నులకు సోకిన జనులు శ్రీరంగనాథుణ్ని కన్నారసేవిస్తారు. 'నిధి' శబ్దం భగవంతుణ్ని సూచిస్తుంది కాబట్టి రూపకాతిశయోక్తి. ఉపజాతివృత్తం.

688. అభంగురా మచ్యుత పాదరక్షే!
మాన్యాం మహానీలరుచిం త్వదీయామ్ ।
నిశ్రేయస ద్వారక వాటికా యాః
శంకే సముత్పాటనకుంచికాం నః ॥ 8

**అర్థం** :- హే అచ్యుత పాదరక్షే = ఓ అచ్యుత పాదుకా! అభంగురాం = తరుగనిదైన; మాన్యాం = శ్లాఘింపదగిన; త్వదీయాం = నీదైన; మహానీల రుచిం = ఇంద్రనీలమణుల కాంతిని; నః = మాకు; నిశ్రేయస ద్వార కవాటికాయాః = మోక్షద్వారమందలి తలుపును; సముత్పాటనకుంచికాం = తెరపించేకుంచె కోలగా; శంకే = ఊహిస్తాను.

**తా**॥ ఓ అచ్యుత పాదావనీ! శాశ్వతమైన మాన్యమైన నీ ఇంద్రనీల మణులకాంతిని మాకు మోక్షద్వారకవాటాన్ని తెరపించే కుంచి కోలగా భావిస్తాను.

**వ్యాఖ్య :- మహానీలకాంతి మోక్షద్వారకవాటాన్ని తెరచే తాళపుచెవి**

ఇంద్రనీల మణికి మహానీలమని పేరుంది.

"మహానీలో భృంగరాజో మణి నాగవిశేషయోః" (విశ్వనిఘంటువు)

కవాటాన్ని బంధించి గడియవేయడానికిగానీ, తీయడానికిగానీ ఇనుప కోలను పూర్వులు ఉపయోగించేవారు. ఈ కుంచికోల ఎప్పుడూ చెడిపోనిది. మారుకోల ఉండదు. కాబట్టి లోకులు దీన్ని భద్రంగా, మాన్యంగా చూస్తూ, కాపాడుతుంటారు. రెండు తలుపుచెక్కల్లో గడియ ఉన్న తలుపునుంచి గడియ నిడిగింపబడి, మరొక తలుపు చెక్కకు తగిలించి బిగింపబడుతుంది. గడియనూడదీయడం ఒక కవాటానికే. కాబట్టి 'కవాటికాయాః' అని ఏకవచనం.

మహానీలకాంతి మోక్షద్వారమందలి తలుపును తెరువడానికి వాడబడే బీగపు చెవిగా కవి భావిస్తున్నాడు. ఉత్ప్రేక్షాలంకారం. ఉపజాతి వృత్తం.

689. జీవయ త్యమృత వర్షిణీ ప్రజా
స్తావకీ దనుజ వైరి పాదుకే ।
ఘోర సంసరణ ఘర్మనాశినీ
కాలికేవ హరినీల పద్ధతిః ॥ 9

**అర్థం** :- హే దనుజవైరి పాదుకే = ఓ దనుజారిపాదుకా! అమృతవర్షిణీ = మోక్షాన్ని కలిగించే / నీటిని కురిపించే; తావకీ = నీ సంబంధమైన; హరినీల పద్ధతిః = ఇంద్రనీలాల పంక్తి; ఘోర సంసరణ ఘర్మనాశినీ = దారుణమైన సంసారమనే గ్రీష్మతాపాన్ని పోగొట్టే; కాలికా, ఇవ = మేఘమాల మాదిరి; ప్రజాః = జనులను; జీవయతి = బ్రతికిస్తుంది.

**తా॥** ఓ దనుజవైరిపాదుకా! మోక్షాన్ని ప్రసాదించే / నీటిని కురిపించే నీ ఇంద్రనీల శ్రేణి భయంకరమైన సంసారమనే గ్రీష్మతాపాన్ని నశింపచేసే మేఘమాలికలాగా ప్రజలను జీవింపచేస్తుంది.

వ్యాఖ్య :- హరినీలపంక్తి మేఘపంక్తిగా వర్ణితం

'అమృత'మంటె మోక్షం, దేవతల ఆహారం, నీరు అని నానార్థాలున్నాయి 'అమృతం మోక్షదేవాన్నే" "పయఃకీలాల మమృతం" (అమరం)

"మేఘజాలే ఉపికాలికా" (అమరం)

సంసారమనేది గ్రీష్మర్తువులోని ఉష్ణోగ్రతలాగా సంతాపకరం. వర్షర్తువులో మేఘాలు జలాన్ని వర్షించడం వల్ల గ్రీష్మతాపం నశిస్తుంది.

"పురోవాతో హింకారో మేఘోజాయతే, సప్రస్తావో వర్షతి".

జలంలో వాయువు సూక్ష్మ భాగం. ఘనీభూతమైన మేఘం వాయువేగంతో కదిలి వర్షిస్తుందని ఛాందోగ్యోపనిషత్తు బోధిస్తుంది. ప్రజలు వర్షపాతంవల్ల ఆనందంగా జీవించే అవకాశముంటుంది. అలాగే ఇంద్రనీల మణులకాంతి ఘోరసంసార తాపత్రయాన్ని నశింపజేసి ప్రజలకు ముక్తిని ప్రసాదించి ఆనందాన్ని కలిగిస్తుంది.

హరినీల పంక్తిని మేఘమాలతో పోల్చి, రూపకానుప్రాణితోపమాలంకారంగా వర్ణితం. రథో ద్ధతా వృత్తం.

*690. శతమఖోపలభంగ మనోహరా*
*విహరసే మురమర్దన పాదుకే ।*
*మణికిరీట గణేషు దివౌకసాం*
*మధుకరీవ మనోరమ పంక్తిషు ॥* *10*

**అర్థం** :- హే మురమర్దన పాదుకే = ఓ మురాంతకపాదుకా! శతమఖ+ఉపలభంగ మనోహరా = ఇంద్రనీల మణిశకలాలచే చిత్తాన్ని దోచేసే నీవు; దివౌకసాం = దేవతలయొక్క; మణికిరీట గణేషు = రత్నమకుట సమూహాలయందు; మనోరమ పంక్తిషు = అందమైన పూలమాలికలందు; మధుకరీ, ఇవ = ఆడ తుమ్మెదలా; విహరసే = విహరిస్తుంటావు.

**తా॥** ఓ ముర మర్దను పాదుకా! ఇంద్రనీల మణిశకలాలచే చిత్తాన్ని హరించే నీవు దేవతల మణికిరీటాల సమూహాలయందు, మనః ప్రియమైన పూలమాలికల్లో మధుకరిలాగా విహరిస్తావు.

వ్యాఖ్య : నీలమణి పాదుక మధుకరిగా ఉపమితం

నాకలోకంలో నివసించే దేవతల కిరీటాల్లో రంగులను విరజిమ్మే మణులు పలురంగుల పూవులుగానూ, మణిఖచిత (దేవతల) కిరీటాలు పూలదండలుగానూ భావింపబడుతున్నాయి. మనోరమ పంక్తులమీద ఆడతుమ్మెద క్రీడించే లాగా, ఇంద్రనీలాల కాంతిచే నల్లగా ఉన్న పాదుక దేవతల కిరీటాలమీద విహరిస్తుంది. శ్లేషానుప్రాణితోపమాలంకారం. ద్రుత విలంబిత వృత్తం.

691. అన్విచ్ఛతాం కిమపి తత్త్వ మనన్య దృశ్యం
సమ్యక్ప్రకాశ జననీ ధృత కృష్ణ రూపా ।
పాదావని! స్ఫురసి వాసవ రత్న రమ్యా
మధ్యే సమాధి నయనస్య కనీనికేవ ॥ 11

**అర్థం :-** హే పాదావని = ఓ పాదుకాదేవీ! ధృత కృష్ణరూపా = ధరింపబడిన శ్రీకృష్ణుని ఆకారంగల; వాసవరత్న రమ్యా = ఇంద్రనీలమణులచే అందమైన నీవు; ధృతకృష్ణ రూపా = ధరింపబడిన నల్లని వన్నెగల; వాసవరత్న రమ్యా = ఇంద్రనీల మణిలాగా రమణీయమైన; అనన్య దృశ్యం = ఇతరులకు కనబడని; కిం, అపి, తత్త్వం = ఒక యథార్థాన్ని (వేదప్రసిద్ధ భగవద్రూపాన్ని); అన్విచ్ఛతాం = అన్వేషించేవారియొక్క; సమాధినయనస్య = యోగమనే నేత్రంయొక్క; మధ్యే = నడుమ ఉన్న; కనీనికా, ఇవ = కంటి గ్రుడ్డులాగా; సమ్యక్ ప్రకాశజననీ = మంచిప్రకాశాన్నీ / సమీచీన జ్ఞానాన్ని కలిగిస్తూ; స్ఫురసి = ప్రకాశిస్తుంటావు.

**తా॥** ఓ పాదావనీ! ధరింపబడిన శ్రీకృష్ణుని ఆకారంగల ఇంద్రనీలమణులచే రమణీయవైన నీవు, ధరింపబడిన నల్లని వర్ణంగల ఇంద్రనీలమణి లాగా రమ్యమైన, యోగులుకాని వారికి కానరాని వేదప్రసిద్ధ భగవద్రూపాన్ని అన్వేషించే యోగుల సమాధి అనే కంటికి మధ్యన ఉన్న నల్లని గ్రుడ్డుగా సమ్యక్ప్రకాశాన్ని/సమీచీన జ్ఞానాన్ని కలిగిస్తూ ప్రకాశిస్తుంటావు.

వ్యాఖ్య : నీలమణిపాదుక సమాధి నేత్రకనీనికగా శ్లేషతో ఉత్ప్రేక్షితం

పాదుక కృష్ణున్ని ధరిస్తుంది కాబట్టి కృష్ణ వర్ణ. పైగా ఇంద్రనీలమణి కాంతులచే నీలచ్ఛాయతో అందంగా భాసిస్తుంది. భగవత్తత్వం యోగులకుకాని బోధపడదు. యోగాభ్యాసంలో చివరి అంగమైన సమాధిలో యోగులు భగవద్రూపాన్ని అచంచల దృష్టితో ఆవిష్కరిస్తారు. 'రూపం' అంటే ఆకారం, వర్ణం అని రెండర్థాలు.

"రూపం స్వభావేసౌందర్యే నాటకే పశుశబ్దయోః!

గ్రంథా వృత్తౌ నాటకా దా వాకార శ్లోకయోరపి॥" (విశ్వ.ని)

సమాధిష్ఠులైన యోగుల నయన మధ్యస్థిత కనీనిక ఇంద్రనీలంలాగా నల్లగా ఉండడమేకాక, భగవంతుని రూపంకూడా అందులో ప్రకాశిస్తుంది. ప్రతిబింబిస్తుంది. భగవద్దర్శనాభిలాషులకు పాదుకాదేవి, కనీనిక లాగా సమాధికి ముఖ్య అవయవమై, తన ద్వారా పరమాత్ముడు గోచరించే లాగా ప్రకాశిస్తుంది.
"తారకాక్ష్ణః కనీనికా" (అమరం)
ఇంద్రనీలమణిలాగా రమ్యంగా ఉండే తారక, ఎదుట కనబడే రూపాన్ని - శ్రీరంగనాథుణ్ని వహించిన పాదుకాస్వరూపాన్ని - ధరించి సమ్యక్ జ్ఞానాన్ని ప్రకాశింపచేస్తుంది. వసంత తిలకావృత్తం.

692 మాత స్సలీల మధిగమ్య విహారవేలాం
కాంతిం సముద్వహసి కాంచన పాదుకే! త్వమ్!
లక్ష్మీ కటాక్ష రుచిరై ర్హరినీల రత్నై
ర్లావణ్య సింధు పృషతైరివ రంగధామ్నః॥ 12

**అర్థం :-** హే మాతః, పాదుకే = ఓ తల్లీ! పాదుకాదేవీ! త్వం = నీవు; సలీలం = ఉల్లాసంతోడ; విహారవేలాం = సంచార సమయాన్ని/విహరించే సముద్రతీరాన్ని; అధిగమ్య = పొంది; లక్ష్మీ కటాక్ష రుచిరైః = లక్ష్మీదేవి కడగంటి చూపుల్లాగా అందమైన; రంగధామ్నః = శ్రీరంగధాముని యొక్క; లావణ్యసింధు పృషతైః, ఇవ = సౌందర్యమనే సముద్రపు జలబిందు లను పోలిన; హరి నీలరత్నైః = ఇంద్రనీల మణులచేత; కాంచన = ఒకానొక; కాంతిం = శోభను; సముద్వహసి = ధరిస్తున్నావు.

**తా॥** ఓ జననీ! పాదుకాదేవీ! నీవు లీలగా సంచారకాలాన్ని/విహార తీరాన్ని పొంది లక్ష్మీదేవి కటాక్షంలాగా అందమైన, శ్రీరంగధాముని సౌందర్యమనే లవణసముద్రపు సలిలబిందువులవలె ఉన్న ఇంద్ర నీలమణుల చేత ఒకానొక కాంతిని వహిస్తున్నావు.

వ్యాఖ్య : శ్రీరంగధాముని లావణ్యసింధు బిందువులే ఇంద్రనీలమణులని ఉత్ప్రేక్ష

లక్ష్మీదేవి నల్లని కన్నుల్లోంచి ఎగసిపడే చూపులు చల్లనివి. లక్ష్మికడలి కూతురు. కాబట్టి లక్ష్మీ కటాక్షం సంపత్కరం, సంతాపహరం. "కటాక్షో దృష్టివిక్షేపే" (హలాయుధని.) లక్ష్మీ కటాక్షంలాంటి ఇంద్రనీల మణులు కలిగిన పాదుక, లీలగా సముద్రతీరానవిహరించే శ్రీరంగధాముడు తన శరీరం మీద చిమ్మిన కడలి నీటి బొట్లచే శోభించినట్లుంది.

శ్రీ రంగనాథుని విగ్రహ సౌందర్యమే సముద్రం. "పృషంతి బిందు పృషతాః" (అమరం) "పృషతో బిందురిష్యతే" (అమరమాల).

శ్రీ రంగధాముని నైగనిగ్యమనే లవణ సముద్రం నుంచి తీరభూమిలో సంచరించే సమయాన పాదుకమీద ఎగసిపడిన ఉదకబిందువులే నీల వర్ణంగా మెరుస్తున్నాయి. నీలమణులందు సింధు బిందుత్వం ఉత్ప్రేక్షితం. వసంతతిలకావృత్తం.

693. క్లుప్తావకుంఠనవిధి ర్మణి పాదరక్షే!
నీలాంశుకై ర్బలభి దశ్మసముద్భవైస్తే!
సంగచ్ఛతే మునిజనస్య మతిః సమాధౌ
రాత్రౌ సమస్త జగతాంరమణేన లక్ష్మ్యాః!! 13

**అర్థం :-** హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! సమస్త జగతాం = అన్నిలోకాలకు; రాత్రౌ = రాత్రియైన; సమాధౌ = ధ్యానయోగమందు; మునిజనస్య = యోగియొక్క; మతిః = బుద్ధి (అభిసారిక); తే = నీ యొక్క;

బలభిత్+అశ్మ సముద్భవైః = ఇంద్రనీలమణులనుంచి ఉదయించిన; నీల+అంశుకైః = నీలవస్త్రాలచేత; క్లృప్త + అవకుంఠన విధిః = కల్పింపబడిన ముసుగు యొక్క ప్రక్రియకలదై; లక్ష్మ్యాః = శ్రీదేవి యొక్క; రమణేన = భర్తతో; సంగచ్ఛతే = కలియ పోతుంది.

**తా॥** ఓ మణిపాదుకా! లోకాలకన్నిటికి రాత్రికాగా ధ్యానయోగియొక్క బుద్ధి అనే అభిసారిక, నీ ఇంద్రనీలాలనుంచి కలిగిన నీలకిరణాలచే కల్పితమైన నల్లని ముసుగు వేసుకొన్నదై లచ్చిమగనితో కలియబోతోంది.

వ్యాఖ్య:- ఇంద్రనీల మణికిరణజాలం అభిసారికయొక్క నీలావరణవస్త్రమని ఉత్ప్రేక్ష.

లోకులు పని-పాట్లు ముగించుకొని సుఖంగా నిద్రించే కాలం రాత్రి. యోగులు రాత్రిపూట జాగ్రదవస్థలో ఉంటారు.

"యానిశా సర్వభూతానాం తస్యాంజాగర్తి సంయమీ" (భ.గీత)

ఇతర వ్యాపారం లేని కాలమని లక్ష్యార్థం. ఇంద్రియ వ్యాపారం లేకుండా యోగుల అంతఃకరణం ధ్యానమగ్నమవుతుంది. సమాధిష్ఠులైనప్పుడు యోగుల బుద్ధి లేదా మనస్సు భగవంతుని ఆశ్రయించడానికి పయనిస్తుంది. ఈ విషయమే లౌక్యంగా చమత్కరింపబడింది.

ధ్యానమగ్నమైనయోగి యొక్క బుద్ధి ఒక అభిసారిక. రాత్రిపూట ఎవరికీకానరాకుండా నల్లని ముసుగును కప్పుకొని పరపురుషునితో సంగమించడానికి పోయే ఆవిడ అభిసారిక. యోగి మతిని అభిసారికగానూ, పాదుకల్లోని ఇంద్రనీలమణి కిరణజాలాన్ని నల్లని ముసుగు బట్టగానూ, శ్రీరంగధాముణ్ని అన్యకాంతానాయకునిగానూ గమనించదగిన ఉత్ప్రేక్ష.

యోగిమతి పర(మ) పురుషునితో సంగమింపబోయే అభిసారికగా అభివర్ణించడం వల్ల సమాసోక్తితో సంకీర్ణమైన ఉత్ప్రేక్ష. వసన్తతిలకావృత్తం.

*694. ద్రష్టుంకదాచన పదావని! నైవజంతుః*
*శక్నోతి శాశ్వతనిధిం నిహితంగుహాయామ్!*
*కృష్ణానురూప హరినీల విశేషదృశ్యా*
*సిద్ధాంజనం త్వమసి యస్య న దేవి! దృష్టేః ॥* **14**

**అర్థం** :- హే పదావని, దేవి = ఓ పాదుకాదేవీ! కృష్ణ+అనురూప హరినీలవిశేష దృశ్యా = శ్రీకృష్ణునికి తగినవైన ఇంద్రనీలమణుల ఆధిక్యంచే చూడతగిన / నీలవర్ణ నిధిని చూడదగిన; త్వం = నీవు; యస్య = ఎవనియొక్క; దృష్టేః = కంటికి / బుద్ధికి; సిద్ధ + అంజనం = నిధినికనుగొనడానికి తగిన కాటుక; న, అసి = కావో; జంతుః = ఆ ప్రాణి; గుహాయాం = హృదయమందు / గుహయందు; నిహితం = ఉంచబడిన; శాశ్వతనిధిం = భగవంతుణ్ని / తరుగని ద్రవ్యనిధిని; ద్రష్టుం = చూడడానికి; కదాచన = ఒకప్పుడైనా; న, శక్నోతి, ఏవ = శక్యమేకాదు.

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీకృష్ణునికి తగిన ఇంద్రనీలమణుల ఆధిక్యంచే చూడదగిన నీవు, ఏ ప్రాణి కంటికి / జ్ఞానానికి నల్లని నిధిని చూడయోగ్యమైన ఇంద్రనీలాల్లాగా సమగ్రంగా చూడదగిన సిద్ధాంజనంకావో, ఆ ప్రాణి హృదయకుహరమందు / దేవఖాతబిలమందు నిక్షిప్తమైన శాశ్వతమైన / భగవద్రూపమైన ద్రవ్యరాశిని చూడడానికి ఎప్పుడూ శక్యమే కాదు.

వ్యాఖ్య : పాదుక అనే సిద్ధాంజనం లేనియెడల భగవంతుడనే నిధి కనబడదని శ్లేషతో కూడిన రూపకం.

పాదుకా నీలమణికాంతి నిధిని కనిపెట్టే అంజనమని (5) సుశ్లోకితం. ఇది సమాధి యోగ ప్రసంగం. ధ్యానయోగంలో శ్రీకృష్ణ భగవానుని దర్శించడానికి అనుగుణమైన ఇంద్రనీలమణిపాదుకానుగ్రహం అత్యావశ్యకం.

"ఆత్మా గుహాయాంనిహితో ఽ స్యజంతోః". భగవంతుడు ప్రాణి హృదయగుహలో ఉంటాడని శ్రుతి. "దేవఖాతబిలే గుహా" (అమరం) ప్రాకృతిక పర్వతాల్లో దేవతలు త్రవ్విన గుహలో అక్షయ నిధిలభిస్తుంది. వసన్తతిలక.

*695. ప్రత్యేమి రంగనృపతే ర్మణిపాదుకే! త్వాం*
*కృష్ణాంతర (ష్ణాంతద) ఙ్గరుచిభిర్హ రినీలరత్నైః !*
*విశ్వాపరాధ సహనాయ పదంతదీయం*
*విశ్వంభరాం భగవతీం సమయే భజంతీమ్ ॥* 15

**అర్థం :-** హే రంగనృపతేః, మణిపాదుకే = ఓ రంగరాడ్రత్నపాదుకా! కృష్ణ + అంతరంగ రుచిభిః = కృష్ణునితో సమానమైనకాంతులుగల; హరినీలరత్నైః = ఇంద్రనీలమణులతో; (ఉపలక్షితాం=కూడియున్న) త్వాం = నిన్ను; విశ్వ+అపరాధ సహనాయ = సమస్త జనులనేరాలను క్షమించడంకోసం, తదీయం = ఆరంగవతి సంబంధమైన; పదం = చరణాన్ని; సమయే = తగినసమయాన; భజంతీం = ఆశ్రయించే; భగవతీం = పూజనీయయైన; విశ్వంభరాం = భూదేవిగా; ప్రత్యేమి = విశ్వసిస్తాను.

**తా॥** ఓ రంగరాణ్మణిపాదుకా! శ్రీకృష్ణతుల్యకాంతులుగల, హరినీలమణులచే గుర్తింపబడేనిన్ను లోకులనేరాలను ఓర్చుకోవడానికి భగవచ్చరణాలను ప్రసన్న సమయంలో ఆశ్రయించే, భగవంతునియందాసక్తిగల ప్రేమానురాగాదులచే గుర్తింపబడే పూజ్యభూదేవిగా నమ్ముతున్నాను.

వ్యాఖ్య : హరినీలపాదుక విశ్వంభరగా ఉత్ప్రేక్షితం.

ఇంద్రనీలమణులకాంతి శ్రీకృష్ణునితో సమానకాంతికలది. కాబట్టి భగవత్పాదుక అని గుర్తింపడుతుంది. భగవంతునియందు ప్రేమానురాగాలు కలది భూదేవి. తన ప్రజల అపరాధాలను క్షమించుమని భూదేవి భగవత్పాదాలను ఆశ్రయిస్తున్నట్లుగా, పాదుక సాభిప్రాయంగా వర్ణింప బడింది. పరికరాలంకారం.

"కృష్ణాం, తదంగరుచిభిః" పాఠమూ ఉంది. తత్ + అంగరుచిభిః, హరినీలరత్నైః, కృష్ణాం = కృష్ణుని శరీరకాంతిలాంటికాంతిగల ఇంద్రనీల మణులచేత నీలవర్ణంగలది పాదుక, అని పాదుకా పరమైన అన్వయం.

కృష్ణ విగ్రహమందు అధిక ప్రీత్యనురాగాలచేత నల్లని వన్నె గలది భూమి. "యత్ కృష్ణం, తదన్నస్య" నల్లనిదేదో, అదిభూమి, అని కృష్ణశబ్దం, అన్న శబ్దం భూ వాచకంగా శ్రుతిబోధిస్తుంది. కాబట్టి భూమి పరమైన అన్వయం.

*696. మత్వామషీం పరిమితాం భవతీ తదన్యాం*
*వైకుంఠ పాదరసికే! మణిపాదుకే! స్వాన్ ।*
*అంక్తే స్వయం కిరణలేపిభిరింద్రనీలై*
*రాశాతటేషు లలితా నపదానవర్ణాన్ ॥ 16*

**అర్థం** :- హే వైకుంఠపాదరసికే = భగవత్పాదరసజ్ఞవైన; హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! భవతీ = నీవు; తత్ + అన్యాం = ఇంద్రనీలాలకంటె వేరైన; మషీం = (ink) శిరాను; పరిమితాం = స్వల్పమైనదిగా; మత్వా = తలచి; ఆశాతటేషు = దిగంతాలయందు; కిరణ లేపిభిః = కిరణాలచేతపూసే; ఇంద్రనీలైః = హరినీలమణులచేత; లలితాన్ = అందమైన; స్వాన్ = స్వీయమైన; అపదానవర్ణాన్ = బిరుదాక్షరాలకు; స్వయం = సొంతంగా; అంక్తే = లేపనం చేస్తావు.

**తా॥** వైకుంఠుని పాదాలయందలి రసాన్ని ఆస్వాదించే ఓ మణిపాదుకా! నీవు ఇంద్రనీలంకంటె వేరైన మషిని అల్పమైనదిగా తలచి కిరణాలనే లేపన ద్రవ్యాలుగల ఇంద్ర నీలాలచే దిగంతాలయందు అందమైన స్వీయ బిరుదులుగా ఉండే అక్షరాలను స్వయంగా ప్రకాశం కోసం లేపనం చేస్తావు.

వ్యాఖ్య : ఇంద్రనీలకిరణజాలం బిరుదు వర్ణాలను ప్రకాశింపజేసే మషిగా ఉత్ప్రేక్షితం.

వ్రాతకు సాధనమైన 'శిర'యే మషి. పత్రికలపై అక్షరాలను ముద్రించే సమయాన ప్రకాశంకోసం నల్లని శిరను - మషిని - ఉపయోగిస్తారు. పాదుకలను ధరించిన భగవత్పాదాలు చేసిన శకటాసురమర్ధన మొదలైనవీరకృత్యాలను లోకులకు తెలియజేయడానికి, దిగంతాలనే పత్రికల్లో ప్రచురించే అక్షరాలు స్పష్టంగా కనబడేలాగా, పాదుకాదేవి తన ఇంద్రనీలాల కాంతినే మషిగా ఉపయోగిస్తుంది. "అపదానం కర్మవృత్తమ్" (అమరం). వైకుంఠపాదరసికులైన శఠకోపదివ్యసూరి తమ శ్రీసూక్తులచే వేదాలకంటె అధికంగా శ్రియః పతినికీర్తించారు కదా! శఠారి స్వరూపమే పాదుకకదా! కాబట్టి పాదుక వేరే శిర సరిపోదని భావించి, తన హరినీలమణులకాంతులతో భగవత్పాదాలకీర్తిని దిగంతాల్లో ప్రకటిస్తుంది.

('అంజూ' ధాతువు 'ఉభయపది' అని వ్యాకరణాంతరమతం. కాబట్టి ఆత్మనేపది 'లట్' ప్రథమ పురుషైకవచన ప్రయోగం, అని శ్రీ భారద్వాజ శ్రీనివాసాచార్యకృత పరీక్షాఖ్యవ్యాఖ్య.

ఇక, ఈ పరీక్షాఖ్య వ్యాఖ్యాసమేత, సంపాదకీయటిప్పణి, ద్రావిడ పదార్థ, భావార్థ పరిష్కృత, ప్రతి నిర్వాహకం ఇలా ఉంది.

ఈ శ్లోకంలో తృతీయ పాదంలో మొదటి పదం 'అంక్తే' అని లేఖకు లెవరో వ్రాసి, దానికి తగినట్లు "మత్వామషీం పరిమితా మితరాంభవత్యై" అనే ప్రథమ పాదాన్ని అన్యథా మలిచారు. 'తదన్యాం' అని తచ్ఛబ్దంకూడా రమ్యంగా లేదు. "అంక్తే, అభ్యంక్తే" అని వైదిక ప్రయోగం ఉన్నా 'అంజూ' ధాతువు

పరస్మైపద మాత్రమగుటవల్ల "అంక్తః" అని 'లట్' ప్రథమ పురుషద్వివచనమే సరియైన పాఠం. పాదుకా సంబోధనకూడా ఇక్కడ ద్వివచనమే'. "వైకుంఠ పాదరసికే! మణిపాదుకే! మీరు - లేపనం చేస్తారు)

వసంతతిలకావృత్తం.

697. బలమథన మణీనాం ధామభిస్తావకానాం
మధురిపు పదరక్షే! వాసరై రవ్యపేతా ।
అభిసరణ పరాణాం వల్లవీనాంతదాసీ
చ్ఛమిత గురుభయార్తిః శర్వరీ కాచిదన్యా!! 17

**అర్థం :-** హే మధురిపుపదరక్షే = ఓ మధువైరిపాదుకా! తావకానాం = నీ సంబంధమైన; బలమథన మణీనాం = ఇంద్రనీల మణులయొక్క; ధామభిః = కాంతులచేత; అభిసరణ పరాణాం = శ్రీకృష్ణుడున్నచోటికి పోయే ఆసక్తిగల; వల్లవీనాం = గోపికలకు; తదా = పెద్దలకు భయపడి సంకట పడేసమయాన; శమిత గురుభయ+అర్తిః = పోగొట్టబడిన పెద్దల భయంవల్ల కలిగేదుఃఖంగల; వాసరైః = పగళ్ళతో; అవ్యపేతా = కూడియున్న; అన్యా = వేరే; కాచిత్ = ఒకవిధమైన; శర్వరీ = రాత్రి; ఆసీత్ = ఉండెను.

**తా॥** ఓ మధురిపు పాదుకా! నీ ఇంద్రనీలమణులకాంతులచే గోపాల కృష్ణునితో సంగమింపబోయే ఆసక్తిగల గోపస్త్రీలకు పెద్దల భయంవలని దుఃఖాన్ని శమింపజేసిన, పగళ్ళచే ఎడబాయని ఒక విలక్షణమైన రాత్రి ఉండింది.

వ్యాఖ్య : ఇంద్రనీల మణిప్రభాచ్ఛన్నమైన పగలు రాత్రిగా ఉందని ఉత్ప్రేక్షితం

గోపాల కృష్ణునితో కలిసి ఆడుకోవాలనే అభిరుచితో గోపికలు అభిసరించే యత్నం చేసేవారు. పగటిపూట తల్లిదండ్రులు, అత్తమామలు మొదలైన పెద్దలు చూస్తే తమనెంత బాధిస్తారో అనే భయం వారికి ఉండేది. ఎవరూ చూడకుండా పోవడానికి చీకటి రాత్రి కావాలి.

**వాసరైః అవ్యపేతా :-** పగటి పూట రాత్రి ఉండదుకదా! కానీ, భగవత్పాదుక బలమథన మణియుక్త. (బలాసురుణ్ణి మట్టుపెట్టినవాడు ఇంద్రుడు) ఎంతటి బలాన్నైనా అణచివేసే ఇంద్రనీలమణులకాంతి పగటిని క్రమ్ముకొన్నది. కాబట్టి పగలుతో కూడిన రాత్రి. పలురకాల పనులు చేసుకొనే పెద్దలకు అనుకూలించే పగలూ ఉంది. పెద్దలకంటబడకుండా శ్రీకృష్ణుని దగ్గరికిపోవడానికి పాదుకామణుల నీలిమ పగలే ఆవరించి గోపికలకు అనుకూలించే రేయీ ఉంది.

**కాచిత్, అన్యా, శర్వరీ :-** 'శౄ-హింసాయాం' అనే ధాత్వర్థాన్ని బట్టి, దినాన్నీ, దినకార్యాన్నీ చెరచేది 'శర్వరి' - రాత్రి. తెల్లవారింది కదా! దైనందిన కార్యాలను నెరవేర్చుకోవాలి. అనే ఆలోచనకలుగకుండా అలుముకొన్న రాత్రి ఇది. పవలూ - రేయీ ఏర్పడకుండా ఎన్ని వాసరాలైనా గోపాల చక్రవర్తి యొక్క అనిర్వచనీయ క్రీడకు హేతవయిన రాత్రి ఇది.

జయద్రథుని వధకోసం శ్రీకృష్ణుడు పగలే రాత్రిగా, అందరనుకొనేలాగా చేస్తే, ఒకప్పుడు పాదుక గోపికలు అభిసరించడంకోసం ఇంద్రనీలమణుల కాంతులను విరజిమ్మి పగలే రాత్రిగా మార్చివేసింది. మాలినీ వృత్తం.

*698. శతమఖ మణిభంగై రున్మయూఖైర్దిశంతీ*
*శరణముపగతానాంరంగనాథేనసామ్యమ్!*
*ప్రథయసి జగతి త్వం పాదుకే! హైతుకానా*
*ముపనిషదుపగీతాం తత్క్రతున్యాయ వార్తామ్ !! 18*

**అర్థం :-** హే పాదుకే = ఓ పాదుకా! ఉత్+మయూఖైః = పైకి ప్రసరించేకిరణాలు కలిగిన; శతమఖమణిభంగైః = ఇంద్రనీలమణులదళాలచేత; శరణం = ప్రపత్తిని / దైవమందిరానికి; ఉపగతానాం = పొందిన / వచ్చిన వారికి; రంగనాథేన = శ్రీరంగనాథునితో; సామ్యం = సమత్వాన్ని; దిశంతీ = సూచిస్తూ; త్వం = నీవు; జగతి = లోకంలో; ఉపనిషత్ + ఉపగీతాం = ఉపనిషత్తుచే ఉపదిష్టమైన; తత్, క్రతు న్యాయ వార్తాం = తత్క్రతువు - ఉపాసన ప్రకారంగా ఫలం పొందడం - అనే న్యాయ సమాచారాన్ని; హైతుకానాం = హేతువాదం చేసే వారికి; ప్రథయసి = తెల్పుతుంటావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! పైకి వ్యాపించే కిరణాలు గల ఇంద్రనీల దళాలచే ప్రపన్నులకు / మందిరానికి వచ్చిన వారికి శ్రీరంగనాథునితో సామ్యాన్ని సూచిస్తూ నీవు, ఉపనిషత్తులో బోధింపబడిన 'పూజను బట్టి ఫలప్రాప్తి' అనే న్యాయవృత్తాంతాన్ని లోకంలో హేతువాదులకు వెల్లడిస్తుంటావు.

వ్యాఖ్య : హరినీలమణులచే పాదుక తత్క్రతున్యాయవార్తను ప్రకటిస్తుంది

"యథాక్రతు రస్మిన్ లోకే పురుషోభవతి తథేతః ప్రేత్యభవతి" అని 'తత్క్రతున్యాయ'విచారం ఛాందోగ్యోపనిషత్తులో ఉంది.

జీవుడు క్రతుమయుడు. క్రతువంటె ఉపాసన. జీవుడేవిధంగా ఉపాసిస్తాడో, ఆ విధమైన ఫలాన్ని పొందుతాడు; అని వేదాంత నిష్పన్నమైన న్యాయం. వేద శాస్త్రార్థాలను నమ్మని కుయుక్తు లెందరో లోకంలో ఉంటారు. కళ్ళతో స్పష్టంగా చూచిన విషయాన్నే ప్రమాణంగా గ్రహిస్తారు. కాబట్టి వీరిని హేతువాదులు లేదా దృష్టప్రమాణవాదులు అంటారు.

భగవత్పాదాలే శరణమని ఉపాసించే పాదుక భగవంతునితో సమాన వర్ణాన్ని పొంది, భగవత్పాదాలతో సమాన ఆకారాన్నీ కలిగి ప్రకాశిస్తుంది. కాబట్టి హరినీలకాంతులచేత మోక్షరూప పరమసామ్యాన్ని పొంది ప్రకాశించే పాదుక 'శరణాగతులు భగవంతునితో సమాన ఆకారాన్ని, వర్ణాన్నీ పొందుతా'రన్న ఉపనిషదర్థాన్ని, హేతువాదులకు తానే తార్కాణం - దృష్ట ప్రమాణం - గా నిలిచి, విశదపరుస్తుంది. ఉత్ప్రేక్షాలంకారం. మాలినీ వృత్తం.

699. పరిచరతి విధౌ త్వాం పాదుకే! రంగభర్తుః
పదసరసిజభృంగై ర్భాసురై రింద్రనీలైః!
ప్రకటిత యమునౌఘా భక్తి నమ్రస్యశంభోః
పరిణమయసి చూడా విష్ణుపద్యాః ప్రయాగమ్ !! 19

**అర్థం :-** హే పాదుకే = ఓ పాదుకా దేవీ! విధౌ = చంద్రుడనే చతుర్ముఖుడు; త్వాం = నిన్ను; పరిచరతి = పూజిస్తున్నప్పుడు; రంగభర్తుః = శ్రీరంగపతి యొక్క; పద సరసిజ భృంగైః = పాదాలనే తామరపూలయందుండే తుమ్మెదలను పోలిన; భాసురైః = ప్రకాశించే; ఇంద్రనీలైః = హరినీలమణులచేత; ప్రకటితయమునా + ఓఘా = ప్రకటింపబడిన యమునా ప్రవాహంగల నీవు; భక్తి నమ్రస్య = భక్తిచే ప్రణమిల్లుతున్న; శంభోః = శివుని యొక్క, చూడా విష్ణు పద్యాః = తలమీద ఉన్న గంగకు; ప్రయాగం = యమునా నదీ సంగమక్షేత్రాన్ని; పరిణమ యసి = ఏర్పరుస్తావు.

**తా॥** ఓ పాదుకా! చంద్రుడనే చతుర్ముఖ బ్రహ్మ నిన్ను సేవిస్తున్నప్పుడు శ్రీ రంగపతి చరణాలనే సరసిజాల యందలి తుమ్మెదలతో ప్రకాశించే ఇంద్రనీలాలచే ప్రకటితయమునా ప్రవాహంకల నీవు భక్తిచే నమ్రుడైన శివుని శిరస్సున ఉండే గంగకు యమునా సంగమాన్ని కల్పిస్తుంటావు.

వ్యాఖ్య : శివుని తలమీది గంగతో ఇంద్రనీలమణికాంతుల సంబంధం యమునా సంగమ క్షేత్రంగా ఉత్ప్రేక్షితం

'విధి, విధు' శబ్దాల సప్తమీ విభక్త్యేకవచనం ఒకే విధంగా ఉండడం వల్ల 'విధౌ' శ్లిష్ట పదంగా ప్రయుక్తం. బ్రహ్మదేవుడు విష్ణుపాదాలకు పరిచర్య చేస్తుంటే గంగ ఉద్భవించింది. శివుడు కూడా పాదాభివందనమప్పుడే చేయగా కలిగిన చంద్రుని సంసర్గం గంగోత్పత్తికాలాన చేయబడిన పరిచర్యగా వర్ణింపబడింది.

ఇంద్రనీలమణులు భగవత్పాదకమలాలయందు మూగిన తుమ్మెదలను పోలి భాసిస్తుంటాయి. గంగను తలదాల్చిన శివుడు శ్రీరంగప్రభువుకు ప్రణమిల్లినప్పుడు పాదుకల్లోని ఇంద్రనీలాలకాంతి గంగకు ప్రసరించింది. చతుర్ముఖుడైన బ్రహ్మ భగవంతుణ్ని సేవించగా గంగ ఎలా ఉదయించిందో, అలాగే పంచముఖుడైన శివుడు భగవంతుని పాదాలకు ప్రణమిల్లగా ఇంద్రనీలాలకిరణ సంసర్గవవల్ల యమునానది ప్రవహించింది.

"గంగా విష్ణు పదీ" (అమరం).

ప్రయాగశబ్దం గంగా యమునా సంగమక్షేత్రంగా ప్రసిద్ధం. నీలమణికాంతియే యమునా ప్రవాహం. శివచూడా విష్ణుపదితో యమునా ప్రవాహం కలిసినట్లున్నది. ఉత్ప్రేక్షాలంకారం మాలినీ వృత్తం.

700. పదకిసలయ సంగా త్పాదుకే! పత్రలశ్రీ
ర్నఖమణిభి రుదారై ర్నిత్యనిష్పన్న పుష్పా!
శతమఖ మణినీలాశౌరిలావణ్యసింధో
ర్నిబిడ తమ తమాలా కాఒపివేలావనీ త్వమ్ !! 20

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకా! పదకిసలయ సంగాత్ = భగవత్పాదాలనే తలిరుల సంబంధం వల్ల; పత్రల శ్రీః = ఆకులున్న శోభగల; ఉదారైః = గొప్ప; నఖమణిభిః = మణుల్లాంటి గోళ్ళచేత; నిత్యనిష్పన్న పుష్పా = ఎల్లప్పుడు వికసించే పూవులు గల; శతమఖమణినీలా = ఇంద్రనీలమణులచే నీలవర్ణంగల; త్వం = నీవు; శౌరి లావణ్యసింధోః = భగవంతుని సౌందర్యమనే లవణ సముద్రం యొక్క; నిబిడతమ తమాలా = దట్టమైన కానుగుచెట్లు గల; కా, అపి = ఒక విలక్షణమైన; వేలావనీ = తీరమందున్న అడవివి.

తా॥ ఓ పాదుకా దేవీ! చిగురాకుల్లాంటి చరణాలసంబంధం వల్ల ఆకులచే ఏర్పడిన శోభగల, గొప్ప మణుల్లాంటి కాళ్ళ గోళ్ళచే ఎల్లప్పుడు పూచే పూలు గల, ఇంద్రనీలమణుల వల్ల నీలవర్ణంగల నీవు శ్రీరంగధాముని సౌందర్యమనే ఉదధికి దట్టమైన కానుగు చెట్లుగల విలక్షణ తీరవనంగా ఉన్నావు.

వ్యాఖ్య : ఇంద్ర నీలమణిపాదుక సముద్రతీరాటవిగా ఉత్ప్రేక్షితం

'వేల' అంటె కడలిదాపున ఉన్న నేల. తమాల తరువును చీకటి చెట్టు అంటారు.

"వేలాకాలేచ జలధేస్తీర నీరవికారయోః" (విశ్వని).
భగవద్విగ్రహసౌందర్యమే సముద్రం.
"ఉదన్వానుదధి స్సింధుః" (అమరం)
ఇంద్ర నీలమణులుగల పాదుకయే కానుగు చెట్లతో నిండిన సమద్రతీర వనం.

కిసలయశోభ భగవత్పాదాలకు ఉంటే, తత్పాదనఖాలకు నిత్య ప్రత్యగ్ర ప్రసూన శోభ ఉంది.

కాzపి :- సాగరతీరం కానుగుచెట్లతో నిండియున్నందున, నేలను కానరాకుండా చేసే ఈ అడవి కవినైపుణ్యం వల్ల ఏర్పడింది. మాలినీవృత్తం.

*701. త్వయి వినిహిత మేత త్కే ఽపి పశ్యంతి మందాః*
*శతమఖమణిజాలం శార్ఙ్గిణః పాదరక్షే!*
*వయ మిదమిహవిద్మః ప్రాణినాంభావుకానాం*
*హృదయ గృహ గుహాభ్యః పీత మంధం తమిస్రమ్ !!* **21**

అర్థం :- హే శార్ఙ్గిణః పాదరక్షే = ఓ భగవత్పాదుకా! కే, అపి, మందాః = అల్పబుద్ధిగల కొందరు; ఏతత్ = దీన్ని; త్వయి = నీ యందు; వినిహితం = ఉంచబడిన; శతమఖ మణిజాలం = ఇంద్రనీలమణి సముదాయంగా; పశ్యంతి = చూస్తారు; వయం = మేము; ఇదం = దీన్ని; ఇహ = ఈలోకంలో; భావుకానాం = భక్తితో కొలిచే; ప్రాణినాం = జీవులయొక్క; హృదయగృహ గుహాభ్యః = హృదయమందిరాల అంతః ప్రదేశాలనుంచి; పీతం = త్రాగబడిన; అంధంతమిస్రం = పెనుచీకటిగా; విద్మః = భావిస్తున్నాం.

**తా॥** ఓ శార్ఙ్గి పాదుకా! అల్పబుద్ధులు కొందరు నీయందు ఉంచబడిన ఈ వస్తువును ఇంద్రనీలమణుల సముదాయంగా భావిస్తారు. మేముమాత్రం దీన్ని ఈ లోకంలో నిన్ను ధ్యానించే ప్రాణుల హృదయ సదనాల అంతఃప్రదేశాల్లో నుంచి త్రాగబడిన గాఢాంధకారంగా భావిస్తున్నాం.

వ్యాఖ్య : ఇంద్ర నీలమణిజాలం అజ్ఞానాంధకారంగా అధ్యవసితం

ప్రాకృత జనులు పాదుకల్లో ప్రత్యుప్తశిలాఖండాలనుజూచి, ఇంద్రనీలమణుల సమూహంగా భావిస్తే, విద్వత్కవులు మాత్రం అలా భావించరు. తనను ఉపాసించే భక్తుల ఎదలో ఏర్పడిన అజ్ఞానమనే అంధకారాన్ని పాదుక, ఎత్తి త్రాగడం వల్ల క్రమ్ముకున్న నల్లని వన్నెయే అంటారు.

*"ఇందౌ యద్ధళితేంద్రనీలశకల శ్యామం దరీదృశ్యతే!*
*తత్సాంద్రం నిశిపీత మంధతమసం కుక్షిస్థమాచక్ష్మహే!!"*

చంద్రుడు వెలుపలిచీకటిని త్రాగడం వల్ల అతని కుక్షిలో ఇంద్రనీలవర్ణం (కళంకం) ఏర్పడి కనబడుతాడు, అన్నాడొక కవి. కాబట్టి చంద్రుడు లోపలి చీకటిని త్రాగలేదు కదా! సర్వశక్తిమతియైన పాదుకాదేవి, ఉపాసకుల హృదయంలోని అజ్ఞానాంధకారాన్ని త్రాగివేసి జ్ఞాన జ్యోతిని వెలిగిస్తుంది. పాదుకాదేవి అజ్ఞాన హంత్రి, సమ్యక్ జ్ఞాన దాత్రి. అజ్ఞానం తొలగిపోగానే మహాజ్ఞేయ, ధ్యేయవస్తువు గోచర మవుతుంది. అపహ్నుత్యలంకారం. మాలినీ వృత్తం.

*702. క్లుప్తశ్యామా మణిభిరసితైః కృష్ణపక్షేణ జుష్టా*
*శ్రేయః పుంసాం జనయసి గతిం దక్షిణాముద్వహంతీ!*
*తేనాస్మాకం ప్రథయసి పరం పాదుకే! తత్త్వవిద్భి*
*ర్మౌళౌ దృష్టాం నిగమవచసాం ముక్తికాలావ్యవస్థామ్ !!* 22

**అర్థం :-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! అసితైః = నల్లని; మణిభిః = మణులచేత; క్లుప్తశ్యామా = కల్పితమైన శ్యామ వర్ణంగల / రాత్రి కలిగిన; కృష్ణ పక్షేణ = కృష్ణుని భక్తిచేత; బహుళ పక్షంతో; జుష్టాం = సేవింబడే / కూడిన, దక్షిణాం = సమర్థమైన / దక్షిణపుదైన; గతిం = నడకను / అయనాన్ని; ఉద్వహంతీ = నిర్వహిస్తున్న నీవు; పుంసాం = మానవులకు; శ్రేయః = ముక్తిని; జనయసి = కల్పిస్తావు; తేన = ఆకారణం చేత; తత్త్వవిద్భిః = తత్త్వజ్ఞానులచేత; నిగమ వచసాం = వేదవాక్కులయొక్క; మౌళౌ = తలయందు / ఉపనిషత్తులనే వేదాంతమందు; దృష్టాం = చూడబడిన; ముక్తికాల + అవ్యవస్థాం = మోక్షకాలం యొక్క నియమరాహిత్యాన్ని; అస్మాకం = మాకు; పరం = బాగా; ప్రథయసి = తెల్పుతున్నావు.

**తా॥** ఓ పాదుకా! నీలమణులచే కల్పితమైన శ్యామవర్ణంగల కృష్ణభక్తునిచేత సేవింపబడి సమర్థమైన సంచారాన్ని నిర్వహించే / నీలమణులచే రాత్రిగా చేయబడిన కృష్ణపక్షంతో కూడిన దక్షిణాయనాన్ని వహించే, నీవు జీవులకు మోక్షం కలిగిస్తావు. అందువల్ల తత్త్వవేత్తలచే వేదాంతమందు చూడబడిన మోక్షకాలం యొక్క అవ్యవస్థను మాకు బాగా వెల్లడిస్తుంటావు.

## వ్యాఖ్య : పాదుకాదేవి స్వీయచరిత్రచే సదర్థాన్ని బోధిస్తున్న నిదర్శనం

ఇంద్రనీలమణుల వల్ల పాదుక(ల) కు శ్యామవర్ణం ఏర్పడింది. కష్ణభక్తుడు పాదుక(ల)ను అభిమానంతో అర్చిస్తాడు. పాదుకాదేవి తన సామర్థ్యంతో చక్కగా సంచరిస్తుంది. ఈ ప్రక్రియ పాదుకాదేవికి స్వాభావికం.

అది రాత్రి సమయం. అందులో చీకటి బహుళంగా ఉండే కృష్ణ పక్షం. పైగా దక్షిణాయనం. ఈ కాలం ధూమమార్గానికి సంబంధించింది.

ముక్తికాలవ్యవస్థ :- "దివాచ శుక్లపక్షశ్చ ఉత్తరాయణమేవచ।

ముమూర్షతాం ప్రశస్తాని, విపరీతంతుగర్హితమ్॥"

పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణం; ఇవి మరణించే వారికి ప్రశస్తసమయాలు. వీటికి 'విపరీతం' అంటే రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయానం; ఇవి మరణించే వారికి అప్రశస్తాలు, అని మోక్షం పొందడానికి కాలనియమం శాస్త్రోక్తం.

"అథయో దక్షిణే ప్రమీయతే పితౄణా మేవ మహిమానంగత్వా చంద్ర మస స్సాయుజ్యం గచ్ఛతి" (తై.నారాయణోపనిషత్తు)

"తేషాం యదా తత్పర్య వైత్యథైతమే వాధ్వానం పునర్నివర్తంతే". (ఛాం-ఉపనిషత్తు)

'దక్షిణాయనంలో మరణించిన జీవులు పితృదేవతల మహిమను పొంది చంద్రసాయుజ్యాన్ని పొందుతారు; అనీ 'చంద్రుణ్ని వదలినప్పుడు ఆ జీవులు తామింతకుముందు పోయిన మార్గాననే తిరిగి వచ్చి జన్మిస్తారు' అని ఉపనిషత్తులు బోధించడం వల్ల అప్రశస్త సమయాల్లో మృతినొందినవాళ్ళకు పరబ్రహ్మప్రాప్తి రూపమైన మోక్షం కలుగదని విశదమవుతున్నది.

ముక్తి కాలావ్యవస్థ :- తత్త్వవేత్తలైన భగవద్వ్యాసాదులు 'బ్రహ్మవేత్తలు మోక్షం పొందడానికి కాలం ప్రతిబంధకం కాదు' అని విశేషంగా వివరించారు.

"నిశి నేతి చేన్న సంబంధస్య యావద్దేహ భావిత్వాద్దర్శయతిచ అత శ్చాయనే ౭పి దక్షిణే" (బ్ర.సూ.4అ-2 పా.18,19)

బ్రహ్మవేత్త రాత్రిగానీ, కృష్ణ పక్షంలోగానీ, దక్షిణాయనంలోగానీ మరణిస్తే అతనికి బ్రహ్మ ప్రాప్తి రూపమైన మోక్షం లేదు, అని తలచరాదు. బ్రహ్మవిద్యా సంబంధం వల్ల సంచిత, ఆగామికర్మలు ముందే నశించినాయి. ఇక ప్రారబ్ధకర్మ సంబంధం దేహమున్నంత వరకే అనుభవింపబడుతుంది. ఎలాంటి కర్మశేషం లేనందువల్ల బ్రహ్మ ప్రాప్తికి ఆటంకం లేదు.

"తస్య తావదేవ చిరం యావన్నవిమోక్ష్యే, అథసంపత్స్యే" (ఛాం.ఉ.) అన్నట్లు బ్రహ్మవేత్తకు శరీర సంబంధం విడిపోవడమే ఆలస్యం, బ్రహ్మప్రాప్తి రూప మోక్షం లభిస్తుంది.

భగవద్గీతలోనూ బ్రహ్మవేత్తలకు మరణకాల విశేషమున్నట్లు శంకకలుగ కుండా ఇలా విశదీకరింపబడింది.

"యోగినః ప్రతిస్మర్యేతే స్మార్తేచైతే" (బ్ర.సూ.4అ.2 పా.20) స్మృతిప్రోక్తాలైన దేవయాన, పితృయానమార్గాలు యోగులు స్మరింపదగినవిగా చెప్పబడుతున్నాయి.

"యత్రకాలే త్వనావృత్తిం----------యోగయుక్తోభవార్జున!! (భ.గీ.8-23 నుంచి 27) ఇక్కడ యోగులంటే అపునరావృత్తికి తగినట్లు బ్రహ్మజ్ఞానులనీ, పునరావృత్తికి అనుగుణంగా పుణ్యకర్మసంబంధులనీ అర్థం.

అర్చిరాది మార్గాన్నే దేవయానమని, ధూమాది మార్గాన్నే పితృయానమని అంటారు. 'కాల' శబ్దానికి కాలాభిమానిదేవతాపరమైన అర్థం. "ఓ భరతశ్రేష్ఠా! అర్జునా! మరణించిన తర్వాత ఏకాలాభిమాన దేవతల ననుసరించి పోతే పునర్జన్మ కలుగదో, కలుగుతుందో ఆ మార్గాలను తెల్పుతాను. అగ్నిరూపమైన జ్యోతిస్సు - పగలు, శుక్ల పక్షం, ఉత్తరాయణం - ఈ కాలాభిమాన దేవతల మార్గంలో పయనించేవారు పునర్జన్మను పొందరు; మోక్షార్హులు. ధూమం - రాత్రి, కృష్ణ పక్షం, దక్షిణాయనం - ఈకాలాభిమాన దేవతల దారిలో పోయేవారు చంద్రుణ్ని చేరి మళ్ళీ జన్మిస్తారు. కర్మిష్ఠులకు పునరావృత్తి ఉంటుంది. అర్చిరాది మార్గగామి తిరిగి రాడు. ధూమాది మార్గగామి తిరిగి వస్తాడు. ఈ దేవయాన పితృయానమార్గాలు తెలిసిన ఏ యోగీ ప్రాణ ప్రయాణ సమయాన మోహం పొందడు. కాబట్టి ఓ పార్థ! నీవు ఎల్లప్పుడు అర్చిరాది మార్గచింతన జేయు" మని శ్రీకృష్ణుడు బోధించాడు. ఈ గీతావచనం మరణకాలాన్ని తెలిపేది కాదు.

బ్రహ్మజ్ఞానం లేనివారికోసం రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయన మనేకాల నియమాన్ని శ్రుతి స్మృతులు బోధించాయి.

అయితే, బ్రహ్మజ్ఞానియైన శ్రీ భీష్మాచార్యులు మృతినొందడానికి ఉత్తరాయణకాలం కోసం ఎందుకు ప్రతీక్షించాడు? అంటే శ్రీ భీష్మాచార్యులు యోగప్రభావం వల్ల తనకిష్టమైన కాలాన మరణించే సమర్థుడు. ప్రశస్తమనే కాలధర్మాన్ని లోకంలో ప్రవర్తింప జేయడానికి, తాను ఆచరించి చూపాడు, అని భగవద్రామానుజులు శ్రీ భాష్యంలో స్పష్టం చేశారు.

కాబట్టి రాత్రి, కష్ణ పక్షం, దక్షిణాయనమూ సమాహారంగా ఉన్నా ఆశ్రితులకు శ్రేయస్సు కలుగుతుందనే వేదాంత విషయాన్ని పాదుకాదేవి తన స్వరూప స్వభావ ప్రక్రియతో ప్రఖ్యాతం చేస్తుందని దేశికులు శ్లేషతో విశదీకరించారు. మందాక్రాంతా వృత్తం.

*703. సద్భిర్జుష్టా సముదితవిధు ర్జైత్రయాత్రా వినోదే*
*స్యాతన్వానా రజని మనఘామింద్ర నీలాంశుజాలైః !*
*చిత్రంఖ్యాతా కుముదవనతః పాదుకే! పుష్యసిత్వం*
*వ్యాకోచత్వం విబుధవనితా వక్త్ర పంకేరుహాణామ్ !!* 23

**అర్థం :-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! సద్భిః = సత్పురుషులచేత / నక్షత్రాల చేత; జుష్టా = సేవింపబడిన/ కూడియున్న; సముదితవిధుః = తోడుగా ఉన్న శ్రీవత్సలాంఛనుడుగల / ఉదయించిన చంద్రుడుగల; జైత్రయాత్రా వినోదేషు = జయశీలమైన సంచారక్రీడల్లో; ఇంద్రనీలాంశుజాలైః = ఇంద్రనీలమణుల కిరణ సమూహాలచేత; అనఘాం = రమ్యమైన; రజనిం = రాత్రిని; ఆతన్వానా = వ్యాపింపజేసే; కు, ముత్+అవనతః = భూదేవి ఆనందాన్ని రక్షించడం వల్ల / కుముద, వనతః = కలువ పూలవనంకంటె: ఖ్యాతా = ప్రసిద్ధి బడసిన; త్వం = నీవు; విబుధ వనితా వక్త్ర పంకేరుహాణాం = దేవాంగనల ముఖాలు అనే కమలాలయొక్క; వ్యాకోచత్వం = వికాసభావాన్ని; పుష్యసి = పోషిస్తున్నావు, చిత్రం = ఆశ్చర్యం.

**తా॥** ఓ పాదుకాదేవీ! సాధుజనులచే సేవింపబడిన తోడుగా ఉన్న శ్రీరంగపతి గల దిగ్విజయ యాత్రల్లో వినోదకృత్యాలయందు ఇంద్రనీలమణులకిరణ జాలాలతో చుక్కలూ, చంద్రుడూ ఉన్న రమ్యమైన రాత్రిని వ్యాపింపజేస్తూ భూదేవి ఆనందాన్ని రక్షించడం వల్ల ప్రసిద్ధి పొందిన నీవు, కలువ పూలవనం కంటె దేవతాస్త్రీల ముఖాలనే కమలాలకు వికాసాన్ని కలుగజేస్తావు. ఆశ్చర్యమే.

వ్యాఖ్య : పాదుకాదేవి రాత్రిని కల్పించి, తామరకమలాలను వికసింప జేయడం చిత్రమే

ప్రియమైన దానివల్ల సుఖమూ, అప్రియమైన దాని వల్ల దుఃఖమూ కలుగుతుంది. దేహాభిమానం వల్ల ప్రియాప్రియాలు, సుఖదుఃఖాలు కలుగుతాయి. కాబట్టి దేహాభిమానాన్ని వదలి రాగద్వేషాది కల్మషరహిత మనస్కులై, సర్వదా భగవచ్చరణారవింద చింతనామృతపాన విశేషచిత్త మత్తులైన వ్యక్తులే సత్పురుషులు. వీరు భగత్పాదుకలనాశ్రయించి ఆరాధిస్తారు. వీరి ఉల్లం పల్లవించేలా రంజిల్ల చేసేది పాదుకాదేవి.

తన అందమైన నడకలతో శ్రీవత్సలాంఛనుడైన శ్రీరంగనాయకులను పులకింప జేసేది పాదుకాదేవి.

శ్రీరంగనాథుడు జైత్రయాత్రకు వెళ్ళినప్పుడు మనోరంజకమైన క్రీడలు సలుపుతూ ప్రభువునూ, ప్రజలనూ హర్షింప జేసేది పాదుకాదేవి. తన ఇంద్రనీలమణులకాంతులను నల్గడల ప్రసరింపజేసి చుక్కలదొరతో కూడిన రమ్యమైన రాత్రిని ధాత్రిలో కల్పించేది పాదుకాదేవి.

సత్పురుషులే చుక్కలు. స్వయం వ్యక్తమైన శ్రీరంగధాముడే చంద్రుడు. పాదుకయే రాత్రిగా రూపొంది లోకానికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

నిర్మల హృదయులు. శుద్ధ చరిత్రులు కాబట్టి సద్వాచ్య పురుషులు చుక్కలు. "విధుః శ్రీ వత్సలాంఛనః" "విధుః సుధాంశుః శుభ్రాంశుః" (ఉభయత్ర అమరం) 'విధు' శబ్దానికి విష్ణువు, చంద్రుడు అని అర్థద్వయం.

నీల ఘన శ్యాముడైన విష్ణుమూర్తి వక్షఃస్థలంలో శ్రీవత్సమనే తెల్లని పుట్టుమచ్చ ప్రకాశిస్తుంది కాబట్టి చంద్రుడు. కుముత్+అవనం; కుముద, వనం; అని సభంగశ్లేష. రాత్రిపూట కలువలు వికసించడం ప్రసిద్ధం. కలువలకు ప్రియుడు చంద్రుడు. "జగ్ముపాంతస్థుషాం వా" అన్నట్లు ఈ కల్పితరాత్రి జంగమస్థావరాలకూ, స్థల జల వస్తువులకూ ఆనందాన్ని కలిగిస్తూ రామణీయకతను పోషిస్తుంది.

రాత్రి వేళ కమలాలు వికసించవు. చంద్రుడు తమ్ముల పగవాడు. దేవాంగనల మొగాలే తామర కమలాలు. రాత్రి వేళకమలాలు వికసించడం వింత.

పాదుకాప్రభావం వల్ల - జైత్రయాత్రలో నిశాచరులు నశించడం వల్ల - దేవాంగనలముఖకమలాలు వికసించాయి.

పాదుకాదేవి రజనియై కలువలకంటె అధికంగా కమలాలనేవికసింపజేయడం వ్యాఘాత రామణీయకత.

వినోదంగా రాత్రించరులనణచివేసి భూభారాన్ని తగ్గించి భూదేవికి (లోకులకు) ఆనందాన్ని కలిగిస్తుంది. అంతకంటె ఎక్కువగా, సాటిమహిళలకు సానుభూతితో దేవాంతకులనంతమొందించి ఆనందాన్ని కలిగించింది. శ్లేష రూపకానుప్రాణిత వ్యాఘాతాలంకారం. మందాక్రాంత.

*704. నిత్యం లక్ష్మీనయనరుచిరై శ్శోభితా శక్రనీలై*
*శ్శాలగ్రామక్షితిరివ శుభైః శార్జ్గిణో రూపభేదైః!*
*సాకేతాదే స్సమధిక గుణాం సంపదం దర్శయంతీ*
*ముక్తి క్షేత్రం మునిభిరఖిలైర్గీయసే పాదుకే! త్వమ్!!* 24

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకావనీ! శుభైః = దోషాలనుపోగొట్టే / మంగళకరమైన; శార్జ్గిణః = భగవంతుని యొక్క; రూపభేదైః = మూర్తి భేదాలచేత; శాలగ్రామక్షితిః, ఇవ = శాలగ్రామలున్న భూమి (క్షేత్రం) లాగా; లక్ష్మీనయన రుచిరైః = లక్ష్మీ దేవికన్నులవలె అందమైన; శక్రనీలైః = ఇంద్రనీలమణులచేత; నిత్యం = ఎల్లకాలం; శోభితా = శోభించే; సాకేత + ఆదేః = అయోధ్యమొదలైన ముక్తి క్షేత్రాలకంటె; సం + అధిక గుణాం = మిక్కిలి ఎక్కువ గుణాలు కలిగిన; సంపదం = వైభవాన్ని; దర్శయంతీ = చూపిస్తున్న; త్వం = నీవు; అఖిలైః = సమస్తమైన; మునిభిః = మునులచేత; ముక్తి క్షేత్రం = ముక్తిని ఇచ్చే క్షేత్రంగా; గీయసే = గానం చేయబడుతున్నావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! దోషహరమైన భగవంతుని మూర్తి భేదాలచే సాలగ్రామలు ఉత్పత్తి అయ్యే భూమిలాగా, లక్ష్మీదేవి నయనాల వలె అందమైన ఇంద్రనీలమణులచేత నిత్యం శోభించే నీవు, అయోధ్యాది నగరాలకంటె చాల ఎక్కువగుణాలు కలిగిన వైభవాన్ని ప్రదర్శిస్తూ సమస్త మునులచేత ముక్తి క్షేత్రంగా కీర్తింపబడుతున్నావు.

### వ్యాఖ్య : పాదుక ముక్తి క్షేత్రంగా వర్ణితం

పాదుక(లు) ఉన్న క్షేత్రం - శ్రీరంగం - ముక్తి క్షేత్రమని మునులు కీర్తిస్తుంటారు. అసితేక్షణయైన లక్ష్మీదేవి కటాక్షం ఇహ పరసుఖప్రదం. జగదేకమోహనమైన కళ్ళతో లక్ష్మీదేవి శోభించే లాగా ఇంద్రనీలమణుల నీలకాంతులతో పాదుకాదేవి శోభిస్తుంది. భగవంతుడు మూర్తీభవించిన శిలలు శాలగ్రామలు. భగవత్స్వరూపాల్లో భేదాలున్నట్లే, మత్స్యం, కూర్మం, వరాహం, నారసింహం, షట్చక్రసీతారామం, గోపాలం ఇత్యాదిరూపభేదాలు శాలగ్రామశిలల్లోనూ ఉంటాయి.

నిత్యం శాలగ్రామరూపంలో ఉండే భగవన్మూర్తిని అభిషేకించి, షోడశోపచారాలతో పూజించడం శుభం, సకలదోషహరం. ఆర్యావర్తంలో శాలగ్రామశిలలు ఉద్భవించిన ప్రదేశం నీలవర్ణంతో శోభిస్తూ ముక్తి క్షేత్రంగా ప్రశంసితం. భారతదేశంలో ఏడు ముక్తి క్షేత్రాలు ప్రసిద్ధమైనవి.

*"అయోధ్యామధురా మాయాకాశీ కాంచీ హ్యవంతికా।*
*పురీ ద్వారవతీచైవ సప్తైతే మోక్షదాయికాః ॥"*

'మాయా' అంటే హరిద్వారమనే పుణ్యతీర్థ క్షేత్రం. "అవంతిక" చారిత్రక ప్రసిద్ధమైన ఉజ్జయినీ క్షేత్రం. సాందీపని గురువువద్ద బలరామకృష్ణులు విద్యాభ్యాసం చేసిన పుణ్య క్షేత్రం ఉజ్జయిని.

అయోధ్యాది సప్త (7) ముక్తి క్షేత్రాలకంటె శాలగ్రామశిలలు ఉదయించే ముక్తి క్షేత్ర మధికంగా శోభిస్తుంది. శాలగ్రామక్షితి కన్నా సమధికగుణ సంపద గల ముక్తి క్షేత్రం పాదుకావాస క్షేత్రం.

"కంగులుం పగలుమ్" అని శ్రీరంగక్షేత్రాన్ని నమ్మాళ్వార్లు స్తుతించారు. "తెన్నాడుం వడనాడుం తొళునిన్ఱ తిరువరంగం తిరుప్పతి". దాక్షిణాత్యులూ ఔత్తరాహులూ సేవించే క్షేత్రం శ్రీరంగమన్నారు పెరియాళ్వారు. "శ్రీరంగం కరిశైల మంజనగిరిం" అంటూ పుణ్యక్షేత్రాల్లోకెల్ల శ్రీరంగం కనిష్ఠికా ధిష్ఠితంగా కొనియాడినవారు శ్రీపరాశరభట్టర్.

"తీరాద వినైయ నైత్తుమ్ తీర్కుంకోయిల్ తిరువరంగమెనత్తి గళుంకోయిఞానే" అని నిగమాంతదేశికులు ప్రస్తుతించారు.

*"ఇదం హిరంగం త్యజతా మిహాంగం, పునర్నచాంగం యదిచాంగమేతి!*
*పాణౌ రథాంగంశయనే భుజంగం, యానే విహంగం చరణేఽపి గాంగమ్"॥*

ఇలా ఎందరో మునులు శ్రీరంగం ముక్తిని ప్రసాదించే క్షేత్రమని గానం చేశారు. ఉపమాలంకారం, మందాక్రాంతావృత్తం.

*705. పాదన్యాస ప్రియసహచరీం పాదుకే! వాసగేహాత్*
*తామారుహ్య త్రిచతరపదం నిర్గతే రంగనాథే!*
*అంతః స్నిగ్ధై రసుర మహిళావేణి విక్షేప మిత్రైః*
*శ్యామచ్ఛాయంభవతి భవనం శక్రనీలాంశుభిస్తే !!* **25**

**అర్థం :-** హే పాదుకే = ఓ పాదావనీ! రంగనాథే = శ్రీరంగనాథుడు; పాదన్యాస ప్రియసహచరీం = అడుగులు వేయడానికి ప్రియసఖివైన; త్వాం = నిన్ను; ఆరుహ్య = అధిరోహించి; వాసగేహాత్ = శయనాగారంనుంచి; త్రిచతురపదం = మూడు నాలుగడుగులు; నిర్గతే = బయటకు రాగా; స్నిగ్ధైః = సాంద్రమైన / నూనెచేత నునుపైన; అసుర మహిళా వేణి విక్షేపమిత్రైః = రాక్షసాంగనల కేశపాశం జారడానికి సాటివైన (విరబోసిన వెంట్రుకలను పోలిన); తే = నీయొక్క; శక్రనీల+అంశుభిః = ఇంద్రనీల మణులకాంతులచేత; భవనం = మందిరం; అంతః = లోపల; శ్యామచ్ఛాయం = నీలవర్ణంగా; భవతి = అవుతుంది.

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీ రంగనాథుడు నడుచునప్పుడు ప్రేమతో తోడుగా ఉండే నిన్ను అధిరోహించి పడకటింటి నుంచి మూడు నాలుగడుగులువేస్తూ బయటకురాగా, సాంద్రమైన / తైలంతో కూడిన రాక్షస స్త్రీల కేశపాశం విడిపోయి జారడానికి తోడైన నీ ఇంద్రనీల మణులకిరణాలచేత కోవెల (బయటా) లోపటా శ్యామచ్ఛాయగా అవుతుంది.

## వ్యాఖ్య : పాదుకవల్ల శ్రీరంగం ముక్తిక్షేత్రమని వర్ణితం

మృదుతల ఫణిరాడ్భోగ పర్యంకమందు పవళించిన శ్రీరంగనాథుడు అంతః పురమందిరంలో నుంచి పాదుకలను ధరించి బయటకు కొన్ని అడుగులు వేస్తూ వచ్చినప్పుడు శ్రీరంగమందిరమంతా ఇంద్రనీలమణులకాంతులతో నిండిపోతుంది. వీథుల్లోకి రాగానే శ్రీరంగ నగరమంతా నీలకాంతులు వ్యాపించి భగవద్విగ్రహ వర్ణంతో పరమసామ్యాన్ని పొంది ముక్తి క్షేత్రంగా గోచరిస్తుంది.

దైవ ద్వేషులైన రాక్షసులు శ్రీరంగనాథునితో మార్కొని దీపకళికను తాకి మాడిపోయి మసియైన మిడతల్లాగా మిగిలి పోవడమూ, తమను భరించే వాళ్ళు నశించడంవల్ల బావురుమని గుండెలు బాదుకుంటూ ఏడ్చే రాక్షసాంగనల సిగముళ్ళు - నూనె పూసి అందంగా ముడుచుకొన్న కొప్పులు - విడిపోయి విరబోసిన నల్లని కురులకాంతులూ నగరమంతా వ్యాపించడమూ జరుగుతుంది. సాంద్రనీలిమ నల్లదల ప్రసరిస్తుంది.

అసుర మహిళల వేణీ విక్షేపానికి అంటే స్వామి విజయానికి పాదుకయే కారకురాలుకదా! విరబోసిన ఇంతులకురులకాంతికీ, పాదుకేంద్రనీలాలకాంతికీ చెలిమి ఏర్పడింది. గుణసామ్యమే మైత్రికి కారణం. సానుభూతికి తోరణం.

"నిరంజనః పరమంసామ్యముపైతి".

రాగద్వేషాలు లేని శుద్ధజీవుడు, స్వస్వరూపావిర్భూతుడై పరమ పురుషునితో సమానమైన స్థితిని పొందడమే 'ముక్తి' అని శ్రుత్యర్థం.

దేహాలతో పాటు రాగద్వేషాలు విడిపోయి శుద్ధజీవుల మీద (అంతః) భగవంతుని అంతరంగంలో ప్రేమ ఏర్పడుతుంది. శ్రీ రంగ మందిరంలోపల హరితత్త్వం - శ్యామవర్ణం వ్యాపించడం వల్ల ముక్తి క్షేత్రం శ్రీరంగం.

"భూ - సత్తాయాం" అనే ధాతువునుంచి భవతి (తిజంతం), భవనం (సుబంతం) ఏర్పడుతుంది. వస్తుధారణానుకూల వ్యాపారమే 'సత్త'. "శ్యామచ్ఛాయం భవతి'. ఏడు అక్షరాలు. "భవనం, శ్యామచ్ఛాయం" 3+4=7. త్రిచతుర పదం. పాదుక సహచరి. "సఖాసప్త పదాభవ, సఖాయౌ సప్త పదాబభూవ" అనే శ్రుతి "సప్త పది' ని వివరిస్తుంది.

జీవ దేవులకు భార్యాభర్తృ సంబంధముంది. ఏడు అడుగులు వేస్తే వీరువారే అవుతారు. పాదన్యాస ప్రియ సహచరితో శ్రీరంగం (3) ముక్తి క్షేత్రం (4) ఉపమాలంకారం. భావానుకూలమైన వృత్తం మందాక్రాంత.

706. యాతేబాహ్యాం గణమభియతః పాదుకే! రంగభర్తుః
సంచారేషు స్ఫురతి వితతిః శక్రనీల ప్రభాయాః!
విష్వక్సేన ప్రభృతిభిరసౌ గృహ్యతే వేత్ర హస్తైః
భ్రూ విక్షేప స్తవ దివిషదాం నూన మాహ్వాన హేతుః !! 26

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకాదేవీ! బాహ్యాంగణం = బయటి వాకిట్లోకి; అభియతః = వెళ్ళుతున్న; రంగభర్తుః = రంగపతియొక్క; సంచారేషు = సంచారాల్లో; తే = నీ యొక్క; శక్రనీలప్రభాయాః = ఇంద్ర నీలమణులకాంతియొక్క; యా = ఏ; వితతిః = విస్తృతి; స్ఫురతి = ప్రకాశి స్తుందో; అసౌ = ఈ విస్తృతి; వేత్రహస్తైః = దండపాణులైన; విష్వక్సేన ప్రభృతిభిః = సేనాపతి మొదలైన వారి చేత; దివిషదాం = దేవతల యొక్క; ఆహ్వాన హేతుః = ఆహ్వానానికి కారణమైన; తవ = నీ యొక్క; భ్రూవిక్షేపః = కనుబొమల కదలికగా; గృహ్యతే = గ్రహింపబడుతుంది. నూనం = నిశ్చయం.

తా॥ ఓ పాదుకా! బాహ్యాంగణంలోకి వెళ్ళుతున్న శ్రీరంగనాథుని విహారాల్లో నీ ఇంద్రనీలాలకాంతి విస్తారంగా ప్రకాశిస్తుంది. ఈ విస్తృతి, దేవతాహ్వానికి కారణమైన నీ కనుబొమలకదలికగా చేతుల్లో బెత్తం ధరించిన విష్వక్సేనాదులచేత గ్రహింపబడుతుంది. నిశ్చయం.

వ్యాఖ్య : ఇంద్రనీలాలకాంతి విస్తృతి పాదుకాభ్రూవిక్షేపంగా ఉత్ప్రేక్షితం

శ్రీరంగవిభుడు సంచారార్థం బయల్దేరే సమయాల్లో పాదుకాదేవి, సేనాధిపతియైన విష్వక్సేనుడు మొదలైనవారికి, దేవతలను ఆహ్వానించండి' అని ఆజ్ఞాపిస్తుంది. స్వామి దర్శనం కోసం ఎదిరిచూస్తూ ప్రాకారాల బయట గుమిగూడిన భక్తజనులను సేనాధికారులు చేతి బెత్తంతో బెదరిస్తూ లోనికి చొచ్చుకొని రాకుండా నియమిస్తుంటారు.

ఇంద్రనీలాల కాంతి విస్తారాన్ని, తన కనుబొమలసైగతో పాదుకా దేవి దేవతలనాహ్వానించడం కోసం తమను ఆజ్ఞాపిస్తున్నట్లు సేనముదలి యాళ్వారాదులు గ్రహిస్తారు.

కనుబొమల కదలికల వలని నైగనిగ్యానికీ, ఇంద్రనీలప్రభావిస్తృతికీ ఉన్న వర్ణసామ్యం వల్ల 'నూనం' అని ఉత్ప్రేక్షింపబడింది. మందాక్రాంతావృత్తం.

707. అక్ష్ణోరంజన కల్పనా, యవనికా లాస్య ప్రసూతేర్గతే
శ్చిద్గంగా యమునా, ముకుందజలధే ర్వేలాతమాలాటవీ!
కాంతాకుంతల సంతతిః శ్రుతి వధూకస్తూరికాలంక్రియా
నిత్యం రత్న పదావని! స్ఫురతితేనీలామణిశ్రేణికా!! 27

అర్థం:- హే రత్న పదావని = ఓ మణిపాదుకా! తే = నీ యొక్క; నీలా = నల్లని; మణి శ్రేణికా = మణుల పంక్తి; అక్ష్ణోః = (సేవకుల) కళ్ళకు; అంజనకల్పనా = కాటుక దిద్దినట్లుగా; లాస్య ప్రసూతేః = నాట్యానికికారణమైన; గతేః = నడకకు; యవనికా = తెరగా; చిత్ + గంగా, యమునా = జ్ఞానమనే గంగకు యమునా నదిగా;

ముకుంద జలధేః = భగవంతుడనే సముద్రం యొక్క; వేలా = తీరాన ఉన్న; తమాల + అటవీ = కానుగు చెట్ల అడవిగా; కాంతా కుంతల సంతతిః = దేవేరుల ముంగురుల సముదాయంగా; శ్రుతివధూ కస్తూరికా + అలంక్రియా = నిగమకాంతలకు కస్తూరి చేత చేయబడిన అలంకారంగా; నిత్యం = ఎల్లకాలం; స్ఫురతి = స్ఫురిస్తుంది.

**తా॥** ఓ రత్నపాదుకా! నీ ఇంద్రనీలమణుల శ్రేణి భక్తుల కళ్ళకు కాటుకతో సమానమవుతుంది. లాస్యాన్ని కల్గించే స్వామి సంచారానికి తెర. జ్ఞానమనే గంగతో కలిసే యమునా ప్రవంతి. ముకుందుడనే సముద్రానికి తీరమందుండే తమాలాటవి. శ్రీ భూనీళాదుల ముంగురుల వరుస. శ్రియఃపతిని కీర్తించే శ్రుతికాంత ముఖాన అలంకరించుకొనే కస్తూరీ తిలకం. ఇలానిత్యం ప్రకాశిస్తుంది.

వ్యాఖ్య : ఇంద్రనీలమణులపంక్తి అనేక వస్తువులుగా ప్రకాశితం

భక్తి యే సిద్ధాంజనం. అది భగవంతుణ్ని సాక్షాత్కరింపజేస్తుంది. తెర ఉంటె రంగం ఏర్పడి నాట్యానికి అనుకూలిస్తుంది. గంగా యమునా సంగమం పవిత్ర తీర్థక్షేత్రం. కాటుక, యవనిక, యమున, తమాలాటవి, అలకలగుమి, కస్తూరి - ఇలా పాదుకేంద్రనీలమణిపంక్తిని నీలవర్ణంతో శోభించే నానా వస్తువులుగా వర్ణించడం ఉల్లేఖాలంకార లక్షణం.

సంకల్ప సూర్యోదయంలో కాదంబినిని వర్ణించే "అక్ష్ణోరంజన వర్తికా" (2-80) అనే శ్లోకం. ఈ శ్లోకంతో పోలియున్నది. శార్దూల విక్రీడితావృత్తం.

*708. నిరంతర పురందరోపలభవం ద్యుతింతావకీ*
*మవైమి మణిపాదుకే! సరణి సంగినీం రంగిణః!*
*తదీయ నవయౌవన ద్విరదమల్ల గండస్థలీ*
*గళన్మదఝుళంఝుళాబహుళ కజ్జలశ్యామికామ్!!* 28

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! నిరంతర పురందర + ఉపల భువం = ఎడతెగకుండా ఇంద్రనీల మణులనుంచి జనించిన; రంగిణః = శ్రీరంగ ప్రభువు యొక్క; సరణి సంగినీం = సంచారమార్గమందు వ్యాపించిన; తావకీం = నీదైన; ద్యుతిం = కాంతిని; తదీయ-శ్యామికాం/తదీయ = ఆ ప్రభువుయొక్క, నవయౌవన = నూత్నవయస్సు అనే, ద్విరదమల్ల = మహాగజం యొక్క; గండస్థలీ = చెక్కిళ్ళనుంచి; గళత్ = జారుతున్న; మద ఝుళం ఝుళా = మద ప్రవాహం యొక్క; బహుళ = సాంద్రమైన; కజ్జల = కాటకవంటి; శ్యామికాం = నీలవర్ణంగా; అవైమి = భావిస్తున్నాను.

**తా॥** ఓ మణిపాదుకా! నిరంతరం పురందరమణులనుంచి జనించే శ్రీరంగ ప్రభు సంచారమార్గమందు వ్యాపించే నీకాంతిని ఆ ప్రభువు యొక్క నవయౌవన మనే గజ తల్లజం యొక్క గండస్థలాల్లోనుంచి స్రవించే మదజల ప్రవాహం యొక్క సాంద్రమైన కజ్జలంలాంటి నీలకాంతిగా భావిస్తున్నాను.

వ్యాఖ్య : ఇంద్రనీలమణులకాంతి మహాగజమద జలకాంతి గా ఉత్ప్రేక్షితం

పాదుకల్లో ఎడం లేకుండా వరుసగా కూర్చబడిన హరినీలాలకాంతి స్వామి సంచరించే దారిలో గాఢంగా ప్రసరిస్తుంది. నిజంగా ఇది ఇంద్రనీలాలకాంతి కాదేమో! శ్రీరంగనాథుడు నిత్యయౌవనుడు. ఆయన నవయౌవన మనే మదగజం యొక్క గండస్థలాలనుంచి నిరంతరం ఝళం ఝళధ్వనితో స్రవించే మదజలధారయొక్క కాటుకలాంటి నీలకాంతియే. నిజంగా నైల్యం లేని కవికేసరి హృదయం నిరంతర భావ ఝళం ఝళాబహుళం. పృథ్వీ వృత్తం.

*709. ప్రతీమ స్త్వాం పాదావని ! భగవతో రంగవసతే*
*ర్ఘనీ భూతా మిత్థం పదకమల మాధ్వీపరిణతిమ్।*
*స్ఫురంతః పర్యంతే మదగరిమ నిష్పంద మధుప*
*ప్రసక్తిం యత్రైతే విదధతి మహానీలమణయః ॥* **29**

**అర్థం:-** హే పాదావని = ఓ పాదుకాదేవీ! త్వాం = నిన్ను; ఇత్థం = ఇట్లు (పాదుకా రూపంలాగా); ఘనీ భూతాం = గడ్డకట్టిన; రంగవసతేః = రంగధాముడైన; భగవతః = భగవంతుని యొక్క; పదకమల మాధ్వీపరిణతిం = పాదకమలాల మకరందం యొక్క పరిణామంగా; ప్రతీమః = భావిస్తున్నాం. యత్ర = ఏ పరిణామమందు; పర్యంతే = చుట్టు ప్రక్కల; స్ఫురంతః = మెరుస్తున్న; ఏతే = ఈ; మహనీలమణయః = గొప్ప ఇంద్రనీలమణులు; మదగరిమ నిష్పంద మధుప ప్రసక్తిం = అధిక మదంచేత చలించని తుమ్మెదలచేరికను; విదధతి = చేస్తున్నాయి.

**తా॥** ఓ పాదావనీ! నిన్ను ఇలా ఘనీభవించిన రంగధాముని పాదాలనే కమలాలమకరంద పరిణతిగా విశ్వసిస్తున్నాం. ఆ మకరందం ముద్ద దగ్గర మెరిసే ఈ మహా నీలమణులు అధికమదం చేత చలించని తుమ్మెదల ప్రసక్తిని చేస్తుంటాయి.

వ్యాఖ్య : పాదుక పూదేనెపెర. మహానీలమణులు తేనెటీగలుగా ఉత్ప్రేక్ష

భగవచ్చరణాలు తామరపూవులే. ఆ పూలమకరందం విశేషంగా స్రవిస్తుంటే తుమ్మెదలు ఆస్వాదించి మత్తెక్కి తొలగిపోలేదు. కాలక్రమేణ ఆ మకరందం పాదుకారూపంగా ఘనీభవించింది. తుమ్మెదలు ఆనందంతో ఏ మాత్రం స్పందించకుండా గడ్డకట్టిన మకరంద ప్రాంతంలో నిల్చి ఉన్నాయి. ఆ రీతిగా, కదలక కూరుకుపోయిన మధుపాలే మహానీలమణులుగా స్ఫురిస్తున్నాయి.

పాదుక ఘనీభవించిన మకరందం. నీలమణులు నీలకాంతులతో మెరిసె, చలించని చంచరీకాలు. కావ్యలింగాలంకారంతో కూడిన ఉత్ప్రేక్షాలంకారం. శిఖరిణీ వృత్తం.

*710. సమతాం నిజేంద్ర నీల ప్రభవేన ముకుంద పాదుకే! భవతీ।*
*తమసా నిరస్యతితమః, కంటకమివ కంటకేనైవ ॥* **30**

**అర్థం:-** హే ముకుందపాదుకే = మోక్షమిచ్చే భగవంతుని పాదుకా! భవతీ = నీవు; కంటకేన, ఏవ = ముల్లు చేతనే; కంటకం, ఇవ = ముల్లునువలె; నిజ + ఇంద్రనీల ప్రభవేన = స్వీయ నీలమణుల నుంచి జనించే;

తమసా = నీలకాంతిచేత; (చీకటిచేత); నమతాం = నమస్కరించే భక్తుల యొక్క; తమః = శోకాన్ని; (చీకటిని), నిరస్యతి = తొలగిస్తావు.

**తా॥** ఓ ముకుందపాదుకా! నీవు నీ ఇంద్రనీలమణుల కాంతిరూపమైన చీకటి చేత నమస్కరించే భక్త జనుల దుఃఖమనే చీకటిని, ముల్లుచేత ముల్లును వలె, తొలగిస్తావు.

వ్యాఖ్య : పాదుకాదేవి నమజ్జనుల తమస్సును తొలగిస్తుందని వర్ణన.

ఇంద్ర నీలాలకాంతి చీకటిలాగా నల్లగా ఉండడం సహజమే. కాని అది రజస్తమస్సులంటని శుద్ధ సత్త్వగుణశోభితయైన పాదుకాదేవికి అలంకారంగా ఉన్న హరినీలమణుల నుంచి ప్రభవించిన కాంతి. ఈ నీలమణులకాంతి ముకుందుని నీల తనుకాంతి సదృశమయింది. కాబట్టి పాదుకాదేవిది హరి నీలప్రభాత్మకమైన తమస్సు.

బద్ధజీవులకు ప్రకృతిలో తాపత్రయం వల్ల కలిగే శోకాత్మకమైన తమస్సు ఆవరించి ఉంటుంది. కాబట్టి, పాదుకాదేవి స్వీయ హరి నీలమణికాంతిరూపమైన తమస్సుచేత ఆశ్రితుల శోకరూపమైన తమస్సును నివారిస్తుంది.

యుక్తితో వాదించే వారికి యుక్తితో సమాధానమీయడం లోకజ్ఞత. లోకంలో కాళ్ళయందు తగిలి విరిగిన ముల్లును మరొక ముల్లుచేతనే కదా తీసి వేస్తారు. "ఉష్ణం ఉష్ణేన శామ్యతి" అన్నట్లు, తమస్సుచేతనే తమస్సు నిరసింప బడడం నిర్వివాదాంశం.

శ్లేషతో కూడిన ఉపమాలంకారం. ఆర్యావృత్తం.

ఇంద్రనీల పద్ధతి సమాప్తం.

# 21. బింబ ప్రతిబింబ పద్ధతి

*711. శౌరేః శుద్ధాంతనారీణాం విహారమణి దర్పణమ్ !*
*ప్రసత్తేరివ సంస్థానం పద త్రాణముపాస్మహే ॥* 1

**అర్థం:-** శౌరేః = శ్రీరంగనాథునియొక్క; శుద్ధాన్తనారీణాం = శ్రీభూమ్యాది దివ్యమహిషీమణులయొక్క; విహారమణిదర్పణం = వినోదం కోసం మణిమయ దర్పణమైన; ప్రసత్తేః = అనుగ్రహమనే స్వచ్ఛతయొక్క; సంస్థానం, ఇవ = ఆకారం లాగా ఉన్న; పదత్రాణం = పాదరక్షిణిని; ఉపాస్మహే = ఉపాసిస్తుంటాం, ధ్యానిస్తుంటాం.

**తా॥** శ్రీరంగనాథుని అంతః పురస్త్రీల వినోదం కోసం మణిదర్పణమైన అనుగ్రహాకృతివలె / నిర్మలరూపంగా ఉన్న పాదుకాదేవిని ధ్యానిస్తుంటాం.

వ్యాఖ్య : మణి దర్పణమైన పాదుకా ప్రశంస

శ్రీరంగ ప్రభు పాదుక మణిమయమైనందున శ్రీ భూనీళాది సతీమతల్లికలకు, తమ లీలను చూచుకోవడానికి అద్దంలాగా ఉపయోగపడుతుంది. మలినమైన అద్దంలో ప్రతి బింబాలు స్పష్టంగా స్ఫురించవు కదా! స్వచ్ఛమణుల ప్రాచుర్యం వల్ల ఒక బింబాన్ని అనేక కోణాల్లో బహుబింబాలను ప్రతి ఫలింపజేసే యోగ్యత పాదుకాదేవికి ఉంది.

మూర్తీభవించిన భగవదనుగ్రహం ప్రాణికోటికి శిరోధార్యమే. నైర్మల్యం భగవత్ప్రసాదమే. కాబట్టి భగవత్పాదుక ఉపాసింపదగినదే. రూపకోత్ప్రేక్షలతో కూడిన ప్రేయో ఉలంకారం. అనుష్టుప్ఛందం.

*712. కమలాపతిపాదుకే! కదాచిత్*
*విహగేంద్ర స్త్వయి బింబితో విభాతి ।*
*సవిలాసగతే ఉపి రంగభర్తు*
*ర్నిజమాత్మానమివోపధాతుకామః॥* 2

**అర్థం:-** హే కమలాపతి పాదుకే = ఓ శ్రియః పతిపాదుకా! కదాచిత్ = ఒకప్పుడు; త్వయి = నీయందు; బింబితః = ప్రతిఫలించిన; విహగ + ఇంద్రః = పక్షులకు రాజైన గరుత్మంతుడు; రంగభర్తుః = శ్రీరంగపతియొక్క; సవిలాసగతే, అపి = విలాసంతో కూడిన సంచారమందుకూడా; నిజం = తనదైన; ఆత్మానం = శరీరాన్ని; ఉపధాతుకామః, ఇవ = సమర్పింపకోరిక కలవాడు వలె; విభాతి = ప్రకాశిస్తున్నాడు.

**తా॥** ఓ కమలాపతి పాదుకా! ఒకప్పుడు నీ యందు ప్రతిఫలించిన పక్షిరాజు, శ్రీరంగపతియొక్క లీలాసంచారమందుకూడా తన దేహాన్ని ధారకత్వంగా అర్పింపగోరినవాడు లాగా ప్రకాశిస్తున్నాడు.

వ్యాఖ్య : పాదుక యందు గరుడుని ప్రతిబింబవర్ణన

నిత్యసూరియైన గరుత్మంతుడు నిచ్చలు భగవంతుని యెదుట నిల్చిసేవిస్తుంటాడు. శ్రీ రంగనాథుడు పాదుకలను ధరించి లీలగా సంచరిస్తున్నప్పుడు కూడా గరుత్మంతుడు భగవంతునికి వాహనంగా తన శరీరాన్ని సమర్పించే అభిలాషకలవాడైనట్లు పాదుకయందు ఆయన ప్రతిబింబం ప్రకాశిస్తుంది.

భగవానుడు గరుడ ధ్వజుడు. బ్రహ్మోత్సవంలో మొట్టమొదట ధ్వజారోహణంతో కార్యక్రమ మారంభమవుతుంది. కాబట్టి తొట్టతొలుత గరుడుని ప్రతిబింబం వర్ణింపబడింది. ఉత్ప్రేక్షాలంకారం. ఔపచ్ఛందసికం.

*713. మణిపంక్తిషు తే దిశా మధీశాః*
*ప్రతిబింబాని నిజాని వీక్షమాణాః ।*
*అభియంతి ముకుందపాదుకే ! త్వా*
*మధికారాంతర సృష్టి శంకయేవ!!* 3

**అర్థం:-** హే ముకుంద పాదుకే = ఓ ముకుంద పాదుకా! దిశాం = దిక్కులయొక్క; అధి+ఈశాః = పాలకులు; తే = నీ యొక్క; మణి పంక్తిషు = రత్నావళులందు; నిజాని = తమవైన; ప్రతిబింబాని = ప్రతిబింబాలను; వీక్షమాణాః = చూస్తున్నవారై; అధికార + అంతర సృష్టి శంకయా, ఇవ = వేరే అధికారుల సృష్టి యొక్క అనుమానంచేతకాబోలు; త్వాం = నిన్ను; అభియంతి = ఆశ్రయిస్తున్నారు.

**తా॥** ఓముకుందపాదుకా! దిక్పాలకులు నీ మణి పంక్తులయందు తమ ప్రతి రూపాలను చూస్తున్నవారై ఇతర అధికారలను సృష్టించిందనే శంకతో ఉన్నట్లే నిన్ను ఆశ్రయిస్తున్నారు.

వ్యాఖ్య : పాదుకామణులయందు దిక్పాలకుల ప్రతిబింబ వర్ణన

ఉత్సవంలో దేవతాహ్వానం జరుగుతుంది. ఇంద్రాద్యష్టదిక్పతులేకాక ఊర్ధ్వలోక పాలకులైన దేవతలు కూడా వచ్చి భగవంతుణ్ని సేవిస్తుంటారు. అప్పుడు ఆ దేవతల ప్రతిబింబాలు మణులయందు కనబడగానే "అయ్యో! వేరే దిక్పతులు సృష్టింపబడినారే! ఇక మా అధికారం పోతుందేమో!" అనే భయం చేత వారు పాదుకాదేవికి ప్రణమిల్లుతున్నారు. హేతూత్ప్రేక్ష. ఔపచ్ఛందసికం.

*714. మణి మౌళిశతేన బింబితేన*
*ప్రణతానాం పరితః సురాసురాణామ్!*
*మురభిన్మణి పాదుకే! మహిమ్నా*
*యుగపత్తేషు సమర్పితేవ భాసి !!* 4

**అర్థం:-** హే మురభిత్ + మణిపాదుకే = ఓ మురారి మణి పాదుకా! ప్రణతానాం = ప్రణమిల్లుతున్న; సుర + అసురాణాం = దేవదానవుల యొక్క; పరితః = అన్ని దిక్కులనుంచి; బింబితేన = ప్రతిఫలించిన; మణి మౌళిశతేన = వందల మణి కిరీటాలచేత; తేషు = ఆదేవాసురకిరీటాలయందు; మహిమ్నా = ప్రభావంచేత; యుగపత్ = ఒకే సమయాన; సమర్పితా, ఇవ = సమర్పింబడినట్లు; భాసి = ప్రకాశిస్తుంటావు.

తా॥ ఓ మురారిమణిపాదుకా! నమస్కరించే దేవదానవుల మణిమయ కిరీటాల బాహుళ్యంచేత అంతట ప్రతిబింబించిన మహిమతో వారికిరీటాలయందు ఏకకాలంలో సమర్పించబడినట్లు నీవు ప్రకాశిస్తున్నావు.

వ్యాఖ్య : ప్రతిఫలించే ప్రభావంచేత అందరి మకుటాలమీద ఒకే సమయాన శఠారి సమర్పించబడినట్లు గోచరించే వర్ణన.

వివిధ కోణాల్లో అమర్చబడిన మణుల్లోనే ఒక్క వస్తువుకు అనేక ప్రతిబింబాలు ఏర్పడుతుంటాయి. ఇక ఎదురెదురుగా ఉన్న మణుల్లో మూర్తులు అనంతంగా ప్రతిఫలించే ప్రభావం నైసర్గికమే కదా! పాదుక మణిమయమే. సురాసురుల కిరీటాలూ మణిమయాలే. నమస్కరించే ఒక్కొక్కరి తలమీద పాదుకను - శఠారిని - అర్చకుడు సమర్పించడమూ, భగవదనుగ్రహం అతనికి లభించినట్లు సంతృప్తిచెందడమూ ఆచారనియమం. అన్ని దిక్కుల నుంచి నమస్కరించే మణిమయకిరీటాలున్న దేవదానవులలో ఒక్కొక్కరి శిరస్సున పాదుకను సమర్పించబోతుంటే, ప్రతిరూపాలు అనేకంగా కనబడడంవల్ల, అందరి శిరః కిరీటాలమీద శఠారిని ఒకే సమయాన సమర్పిస్తున్నట్లు గోచరిస్తున్నది.

వాస్తవంగా, దిక్కులు పిక్కటిల్ల గుమిగూడిన జనం గోవింద నామాన్ని గొంతెత్తి ఉచ్చరిస్తూ నమస్కరిస్తుంటే, అందరి తలల మీద ఏకకాలంలో శఠారిని సమర్పించే పద్ధతిని కవి రమణీయ శిల్పంతో చమత్కరించాడు. ఉత్ప్రేక్ష. ఔపచ్ఛందసికం.

*715. ఉపనీత ముపాయనం సురేంద్రైః*
*ప్రతిబింబచ్ఛలత స్త్వయిప్రవిష్టమ్ ।*
*స్వయమేవకిల ప్రసాద భూమ్నా*
*ప్రతి గృహ్ణాసి ముకుంద పాదుకే! త్వమ్॥* **5**

**అర్థం:-** హేముకుందపాదుకే = ఓ ముకుంద పాదుకా! సుర+ఇంద్రైః = అమరవరులచే; ఉపనీతం = తేబడిన; ప్రతిబింబచ్ఛలతః = ప్రతిబింబమనే వ్యాజంవల్ల; త్వయి = నీయందు; ప్రవిష్టం = ప్రవేశించిన; ఉపాయనం = కానుకను; త్వం = నీవు; ప్రసాదభూమ్నా = అధిక స్వచ్ఛతచేత / అనుగ్రహాధిక్యంచేత; స్వయం, ఏవ = స్వయంగానే; ప్రతిగృహ్ణాసి, కిల = ప్రతిగ్రహిస్తావట.

**తా॥** ఓ ముకుందపాదుకా! నీవు అమరేంద్రులచే తేబడిన, ప్రతిబింబ వ్యాజం వల్ల నీయందు ప్రవేశించిన కానుకను నైర్మల్యాతిశయంతో / అనుగ్రహాతిశయంతో స్వయంగా గ్రహిస్తున్నట్లుంటావు.

వ్యాఖ్య : మణిపాదుకల్లో కానుకలు ప్రతిఫలించే వర్ణన

దేవ ప్రముఖులు తెచ్చి భగవంతునికి సమర్పిస్తున్న కానుకలు నిర్మలమైన పాదుకామణుల్లో ప్రతిబింబిస్తుంటాయి. దేవతలు భగవదనుగ్రహం తమపైన పరిపూర్ణంగా ప్రసరిస్తున్నట్లు ఆనందిస్తుంటారని ఉత్ప్రేక్షితం. ఔపచ్ఛందసికం.

716. రంగేశ్వరస్య నవపల్లవ లోభనీయౌ
పాదౌ కథంను కఠినా స్వయముద్వహేయమ్ ।
ఇత్యాకలయ్య నియతం మణిపాదుకే! త్వం
పద్మాస్తరం వహసి తత్ప్రతిబింబ లక్షాత్ ॥ 6

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! నవ పల్లవ లోభనీయౌ = కొత్త చిగురాకుల్లాగా ఆకర్షణీయాలైన; రంగ+ఈశ్వరస్య = శ్రీరంగేశుని యొక్క; పాదౌ = చరణాలను; కఠినా = మొరటుగా ఉన్న; స్వయం = తాను; కథం, ను = ఏవిధంగా; ఉద్వహేయం = మోయగలను? ఇతి = అని; ఆకలయ్య = విచారించి; త్వం = నీవు; తత్+ప్రతిబింబలక్షాత్ = ఆచరణాలను ప్రతిబింబింపజేసే నెపంవల్ల; పద్మ+ఆస్తరం = పద్మపీఠాన్ని; నియతం = నిశ్చయంగా; వహసి = మోస్తుంటావు.

**తా॥** ఓ మణిపాదుకా! నీవు కొత్త చిగుళ్ళలాగా హృద్యమైన శ్రీరంగేశ్వరుని పాదాలను కఠినమైన తానేవిధంగా ధరించేను అని భావించి, పద్మసదృశమైన ఆపాదాలను ప్రతిఫలింపజేసే మిషతో నిశ్చయంగా తామర పూల పీఠాన్ని వహిస్తుంటావు.

వ్యాఖ్య : మణిపాదుకలో పద్మపీఠం ప్రతిబింబించే వర్ణన

భగవత్పాదాలు లేత చిగురుటాకుల్లాగా మృదువుగా ఉంటాయి. పాదుకలు విలువైన రాళ్ళతో నిండి కఠినంగా ఉంటాయి. కాబట్టి "కఠినంగా ఉన్న నేను మెత్తని శ్రీపాదాలను ఎలా మోయడం? ఆ పాదాలు కందిపోతాయి", అని చింతిస్తుంటుంది. భగవత్పాదాలు పద్మపీఠంమీద ఆవహించి ఉంటాయి. "పాదుకలు పద్మపీఠం ముందు సిద్ధంగా ఉన్నాయి."

భగవత్పాదకమలాలను నేరుగా మోయక, పాదపీఠంగా ఉండే మృదువైన పద్మాస్తరణాన్నీ తాను నిశ్చయంగా వహిస్తున్నట్లు, పాదుకామణుల్లో ప్రతిబింబం గోచరిస్తుంది. సాపహ్నవోత్ప్రేక్షాలంకారం వసంత తిలకావృత్తం.

717. పాదార్పణా త్ప్రథమతో హరిదశ్మరమ్యే
మధ్యే తవప్రతిఫలన్ మణిపాదరక్షే !
మన్యే నిదర్శయతి రంగపతిర్యుగాంతే
న్యగ్రోధ పత్రశయితం నిజమేవరూపమ్ ॥ 7

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! పాద + అర్పణాత్ = అడుగు పెట్టడానికంటె; ప్రథమతః = ముందు; హరిత్ + అశ్మరమ్యే = పచ్చరాళ్ళచే అందమైన; తవ = నీ యొక్క; మధ్యే = నడిమి భాగాన; ప్రతిఫలన్ = ప్రతిబింబించే; రంగపతిః = శ్రీరంగనాయకులు; యుగ+అంతే = ప్రళయ సమయంలో; న్యగ్రోధ పత్రశయితం = మఱ్ఱియాకు మీద పవళించిన; నిజం = తనదైన; రూపం, ఏవ = ఆకృతినే; నిదర్శయతి = చూపిస్తుంటాడు. మన్యే = అనుకొంటాను.

**తా॥** ఓ మణిపాదుకా! శ్రీరంగపతి అడుగు పెట్టడానికి ముందు మరకత మణులచే రమ్యమైన నీ మధ్య భాగాన ప్రతిబింబిస్తూ ప్రళయకాలంలో మఱ్ఱియాకుమీద పవళించిన తన ఆకారాన్నే తార్కాణంగా చూపిస్తుంటాడని భావిస్తాను.

వ్యాఖ్య : పచ్చరాళ్ళ పాదుక యందు శ్రీరంగపతి వటపత్రశాయిగా ప్రతిబింబించే వర్ణన

మరకత మణులతో ప్రత్యుప్తమైన పాదుక వటపత్రంలాగా గోచరిస్తుంది. పాదుకలను ధరించడానికి తలవంచి చూస్తూ పాదమెత్తే శ్రీరంగపతి, పాదుకామణులయందు ప్రతిఫలించడం స్పృహణీయం. "వటస్య పత్రస్య పుటే శయానం" అన్నట్లు ప్రళయకాలంలో మఱ్ఱియాకు మధ్యన పడుకొనే తన బాలముకుంద రూపాన్ని మనకు ప్రదర్శిస్తున్నాడేమో అనిపిస్తుంది.

పాదుకారోహణకై ప్రహ్వీభూతుడైన శ్రీరంగనాథుని ప్రతిబింబం వట పత్రశాయిగా గోచరిస్తుందని ఉత్ప్రేక్షితం. వసన్త తిలక.

*718. యాత్రావసాన మధిగచ్ఛతి రంగనాథే*
*విశ్రాణయస్యనుపదం మణిపాదుకే! త్వమ్ !*
*ప్రాయః ప్రయాణసమయే ప్రతిబింబితానాం*
*తీర్థావగాహ మపరం త్రిదశేశ్వరాణామ్ !!* *8*

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! త్వం = నీవు; రంగనాథే = శ్రీరంగేశుడు; యాత్రా+అవసానం = బ్రహ్మోత్సవసమాప్తిని; అధిగచ్ఛతి = పొందుతున్నప్పుడు; ప్రయాణ సమయే = బయల్దేరే సమయాన; ప్రతిబింబితానాం = ప్రతిఫలించిన; త్రిదశ + ఈశ్వరాణాం = దేవప్రముఖులకు; అనుపదం = పదే పదే, ఆయా కాలాల్లో; అపరం = రెండవ, తీర్థ + అవగాహం = నీటమునుగడాన్ని, స్నానాన్ని; ప్రాయః=బహుశః; విశ్రాణయసి = కల్పిస్తుంటావు.

**తా॥** ఓ మణిపాదుకా! శ్రీరంగనాథుడు యాత్రను పూర్తిచేయగా, ప్రయాణ సమయంలో ప్రతిబింబించిన దేవతలకు బహుశః వెంటవెంట రెండవ (సారి) స్నానాన్ని కల్పిస్తుంటావు.

వ్యాఖ్య : యాత్రలో పాల్గొన్న దేవతలకు అవభృథస్నానాన్ని కల్పించే ప్రతిబింబవర్ణన

దేవతలు భగవత్సేవకోసం వచ్చే ముందు స్నానం చేసి పరిశుద్ధులై వస్తారు. యాత్రలో పాల్గొంటారు. యాత్రపూర్తికాగానే శ్రీరంగేశుడు పాదుకలను విసర్జిస్తాడు. భగవంతుడు పాదుకలను ధరించినప్పుడు ప్రతిబింబించడం కుదురదు. ప్రయాణ సమయంలో అంటే దేవతలు వచ్చేముందు, పోయే ముందు, అనే అర్థం గ్రాహ్యం.

యాత్రావసానంలో దేవతలు భగవంతుని సన్నిధిలో అనుమతికోసం వేచియున్నప్పుడు వారి రూపాలు పాదుకామణుల్లో ప్రతిబింబిస్తాయి. యాత్రలో పాల్గొన్న వ్యక్తులు శ్రీరంగంలో - చంద్రపుష్కరిణిలో అవభృథస్నానం పవిత్రతకోసం చేస్తారు. మొదటిది స్నానరూపం. రెండవది పాదుకల్లో ప్రతిబింబంగా ప్రవేశించిన రూపమే అపరతీర్థావగాహం.

"విగాహే తీర్థబహుళాం శీతలాంగురుసంతతిమ్" అన్నట్లు శమ దమాదిగుణ పరిపూర్ణమై, సర్వేశ్వరుని కృప చేత ఏర్పడిన "శఠకోపముని, నాథముని మొదలైన ఆచార్యపరంపర అనే పుణ్యతీర్థమందు స్నానం చేయడం - ఆచార్యులచే ప్రదర్శితమైన ప్రపత్తి మార్గాన్ని అనుసరించడం - శ్రేయస్కరం.

మూర్తీభవించిన భగవదనుగ్రహమై, ప్రపన్న జనకూటస్థులైన నమ్మాళ్వార్ల మూర్త్యంతరంగా భాసించే పాదుక యందు ప్రతిబింబించడ మనేది 'అపర తీర్థావగాహం'

యాత్రావసానంలో శ్రీరంగ ప్రభువకు నమస్కరించి, అనుమతిని పొంది, దేవతలు స్వగృహోన్ముఖులవుతున్నారన్న భావం, కావ్యభాషలో, ఉత్ప్రేక్షితం. వసంతతిలకావృత్తం.

*719.* *ఉచ్చావచేషు తవరత్నగణేషు మాత*
*ర్వేధాః ప్రయాణసమయే ప్రతిబింబితాంగః ।*
*ఆశంకతే మధుభిదో మణిపాదుకే! త్వా*
*మాగామి కల్పకమలాసన పంక్తి గర్భామ్ ॥* *9*

**అర్థం:-** హే మాతః = ఓ తల్లీ! మధుభిదః, మణిపాదుకే = మధుసూదను మణిపాదుకా! ఉచ్చావచేషు = పలురకాలైన; తవ = నీ యొక్క; రత్న గణేషు = మణులసమూహాలయందు; ప్రయాణసమయే = పయనించే సమయంలో; ప్రతిబింబితాంగః = ప్రతిబింబించిన దేహంగల; వేధాః = చతుర్ముఖ బ్రహ్మ; త్వాం = నిన్ను; ఆగామి కల్ప కమలాసన పంక్తి గర్భాం = రాబోయే కల్పాల్లోని బ్రహ్మలశ్రేణి గర్భమందు కలదానిగా; ఆ శంకతే = సందేహ పడుతున్నాడు.

**తా॥** ఓ తల్లీ! మధుసూదను పాదుకా! బ్రహ్మదేవుడు అనేక ప్రకారాలైన నీమణులసముదాయాలయందు పయనమయ్యే వేళలో ప్రతిబింబించిన శరీరం కలవాడై నిన్ను రాబోయే కల్పాల్లో బ్రహ్మల వరుస గర్భమందు కలదానిగా భావిస్తున్నాడు.

వ్యాఖ్య : మణిపాదుకలో బ్రహదేవుని ప్రతిబింబబాహుళ్యవర్ణన

ఉత్సవం సమాప్తికాగానే దేవతల తర్వాత బ్రహ్మదేవుడు స్వస్థలానికి తిరిగి పోయేముందు భగవంతుని అనుమతిని పొందడానికి వచ్చాడు. "ఉచ్చావచం నైక భేదం" (అమరం) పాదుకాదేవికి పలురకాలమణులు అనేకంగా ఉన్నందువల్ల బ్రహ్మదేవునికి అనేక ప్రతిబింబాలు కనబడ్డాయి. కాబట్టి, రాబోయే కల్పకాల పరిమాణంలో బ్రహ్మపదవిని అధిష్ఠించే అధికారుల శ్రేణిగా తలచాడు బ్రహ్మదేవుడు.

నాలుగు యుగాల పరిణామ కాలాన్ని (4320000 సంవత్సరాలు) 'మహాయుగ' మంటారు. డెబ్బైయొకటి మహాయుగాలను 'మన్వంతర' మంటారు. పద్నాల్గు మన్వంతరాల కాలమైతే బ్రహ్మదేవునికి ఒక్క పగలు. ఇట్టి పగటికాలం - వెయ్యి మహాయుగాలు (4320000000) అయితే ఉదయకల్పం. ఇది ప్రపంచ రచనా కాలం. ఉదయ కల్పకాలమెంతో క్షయ కల్పకాలమంతే. క్షయ కల్పకాలం (రాత్రికాలం) బ్రహ్మనిద్రించే కాలం. ఉదయ,

క్షయకల్పాల పరిమాణ (8640000000 సం.) కాలమైతే బ్రహ్మకు ఒక్క దినం. ఇట్టి (360) మూడు వందల అరవైదినాలైతే బ్రహ్మకు ఒక్క సంవత్సరం. ఇలాగా నూరు సంవత్సరాలైతే బ్రహ్మ కల్పం - బ్రహ్మకు ఆయుర్భాగ్యం అవుతుంది.

"యథా పూర్వమకల్పయత్" శ్రుతి రీత్యా, దైవసంకల్పం వల్ల మరొక బ్రహ్మ అట్టి కల్పకాలపరిమితి వరకు అధికారంలో ఉంటాడు. అనంతకాల పరిమాణంలో కల్పాధికారులు కాబోయే బ్రహ్మల రూపాలను పాదుకాదేవి పరిపూర్ణానుగ్రహంతో బ్రహ్మ దేవునికి తెలియజేసింది. ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలక.

*720. ఆలోల రశ్మినియతాం మణిపాదుకే! త్వా*
*మారుహ్య సంచరతి రంగపతౌ సలీలమ్ !*
*అంతః పురేషు యుగపత్ సుదృశో భజంతే*
*డోలాధిరోహణరసం త్వయి బింబితాంగ్యః !!* **10**

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! రంగపతౌ = శ్రీరంగేశుడు; ఆలోలరశ్మి నియతాం = చలించే కిరణాలనే త్రాళ్ళచే వ్యాపించిన; త్వాం = నిన్ను; ఆరుహ్య = అధిరోహించి; సలీలం = ఉల్లాసంగా; అంతఃపురేషు = అంతఃపురాల్లో; సంచరతి = సంచరిస్తున్నప్పుడు; త్వయి = నీయందు; ప్రతిబింబిత + అంగ్యః = ప్రతిబింబించిన శరీరాలుగల; సుదృశః = స్త్రీలు (దేవేరులు); యుగపత్ = ఏకకాలంలో; డోలా + అధిరోహణ రసం = ఊయలనెక్కిన సుఖాన్ని; భజంతే = పొందుతుంటారు.

**తా॥** ఓ మణిపాదుకా! శ్రీరంగపతి ఇటు అటు కదిలే త్రాళ్ళలాంటికిరణాలచే వ్యాపించిన నిన్ను అధిరోహించి అంతః పురాల్లో వినోదంగా సంచరిస్తుంటే, నీయందు ప్రతిబింబించిన శరీరాలుగల స్త్రీలు ఒకే సమయంలో ఊయలనెక్కిన ఆనందాన్ని పొందుతుంటారు.

వ్యాఖ్య : మణిపాదుకలో అంతఃపుర స్త్రీల ప్రతిరూపాల వర్ణన

అందరి వీడ్కోలు తర్వాత శ్రీకరంగేశుడు అంతఃపురంలో ప్రవేశించాడు. అక్కడ దేవేరులు పరిచారికలతో పాటు స్వామిని ఎదుర్కోవడానికి వచ్చారు. అప్పుడు పాదుకల్లో అడుగులు పెట్టిన శ్రీరంగనాథుడు లీలగా ముందుకూ, వెనుకకూ ఊగుతున్నట్లు సంచరిస్తున్నాడు. పాదుకల పార్శ్వములందున్న మణులలో అంతఃపుర స్త్రీల రూపాలు ప్రతిబింబించాయి.

మణులకిరణాలే త్రాళ్ళు, పాదుక ఒక ఊయలగా భావింపబడింది. కిరణాలు ఊయల త్రాళ్ళలాగా అటు ఇటు సంచలిస్తూ ప్రసరిస్తున్నాయి. అంతఃపురకాంతలు ఏకకాలంలో ఊయలనెక్కి ఊగుతున్న శ్రీరంగేశునితో ప్రేమచేత ప్రేంఖోలికా క్రీడా సుఖాన్ని పొందుతుంటారు. శ్లేష ఆశ్లేషించిన ఉత్ప్రేక్ష ఇది. వసంతతిలకావృత్తం.

*721. కాలేషు రాఘవ పదావని ! భక్తినమ్రః*
*కార్యాణి దేవి ! భరతో వినివేదయం స్తే!*
*త్వద్రత్న బింబితతయాఽపి ముహుః స్వకీయాం*
*రాజాసన స్థితి మవేక్ష్య భృశం లలజ్జే !! 11*

**అర్థం:-** హే దేవి + రాఘవ పదావని = ఓ దేవీ! రాఘవపాదుకా! భరతః = భరతుడు; కాలేషు = అధికార సమయాల్లో; భక్తినమ్రః = భక్తిచేతనమ్రుడై; కార్యాణి = చేయవలసిన పనులను; తే = నీకు; వినివేదయన్ = విన్నవిస్తూ; ముహుః = మాటి మాటికి; త్వత్ + రత్నబింబితతయా, అపి = నీ మణులయందు ప్రతిబింబించడం చేతనే; స్వకీయాం = తనదైన; రాజ + ఆసన స్థితిం = సింహాసన మందలి ఉనికిని; అవేక్ష్య = చూచి; భృశం = మిక్కిలి; లలజ్జే = సిగ్గుపడెను.

**తా॥** ఓ దేవీ! రామ పాదుకా! అధికారదినాల్లో భక్తిచే నమ్రుడైన భరతుడు చేయదగిన పనులను నీకు విన్నవిస్తుండగా నీ మణులందు మాటి మాటికి ప్రతిబింబించడం చేతనే, తన రాజసింహాసనమందలి ఉనికిని చూచి చాలా సిగ్గుపడుతుండెను.

వ్యాఖ్య : పాదుకారాజ్యాధికార సమయాన భరతుడు ప్రతిబింబించిన వర్ణన

ఇంతవరకు అర్చావతారవిషయమైతే, ఇక విభవావతార విషయం వర్ణింపబడుతుంది.

పాదుకా పట్టాభిషేకానంతరం భరతుడు భక్తితో వినయంగా రాజ కార్యాలన్నీ పాదుకాదేవికి ప్రతిదినం విన్నవించి నిర్వహించే వాడు. అప్పుడు భరతుని రూపం పాదుకా మణి దర్పణంలో ప్రతిబింబిస్తుండేది. తన ప్రతిరూపం కనబడేసరికి భరతుడు, నేరుగా రాజసింహాసనమందు అధిష్ఠితుడు కాకున్నా, తెగ సిగ్గుపడేవాడు. వాస్తవంగా పాదుకకు పట్టం కట్టక, ఇక్ష్వాకు వంశ సింహాసనమందు తానే కూర్చుండి రాజ్యాధికారాన్ని నిర్వహిస్తే, భరతుడు ఇంక ఎంత క్రుంగి కృశించి పోయే వాడోకదా! ఒక్క సారి ప్రతిబింబంకనబడినంత మాత్రాన భరతుడు సిగ్గుతో తల ఎత్తుకోలేక, పదే పదే చింతిస్తూ నతమస్తకుడయ్యేవాడు.

మణి దర్పణంలో ప్రతిబింబించినంత మాత్రాన సిగ్గు పడవలసిన కారణం లేకున్నా సిగ్గు పడినట్లు వర్ణించడం వల్ల సంబంధాతిశయోక్త్యలంకారం.

అలంకారం చేత అతివినయం ప్రతీయమానమవడం వస్తుధ్వని. వసన్త తిలక.

*722. ప్రత్యాగతే విజయిని ప్రథమే రఘూణాం*
*విన్యస్యతి త్వయి పదం మణిపాదరక్షే!*
*రత్నౌఘబింబిత నిశాచర వానరాం త్వాం*
*పూర్వక్షణస్థమివ పుష్పక మన్వపశ్యన్ !! 12*

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! విజయిని = (రావణున్ని చంపి) విజయుడై; ప్రత్యాగతే = తిరిగి వచ్చిన; రఘూణాం = రఘువంశరాజుల్లో; ప్రథమే = శ్రేష్ఠుడైన శ్రీరాముడు; త్వయి = నీమీద; పదం = పాదాన్ని; విన్యస్యతి = ఉంచినప్పుడు; రత్న + ఓఘ బింబిత నిశాచర వానరాం = మణిసమూహ మందు ప్రతిబింబించిన రాక్షసులను, కోతులను కలిగియున్న; త్వాం = నిన్ను; పూర్వక్షణస్థం = అంతకుముందరి క్షణమందున్న; పుష్పకం, ఇవ = పుష్పక విమానాన్ని వలె; (ప్రజలు) అన్వపశ్యన్ = చూచారు.

**తా॥** ఓ మణిపాదుకా! విజయుడై తిరిగి వచ్చిన రఘువరుడైన శ్రీరాముడు నీయందు అడుగు(లు) పెడుతుండగా, మణుల సముదాయమందు ప్రతిబింబించిన రాక్షసులూ. కపులూ కలిగిన నిన్ను ఇంతకు క్షణం ముందున్న పుష్పక విమానంలాగా ప్రజలు చూచారు.

వ్యాఖ్య : పాదుక పుష్పక విమానం వలె గోచరించే వర్ణన

శ్రీరాముడు రావణాసురుణ్ని సంహరించి తిరగి రాగానే భరతుడు రామపాదుకలను సమర్పించాడు.

*"పాదుకే తే తు రామస్య గృహీత్వా భరతః స్వయమ్ !*
*చరణాభ్యాం నరేంద్రస్య యోజయామాస ధర్మవిత్!!*

"ధర్మజ్ఞుడైన భరతుడు రామపాదుకలను పట్టుకొని తానే రామరాజు పాదాలకు తొడిగాడు." (రా.యు. 130. స. 53)

అప్పుడు రాముడు, రాముని వెంట వచ్చిన విభీషణాది రాక్షసులూ, సుగ్రీవాది వానరులూ పాదుకా మణులయందు ప్రతిబింబించారు.

"దదృశు స్తం విమానస్థం నరాస్సోమ మివాంబరే" (రా.యు.130 స. 34) "ప్రజలు పుష్పక విమానంలోని రాముణ్ని ఆకాశంలోని చంద్రునివలె చూచారు." కాబట్టి ప్రజలకు ఆప్రతిబింబాలున్న పాదుక ఒక్క క్షణకాలం ముందు రాముడూ, రాక్షసులూ, వానరులూ కూర్చున్న పుష్పక విమానంలాగా కనబడింది.

ఉపమాలంకారం. వసంత తిలకా వృత్తం.

*723. వైయాకులీం శమయితుం జగతోవహంత్యా*
*రక్షాధురాం రఘుధురంధర పాదరక్షే!*
*ప్రాజ్యం యశః ప్రచురచామరబింబలక్ష్యాత్*
*ప్రాయస్త్వయాకబళితం ప్రతిభూపతీనామ్!!* **13**

**అర్థం:-** హే రఘుధురంధర పాదరక్షే = రఘువంశ భారాన్ని వహించే ఓ శ్రీరాముని పాదుకా! జగతః = లోకం యొక్క; వైయాకులీం = వ్యాకులత్వాన్ని; శమయితుం = అణచివేయడానికి; రక్షాధురాం = రక్షణభారాన్ని; వహంత్యా = ఎత్తుకున్న; త్వయా = నీ చేత; ప్రచుర చామర బింబ లక్ష్యాత్ = అనేక చామరాలు ప్రతిబింబించే మిషవల్ల; ప్రతి భూపతీనాం = వైరులైన రాజుల యొక్క; ప్రాజ్యం = బహుళమైన; యశః = కీర్తి; ప్రాయః = తరచుగా; కబళితం = గ్రస్తమయింది.

తా॥ రఘుకుల భారవాహినియైన ఓ రామపాదుకా! జగద్వ్యాకులభావాన్ని పోగొట్టి రక్షణ భారాన్ని వహించే నీ చేత బహుళ చామరాలు ప్రతిబింబించే వ్యాజం వల్ల శత్రురాజుల బహుళ కీర్తి గ్రస్తమయింది.

వ్యాఖ్య : పాదుకామణులందు చామరాల ప్రతిబింబవర్ణన

శ్రీరాముడు రఘువంశంలోని కలతను నివారించి వంశ రక్షణ భారాన్ని వహించాడు. కాబట్టి ఆవంశంలో శ్రేష్ఠుడయ్యాడు. ఆ రాముని పాదుకలుకూడా లోకంలోని వ్యాకులత్వాన్ని శమింపజేసి తద్రక్షణ భారాన్ని వహించాయి. కాబట్టి శ్రతురాజులు పాదాక్రాంతులై చామరాలు పట్టిపాదుకాదేవికి వీచుతుంటారు. పాదుకామణులందు ఆచామరాలు ప్రతిబింబించడంల వల్ల పగతుర కీర్తిని కబళించినట్లు ఉత్ప్రేక్షితం.

భారవాహికకు తెల్లని చామరాలతో వీచితే ఆ చల్లని గాలికి శ్రమతొలిగి సుఖావహమై ఉత్తేజకంగా ఉంటుంది. యశస్సు తెల్లగా ఉంటుందని కవి సమయం. రాముని త్యాగమహిమవల్లనూ, పాదుకా రాజ్య ప్రభావం వల్లనూ రాజుల పగ నొగిలి తెగిపోయింది. కాబట్టి ఆ రాజులు పాదుకాదేవికి సేవచేస్తూ తమ ధవళయశస్సును ధారపోసినట్లు, వింజామరలు పాదుకల్లో ప్రవేశించి ప్రతిఫలించాయి. కైత కైపు రసజ్ఞుల తలకెక్కడం ఆజానజం. వసన్తతిలక.

*724. ప్రతిదిశముపయాతే దేవి! యాత్రోత్సవార్థం*
*త్వయి విహరణకాలే బింబితే జీవలోకే*
*వహసి మణిగణైస్త్వం పాదుకే! రంగభర్తుః*
*కబళిత సకలార్థాం కాంచిదన్యా మవస్థామ్ !* **14**

**అర్థం:-** హే దేవి! పాదుకే = ఓ పాదుకాదేవీ! త్వం = నీవు; యాత్రా + ఉత్సవ + అర్థం = వీథులయందు జరుపబడు వేడుకలకోసం; ప్రతిదిశం = నానాదిక్కులనుంచి; ఉపయాతే = వచ్చిన; జీవలోకే = ప్రాణిసమూహం; విహరణకాలే = సంచార సమయాన; మణిగణైః = మణుల సముదాయాలచే; త్వయి = నీయందు; బింబితే = ప్రతి బింబించినప్పుడు; కబళిత సకల + అర్థాం = మ్రింగబడిన సమస్త పదార్థాలుగల; అన్యాం = వేరే (విలక్షణమైన); రంగభర్తుః = శ్రీరంగేశునియొక్క; కాంచిత్ = ఒకానొక; అవస్థాం = (ప్రపంచ ప్రళయ) దశను; వహసి = వహిస్తున్నావు.

తా॥ ఓ పాదుకాదేవీ! నీవు యాత్రోత్సవం కోసం సంచరించే సమయంలో అన్ని దిక్కులనుంచి వచ్చిన జీవుల సముదాయం మణిగణాలచేత నీయందు ప్రతిబింబించినపుడు కబళించిన సమస్త వస్తువులుగల ఒక విలక్షణమైన శ్రీరంగనాథుని దశను వహిస్తున్నావు.

వ్యాఖ్య : ఉత్సవానికి వచ్చిన జనగణం మణిపాదుకయందు ప్రతిబింబించే వర్ణన

యాత్రోత్సవంలో శ్రీరంగేశుడు పాదుకలను ధరించి విహరిస్తుంటాడు. ఉత్సవాన్ని సేవించి తరించడానికి జనులు ఎడ్లబండ్లమీద, గుఱ్ఱాలమీదనూ పలుదిక్కులనుంచి వస్తారు. కాబట్టి 'జీవలోక' పద ప్రయోగం గమనీయం.

ప్రళయకాలంలో భగవంతుడు సకల చరాచర ప్రపంచాన్ని తన పొట్టలో పెట్టుకొని కాపాడుతూ మఱ్ఱియాకుపై చిన్న బాలునిగా ప్రకాశిస్తుంటాడు. యాత్రోత్సవ దర్శనార్థం వచ్చిన సమస్త జీవలోకం పాదుకామణులయందు ప్రతిబింబించింది. అప్పుడు పాదుకాదేవి సకల పదార్థాలను కబళించిన వటపత్ర శాయి దశలాంటి దశను వహిస్తుందని వర్ణితం. నిదర్శనాలంకారం. మాలినీవృత్తం.

*725. భగవతి గరుడస్థే వాహనస్థాస్సురేంద్రా*
*స్త్వయివినిహిత పాదే భూమి మేవాశ్రయంతి*
*తదపి చరణరక్షే! రత్నజాలే త్వదీయే*
*ప్రతి ఫలిత నిజాంగాస్తుల్యవాహా భవంతి !! 15*

**అర్థం:-** హే చరణరక్షే = ఓ పాదుకాదేవీ! భగవతి = భగవంతుడు; గరుడస్థే = పక్షిరాజు మీద ఉన్నప్పుడు; సురేంద్రాః = దేవప్రముఖులు; వాహనస్థాః = (తమ) వాహనాలమీద ఉంటారు; త్వయి = నీ మీద; వినిహితపాదే = పాదం ఉంచినప్పుడు; భూమిం, ఏవ = నేలనే; ఆశ్రయంతి = ఆశ్రయిస్తారు. తత్ + అపి = అదికూడా (అట్లైనా); త్వదీయే = నీ సంబంధంగల; రత్నజాలే = మణులసమూహమందు; ప్రతిఫలిత నిజ + అంగాః = ప్రతిబింబించిన తమ శరీరాలుగలవారై; తుల్య వాహాః = సమానవాహనులై; భవంతి = ఉంటారు.

**తా॥** ఓ పాదావనీ! భగవంతుడు గరుడుని మీద అధిష్ఠితుడైతే సురవరులు తమ తమ వాహనాలమీద అధిష్ఠితులై ఉంటారు. భగవంతుడు నీయందు అధిరూఢుడైతే అమరవరులు తమ వాహనాలనుంచి దిగి భూమినే ఆశ్రయిస్తారు. అట్లైనా, నీమణులరాశియందు ప్రతిఫలించిన తమ ఆకృతులుకల వారై, ఒకే రూపమైన వాహనాలు కల వారవుతారు.

వ్యాఖ్య : దేవతలు పాదుకల్లో ప్రతి ఫలించినప్పుడు సమాన వాహనాలు కలవారై శేషవృత్తిని పాటిస్తుంటారు.

శ్రియఃపతి గరుడ వాహనుడు, బ్రహ్మ హంస వాహనుడు. శంకరుడు వృషభ వాహనుడు, కార్తికేయుడు మయూర వాహనుడు. ఇంద్రుని వాహనం ఐరావతం. శ్రీరంగనాథుడు గరుడవాహనారూఢుడైనప్పుడు బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు తమ తమ వాహనాలయందు అధిరూఢులవుతారు. శ్రీరంగేశుడు వాహనందిగి పాదుకలను ధరిస్తుంటే సురవరులు తమ వాహనాలను వదిలి భూమి మీదనే నిల్చియుంటారు. భూమి మీద ఉన్నప్పటికీ దేవతలు పాదుకామణిగణంలో ప్రతిబింబిస్తుంటే సమాన వాహనస్థులవుతారు. ఇది ఉత్ప్రేక్ష.

తుల్యవాహాః - 'సమాన వాహనాలు కలవారనడం భగవంతునిలాగా దేవతలూ పాదుకలమీద ఉంటారనే అర్థంకాదు. పాదుకామణులు వాహనస్థులైన దేవతల ప్రతిరూపాలనెట్లు వహించాయో, నేలమీద నిల్చినప్పుడూ నేల అందరినీ సమానంగా వహిస్తుంటే, మణులూ వారి ప్రతిరూపాలనట్లే వహించాయి.

వహించేది వాహనం. మణులు శేషవృత్తిగల ప్రతిరూపాలను వాహనాల నధిరోహించినా, అవరోహించినా, సమంగా వహించాయి. కాబట్టి సురేంద్రులు 'తుల్యవాహులు'

పాదుకా మణిదర్పణం మీద భగవద్రూపంతో పాటు సురేంద్రుల రూపాలూ ప్రవేశించాయి, ప్రతిఫలించాయి. కాబట్టి 'తుల్యవాహులు ప్రతిఫలిత నిజాంగులు. మాలినీ వృత్తం.

726. స్వచ్ఛాకారాం సురయువతయః స్వప్రతిచ్ఛంద లక్ష్యాత్
గాహంతే త్వాం ప్రణతిసమయే పాదుకే! సాభిమానాః
స్త్రీ రత్నానాం పరిభవ విధౌ సృష్టి మాత్రేణ దక్షాం
నీ చైః కర్తుం నరసఖ మునే రుర్వశీమూరుజాతామ్!! 16

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! సుర యువతయః = దేవతా స్త్రీలు; సాభిమానాః = గర్వంతో కూడిన వారైయుండగా; స్త్రీ రత్నానాం = ఉత్తమాంగనలను; సృష్టిమాత్రేణ = జన్మించినంతమాత్రాన; పరిభవ విధౌ = అవమానించడమందు; దక్షాం = సమర్థురాలైన; నరసఖమునేః = నారాయణముని యొక్క; ఊరుజాతాం = తొడనుంచి జనించిన; ఉర్వశీం = ఊర్వశి అనే దేవస్త్రీని; నీచైః కర్తుం = తిరస్కరించడానికి; స్వచ్ఛ + ఆకారాం = నిర్మలమైన రూపంగల; త్వాం = నిన్ను; ప్రణతి సమయే = నమస్కరించేవేళలో; స్వప్రతిచ్ఛంద లక్ష్యాత్ = తమ ప్రతిబింబవ్యాజం వల్ల; గాహంతే = చేరుతారు.

**తా॥** ఓ పాదుకాదేవీ! దేవాంగనలు గర్వంతో ఉండగా ఉత్తమాంగలను పుట్టిన తోడనే ధిక్కరించడంలో సమర్థురాలైన, నరసఖుడైన నారాయణముని తొడనుంచి పుట్టిన ఊర్వశీ సంజ్ఞగల దేవాంగనను తిరస్కరించడానికి నిర్మలాకృతిగల నిన్ను ప్రణమిల్లే సమయంలో తమ ప్రతిబింబాలనెపంతో చేరుకుంటారు. నీలోనే ప్రవేశిస్తారు.

వ్యాఖ్య : పాదుకామణులందు దేవవనితలు ప్రతిబింబించే వర్ణన

దేవ ప్రముఖులు ప్రతిబింబించడం వర్ణింపబడిన తర్వాత దేవ వనితల ప్రతిబింబనం ఇందు సుశ్లోకితం.

దేవాంగనలు అభిమానం కలవారు. న్యక్కారాన్ని సహించలేరు.

"ఊరూద్భవా నరసఖస్యమునే స్సురస్త్రీ." (విక్రమోర్వశీయం) నరనారాయణావతారంలో నారాయణముని యెదుట రంభాద్యప్సరలు హావభావలీలాభినయాలతో ఆయన తపస్సును భంగపరచి ప్రలోభింప చేయడానికి ప్రయత్నించారు. అప్పుడు నారాయణముని తన తొడనుంచి అలౌకిక సౌందర్యవతియైన 'ఊర్వశి' యనే దివ్యాంగనను సృష్టించాడు. "విలక్షణ సౌందర్య సందానితయైన సురయువతినే తన తొడనుంచి ప్రభవింపజేసిన మహామునిని మనమా మోహింపజేసేది"! అని అప్సరోగణం సిగ్గుపడి తలవంచుకుంది. ఇది పురాణగాథ.

ఊర్వశి పుట్టినవెంటనే అభిరూప్యాధీనమైన గర్వం కలదై దివ్యనారీమణులను ధిక్కరించే దక్షురాలుకదా! కాబట్టి గర్విష్ఠయైన ఊర్వశిని తలవంచుకొనేలాగా చేయడానికి నిర్జరాంగనలు స్వచ్ఛమైన ఆకారం కల్గిన పాదుకాదేవిని ఆశ్రయించారు. భగవంతుని ఊరువు రమణిని మాత్రం సృష్టిస్తుంది. కాని, పాదుకవలె స్వచ్ఛాకారత్వం లేనందువల్ల స్వయంగా స్వచ్ఛతను కలిగించదు.

స్ఫటికలాగా స్ఫుటమైన ఆకారమున్న పాదుకాదేవికి స్వచ్ఛతను ప్రసాదించే సామర్థ్యముంది. పాదుకామణులందు ప్రతిబింబించడంవల్ల నిర్జరాంగనలకు నిద్దమైన అద్దంలాగా స్వచ్ఛత కలుగుతుంది. స్వచ్ఛమైన వస్తువు రూపాన్ని ఆకర్షిస్తుందికదా! స్వచ్ఛాకారలై సురయువతులు సుందరాకృతిగల ఉర్వశిని తమలో ప్రతిఫలింపచేసుకొని వశపరచుకుంటే, ఉర్వశినే తాము పరిభవించడమవుతుందని పాదుకల్లో ప్రతిబింబాలమిషతో ప్రవేశిస్తారట. ఇది కవి హృదయం. ఉత్ప్రేక్ష. మందాక్రాంతావృత్తం.

727. స్వేచ్ఛాకేళి ప్రియసహచరీం స్వచ్ఛరత్నాభిరామాం
స్థానే స్థానే నిహితచరణో నిర్విశన్ రంగనాథః ।
సంచారాంతే సహకమలయాశేషశయ్యాధిరూఢ
స్త్యక్త్వాఽపి త్వాం త్యజతి నపునః స్వప్రతిచ్ఛంద లక్షాత్ ॥ 17

**అర్థం:-** (హే పాదుకే = ఓ పాదుకాదేవీ! త్వయి = నీయందు) నిహితచరణః = మోపిన చరణాలుగల; స్వేచ్ఛా కేళిప్రియసహచరీం = తన ఇష్టమున్న క్రీడలకు ప్రియమైన తోడుగా ఉన్న; స్వచ్ఛ రత్న+అభిరామాం = పరిశుద్ధమైన మణులచేత అందంగా ఉన్న; త్వాం = నిన్ను; స్థానే, స్థానే = ఆయా స్థలాల్లో; నిర్విశన్ = అనుభవిస్తున్న; రంగనాథః = శ్రీరంగప్రభువు; సంచార+అంతే = సంచారం ముగిసినప్పుడు; (త్వాం=నిన్ను) త్యక్త్వా = వదిలి; కమలయా, సహ = లక్ష్మీదేవితో కూడా; శేషశయ్యా+అధిరూఢః, అపి = శేషతల్పాన ఎక్కియున్నా; స్వప్రతిచ్ఛందలక్షాత్ = తన ప్రతిబింబ వ్యాజంవల్ల; పునః = మళ్ళీ, న, త్యజతి = విడువడు.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీయందు పాదాలనుంచిన శ్రీరంగనాథుడు స్వచ్ఛంద లీలకు ప్రియసఖివైన, స్వచ్ఛ మణులచేత అభిరామవైన నిన్ను ఆయా ప్రదేశాల్లో అనుభవిస్తూ, సంచారం ముగిసిన తర్వాత నిన్ను విడిచి లక్ష్మీదేవితో కూడ శేషశయ్య యందధిరూఢుడైననూ, తన ప్రతిబింబ వ్యాజంవల్ల నిన్ను విడువనే విడువడు.

వ్యాఖ్య : పాదుకామణులందు శ్రీరంగనాథుడు ప్రతిబింబించే వర్ణన

శ్రీ రంగపతి సంచారసమయాన తనకిష్టమైన క్రీడలకు తోడుగా ఉండి పులుకడిగిన ముత్యంలాగా స్వచ్ఛమైన పొలుపూ, పొడిమి కలిగిన పాదుకా దేవిని ప్రాకారాల్లో, వీథుల్లో, కావేరీ తీరంలోనూ, ఇసుక తిన్నెల్లోనూ, పలురకాలుగా విహరిస్తూ అనుభవిస్తాడు. పాదుకాదేవిలాగా ప్రియసఖియూ, రత్నాభిరామయూ అయిన కలుముల జవరాలితో కలిసి యుండడానికి సంచారగతిని చాలించి పాదుక(ల)ను త్యజిస్తాడు. గాలిమేతగాని సెజ్జమీద కమలాదేవితో భోగ్యంగా కలిసి యుంటాడు శ్రీరంగేశుడు. అయినా, పాదుకాదేవియందు ప్రతిబింబాత్మకంగా ఉండడంవల్ల - అఘటిత ఘటనాశక్తిగల శ్రీరంగనాథుడు పాదుకాదేవిని విడిచినా - విడువనివాడుగానే ఉంటాడు. పతిని చేజిక్కించుకొనే భాగ్య గరిమ కలది పాదుకాదేవి. ఉత్ప్రేక్షాలంకారం. మందాక్రాంతావృత్తం.

728. త్వామే వైకా మధిగతవతః కేళి సంచారకాలే
పార్శ్వేస్థిత్వా వినిహిత దృశోః పాదుకే உనన్యలక్ష్యమ్ ।
త్వద్రత్నేషు ప్రతిఫలితయోర్నిత్య లక్ష్య ప్రసాదా
పద్మాభూమ్యో ర్దిశతి భవతీ పాదసేవాం మురారేః ॥ 18

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! భవతీ = నీవు; కేళి సంచారకాలే = లీలా విహారవేళలో; ఏకాం = ఒక్క; త్వాం, ఏవ = నిన్నే; అధిగతవతః = పొందియున్న; మురారేః = శ్రీరంగనాథుని యొక్క; పార్శ్వే = ప్రక్కన; స్థిత్వా = ఉండి, అనన్య లక్ష్యం = వేరేదేన్నీ చూడకుండా; వినిహిత దృశోః = (నీమీదనే) ఉంచిన చూపుగల; త్వత్+రత్నేషు = నీ మణులయందు; ప్రతిఫలితయోః = ప్రతిబింబించిన, పద్మాభూమ్యోః = లక్ష్మీభూదేవులకు; నిత్యలక్ష్య ప్రసాదా = నిత్యం చూడదగిన స్వచ్ఛత/అనుగ్రహం కలదానవై; పాదసేవాం = భగవత్పాదసేవను; దిశతి = కృపచేస్తావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీవు లీలా విహార సమయంలో ఒక్క నిన్నేపొందియుండే శ్రీరంగనాథుని పార్శ్వమందుండి, ఇతర విషయాలమీద ఆసక్తి లేకుండా నీయందు చూపులు ఉంచిన, నీ మణులయందు ప్రతిబింబించిన శ్రీదేవికీ, భూదేవికీ నిత్యం చూడదగిన నైర్మల్యమూ / అనుగ్రహమూ కలదానవై భగవత్పాద సేవను కలిగిస్తావు.

వ్యాఖ్య : మణిపాదుకలో శ్రీభూదేవులు ప్రతిబింబించే చమత్కృతి

శ్రీదేవితో కూడియున్నా శ్రీరంగనాథుడు పాదుకాదేవిని విడిచి యుండడని గత శ్లోకంలో వర్ణితం. వినోద విహార వేళలో ఒక్క పాదుకాదేవితోనే ఉంటాడు. అప్పుడు పతిపాదసేవచేసే అవకాశంలేని శ్రీ భూదేవులిర్వురు స్వామికి ఇరుప్రక్కలచేరి విషయాంతరాలమీద మనస్సును పోనీయక పాదుకాదేవినే తమి దీర చూస్తుంటారు.

పాదుకాదేవి నిత్యం దర్శనీయమైన స్వచ్ఛత, స్నిగ్ధత కలది. కాబట్టి తన మణులయందు ప్రతిఫలించిన దేవేరులకు ప్రేమతో శ్రీరంగనాథుని చరణకమలసేవాభాగ్యాన్ని అనుగ్రహిస్తుంది.

భగవంతుడు పాదుకాదేవియందు మాత్రమే అపేక్షకలవాడైనా, పాదుకాదేవి మాత్రం దేవేరులను విడువజాలని ప్రసాదగుణం కలది. ప్రతిబింబమూలం సర్వసమ్మేళనం. ఉత్ప్రేక్ష. మందాక్రాంత.

729. ఏకామేకః కిల నిరవిశత్ పాదుకే! ద్వారకాయాం
క్రీడాయోగీ కృత బహుతనుః షోడశస్త్రీ సహస్రే ।
శుద్ధేదేవి! త్వదుపనిహితే బింబితో రత్నజాలే
భుంక్తే నిత్యం సఖలు భవతీం భూమికానాం సహస్రైః ॥ 19

**అర్థం:-** హే దేవి! పాదుకే = ఓ పాదుకాదేవీ! క్రీడాయోగీ = లీలయందు సంనాహియైన శ్రీకృష్ణుడు; ద్వారకాయాం = ద్వారకానగరమందు; కృత బహుతనుః = చేయబడిన అనేక శరీరాలు కలవాడై; షోడశస్త్రీ సహస్రే = పదహారువేల స్త్రీలయందు; ఏకాం = ఒక్కస్త్రీని; ఏకః = ఒక్క (శరీరు)డుగా, నిరవిశత్, కిల = అనుభవించాడట.

సః = అతడే; శుద్ధే = స్వచ్ఛమైన; త్వత్ +ఉపనిహితే = నీయందు పొదుగబడిన; రత్నజాలే = మణిగణమందు; బింబితః = ప్రతిఫలిస్తూ, భూమికానాం సహస్రైః = వేల (వేషాల) శరీరాలతో; భవతీం = నిన్ను; నిత్యం = ఎల్లప్పుడు; భుంక్తేఖలు = అనుభవిస్తాడుకదా!

**తా॥** ఓ పాదుకాదేవీ! క్రీడా సంనాహంకల శ్రీ కృష్ణుడు కుశస్థలీపురంలో అనేక స్వరూపాలను ధరించినవాడై పదహారువేల స్త్రీలలో ఒక్క స్త్రీని ఒక్క ఆకారంతో అనుభవించాడట. అతడే నీయందు ప్రత్యుప్తమైన శుద్ధమణుల సమూహమందు ప్రతిబింబిస్తూ వేల శరీరాలతో, ఎల్లకాలం నిన్ను అనుభవిస్తుంటాడు కదా!

వ్యాఖ్య : శ్రీరంగపతి బహు రూపాలతో పాదుకాదేవిని అనుభవిస్తాడని ఉత్ప్రేక్షితం

భగవంతుడు శ్రీకృష్ణావతారంలో క్రీడా యోగిగా వ్యవహరించాడు.

"అథో ముహూర్త ఏకస్మిన్నానాగారేషు తా స్త్రియః ।

యథో పయేమే భగవాన్ తావద్రూపధరో ఉవ్యయః. (భాగ.10 స్కం. ఉ. 59 అ.)

నరకాసురుడు బలాత్కారంగా బంధించిన పదహారువేలరాజ కన్యలను చెరనుంచి విడిపించిన శ్రీ కృష్ణుణ్ని ఆస్త్రీలు చూచి, ఎవరికివారే శ్రీకృష్ణుడు తమకు పతికావాలని ప్రార్థిస్తూ హృదయాలను అర్పించారు. ఆ రాజకన్యలందరిని ద్వారకానగరానికి తెచ్చి ఒక్క శుభముహూర్తాన వేర్వేరు భవనాల్లో శ్రీకృష్ణుడు వేర్వేరు రూపాలను ధరించి శాస్త్ర విధిగా వివాహమాడాడు. ఒక్కొక్క స్త్రీకి ఒక్కొక శ్రీకృష్ణుడుగా - గృహమేధిగా ప్రవర్తించి ఆత్మానందాన్ని అనుభవించినవాడే రంగధాముడు.

పదహారువేల స్త్రీలతో పదహారువేల శరీరాలను ధరించి అంగరంగభోగ రసాలననుభవించినప్పుడు పాదుకా పరిశుద్ధమణుల్లో అనేక వేల మూర్తులుగా ప్రతిఫలించాడు. అట్టి పాదుకాదేవిని ప్రణయాధిక్యంతో నిత్యం భోగ్యంగా అనుభవిస్తూ రస సమ్రాట్టుగా రాజిల్లుతున్నాడు రంగధాముడు. అందరికంటె పాదుకాదేవియందు భోగ్యతాధిక్యం వ్యక్తమవడం అలంకార ధ్వని. మందాక్రాంతా వృత్తం.

*730. హరిపదనఖేషు భవతీ ప్రతిఫలతి తవ తదపి రత్నేషు ।*
*ఉచితా మిథః పదావని! బింబప్రతిబింబతా యువయోః ॥ 20*

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకా! భవతీ = నీవు; హరి పదనఖేషు = భగంతుని కాళ్ళగోళ్ళయందు; ప్రతి ఫలతి = ప్రతిఫలిస్తావు. తత్ + అపి = ఆ హరిపాదం కూడా, తవ = నీయొక్క; రత్నేషు = మణులయందు; ప్రతిఫలతి = ప్రతిబింబిస్తుంది. యువయోః = మీ ఇర్వురకు; మిథః = అన్యోన్యంగా; బింబప్రతిబింబతా = తనయందు ప్రతిబింబించే వస్తువునందు తాను ప్రతిబింబించడం; ఉచితా = తగినదే.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీవు భగవత్పాదనఖాలయందు ప్రతిబింబిస్తావు. ఆ భగవంతుని పాదం కూడా నీ మణులయందు ప్రతిబింబిస్తుంది. ఇలాగా మీ యిర్వురకు అన్యోన్యంగా బింబ ప్రతిబింబ భావం సముచితమే.

వ్యాఖ్య : భగవత్పాద పాదుకలయందు పరస్పరంగా బింబ ప్రతిబింబత్వం వర్ణితం

ప్రతిబింబించడానికి అనురూపమైన వస్తువును 'బింబం' అంటారు. బింబం స్వచ్ఛమైన, నునుపైన వస్తువునందు ప్రతిబింబిస్తుంది. పాదాలకు అనురూపంగా పాదుకలు నిర్మితమవడంవల్ల పాదం 'బింబ' మైతే పాదుక ప్రతిబింబం. పాదమన్నప్పుడు వ్రేళ్ళూ, గోళ్ళూ ఉంటాయనడం అనుచితంకాదు. పాదాలకూ, పాదుకలకూ అన్యోన్య సాన్నిహిత్యమూ, సాదృశ్యమూ, స్వచ్ఛావయవత్వమూ ఉన్నందువల్ల బింబప్రతిబింబ భావం యుక్తమే. సమాలంకారం. ఆర్యావృత్తం.

బింబ ప్రతిబింబ పద్ధతి సమాప్తం.

# 22. కాఞ్చన పద్ధతి

731. కల్యాణ ప్రకృతిం వందే భజంతీం కాంచనశ్రియమ్ ।
పదార్హాం పాదుకాం శౌరేః పద ఏవ నివేశితామ్ ॥ 1

**అర్థం:-** కల్యాణ ప్రకృతిం = సువర్ణమయమైన / మంగళస్వరూప స్వభావాలు కలిగిన; కాంచన శ్రియం = హిరణ్య ప్రభను కలిగియున్న / కాంచన = ఒకానొక విలక్షణమైన; శ్రియం = లక్ష్మియైన; భజంతీం = (భగవంతుణ్ని) సేవిస్తున్న; శౌరేః = సర్వేశ్వరుని యొక్క; పద+ అర్హాం = చరణాలకు / స్థానానికి, తగినట్టి; పదే, ఏవ = చరణమందే / సాకేతసింహాసన స్థానమందు; నివేశితాం = సమర్పించబడిన / ఉంచబడిన; పాదుకాం = పాదుకాదేవిని; వందే = స్తుతించి నమస్కరిస్తాను.

**1. తా॥** స్వర్ణాకారమునూ, కనకప్రభనూ కలిగి, చరణాలకు యోగ్యమైనది కాబట్టి చరణాలయందే ఉంచబడిన శౌరి పాదుకను స్తుతిస్తాను.

**2. తా॥** మంగళ స్వరూపయైన విలక్షణ లక్ష్మియైన భగవంతుణ్ని సేవిస్తున్న, స్థాన యోగ్యయైనది కాబట్టి శౌరిస్థానమందే నివేశితయైన పాదుకాదేవికి ప్రణతులర్పిస్తాను.

**వ్యాఖ్య :- పాదుకాదేవి సార్వభౌమమహిషిగా వర్ణితం**

పాదుకామణులయందు ప్రతిఫలించిన రూపాలను వర్ణించిన తర్వాత ఈ పద్ధతిలో, ఆమణులు పొసగబడిన బంగారు ఆకృతికల పాదుకాదేవిని కవి వర్ణిస్తున్నాడు.

భగవత్పాదాలకు అనురూపంగా బంగారంతో పాదుకలు నిర్మితాలు కాబట్టి కల్యాణకారకమైన ఆకారం పాదుకకు నైసర్గికం.

"కల్యాణ మక్షయే స్వర్ణే కల్యాణం మంగళే ఽపిచ ॥" (విశ్వని.)

మంగళ స్వరూపయైన అపర లక్ష్మిదేవియే కాబట్టి భగవంతుణ్ని ఆశ్రయించి కనక ప్రభతో శోభించేది పాదుకాదేవి. లక్ష్మీదేవితో పాదుకకు సామ్యమున్నా, భేదమూ ఉంది. అందుకే, "కాంచన శ్రియం" అని పదద్వయంగానూ ప్రయుక్తం. ఉత్తరార్థం ఈ వైలక్షణ్యాన్ని విశదీకరిస్తుంది.

"పదం వ్యవసిత త్రాణ స్థాన లక్ష్మాంఘ్రివస్తుషు" (అమరం)

పాదస్థానయోగ్యమైనది పాదుక. కాబట్టి పాదంకంటె వేరే అవయవమందు పాదుక ఉంచబడదు.

'పద'మంటె స్థానం కదా! శ్రీరామ చంద్రస్వామికి ప్రతినిధిగా - పట్టంపు రాణిగా - రాజసింహాసనమందు అధిష్ఠింపబడింది.

లక్ష్మి పాదాలకడనేకాదు భగవంతుని వక్షః స్థలమందు, వామాంక మందు కూడా ఉంటుంది. భగవానుడు తన సింహాసనమందు సార్వభౌమ మహిషిగా భాసించే అవకాశం పాదుకాదేవికి కలిగించినట్లు లక్ష్మీదేవికి ఎక్కడనూ కలిగించకపోవడమే పాదుకా వైలక్షణ్యం. అందం, ఐశ్వర్యం, అధికారమూ కలిగి కల్యాణ ప్రకృతి - మోక్షస్వరూపయైన పాదుకాదేవికి చమత్కృతిమన్నుతి ఇది. శ్లేషమహిమచే సార్వభౌమ మహిషీ వృత్తాంతం ధ్వనించడంవల్ల సమాసోక్త్యలంకారం. అనుష్టుప్ఛందం.

732. మధుజిత్తనుకాంతి తస్కరాణాం
జలదానామభయం విధాతుకామా ।
చపలేవ తదంఘ్రి మాశ్రయంతీ
భవతీ కాంచన పాదుకే! విభాతి ॥ 2

**అర్థం:-** హే కాంచనపాదుకే = ఓ బంగారు పాదుకా! భవతీ = నీవు; మధుజిత్ + తనుకాంతి తస్కరాణాం = మధుసూదనుదేహకాంతిని దొంగిలించిన; జలదానాం = మేఘాలకు; అభయం = భయరాహిత్యాన్ని; విధాతుకామా = కలిగించే కోరిక కలదానవై; తత్ + అంఘ్రిం = ఆ భగవంతుని పాదాన్ని; ఆశ్రయంతీ = ఆశ్రయిస్తూ; చపలా, ఇవ = మెరుపు తీగలాగా; విభాతి = ప్రకాశిస్తున్నావు.

**తా॥** ఓ కాంచన పాదుకా! మధువనే రాక్షసుణ్ని జయించిన భగవంతుని శరీర కాంతిని దొంగిలించిన మేఘాలకు భయరాహిత్యాన్ని కలిగించే కోరిక కలదానవై శ్రీరంగనాథుని పాదాలను ఆశ్రయిస్తున్న సౌదామని వలె నీవు ప్రకాశిస్తున్నావు.

వ్యాఖ్య :- కాంచనపాదుక విద్యుల్లేఖగా భాసించే వర్ణన

వర్షించే మేఘాలు నీలవర్ణంతో రమణీయంగా కనబడుతాయి. మధుసూదనుని శరీరమందలి నీలిమను తస్కరించకుంటే మేఘాలకు ఆ నీలరూపం ఉండేది కాదు. శ్రీరంగనాథుడు మధుజిత్తుకదా! మరి నీరదాల ఎత్తు జిత్తులను చూచి ఊరకుంటాడా? తన తను కాంతిని తస్కరించిన వారికి తగిన దండన విధించక మానడు.

కాంచన పాదుక జలదాలకు కలిగే దండన వలని భయాన్ని తొలగింప తలచింది. చపలగా భాసిస్తున్నది. మేఘుని పత్ని సౌదామని - మెరుపు. "తటిత్ సౌదామనీ విద్యుత్ చంచలా చపలా ఽపిచ" (అమరం).

స్త్రీ చాపల్యంచేత విద్యుత్తు, తన భర్తకు కలుగబోయే మరణ దండనను పరిహరింపజేసే కోరికతో, శ్రీరంగనాథుని పాదాలను పట్టుకొని 'అపరాధాన్ని క్షమింపు'మని ఆర్తితో ప్రార్థిస్తున్నట్లు, మేలి బంగారు పాదుక మెరుస్తున్నది. ఇది ఉత్ప్రేక్షాలంకారం.

పతి దోష పరిహారార్థం భగవత్పాద పతన పూర్వకంగా సతివేడుకొంటున్న అర్థం వెల్లడి అవుతున్నందువల్ల సమాసోక్త్యలంకారం. ఔపచ్ఛంద సికం

733. నికషీకృత రమ్య కృష్ణరత్నా
భవతీ కాంచన సంపదం వ్యనక్తి !
పరిపుష్యతి పాదుకే! యదీక్షా
సహసా నః సమలోష్టకాంచనత్వమ్ !! 3

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకా! నికషీకృత రమ్య కృష్ణరత్నా = గీటురాయిగా చేయబడిన అందమైన నీలమణిలాంటి కృష్ణుడు కలిగిన, భవతీ = నీవు; కాంచన సంపదం = సువర్ణకాంతిని; కాంచన = ఒక విలక్షణమైన; సంపదం = శోభను; వ్యనక్తి = ప్రకాశింపజేస్తావు; యత్ + ఈక్షా = ఏనీ సంపద్దర్శనం; సహసా = వెంటనే; నః = మాకు; సమలోష్టకాంచనత్వం = సమానమైన మన్ను పొన్నులుగల ధర్మాన్ని; పరిపుష్యతి= పెంచి పోషిస్తుంది.

తా॥ ఓ పాదుకాదేవీ! గీటురాయిగా చేయబడిన అందమైన నీలమణివంటి కృష్ణుడు కలిగిన నీవు స్వర్ణప్రభను / విలక్షణమైన శోభను ప్రకాశింపజేస్తావు. ఆ నీ సంపద్దర్శనం మాకు శీఘ్రంగా మట్టి బెడ్డనూ బంగారు కడ్డీనీ సమానంగా చూచే భావాన్నీ వృద్ధి పరుస్తుంది.

వ్యాఖ్య :- పాదుకాస్వర్ణకాంతిని చూచే వారికి వైరాగ్యం పెరుగుతుంది.

నల్లని గీటురాయి మీద బంగారాన్ని రాపిడిచేసి పరీక్షిస్తే, చొక్కం బంగారం వన్నె చక్కగా తెలుస్తుంది. నీల మణిలాంటి కృష్ణుడు - శ్రీరంగనాథుడు - గీటురాయి. శ్రీరంగనాథుడు బంగారు పాదుకతో చేరియున్నప్పుడు పరిశీలించే వారికి కాంచన పాదుక(ల) యొక్క వన్నె శ్రేష్ఠమైనదని ప్రత్యక్షంగా గోచరిస్తుంది. కాంచన పాదుకా సంపదను వీక్షించే భక్తులకు ఇతరమైన ప్రాకృతిక స్వర్ణభూషణాదులు మట్టిబెడ్డలతో సమానంగా గోచరిస్తాయి. వైరాగ్యం పెరుగుతుంది. ప్రాకృతిక పదార్థాల మీద విరక్తి ఏర్పడుతుంది.

"పరమాత్మని యోరక్తః విరక్తో ఽపరమాత్మని"

భగవంతునియందు రక్తి కలవాడు లౌకిక విషయాలయందు విరక్తుడవుతాడు. శ్లేషానుప్రాణిత కావ్యలింగాలంకారం. ఔపచ్ఛందసికం.

734. సురభి ర్నిగమైః సమగ్రకామా
కనకోత్కర్షవతీ పదావని! త్వమ్ !
దిశసి ప్రతిపన్న మాధవశ్రీ
రనిశోన్నిద్ర మశోకవైభవం నః !! 4

(1) అర్థం:- హే పదావని = ఓ పాదుకా! నిగమైః = ప్రాబల్యులచేత; సురభిః = పరిమళంగల; సమగ్రకామా = సకలవాంఛలు, కల్యాణగుణాలుకలిగిన; కనక + ఉత్కర్షవతీ = బంగారంచేత అతిశయంకలిగిన; ప్రతిపన్న మాధవ శ్రీః = పొందబడిన భగవత్సంపదగల; త్వం = నీవు; నః = మాకు; అనిశ+ఉన్నిద్రం = ఎల్లప్పుడు చైతన్యాన్ని; అశోకవైభవం = దుఃఖంలేని ఐశ్వర్యాన్ని - మోక్షాన్ని; దిశసి = ప్రసాదిస్తావు.

(2) **అర్థం:-** ఓ పాదుకా! నిగమైః = కోకిల పలుకులచేత; సురభిః = వసంతకాలమైన; సమగ్ర కామా = పూర్ణమన్మథుడు గల (కామాన్ని ఉద్రేకపరచే); కనక + ఉత్కర్షవతీ = చంపవృక్షాలచే అతిశయిస్తున్న; ప్రతిపన్న మాధవ శ్రీః = పొందబడిన వైశాఖమాసశోభగల; త్వం = నీవు; నః = మాకు; అనిశ + ఉన్నిద్రం = సదావికాసాన్నీ; అశోక వైభవం = అశోక పుష్పసంపదనూ; దిశసి = కృపచేస్తావు.

(1) **తా॥** ఓ పాదుకాదేవీ! వేదాలచే సౌగంధ్యవతివి. సంపూర్ణ కల్యాణ గుణవతివి. బంగారం చేత, అతిశయవతివై శ్రీరంగనాథుని సంపదను పొందిన నీవు మాకు సర్వదా చైతన్యాన్నీ, దుఃఖరహితమైన ముక్తైశ్వర్యాన్నీ కృప చేస్తావు.

(2) **తా॥** ఓ పాదుకా! కోకిలలతోకూడిన వసంతర్తు మయమైన, నిండుకాముడు గల, చంపక తరులచే ఉత్కర్షకలిగిన, ప్రాప్తించిన వైశాఖ మాసశోభగల నీవు, మాకు సదావికాసాన్నీ, అశోక పుష్పసంపదనూ కలిగిస్తావు.

వ్యాఖ్య :- కాంచన పాదుక ఇహ పరసుఖాలను కలిగిస్తుందని శ్లిష్టవర్ణన

ఈ శ్లోకంలో వసంతర్తు వృత్తాంతం శ్లేషమహిమచే వర్ణితం.

1. నిగమైః సురభిః:- పాదుకాదేవి భగవచ్చరణ సంబంధంవల్ల వేదాలచేత సౌగంధ్యం కలది. వేదప్రతిపాదిత పాదుక అని భావం.

   "సురభిశ్చంపకే స్వర్ణేజాతీఫలవసంతయోః, సుగంధేచమనోజ్ఞేచ" (విశ్వ.ని.) వసంతర్తువు కోకిలరుతాలచే విశిష్టమైనది.

2. సమగ్రాకామా :- హేయగుణాలు లేని పాదుకాదేవి సకల కల్యాణగుణాలు కలది. కాబట్టి ఎల్లకాలం విశ్వశ్రేయస్సునే అభిలషిస్తుంది.

   "సో2శ్నుతే సర్వాన్ కామాంత్సహ బ్రహ్మణావిపశ్చితా" అనే ఉప నిషద్వాక్యంలో "కామాన్" అంటె 'కల్యాణ గుణాలను' అని శ్రీ భాష్య కారులు వ్యాఖ్యానించారు.

   వసంతుడు, మన్మథుడు ఇర్వురు అన్యోన్యమిత్రులు. కాబట్టి వసంతర్తువు కామోద్రేకాన్ని కలిగించడం అనుభవైక వేద్యం.

3. కనకోత్కర్షవతీ:- పాదుక మేలిమి బంగారు రూపంతో ప్రకాశిస్తుంది.

   "చంపకః కనకాహ్వయః" (అమరం) "కనకంచంపకే స్వర్ణేకింశుకే నాగకేసరే" (విశ్వ.ని) వసంతర్తువు సంపెంగచెట్ల పూలవాసనతో శోభిస్తూ ప్రకృతిని రంజింప జేస్తుంది.

4. ప్రతిపన్నమాధవ శ్రీః:- లక్ష్మీపతి సంపద పాదుకాదేవికి నిరంతరం చెందుతుంది.

   "వైశాఖే మాధవో రాధే"(అమరం).

   చైత్ర వైశాఖాలకు పరిమితమైన వసంతర్తువుకు వైశాఖమాసంలో తేజస్సు పుంజుకుంటుంది.

5. అశోక వైభవం:- పాదుకాదేవి చైతన్యాన్నీ; శోకరహితమైన శాశ్వతమైన ముక్తినీ ప్రసాదిస్తుంది.

వసంతర్తువు అశోక తరు సుమ సౌందర్య సౌగంధ్యాలతో సదా వికాసాన్ని స్ఫురింపజేస్తుంది.

జీవితమంతా వసంతమయమై ఉండడానికీ, చివరకు మోక్షం పొందడానికీ పాదుకాదేవ్యనుగ్రహమే ఆదికారణం. ఔపచ్ఛందసికం.

*735. సతివర్ణగుణే సువర్ణజాతే*
*ర్జగతిఖ్యాత మసౌరభా దవర్ణమ్ !*
*శ్రుతి సౌరభశాలినా స్వహేమ్నా*
*భవతీ శౌరిపదావని! వ్యుదాస్థత్ !! 5*

**అర్థం:-** హే శౌరిపదావని = ఓ భగవత్పాదుకా! సువర్ణజాతేః = బంగారమనే ద్రవ్యజాతికి; వర్ణగుణే = కాంతిగుణం; సతి = ఉండగా; అసౌరభాత్ = పరిమళం లేనందువల్ల; జగతి = లోకమందు; ఖ్యాతం = వ్యాపించిన; అవర్ణం = కాంతిలేమిని / అపవాదను; శ్రుతిసౌరభశాలినా = వేద పరిమళంచేత ఒప్పియున్న; స్వహేమ్నా = నీ బంగారం చేత; భవతీ = నీవు; వ్యుదాస్థత్ = తొలగించావు.

**తా॥** ఓ శౌరిపాదుకా! సువర్ణ జాతి ద్రవ్యానికి ప్రకాశించే గుణముంది. కాని పరిమళం లేదు. లోకమందు ప్రసిద్ధమైన ఈ దోషాన్ని నీవు వేద పరిమళంచే ఒప్పియున్న నీ సువర్ణంచేత నిరసింప జేస్తున్నావు.

వ్యాఖ్య :- ప్రాబల్యాల పరిమళంగల బంగారు పాదుక బంగారానికి పరిమళం లేదనే అపవాదను నిరసించే హేతు చమత్కృతి.

సువర్ణమంటే కాంతిరూపధర్మం కలిగిన బంగారం. సువర్ణానికి ప్రకాశించే గుణమున్నప్పుడు సుగంధం కూడా ఉంటే ఎంత బాగుండును. అబ్బా! బంగారానికి పరిమళం అబ్బలేదుకదా! అని లోకంలో సువర్ణజాతి ద్రవ్యానికి ఒక అపవాదముంది. వర్ణమున్నప్పుడు 'అవర్ణ'మనడం విరోధా భాసం.

"అవర్ణాక్షేప నిర్వాద పరీవాదాపవాదవత్" (అమరం) అవర్ణమంటె నింద.

బంగారానికి వన్నె ఉందని భూషిస్తూనే, వాసన లేదని లోకం దూషిస్తుంది. పాదుక(ల)కున్న ఆకారం సువర్ణజాతికి చెందిందే కదా! సువర్ణజాతిలో ఎక్కడైనా పరిమళం ఉంటే, ఆ ద్రవ్యజాతికంతటికీ ఆ గుణం వర్తిస్తుంది. దోషం - అపవాద - తొలగిపోతుంది.

శ్రుతి పరిమళం కలది భగవత్కాంచనపాదుక. భగవంతుడు సర్వ గంధుడు కదా!

"స యథార్ద్రేధాగ్నే రభ్యాహితాత్ పృథక్ ధూమాని నిశ్చరంతి, ఏవంవా అరే ఉస్య మహతో భూతస్య నిశ్వసితమేతత్ ఋుగ్వేదో యజుర్వేద స్సామవేద అధర్వాంగిరసః."

"ఓ మైత్రేయీ! పచ్చిసమిధలతో రాజుకొనే అగ్నినుంచి నలుమూలల పొగవిరజిమ్మబడినట్లు, ఈ మహద్భూతం యొక్క నిట్టూర్పే చతుర్వేదాలు" అని బృహదారణ్యకోపనిషత్తు.

"ఏకోవిష్ణు ర్మహద్భూతం". సర్వవ్యాపకుడైన శ్రీమహావిష్ణువేమహాభూతం.

భగవంతుని నిట్టూర్పుగా ప్రసిద్ధమైనది సమస్త వేదం. వాయువు గంధవహుడే కదా! సర్వగంధుడైన భగవంతుని ప్రాణభూత వాయురూపమైన వేదమూ సుగంధ భరితమే. "పుణ్యస్య కర్మణో దూరాద్గంధోవాతి." ఉత్కృష్టమైన చేష్టితం యొక్క సువాసన దూరంనుంచి వీస్తుంది. కాబట్టి శ్రుతి పరిమళమబ్బిన భగవత్కాంచన పాదుక తన విగ్రహమందు సౌరభంతోపాటు సువర్ణగుణముందని ప్రకటిస్తున్నది. సౌరభ హేతువు చేత లోకాపవాదనూ తొలగిస్తున్నది.

మంచి గుణం దాచినా దాగదు. పలువలకులకు ప్రసరిస్తుందనడం వల్ల మంచి గుణమందు గంధవ్యవహారం లేదనేదిలేదు. ఔపచ్ఛందసికం.

*736. ప్రతిపన్న మయూరకంఠధామ్నా*
*పరిశుద్ధేన పదావని ! స్వకేన ।*
*కమలాస్తన భూషణోచితం త*
*ద్భవతీ రత్న మలంకరోతి హేమ్నా ॥ 6*

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకా! భవతీ = నీవు; ప్రతిపన్నమయూరకంఠ ధామ్నా = ప్రాప్తమైన నెమిలికంఠచ్ఛాయగల; పరిశుద్ధేన = చొక్కపుదైన; స్వకేన = ఆత్మీయమైన; హేమ్నా = బంగారంచేత; కమలాస్తనభూషణ+ఉచితం = శ్రీదేవి స్తనాలకు అలంకరించదగిన; తత్ = ఆ; రత్నం = శ్రేష్ఠమైన శ్రీరంగనాథుణ్ని / పద్మరాగమణిని; అలంకరోతి = అలంకరించు కొంటున్నావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! ప్రాప్తమైన నెమలికంఠం యొక్క కాంతి కలిగిన పరిశుద్ధమైన స్వీయసువర్ణంచేత నీవు, లక్ష్మీదేవి వక్షోజాల ఆభరణానికి తగిన శ్రేష్ఠమైన పద్మరాగమణిని / శ్రీరంగనాథుణ్ని అలంకారంగా వహిస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకా ప్రత్యుప్తమైన పద్మరాగమణిగా శ్రీరంగనాథుణ్ని వహించే వర్ణన

పుటం పెట్టిన బంగారం పరిశుద్ధంగా ఉంటుంది. చొక్కంబంగారం కాంతి మయూర కంఠవర్ణంగా భాసిస్తుంది.

"మయూరకంఠ వర్ణత్వం శుద్ధ స్వర్ణస్య లక్షణమ్" అని శిల్పశాస్త్రం.

'తాత్పర్య చంద్రిక'లోనూ అలాగే చెప్పబడింది. పాదుక పరిశుద్ధమైన బంగారంతో నిర్మిత మయింది. కాబట్టి కాంచన పాదుక మయూర గ్రీవా సదృశ వర్ణంతో ప్రకాశిస్తుంది. శ్రీరంగనాథుడు శ్రీస్తనాభరణమైన ప్రసిద్ధ రత్నం.

పడతులు రత్న ఖచిత స్వర్ణపదకం ధరించేలాగా, పాదుకాదేవి కేకికంఠచ్ఛాయా సదృశమైన కాంచన భూషణమందు పొదుగబడిన రత్నమనదగిన శ్రీరంగనాథస్వామిని అలంకరించుకొని వహిస్తున్నది. రూపకాతిశయోక్తితో సంకీర్ణమైన ఉత్ప్రేక్షాలంకారం. ఔపచ్ఛందసికం.

*737. కాంత్యా పరంపురుష మాప్రణఖాత్సువర్ణం*
*కర్తుం క్షమా త్వమసి కాంచనపాదరక్షే !*
*అన్యాదృశీం దిశసి యా వినతస్యదూరా*
*దారగ్వధస్తబక సంపద మిందుమౌళేః !!* 7

**అర్థం:-** హే కాంచన పాదరక్షే = ఓ బంగారు పాదుకా! త్వం = నీవు; కాంత్యా = కాంతిచేత; పరం, పురుషం = పరమపురుషుణ్ని; ఆప్రణఖాత్ = పాదన ఖాగ్రం మొదలుకొని (శిఖవరకు); సువర్ణం = మేలివన్నెగా / కనక మయంగా; కర్తుం = చేయడానికి; క్షమా = సమర్థురాలవై; యా = ఏ నీవు; దూరాత్ = దూరంనుంచి; వినతస్య = నమస్కరించిన; ఇందుమౌళేః = చంద్రశేఖరునికి; అన్యాదృశీం = మరొక రకమైన; ఆరగ్వధస్తబక సంపదం = రేలపూల గుత్తి (వన్నెగల) శోభను; దిశసి = కలిగిస్తున్నావు.

**తా॥** ఓ కాంచనపాదుకా! నీవు పరమ పురుషుడైన శ్రీరంగనాథస్వామిని నీకాంతిచేత నఖాగ్రం మొదలుకొని శిఖాపర్యంతం శోభించే వర్ణంతో కూడిన వానిగా / కనకమయంగా చేయు సమర్థురాలవు.

నీవు దూరం నుంచి నమస్కరించే చంద్రమౌళికి విలక్షణమైన రాజ వృక్ష పుష్పగుచ్ఛశోభను ప్రసాదిస్తావు.

వ్యాఖ్య :- పాదుకాదేవి పరమ పురుషుణ్ని సువర్ణునిగా చేస్తుందని ఉత్ప్రేక్షితం

"సూర్యునిలో బంగారంలాగా ప్రకాశించేవాడు, బంగారువన్నె మీసాలూ, తలవెంట్రుకలూ కలవాడు, యోగుల దృష్టికి పరమపురుషుడు కాళ్ళ వ్రేళ్ళగోళ్ళు మొదలుకొని తలజుట్టుదాకా అంతా బంగారంలాగా కనబడుతుంటాడు" అని 'అంతరాదిత్య విద్య' వల్ల తెలుస్తుంది.

"య ఏషో ఽంతరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే, హిరణ్యశ్మశ్రు ర్హిరణ్యకేశ ఆప్రణఖా త్సర్వఏవ సువర్ణః" (ఛాం.ఉ.1-6-6)

ఈ శ్రుతి ఆధారంగానే, పరమపురుషునికి సువర్ణమయత్వం స్వాభావికంకావనీ, పాదుకా సువర్ణ ప్రభవల్లనే శోభకలిగినదని కవి వర్ణిస్తున్నాడు. లక్ష్మీదేవి ప్రభవల్లనే సువర్ణత్వం కలిగినదనీ చెప్పవచ్చు! కానీ లక్ష్మీదేవికి కూడా సాక్షాత్తుగా బంగారం లేదు కదా! జుట్టూ, మీసాలూ నల్లగా ఉంటాయి. గోళ్ళు చంద్రునిలాగా తెల్లగా ఉంటాయి. కాబట్టి భిన్నభిన్నమైన వన్నెలు కలిగిన కేశనఖాదుల స్వర్ణీకరణం కాంచన పాదుకా ప్రభాతిశయం వల్లనే కలుగుతున్నది.

"ఆరగ్వధో రాజ వృక్షః" (అమరం)

'ఆరగ్వధ' మంటె రేలచెట్టు. పాదుకాదేవికి ఎంతో దూరం నుంచి శివుడు నమస్కరిస్తుంటే, శివుని తలమీది చంద్రుని ధవళ వర్ణాన్ని పాదుకాదేవి తన కనకమయ కాంతితో రేల పూలగుత్తి కంటె నుత్కృష్టమైన వన్నెగా మార్చివేస్తుంది. ఇక పాదుక మీదనే నిల్చియున్న శ్రీరంగనాథునికి నఖశిఖా పర్యంతం కలిగే సువర్ణత్వాన్ని గూర్చి చెప్పేదేముంది? ఇది కైముత్యసిద్ధమే కదా! కావ్యార్థా పత్తి సంకీర్ణమైన ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలక.

*738. చంద్రాకృతిః కథమకల్పయథాస్తదానీం*
*వైమానిక ప్రణయినీ వదనాంబుజానామ్ ।*
*విక్రాంతికాల వితతేన నిజేన ధామ్నా*
*బాలాతపం బలివిమర్దన పాదుకే! త్వమ్ ॥ 8*

**అర్థం:-** హే బలివిమర్దన పాదుకే = బలిని అణచిన భగవంతుని ఓ పాదుకా! చంద్ర + ఆకృతిః = చంద్రుని రూపం కలిగిన / కనకమయ శరీరంకల; త్వం = నీవు; తదానీం = అప్పుడు; విక్రాంతికాలవితతేన = లోకాలను ఆక్రమించిన సమయాన విస్తరించిన; నిజేన = స్వీయ; ధామ్నా = కాంతిచేత; వైమానికప్రణయినీ వదన + అంబుజానాం = దేవతల ప్రియురాండ్రముఖాలు అనే కమలాలకు; బాల + ఆతపం = లేత ఎండను; కథం = ఏవిధంగా; అకల్పయథాః = కల్పించావు?

**తా॥** ఓ బలి విమర్దను పాదుకా! చంద్రుని రూపం / కనకమయాకారం కలిగిన నీవు త్రివిక్రమావతారమప్పుడు ముల్లోకాలను ఆక్రమించిన సమయంలో పైకి ప్రసరించిన స్వీయకాంతిచేత దేవాంగనల ముఖాలనే కమలాలకు లేత ఎండను ఎలా కల్పించావు?

వ్యాఖ్య :- చంద్రాకృతి కలిగిన పాదుక దేవస్త్రీల ముఖపంకజాలను వికసింపజేసే వర్ణన

త్రివిక్రమావతార కాలంలో ముల్లోకాలను భగవంతుడు తన అడుగులతో కొలుస్తుంటే పాదుకాదేవి కాంచన ప్రభ మీదికి ప్రసరించింది. చంద్రశబ్దానికి స్వర్ణమని అర్థం.

"చంద్రః సుధాంశుకర్పూరకాపిల స్వర్ణ వారిషు" (విశ్వ.ని.)

ఊర్ధ్వలోకానికి ప్రసరించిన స్వర్ణపాదుకయొక్క కాంతి ఉదయ భానుని లేత కిరణాల లాగా సోకడం వల్ల దేవవనితల ముఖాలనే పద్మాలు ప్రఫుల్లితాలయ్యాయి.

చంద్రునికి ఆ చంద్ర, సూర్య, ధర్మం పాదుకాయత్తమైన సిద్ధ విషయం. వదనాంబుజ వికాస హేతువు అవడం వల్ల పాదుకా కనక ప్రభయే బాలాతపంగా అధ్యవసింపబడింది. చంద్రునికి పద్మాలను వికసింప జేసే సూర్యకాంతి ఉండడం సుతరాంవిరుద్ధం.

విరుద్ధ ధర్మం వల్ల పద్మోల్లాసక కార్యం నిర్వహింపబడింది! కాబట్టి శ్లేషాను ప్రాణితమైన విభావనాలంకారభేదమిది. వసంత తిలకావృత్తం.

739. లేభే తదా ప్రభృతి నూనమియం భవత్యాః
కాంత్యా కవేర తనయా కనకాపగా త్వమ్
యా వన్ముకుంద పద హేమ పదావని! త్వం
పుణ్యం విభూషితవతీ పులినం తదీయమ్ !! 9

అర్థం:- హే ముకుంద పద హేమ పదావని = ముకుందునిచరణాలయందలి ఓ బంగారు పాదుకా! యావత్ = ఎప్పటినుంచి; త్వం = నీవు; తదీయం = ఆకావేరీనదికి సంబంధించిన; పుణ్యం = పరిశుద్ధమైన; పులినం = ఇసుక తిన్నెను; విభూషితవతీ = అలంకరించి ఉన్నావో; తదా ప్రభృతి = అప్పటినుంచి, ఇయం = ఈ; కవేరతనయా = కావేరీ నది; భవత్యాః = నీయొక్క; కాంత్యా = ప్రభచేత; కనకాపగాత్వం = బంగారుపుటేరు అనే ఖ్యాతిని; లేభే = పొందెను; నూనం = నిశ్చయం.

తా॥ ముకుందుని పాదాలకు సంబంధించిన ఓ బంగారు పాదుకా! ఎప్పటినుంచి నీవు కావేరీ సైకత ప్రదేశాన్ని అందంగా అలంకరించి ఉన్నావో, అప్పటినుంచి ఈ కావేరీనది నీకాంతిచేత "కనకాపగ' అనే సంజ్ఞను నిశ్చయంగా పొందింది.

వ్యాఖ్య :- కనక పాదుకా కాంతిచేత కావేరీనది 'కనకనది' గా వ్యవహృతం

ధర్మాత్ముడైన విభీషణుడు అయోధ్యనుంచి శ్రీరాముడర్పించిన శ్రీరంగనాథ విగ్రహాన్ని లంకానగరానికి తీసుకొని పోతూ కావేరీ నదీ మధ్యన ఇసుక తిన్నె మీద ఉంచాడు. అప్పటికే 'శేషపీఠ' మని కావేరీ పులినం పుణ్యస్థలంగా పేరుగాంచింది. శ్రీరంగనాథుని కాంచన పాదుకలకాంతి సైకత ప్రదేశ మంతా వ్యాపించింది. అప్పటినుంచి 'కావేరి' కి 'కనకాపగ' అనే పేరు కల్గింది.

'కనకాపగ' అనే సంజ్ఞకు పాదుకా కనకకాంతి హేతువుకాకున్నా, హేతువుగా ఉత్ప్రేక్షితం. నామనిర్వచనం నిరుక్త్యలంకార లక్షణం. వసన్తతిలక.

740. చిత్రం సరోజనిలయా సహితస్యశౌరే
ర్వాసోచితాని చరణావని ! సంవిధిత్సోః
సద్యోవికాసముపయాంతి సమాధిభాజాం
చంద్రాతపేన తవ మానస పంకజాని !! 10

అర్థం:- హే చరణావని = ఓ పాదుకా! సరోజనిలయా సహితస్య = కమల వాసినియైన లక్ష్మితో కూడియున్న; శౌరేః = భగవంతుని యొక్క; వాస + ఉచితాని = నివాస యోగ్యమైన వాటినిగా; సంవిధిత్సోః = చేయగోరే; తవ = నీయొక్క; చంద్ర+ఆతపేన = వెన్నెలచేత / బంగారుకాంతిచేత; సమ + ఆధి, భాజాం = శ్రియః పతియందుచిత్తం నిల్పిన యోగుల యొక్క; మానస పంకజాని = హృదయాలనే కమలాలు; సద్యః = తత్కాలాననే; వికాసం = వికాసాన్ని; ఉపయాంతి = పొందుతాయి; చిత్రం = ఆశ్చర్యం.

తా॥ ఓ పాదుకాదేవీ! ధ్యాన నిష్ఠులైన యోగుల హృదయాలనే కమలాలు, కమలాలయతోపాటు శ్రీరంగనాథుని నివాస యోగ్య స్థానాలుగా చేయగోరే నీ కాంచన ప్రభయనే వెన్నెలచేత, సద్యోవికాసాన్ని పొందుతాయి, చిత్రమే.

వ్యాఖ్య :- చంద్రాతపంచేత మానస పంకజాలు వికసించడం ఆశ్చర్యం

యోగుల హృదయాలే కమలాలు. లక్ష్మీదేవి కమలవాసిని. శ్రీరంగనాథునికి సమాధిష్ఠులైన వారి హృదయకమలాల్లో నివసించే మక్కువ ఎక్కువ. కాబట్టి లక్ష్మీ సహితుడైన శ్రీరంగనాథుడు నివసించడానికి యోగ్యంగా పాదుక, తన కనక ప్రభయనే వెన్నెలతో యోగుల మానస కమలాలను వికసింపజేస్తుంది.

"చంద్రమా మనసోజాతః" (శ్రుతి.) చంద్రుడు శ్రీవిష్ణు మనస్సంజాతుడు. మానసమేకమలం. కమలాలయ లక్ష్మి. లక్ష్మీపతిని యోగులు ధ్యానిస్తుంటారు. దయామయి పాదుక తన చంద్రాతపం - బంగారు కాంతి - చేత మానసకమలాలను వికసింపజేస్తుంది. వికసిత కమలాలయందు శ్రీకాంతుడు నివసింప చిత్తగిస్తాడు.

సూర్యకాంతితో చంద్రుడు ప్రకాశిస్తాడు. కమలాలు వికసిస్తాయి. శ్రీ శఠకోపదివ్యసూరి, వేద సూర్యకాంతిచే ప్రకాశించే దివ్యప్రబంధచంద్ర చంద్రికతో శ్రీమన్నాథమున్యాది యోగుల మానసకమలాలను వికసింపజేశాడు కదా! పరత్వాన్ని స్వయంగా గ్రహించి, ప్రబంధచంద్ర చంద్రికచేత కమలాకాంతుని నిత్యస్థితిని సర్వత్ర కల్పించాడన్న వ్యంగ్యమే చిత్రం.

హృత్సరోజవాసప్రీతికి 'సరోజనిలయా' శబ్దం సాభిప్రాయం, కాబట్టి పరికరాలంకారం. 738 శ్లోకం వలె విభావనాలంకారం. వసంతతిలకావృత్తం.

*741.* *త్వయ్యేవ పాద మధిరోప్య నవం ప్రవాహం*
*నాథే పదావని! నిశామయితుం ప్రవృత్తే*
*ఆత్మీయకాంచనరుచా భవతీ విధత్తే*
*హేమారవిందభరితా మివ హేమసింధుమ్ !* *11*

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకాదేవీ! నాథే = ప్రభువైన శ్రీరంగనాథుడు; త్వయి, ఏవ = నీ యందే; పాదం = చరణాన్ని; అధిరోప్య = మోపి; నవం = కొత్తదైన; ప్రవాహం = వెల్లువను; నిశామయితుం = చూడడానికి; ప్రవృత్తే = వెళ్ళినప్పుడు; భవతీ = నీవు; ఆత్మీయకాంచనరుచా = నీ బంగారు కాంతిచేత; హేమసింధుం = కావేరి నదిని; హేమ + అరవింద భరితాం, ఇవ = బంగారు కమలాలచే నిండియున్న దాన్ని వలె; విధత్తే = చేస్తుంటావు.

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీరంగప్రభువు నీయందే పాదాలను మోపి కావేరిలోని కొత్త ప్రవాహాన్ని చూడడానికి వెళ్ళినప్పుడు నీవు, నీ బంగారు కాంతిచేత కావేరీ నదిని బంగారు కమలాలచే నిండియున్నట్లు చేస్తుంటావు.

వ్యాఖ్య :- కాంచన పాదుక కావేరీ నదిలో బంగారు కమలాలున్నట్లు చేస్తుంది

శ్రీరంగనాథుడు వర్షాలవల్ల కొత్తగా వరద వచ్చినప్పుడు కావేరీ నదిని చూడడానికి పాదుకలను ధరించి వెళ్ళుతాడు. అప్పుడు కనకాపగలోని తామరపూవులు పాదుకల బంగారు కాంతిచేత బంగారు తామర పూవులుగా శోభిస్తుంటాయి. పాదుక పద్మాక్షుని ముఖోల్లాసంకోసం చేసే ప్రయత్నమిది. కనువిందుచేసే ప్రకృతి రామణీయకమైన కల్పన. ఉత్ప్రేక్ష. వసన్తతిలక.

742. *విహరతి పులినేషు త్వ త్సఖేరంగనాథే*
*కనకసరిదియంతే పాదుకే! హేమధామ్నా*
*వహతి సలిలకేళీ స్రస్త చోలావరోధ*
*స్తనకలశ హరిద్రా పంక పింగా మవస్థామ్!!* 12

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! త్వత్ సఖే = నీతోకూడియున్న; రంగనాథే = శ్రీరంగనాథస్వామి; పులినేషు = ఇసుకతిన్నెలయందు; విహరతి = ఉల్లాసంగా సంచరిస్తున్నప్పుడు; ఇయం = ఈ, కనకసరిత్ = కావేరీనది, తే = నీయొక్క; హేమధామ్నా = బంగారుకాంతిచేత; సలిల - పింగాం - సలిల కేళీ = జలక్రీడ చేత; స్రస్త = జారిన / కడుగబడిన; చోల = రవికెలుగల / చోళదేశమందలి; అవరోధ = అంతఃపురస్త్రీలయొక్క; సన్తకలశ = గిండ్లలాంటి చండ్లయందలి; హరిద్రాపంక = పసుపుచిత్తడి చేత; పింగాం = గోరోచన వర్ణమున్న; అవస్థాం = స్థితిని; వహతి = ధరిస్తున్నది.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీ ప్రియుడైన శ్రీరంగనాథుడు ఇసుక తిన్నెలయందు విహరిస్తుంటే నీ చాంపేయకాంతిచే ఈ కావేరీనది, జలక్రీడచే రవికలు జారిపోయిన / క్షాలితమైన, చోళదేశ ప్రభువు యొక్క అంతఃపుర స్త్రీల భగవంతుని శుద్ధాంత మహిళల కలశసదృశమైన స్తనాలకు సంబంధించిన పసుపు చిత్తడిచేత పిశంగ వర్ణం కల స్థితిలాంటి స్థితిని పొందుతుంది.

వ్యాఖ్య :- కావేరి పసుపేరుగా కనబడుతుందని నిదర్శనోక్తి వైచిత్రి

పాదుకలను ధరించి శ్రీరంగనాథుడు కావేరిని కటాక్షించడానికి వెళ్ళుతాడు. సాధారణంగా భగవద్దర్శనార్థమై వచ్చిన చోళదేశ ప్రభువుయొక్క అంతఃపుర స్త్రీలు కావేరీ నదిలో జలకాలాడుతారు. ఆ చోళదేశ పురంధ్రులు రవికెలు విడిచి స్నానం చేస్తుంటే వక్షోజాలకు రాసుకొనే పసుపు క్షాలితమై నదీజలం పసుపు నీరుగా మారుతుంది. అలాగే పాదుకా కాంచన ప్రభచేత కావేరి పిశంగవర్ణం కలిగిన దశను పొందుతుంది. ఇది నిదర్శనాలంకారం.

"చోలావరోధః" : చోళదేశ రాజాంతఃపురస్త్రీలు అన్నప్పుడుమానవ కాంతలుగా అర్థమవుతుంది. "చోలఃకూర్పాసకో ఒస్త్రి యామ్" (అమరం) 'చోల' శబ్దానికి 'రవికె' అనే అర్థముంది. కాబట్టి స్రస్త కూర్పాసకాంతఃపుర స్త్రీలు అంటే శ్రీరంగనాథుని శుద్ధాంతస్త్రీలు జలక్రీడ జరుపుతున్నప్పుడు వారి వక్షోజాలయందలి పసుపు క్షాలితమైకావేరీ నది పింగదశను పొందుతుంది.

"పింగ పిశంగౌ కద్రుపింగళౌ" (అమరం) పింగవర్ణమంటే గోరొచనంవన్నె. 'గోరోచనారుచిరయాచరుచేందిరాయాః' (గోదాస్తుతి) లక్ష్మీదేవి శరీరకాంతి గోరోచన వర్ణంగా శోభిస్తుందన్నారు దేశికులు. చోళదేశ సంజాతయైన దివ్యమహిషిగోదాదేవి నీరాడుతుంది. మంగళ ద్రవ్యమైన పసుపు దేహానికి రాసుకోవడం వల్ల కావేరీ జలం పసుపు నీరై శోభించినట్లు, పాదుకాసువర్ణకాంతి చేత కావేరి పసుపేరై శోభిస్తుందనడమూ సరసమే. మాలినీ వృత్తం.

*743. సురభి నిగమగంధా సౌమ్య పద్మాకరస్థా*
*కనక కమలినీ వప్రేక్షసే పాదుకే! త్వమ్!*
*భ్రమర ఇవ సదా త్వాం ప్రాప్త నానావిహార*
*శ్శతమఖ మణినీలః సేవతే శార్ఙ్గధన్వా !!* 13

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! సురభినిగమగంధా = పరిమళించే వేదవాసనగల / నగర యోగ్యవాసనగల; సౌమ్య పద్మాకరస్థా = అందమైన మహాలక్ష్మి హస్తమందున్న / చంద్రపుష్కరిణియందున్న; త్వం = నీవు; కనక కమలినీ, ఇవ = బంగారు తామర తీగలాగా; ప్ర+ఈక్ష్యసే = చూడబడుతావు. ప్రాప్త నానావిహారః = పొందబడిన పలురకాల సంచారం / భూషణం గల; శతమఖ మణి నీలః = ఇంద్రనీలమణిలాగానీల వర్ణంగల; శార్ఙ్గధన్వా = శార్ఙ్గమనే విల్లుగల శ్రీరంగనాథుడు; సదా = ఎల్లప్పుడు; త్వాం = నిన్ను; భ్రమరః, ఇవ = తుమ్మెదవలె; సేవతే = ఆశ్రయిస్తాడు.

**తా॥** ఓ పాదుకాదేవీ! పరిమళించే వేదమే గంధంగా కలిగిన, అందమైన లక్ష్మీహస్తమందున్న నీవు, నగర యోగ్య సౌరభంతో కూడిన, చంద్రపుష్కరిణిలాంటి తటాకమందున్న బంగారు తామర తీగలాగా కనబడుతావు. ప్రాప్తించిన నానా విధ సంచారం కలిగిన, ఇంద్రనీల మణిలాగా నీలవర్ణం కలిగిన, శార్ఙ్గమనే ధనుస్సుకల శ్రీరంగనాథుడు నిన్ను ప్రాప్తించిన పలురకాల సొమ్ము కలిగిన, ఇంద్రనీల మణి వర్ణం కలిగిన తుమ్మెద మాదిరిగా ఎల్లప్పుడు సేవిస్తుంటాడు.

వ్యాఖ్య :- శ్రీరంగనాథుడు పాదుకను, భ్రమరం కమలినివలె సర్వదా ఆశ్రయించే వర్ణన

'నిగమ' శబ్దానికి వేదం, నగరం అని అర్థద్వయం. 'సౌమ్య' మంటే సుమశోభకలది. చంద్రసంబంధమైనది. పద్మా+కరం = లక్ష్మీహస్తం. పద్మ+ఆకరం = కమలాలకునెలవైన జలాశయం. 'పద్మాకర' శబ్దం సంభంగశ్లేషకలది.

"పద్మాకరస్తటాకో ఒస్త్రీ" (అమరం). 'విహారం' అంటే సంచారం, నగ. గంధం ఘ్రాణేంద్రియాన్ని తృప్తిపరుస్తుంది. పాదుకాదేవి వేదగంధంతో సురభిళమవుతుంది. లక్ష్మీదేవి భగవంతుని పాదసంవహనం చేస్తుంది. కాబట్టి పాదుకాదేవి పద్మాకరస్థయై బంగారు తామరతీగ (కమలిని) లాగాకనబడుతుంది.

శ్రీరంగనాథుడు శార్ఙ్గధన్వుడు, శతమఖమణినీలుడు. కమలాలు కలది కమలిని; సరస్సులేదా తామరతీగ అని అర్థం. సరస్సులేని తామరలుండవు. తామరపూలను సొమ్ముగా చేసుకొనేది భ్రమరం. కమలిని ఆశ్రయించకపోతే నీలవర్ణంగల భ్రమరానికి నానా విహారం ప్రాప్తించదు. స్థాన-సౌరభాలను, వన్నె-వాసిని బట్టి కమలినికీ - పాదుకకూ; శార్ఙ్గికీ - భ్రమరానికీ సామ్యాన్ని కల్పించిన అర్థ చమత్కృతి. శ్లేషసంకీర్ణోపమాలంకారం. మాలినీవృత్తం.

744. కనక రుచిరవర్ణాం పాదుకే! సహ్యసింధుః
శ్రియమివ మహనీయాం సింధురాజస్య పత్నీ ।
స్వయమిహ సవిధస్థా సౌమ్యజామాతృయుక్తా
ముపచరతి రసేన త్వామపత్యాభిమానాత్ ॥ 14

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! సింధురాజస్య = సముద్రునియొక్క; పత్నీ = భార్యయైన; సహ్యసింధుః = సహ్యాద్రియందు జనించిన కావేరీనది; ఇహ = ఇక్కడ (శ్రీరంగమందు); స్వయం = తానే; సవిధస్థా = సమీపమందున్నదై; కనక రుచిర వర్ణాం = బంగారంచేత / బంగారంలాగా, అందమైనవన్నెగల; సౌమ్యజామాతృయుక్తాం = సుందరవరునితో / సౌమ్యజామాత అనే పేరుగల శ్రీరంగనాథునితో, కూడియున్న; త్వాం = నిన్ను; మహనీయాం = పూజనీయ అయిన; శ్రియం, ఇవ = లక్ష్మీదేవినివలె; అపత్య+అభిమానాత్ = పుత్రీ త్వాభిమానం వల్ల; రసేన = ప్రేమచే / జలంచేత; ఉపచరతి = ఉపచారం చేస్తుంది.

**తా॥** ఓ పాదుకాదేవీ! సముద్రుని పత్నియైన కావేరీనది, స్వయంగా దగ్గర ఉంటూ సువర్ణంలాగా అందమైన రూపం కలిగిన సుందరవరుడైన శ్రీరంగ నాథునితో కూడియున్న మహనీయురాలైన లక్ష్మీదేవినివలె, సువర్ణంచేత అందమైన రూపం కలిగిన, సౌమ్యజామాత అనే పేర్గాంచిన శ్రీరంగనాథునితో కూడియున్నందువల్లనే మహనీయవైన నిన్ను పుత్రీత్వాభిమానం వల్ల అత్యంతాదరంతో గౌరవిస్తుంది.

వ్యాఖ్య :– కావేరీమాత పాదుకాదేవిని పుత్రికాభావంతో ప్రియంగా చూస్తుంది

కావేరీనది సముద్రుని భార్య - సముద్రుని తనయ లక్ష్మీదేవి. కాబట్టి కావేరి లక్ష్మికి తల్లి. 'జామాత' అంటే అల్లుడు. కావేరికి అల్లుడు, లక్ష్మికి సుందరవరుడు శ్రీరంగనాథుడేకదా! అందుకే తల్లియైన కావేరి శ్రీరంగమందే దగ్గరగా ఉంటూ లక్ష్మీదేవిని కడుగారాబంగా చూచుకొంటుంది.

కాంచనపాదుక సౌమ్యజామాతృయుక్త కాబట్టి కావేరి మహనీయయైన పాదుకాదేవిని లక్ష్మీదేవినివలె పుత్రికాభిమానంతో ఉపచరిస్తుంది.

ఇది కావ్య శిల్ప చమత్కారం.

'రసేన' - తీర్థమవడంవల్ల - ప్రేమరసమొల్కడంవల్ల శ్రీరంగమందే సంచరిస్తుంది. 'సింధురాజస్యపత్నీ' - కావేరికి మాతృత్వ సంబంధాన్ని సూచించే విశేషణం. కాబట్టి ఇది పరికరాలంకారోక్తి. 'కనక రుచిరవర్ణ' మరియు 'సౌమ్యజామాతృయుక్త' శబ్దాలలో శ్లేషాలంకారం ఉంది. 'శ్రియంఇవ' - లక్ష్మీదేవినివలె పాదుకాదేవిని కూడా అపత్యాభిమానంతో గౌరవిస్తుందన్న సామ్యం ఉంది. కాబట్టి ఇది ఉపమాలంకారం. మాలినీవృత్తం.

745. అనుకలముపజీవ్యా దృశ్యసే నిర్జరాణాం
త్రిపుర మథన మౌళౌ శేఖరత్వం దధాసి ।
ప్రతిపదమధిగమ్య ప్రాప్తశృంగా౽సిశౌరే
స్తదపి చరణ రక్షే! పూర్ణచంద్రాకృతిస్త్వమ్ ॥ 15

**అర్థం:-** హే చరణరక్షే = ఓ పాదుకా! అనుకలం = ప్రతిక్షణం / ప్రతికళయందు; నిర్జరాణాం = ముసలితనంలేని ముక్తాత్మలకు / దేవతలకు; ఉపజీవ్యా = రక్షణార్థం ఆశ్రయించదగినదానవై / ఆహారం కోసం ఆధారమై; దృశ్యసే = కనబడుతావు. త్రిపుర మథన మౌళౌ = త్రిపురారియైన పరమశివుని తలమీద; శేఖరత్వం = శిరోభూషణత్వాన్ని; దధాసి = ధరిస్తున్నావు. శౌరేః = భగవంతునియొక్క; ప్రతిపదం = ఒక్కొక్కచరణాన్ని / ప్రతిపత్తిథిని; అధిగమ్య = పొంది; ప్రాప్త శృంగా = పొందబడిన ప్రభుత్వం / శిఖరం కలదానవై; అసి = ఉన్నావు. తత్+అపి = అట్లైననూ; త్వం = నీవు; పూర్ణచంద్ర+అకృతిః = సమగ్రమైన కనకమయ శరీరవై / పూర్ణచంద్రాకారవై; అసి = ఉన్నావు.

**తా॥** ఓ పాదుకా! నీవు ప్రతిక్షణంముక్తులకు రక్షణకోసం ఆశ్రయణీయవై/కళావిషయమై దేవతలకు ఆహారం కోసం ఆశ్రయణీయవై కనబడుతావు. త్రిపురాంతకుని శిరస్సున భూషణంగా వెలుగుతావు. ప్రతిపాదమందు ధరించిన భగవంతునిచేత పొందిన ప్రాభవం కలదానవు/ప్రతిపత్తిథి నాడుచేరి పొందిన శిఖరం కలదానవు. అయినా, సమగ్రంగా కాంచన శరీరవై / పూర్ణచంద్రాకృతిగా ఉన్నావు.

**వ్యాఖ్య :– పాదుకాదేవి కళావిభక్త అయినా పూర్ణచంద్రాకృతిగా వర్ణితం**

ముసలితనం ఎరుగని ముక్త పురుషులు పాదుకాదేవిని రక్షణకోసం ఆశ్రయిస్తారు. పరమశివుడు ప్రణమిల్లుతున్నప్పుడు పాదుక ఆయన తలమీద భూషణమై రాణిస్తుంది. భగవంతుని పాదయుగళాన్ని పొంది ప్రభుత్వాన్ని సాగిస్తుంది. ఇలా వేర్వేరుగా రాణించడానికి పాదుకాదేవి శరీరం సమగ్రంగా కాంచనమయమవడయే కారణం.

'నిర్జరులు' : ప్రకృతి 24 తత్త్వాలుకలది. 25వ తత్త్వం జీవునిది. కాబట్టి ప్రకృతి బంధం నుంచి ముక్తులైన జీవులు నిర్జరులు - జరాహీనులు - నిత్యయౌవనులు.

దేవతలు అని మరొక అర్థం. ముప్పదేండ్ల యువకులుగానే ఉంటారు.

"అమరా నిర్జరాదేవాః త్రిదశా విబుధాః సురాః" (అమరం)

'అనుకలం' అంటె ప్రతిక్షణం, ప్రతికళ. దేవతలకు చంద్రకళలు - అమృతగుళికలు - ఆహారం "ప్రథమాంపిబతేవహ్నిః" మొదటి కళను అగ్ని దేవుడు ఆహారంగా స్వీకరిస్తాడని శాస్త్రం తెల్పుతుంది. 'కళ' అంటె చంద్రునికాంతిలో పదహార(16)వ భాగం.

"షోడశాంశే చ చంద్రస్య కలనాకాలయోః కళా" (విశ్వనిఘంటువు) 'శృంగ' శబ్దానికి ప్రభుత్వం శిఖరం,కొమ్ము, చిహ్నమనీ అనేకార్థాలు.

శృంగంప్రభుత్వేశిఖరే చిహ్నే క్రీడాంబుయంత్రికే" (విశ్వనిఘంటువు).

పాదరక్షలను ధరిస్తే ప్రభుత్వ చిహ్నంగా రాజసంరంజిల్లుతుంది.

శుక్ల ప్రతిపత్తిథి - పాఢ్యమి - నాటి సాయంకాలాన చంద్రకళ సన్నని రేఖగా - శిఖరం - కొమ్ము-గా కనబడుతుంది కదా!

'పూర్ణచంద్ర' శబ్దానికి పున్నమనాటి నిండు చంద్రుడనీ, నిలువెల్ల బంగారమనీ రెండర్థాలున్నాయి.

దేవతలు ఆహారంగా స్వీకరించడం వల్ల చంద్రకళలు క్షీణిస్తాయి. శివుని తలమీది చంద్రుడు కళామాత్రావశిష్టుడు. ఇక పాఢ్యమి నాటి చంద్రునికి పూర్ణత్వమేలేదు.

ఇంత వైవిధ్యమున్న చంద్రుని ఆకృతితో పోల్చి పాదుకాకృతిని పూర్ణత్వంగా వర్ణించడం పరిహాసమే - విరోధమే. అయినా 'పూర్ణచంద్ర' పదానికి 'నిండుగా బంగారం కలది' అనే అర్థం - శ్లేష - వల్ల విరోధం పరిహరింపబడుతుంది. మాలినీ వృత్తం.

*746. కనక మపితృణం యే మన్వతే వీతరాగాః*
*తృణమపి కనకం తే జానతే త్వత్ప్రకాశైః ॥*
*మధురిపు పదరక్షే! యత్ త్వదర్థోపనీతాన్*
*పరిణమయసి హైమాన్ దేవి! దూర్వాంకురాదీన్!!* **16**

**అర్థం:-** హే దేవి! = మధురిపుపదరక్షే = ఓ మధువైరిపాదుకాదేవి! యే = ఏ; వీతరాగాః = ఆశను అణచివేసిన వ్యక్తులు; కనకం, అపి = బంగారాన్ని కూడా; తృణం = గడ్డిపోచగా; మన్వతే = తలుస్తారో; తే = వారు; త్వత్+ప్రకాశైః = నీ వన్నెల చేత; తృణం, అపి = గడ్డిపోచను కూడా; కనకం = బంగారంగా; జానతే = భావిస్తారు; యత్ = ఎందువల్ల, అంటే; త్వత్ + అర్థ + ఉపనీతాన్ = నీ కోసం ఉపహారంగా సమర్పింపబడిన; దూర్వా + అంకుర్+ఆదీన్ = గరిక మొక్కలు మొదలైనవాటిని; హైమాన్ = కనక వర్ణాలుగా; పరిణమయసి = మారుస్తుంటావు.

**తా॥** ఓ మధురిపుపాదుకా! వీతరాగులైన ఏ వ్యక్తులు బంగారాన్ని కూడా గడ్డిపోచగా భావిస్తారో, ఆ వ్యక్తులే గడ్డిపోచను కూడా నీ కాంతులచేత బంగారమనుకొంటారు. ఓ దేవీ! కారణమేమి? అంటే, నీ కోసం తెచ్చేగరిక మొక్కలు మొదలైన వాటిని నీవు బంగారు వన్నెగల వాటినిగా మార్చేస్తుంటావు.

వ్యాఖ్య :- వైరాగ్య పురుషులు, పాదుకాకాంతులు ప్రసరించిన గడ్డిపోచలను బంగారంగా భావిస్తారని వర్ణితం.

రాగద్వేషాదులు లేని వ్యక్తులు బంగారాన్ని తృణంగా భావిస్తారు. విలువకలదైనా బంగారాన్ని గౌరవించరు. వారే, కాంచన పాదుకా కాంతులు ప్రసరించడం వల్ల గడ్డిపోచలను కూడా బంగారంగా భ్రమిస్తారు. (భ్రమాలంకారం)

విలువకలిగిన బంగారమెక్కడ? విలువలేని గరిక ఎక్కడ? బంగారానికీ గరికకూ అననురూపఘటన వర్ణితం. (ఇది విషమాలంకారం) ఆదరణ పొందని గరిక మొక్కలను తెచ్చి ఆదరంతో పాదుకలను అర్చించడం, వ్యాఘాతాలంకార లక్షణం.

దూర్వాంకురాది పదార్థాలు బంగారు వన్నెగా మారడానికి పాదుకాదేవి యొక్క కాంచనమయశరీరకాంతులే సాధనాలుగా వర్ణించి, సమర్థించడం వల్ల వాక్యార్థ హేతుక కావ్యలింగాలంకారం.

అలంకార చతుష్టయంతో కూడిన కవితా శిల్పమిది.

*747. విశుద్ధి మధిగచ్ఛతి జ్వలన సంగమాత్కాంచనం*
*విదంతిచ జగంతి తన్నఖలు తద్విపర్యస్యతి*
*కథం కనకపాదుకే! కమలలోచనే సాక్షిణి*
*త్వయైవ పరిశుద్ధతా హుతభుజోఽపి జాఘట్యతే!!* **17**

**అర్థం:-** హే కనక పాదుకే = ఓ సువర్ణపాదుకా! కాంచనం = బంగారం; జ్వలనసంగమాత్ = అగ్నితోకలియడం వల్ల; విశుద్ధిం = పరిశుద్ధిని; అధిగచ్ఛతి = పొందుతుంది. తత్ = దానిని; జగంతి = లోకాలు; విదంతి, చ = తెలుసు కొంటున్నాయి కూడ. తత్ = అది; న, విపర్యస్యతి, ఖలు = విపర్యాసం కాదు కదా! కమలలోచనే = తామరసాక్షుడు; సాక్షిణి = ప్రత్యక్షంగా చూస్తున్నప్పుడు; హుతభుజః, అపి = అగ్నికి కూడా; త్వయా, ఏవ = నీ చేతనే; పరిశుద్ధతా = పావనత్వం; కథం = ఎలా? జా ఘట్యతే = ఘటిస్తుంది? (ఇది విపర్యాసమే)

**తా॥** ఓ కాంచనపాదుకాదేవీ! అగ్ని సంయోగం వల్ల బంగారం మంచి వన్నెను పొందుతుంది. ఇది లోకులకు తెలుసు. ఇది విపరీతమని ఎవ్వరనుకోరుకదా! కమలలోచనుడైన భగవంతుడు చూస్తుండగా నీ చేతనే అగ్నికి కూడా పావనత్వం ఎలాగైనా ఘటిస్తుంది.

వ్యాఖ్య :- పాదుకాదేవి వల్ల అగ్నిహోత్రుడూ పావనుడవుతాడని వర్ణన.

అగ్గిలోవేసి కాచిననే గాని బంగారం చొక్కమో, కేటో తెల్యదు కదా! "హేమ్నః సంలక్ష్యతే హ్యగ్నౌవిశుద్ధిః శ్యామికా ఽపివా" - అని కాళిదాసు రఘువంశ మహాకావ్యశైలిని సత్పురుషులేవిని, అది ఎట్టిదో పరిశీలిస్తారన్న సందర్భ శుద్ధిగల సూక్తి, లోకంలో ప్రసిద్ధమైన విషయాలనే కవులు ప్రతిభ వల్ల చమత్కారంగా వినిపిస్తారు.

"తీర్థోదకం చ వహ్నిశ్చనాన్యతః శుద్ధిమర్హతః" నీటినీ, అగ్గినీ శుద్ధి చేసే వస్తువులోకంలో మరొకటి లేదు - అన్నాడు. భవభూతి (ఉ.రా.చ.) నిజమే కానీ, అన్నింటిని శుద్ధిపరచే, దాహికా శక్తిగల, అగ్నిమహిమ భగవదధీనమనడం నిర్వివాదాంశం.

అగ్నిదేవుడు ఖాండవ వనాన్ని కాల్చడానికి శ్రీకృష్ణ భగవానుని చరణాల నాశ్రయించి అనుమతిపొందాడు. గడ్డి పరక కాంచన పాదుకాప్రకాశం వల్ల బంగారమవుతుందని గత శ్లోకం వర్ణించింది.

"శ్రియ మిచ్ఛేద్ధుతాశనాత్" - బంగారమూ, వెండి మొదలైన సంపద నొసగే అగ్నిహోత్రుని శక్తికి భగవత్కాంచన పాదుకానుగ్రహమే మూల కారణమని చిత్రితం.

అంతర్యామిగా ఉన్న భగవంతుడనుగ్రహిస్తేనే గాని అగ్నిదేవుడు గడ్డిపరకను కూడా కాల్చజాలడు.

ఒకప్పుడు భగవదనుగ్రహం వల్ల దేవతలు రాక్షసులను జయించారు.

"అకస్మాకమేవాయం విజయః, అస్మాకమేవాయం మహిమా."

'మాశక్తి చేతనే సాధించిన విజయమిది' అని దేవతలు విర్రవీగినారు. అయ్యో! గర్వం పతనానికి కారణం కదా! అని దయతో యక్షరూపంలో భగవంతుడు దేవతలకు సాక్షాత్కరించాడు. ఇంద్రాదిదేవతలు అగ్నిదేవుణ్ని పురమాయించి, ఆ పూజ్య పురుషుడెవరో తెలుసుకొమ్మని పంపించారు.

యక్షుడు తన ముందుకు వచ్చిన వ్యక్తిని నీ వెవరు? అని అడిగాడు. "పృథివిమీద ప్రతివస్తువును దహించే శక్తిగల జాతవేదసుడ" నన్నాడు.

"తస్మై తృణం నిదధావేతద్ధహేతి । తదుపప్రేయాయ సర్వజవేన, తన్నశశాక దగ్ధుమ్ । స తత ఏవ నివవృతే । నైత దశకం విజ్ఞాతుం యదేత ద్యక్షమితి॥"

(తలవకారోపనిషత్తని నామాంతరం గల "కేనోపనిషత్తు" లోని కథ ఇది - 3 ఖం.6)

యక్షుడు ఒక ఎండిన గడ్డి పరకను అగ్ని దేవుని ముందువేసి 'దీనిని కాల్చు' మన్నాడు. హేళనగాభావించిన జాతవేదసుడు, తన జవసత్త్వాలతో ఎంతయత్నించినా, గడ్డిపరకను దహింపజాలక సిగ్గుపడి మరలి వచ్చాడు. ఆ పూజ్యదేవుడెవరో తెలుసుకొనే శక్తి నాకు లేదని దేవతలకు తెలిపాడు.

ఉత్సవాలలో ప్రాతస్స్నాయ మౌపాసనానంతరం అగ్ని హోత్రునికి శఠారిని సమర్పించడం మర్యాద, గమనీయం.

కాబట్టి, భగవత్కాంచన పాదుకాసంబంధం - స్పర్శ - వల్ల హుతభుక్కు కూడా పునీతుడవుతాడనడానికి భగవంతుడే సాక్షి, అని దేశికుల ఉక్తి వైచిత్రి.

ప్రసిద్ధ విషయానికి విపరీతంగా, బంగారమే అగ్గిని శుద్ధి చేస్తుంది, అని భగవత్సంబంధమనే కారణాన్ని విచారింపజేయడం వల్ల, ఇది విభావనా లంకారం. పృథ్వీ వృత్తం.

*748. తారాసంగ ప్రథిత విభవాం చారుజాంబూనదాభాం*
*త్వా మారూఢ స్త్రిదశ మహితాం పాదుకే! రంగనాథః!*
*సంచారిణ్యాం సురశిఖరిణ స్తస్థుషా మేఖలాయాం*
*ధత్తే మత్తద్విరద పతినా సామ్యకక్ష్యాం సమీక్ష్యామ్ ॥* **18**

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకా! తారా సంగ, ప్రథిత విభవాం = (తార+అసంగ) ప్రణవ స్వరూపుడైన భగవత్సంబంధంచేత; (తారా సంగ) ఆణిముత్యాల కలిమిచేత / నక్షత్రాలతో ఉండడం చేత, ప్రసిద్ధమహిమగల;

చారుజాంబూనద + ఆభాం = మనోజ్ఞమైన బంగారం లాగా ప్రకాశించే; త్రిదశ మహితాం = దేవతలచే కొనియాడబడే; త్వాం = నిన్ను; ఆరూఢః = అధిష్ఠించిన; రంగనాథః = శ్రీరంగనాథుడు; సంచారిణ్యాం = సంచరించనున్న; సురశిఖరిణః = మేరుపర్వతం యొక్క; మేఖలాయాం = కటియందు; తస్థుషా = నిల్చియున్న; మత్తద్విరద పతినా = మదించిన గజరాజు చేత; సమీక్ష్యాం = చూడదగిన; సామ్యకక్ష్యాం = సమానమైన కక్ష్యను / సమాన స్థితిని; ధత్తే = ధరిస్తాడు.

**తా॥** ఓ పాదుకాదేవీ! ప్రణవ స్వరూపుడైన భగవంతుని సంబంధం కలిగి, మంచి ముత్యాల కలిమిచే ప్రసిద్ధమైన సమృద్ధి కలిగి పుత్తడి లాగా ప్రకాశిస్తూ దేవతలచే పూజితవైన నిన్ను అధిరోహించిన శ్రీరంగనాథుడు, రత్నాలతోనూ, చుక్కలతోనూ మిలమిలలాడే బంగారుకొండయైన దేవగిరి (మేరు పర్వతం) యొక్క కటి ప్రదేశాన నిల్చిన మదేభరాజుచే ప్రేక్షణీయమైన గమనశీలంకల సామ్యకక్ష్యను ధరిస్తాడు.

వ్యాఖ్య :- పాదుకకు మేరునగ కక్ష్యతో సాదృశ్యం వర్ణితం

ఆణిముత్యాలూ రత్నాలూ కలిగిన కొండచరియలతో ప్రకాశించే మేరు పర్వతానికి 'రత్నసాను' వని పేరు. చక్కని చుక్కలను వహించేది (సుష్మమినోతి జ్యోతింషి) కాబట్టి 'సుమేరు' వని పేరు కూడా ఉంది. బంగారు వన్నె గల పర్వతం కాబట్టి 'హేమాద్రి' అంటారు. దేవతల నివాసస్థానమైనందువల్ల 'సురాలయ' మని పేరు పొందింది. ఆమేరు పర్వతం యొక్క కటి ప్రదేశంలో గమన శీలం కలిగిన 'అయన రేఖ' - కక్ష్య (movable ringline) ఉంది. మేరు పర్వతానికి ఉన్న లక్షణాలన్నీ దాని కక్ష్యకూ ఉన్నాయి.

ఆమేరునగ కక్ష్యలాగా పాదుకాదేవి ఆణిముత్యాలూ, రత్నాలూ కలిగి బంగారు వన్నెతో ప్రకాశిస్తూ దేవతలచే ప్రశంసింపబడుతుంది. గమన శీలమూకలది కదా! ('తారాసంగ' పదం సభంగశ్లేషకలది). నగమందు ఉండేది. నాగం-గజం. కాబట్టి, మదించిన గజరాజు శ్రీరంగ ప్రభువే. మేరునగంపైన గమనశీలం కలిగి చూడసొంపైన కక్ష్యమీద మదగజ రాజు నిలిచినట్లు, సంచార శీలంకలిగి ప్రేక్షణీయమైన కాంచన పాదుక మీద శ్రీరంగరాజు నిలిచిశోభిస్తుంటాడు.

శ్లేషాను ప్రాణితోపమాలంకారం. మందాక్రాంతావృత్తం.

*749. కనకరుచిరా కావ్యాఖ్యాతా శనైశ్చరణోచితా*
*శ్రితగురుబుధా భాస్వద్రూపా ద్విజాధిప సేవితా!*
*విహితవిభవా నిత్యం విష్ణోఃపదే మణిపాదుకే!*
*త్వమసి మహతీ విశ్వేషాం నః శుభాగ్రహమండలీ॥ 19*

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! కనక రుచిరా = బంగారంచేత ప్రకాశించే / బంగారంలాగా ఎర్రని అంగారకుడున్న; కావ్య+ఆఖ్యాతా = కావ్యాల్లోకీర్తింపబడిన/శుక్రగ్రహం చేత విదితమైన; శనైశ్చరణ + ఉచితా = మెల్లగా సంచరించడానికి యోగ్యమైన /శనైశ్చరునికి తగిన; శ్రితగురుబుధా = ఆశ్రయించిన ఆచార్యులూ,

విద్వాంసులూగల; ఆశ్రయింపబడిన గురువు, బుధుడు కలిగిన; భాస్వత్ + రూపా = కాంతిమంతమైన ఆకారంగల/ సూర్యగ్రహరూపంకలిగిన; ద్విజ + అధిప, సేవితా = బ్రాహ్మణక్షత్రియ వైశ్యులనే ద్విజవరులచే సేవింపబడే/ ద్విజరాజు - చంద్రుని-చేత సేవింపబడే; నిత్యం = ఎల్లప్పుడు; విష్ణోః, పదే = భగవంతుని పాదాలయందు / ఆ కాశమందు; విహితవిభవా = సంపాదిత వైభవంకల; మహతీ = పూజ్యమైన / గొప్పదైన; త్వం = నీవు; విశ్వేషాం, నః=మా అందరికీ; శుభా = శుభమైన; గ్రహమండలీ = గ్రహాల సముదాయ రూపవై; అసి = ఉన్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! బంగారంచే ప్రకాశించే, కావ్యప్రతిపాదితమైన, మెల్లని నడకకు తగిన, ఆశ్రయించిన ఆచార్యులూ తత్త్వజ్ఞులూ కలిగిన, తళతళమనే ఆకారం కలిగిన, త్రైవర్ణిక ప్రముఖులచే సేవింపబడే, ఎల్లప్పుడు శ్రీరంగనాథుని చరణాలయందు సంపాదింపబడిన వైభవంకల, పూజనీయమైన నీవు -

బంగారం లాంటి కాంతిగల అంగారకుడున్న, శుక్రునిచే తెలియబడే, శనైశ్చరునికి తగిన, గురు బుధులచే ఆశ్రయింపబడిన, సూర్యరూపం కలిగిన, చంద్రునిచే సేవింపబడే, నిత్యం ఆకాశమందు విహితవైభవం కల గొప్పదైన, సమస్త జీవులమైన మాకు శుభమైన గ్రహమండలివై ఉన్నావు.

**వ్యాఖ్య :- కాంచన పాదుకాదేవి శుభస్థానమందు ఉండే గ్రహమండలి లాగా అభీష్ట దాత్రి.**

పాదుకాదేవి కనకం చేత ప్రకాశిస్తే అంగారక గ్రహం కనకంలాగా లోహిత వర్ణంతోప్రకాశిస్తుంది. శ్రీమద్రామాయణాదికావ్యాలచే ప్రతిపాదిత పాదుక, 'కావ్య' శబ్దం శుక్రగ్రహాన్ని తెల్పుతుంది. "శుక్రోదైత్య గురుః కావ్యః" (అమరం) పాదుక మెల్లగా నడుస్తుంది. శని గ్రహం ఒక్కొక్క రాశిలో చాలాకాలం ఉంటూ సంచరిస్తుంది. శ్రీమన్నాథ యామున ప్రభృతి పూర్వాచార్యులూ, తత్త్వజ్ఞులైన వాల్మీకి వ్యాసాది మహర్షులూ పాదుకాదేవిని ఆశ్రయించినవారు, గురుబుధులు గ్రహమండలిలో చేరినవారే. భాస్వద్రూపయై ద్విజప్రముఖులచే సేవింపబడేది పాదుక, కాగా సూర్యుడు, చంద్రుడు గ్రహ మండలిలో ప్రముఖులు, "భాస్వ ద్వివస్వత్సప్తాశ్వః" (సూర్యుని పేర్లు - అమరం) "ద్విజరాజః శశధరః" - చంద్రునికి పర్యాయ పదాలు - అమరం) భగవత్పాదాలను అలంకరించేది పాదుకాదేవి. ఆకాశాన్ని అంటె విష్ణుపదాన్ని అలంకరించేది గ్రహపరిషత్తు. "వియద్విష్ణుపదం" (అమరం)

శ్లిష్ట పదాలతో కూడిన రూపకంతో పాదుకాదేవినీ, గ్రహమండలినీ తాదాత్మ్యరంజకంగా వర్ణించారు. శ్రీమద్వేదాంత దేశికులు.

రాహు కేతుగ్రహాలు ఛాయాగ్రహాలు. కాబట్టి పాదుకాదేవి సప్తగ్రహాల సమూహంగా వర్ణింపబడింది. మనం గ్రహమండలినీ పూజిస్తాం. కొంతకాలం మేలునూ, కీడునూ కలిగిస్తాయి గ్రహాలు.

పిపీలికాది బ్రహ్మపర్యంతం జీవులందరికీ యోగక్షేమాలను కలిగించేది పాదుకాదేవి. గ్రహారాధన వల్ల కలిగే ఫలంకంటె, పాదుకారాధన వల్ల, అధిక ఫలం లభిస్తుంది. దేహావసానంలో మోక్షఫలమూ లభిస్తుంది. గ్రహబలంకన్నా పాదుకాదేవ్యనుగ్రహబలం మహత్త్వ పూర్ణం. హరిణీవృత్తం.

750. ప్రజ్వలిత పంచహేతిర్హిరణ్మయీం త్వాం హిరణ్యావిలయార్హః!
ఆవహతుజాతవేదాః శ్రియమివ నః పాదుకే! నిత్యమ్ 20

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! ప్రజ్వలితపంచహేతిః = ప్రకాశించే అయిదు ఆయుధాలుగల / మండుతుండే విస్తారమైన ఐదుజ్వాలలు గల; హిరణ్య విలయ + అర్హః = హిరణ్యనామరాక్షసులనాశనానికి యోగ్యుడైన / బంగారం కరుగడానికి తగినట్టి; జాతవేదాః = వేదవేద్యుడైన శ్రీమన్నారాయణుడు / అగ్నిహోత్రుడు; హిరణ్మయీం = స్వర్ణమయమైన; త్వాం = నిన్ను; శ్రియం, ఇవ = సంపదనువలె, ధనాన్ని వలె; నః = మాకు; నిత్యం = ఎల్లప్పుడు; ఆవహతు = కలిగించుగాక!

**తా॥** ఓ పాదుకాదేవీ! ప్రకాశించే పంచాయుధాలుగల హిరణ్యాసురుల నాశనానికి యోగ్యుడైన, ఉదయించిన వేదాలుగల శ్రీరంగనాథస్వామి కాంచనమయియైన లక్ష్మిని - శోభను - వలె -

మండుతుండే విస్తార జ్వాలలు కల, బంగారం కరుగడానికి అర్హుడైన అగ్ని హోత్రుడు హిరణ్యమయమైన వంపదను వలె -

కనకమయివైన నిన్ను మాకు ఎల్లప్పుడు పొందజేయుగాత.

వ్యాఖ్య :- వీతి హోత్రుడు విత్తాన్ని ఇచ్చే రీతిగా శ్రీరంగనాథుడు

కాంచన పాదుకలను సేవకులకు ప్రసాదించాలి, అని ప్రార్థన. శ్రీరంగనాథుడు "సదా పంచాయుధీం బిభ్రత్." ఎల్లప్పుడు సుదర్శనం, పాంచజన్యం, కౌమోదకి, నందకం, శార్ఙ్గం అనే ఐదు ఆయుధాలను ధరిస్తాడు. పంచాయుధాలు సచేతనంగా ప్రకాశిస్తాయి. భగవత్సంకల్పానుసారం శిష్ట రక్షణార్థం, దుష్టశిక్షణ చేయడానికి ఆయుధాలుగానూ, భగవద్దివ్య మంగళ విగ్రహానికి భూషణాలుగానూ ధగ ధగ ప్రకాశిస్తుంటాయి.

'హేతి' శబ్దానికి ఆయుధమనీ, అగ్నిజ్వాల అనీ నానార్థాలు.

"రవే రర్చిశ్చ శస్త్రంచ వహ్నిజ్వాలా చ హేతయః" (అమరం)

'పంచహేతిః' అంటే "పచి=విస్తారే" అనే ధాత్వర్థాన్ని బట్టి విస్తృత ఆయుధాలు కలవాడు. శ్రీరంగనాథుడు. ఈ అర్థం అగ్గికీ సమన్వయిస్తుంది. పరుల ధన కనక వస్తు వాహనాదులను అపహరించే లోక కంటకులైన హిరణ్య కశిపులాంటి అసురుల నంతమొందించే అర్హత ఆశ్రియః పతికే ఉంది. నరసింహుడవుతాడు.

"జాతాస్త్వదర్థం వేదాశ్చ జాతవేదాస్తతోహ్యసి" (మహాభారతం)

'నీకోసమే వేదాలు పుట్టాయి కాబట్టి, నీవు జాతవేదసుడవు' అని అర్థం. సకల వేద వేద్యుడు, వేద విహిత యజ్ఞాది కర్మలచేత ఆరాధింపదగిన వాడు భగవంతుడు. ఆయన జాతవేదసుడన్న సంజ్ఞకలవాడు, అని తాత్పర్యం. 'ధనం తస్య హరామ్యహం'. క్రూరుల ధనాన్ని ఆశ్రితులకోసం హరిస్తానన్నాడు భగవానుడు. ఆశ్రితులకు లక్ష్మిని ప్రసాదిస్తాడు.

"లక్ష్మీః శ్రీరపిసంపత్తిః పద్మాశోభాప్రియంగుషు" (విశ్వనిఘంటువు)

"శ్రీర్వేషరచనా శోభా సంపత్సరళశాఖిషు ! వాణీ లక్ష్మీ లవంగేషు విషే బిల్వే ఉ. వ్యథత్రిషు॥"

శ్రీ శబ్దానికి 'త్రివర్గ సంపత్తు' అనే అర్థమూ ఉంది.

"లక్ష్మీ సరస్వతీధాత్రీ త్రివర్గసంపద్విభూతి శోభాసు। ఉపకరణ వేషరచనా విశేషేషు చ శ్రీరితి ప్రథితా॥" అని 'వ్యాడి' చెప్పినాడు

"చంద్రాంహిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ"

'హే జాతవేదః! ఓ భగవంతుడా! అందరినీ ఆహ్లాదపరచే బంగారం మొదలైన సర్వధన ప్రచురయైన లక్ష్మిని (అమ్మ ద్వారా నిన్ను ఆశ్రయించే) నాకు ప్రసాదించుము' అని 'శ్రీసూక్తం.' మొదట శ్రియః పతిని ప్రార్థించింది. "యశ్ఛందసామృషభో విశ్వరూపః' మొదల్కొని "తతోమేశ్రియ మావహ" వరకు పేర్కొంది ఉపనిషత్తు.

'వేదాలకు శ్రేష్ఠమైన ప్రణవ స్వరూపా! శరీరాన్ని దృఢంగా ఉంచి ఇంద్రియ పుష్టిని కలిగించి, మేధా సంపత్తిని ప్రసాదించిన తర్వాత తద్వారా భగవత్కైంకర్యానికి తగిన పరికరాలను, వస్తు సామగ్రిని పొందడానికి నిన్ను ఆశ్రయించిన నాకు లక్ష్మి - కలిమి - ని అనుగ్రహించుము' అని అర్థం.

జాతం వేత్తీతి = జాతవేదాః, సమస్తం తెలిసినవాడు పరమాత్ముడు. జాతం వేదః యస్యసః = జాతవేదాః. వేదమనే నిధికలవాడు. భగవంతుడు. అగ్ని పరమైన అర్థమూ ఉంది. జాతాః వేదాః యస్మాత్సః = జాతవేదాః. ఇతనివల్ల వేదాలు పుట్టినాయి కాబట్టి అగ్ని హోత్రుడు జాతవేదుడు. జాతే జాతే విద్యతే = జాతవేదాః. (విద=సత్తాయాం) పుట్టిన దేహమందెల్ల ఉండేవాడు, అగ్నిహోత్రుడు. జాతం వేత్తీతి = జాతవేదాః (విద=జ్ఞానే) శుభా శుభాలనెరిగినవాడు అగ్నిహోత్రుడు.

వేదో హిరణ్యం అస్మాత్ జాతః = జాతవేదాః - వేదశ్శబ్దానికి హిరణ్యం అని అర్థం. హిరణ్యం - శుద్ధ సువర్ణం - అగ్ని వల్ల జనించింది. కాబట్టి జాతవేదుడు - "శ్రియ మిచ్ఛేద్ధుతాశనాత్" అగ్నిహోత్రుని నుంచి ధనం కోరుకోవాలి (అని స్మృతి).

అగ్నిజ్వాల బంగారాన్ని ద్రవింపజేస్తుంది. కాబట్టి అగ్ని హిరణ్యవిలయార్హమయింది.

అగ్ని సప్తజిహ్వుడు.

*"కాళీకరాళీచ మనోజవాచ సులోహితా యాచ సుధూమ్రవర్ణా!*
*స్ఫులింగినీ విశ్వరూపీచదేవీ లేలాయమానా ఇతిసప్త జిహ్వాః* *(ముం.ఉ.)*

హోమ సమయాన పైకి ఎగసి ప్రకాశించే ఏడు (నాలుకలు) జ్వాలలు అగ్నికి ఉంటాయి. 'కాళీ, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరూపి' అని ఏడు జిహ్వాల పేర్లు.

'దక్షస్మృతి' లో ఏడు జ్వాలల పేర్లు ఇలా ఉన్నాయి.

"హిరణ్యాకనకారక్తా కృష్ణా చైవాథసుప్రభా ।

అతిరిక్తా బహురూపా సప్తజిహ్వాప్రకీర్తితాః"

సప్త జిహ్వలు - హోమాగ్నియందు ఉండే స్థానాలు ఇలా ఉన్నాయి:

*"హిరణ్యాపశ్చిమే జిహ్వాకనకామధ్యమేస్థితా!*
*రక్తాచైవోత్తరేజిహ్వా కృష్ణా దక్షిణదిక్ స్థితా!*
*సుప్రభాచైవ పూర్వాయాం, అతిరిక్తాగ్ని దిక్ స్థితా!*
*బహురూపాచశార్వాయాం జిహ్వాస్థానం ప్రకీర్తితమ్"*

అయాకర్మల్లో ఆహుతులు వినియోగింపబడే జిహ్వాస్థానాలు ఇలా ఉంటాయి.

"వివాహే పశ్చిమాజిహ్వా, జాతకర్మణి మధ్యమా ।
ఉత్తరాచోపనయనే పితృకార్యేతు దక్షిణా ॥
సర్వకర్మసు పూర్వాయాం, అభిచారే ఽగ్నిదిక్స్థితా ।
శాంతి కర్మణి శార్వాయాం, స్థానకర్మసమీరితమ్ ॥"

"స్మృతిరత్నం" లోనూ ఇలా ఉంది :-

"వివాహే వారుణీ జిహ్వా, మధ్యమా యజ్ఞకర్మసు ।
ఉత్తరాచోపనయనే, దక్షిణా పితృకర్మసు ॥
పూర్వదిక్సర్వకామేషు, ఆగ్నేయీశాంతికర్మసు ।
ఐశానీ చాగ్నికార్యేషు, ఏతద్ధోమస్యలక్షణమ్ ॥"

"అజ్ఞానాత్ సప్తజిహ్వాసు హోమంయః కురుతేద్విజః ।
హోమో నిష్ఫలతాంయాతి హోతాచనరకం వ్రజేత్ ॥"

ఉగ్రకర్మలకు, శాంతి కర్మలకు ఆగ్నేయ, ఈశాన్య మూలల్లోనే ఆహుతులను వినియోగిస్తారు. ఈ రెండు స్థానాలు అభిచార రూపంకలవి కాబట్టి వీటిని జిహ్మావృత్తులంటారు.

"నిగిరంతో జగత్ప్రాణాన్ ఉద్గిరంతో ముఖైర్విషమ్ ।
దూరతః పరిహర్తవ్యా ద్విజిహ్వా జిహ్మావృత్తయః ॥" (3-10 శ్లో)

దేశికులు అనుగ్రహించిన "సుభాషితనీవి" గ్రంథంలోని 'ఖల పద్ధతి'లో ఉన్న ఈ శ్లోకానికి 'శ్రీ పుట్టప్పాస్వామి వ్యాఖ్యానం చూడదగినది.

ముఖ్యంగా నాలుగు దిక్కులయందు నాలుగు జ్వాలలు, మధ్యన ఒక జ్వాల; ఇలా పంచహేతి యుక్తుడు అగ్నిహోత్రుడు. అగ్నికి విశేషణంగా ఉన్న "ప్రజ్వలిత పంచహేతిః" శ్రీరంగనాథునికీ సమన్వయిస్తుందికదా!

హిరణ్మయియైన పాదుకాదేవియే ముఖ్యసంపద. "సాహిశ్రీరమృతాసతామ్" ఋక్సామ యజుర్వేదాలనబడే 'త్రయీవిద్య' యే 'శ్రీ' శబ్దార్థంగా ప్రతిపన్నం.

"నీంగాదశెల్వం నిఱైందు" - గోదాదేవి అన్నట్లు, శ్రియః పతినిప్రార్థిస్తే తరుగని సంపద నిండుగా ఉంటుంది, అని శ్లోకార్థం సుసంపన్నం.

శ్లేషానుప్రాణితమైన ఉపమాలంకారం. ఆర్యా వృత్తభేదం.

**కాంచన పద్ధతి సమాప్తి.**

# ౨౩. శేష పద్ధతి

*751.* సృష్టాం భూమావనంతేన నిత్యంశేషసమాధినా ।
అహం సంభావయామి త్వా మాత్మానమివపాదుకే ॥ 1

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! అనంతేన = అనంతునిచేత (భగవంతునిచేత / ఆదిశేషునిచేత / అనంతసూరిచేత) భూమౌ = భూలోకమందు; నిత్యం = ఎల్లకాలం; శేషసమాధినా = శేష - దాస్య - భావనతో; సృష్టాం = సృజింపబడిన; త్వాం = నిన్ను; అహం = నేను; ఆత్మానం, ఇవ = జీవాత్మనువలె / తనను వలె; సంభావయామి = తలుస్తున్నాను.

**తా॥** ఓ పాదుకాదేవీ! శేషునిచేత ఎల్లప్పుడు శేషుడు అని సమర్థించడంతో భూమియందు సృజింపబడిన నిన్ను, శ్రీరంగనాథునిచేత శాశ్వతంగా దాసభావ సమర్థనంతో జగత్తులో పుట్టింపబడిన జీవాత్మునిగా నేను సంభావిస్తాను.

**రమణీయ వ్యాఖ్య :- అనంతుడు భగవత్పాదసేవకు తగిన చిహ్నంగా ఉండే పాదుకా రూపంగా సృజింపబడినాడని శ్లేషతో ఉత్ప్రేక్షితం**

పాదుకా మూర్తిని వర్ణించిన తర్వాత ఆమూర్తిలో ఉన్న ఆత్మ-జీవుడు - ఎవరని విచారిస్తే, సాక్షాత్తుగా శేషుడే అని తెలియజేయడం 'శేషపద్ధతి'.

(1) ఆదిశేషుడు పాలకడలిపైన శ్రీమన్నారాయణునికి తల్పంగా ఉన్నవాడు. భగవంతుని సంచారార్థమైన సేవచేయడం కోసం శేషుడే పుడమిపై పాదుకా రూపమెత్తాడు.

"సమాధిర్నియమేధ్యానే నివాసేచ సమర్థనే" (విశ్వనిఘంటువు)

ఈ పాదుక 'ఆదిశేషుడే' అని సమర్థించే విధంగా, శేషుడు తన ఆకారాన్ని మారుస్తూ ఎల్లకాలం దాస్య లక్షణ లక్షితుడవుతాడు.

(సృష్టం ఆత్మానమివ - అని లింగం మార్పు).

(2) "అనంతః శేషవిష్ణ్వోః స్యాత్" (వి.ని.) సర్వశేషియైన భగవంతుడే తన సంకల్పంచేత, లీలా విభూతిలో శేషునిగా ఉంటానని తననే సృజించుకొన్నాడు. కాబట్టి శేషుడూ అనంతుడే అని మరో అర్థం.

(3) అవిభజ్యాత్మనా ఽ ఽచార్యం వర్తే తాస్మిన్యథా ఽచ్యుతే".

ఆచార్యుడు వేరు, సర్వేశ్వరుడు వేరు అని విభజించక, ఆచార్యులను భగవంతునిలాగా భావించవలెనని శాస్త్రం.

దేశికులవారు 'ఆత్మానం' అంటే 'తనను' అన్న అర్థాన్ని గ్రహించారు. 'సమాధి' పదానికి ధ్యానం, వాసస్థానం అనే అర్థాలున్నాయికదా!

ఆదిశేషునిగా భావింపబడే శేషాద్రి మీద ఉంటూ, ధ్యాన పరాయణుడైన అనంత సూరిచేత, శేషాచలవాసియైన శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహంవల్ల నేను సృజింపబడినాను. అందువల్ల, నీకూ నాకూ అనంతశేష సమాధి సృష్టత్వం సమానమే. ఈనాటికి పాదుకా సామ్యంతో నేను ధన్యుడనయ్యాను, అని దేశికులవారు తన అవతార రూపాన్నీ వెల్లడించారు.

ఈ శ్లోకంలో నిత్యసూరియైన ఆదిశేషుణ్ని ఉత్కృష్టవస్తువుతో పోల్చి వర్ణించడానికి మారుగా, జీవ సమష్టితో సాదృశ్యంగా వర్ణించడం ఉచితమా? అని విచారిస్తే, పాదుకలు అచేతనం కాబట్టి, అచేతనంకంటె ఉత్కృష్టచేతన సాదృశ్య వర్ణనం సముచితమే. అంతేకాదు.

"స్రగ్వస్త్రాభరణైర్యుక్తం స్వానురూపైరనూపమైః ।

చిన్మయైః స్వప్రకాశైశ్చ స్వాన్యోన్య రుచిరంజకైః ॥" అన్నట్లు శ్రీ మన్నారాయణుడు ధరించే హారాలు, ఉడుపులు, అలంకారాలు అన్నీ స్వయంగా ప్రకాశించే చేతన కోటిలో చేరినవే కదా!

మరొకశంక :- సన్నివేశ రేఖాది పద్ధతులను వర్ణించిన తర్వాత శేషాను ప్రవేశాన్ని చూపే 'శేషపద్ధతి'ని వర్ణించడం తగును కానీ మధ్యన వర్ణించడం తగునా?

మహాభూతాల సృష్టిని పేర్కొని, అవి దేహాకారంగా పరిణమించే సమకాలంలోనే జీవాను ప్రవేశం జరుగుతుందన్నాయి ఉపనిషత్తులు : "తోయేనజీవాన్ వ్యచసర్జభూమ్యామ్"

జగత్తులో తోయశబ్దంచేత ఉపలక్షితాలైన భూతాలతో కూడా బ్రహ్మాది జీవులను సృజించాడు శ్రీమన్నారాయణుడు. "అనేన జీవేనా ఽ ఽత్మనా ఽను ప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి".

రూప శబ్దంచేత చెప్పదగిన అవయవ సంస్థానాన్ని పొందడానికన్న ముందే జీవాను ప్రవేశం చెప్పబడింది. అలాగే ఇక్కడ సన్నివేశ సంపత్తి కంటెముందు శేషానుప్రవేశమని 'శేషపద్ధతి' వెల్లడిస్తుంది. దేహారంభకమైన మహాభూత సృష్టిని చెప్పిన తర్వాత జీవప్రస్తావనలాగా, నానామణికాంచన రూపమైన పాదుకారంభకాంశను నిరూపించిన పిమ్మటనే కదా! శేష ప్రస్తావన. కాబట్టి సర్వం సమంజసం. అనుష్టుబ్ఛందం.

*752. పద్మా భోగాత్ పాదుకే! రంగభర్తుః*
*పాదస్పర్శాత్ భోగ మన్యం ప్రపిత్సోః ।*
*శేష స్సైకాం భూమికా మబ్రవీత్త్వా*
*మాచార్యాణా మగ్రణీ ర్యామునేయః ॥* 2

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! ఆచార్యాణాం = ఆచార్యులలో; అగ్రణీః = శ్రేష్ఠుడైన; యామునేయః = యామునాచార్యులు; త్వాం = నిన్ను; రంగభర్తుః = శ్రీరంగరాజుయొక్క; పాదస్పర్శాత్ = చరణస్పర్శవల్ల; పద్మాభోగాత్ = లక్ష్మీదేవి పొందే సుఖంకంటె; అన్యం = వేరైన; భోగం = సుఖాన్ని / శరీరాన్ని; ప్రపిత్సోః = పొందగోరే; శేషస్య = ఆదిశేషునియొక్క; ఏకాం = ఒక; భూమికాం = రూపంగా; అబ్రవీత్ = చెప్పినాడు.

**తా॥** ఓ పాదుకా! ఆచార్య వర్యుడైన శ్రీ యామునాచార్యులు శ్రీరంగపతిపాద స్పర్శవల్ల, లక్ష్మికి కల్పింపబడిన సుఖానుభవం కంటె వేరైన సుఖాన్ని / శరీరాన్ని పొందగోరే శేషుని ఒక విధమైన వేషంగా నిన్ను ప్రవచించారు.

## వ్యాఖ్య :- యామునాచార్యులు పాదుకను శేషుని మూర్త్యంతరమన్నారని వర్ణన

శ్రీమద్రామానుజాచార్యులు, కూరేశులు, రామమిశ్రులు, మహాపూర్ణులు మొదలైన ఆచార్యులకన్న పూర్వాచార్యులు శ్రీమద్యామునాచార్యులు. శ్రీమన్నాథమునులకు వీరు పౌత్రులు, ఈశ్వరమునులకు పుత్రులు. అత్యంత దురవగాహమైన వేదాంతార్థాలు అందరికి సుబోధకమయ్యే లాగా శ్రీ యామునాచార్యులు సంస్కృతంలో 'స్తోత్రరత్నం' కృపచేశారు. దీనికి 'ఆళవందార్ స్తోత్రం' అని ప్రసిద్ధి.

"నివాసశయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతపవారణాదిభిః ।
శరీరభేదైస్తవ శేషతాంగతై ర్యథో చితంశేష ఇతీర్యతేజనైః॥"

'ఆదిశేషుడు శ్రియః పతికి దాస్యంచేసే భావంతో ఇల్లు, పడక, పీఠం, పాదుకలు, పీతాంబరం, దిండు, ఛత్రం మొదలైన ఆకారాలను ఆయాకాలానికి తగినట్లు ధరిస్తూ జనులచే 'శేషు'డని యోగరూఢంగా వ్యవహరింపబడుతాడని శేషుని వృత్తి విశేషాలను విశదపరచే శ్లోకమిది.

"శేషః పరార్థత్వాత్" (పూ.మీ. 3-1-2 సూ) "పరగతాతిశయా
ధానేచ్ఛయోపదేయత్వమేవ యస్యస్వరూపం సశేషః".

'ఎవడు స్వార్థమెరుగని తన శరీరాన్ని పరుని-శ్రియఃపతి-కే అతిశయం చేకూర్చడానికి ఉపయోగిస్తాడో, అతడే శేషుడు'' అని భగవద్రామానుజులు వేదార్థ సంగ్రహం లో వివరించారు.

పాపతేడు, శ్రీశ్రియః పతుల సౌకుమార్యానికి అనుగుణంగా శైత్య సౌరభ్య మార్దవాలు గల తన విగ్రహమందలి సహస్రఫణా మణిమండల కాంతులచేత ప్రకాశించే దివ్యాంతఃపురంలోని పాన్పుగా ఏర్పడి పరిచర్య చేసేవాడు. భగవంతునికి సెజ్జగా ఉన్నప్పుడు లక్ష్మీదేవి పాదసంవాహనం చేయడంవల్ల, ఆమెతోపాటు ఆదిశేషుడు కూడా సుఖాన్ని పొందగోరేవాడు. కాని ఆ సుఖం స్వల్పమైనది. అంతకన్న అధికమైన సుఖాన్ని శేషి అనుభవించాలనుకొని, భగవంతుడు సంచరించే వేళల్లో పూర్ణపాద స్పర్శ మూలకమైన పాదుకారూపాన్ని ధరించాడు శేషుడు.

"అబ్రవీత్" - ఆచార్యులు శేషుని వేషాంతరమన్నారని శబ్దప్రమాణాన్ని చెప్పడంవల్ల ఇది శబ్దాలంకారం.

"భోగః సుఖేధనే చాహేఃశరీర ఫణకాయయోః" (వి.ని.) 'భోగ' శబ్ద ప్రయోగంవల్ల ఇది శ్లేషాలంకారం.

"ఆచార్యాణా మగ్రణీర్యామునేయః" - భగవచ్ఛాస్త్రం పాంచరాత్రంకంటె గుణోత్కర్ష వ్యంజకమైన పరమాచార్య సూక్తియందు మాకున్న ఆదరం దండిది - అనే అభిప్రాయాన్ని బట్టి, ఇది పరికరాలంకారం. శాలినీవృత్తం.

*753. శేషత్వమంబ! యది సంశ్రయతిప్రకామం*
*త్వద్భూమికాం సమధిగమ్య భుజంగరాజః ।*
*త్వామేవ భక్తివినతై ర్వహతాం శిరోభిః*
*కాష్ఠాంగతం తదిహ కేశవపాదరక్షే ॥ 3*

**అర్థం:-** హే అంబ! కేశవ పాదరక్షే = ఓ తల్లీ! కేశవ పాదుకా! భుజంగరాజః = సర్పరాజైన ఆదిశేషుడు; త్వత్ + భూమికాం = నీ వేషాన్ని; సమధిగమ్య = ధరించి; శేషత్వం = దాస్యాన్ని; ప్రకామం = చాలా ఎక్కువగా; యది, సంశ్రయతి = పొందుతున్నట్లైతే; త్వాం, ఏవ = నిన్నే; భక్తి వినతైః = భక్తిచే వంచిన; శిరోభిః = తలలచేత; వహతాం = ధరించేవారికి; ఇహ = ఈలోకమందు; తత్ = ఆశేషత్వం; కాష్ఠాం = ఉన్నతస్థితిని; గతం = పొందింది.

**తా॥** ఓ జననీ! కేశవపదావనీ! సర్పరాజు నీ రూపాన్ని దాల్చి అధికంగా దాస భావాన్ని పొందితే, నిన్నే భక్తితో వంచిన తలలచే మోసేవారికి ఈ లోకంలో ఆదాసభావం ఉత్కర్షను పొందింది.

**వ్యాఖ్య :-** పాదుకకు గల శేషత్వంకంటె పాదుకలను శిరసావహించే వారికి గల శేషత్వం శ్రేష్ఠమని వర్ణితం

ఆదిశేషుడు భగవత్పర్యంక భోగానుభవరూపదాస్యంకంటె తత్పాదాలకు ఆభరణంగా ఉండే రత్న ఖచిత సువర్ణపాదుకారూపాన్ని ధరించి విహారయోగ్యమైన భగవద్దాసభావాన్ని అధికంగా వహిస్తాడు. లోకంలో భగవత్పాదుకలనే భక్తులు శిరసావహిస్తుంటే జనుల శేషత్వాన్ని గురించి చెప్పేదేముంది?

"కాష్ఠోత్కర్షేస్థితౌదిశి" (అమరం) ఉత్కర్ష, మర్యాద, దిక్కు అని 'కాష్ఠ' శబ్దార్థాలు. పాదుకాత్మయైన శేషుని భగవచ్ఛేషత్వంకన్న పాదుకాదాసుల భగవచ్ఛేషత్వమే మిన్న - అనడం కైముత్య సిద్ధం - కావ్యార్థాపత్త్యలంకారం. వసంతతిలక.

*754. మాభూదియం మయినిషణ్ణ పదస్య నిత్యం*
*విశ్వంభరస్య వహనా ద్వ్యథితేతి మత్వా ।*
*ధత్సే బలాభ్యధికయా మణిపాదుకే! త్వం*
*శేషాత్మనా వసుమతీం నిజయైవ మూర్త్యా ॥ 4*

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! ఇయం = ఈ భూమి; మయి = నామీద; నిషణ్ణపదస్య = మోపబడిన చరణాలుగల; విశ్వంభరస్య = విశ్వాన్ని భరించేభగవంతుణ్ని; నిత్యం = సర్వకాలం; వహనాత్ = మోయడంవల్ల; వ్యథితా = పీడింపబడినది; మాభూత్ = కాకూడదు; ఇతి = అని; మత్వా = తలచి; త్వం = నీవు; బల+అభ్యధికయా = బలమెక్కువగా నున్న; శేష +ఆత్మనా = ఆదిశేష స్వరూపమైన; నిజయా = స్వకీయమైన; మూర్త్యా, ఏవ = శరీరంచేతనే, వసుమతీం = భూమిని; ధత్సే = ధరిస్తున్నావు.

తా॥ ఓ మణిపాదుకా! ఈభూమి నామీద అడుగుపెట్టిన విశ్వంభరుణ్ని నిత్యం మోయడంవల్ల పీడింపబడినది కాకూడదని తలచి అధిక బలశాలియైన ఆదిశేషాకారమైన స్వీయరూపంతోనే భూమిని ధరిస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకాదేవియే పాతాళంలో శేషరూపంతో భూమిని మోస్తుందని ఉత్ప్రేక్షితం

అండపిండ బ్రహ్మాండాలను మోసేవాడు విశ్వంభరుడు. ఆవిశ్వంభరుణ్ని మోసేది పాదుకాదేవి. ఆ పాదుకాదేవిని మోసేది భూదేవి.

"ప్రకృష్ట విజ్ఞాన బలైకధామని" అధిక జ్ఞానానికి, బలానికి ముఖ్యస్థానమైనవాడు ఆదిశేషుడు - అన్నారు ఆళవందార్.

విశ్వంభరుణ్ని ఎల్లకాలం మోయడంవల్ల భూదేవికి కలిగే శ్రమను తొలిగించడానికి పాదుకాదేవి తనదైన శేషరూపంతో భూమిని మోస్తుందని కవికేసరి సంభావించారు.

"ఆదౌజగదాధారః శేషః" - అని కదా ఆర్యోక్తి. విశ్వంభరుణ్నిమోసే ధరణికి ఆధారమైన శేషరూపంవల్లనూ, పరంపరగా భగవచ్ఛేషత్వం సురక్షితమే. వసంత తిలకావృత్తం.

755. తత్తాదృశా నిజబలేన నిరూఢకీర్తిః
శేషస్తవైవ పరిణామ విశేష ఏషః ।
రామేణ సత్యవచసా యదనన్యవాహ్యం
వోఢుం పురావసుమతీం భవతీ నియుక్తా ॥ 5

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకా దేవీ! తత్+తాదృశా = ఆవిధంగా ప్రసిద్ధమైన; నిజబలేన = తనబలంచేత; నిరూఢకీర్తిః = శాశ్వతమైన యశస్సుకలిగిన; ఏషః = ఈ; శేషః = ఆదిశేషుడు; తవ = నీ యొక్క; పరిణామ విశేషః; ఏవ = మరొక మూర్తియే. యత్ = ఎందుకంటే; సత్యవచసా = సత్యవాక్కుగల; రామేణ = శ్రీరామునిచేత; అనన్యవాహ్యం = ఇతరులచేత ధరింపశక్యంకానట్టి; వసుమతీం = భూమిని; వోఢుం = వహించడానికి; భవతీ = నీవు; పురా = మునుపు; నియుక్తా = నియమింపబడినావు.

తా॥ ఓ మణిపాదుకా! అలాంటి స్వీయబలంచేత స్థిరమైన కీర్తిగల ఈ ఆదిశేషుడు నీమారు రూపమే. కాబట్టి, ఇతరులచే మోయరాని భూమిని వహించడానికి నీవు పూర్వం సత్యసంధుడైన శ్రీ రామచంద్రస్వామిచే నియోగింపబడినావు.

వ్యాఖ్య :- బుద్ధిబలమున్న పాదుకాదేవిని శ్రీరాముడు రాజ్యమేల నిచ్చాడని వర్ణితం

ఆదిశేషుడు బలశాలికానీ పాదుకాదేవి నిర్బల కదా! అని అనుమానించరాదు. అనిర్వచనీయమైన స్వరూప ప్రకారంతో కూడిన ఆదిశేషుడు విజ్ఞాన బలైకధాముడేకదా! పాదుకకూ శేషునికీ శరీరం మాత్రమే భేదం.

ఇర్వురి జీవనాడి ఒక్కటే కాబట్టి పాదుకాదేవికి కూడా జ్ఞానబలాలు స్థిరంగా ఉన్నందువల్లనే శ్రీరాముడు పాదుకలను భూభారవహనార్థం భరతునికి ఇచ్చాడు. పతంజలి, శఠకోపసూరి, యతీంద్ర రూపాలలోనూ జ్ఞానాధిక్యతకు కొరతయే లేదుకదా!

'సత్యవచాః' - శ్రీరాముడు పాదుకలకు రాజ్యమిస్తాననలేదు. వనవాస వాక్కును పాలించినందువల్ల దాశరథి సత్యవచస్కుడని ప్రయోగింపబడిందనుకుంటే ఆ సత్యవాక్కుకు ఇక్కడ సంబంధంలేదు.

భరతుని ప్రార్థనవల్ల, వసిష్ఠుని ఆదేశంవల్లనూ శ్రీరాముడు హేమపాదుకలమీద ఎక్కి, దిగి భరతునికి వాటిని ఇచ్చాడు. వసిష్ఠుని, భరతుని మాట శ్రీరామునిచే సత్యంగా పాటింపబడింది. కాబట్టి శ్రీరాముడు సత్యవచస్కుడు. మరో విధం -

"ససైన్యం భరతం హత్వా భవిష్యామి న సంశయః"

భరతుడు పరివారంతో చిత్రకూటానికి వస్తున్నప్పుడు లక్ష్మణుడు క్రుద్ధుడై 'సైన్యంతోపాటు భరతుణ్ని చంపితీరుతా'నన్నాడు. శ్రీరాముడతనికి తత్త్వముపదేశిస్తూ చివరకన్న మాట ఇలా ఉంది.

"ఉచ్యమానో ఽపిభరతో మయా లక్ష్మణ తత్త్వతః ।
రాజ్యమస్మైప్రయచ్ఛేతి బాఢమిత్యేవ వక్ష్యతి" ॥ (రా.అయో. 97 స.)

"ఓ లక్ష్మణా! నేను యథార్థంగా భరతునితో 'రాజ్యం ఇతనికి (లక్ష్మణునికి) ఇ'మ్మని చెప్పితే అతడు 'సరె' అని అంగీకరింపగలడు". ఈమాట సత్యమే అయిందికదా!

'తత్త్వతః' - జగదాధారుడైన ఆదిశేషుని అవతారమే - పాదుకా పరిణామ విశేషమే - లక్ష్మణుడు. "ఆదౌజగదాధారః శేషః, తదనుసుమిత్రానందనవేషః".

"శేషోహవై ..... భగవంతం బహుధా విప్రీయమాణః అఖిలేన స్వేన రూపేణ యుగే యుగే తేనైవ జాయమానః సఏవసౌమిత్రిరైక్ష్వాకః" (కృష్ణోపనిషత్- ౨ ఖం).

'శేషుని శరీరభేదమే పాదుక' అన్న పూర్వార్ధాన్ని ఉత్తరార్థం సమర్థించడంవల్ల ఇది కావ్యలింగాలంకారం. వసన్త తిలకము.

*756. శేషత్వ సీమనియతాం మణిపాదరక్షే !*
*త్వామాగమాః కులవధూమివ బాలపుత్రాః ।*
*త్వద్రూప భేదశయితస్య పరస్య పుంసః*
*పాదోపధాన శయితా ముపధానయంతి ॥* 6

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! శేషత్వ సీమనియతాం = పారతంత్ర్యం యొక్క మర్యాదపట్ల స్థిరంగా ఉన్న; త్వత్ + రూపభేదశయితస్య = నీ మరో రూపమైన శేషునియందు పవళించిన; పరస్య, పుంసః = పరమ పురుషుని యొక్క; పాద + ఉపధానశయితాం = చరణాలు అనే దిండుమీద పడుకొనే; త్వాం = నిన్ను; ఆగమాః = వేదమూలకశాస్త్రాలు; బాలపుత్రాః = శిశువులైన సుతులు; కుల వధూం, ఇవ = కులకాంతను - తల్లిని వలె; ఉపధానయంతి = దిండుగా చేస్తాయి.

తా॥ ఓ మణిపాదుకా! పారతంత్ర్య సీమయందు వ్యాప్తవైన, నీ మారురూపమైన శేషునియందు పవళించిన శ్రీరంగనాథుని చరణాలనే దిండుమీద పవళించే నిన్ను ఆగమాలు, బాలురైన పుత్రులు పతివ్రతనువలె, ఆశ్రయిస్తాయి.

వ్యాఖ్య :- పారతంత్ర్యమందు ప్రతిష్ఠితయైన పాదుకాదేవిని ఆగమాలు ఆశ్రయిస్తాయి

పాదుకాదేవి ఏరూపంలో ఉన్నా దాస్యమే స్వరూపంగా ప్రకాశిస్తుంది. శ్రీరంగనాథునికి శయ్యగానూ, పాదుకారూపంగానూ ఉంటుంది. వేర్వేరు రూపాలతో స్థిరంగా ఉన్నా భగవత్పాదాలకడ దిండుగానూ ఉంటుంది. లక్ష్మణుని రూపంలో ఉన్నా శ్రీరాముని పాదుకారూపం సుప్రతిష్ఠితమే కదా! విడిచి భరతుని కర్పించినప్పటికి, పాదుకాదేవి శ్రీరామునికి శేషభూతగానే ఉంది. అలాగే శేషశాయియైన శ్రీరంగపతి పాదాలనే దిండుగా ఆశ్రయించి పాదుకాదేవి, కాళ్ళకడ పడుకొనే పతివ్రతలాగా ఉంది. పిల్లలు తల్లినే ఆశ్రయించేరీతిగా పాదుకాసంచార వేళల్లో వేదాలు ఘోషిస్తూ వెంటబడుతాయి. వేదమూలకమైన పాంచరాత్రాది శాస్త్రాలు శేషత్వ మర్యాదను పాటిస్తున్నాయి.

"త్వద్రూప శేషశయితస్య" అని పాఠాంతరం.

ఉపమాలంకారంవల్ల వస్తుధ్వని గమనీయం. వసంతతిలకావృత్తం

*757. భరతశిరసి లగ్నాం పాదుకే! దూరత స్త్వాం*
*స్వతను మపి వవందే లక్ష్మణః శేషభూతః ।*
*కి మిద మిహ విచిత్రం నిత్యయుక్తః నిషేవే*
*దశరథ తనయస్సన్ రంగనాథః స్వమేవ ॥* 7

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకాదేవీ! లక్ష్మణః = లక్ష్మణుడు; శేషభూతః = శేషుడై (దాసుడై); భరతశిరసి = భరతుని తలమీద; లగ్నాం = అమరియున్న; త్వాం = నిన్నుగూర్చి (నీకు); స్వతనుం, అపి = తనదేహమే అయినను; దూరతః = దూరం నుంచి; వవందే = నమస్కరించాడు. ఇదం = ఇది (తన రూపాంతరానికి తాను నమస్కరించడం) ఇహ = ఈ లోకమందు; కిం, విచిత్రం = ఆశ్చర్యమేమి? నిత్యయుక్తః = ఎల్లప్పుడు దగ్గరగా ఉన్న; రంగనాథః = శ్రీరంగనాథుడు; దశరథ తనయః సన్ = దశరథరాజ పుత్రుడై; స్వం, ఏవ = తననే; నిషేవే = సేవించాడు.

తా॥ ఓ పాదుకాదేవీ! శేషావతారుడైన లక్ష్మణుని శరీరమే నీవుకదా! అయినా, భరతుని శిరస్సున ఉన్న నీకు ఆయన నమస్కరించాడు. సదాసన్నిహితుడైన శ్రీరంగనాథుడు శ్రీరాముడుగా అవతరించి తనను తానే సేవించాడు. ఇది లోకంలో ఆశ్చర్యమా? కాదు.

వ్యాఖ్య :- ప్రకృతిలో రూపాంతరంగా ఉన్న తనకు తానే నమస్కరించడం వర్ణితం

ఆదిశేషుడు లోకంలో లక్ష్మణుడుగా అవతరించాడు. శేషుని మారురూపమే పాదుకా స్వరూపం. భరతుడు నందిగ్రామం నుంచి పాదుకలను శిరసావహించి శ్రీరామచంద్రస్వామికి అర్పించడానికి తెస్తుంటే, లక్ష్మణుడు దూరంనుంచి చూచి పాదుకలకు నమస్కరించాడు. రామాయణం పురావృత్తం.

అభినయోచితమైనది ప్రకృతి మండలం. పూజ్యస్థానంలో ఉన్న శ్రీరామపాదుకలకు లక్ష్మణుడు, తనరూపాంతరమే అయినా, ప్రణమిల్లడం స్వరూపదాస్యలక్షణం. ఇది వింతకాదు, విడ్డూరమూకాదు.

నిత్యసూరియుక్తుడైన శ్రీరంగనాథుడు శ్రీమహావిష్ణువు యొక్క అర్చావతారమే. "తామర్చయేత్, తాంప్రణమేత్, తాంయజేత్తాం విచింతయేత్" అని శాస్త్రం.

ఇక్ష్వాకు కులదైవమై, సదా సమీపమందున్న శ్రీ రంగనాథుణ్ని విభవావతారుడైన శ్రీరాముడు నిత్యకర్మానుష్ఠానపరుడై భక్తితో సేవించాడు. రాముడూ నిత్యయుక్తుడే. అయుక్తకార్యరహితుడు, నిత్యసూరి యుక్తుడనీ అర్థం.

వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరః పుమాన్ । విష్ణురారాధ్యతే" అన్నట్లు వర్ణ, ఆశ్రమ ధర్మాలను ఆచరించే వ్యక్తిచేసే పనులన్ని విష్ణ్వారాధనే కదా!

"శత్రుఘ్నః చక్రరాట్ స్వయమ్ । భరతః శంఖనామకః । సాక్షాల్లక్ష్మ ణోధరణీధరః"।
(తారసారోపనిషద్వాక్యాలు) "కైకేయ్యాం భరతోజజ్ఞే పాంచజన్యాంశచోదితః
అనంతాంశేన సంభూతో లక్ష్మణః పరవీరహా । సుదర్శనాంశాచ్ఛత్రుఘ్నః సంజజ్ఞే ఽమిత విక్రమః". (పద్మపురాణం).

పాంచజన్యాంశతో భరతుడు, చక్రాంశవల్ల శత్రుఘ్నుడు, శేషాంశవల్ల లక్ష్మణుడు అవతరించాడు.

"శంఖచక్ర గదాఖడ్గ శార్ఙ్గాద్యైర్తే తిభి స్సహా । పరీతః పురుషాకారైః పరిరక్షతే". శ్రుతిస్మృతులు బోధించినట్లు, విష్ణువు అవతరించినప్పుడు ఆయన పరివారమూ, పరికరాలూ, అన్ని పురుషాకారాలు వహించి ఆయనను సేవిస్తుంటాయి.

"నత త్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే." శ్రుతి పలికినట్లు, తనకు సమానుడే లేనప్పుడు తనకంటె గొప్పవాడు లేనేలేడుకదా!

శేషత్వమేలేని, శేషియైన శ్రీరాముడే, తనను తానే సేవిస్తూ స్వశేషత్వమందు ప్రవర్తిస్తుంటే, శేషస్వభావుడైన లక్ష్మణుడు, తన మూర్త్యంతరమైన పాదుకలకు వందనమాచరిస్తూ, స్వశేషత్వమందు ప్రవర్తించడం ఆశ్చర్యంకాదు. కావ్యార్థా పత్త్యలంకారం. మాలినీవృత్తం.

*758. భూయోభూయః స్తిమితచలితే యస్య సంకల్పసింధౌ*
*బ్రహ్మేశాన ప్రభృతయఇమే బుద్బుదత్వం భజంతి ।*
*తస్యా నాదే ర్యుగ పరిణతౌ యోగనిద్రానురూపం*
*క్రీడాతల్పం కిమపితనుతే పాదుకే! భూమికాఽన్యా ॥ 8*

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా దేవీ! భూయః, భూయః = మళ్ళీమళ్ళీ; స్తిమిత చలితే = నిశ్చలమై చలించే; యస్య = ఎవనియొక్క; సంకల్ప సింధౌ = సంకల్పరూపమైన సముద్రమందు; బ్రహ్మ+ఈశాన ప్రభృతయః = విరించి, విరూపాక్షుడు మొదలైన; ఇమే = వీరు; బుద్బుదత్వం = నీటి బుడుగల భావాన్ని;

భజన్తి = పొందుతుంటారో; అనాదేః = పుట్టుకలేని; తస్య = ఆ భగవంతునికి; యుగపరిణతౌ = ప్రళయకాలమందు; యోగనిద్రా + అనురూపం = ధ్యానరూపమైన నిద్రకు యోగ్యమైన; కిం, అపి = ఒక విలక్షణమైన; క్రీడాతల్పం = లీలకోసం (వటపత్ర) శయ్యగా; (తే=నీకు) అన్యా = మరొక; భూమికా = రూపం; తనుతే = ఉంటుంది.

**తా॥** ఓ పాదుకాదేవీ! మళ్ళీ మళ్ళీ నిశ్చలమై, చలించే ఎవని సంకల్పమనే సముద్రమందు, ఈ సంసారులైన చతుర్ముఖ, ఈశానాదులు నీటి బుడుగల భావాన్ని పొందుతుంటారో, పుట్టుకయే లేని ఆ భగవంతునికి యుగకాలం మారినప్పుడు యోగనిద్రకు తగిన; లీలార్థమైన సెజ్జను నీ మరో శరీరం చేస్తుంది.

వ్యాఖ్య :- ప్రళయకాలంలో పాదుకాదేవి భగవంతునికి వటపత్రశయ్యగా పరిణమిస్తుందని రూపకోదాత్తంగా వర్ణితం

భగవత్సంకల్పమే మహాసముద్రం. అది ప్రళయకాలంలో ఏవ్యాపారమూ లేనందువల్ల నిశ్చలంగా ఉంటుంది. సృజనాత్మక వ్యాపారమున్నప్పుడు గొప్ప కెరటాలరూపంలో కడలి హోరెత్తుతూ చలిస్తుంది. అందువల్ల, నీటిబుడుగలు పుట్టడం, చితికి పోవడం మళ్ళీ మళ్ళీ జరిగే ప్రక్రియ.

"ధాతాయథా పూర్వమకల్పయత్" - "మాతీమాతీప్పలప్పిరప్పుమ్" - అనే వేదాంతవాక్యాలవల్ల, భగవత్సంకల్పంచేత బ్రహ్మరుద్రాదులూ పలుమార్లు ప్రకృతి మండలంలో పుట్టుతారు, గిట్టుతారు. నీటి బుడుగల్లాగా వారూ క్షణభంగురులే.

పుట్టుకలేని వాడు శ్రీమన్నారాయణుడు. ప్రళయకాలంలో జీవ, ప్రకృతుల ధారక పోషక భోగ్యరూపమైన చింతన అనే యోగనిద్రను అనుష్ఠిస్తాడు.

అన్యా భూమికా :- వేరువేషం. నిత్య సూరియైన ఆదిశేషుడు భగవంతునికి సర్వదా సేవచేస్తుంటాడు. నిద్రకు యోగ్యమైన శయ్యగానూ, సంచారానికి తగిన పాదుకలుగానూ, శేషుడు తన రూపాలను మారుస్తాడు.

"వటస్య పత్రస్య పుటేశయానం, బాలంముకుందం మనసాస్మరామి." మోక్షదాతయైన శ్రీమన్నారాయణుడు ప్రళయకాలాన వటపత్రశాయిగా శిశురూపంలో ఉంటాడని శ్రీ లీలాశుక సూక్తి. 'ఆలి నిలైయాయ్' అని గోదాసూక్తి.

"తదాత్మానం స్వయమకురుత" శ్రుతిరీత్యా, శిశురూపంలో ఉన్న ముకుందునికి సంసారంలో కానరాని, లీలారసాన్ని ఆస్వాదింపజేసే, అల్పాల్ప తల్పం - మఱ్ఱి ఆకు -గా పరణమించిన రూపం పాదుకాదేవిదే అనిభావం.

పాదుక పట్ల ఉన్న భక్తిచేత బ్రహ్మాదులకు బుద్బుదత్వ కల్పనవల్ల ప్రేయో రూపకాల సంకీర్ణం. శ్లోకం చివరిపాదంలో 'తనుతే' అనీ 'పాదుతే' అనీ పాఠాంతరం ఉంది. మందాక్రాంతా వృత్తం.

*759. అహీనాత్మారంగక్షితిరమణ పాదావని! సదా*
*సతామిత్థం త్రాణాత్ ప్రథితనిజ సత్రత్వ విభవా ।*
*అవిద్యాయామిన్యాః స్పృశసి పునరేకాహపదవీం*
*క్రతూనా మారాధ్యా క్రతురపిచ సర్వస్త్వమసి నః ॥ 9*

అర్థం:- రంగక్షితి రమణపాదావని = రంగభూమికి ఆనందాన్ని కూర్చే శ్రీరంగ భూపతిపాదుకా! త్వం = నీవు; అహీన+ఆత్మా = శ్రేష్ఠస్వరూపం కలదానవు. సదా = ఎల్లప్పుడు; సతాం = సజ్జనులకు; ఇత్థం = అనుభవ మందు ఉండేవిధంగా; త్రాణాత్ = రక్షించడంవల్ల, ప్రథిత, నిజ, సత్రత్వ, విభవా = ప్రసిద్ధమైన, స్వీయ, సత్రత్వ, సంపత్తు కలదానవు; నః = మాయొక్క; అవిద్యా, యామిన్యాః = అజ్ఞాన మనే రాత్రికి; పునః = మళ్ళీ, (అజ్ఞానాన్ని పోగొట్టిన తర్వాత) ఏకాహ పదవీం = అద్వితీయమైన దినమార్గాన్ని; స్పృశసి = స్పృశిస్తావు. క్రతూనాం = యాగాలకు; ఆరాధ్యా = ఉద్దేశ్య దేవతవు. సర్వః, క్రతుః, అపి, చ = సమస్తయాగంగా కూడా; అసి = ఉన్నావు.

తా॥ ఓ రంగరాజ పాదుకా! నీది గొప్ప శరీరం. నీవు సర్వదా సత్పురుషులను కాపాడడంవల్ల నీ సత్రపరమైన సమృద్ధి ప్రసిద్ధిని పొందింది. మా అజ్ఞానతామసిని చిమ్మివేసి ఒక్కపగలునే కల్పిస్తావు. యాగదేవతవూ నీవే. సమస్తయాగమూ నీవే.

### వ్యాఖ్య :- పాదుకాదేవి అహీనాత్మయని శ్లేషతో ఉత్ప్రేక్షితం

ఇది అహీన పద్ధతి. శ్రీరంగనాథుడు ఈ లీలా విభూతిలో భక్తులకు మోక్షానంద సామ్రాజ్యాన్ని ప్రసాదిస్తాడు. భక్తి మార్గానికి శేషత్వం ముఖ్యమైనది. పాదుకాదేవిది ఆదిశేషస్వరూపం.

1. అహి+ఇన+ఆత్మా = సర్పాలకురాజైన ఆదిశేషుని రూపంకలది పాదుక.

2. న+హీన+ఆత్మా = అహీనాత్మా : గొప్ప ఆకారం కలది పాదుక. అనేక రూపాలూ కలది. సర్వగుణ పూర్ణురాలు పాదుకాదేవి.

3. అహీన + ఆత్మా = సోమయాగరూపం కలది పాదుక.

సోమలతను పత్తిదంచి పిడిచిన సోమరసంతో యజమానుడు ఒక్కదినం మాత్రం చేసే యాగం 'ఏకాహం' ఇది జ్యోతిష్టోమానికి మూలమైన యాగం.

రెండు దినాలు మొదల్కొని పన్నెండు దినాలవరకు చేసే సోమయాగాన్ని 'అహీనం' అంటారు. పన్నెండు దినాలకు మించి కొన్నాళ్లు చేసే యాగానికి 'సత్రం' అని పేరు.

"అస్త్యుపైతి చోదనా చోదితో బహుయజమానోయాగః సత్రశబ్దార్థః".

'సత్రం'ను నిర్వహించడానికి పలువురు యజమానులుండాలని శాస్త్రం. ఈ శ్లోకంలో 'అహీన, సత్ర, ఏకాహ' శబ్దాలున్నాయి.

'అహీన' శబ్దానికి ఉన్న మూడు అర్థాల రూపం కలదే కాక, పాదుకా దేవి 'యాగత్రయ దేవత' కూడా అని విశదమవుతున్నది. 'సత్+త్రం' - సత్పురుషులను రక్షించేది. కాబట్టి పాదుకాదేవికి సత్ర ధర్మం సమృద్ధిగా ఉంది.

'ఏక+అహం' - దినమంటే పగలు. ఒక్కదినమే. అది అస్తమయం లేని పగలుకలది. జ్యోతిర్మండలం - మోక్షస్థానం.

'ఏకాహ పదవి' - మోక్షానికి మార్గం - ఉపాయం - భక్తి.

'పరస్మిన్ శేముషీ భక్తి రూపా' - అన్నట్లు అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకునియందు భక్తిరూపమైన జ్ఞానంతో ప్రకాశించేది. అజ్ఞానాంధకారాన్ని తొలగించి భక్తులకు ముక్తిని ప్రసాదించే ఆచార్యత్వ గుణపూర్తి కలది పాదుకామూర్తి.

క్రతువులన్నింట ఆరాధింప తగిన దేవతయే కాక, సర్వక్రతువుల స్వరూప గుణశీల వైభవం కలది పాదుకాదేవి. సమస్తయాగాల ఫలం కూడా పాదుకా ప్రాప్తియే. కాబట్టి దేశికులవారు అపచార క్షామణంకోసం 'త్వమేవ సర్వం' అని ప్రపత్తి చేసే రీతిగా 'అహీనపద్ధతి'తో పాదుకాస్తోత్రం చేశారు. శిఖరిణీ వృత్తం.

*760. బహుముఖభోగ సమేతై*
*ర్నిర్ముక్తతయా విశుద్ధి మాపన్నైః ।*
*శేషాత్మికా పదావని ।*
*నిషేవ్యసే శేషభూతై స్త్వమ్ ॥* 10

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకాదేవీ! శేషాత్మికా = శేషభూతవైన / ఆదిశేష స్వరూపవైన; త్వం = నీవు; బహుముఖభోగసమేతైః । బహుముఖ = నానా విధాలైన / వేయిముఖాలు కలిగిన; భోగ = సుఖాలతో / శరీరాలతో; సమేతైః = కూడియున్న; నిర్ముక్తతయా = ముక్తిపొందడంచేత / కుబుసం విడువడంచేత; విశుద్ధిం = దోషరాహిత్యాన్ని / ధావళ్యాన్ని; ఆపన్నైః = పొందినట్టి; శేషభూతైః = దాసులైనవారిచేత / అనంతాత్మకులైన మహాజనులచేత; నిషేవ్యసే = సేవింపబడుతున్నావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీవు శేష స్వరూపవై నానాభోగాలతో కూడిన, ముక్తులై పరిశుద్ధులైన శేషభూతులచే సేవింపబడుతున్నావు.

ఆదిశేషరూపవైన నీవు సహస్ర ఫణాలు కల శరీరము(లతో) కూడిన, కుబుసం విడిచి తళ తళ మెరుస్తున్న అనంతాత్మకులైన మహానుభావులచేత సేవింపబడుతున్నావు.

వ్యాఖ్య :- ఆదిశేష స్వరూపులైన ముక్తులు పాదుకాదేవిని నిత్యం స్తుతిస్తారని వర్ణన

ఆదిశేషుడు వేయిపడగల శరీరం కలవాడు. పాదుకాదేవి కూడా కైంకర్యపరులు సమర్పించే అనేక ప్రకారాల సుఖకరమైన సపర్యలను పొందుతుంది. ఇది 'బహుముఖభోగసమేత' పదానికి ఉన్న శ్లిష్టార్థం.

'నిర్ముక్తో ముక్తకంచుకః' (అమరం). ఆదిశేషుడు సర్పరూపంలో కుబుసం విడిచినప్పుడు తెల్లగా ప్రకాశిస్తాడు. పాదుకలు అభిషేకానంతరం శుభ్రంగా విభ్రాజిల్లుతాయి.

ప్రకృతినుంచి విముక్తులైన మహాత్ములు శుద్ధాత్ములైనందువల్ల, ఒకే విధంగా శేషరూపంతో ఉండి, చందన పుష్పధూపాలతో ఆరాధిస్తారు. భగవత్కైంకర్యానికి సముచితమైన స్వరూపాలను ధరించికూడా, తమ వేర్వేరు రూపాలను తామే శేషభూతులై సేవిస్తుంటారు. ముక్త పురుషుల ఐశ్వర్యం, కైంకర్యవిధానమే అద్భుతం. అంతా శేషమయం. అనంత భోగ లింగాత్మకం.

శ్లిష్టపద విశిష్టమైన రచనలోనూ సమాలంకార చమత్కారం.

ఆర్యా వృత్తం.

శేషపద్ధతి సమాప్తం.

# 24. ద్వంద్వపద్ధతి

*761. ప్రపద్యే పాదుకారూపం ప్రణవస్య కళాద్వయమ్।*
*ఓతం మితమిదం యస్మి న్ననంతస్యాపి తత్పదమ్ ॥* 1

**అర్థం:-** పాదుకారూపం = భగవత్పాదుకాత్మకమైన; ప్రణవస్య = ఓంకారం యొక్క; ఓతం = ఓంకారాత్మకమైన కళాద్వయం = మాత్రల జంటను; ప్రపద్యే = శరణంగా ఆశ్రయిస్తున్నాను. యస్మిన్ = పాదుకాయుగళమందు / ప్రణవకళాయుగళమందు; అనంతస్య = పరిచ్ఛేద రహితుడైన భగవంతుని యొక్క / అసంఖ్యామైన జీవాత్మయొక్క, ఇదం = ఈ, ముందున్న / వినబడుతున్న; తత్ = ఆ; గ్రహింపశక్యం కాని / ప్రసిద్ధమైన; పదం, అపి = భగవంతుని చరణం కూడా ప్రణవ రూపశబ్దంకూడా; మితం = పరిచ్ఛిన్నమై /మ్+ఇతం = మకారంతో కూడినదై; భవతి = ఉంటుంది.

**తా॥** పాదుకాయుగళం ప్రణవ పదం యొక్క రెండు మాత్రలు. పాదుకాయుగ్మమందు పరిచ్ఛేద రహితుడైన భగవంతుని శ్రీచరణ యుగళం దుర్గ్రహమైనా మితంగా ఉంటుంది.

ప్రణవ కళాయుగళమందు ఓకారం మకారంతోకూడినదై ప్రసిద్ధభగవద్వాచకమైన ఓంకారం ఉంటుంది. కాబట్టి, పాదుకాత్మకమైన ప్రణవకళాద్వయాన్ని ప్రపత్తి చేస్తున్నాను.

వ్యాఖ్య :- పాదుకాయుగళం ప్రణవకళాద్వయమని స్తుతి

భగవద్వాచకం ప్రణవం. భగవంతుడు అపరిచ్ఛేద్యుడు. అనంతుడు. "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ". పరబ్రహ్మను బోధించే ఓంకారం అ+ఉ+మ్' అని పరిచ్ఛిన్నమైన అవయవాలు కలిసిన ఒకే అక్షరం గల శబ్దం. మకారార్థమైన అసంఖ్యాక జీవవర్గం అకార వాచ్యుడైన సర్వశేషికి సేవచేయడం కోసమే ఉంది అని ప్రణవార్థం. "ఓం తత్సదితినిర్దేశః" (భ.గీ.) అ+ఉ రెండు సమానమైన ఏకమాత్రోచ్చారణ కలవర్ణకాలు, పరస్పరం సంగతమైన 'ఓ' అనే ఒక కళ. మకారం ఒక కళ. ప్రణవంలో ఈ రెండు అంశాలున్నాయి. 'కళ' అంటే అంశ, మాత్ర అనే అర్థాలున్నాయి. "కళాస్యాన్మూలరై వృద్ధ్యోః శిల్పాదావంశ మాత్రయోః" (విశ్వ.ని.)

శ్రీ చరణాలను తలదాల్చే పాదుకాశరీరంలోని జీవాత్మ'మ' కారం. 'మ'కార శిరస్సు నలంకరించింది 'ఓ'. పాదుకల జత భగవత్పాదాలకు తగినట్లు 'అ,ఉ' కలిసిన 'ఓ' రూపంగా ఉంది. ఓకారం, జీవకళయైన మకారయుక్త మయింది. "ఓతం, మితం" - ఓ అనేది ఒకకళ' 'మ'కారం ఒక కళ. ఈ కళాద్వయమే పాదుకారూపం,. భగవంతుడు యథేచ్ఛగా వినియోగించుకోవడానికే తన రూపం, అనే లక్ష్యంతో సేవించే జీవాత్మ - మకారం-తో 'ఓ' సర్వశేషి కూడియుండడమే ప్రణవత్వసిద్ధి' అని స్పష్టీకృతం. దేశికుల భావగాంభీర్యమనంతం కదా! శ్లేషతో కూడిన రూపకాలంకారం. అనుష్టుప్ ఛందం

762. మణిపాదుకయోర్యుగం మురారే
ర్మమనిత్యం విదధాతు మంగళాని ।
అధికృత్య చరాచరస్య రక్షా
మనుకంపా క్షమయో రివావతారః ॥ 2

**అర్థం:-** చర + అచరస్య = జంగమ స్థావరాత్మకమైన ప్రపంచం యొక్క; రక్షాం = రక్షణను; అధికృత్య = ఉద్దేశించి; అనుకంపా క్షమయోః = దయ, ఓర్పు అనే గుణాల యొక్క; అవతారః, ఇవ (స్థితం) = అవతారమన్నట్లు ఉన్న; మురారేః = శ్రీరంగనాథునియొక్క; మణిపాదుకయోః, యుగం = రత్నపాదుకలజంట; మమ = నాకు; నిత్యం = ఎల్లప్పుడు; మంగళాని = శ్రేయస్సులను; విదధాతు = ఒనర్చుగాత.

**తా॥** చరాచర ప్రపంచాన్ని రక్షించడం కోసం భగవంతుని దయ, క్షమ అనే రెండు గుణాలు మూర్తీభవించాయి అన్నట్లున్న మణిపాదుకాయుగళం నాకు నిత్యం సకలశుభాలను కల్పించుగాత.

**వ్యాఖ్య :- భగవంతుని దయ, క్షమ అనే గుణద్వయం పాదుకాయుగళంగా అవతరించిన వర్ణన**

దేవ మానవ పశు పక్ష్యాదిలోకమంతాచరరూపం. కదలక ఉండే చెట్టు, గుట్ట మొదలైనవి అచరరూపం. ఈ రెండు రూపాల జగత్తును భగవంతుని అనంత కల్యాణగుణాలలోని 'దయ, క్షమ' అనే రెండు గుణాలు మాత్రమే కాపాడుతున్నాయి.

ఇతరులు పడుతున్న కష్టాలను చూచి భరించలేక తానే వాటిని అనుభవిస్తున్నట్లు భావించి, కంపించి, ఇతరులను కష్టాల కడలినుంచి గట్టెక్కించడమే 'అనుకంప' - దయ. దయాగుణంలోకాన్ని కాపాడాలనుకుంటుంది. కానీ, లోకంలో వ్యక్తులు చేసే క్రూర కర్మలు, దుష్టచేష్టలు భగవంతునికి కోపం కలిగించి, తాను దోషులను దండించే లాగా చేస్తాయి. దోషాలను లెక్కించక మన్నించే ఓర్పును 'క్షమ' అంటారు.

'దయ' వర్షిస్తే 'క్షమ' అంకురిస్తుంది. 'క్షమ' సహకరిస్తే 'దయ' నిర్వాహక మవుతుంది. ఒండొంటిపై ఆధార పడియుండి, నిత్యయుక్తమై లోకాన్ని రక్షించే ఈ, గుణ రత్న ద్వయం, రత్న పాదుకాద్వయిగా అవతరించడం వల్ల చరాచర ప్రపంచం సురక్షిత మవుతున్నదంటారు దేశికులు. ఉత్ప్రేక్షాలంకారం. ఔపచ్ఛందసికం.

763. చరణ మణిపాదుకే! మురారేః
ప్రణతాన్ పాలయితుం ప్రపద్య మానమ్ ।
విపదామిహ దైవ మానుషీణాం
ప్రతికారం యువయోర్ద్వయం ప్రతీమః ॥ 3

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకలారా! ప్రణతాన్ = నమస్కరించిన వారిని; పాలయితుం = కాపాడడానికి; మురారేః = శ్రీరంగపతియొక్క; చరణౌ = పాదాలను; ప్రపద్య మానం = ఆశ్రయించే; యువయోః = మీయొక్క; ద్వయం = జతను; ఇహ = ఈ లోకమందు; దైవమానుషీణాం = దేవతలకు, మనుష్యులకు సంబంధించిన; విపదాం = ఆపదలకు; ప్రతికారం = పరిహారంగా; ప్రతీమః = భావిస్తున్నాం.

తా॥ ఓ మణిపాదుకలారా! ప్రణతులను పాలించడంకోసం భగవత్పాదాలను ఆశ్రయిస్తున్న మీజతను అమరులకు, మర్త్యులకూ సంబంధించిన ఆపదల నిష్కృతిగా తలుస్తున్నాం.

వ్యాఖ్య :- పాదుకాయుగళం భక్తుల సంకటాలను హరించే స్వరూపం

ప్రసన్నులను రక్షించడానికి పాదుకలు రెండు శ్రీరంగనాథుని చరణాలను ఆశ్రయిస్తున్నాయి. తత్ఫలితంగా, భక్తులకు దేవతల వల్లనూ, మనుష్యుల వల్లనూ వచ్చే ఆపత్తులను బొత్తుగా పోగొట్టే శక్తి కలిగిన స్వరూపం పాదుకాయుగళమని కవిహృదయం. ఉత్ప్రేక్షాలంకారం, ఔపచ్ఛందసికం.

*764. మురభి న్మణిపాదుకే! భవత్యో*
*ర్విహితోనూనమసౌ మిథో విభాగః !*
*భజతా మపరస్పర ప్రియాణా*
*మవిరోధాయ సురాసురేశ్వరాణామ్ ॥* 4

**అర్థం:-** హే మురభిత్ + మణిపాదుకే = ఓమురారి రత్నపాదుకలారా! భవత్యోః = మీరెంటిలో; అసౌ =ఈ మిథః = అన్యోన్యంగా; విభాగః = విడివడి ఉండడం,; భజతాం = సేవించే వారిలో, అపరస్పర ప్రియాణాం = అన్యోన్య స్నేహంలేని; సుర+అసుర+ఈశ్వరాణాం = దేవరాజులకు, దానవరాజులకు; అవిరోధాయ = కలహంలేక ఉండడానికై; నూనం = నిశ్చయంగా; విహితః = ఏర్పరచబడినది.

తా॥ ఓ మురహరి మణిపాదుకలారా! మీ జంటలో కనబడుతున్న పరస్పర విభాగం, వచ్చి సేవించే వారిలో అన్యోన్య ప్రేమలేని దేవాధిపతులకూ, దైత్యాధిపతులకూ కలహం ఏర్పడకుండా చేయబడినది.

వ్యాఖ్య :- పాదుకలు రెండు, సురాసురేశ్వరులు సేవించడానికి విడిగా ఉన్నాయి

దేవతలు, రాక్షసులు నిత్య విరోధులు, అయినా, దేవ దేవుణ్ణి సేవించడం కోసం దేవరాజులూ, దనుజేశ్వరులూ వస్తుంటారు. ఒండొరులకు స్నేహం లేదుకదా! వారు, వీరు వచ్చి జగడమాడకుండా, సేవాఫలాన్ని పొందడంకోసం, దేవరాజులకొకటి, దైత్యరాజులకు ఒకటి చొప్పున, పాదుకాయుగళం రెండు వేర్వేరుగా, విభక్తమైనాయి. అసత్కల్పనలేని సూక్తి వైచిత్రి శ్రీవేంకటనాథ కవికేసరిది. ఉత్ప్రేక్షాలంకారం. ఔపచ్ఛందసికం.

*765. అహితోన్మథనాయ సంశ్రితానా*
*మల మాలోక వశేన శబ్దతోవా ।*
*కరయోశ్చ రథాంగ పాంచజన్యౌ*
*మధుహంతుః పదయోశ్చ పాదుకే! యే ॥* 5

**అర్థం:-** మధుహంతుః = మధువనే రాక్షసుణ్ణి సంహరించిన శ్రీరంగనాథుని యొక్క; కరయోః = చేతులయందలి; రథాంగ, పాంచజన్యౌ = చక్రమూ, శంఖమూ; పదయోః = పాదాలయందు; యే = ఏవైతే; పాదుకే = పాదుకలు రెండున్నాయో; (తే) చ = అవికూడా; ఆలోకవశేన = దర్శన మాత్రంచేత / ప్రకాశం చేత; శబ్దతః, వా

= ధ్వని వల్లనూ / సంకీర్తన వల్లనూ; సంశ్రితానాం = ఆశ్రయించిన వారి యొక్క; అహిత + ఉన్మథనాయ = శత్రువుల / అనిష్టాల ధ్వంసంకోసం; అలం = సమర్థమైనవే.

తా॥ శ్రీ రంగనాథుని చేతులయందున్న సుదర్శన పాంచజన్యాలూ, పాదాలయందలి పాదుకలూ ఆలోకంచేతనైనా, శబ్దం వల్లనైనా ఆశ్రితుల శత్రువులను / అనిష్టాలను నశింపచేయ జాలుతాయి.

వ్యాఖ్య :- శంఖచక్రాలూ, పాదుకలూ అహితధ్వంసకాలని వర్ణితం

భగవంతుని హస్తాలయందు సుదర్శన పాంచజన్యాలు ఎలా అలంకారంగా ఉన్నాయో, అలాగే పాదాలయందు పాదుకలూ అలంకారంగా ఉన్నాయి.

"సురద్విషాం ప్రాణవినాశి విష్ణోశ్చక్రం" - ప్రచండ జ్వాలలతో ప్రకాశిస్తూ ఆశ్రిత విరోధులను ధ్వంసం చేస్తుంది. సుదర్శనం. దుర్నిరీక్ష్యమానతేజస్సే దానవ హననానికి చాలును కదా!

"విష్ణోర్ముఖోత్థానిల పూరితస్య యస్యధ్వని ర్దానవదర్పహంతా" శ్రీమహావిష్ణువు ఊదినగాలిచే నిండిన శంఖం యొక్క ధ్వని పగతుర గుండెలను పిండికొడుతుంది.

"అలంభూషణ పర్యాప్తి శక్తివారణవాచకమ్" - (అమరం)

రత్నఖచిత సువర్ణ పాదుకల దర్శన భాగ్యం వల్ల ఆశ్రితుల అనిష్టాలన్నీ తొలగిపోతాయి. పాదుకానామ సంకీర్తనం వల్లనూ అనిష్టనివారణ, ఇష్ట ప్రాప్తి కలుగుతుంది. అహిత , ఆలోక శబ్దాలు నానార్థాలు కలవికాబట్టి, శ్లేషాలంకారం. సుదర్శన పాంచజన్యాలకూ, పాదుకాలకూ ధర్మైక్యం ఉండడం వల్ల దీపకాలంకారం. శంఖచక్రాలతో సాదృశ్యంగా పాదుకా వర్ణన ప్రతీయ మానం కాబట్టి, ఆలంకారికధ్వని. ఔపచ్ఛందసికం

766. అవధీరిత సాధు పద్ధతీనా
మలసానాం మధువైరి పాదుకే! ద్వే ।
ఇతరేతర సాహచర్య మిత్థం
ప్రతిపన్నే ఇవ దైవ పౌరుషే నః ॥ 6

అర్థం:- హే మధువైరి పాదుకే, ద్వే = ఓ మధువైరియొక్క రెండు పాదుకలారా! అవధీరిత సాధు పద్ధతీనాం = ఉల్లంఘించిన సాధువుల మార్గంగల; అలసానాం = సోమరులమైన; నః = మాకు; ఇత్థం = కనబడే యుగళ ప్రకారంగా; ఇతర+ఇతర సాహచర్యం = ఒకరితో నొకరు కూడి ఉండడం; ప్రతిపన్నే = పొందబడిన; దైవ పౌరుషే; ఇవ = దైవపౌరుషాలో అన్నట్లు ఉంది.

తా॥ ఓ మధుసూదను రెండు పాదుకల్లారా! మేము సాధువుల ఆచారాన్ని ఉల్లంఘించిన వాళ్ళం. పైగా అశక్తులం. మాకు జంటగా కనబడే మీరు అన్యోన్య సహాయంతో వర్తించడం వల్ల మేము పొందిన దైవమూ, పురుష ప్రయత్నమూ మీదే అని భావిస్తున్నాం.

వ్యాఖ్య :- పాదుకలు రెండు భక్తులకు ఉండే దైవ పౌరుషాలని ఉత్ప్రేక్ష

మహాజనులు నడచిన త్రోవలో నడుస్తూ, సదాచార పరాయణులై, సత్కర్మలను అనుష్ఠించి పొందే ఫలం దైవం - అదృష్టం, "దైవం దిష్టం భాగధేయం" - (అమరం)

పురుషుడు యథాశక్తిచేసే ప్రయత్నం పౌరుషం. దైవ పౌరుషాల్లో ఏ ఒక్కటైనా లేకుంటే, ఏ కార్యం కూడా సిద్ధించదు. పౌరుషమూ, దైవమూ పరస్పరంగా సహచరిస్తే పురుషార్థం ఫలిస్తుంది.

సన్మార్గగాములై ఏదైనా మంచి కర్మను చేయని వారికి దైవం తోడుగా ఉండదు. సోమరులై ఏ ప్రయత్నమూ, శ్రమ చేయనివారికి పౌరుషమూ లేదు, ఉండదు.

దైవ పౌరుషాలు తమకు లేవు కాబట్టి, భక్తులు తమ ఎదుట కనబడుతున్న రెండు పాదుకలే తమకు ఉన్న దైవ పౌరుషాలుగా నమ్ముతారు.

దైవ పౌరుషాల దరిద్రానికి కారణం సాధు పద్ధతిని మీరడం, సోమరితనంతో ఉండడం. ఈ రెండు విశేషణాల వల్ల పరికరాలంకార మిది. ఔపచ్ఛందసికం.

*767. పార్శ్వయో స్సరసిజావసుంధరే*
*పాదయోశ్చ మణిపాదుకే ! యువామ్ ।*
*సన్నికర్షథ న చే న్మధుద్విషః*
*కింకరిష్యతి కృతాగసాం గణః ॥* 7

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకలారా! మధుద్విషః = మధువైరియైన శ్రీ రంగపతియొక్క; పార్శ్వయోః = ఇరుప్రక్కలయందు; సరసిజా, వసుంధరే = లక్ష్మీ భూదేవతలు; పాదయోః = చరణాలయందు; యువాం, చ = రెండుగా ఉన్న మీరు కూడా; న సంనికర్షథ చేత్ = సమీపమందుండకుంటే; కృత+ఆగసాం = చేయబడిన పాపాలు గలవారి యొక్క; గణః = సమూహం; కిం, కరిష్యతి = ఏమి చేయగలదు?

**తా॥** ఓ మణి పాదుకల్లారా ! శ్రీరంగపతికి ఇరుప్రక్కల లక్ష్మీదేవి, భూదేవి ఉంటారు. పాదాలయందు మీరిరువురుంటారు. వారూ, మీరు స్వామి సన్నిధానంలో ఉండక పోతే, అపరాధుల గణం ఏమి చేయగలదు?

వ్యాఖ్య :- శ్రీభూదేవతలను పోలినవే రెండు పాదుకలు అని వర్ణన

శ్రీదేవి ఒక ప్రక్కన, మరొక ప్రక్కన భూదేవి అనపాయినలై ఉంటారు. అపరాధులెదుటికి వస్తే వారిని నిగ్రహించి, వారి మీద నిగ్రహాన్ని / క్రోధాన్ని ప్రసరింపచేసే భగవంతునికి కుడివైపున లక్ష్మీదేవి ఉంటుంది. ఆమె, "ఏమండీ! ఎలాగో మీ పాదాల నాశ్రయించిన వీరిని కరుణతో కటాక్షించండి" అని భగవంతుణ్ని వేడుకొంటుంది.

'ఊఁహుఁ' అంటూ శ్రియఃపతి బిరుసుతో తలత్రిప్పుతే, ఇటు ఎడమవైపున ఉన్న భూదేవి "ప్రభూ! అపరాధులను కోపించక వారి దోషాలను క్షమించండి" అని విన్న విస్తుంది. వెంటనే అటూ, ఇటూ చూడలేక, నేల చూపులు చూచేసరికి, క్రింద ఉన్న రెండు పాదుకలు కనబడుతుంటాయి. "స్వామీ! జ్ఞానదరిద్రులైన ఈ దీనులను మీరే రక్షించవలసి ఉంటుంది" అని ఒక పాదుక అంటుంది. 'నైచ్యానికే కదా! మీదయ ప్రవహించేది. అకించనులను రక్షిస్తేనే కాని మీ ఈశత్వం అన్వర్థంకాదు' అని మరొక పాదుక అంటుంది. ఇలా భగవంతుణ్ని ఒక్క అడుగైనా ముందుకు వేయకుండా ఆపి, పురుషకారం చేసే శ్రీ భూ పిరాట్టులతో సాదృశ్యాన్ని పొందింది పాదుకా ద్వంద్వం.

"రమాబ్ధిజా భార్గవీచ స్త్రీ లింగాశ్చాంబు జాహ్వయాః" (యాదవ నిఘంటువు)

భగవత్సన్నిధానంలో ఉండి వీరందరు చేసే పురుషకారం వల్ల భగవంతుడు శరణాగతులను, దోషభూయిష్ఠులైనా "క్షమించాను. యథేచ్ఛగా వర్తించండి. భయపడకండి' అని కటాక్షిస్తాడు.

"ఆర్ద్రాపరాధినిజనేఽ ప్యభిరక్షణార్థం" (గోదాస్తుతి 24) అని ఈ విషయాన్నే అద్భుతంగా ప్రవచించారు దేశికులు.

దీపక సంకీర్ణమైన ఉత్ప్రేక్ష. శ్రీభూసాదృశ్య వర్ణన వల్ల ఆలంకారిక ధ్వని, రథోద్ధత.

*768. పాదుకే! భవ భయప్రతీపయో*
*ర్భావయామి యువయోస్సమాగమమ్ ।*
*సక్తయో ర్దనుజవైరిణః పదే*
*విద్యయోరివ పరాపరాత్మనోః ॥* 8

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకలారా! భవ భయప్రతీపయోః = సంసారంవలని భయానికి విరోధినులై; దనుజవైరిణః = అసురులకు శత్రువైన శ్రీ రంగపతియొక్క; పదే = చరణమందు / స్వరూపమందు; సక్తయోః = సంబంధం కలిగియున్న; యువయోః = మీ (జంట) యొక్క; సమాగమం = చేరికను; పరాపరాత్మనోః = పర, అపర అనే స్వరూపాలుకలిగిన; విద్యయోః = విద్యలయొక్క; సమాగమం, ఇవ = సంసర్గంగా; భావయామి = భావిస్తున్నాను.

**తా॥** ఓ పాదుకలారా! సంసారం వలన కలిగే భయానికి ప్రతికూలంగా ఉన్న, భగవత్పాదాలను చేరియున్న, మీ రెండింటి కలయికను, భవ భయనిరాసకాలైన భగవత్స్వరూప సంబంధం కలిగియున్న పరాపర విద్యల సమాగమంగా తలుస్తాను.

### వ్యాఖ్య :- పాదుకాద్వయం పరాపర విద్యల సమాగమంగా వర్ణితం

దేవ దేవ దివ్యమహిషీమణులైన శ్రీ, భూ, పాదుకాదేవతలు భక్తుల సర్వదోషాలను తిరిగి తలెత్తకుండా నశింప జేస్తారు. "సాహిశ్రీరమృతా సతాం" - అన్నట్లు, సంసార సముద్రం నుంచి కడతేర్చడానికి ముఖ్యమైన ఉపాయం వేదవేదాంగ రూపమైన జ్ఞానలక్ష్మి అని వేదశాస్త్రాలు కీర్తిస్తున్నాయి.

పాదుకలను పరాపర విద్యలుగా దేశికులు సంభావించారు.

"ద్వేవిద్యే వేదితవ్యే వై ఇతి చా థర్వణీ శ్రుతిః ।

పరయాత్వక్షర ప్రాప్తిః, ఋగ్వేదాది మయాఽ పరా" (విష్ణుపురాణం).

ఋగ్వేదాది శాస్త్రజన్య జ్ఞానరూపమైనది 'అపరావిద్య' అక్షర రూపమైన పరబ్రహ్మను సాక్షాత్కరింపచేసేది, 'పరావిద్య'.

ద్వేవిద్యే వేదితవ్యే ఇతి హస్మయద్బ్రహ్మ విదోవదంతి, పరాచైవాపరాచ." (ముం.ఉ.1-4)

పరబ్రహ్మను పొందడానికి పర, అపర అనే రెండు విద్యలు తెలుసుకోతగినవి, అని వేదవేత్తలు చెబుతున్నారు.

'విద్య' అంటే జ్ఞానం. 'అపర విద్య' అంటే గురుముఖతః వేదాంగాలను అభ్యసించి, వేదాల అర్థమైన పరబ్రహ్మను తెలుసుకోవడం, 'పరవిద్య' అంటే బ్రహ్మ సాక్షాత్కారంకోసం చేసే ఉపాసనాత్మకమైన భక్తి రూపాపన్నజ్ఞానం. ('తత్రాపరా' 5వ మంత్ర వివరణ)" బ్రహ్మవిషయే పరోక్షా పరోక్షరూపేద్వే జ్ఞానే (విద్యే) ఉపాదేయే" (శ్రీభాష్యం)

'ముముక్షువు మొదట వేదశాస్త్ర శ్రవణజన్యమైన పరోక్షజ్ఞానాన్నీ, తర్వాత పరబ్రహ్మను ప్రత్యక్షంగా దర్శించడానికి హేతువైన ఉపాసన అనే భక్తిరూపమైన జ్ఞానాన్నీ పొందవలెను. ఇవే రెండు విద్యలు' అని 'అదృశ్యత్వాధి కరణం'లో భగవద్రామానుజులు విశదీకరించారు.

పరావర విద్యలు రెండు కలిసి ముక్తికి హేతువు అయినట్లే, భగవత్పాదుకలు రెండూ మోక్షఫలప్రాప్తికి మూలం, అని భావన. ఉత్ప్రేక్ష. రథోద్ధత.

*769. రంగసీమని రథాంగ లక్ష్మణ శ్చింతయామి తపనీయ పాదుకే ।*
*శాపదోషశమనాయ తత్పదే చక్రవాకమిథునం కృతాస్పదమ్ ॥* *9*

**అర్థం:-** రంగసీమని = శ్రీరంగప్రదేశమందలి; రథాంగ లక్ష్మణః = చక్రచిహ్నం గల శ్రీరంగ ప్రభువు యొక్క; తపనీయపాదుకే = బంగారు పాదుకలను; శాపదోష శమనాయ = శాపమనే పాపం యొక్క శాంతికోసం; తత్ + పదే = ఆ శ్రీరంగ క్షేత్రమందు / శ్రీరంగ పతిచరణమందు; కృత+అస్పదం = చేయబడిన వాసం గల; చక్రవాక మిథునం = జక్కువ పక్షుల జంటగా; చింతయామి = భావిస్తాను.

**తా॥** శ్రీరంగ దివ్యక్షేత్రంలో చక్రధారియైన శ్రీరంగపతియొక్క బంగారు పాదుకలను, శాపంవల్ల కలిగిన విరహ రూపదోషాన్ని పోగొట్టుకోవడానికి శ్రీరంగ క్షేత్రమందు (స్వామి పాదాలయందు) నివసిస్తున్న చక్రవాక పక్షుల జంటగా తలుస్తాను.

వ్యాఖ్య :- పాదుకల జంట చక్రవాకమిథున మని ఉత్ప్రేక్ష

రథాంగ లాంఛనుడు, సుదర్శనాయుధుడు. రథాంగ - చక్రవాక - పక్షులకు రథాంగమందు పురుషకారత్వభావం ఉంది. స్వామిపాదాలకూ చక్ర చిహ్నం ఉంది. పాపాలను పరిహరిస్తుంది.

రాత్రి-చీకటి - కాగానే చక్రవాక పక్షులు ఎక్కడున్నవి అక్కడనే ఉంటాయి. మగ - ఆడ పక్షులు ఒండొంటితో కలియక ఎడబాసి బాధపడుతుంటాయి. "పురాకిల దాశరథిశ్చక్రవాకం శప్తవానితి పురాణాంతరే'. 'పూర్వం శ్రీరాముడు చక్రవాకాన్ని శపించాడు' అని ఒక పురాణంలో ఉంది అన్నాడు వ్యాఖ్యాత. కాబట్టి రథాంగ పక్షుల జంట రథాంగ లక్షణ లక్షితుని సన్నిధానంలోనే వసించి, తపించి, శరణాగతి చేస్తున్నట్లు తపనీయ పాదుకలున్నాయి. రథాంగ శబ్దం శ్లేషగా ప్రయుక్తం. దానివల్ల చక్రవాక పక్షుల జంట సాకూతం కాబట్టి పరికరాలంకారం. రథోద్ధతావృత్తం.

*770. మానయామి జగతస్తమోపహే*
*మాధవస్య మణిపాదుకే ! యువామ్ !*
*దక్షిణోత్తర గతిక్రమోచితే*
*పద్ధతీ ఇవ మయూఖ మాలినః ॥* 10

**అర్థం:-** మాధవస్య = మాధవుని యొక్క; హే మణిపాదుకే = ఓ మణి పాదుకలారా! గతః = లోకం యొక్క; తమస్ + అపహే = శోకాన్ని/చీకటిని తొలగించే; దక్షిణ + ఉత్తర, గతిక్రమ + ఉచితే = కుడి ఎడమ పాదాలను ఉంచడానికి యోగ్యంగా ఉన్న / దక్షిణోత్తర దిక్కులకు సంబంధించిన సంచారాల వరుసకు తగియున్న; యువాం = మిమ్ములను; మయూఖమాలినః = కిరణశ్రేణిగల సూర్యుని యొక్క; పద్ధతీ, ఇవ = రెండు మార్గాలుగా; మానయామి = తలుస్తాను.

**తా॥** ఓ మాధవుని పాదుకల్లారా! లోకాలశోకాన్ని నివారించే, మాధవుని సవ్యాప సవ్య పాదాల విక్షేపానికి తగియున్న మీ రెండింటిని; లోకాల చీకటిని చీల్చివేసే దక్షిణోత్తర దిశల్లో మారి మారి సంచరించడానికి యోగ్యంగా ఉన్న సహస్రకిరణుడైన సూర్యుని దక్షిణోత్తరాయణాలనే రెండుకక్ష్యలుగా భావిస్తాను.

వ్యాఖ్య :- రెడు పాదుకలు దక్షిణోత్తరాయణ కక్ష్యలను పోలియున్నవని వర్ణన

చక్రవాక పక్షుల కానందం కలిగించే సూర్యుడు మదిలో మెదులగా, సూర్యుని కక్ష్యల్లాగా భగవత్పాదుకలున్నాయన్నారు.

మాధవుని దక్షిణపాదుక మయూఖ మాలియొక్క దక్షిణాయన మార్గంలాగా, వామపాదుక ఉత్తరాయణ మార్గంలాగా ఉంది. రెండు పాదుకలు, రెండు మార్గాలు సంచార యోగ్యాలు. కర్కాటక, మకరరేఖలే దక్షిణోత్తరాయణ కక్ష్యలు కదా! పాదుకా సంచారం వల్ల లోకాల శోకం నశిస్తుంది. సూర్యుడు రెండు కక్ష్యలయందు సంచరించడం వల్ల లోకాల చీకట్లు తొలగిపోతాయి. శ్లేషతో కూడిన ఉపమాలంకారం. రథోద్ధతా వృత్తం.

771. రంగనాథ పదయోరలంక్రియా
రాజతే కనక పాదుకాద్వయీ ।
తద్విభూతియుగళీవ తాదృశీ
ఛందతః సమవిభాగ మాశ్రితా ॥ 11

**అర్థం:-** రంగనాథ పదయోః = శ్రీరంగనాథుని చరణాలకు, లీలా, ముక్తిస్థానాలకు; అలంక్రియా = అలంకారమైన; కనక పాదుకాద్వయీ = బంగారు పాదుకలజంట; తాదృశీ = ఒకపాలు లీలాస్థానం, మూడు పాళ్ళు భోగస్థానంగాను ప్రసిద్ధమైన; ఛందతః = స్వేచ్ఛగా; సమవిభాగం = సమానమైన వేర్పాటును; ఆశ్రితా = ఆశ్రయించిన; తత్ + విభూతి యుగళీ, ఇవ = శ్రీరంగ ప్రభువు యొక్క రెండు సంపదల జంటలాగా; రాజతే = విరాజిల్లుతున్నది.

**తా॥** భగవత్పాదాలకు, ఇహ పరలోకాలకు అలంకారంగా ఉన్న కాంచన పాదుకాయుగళి; ఏకపాది, త్రిపాదిగా ప్రసిద్ధమైన, స్వేచ్ఛతో సమవిభాగాన్ని పొంది, భగవంతుని లీలాస్థానం, భోగస్థానం అనే రెండు సంపదల జంటలాగా ప్రకాశిస్తున్నది.

### వ్యాఖ్య :- పాదుకాద్వయి భగవద్విభూతి యుగళిలాగారాజిల్లే వర్ణన

ఉభయ విభూతి నాయకుడు శ్రీ రంగేశ్వరుడు. విభూతి అంటే ఐశ్వర్యం - ఈశ్వర సంబంధమైనది- ప్రకృతి మండలమే లీలావిభూతి. శుద్ధ సత్త్వమండలమే శ్రీ వైకుంఠం. ఒక పాదంగా లీలావిభూతి ఉంటే దీనికి మూడు రెట్లుగా ముక్తిస్థానం ఉండడం వల్ల త్రిపాద్విభూతి అనిపేరు.

"పాదోఽస్య విశ్వాభూతాని, త్రిపాదస్యామృతందివి." (పురుష సూక్తం) భగవత్పాదాలకు అలంకారంగా ఉన్న పాదుకలు, రెండు విభూతులకు పర్యాప్తంగా ఉన్నాయి. దక్షిణోత్తరాల తర్వాత ఇది క్రింది మీది స్థలాల విషయం "అలం భూషణ పర్యాప్తి శక్తి వారణవాచకమ్". (అమరం)

ఒక పాలు, మూడు పాళ్ళు అన్నప్పుడు 'సమవిభాగం' ఎలా ఏర్పడుతుంది. అంటే, అది భగవత్సంకల్పం. అందుకే 'ఛందతః' అని సమాధానం.

మండలాల పరిమాణమెలా ఉన్నా, ప్రకృతి మండలంలో ఉండే వారి మీదనూ, పరమ పదంలో ఉండే వారి మీదనూ, ఆశ్రయ విషయంలో కూడా, వైషమ్యం లేదు. కాబట్టి విభూతి పరిమాణం కాక, పాదాను రూప పరిమాణ మనేది సమవిభాగానికి అర్థం.

వీరు సంసారులు, వారు సంసార గంధ శూన్యులు అని భావించక, స్వేచ్ఛగా, సర్వాశ్రితత్వ సామ్యం కోసమే ఉభయ విభూతులు పాదుకా యుగళిగా వెలసినవనడం లెస్స. అభూతోపమాలంకారం. రథోద్ధత.

772. సాక్షాత్పదం మధుభిదః ప్రతిపాదయంత్యో
మానోపపత్తినియతే మణిపాదుకే ద్వే ।
అన్యోన్యసంగతి వశా దుపపన్న చర్యా
మాజ్ఞాం(శ్రుతిస్మృతి మయ మవధారయామి ॥ 12

**అర్థం:-** మధుభిదః = మధువనే దనుజుని భేదించిన భగవంతునియొక్క; పదం = చరణాన్ని / స్వరూపాన్ని; సాక్షాత్ = ప్రత్యక్షంగా / ముఖ్యవృత్తిగా; ప్రతిపాద యంత్యో = ఇచ్చే / బోధించే; మాన + ఉపపత్తి, నియతే = పరిమాణం చేత, గతిచేత వ్యాపించిన / ప్రమాణంచేత, తర్కంచేత నిశ్చయింపబడే; ద్వే, మణిపాదుకే = రెండు రత్నపాదుకలను; అనోన్య సంగతి వశాత్ = ఒండొంటితో చేరడం వల్ల; ఉపపన్నచర్యాం = సమ్మతమైన నడవడిగల / తగిన అనుష్ఠానం గల; శ్రుతి, స్మృతిమయీం = వేద ధర్మశాస్త్ర రూపమైన, ఆజ్ఞాం = భగవంతుని శాసనంగా; అవధారయామి = గ్రహిస్తున్నాను.

**తా॥** భగవత్పాదాలను సాక్షాత్తుగా ఆశ్రితులకు ప్రసాదించే, చరణాలతో సమాన పరిమాణంచేత, గమనం చేతనూ కూడిన, పరస్పరంగా సమ్మతమైన సంచారంగల రెండు పాదుకలను; భగవత్స్వరూపాన్ని ముఖ్యవృత్తిచే బోధించే, ప్రమాణంచేత, తర్కంచేతనూ అర్థ నిర్ణయంచేసే, అన్యోన్యంగా కలిసి ఉచితానుష్ఠానం కలిగిన శ్రుతి, స్మృతి రూపాలైన రెండు భగవంతుని శాసనాలుగా భావిస్తున్నాను.

**వ్యాఖ్య :- పాదుకలు శ్రుతి స్మృతులనే రెండు భగవదాజ్ఞలని ఉత్ప్రేక్ష**

"ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్". వేదాన్ని ఇతిహాస పురాణాలచేత విశద పరచవలెనని శాస్త్రం. శ్రుతిస్మృతులు రెండు భగవంతుని స్వరూపాన్ని తెలియజేస్తాయి. పాదుకలు రెండు భగవత్పాదాలను తాము ధరించి మనకు దర్శింప జేస్తాయి. శ్రుతి స్మృతులు శబ్దశక్తిచే భగవత్స్వరూపాన్ని ప్రతి పాదిస్తూ, ప్రమాణాలచే తర్కంచేతనూ, తాత్పర్యగోచరార్థాన్ని నిశ్చయిస్తాయి.

"ఆర్షం, ధర్మోపదేశం చ వేద శాస్త్రా విరోధినా ।
యస్తర్కేణాను సంధత్తే సధర్మం వేద నేతరః ॥

'వేద శాస్త్రాలకు విరోధంగా ఉండని తర్కంచేత ఆర్షాన్ని, ధర్మోపదేశాన్ని - శ్రుతి స్మృతులను - అనుసంధానం చేసే వాడే ధర్మవేత్త, తదితరుడు కాడు - అనడంవల్ల శ్రుతి స్మృతులకు ప్రమాణ తర్కానుగ్రహం ఆవశ్యకం.

భగవత్పాద తుల్యమైన పరిమాణ గతులతో కూడినవే పాదుకలు. పాదుకలు రెండు ఒండొంటితో కలిసి భగవంతుని సంచారాన్ని నిర్వహిస్తే, శ్రుతి స్మృతులు రెండు అన్యోన్యంగా భేదించక, జనులు ధర్మాన్ని అనుష్ఠించే విధంగా తోడ్పడుతాయి.

"శ్రుతిః స్మృతిర్మమై వాజ్ఞా యస్తా ముల్లంఘ్య వర్తతే ।
ఆజ్ఞాచ్ఛేదీ మమద్రోహీ మద్భక్తోపి న వైష్ణవః ॥"

శ్రుతి స్మృతులు రెండు భగవంతుని శాసనాలే. వాటిని ఉల్లంఘించి ప్రవర్తించే వ్యక్తిని, తాను భక్తుడనుకొన్నా, భగవంతుడు మాత్రం తనకు ద్రోహం చేసిన వానిగా పరిగణిస్తాడని శాస్త్రం స్పష్టపరచింది. శ్రుతి స్మృతులను అంగీకరించేవాడు ఆస్తికుడనీ, అతడే భక్తుడని భావం.

సామ్యాన్ని బట్టి రెండు పాదుకలు, భగవదాజ్ఞారూపమైన రెండు శ్రుతి స్మృతులుగా సంభావింప బడుతున్నాయి. ఉభయ విభూతుల వర్ణన తర్వాత అందుకు ప్రమాణంగా ఉండే శ్రుతి స్మృతులుగా పాదుకలను వర్ణించడంలో భావౌచిత్యం ప్రదర్శితం. వసంత తిలకావృత్తం.

*773. విశ్వోపకార మధికృత్య విహారకాలే*
*ష్వన్యోన్యతః ప్రథమ మేవ పరిస్ఫురంత్యోః ।*
*దృష్టాంతయంతి యువయోర్మణిపాదరక్షే!*
*దివ్యం తదేవ మిథునం దివిషన్ని షేవ్యమ్ ॥ 13*

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకలారా । విహారకాలేషు = సంచార సమయాల్లో; విశ్వ + ఉపకారం = లోకోపకారాన్ని; అధికృత్య = గురించి, అన్యోన్యతః = ఒకరికంటె మరొకరు; ప్రథమం, ఏవ = ముందుగనే; పరిస్ఫురంత్యోః = ప్రకాశిస్తున్న, యువయోః = మీ జంటకు; దివి+సత్ + ని+సేవ్యం = దేవతలచే సేవింప దగిన; దివ్యం = అప్రాకృతమైన; తత్ = లక్ష్మీనారాయణాత్మకమైన; మిథునం, ఏవ = దంపతులనే; దృష్టాంత యంతి = దృష్టాంతంగా నిశ్చయిస్తున్నారు.

**తా॥** ఓ మణి పాదుక ల్లారా! విశ్వసంరక్షణ కోసం సంచరించే వేళల్లో అహమహమికా పేక్షతో ముందడుగిడే మీ జంటకు; లోకోపకారం కోసం సంచరిస్తూ 'నేను ముందు' అంటూ ఒండొరులు స్పర్థతో ప్రకాశిస్తున్న, అమర సేవ్యులైన దివ్య దంపతులనే సాదృశ్యంగా లోకులు చూస్తున్నారు.

వ్యాఖ్య :- రెండు పాదుకలు దివ్య దంపతులను పోలి ఉన్నవని వర్ణన

ప్రమాణంగా ఉన్న శ్రుతిస్మృతుల వర్ణనానంతరం, ప్రమేయంగా ఉన్న శ్రీశ్రియఃపతులతో సదృశంగా పాదుకలను వర్ణించే శ్లోకమిది.

లోక రక్షణార్థం 'నేనే ముందుపోతాను' అంటూ రెండు పాదుకలు పాటీ పడుతూ సంచరిస్తుంటాయి. లోక రక్షణ తత్పరులైన లక్ష్మీనారాయణులు. లీలా విభూతిలో అవతరించి విహరించే కాలంలో, లోకోపకారార్థం 'నేనే ముందు వెళ్ళుతాను' అని ఒకరంటే 'నేనే ముందు వెళ్ళుతాను' అని మరొకరు స్పర్థతో ప్రవర్తిస్తారు.

రావణున్ని సంస్కరించడానికి మొదటపోతానన్నాడు శ్రీరాముడు. కానీ శ్రీరాముని కంటె ముందే పోయింది సీతమ్మ. ఆ దివ్యదంపతుల్లాగా రెండు పాదుకలు విశ్వరక్షణ వ్యగ్రతతో స్పర్థిస్తుంటాయి. ఉపమాలంకారం. దివ్యమిథునాన్ని సాదృశ్యంగా వర్ణించడంవల్ల ఉపమేయోపమ. అలంకారధ్వని. వసన్త తిలకావృత్తం.

*774. ద్వావేవ యత్రచరణౌ పరమస్య పుంస*
*స్తత్ర ద్విధాస్థితవతీ మణిపాదుకే! త్వమ్ ।*
*యత్రైవ(ష) దర్శయతిదేవి ! సహస్రపాత్త్వం*
*తత్రాపి నూనమసి దర్శిత తావదాత్మా॥* 14

**అర్థం:-** హే దేవి ! మణిపాదుకే = ఓ రత్నపాదుకాదేవీ! త్వం = నీవు; పరమస్య, పుంసః = పరమపురుషునికి; యత్ర = ఏరూపమందు; ద్వౌ, ఏవ = రెండే; చరణౌ = పాదాలో; తత్ర = ఆ రూపమందు; ద్విధా = రెండుగా; స్థితవతీ = ఉండగలుగుతావు. యత్ర = ఎక్కడ; ఏషః = ఈ పరమపురుషుడు; సహస్రపాత్+త్వం = వేయికాళ్ళ ఉనికిని; దర్శయతి = కన్పింపజేయునో; తత్ర, అపి = అక్కడకూడా; దర్శిత, తావత్ + ఆత్మా = కన్పించబడిన అన్ని శరీరాలు కలదానివిగా; నూనం, అసి = అవుతునే ఉంటావు.

**తా॥** ఓ మణి పాదుకాదేవీ! పరమ పురుషుని స్వరూపానికి రెండు కాళ్ళు మాత్రమే ఉన్నప్పుడు నీవు రెండుగా ఉండగలుగుతావు; ఆయన రూపం వేయికాళ్ళతో ఉంటే, నీవు కూడా దానికి తగినన్ని మూర్తులతోనే దర్శన మిస్తుంటావు.

వ్యాఖ్య :- భగవత్పాదాల సంఖ్యకు పాదుకాసంఖ్య పర్యాయంగా ఉండే వర్ణన

పరమ పురుషునికి పరవ్యూహ విభవాద్యవతారాల్లో రెండు చరణాలు ఉన్నప్పుడు పాదుకాదేవి రెండు రూపాలతోనే ఉంటుంది.

విరాడ్రూపంలో సహస్ర పాదాలకు అనురూపంగా దివ్యపాదుక తన ఆకృతులను కూడా సహస్ర సంఖ్యగానే పెంచుకొని దర్శన మిస్తుంది.

ఒక పాదుక యందే రెండు మొదలుకొని అనేక రూపాలున్నట్లు వర్ణించడం వల్ల ఇది పర్యాయాలంకారం. 'నూనం' అనే పదానికి 'ఏవ' కారార్థం-కాబట్టి ఉత్ప్రేక్షకాదు. వసంతతిలక.

*775. పర్యాయతో గతివశా న్మణి పాదరక్షే*
*పూర్వా పరత్వనియమం వ్యతివర్తయంత్యౌ ।*
*మన్యే యువాం మహతి విష్ణు పదే స్ఫురంత్యౌ*
*సంధ్యే సమస్తజగ తామభివందనీయే॥* 15

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకలారా! పర్యాయతః = మారి మారి; గతివశాత్ = నడిచే కారణం వల్ల; పూర్వ + అపరత్వ, నియమం = మొదటిది, తర్వాతది అనే వ్యవస్థను; వ్యతివర్తయంత్యౌ = మీరినడుస్తున్న; మహతి = ఉత్కృష్టమైన / విశాలమైన; విష్ణుపదే = భగవచ్చరణమందు / ఆకాశమందు; స్ఫురంత్యౌ; ప్రకాశిస్తున్న; యువాం = మీరెండింటిని; సమస్త జగతాం = అన్నిలోకాలకు; అభివందనీయే = నమస్కరించదగిన; సంధ్యే = రెండు సంధ్యలుగా; మన్యే = భావిస్తున్నాను.

తా॥ ఓ రత్నపాదుకలారా! క్రమంగా పాదవిక్షేపంవల్ల ఇది మొదటిది, ఆది తర్వాతది అని తెలియరాకుండా నడుస్తూ భగవత్పాదాలయందు ప్రకాశించే మీ రెండింటిని, పదే పదే కాలగతివశాన తొలిది, మలిది అనే నియమాన్ని గుర్తించరాకుండా వర్తిస్తూ ఆకాశంలో ప్రకాశిస్తున్న , లోకులకు ఉపాసింపదగిన రెండు సంజలుగా భావిస్తాను.

వ్యాఖ్య :- పాదుకలను ఉభయ సంధ్యలుగా తలచే వర్ణన

పాదుకలు రెండు ఒకటి తర్వాత మరొకటి క్రమంగా చలిస్తుంటే పౌర్వాపర్య భావం నిలువదు. సంధ్యల విషయమూ అంతే. సూర్యోదయమైనప్పుడు 'తొలిసంజ' అనుకుంటాం. సూర్యుడు అస్తమిస్తే 'మలిసంజ' అనుకుంటాం. కానీ, పగటిని వెన్నాడుతూ రాత్రి, రాత్రిని వెన్నాడుతూ పగలు, మారి మారి తిరుగుతుంటే ఏది తొలిసంజయో? ఏది మలి సంజయో? స్థిరంగా నిర్ణయించి చెప్పరాదు కదా!

భగవత్పాదాలను అలంకరించి ప్రకాశించే పాదుకలు సమస్తజనులకు నమస్కరించదగినవి. అహోరాత్రాలకు కారణమైన ప్రాతః సాయం సంధ్యలు సర్వలోకాలకు ఉపాసించ దగినవే కదా! శ్లేషతోడి ఉత్ప్రేక్ష. వసన్త తిలక.

*776. అశ్రాంతసంచరణయో ర్నిజ సంప్రయోగా*
*ద్గమ్లానతాంచరణ పంకజయోర్దిశం త్యౌ ।*
*మాన్యే యువాం రఘుపతే ర్మణి పాదరక్షే*
*విద్యే బలామతి బలాంచ విచింతయామి ॥ 16*

**అర్థం:-** హే రఘుపతేః , మణి పాదరక్షే = ఓ రాఘవమణిపాదుకలారా! అశ్రాంత సంచరణయోః = శ్రమలేకుండా సంచరించగల; చరణ పంకజయోః = కమలాల్లాంటి పాదాలకు; నిజ సం ప్రయోగాత్ = తమచేరిక వల్లఅమ్లానతాం = వాడిపోని తనాన్ని; దిశం త్యౌ = కలిగిస్తున్న; మాన్యే = పూజింపదగిన; యువాం = మీ రెండింటిని; బలాం, అతి బలాం, చ = బల, అతిబల అనే; విద్యే = రెండు మంత్ర విద్యలుగా; విచింతయామి = అనుకుంటాను.

తా॥ ఓ రాఘవ రత్నపాదుకల్లారా! ఆయాసం లేక నడువగలిగే కమలపూవుల్లాంటి కాళ్ళకు తమ చేరిక వల్ల వైవర్ణ్యం కలుగకుండా వాటిని కాపాడుతున్న మాన్యమైన మీ జంటను, బల, అతి బల సంజ్ఞ కలిగిన మంత్ర ద్వయంగా తలుస్తాను.

వ్యాఖ్య :- శ్రీరామ పాదుకలను బలాతిబల విద్యలుగా ఉత్ప్రేక్షించే శ్లోకం

విశ్వామిత్ర మహర్షి రామ లక్ష్మణులను అయోధ్యనుంచి తెచ్చిననాటి తొలిసంధ్య సాయం సంధ్యయే. సరయూనదికి దక్షిణతీరం చేరగనే సాయం సంధ్యాకాలాన్ని గమనించి మహర్షి అన్న మాట ఇలా ఉంది.

"మంత్రం గృహాణ రామ! త్వం బలామతి బలాంతథా!
నశ్రమో నజ్వరోవా తే నరూపస్య విపర్యయః ! (రా.బా.22.స.14)

"ఓ రామచంద్రా! నీవు బల, అతిబల అనే మంత్రవిద్య(ల)ను గ్రహించుము. నీ శరీరానికి అలసట ఉండదు. జ్వరమూరాదు. అందమూ చెడదు"

ఇప్పుడు తన వెంట నడచినా, ఇక ముందు వనవాసంలో సంచరించినా ఏ మాత్రం బడలిక కలుగకుండా, చరణ సౌందర్య సౌకుమార్యాలు చెదరకుండా విశ్వామిత్రుడు శ్రీరామునికి బలాతిబల మంత్రాలను ఉపదేశించాడు. కాబట్టి, భగవత్పాదాల సొబగు చెడకుండా కాపాడే పాదుకలు బలాతిబల సంజ్ఞగల మంత్ర రూపాలని సంభావించారు దేశికులు.

"కౌసల్యా సుప్రజారామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే" అనే శ్రీమద్రామాయణ సూక్తిని మీరు మరచినారు కోబోలు స్వామీ! అని గత శ్లోకం విన్న వారిలో కొందరు హేళన చేస్తే, వారికి సమాధాన మీయక దేశికులు ఈ శ్లోకాన్ని అనుగ్రహించి ఉంటారు.

శ్రీరామునికి మంత్రోపదేశం చేసిన నాటి సాయం సంధ్య ఒకటి. ఆ రాత్రి అక్కడనే పవళించిన శ్రీరామచంద్ర స్వామిని విశ్వామిత్రుడు మేల్కొల్పిన ప్రాతః సంధ్య రెండవది. శ్రీరాముని నిద్రాకాలిక సౌందర్యాన్ని సేవించి, "ఉత్తిష్ఠ నరశార్దూల!" అని ఆహ్నిక క్రియలను అనుష్ఠించవలసిందని, మహర్షి స్వామిని మొట్టమొదట ప్రబోధించిన ప్రాత స్సంధ్య - పిదప వచ్చే సంధ్యలన్నిటికీ పూర్వసంధ్య.

తానాచరించే ఆహ్నిక క్రియాకలాపమంతా భగవదారాధనా రూపమే కాబట్టి, మహర్షి స్వామికి తొట్టతొలుత సుప్రభాతం పలికిన సంధ్య పూర్వసంధ్య.

"సాయమాది యథాక్రమమ్" - (సంధ్యాభాష్యమ్) నూతన వటువుకు ప్రథమ సంధ్యోపాసన సాయం సంధ్యయే. ఉభయ సంధ్యల పూర్వా పరత్వనియమమెలాంటిదో ప్రాజ్ఞులు గ్రహించి యుంటారని ఈ శ్లోక నిర్వాహకం.

'రఘుపతేః' పదప్రయోగం విద్యా సంబంధంవల్ల సాభిప్రాయం కాబట్టి పరికరాలంకారం. వసంత తిలకావృత్తం.

*777. అంతర్మోహా దవిదిత వతా మాత్మతత్త్వం యథావత్*
*పద్యామిత్థం పరిచితవతాం పాదుకే! పాపలోక్యామ్!*
*నిత్యం భక్తే రనుగుణతయా నాథపాదం భజంత్యౌ*
*నిష్ఠేసాక్షాత్ స్వయ మిహయువాం జ్ఞానకర్మాత్మికే నః ॥ 17*

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకలారా! అంతః + మోహాత్ = అంతఃకరణమందలి తమోగుణంవల్ల; ఆత్మతత్త్వం = పరమాత్మనువలె జీవాత్మను కలిగియున్న నీ ఉనికిని; యథావత్ = ఉన్నది ఉన్నట్లుగా; అవిదితవతాం = తెలియ(రా)నట్టి; ఇత్థం = అనుభవమందు కనబడుతున్నట్లు, పాపలోక్యాం = పాపఫలమైన సంసారానికి తగిన / నరకలోకానికి పోయే; పద్యాం = మార్గాన్ని గూర్చి; పరిచితవతాం = తెలిసియున్నట్టి; నః = మాకు; నిత్యం = ఎల్లకాలం; భక్తేః = భక్తికి; అనుగుణతయా = హేతువగుటచేత / ఉపయోగపడుటచేత; నాథ పాదం

= శ్రీరంగపతి పాదాన్ని /పూజ్యరంగపతిని / భగవత్పాదంగా ఉండే జీవాత్మను; భజంత్యౌ = ఆశ్రయిస్తున్న; యువాం = మీరు (ఇర్వురు); ఇహ = ఈలోకాన; స్వయం = తామే; సాక్షాత్ = సాక్షాత్తుగా; జ్ఞాన కర్మ ఆత్మికే = జ్ఞానయోగ, కర్మయోగరూపాలైన; నిష్ఠే = ఉపాయ చర్యలు.

**తా॥** ఓ పాదుకలారా! మేము మనస్సునావరించియున్న తమస్సు వల్ల జీవాత్మ పరమాత్మల సాధర్మ్యాన్ని సముచితంగా తెలిసిన వాళ్ళం కాదు. మా అనుభవాన్నిబట్టి చూస్తే, పాపలోకాలకు హేతువైన పద్ధతి మాత్రం మాకు తెలిసినట్లు ఉంది. రెండుగా విభక్తమైనందువల్ల, భగవత్పాదాలనాశ్రయిస్తున్న మీరు, మాకు సాక్షాత్తుగా భగవంతుని పట్లకలిగే భక్తికి అంగాలుగా జ్ఞాన, కర్మ యోగాలస్వరూపాలైన రెండు ఉపాయాలై కనబడుతున్నారు.

వ్యాఖ్య :- పాదుకలు, జ్ఞానకర్మ రూపాలైన రెండు నిష్ఠలు అని ఉత్ప్రేక్ష

పాప ఫలమైన కష్టాల కడలి సంసారం. సంసారుల మనస్సుతమోగుణంతో ఆవరించి యుండడం వల్ల 'దేహమే ఆత్మ' అనే భ్రాంతి కలిగిస్తుంది. ఇదే అజ్ఞానం. దీనివల్ల లోకులు భోగైశ్వర్య కాములవుతారు. దేహం వేరు, జీవుడు వేరు, దేవుడువేరు. అని చిదచిదీశ్వర తత్త్వం తెలుసుకోవలసి ఉంది లోకులు.

"పాదోఽస్య విశ్వాభూతాని" (శ్రుతి) "మమైవాంశో జీవలోకే జీవ భూతః సనాతనః". (భ.గీ.15-7)

అనాదియైన జీవాత్మభగవదంశమే. మనస్సు ప్రకృతి అంశ. 'నాథ పాదం' అంటే, పరమాత్ముని అంశమే జీవుడు అని అర్థం. ఈ యథార్థ విషయాన్ని - ప్రత్యక్షంగా భగవంతుని పాదాలను ఆశ్రయించి, మనకు భక్తియోగాన్ని - ప్రదర్శిస్తున్నాయి. పాదుకలు.

'భక్తి' అంటే భగవంతుని విషయమై ప్రేమ రూపమైన, ఎడతెగని ధ్యానం. భక్తికి జ్ఞాన యోగం, కర్మయోగం అనేవి రెండు అంగాలు - సహకరించేవి. 'జ్ఞానం' అంటే శ్రోత్రియుడై బ్రహ్మనిష్ఠుడైన సదాచార్యుని వల్ల జీవాత్మ పరమాత్మల స్వరూపాన్ని తెలుసుకొని ఎల్లకాలందాన్నే చింతించడం. 'కర్మయోగం' అంటే తమ తమ వర్ణాశ్రమాలకు విధింపబడిన కర్మలను విడువకుండా చేయడం వల్ల తమోగుణం అణగి, సత్త్వగుణం సమృద్ధికాగా, చిత్తశుద్ధితో సర్వకర్మలను భగవంతుని ఆరాధన రూపంగా తలచి, వాటిని త్యాగం చేయడం.

"స్వకర్మణా తమ భ్యర్చ్య సిద్ధిం విందతి మానవః". (భ.గీత.18-46) మానవుడు తన వర్ణాశ్రమోచితమైన కర్మచేత శ్రియఃపతిని ఆరాధించి సిద్ధిని పొందుతాడని భావం.

'నిష్ఠ' అంటే కోరిన ఫలాన్ని పొందడానికి శ్రద్ధతో చేసే ప్రయత్నం, సాధన లేదా ఉపాయం.

"ఏకస్మై మోక్షఫలాయ హి ముముక్షోః సర్వాణి కర్మాణి విధీయంతే" (గీతాభాష్యం) ముముక్షువుకు సర్వకర్మలు ఒక్క మోక్ష ఫలసాధన కోసమే విధింపబడుతున్నవి అన్నారు భగవద్రామానుజులు.

"భక్తేః అనుగుణతయా" :- జీవులకు మోక్షాన్ని అనుగ్రహించే భక్తికి గల జ్ఞాన, కర్మ రూపాలైన రెండు నిష్ఠలుగా - భగవంతుని కుడిపాదానికి, ఎడమపాదానికి అనురూపమై - అమరి ఉన్నాయి రెండు పాదుకలు. శ్లేషాను ప్రాణితోత్ప్రేక్ష. మందాక్రాంతా వృత్తం.

778. న్యస్తం విష్ణోః పద మిహమహత్ స్వేన భూమ్నా వహంత్యో
రామ్నాయాఖ్యా మవిహతగతిం వర్తయంత్యోర్ని జాజ్ఞామ్
ఆసన్నానాం ప్రణయ పదవీ మాత్మనా పూరయంత్యో
ర్ద్వైరాజ్యశ్రీ ర్భవతి జగతామైక రాజ్యే భవత్యోః ॥ 18

**అర్థం:-** ఓ పాదుకలారా! ఇహ = శ్రీరంగమందు; న్యస్తం = నిక్షిప్తమైన; మహత్ = ఉత్కృష్టమైన; విష్ణోః = భగవంతుని / శ్రీరాముని; పదం = చరణాన్ని / స్థానాన్ని; స్వేన = స్వకీయమైన; భూమ్నా = మహిమచేత; వహంత్యోః = ధరిస్తున్న / మోస్తున్న; అమ్నాయ + ఆఖ్యాం = వేదమనే పేరుకలిగిన; నిజ + ఆజ్ఞాం = స్వీయశాసనాన్ని; అవిహత, గతిం = ఆటంకం లేని ప్రవృత్తి కలదానిగా / అడ్డులేని సంచారం కలదానిగా; వర్తయంత్యోః = నడుపుతున్న, ఆసన్నానాం = దగ్గర ఉన్నవారికి; ప్రణయ, పదవీం = స్నేహమార్గాన్ని / కోరినవస్తువును; ఆత్మనా = స్వయంగా; పూరయంత్యోః = పూర్తిచేస్తున్న; భవత్యోః = మీయందు; జగతాం = లోకాలకు; ఐకరాజ్యే = ఒక రాజే ఉండగా; ద్వైరాజ్యశ్రీః = రాజద్వయశోభ; భవతి = ఉంటున్నది.

**తా॥** ఓ పాదుకలారా! శ్రీరంగనాథుని పాదాలను స్వీయమాహాత్మ్యం వల్ల వహిస్తున్నారు మీరు. వేదమనే శాసనాన్ని ప్రతిబంధకం లేకుండా ప్రవర్తింపజేస్తున్నారు. ఆశ్రితులకు ఇష్టమైన కోరికలను పూర్తిచేస్తున్నారు. లోకాలకు రాజు (ఒక్కడే) అద్వితీయుడే అయినా, మీరు మాత్రం రాజద్వయ మూర్తులుగా శోభిస్తున్నారు.

**వ్యాఖ్య :- పాదుక శేషాత్మకంగా ఒక్కటే అయినా రెండు మూర్తులై ప్రజారంజకంగా ఉండే వర్ణన.**

తమ సామర్థ్యంతో భగవత్పాదాలను వహిస్తున్న పాదుకలు, వేదశాసనాన్ని అప్రతిహతంగా ప్రవర్తింపజేస్తున్నాయి. పదవియందున్న ప్రజాపాలకుడు తన ఆజ్ఞకు ప్రజలు లోబడి నడిచే వాళ్ళుగా వర్తిస్తాడు. శరణార్థులైనవారి కోరికలనూ నెరవేరుస్తాడు. అది రాజధర్మమే.

ఐకరాజ్యమందు ద్వైరాజ్యలక్ష్మి అనడం విరోధం కదా! మూలమైన శేషస్వరూపం మాత్రం ఒక్కటే. శ్రీరామచంద్రస్వామి వనవాసానికి పోయినప్పుడు ఆ శేషరూపమే పాదుకా రూపంలో రాజ్యమేలింది. సౌమిత్రి (లక్ష్మణ) రూపంలో అరణ్య సంచారమూ చేసింది.

అంతేకాదు. పాదుకా రాజ్యం ఒక్కటే అయినా, పాదుకాదేవి రెండు మూర్తులుగా వెలసి పాలన సాగించింది. పాదుకలు రెండు అయినా ఆజ్ఞ ఒక్కటే కదా! అద్వితీయయైన పాదుక రెండు సమాన ఆకృతులుగా వెలసి, పరస్పరం ఐకమత్యంతో, వేద విహితంగా శాసిస్తూ రాజ్యాన్ని పాలించిందనడం వల్ల విరోధం పరిహరింపబడుతున్నది.

అప్పుడే కాదు, ఇప్పుడు కూడా ఒక్క శ్రీరంగరాజు రెండు చరణాలకు తగినట్లు సమాన ఆకృతులతో వెలసి, వాటిని ధరిస్తూ, ఉపాసించే ప్రజల యోగ, క్షేమాలను వహిస్తూ జనుల మనోనయనానందకరంగా పాదుకలు ప్రకాశిస్తున్నాయి. కాబట్టి విరోధం ఆభాసయే కదా!

సమాసోక్తితో కూడిన విరోధాభాసాలంకారం. మందాక్రాంతావృత్తం.

779. అప్రాప్తానా ముపజనయథస్సంపదాంప్రాప్తిమేవం
సంప్రాప్తానాం స్వయ మిహపునః పాలనార్థం యతేథే
సాక్షాద్రంగక్షితిపతి పదం పాదుకే! సాధయంత్యౌ
యోగక్షేమౌ సుచరితవశాన్మూర్తిమంతౌ యువాంనః ॥ 19

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకలారా! అప్రాప్తానాం = పొందని; సంపదాం = సంపదల; ప్రాప్తిం = ప్రాప్తిని; ఉపజనయథః = కలిగిస్తారు; పునః = మళ్ళీ; సంప్రాప్తానాం = పొందిన వాటియొక్క; పాలనార్థం = రక్షణకోసం; ఇహ = ఇక్కడ; ఏవం = ఈ రీతిగా; స్వయం = తామే; యతేథే = ప్రయత్నిస్తారు; సాక్షాత్ = ప్రత్యక్షంగా; రంగక్షితిపతిపదం = శ్రీరంగ భూపతి, చరణాన్ని / స్థానాన్ని; సాధయంత్యౌ = సాధింప చేస్తున్న; యువాం = మీరు; నః = మా యొక్క; సుచరిత వశాత్ = పుణ్యకారణం వల్ల; మూర్తిమంతౌ = శరీరాలు కలిగిన; యోగక్షేమౌ = యోగక్షేమాలుగా; (స్థః=ఉన్నారు).

**తా॥** ఓ పాదుకలారా! మీరు మాకు లేని సంపదలను కలిగిస్తారు. కలిగిన సంపదలను కాపాడడం కోసం, లోకంలో మేము చూస్తున్న రీతిగా, తామే పాటు పడుతారు. ప్రత్యక్షంగా శ్రీరంగ రాజు చరణాలను సాధించి ఇస్తున్న మీరు, రూపుగొన్న యోగక్షేమాలే. అది మా భాగ్యమే.

వ్యాఖ్య :- పాదుకలు మూర్తీభవించిన యోగక్షేమాలని వర్ణన

భగవత్పాదుకలు యోగక్షేమాలను కలిగించేవి కదా! కార్యకారణాలకు భేదం లేదు. కాబట్టి పాదుకలే స్వయంగా 'యోగక్షేమాలు' అని అర్థం. "యోగోఽపూర్వార్థ సంపత్తౌ." లేని సంపదలను పొందడం 'యోగం'. "క్షేమఃస్యాల్లబ్ధరక్షణే." పొందిన సంపదలను కాపాడడం 'క్షేమం' (విశ్వని).

భగవంతుని విషయమై లోకులకు అద్వేషాన్నీ, ఆభిముఖ్యాన్నీ పాదుకలు కలిగిస్తాయి. ఇది యోగం. ఇక క్షేమ రూపం కూడా పాదుకలే. భక్తులకు సదాచార్య సంపత్తిని కలిగించి, జ్ఞానోపదేశం ద్వారా వారి నిష్ఠనూ కాపాడుతాయి. వృద్ధిచేస్తాయి కూడా. చివరకు భగవత్పాదకమలాలను సేవింపచేస్తాయి; అంటే, మోక్షఫలాన్నీ ప్రసాదిస్తాయి, పాదుకలు.

అంతేకాదు. లోకుల భాగ్య పరిపాకం వల్ల భగవంతునికి కూడా పాదుకలు యోగక్షేమాలుగా ఉన్నాయి. భగవచ్చరణాలకు సాధనంగా ఉంది. ఆయాస్థలాలను పొందింపజేస్తాయి. అప్రాప్తస్థల ప్రాప్తి అవుతుంది భగవంతునికి. ప్రాప్తస్థలాల్లో పాదుకల చిహ్నాలు - గుర్తులు - పడడం వల్ల తదీయత్వమూ రక్షింపబడుతుంది కదా!

"కుశలం క్షేమ మస్త్రియామ్." (అమరం) క్షేమ శబ్దం పుంలింగమందూ ఉంది. కావ్యలింగాలంకారం. మందాక్రాంతా వృత్తం.

780\. బద్ధహరి పాదయుగళం

యుగళం తపనీయ పాదుకే! యువయోః ।

మోచయతి సంశ్రితానాం

పుణ్యాపుణ్యమయ శృంఖలాయుగళమ్ ॥ 20

**అర్థం:-** హేతపనీయపాదుకే = ఓ బంగారు పాదుకలారా! బద్ధ హరి పాదయుగళం = బంధింపబడిన భగవంతుని పాదద్వంద్వంగల; యువయోః = మీయొక్క; యుగళం = జంట; సంశ్రితానాం = ఆశ్రితుల యొక్క; పుణ్య + అపుణ్యమయ, శృంఖలాయుగళం = పుణ్య పాపాత్మకాలైన సంకెళ్ళ జంటను; మోచయతి = విడిపిస్తున్నది.

**తా॥** ఓ బంగారు పాదుకలారా! హరి చరణయుగళాన్ని బంధించిన మీయుగళం, ఆశ్రయించిన వారి సుకృత దుష్కృత రూపాలైన నిగళాల యుగళాన్ని తెంచుతుంది.

వ్యాఖ్య :- పాదుకలు రెండింటిని బంధించి, మరో రెండింటిని భంజిస్తాయి

పుణ్యమైనా, పాపమైనా అవి రెండూ సంకెళ్ళు. వాటితో జీవులు బద్ధులయ్యారు. బద్ధ జీవులు పాదుకలను కొలిచారు. పాదుకలు భగవంతుని పాదాలను కొలిచాయి. ఫలితమేమి? అంటే, బద్ధాత్మలు ముక్తాత్మలుగా పరిణమించడమే ఫలం.

"హరి ర్హరతి పాపాని" పాపాలను హరించే వాడు హరి. "విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి." (ఉపనిషద్వాణి)' బ్రహ్మజ్ఞాని పుణ్యపాపాలను దులిపివేసి, నిర్లిప్తుడై భగవంతునితో సాధర్మ్యాన్ని పొందుతాడు, అని వేదాంతం బోధిస్తుంది. 'బంధించే పాదుకాదేవి బంధాలను ఛేదిస్తుంది' అనడం వ్యాఘాతాలంకార లక్షణం.

హరిని తన కట్టుబడితో స్వాధీనం చేసుకొని, జీవులకు ముక్తిని సంపాదించడం వల్ల పాదుకాదేవికి జీవుల యందు ఆదరం అధికం, అనడమే స్వారస్యం కదా!

'యుగళ' పదాన్ని మూడుసార్లు ప్రయోగించడం 'పునరుక్తి' దోషమే. ధర్మ సూక్ష్మ వైలక్షణ్యం అద్భుతంగా ఉంటుంది.

"ఉదేతి సవితా తామ్ర స్తామ్ర ఏవాస్తమేతిచ."

'సూర్యుడు రక్తుడై ఉదయిస్తాడు, రక్తుడయ్యే క్రుంకుతాడు' - అన్న చోట 'తామ్ర' పదం కథిత పదమే కదా! అయినా, ఉదయాస్త మానసమయాల్లో సూర్యునికి ఏక రూపత్వమే ఉద్దేశ్యం. కాబట్టి, ఈ శ్లోకంలో 'యుగళం' మూడుసార్లు ఆవృత్తి యైనా, ఇది దోషం కాదు. గుణమే అన్నారు రసజ్ఞులు. యు=1, గ=3, ళ=3, మొత్తం సంఖ్య 7. శబ్దం మూడు ఆవృత్తులు = 3 × 7 = 21. శబ్దాక్షరాలు 3. 21+3 = 24. 24వ పద్ధతి ఇది. యుగళ

శబ్దాక్షరాలు = 3. యుగళ శబ్దార్థం = 2. 3×2 = 6. మూడు ఆవృత్తులు. 3×6=18. 'ద్వంద్వ' పద్ధతి ఇది. కాబట్టి 18+2=20 శ్లోకాలున్నాయి.

పాదుకాదేవి, మీద భగవంతునితోనూ, క్రింద దాసజనంతోనూ అనుభవించే ద్వంద్వ పద్ధతిని - తత్త్వ, హిత, పురుషార్థాలుగా భావింపబడే 'యుగళ' పదత్రయ ప్రయోగంతో - పూర్తి చేశారు సర్వతంత్ర స్వతంత్రులైన వేదాంత దేశికులు. ఆర్యావృత్తం.

ద్వంద్వ పద్ధతి సమాప్తం.

# 25. సంనివేశ పద్ధతి

781. అణో రణీయ సీం విష్ణోర్మహతోఽపిమహీయసీమ్ ।
ప్రపద్యే పాదుకాం నిత్యం తత్పదేనైవ సమ్మితామ్ ॥ 1

**అర్థం:-** విష్ణోః = విష్ణువు; అణోః = అల్పశరీరుడై ఉన్నప్పుడు; అణీయసీం = మిక్కిలి అల్పంగానూ; మహతః; అపి = బృహద్రూపుడై ఉన్నప్పుడు కూడ; మహీయసీం = కడు పెద్దగానూ; తత్ + పదేన, ఏవ = ఆ విష్ణు, చరణంతోనే / స్వరూపంతోనే; సమ్మితాం = సమపరిమాణంగా ఉన్న; పాదుకాం = పాదుకాదేవిని; నిత్యం = ఎల్లప్పుడు; ప్రపద్యే = ప్రపత్తిచేస్తాను.

**తా॥** శ్రీమహావిష్ణువు అణుస్వరూపుడైతే ఆయన పాదాలకు తగినట్లు కడు చిన్న సంనివేశంగానూ, బృహద్రూపుడైతే కూడా ఆయన స్వరూపానికి అనుగుణమైన కడుగొప్ప సంనివేశంగానూ ఉండే పాదుకాదేవిని శరణంగా పొందుతాను.

వ్యాఖ్య :- భగవత్పాదానుగుణ్యంగా సూక్ష్మ ఘనరూపంతో ఉండే పాదుకా సంనివేశ వర్ణన

భగవంతుని రూపం అణువుకంటెను. అల్పతరంగానూ, మహత్తుకంటెను మహత్తరంగానూ ఉంటుంది. "అణోరణీయాన్ మహతో మహీయాన్"

సర్వేశ్వరుడు అంతర్యామిగా సూక్ష్మాతి సూక్ష్మ స్వరూపుడు. విరాట్టుగా మహీయ స్స్వరూపుడు.

వామనుడై చిన్న దేహంతో ఉన్నప్పుడు పాదుకాదేవి ఆయన పాదావయవసమానంగా కడుచిన్న సంనివేశంతో ఉండింది. త్రివిక్రముడై భూనభోంతరాళమంతా వ్యాపించిన గొప్పదేహంతో ప్రకాశిస్తే, పాదుకా దేవి కూడా దానికి తగినట్లు బృహత్సంనివేశంగానే ఉండింది.

పాదుకా రూపానికి ఎచ్చు, తగ్గుల నియమనశక్తి ఉన్నా, భగవంతుని పాద తుల్యంగానే ఉంటూ పాదుక అణీయసి లేదా మహీయసిగా ఉండే ప్రభావం కలది. కావ్యలింగాలంకారంతోపాటు ప్రేయోలంకారమూ ఉంది. అనుష్టుప్ ఛందస్సు.

782. ప్రతి తిష్ఠతి పాదసమ్మితాయాం
త్వయి నిత్యం మణిపాదుకే! ముకుందః ।
ఇతరేతు పరిచ్ఛదాస్త ఏతే
విభవ వ్యంజన హేతవో భవంతి ॥ 2

**అర్థం:-** హేమణిపాదుకే = ఓ రత్నపాదుకా! ముకుందః = ఇహపరసుఖాలనిచ్చే శ్రియః పతి; పాద సమ్మితాయాం = (తన) చరణాలతో సమానమైన కొలతగల; త్వయి = నీయందు; నిత్యం = సర్వకాలం; ప్రతితిష్ఠతి = ప్రతిష్ఠితుడై ఉంటాడు, తే = ప్రసిద్ధాలైన; ఏ తే = ఈ; ఇతరే = వేరే; పరిచ్ఛదాః, తు = పరికరాలు మాత్రం; విభవ, వ్యంజన, హేతవః = ఐశ్వర్యం యొక్క ప్రకటనయందు కారణాలై; భవంతి = ఉంటున్నాయి.

తా॥ ఓ మణిపాదుకా! ముకుందుడు తన పాదాలతో సమాన పరిమాణంగల నీయందే ఎల్లకాలం నిల్చి ప్రతిష్ఠను పొందుతాడు. ఇక నీ కంటె ఇతర పరికరాలు మాత్రం భగవత్సంపదను ప్రకటిస్తుంటాయి.

వ్యాఖ్య :- పాదుకలకు ఇతర పరికరాలకు తారతమ్య పరిశీలన

ముకుందదాతీతి = ముకుందః, 'ముకుం' అనేది మకారంతమైన అవ్యయం, ముక్తినీ, భుక్తినీ ఇచ్చేవాడు ముకుందుడు. ముకుందునికి పాదం ఒక అవయవమైనట్లే పాదుక కూడా ఒక అవయవ సంనివేశమే. ఛత్రచామరాది పరికరాలు భగవంతుని వైభవాన్ని ప్రకటిస్తాయి. పాదుకలకు గొడుగు, వింజామరాలకంటె గొప్పతనముంది.

పాదుకలు ఈశ్వరత్వాన్ని అభివ్యక్తీ కరించేవి మాత్రమే కావు. మోక్షదాతపాదాలతో పాదుకలకు సమానస్థాయి ఉంది. నిలిచినా, నడిచినా భగవంతునికి పాదుకలవల్లనే ప్రతిష్ఠ, ప్రాభవం కలుగుతుంది.

ఇతర పరికరాలకంటె భగవత్ప్రతిష్ఠ పాదుకాధీనమనే అధిక్య వర్ణన వల్ల వ్యతిరేకాలంకారం. ఔపచ్ఛందసికం.

*783. తవ రంగ నరేంద్ర పాదరక్షే!*
*ప్రకృతి స్సన్నపి భక్తి పారతంత్ర్యాత్ ।*
*భవతీం వహతీవ పన్నగేంద్రః*
*ప్రథిత స్వస్తిక లక్షణైః శిరోభిః ॥* 3

**అర్థం:-** హేరంగ నరేంద్ర పాదరక్షే = ఓ రంగరాట్పాదుకా! పన్నగ + ఇంద్రః = సర్పరాజైన ఆదిశేషుడు; తవ = నీ యొక్క; ప్రకృతిః, సన్, అపి = మూలకారణమైనను; భక్తి పారతంత్ర్యాత్ = ప్రేమ పారవశ్యం వల్ల; భవతీం = నిన్ను; ప్రథిత, స్వస్తిక, లక్షణైః = ప్రసిద్ధమైన స్వస్తిక చిహ్నం కలిగిన; శిరోభిః = పడగలచేత; వహతి, ఇవ = ధరిస్తున్నట్లు ఉన్నాడు.

తా॥ ఓ రంగ నరేంద్ర పాదుకా! నీ మూల రూపమైన ఆదిశేషుడు నీ పట్ల ఉన్న ప్రేమతో ప్రసిద్ధమైన స్వస్తిక రేఖల అడయాళం కలిగిన వేయిపడగల చేత నిన్ను వహిస్తున్నట్లున్నాడు.

వ్యాఖ్య :- నాగుపాము పడగమీది రేఖలు పాదుకల సంనివేశంగా ఉత్ప్రేక్షితం

శేషుని పడగలపైన సహజమైన స్వస్తికమనే శుభ లక్షణ రేఖలుంటాయి. పాదుకలతో సమాన ఆకారం కలిగిన స్వస్తిక రేఖలు ఆదిశేషుని సహస్ర ఫణాళిమీద లాంఛనంగా ఉండడం వల్ల, శేషుడు భగవంతుని ఆదరాభిమానాలను పొందిన పాదుకా సంనివేశాన్ని భక్తితో తలదాల్చాడని కవి రాడ్వ్యాప్తి చిత్రి. ఔపచ్ఛందసికం.

*784. పరస్య పుంసః పద సన్నివేశాన్*
*ప్రయుంజతే భావిత పంచరాత్రాః ।*
*అఘప్రతీపానపదిశ్య పుండ్రా*
*నంగేషు రంగేశయ పాదుకే! త్వామ్ ॥* 4

అర్థం:- హేరంగేశయ పాదుకే = శ్రీరంగ విమానమందు పవళించిన భగవంతుని పాదుకా! భావిత పంచరాత్రాః = పరిశీలించిన పాంచరాత్ర శాస్త్రంగల పురుషులు; పరస్య, పుంసః = పరమపురుషునియొక్క; పదసన్నివేశాన్ = పాదాల సంనివేశం లాంటి సంనివేశంగల; అఘప్రతీపాన్ = పాపాలకు ప్రతిభటమైన; పుండ్రాన్ = ఊర్ధ్వపుండ్రాలను; అపదిశ్య = వ్యాజంగా జేసుకొని; త్వాం = నిన్ను; అంగేషు = అవయవాలయందు; ప్రయుంజతే = ధరిస్తున్నారు.

తా॥ ఓ రంగేశయ పాదుకా! పంచరాత్రమనే ఆగమశాస్త్రాన్ని పరిశీలించిన శ్రీ వైష్ణవులు భగవంతుని చరణాలను పోలిన స్వరూపం గల, పాపవిరోధాలైన ఊర్ధపుండ్రాలనెపంతో నిన్ను తమ అవయవాలయందు ధరిస్తారు.

## వ్యాఖ్య :- ఊర్ధ్వపుండ్రాలు పాదుకా సంనివేశాలని వర్ణన

'పాంచరాత్రం' అనేది భగవచ్ఛాస్త్రం. దానికి 'ఏకాయనం' అనే పేరు ఉంది. ఆ శాస్త్రంలో శ్రీవైష్ణవ ధర్మాలన్ని బోధింపడినాయి. శ్రీవైష్ణవులు తమ విధులను, భగవదారాధనాది ప్రక్రియలను పాంచరాత్రాగమ ప్రకారంగా నిర్వహిస్తారు. స్నానంచేసిన వెంటనే ఊర్ధ్వపుండ్రాలను ధరించడమూ విధియే కదా!

భగవంతుని పాదాలతో సమాన స్వరూపమైన ఊర్ధ్వపుండ్రాలను శ్రీ వైష్ణవులు ధరిస్తారు. పాపాలను ప్రతిఘటించే స్వరూపమది. పాదుకలు భగవచ్చరణ సమాన పరిమాణం కలవి కాబట్టి, ఊర్ధ్వపుండ్రాలనే మిషతో భక్తులు, పాదుకా సంనివేశాలనే తమ అవయవాలయందు ధరిస్తారని దేశికులు విశదపరచారు.

"హరేః పాదాకృతి మాత్మనోహితాయ మధ్యే ఛిద్రమూర్ధ్వపుండ్రం యోవిదధాతి స పరస్యపుంసః ప్రియోభవతి, సముక్తిభాగ్భవతి". (అధర్వణం) 'భగవంతుని పాదాలరూపమైన ఊర్ధపుండ్రాలను ధరించిన వ్యక్తికి శ్రేయస్సు కలుగుతుంది. ఆ వ్యక్తి శ్రీమన్నారాయణుని ప్రేమకు పాత్రుడవుతాడు, ముక్తి నీ పొందుతాడు' అని వేదవాణి.

"శౌతస్మార్త క్రియాః సర్వాః ఊర్ధ్వ పుండ్ర మకుర్వతామ్ ।
జాయంతేనిష్ఫలాబ్రహ్మన్ బాధితాశ్చ భవంతితాః ॥ (బ్రహ్మాండపురాణం)

ఊర్ధ్వపుండ్రాలను ధరించకుండా శ్రుతులూ, స్మృతులూ బోధించిన రీతిగా కర్మకలాపాలను శ్రద్ధతో చేసినా, అవి ఫలమీయవు. అంతేకాదు; శబ్దశక్తితో కూడిన ఆ కర్మలన్ని తిరిగి బాధించక మానవుకదా!

"ధృతోర్ధ్వ పుండ్రః పరమే శితారం నారాయణం పూజయతి స్మభక్త్యా ।
అర్ఘ్యాదిభిః పౌరుషసూక్త మంత్రైః సంప్రాప్నుయాత్ విష్ణు పదం మహాత్మా ॥" (కఠశాఖ - శ్రుతి)

"అర్చనాదౌ యజ్ఞమూర్తే రూర్ధ్వ పుండ్రం" మొదల్కొని "కులం తారయతే సప్త సగచ్ఛేత్ వైష్ణవం పదమ్" అని భల్లశాఖ బోధించింది. ఊర్ధ్వపుండ్ర ధారణం తర్వాత భగవంతుణ్ని పురుష సూక్తమంత్రాలచే షోడశోపచారాలుగా పూజించిన వ్యక్తి మహాత్ముడై మోక్ష ఫలాన్ని పొందుతాడన్నది కాఠక శ్రుతి. ఊర్ధ్వ పుండ్రాలను ధరించి యజ్ఞ మూర్తిని అర్చిస్తే, ఆయన వంశం ఏడు తరాల వరకు తరిస్తుంది. ఆయన కూడా మోక్షం పొందుతాడన్నది భాల్లవిశాఖా శ్రుతి.

ఇవి బాహ్య చిహ్నలే కదా! అంతశ్చిహ్నలుంటే - మనస్సు మంచిగ ఉంటే - చాలుకదా? అనే వారెందరో మహానుభావులున్నారు. అంతశ్చిహ్నలకు బాహ్యచిహ్నలు అంగభూతాలు. మగనాలికి మంగళ సూత్రం, నాణాలమీద ముద్రలు ఎందుకో గమనించాలి. సృష్టి స్రష్టకు బాహ్య చిహ్నమే.

"భగవదృక్త్యోర్ధ్వపుండ్రీ వశిష్ఠః కశ్యపో ఽత్రిరగస్త్యః జామదగ్నిర్విశ్వా మిత్రో యమో వ్యాసః పరాశర స్సనక స్సనందన శ్శుకోవామదేవ స్స్రబ్రహ్మణో భవతి" (శత పథబ్రాహ్మణం)

వశిష్ఠ, కశ్యప, అత్రి, అగస్త్య, జామదగ్ని, విశ్వామిత్ర, పరాశర, పారాశర్యాది మహర్షులు ఊర్ధ్వపుండ్రాలను యథావిధిగ ధరించి, పరబ్రహ్మోపాసనచేసి, విశ్వశ్రేయస్కాములై, విష్ణుభక్తులైనారు కదా!

తిరుమణిదురిత విదూరము
తిరుమణి సౌభాగ్యకరము త్రిజగములందున్ !
తిరుమణి పెట్టిన మనుజుడు
పరమ పవిత్రుండు భాగ్యవంతుడు కృష్ణా ॥ (కృష్ణశతకం - 94)

'తిరుమణి' అంటె శ్వేతమృత్తిక - తెల్లమట్టి. అమంగళాన్ని తొలగిస్తుంది.

"ఊర్ధ్వపుండ్రస్యమధ్యేతు విశాలే ఽతిమనోహరే ।
లక్ష్మ్యాసార్థం సమాసీనో రమే ఽహంతత్రనిర్వృతః"॥ (సచ్చరిత్రరక్ష)

తిరుమణి ఊర్ధ్వపుండ్రాల మధ్యన శ్రీచూర్ణరేఖతో శోభించే ముఖం శ్రీవైష్ణవ స్వరూపం. ఇది యమ ధర్మరాజుకూ భీతిని కలిగిస్తుంది.

*అంగేషు :-*

"ఊర్ధ్వగత్యాం హి యస్యేచ్ఛా తస్యోర్ధ్వం పుండ్రముచ్యతే ।
ఊర్ధ్వగత్యాతు దేవత్వం ప్రాప్నోతీహనసంశయః" ॥ (సచ్చరిత్రరక్ష)

సద్గతిని కోరే చిహ్నంకాబట్టి ఊర్ధ్వపుండ్రమని పేరు. ఊర్ధ్వపుండ్రధారి నిస్సంశయంగా సాయుజ్యాన్ని పొందుతాడు.

"గృహస్థో లలాటాదిషు ద్వాదశ స్థానేషు అనామికాంగుళ్యాకేశవాది ద్వాదశనామభిః ధారయేత్" - అంగుష్ఠేన బ్రహ్మచారీ=బొటనవ్రేలితో బ్రహ్మచారి; అనామికా గృహస్థస్య=ఉంగరపు వ్రేలితో గృహస్థుడు; వనస్థస్యతు మధ్యమా=వానప్రస్థుడు నడిమివ్రేలితోనూ; తర్జనీ భిక్షుకస్యైవ=సన్యాసి చూపుడు వ్రేలితోనూ ఊర్ధ్వ పుండ్రాలను ధరించాలి. రాగి, వెండి పుల్లతోనైనా ధరించవచ్చును. "ఊర్ధ్వపుండ్రస్యకరణే నిషిద్ధా మధ్యమాంగుళిః" ముఖ్యంగా గృహస్థుడు మాత్రం ఊర్ధపుండ్రాల ధారణకు (పెద్ద) నడిమి వ్రేలును ఉపయోగించరాదని శాస్త్రం. ముఖమందు శ్రీచూర్ణం దీప శిఖాకారంగా ధరించాలి.

ధారణక్రమం :- తిరుమణిని లలాటమందు కేశవాయనమః అంటూ, ఉదరమధ్యన నారాయణాయనమః; వక్షఃస్థలాన మాధవాయనమః; కంఠమధ్యన గోవిందాయనమః; పొట్టకు కుడిప్రక్కన విష్ణవే నమః; కుడి భుజాన మధుసూదనాయనమః; మెడకు కుడివైపు త్రివిక్రమాయనమః; పొట్టకు ఎడమవైపు వామనాయనమః; ఎడమ భుజాన శ్రీధరాయనమః; మెడకు ఎడమ భాగాన హృషీకేశాయనమః; వీపుమీద పద్మనాభాయనమః; కంఠానికి వెనుకవైపు దామోదరాయనమః; అంటూ క్రమంగా ధరించాలి. శ్రీచూర్ణాన్ని కూడా పంద్రెండుస్థానాల్లో అదేక్రమంగా 1) శ్రియైనమః, 2) అమృతోద్భవాయైనమః, 3) కమలాయైనమః, 4) చంద్రశోభిన్యై నమః, 5) విష్ణుపత్న్యై నమః, 6) వైష్ణవ్యై నమః, 7) వరారోహాయైనమః, 8) హరివల్లభాయైనమః, 9) శార్ఙగిణ్యై నమః, 10) శ్రీదేవ దేవ్యైనమః, 11) శ్రీమహాలక్ష్మ్యైనమః, 12) లోకసుందర్యైనమః అంటూ ధరించాలి. 1) బ్రహ్మ రాత్రం, 2) శివరాత్రం 3) ఇంద్రరాత్రం, 4) నాగరాత్రం, 5) ఋషిరాత్రం - వీటిని పంచరాత్ర మంటారు. (భరద్వాజ సంహిత)

కైతవాపహ్నవాలంకారం. 'జాయ' అనే ఉపజాతి వృత్త (భేద)ం.

*785. విమృశ్య రంగేంద్ర పతిం వరాయాః*
*శ్రుతేః స్థితాం మూర్ధని పాదుకే! త్వామ్ ।*
*బధ్నంతి వృద్ధాః సమయే వధూనాం*
*త్వన్ముద్రితాన్యాభరణాని మౌళౌ ॥* 5

**అర్థం:-** హే పాదుకే = ఓపాదుకా! వృద్ధాః = పెద్దలు; రంగ + ఇంద్ర పతింవరాయాః = శ్రీరంగనాథుణ్ని భర్తగా వరించిన; శ్రుతేః = శ్రుతియొక్క; మూర్ధని = శిరస్సున; త్వాం, స్థితాం = నీవు ఉండగా; విమృశ్య = పరామర్శించి; సమయే = వివాహకాలమందు; వధూనాం = పెండ్లిపడుచులయొక్క; మౌళౌ = శిరస్సునందు; త్వత్ + ముద్రితాని = నీ ముద్రలున్న; ఆభరణాని = భూషణాలను; బధ్నంతి = కట్టుతున్నారు.

**తా॥** ఓ పాదుకా! నీవు రంగపతిని వరించిన నిగమకాంత శిరస్సున ప్రకాశిస్తుంటావు. వృద్ధులు నీ ఉనికిని ఆలోచించి వివాహవేళలో పెండ్లి పడుచుల శిరస్సున నీ రూపమున్న నగలను ధరింపజేస్తారు.

వ్యాఖ్య :- కల్యాణసమయంలో నూత్నవధువుల శిరస్సున పాదుకాముద్రితాభరణాలను ధరింపజేసే వర్ణన

శ్రుతిశిరస్సు అంటె ఉపనిషత్తులు. భగవత్పాదుకలను ఉపనిషత్తులు ప్రతిపాదిస్తాయి. జ్ఞానాధికులు పాదుకాంకితాలైన శ్రుతికాంతల సౌమంగల్యాన్ని తిలకించారు. తమ పెండ్లి కూతుళ్ళకు ఆ సౌమంగల్యాన్ని అపేక్షిస్తూ, పెద్దలు పాదుకాకారరేఖలుగల నగలను వధువుల శిరస్సున ధరింపజేస్తారు.

ఉత్ప్రేక్షాలంకారం. 'భద్ర' అనే ఉపజాతి వృత్తం.

786. వహంతి రంగేశ్వర పాదరక్షే
దీర్ఘాయుషాం దర్శితభక్తి బంధాః !
ఆశాధి పానా మవరోధ నార్య
స్త్వన్ముద్రికాం మంగళ హేమ సూత్రే॥ 6

అర్థం:- హే రంగేశ్వర పాదరక్షే = ఓ రంగనాథ పాదుకా । దీర్ఘ + ఆయుషాం = చిరకాల జీవులైన; ఆశా + అధిపానాం = దిక్పతులయొక్క: అవరోధ నార్యః = అంతః పురస్త్రీలు; దర్శిత భక్తిబంధాః = చూపబడిన ప్రేమోత్కర్షకలవారై: మంగళ హేమసూత్రే = మంగళార్థమైన బంగారు (పుస్తెల) తాడునందు; త్వత్ + ముద్రికాం = నీ ముద్రికను: వహంతి = ధరిస్తారు.

తా॥ ఓ శ్రీరంగపతిపాదుకా! దిక్పాలకులు దీర్ఘాయుష్మంతులు. వారి పత్నులు నీయందు మిక్కిలి భక్తి కలవారు. కాబట్టి ఆశాధి పతుల భార్యలు బంగారు మంగళసూత్రమందు నీ రూపరేఖలు గల మాంగల్యాన్ని ధరిస్తారు.

వ్యాఖ్య :- దిక్పతుల పత్నులు పాదుకాంకిత మంగళ సూత్రాన్ని ధరిస్తారని వర్ణన

దిక్పతుల భార్యలు భక్తితో పాదుకాస్వరూపం కలిగిన పుస్తెలను స్వర్ణమంగళ సూత్రంతో కట్టి, కంఠాభరణంగా ధరిస్తారు. వారి భర్తలు అష్టదిక్కులను భద్రంగా పాలిస్తూ, చిరంజీవులుగా మనడానికి వారి మంగళా భరణధారణమే కారణం. అది సౌభాగ్యవతులుగా రాణించడానికీ హేతువనడం భంగ్యంతర కథనం. 'మంగళ హేమసూత్రైః' అని పాఠాంతరమూ ఉంది. మాంగల్యాభరణం పాదుకా సంనివేశమే అని ఉత్ప్రేక్ష. 'కీర్తి' అనే ఉపజాతి వృత్తం.

787. వ్యూహక్రమేణ ప్రథితారమగ్రే
సందర్శయంతీం మణిపాదుకే! త్వామ్ !
పాతుం త్రిలోకీం పద పద్మభాజం
సౌదర్శనీం శక్తి మవైమి శౌరేః ॥ 7

అర్థం:- హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! వ్యూహక్రమేణ = వ్యూహావతారాల ప్రకారంగా /సామూహిక నియమంతో: ప్రథితారం = విస్తరించిన భగవంతుణ్ని/ప్రథిత + అరం = ప్రసిద్ధ చక్రపుటారెలుకలిగిన సుదర్శనపురుషుణ్ని; అగ్రే = ఎదుట/మీద; సందర్శయంతీం = చూపుతున్న/ప్రకాశింప జేస్తున్న; త్వాం = నిన్ను; త్రిలోకీం = ముజ్జగాలను; పాతుం = కాపాడడానికి; శౌరేః = భగవంతునియొక్క; పదపద్మభాజం = పాదకమలాలను పొందిన / పద్మంలాంటిస్థానాన్ని ఆశ్రయించిన; సౌదర్శనీం = సుదర్శనమనే చక్ర సంబంధమైన; శక్తిం = యంత్రశక్తిగా; అవైమి = భావిస్తున్నాను.

తా॥ ఓ మణిపాదుకా! నాలుగు వ్యూహావతారాల ప్రకారంగా వ్యాపించి ప్రసిద్ధిగాంచిన భగవంతుణ్నిపై భాగాన ప్రకాశింపజేస్తూ ప్రదర్శిస్తున్న, ముల్లోకాల రక్షణ కోసం భగవత్పాద పద్మాలను ఆశ్రయించిన నిన్ను, సామూహికంగా చక్రపుటారెలతో ప్రసిద్ధమైన సుదర్శనపురుషుణ్ని ఎదుట ప్రకాశింపజేస్తూ చూపుతున్న జగత్త్రయ రక్షణార్థం భగవత్పద వ్యూహాన్ని, పద్మవ్యూహాన్నీ ఆశ్రయించియున్న సుదర్శన యంత్ర శక్తిగా తలుస్తున్నాను.

వ్యాఖ్య :- పాదుకాయుగళ సంనివేశం సుదర్శన యంత్రంగా ఉత్ప్రేక్షితం.

నిత్య సూరులలో ఒకడైన సుదర్శనుడు భగవంతుని చేతిలో అలంకారంగా ప్రకాశిస్తాడు. భగవత్సంకల్పం వల్ల దుష్టులను సంహరించి లోకాలను కాపాడేశక్తి సుదర్శనునికి ఉంది.

భగవంతుని పాదాలయందు పాదుకాయుగళం ప్రకాశిస్తుంది. దీనికి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అనే వ్యూహచతుష్టయంగా విస్తరించే భగవంతుని పాద పద్మాలను ఆశ్రయించి జగద్రక్షణ చేసే సత్త ఉంది. 'సుదర్శన శక్తి' అంటే సుదర్శన యంత్ర విన్యాస రీతి. "అరం శీఘ్రేచ చక్రాంగే" (అమరం)

సుదర్శన యంత్రమందు మధ్యన త్రికోణాకారం గల రెండు రేఖలు ఎదురెదురుగా ఉంటాయి. వృత్తరేఖ వీటిని ఆవరించి ఉంటుంది. ఆ పైన చుట్టూ పద్మదళాలు ఉంటాయి. ఆపైన మళ్ళీ ఒక మండల రేఖ ఆవృత్త మవుతుంది. దానికి పైన నాలుగు దిక్కుల్లో జ్వాలా రేఖలు ప్రజ్వలిస్తుంటాయి.

వికసిత పద్మాలనడుమ పరస్పరం వ్యతిరేకంగా ఉన్న రెండు త్రికోణాలను - షట్కోణ సంనివేశాన్ని - చూస్తే, అన్యోన్యం అభిముఖంగా ఉండే మూడు జతల పాదుకల - షట్పాదుకల - సంనివేశంగా గోచరిస్తుంది. చక్రనేమిలో ఆకులున్నట్లే యంత్ర మందు పద్మదళాలూ ఉంటాయి. సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధుల పాద పద్మవ్యూహాన్ని బట్టి పాదుకావ్యూహం ఉన్నట్లే, పద్మాకారవ్యూహం సుదర్శన యంత్రమందు ఉంది. అలాగే, ప్రథితార సందర్శకత్వం, పద్మభాక్త్వం అంటే, చక్రరేఖ, పద్మరేఖ పాదుక యందు ఉంది.

స్వర్గ, మర్త్య, పాతాళ లేదా భూర్భువ స్వర్లోకాలను కాపాడడానికి పాటుపడే వాళ్ళకు భగవంతుని పద పద్మాలను ఆశ్రయించడం అవశ్యకం. ఇంద్రవజ్రావృత్తం.

*788. బద్ధాసికా కనక పంకజ కర్ణికాయాం*
*మధ్యే కృశా మురరిపో ర్మణిపాదుకే ! త్వమ్ !*
*సందృశ్యసే సరసిజాసనయా గృహీతం*
*రూపాంతరం కిమపి రంగవిహారయోగ్యమ్ ॥ 8*

**అర్థం:-** హే మురరిపోః, మణిపాదుకే = ఓ మురారి మణిపాదుకా! కనకపంకజ కర్ణికాయాం = బంగారుతామరపూవుయొక్క దుద్దునందు; బద్ధా + ఆసికా = బద్ధమైన ఉనికి కలిగిన; మధ్యే = నడుమ; కృశా = సన్నగా ఉన్న; త్వం = నీవు; సరసిజ + ఆసనయా = కమలవాసినియైన లక్ష్మిచేత; గృహీతం = గ్రహింపబడిన; రంగవిహారయోగ్యం = శ్రీరంగమందు సంచరింప దగిన / నాటకరంగమందు నర్తనకు ఉచితమైన; కిం, అపి = విలక్షణమైన; రూప + అంతరం = వేరే శరీరంగా సందృశ్యసే = కనబడుతున్నావు.

**తా॥** ఓ మురవైరి మణిపాదుకా। స్వర్ణకమల కర్ణికయందా సీనవై, నడుమ కృశించియున్న నీవు, పద్మవాసినియైన లక్ష్మీదేవి దాల్చిన రంగవిహార యోగ్యమై అనిర్వాచ్యమైన వేషాంతరంగా కనబడుతున్నావు.

వ్యాఖ్య :- పాదుకాసంనివేశం, లక్ష్మీదేవి నర్తనకోసం కట్టిన వేషమని వర్ణితం

భగవంతుడు ఉల్లాసంగా సంచరించడానికి తగిన రూపం పాదుకాదేవికి ఉంది. భగవంతునిముందు పద్మపీఠం మీద ఆసీనయై ఉంటుంది. సాధారణంగా తామరపూవు పైన రెండుపాదుకలు భగవంతుని సన్నిధిలో ఉన్నట్లు కనబడుతుంది శఠారి.

నడుముసన్నగా ఉండడం ఉత్తమ స్త్రీ లక్షణం. పుష్పవాసినియైన లక్ష్మి నాటకరంగమందు కచ్చెకట్టి నాట్యమాడడానికి ధరించిన మారువేషమో అన్నట్లు పాదుకయొక్క ఉనికి నిరూపింపబడినది.

శ్లేషతోకూడిన ఉత్ప్రేక్షాలంకారం. వసంత తిలకా వృత్తం.

*789. మానోచితస్య మదధీన జనస్య నిత్యం*
*మాభూదతః కృపణ తే తి విచింతయంత్యా ।*
*బందీకృతం ధ్రువ మవైమి వలగ్న దేశే*
*కార్శ్యం త్వయా కమలలోచన పాదరక్షే ।* 9

**అర్థం:-** హేకమలలోచన పాదరక్షే = ఓ పద్మాక్షుని పాదుకా! నిత్యం = ఎల్లప్పుడు; మాన +ఉచితస్య = పూజింపదగిన; మత్ + అధీన జనస్య = నన్నాశ్రయించిన జనానికి; అతః = విభవం లేనందువల్ల; కృపణతా = దీనస్థితి; మాభూత్ = ఉండకూడదు; ఇతి = అని; విచింతయంత్యా = చింతిస్తున్న; త్వయా = నీ చేత; వలగ్న దేశే = మధ్యభాగమందు (నడుమున) కార్శ్యం = తనుత్వమనే దారిద్ర్యం; ధ్రువం = దృఢంగా; బందీకృతం = చెఱపెట్టబడినదిగా; అవైమి = తలుస్తున్నాను.

**తా॥** ఓ కమలలోచను పాదుకా! నిత్యం నన్నాశ్రయించిన మాన్యులైన వ్యక్తులకు ఐశ్వర్యం లేనందువల్ల ఎవరైనా అవమానించే దయనీయ స్థితి కలుగకూడదని చితించే నీవు, నీ నడుముకు దరిద్రాన్ని బలాత్కారంగా కట్టివేసుకొన్నావని భావిస్తున్నాను.

వ్యాఖ్య :- పాదుకాదేవి తన నడుమున ఆశ్రితుల'లేమి'ని కట్టివేసుకొన్నదని ఉత్ప్రేక్ష

'కార్శ్యం' అంటే బక్కచిక్కినతనం. కార్శ్యం దారిద్ర్యంగా అధ్యవసింపబడింది. సన్నని నడుము వైరాగ్యానికి చిహ్నామంటారు విజ్ఞులు. ముందుభాగం, వెనుక భాగం కొంచెం విశాలంగా ఉండి, మధ్యభాగం సన్నగా ఉండే పాదుకాస్వరూపనిరూపణమిది.

పాదుకాదేవి తను మధ్యగా ఉండడానికి హేతువేమిటి? ఐశ్వర్యం లేని జనులు తనను ఆశ్రయించిన తర్వాత లోకులచిన్న చూపుతో బాధపడకూడదు. వారు అమర్యాదకు గురికాకూడదు అని పాదుకాదేవి భావించింది. కాబట్టి ఆశ్రితుల దారిద్ర్యాన్ని పాదుకాదేవి బలాత్కారంగా లాగి, తిరిగి వారి దగ్గరికి పోకుండా, తన నడుముకేదృఢంగా కట్టివేసుకొన్న అమోఘ కరుణారూపిణి. సంనివేశ చమత్కారం. వసంత తిలకావృత్తం.

**790.** *మధ్యేకృశా ముభయతః ప్రతిపన్న వృద్ధిం*
*మన్యే సమీక్ష్య భవతీం మణిపాదరక్షే!*
*నిత్యం ముకుంద పద సంగమ విప్ర యోగౌ*
*నిశ్చిన్వతే కృతధియః సుఖదుఃఖ కాష్ఠామ్ ॥* 10

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! మధ్యే = నడుమ; కృశాం = సన్నగా ఉన్న; ఉభయతః = ముందు వెనుక రెండు భాగాల్లో; ప్రతి పన్నవృద్ధిం = పొందబడిన వృద్ధిగల; భవతీం = నిన్ను; సమీక్ష్య = చూచి; కృతధియః = విద్వాంసులు; నిత్యం = ఎల్లప్పుడు; ముకుంద పదసంగమవిప్రయోగౌ = ముకుందుని చరణాలపొందు, ఎడబాటు అనే రెండింటిని; సుఖదుఃఖ కాష్ఠం = సుఖదుఃఖాలచరమసీమగా; నిశ్చిన్వతే = నిశ్చయిస్తారని; మన్యే = తలుస్తాను.

**తా॥** ఓ రత్నపాదుకా! నీ రూపంలో ముందు వెనుకభాగాలు రెండు వృద్ధిచెంది, మధ్యభాగం సన్నగిలి ఉంటుంది. ఇలా ఉన్న నిన్ను విద్వాంసులు చూచి, ముకుందుని పాద సంశ్లేషతో కూడిన భాగ ద్వయం సుఖానికి పరమావధిగానూ, విశ్లేషతో కూడిన మధ్యభాగం దుఃఖానికి చరమావధిగానూ నిర్ణయిస్తారని భావిస్తాను.

వ్యాఖ్య :- భగవత్పాద సంశ్లేష విశ్లేషాలు పాదుకావయవ వృద్ధి కార్శ్య దర్శన హేతువులని ఉత్ప్రేక్ష

పరమైకాంతులు భగవచ్చరణాల సంబంధం పొందడమే సుఖానికి, సంబంధరాహిత్యమే దుఃఖానికి పరాకాష్ఠ, అని దృఢాధ్యవ సాయం కలిగి ఉంటారు. వేరే సుఖదుఃఖాలు లేనేలేవు.

"యన్ముహూర్తం క్షణం వా ౭పి వాసుదేవోనచింత్యతే।
సాహాని స్తన్మహచ్ఛిద్రం సాభ్రాంతిః సాచవిక్రియా" ॥

ఒక్క క్షణమైనా వాసుదేవుణ్ని ధ్యానించక ఉంటే పెద్ద ఆపత్తుగానూ, గొప్ప దుఃఖంగానూ భావిస్తారు. పరమ భక్తులు, అని శాస్త్రం.

భగవంతుడు పాదుకలను ధరించినప్పుడు, పాదుకల ముందు, వెనుక భాగాల మీదపాదాలభారం పడడం వల్ల ఆ రెండు భాగాలు వృద్ధిచెందాయి. పాదాల మధ్యభాగం ఉబ్బెత్తుగా ఉండడం వల్ల, అరకాళ్ళ స్పర్శ పాదుకలకు కలుగదు. కాబట్టి చరణ స్పర్శకలుగని పాదుకా మధ్యభాగం కృశించింది.

"యస్త్వయాసహ స స్వర్గో నిరయో యస్త్వయావినా" (రామాయణం)

"భగవంతునితో కలిసి ఉంటే స్వర్గం, లేకపోతే అది నరకమే" - అన్నాడు. వాల్మీకి మహర్షి.

"జ్ఞానీతు పరమైకాంతీ తదాయత్తాత్మజీవనః ।
తత్సంయోగ వియోగైక సుఖదుఃఖస్తదేకధీః ॥ (29)

అన్యదేవతలను తలచక జగత్కారణ భూతుడైన శ్రియః పతినే ఉపాసించేవాడు ఏకాంతి. జ్ఞాని ఏకాంతులలో శ్రేష్ఠుడు. అనన్యదేవతాకుడే కాక అనన్యప్రయోజనుడు పరమైకాంతి. తన జీవనం పరమాత్మ పరంగానే గడుపుతూ, పరమాత్ముని తోడి సంయోగమే సుఖంగానూ, వియోగమే దుఃఖంగానూ నిశ్చయించుకొని ఉంటాడు జ్ఞాని, అని శ్రీ యామునాచార్యులు 'గీతార్థ సంగ్రహం'లో విశదీకరించారు.

పాదుకా సంనివేశాన్ని సమీక్షించిన జ్ఞానులకు 'భగవచ్చరణకమల పరిభజనమే సుఖహేతువు, అది లేకుంటే దుఃఖహేతువు' అని తెలుసునంటారు దేశికులు. ఇది నమ్మాళ్వార్ల దివ్యానుభూతియే. వసంతి తిలక.

*791. రంగేశితు శ్చరణ పంకజయో ర్భజం తీ*
*రక్షాప్రసాధన వికల్ప సహా మవస్థామ్ ।*
*మాన్యాకృతిర్ని విశసే మణిపాదరక్షే ।*
*మధ్యే పరిచ్ఛద విభూషణ వర్గయోస్త్వమ్ ॥ 11*

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! మాన్యా + ఆకృతిః = పొగడదగిన స్వరూపం కలిగిన; త్వం = నీవు; రంగ+ఈ శితుః = శ్రీరంగప్రభువు యొక్క; చరణ పంకజయోః = పాదపద్మాలయొక్క; రక్షా, ప్రసాధన వికల్ప సహాం = రక్షణకుగానీ, అలంకరణకుగానీ (రెండు పక్షాలకు) సమర్థమైన; అవస్థాం = దశను; భజంతీ = పొందుతున్న దానవై; పరిచ్ఛద, విభూషణ వర్గయోః = పరికరాల యొక్క, ఆభరణాల యొక్క (రెండు) తెగలకు; మధ్యే = నడుమ; నివేశసే = స్థానాన్ని పొందుతున్నావు.

**తా॥** ఓ మణి పాదుకా। నీ ఆకారం మాననీయమైనది. శ్రీ రంగరాట్పాద సరోజాల రక్షణకూ, అలంకరణకూ వివిధ కల్పనలను సహించే దశను అనుభవిస్తూ, పరిచ్ఛద వర్గంలోనూ, భూషణ వర్గంలోనూ ప్రవేశిస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకాసంనివేశం అనేక స్థానాల్లో రాణిస్తుందని వర్ణితం.

ఎండసోకకుండా, వానకు తడువకుండా భగవద్విగ్రహాన్ని కాపాడే పరిచ్ఛదం ఛత్రం. తాపాన్ని పోగొట్టే చల్లని గాలిని వీచే పరికరం చామరం. ఛత్ర చామరాలు శరీరాన్ని కాపాడుతున్నట్లే, పాదుకలు చల్లగా, మెత్తగా, నునుపుగా నిగనిగలాడే కమలాల్లాగా వికసించి ఉండే శ్రీమంతుని చరణాలను నిండుగా వ్యాపించి ఉండి కాపాడడం వల్ల పరిచ్ఛద వర్గంలోనూ రాణిచడం ఒకటి.

అందాన్ని కూర్చేది ఆభరణం. నానారత్నఖచిత కాంచన పాదుకలు భగవత్పాదాలకు ముందు, వెనుక భాగాల్లో కాస్త ఎక్కువగా ఉండి, మీగాళ్ళమీదనూ కొంత భాగం ఉండి, ధగధగ ప్రకాశిస్తూ సౌందర్యాన్ని సమకూర్చడం వల్ల విభూషణ వర్గంలోనూ వన్నె వాసి కెక్కడం మరొకటి. వివిధమైన కల్పం = వికల్పం. వేర్వేరు ప్రయోజనాలను ఒకే సమయాన నెరవేర్చే సామర్థ్యమున్న అవస్థ - ఉనికి పాదుకాదేవికి ఉంది. ఒక పనికి ఉపయోగపడుతున్నప్పుడు మరో పనికి ఉపయోగపడదనే అవ్యవస్థ లేని స్వరూపం పాదుకా దేవిది. కాబట్టి మాన్యాకార కదా! అనేకత్ర రాణించే వర్ణన వల్ల విశేషాలంకారం - వసన్త తిలకా వృత్తం.

792. అంగాంతరేషు నిహితా న్యఖిలాని కామం
పర్యాయకల్పన సహాని విభూషణాని !
నిత్యం ముకుంద పదపద్మతలానురూపం
నైపథ్యమంబ! భవతీనయనాభిరామమ్ ॥ 12

**అర్థం:-** హే అంబ = ఓ అమ్మా! అంగ + అంతరేషు = భగవంతుని ఇతర అవయవాలయందు; నిహితాని = సమర్పించబడిన; అఖిలాని = సమస్తమైన; విభూషణాని = ఆభరణాలు; కామం = ఇష్టప్రకారం; పర్యాయకల్పన సహాని = ఆ యా అవయవాలయందు వేరే ఆభరణాలను సమర్పించడాన్ని సహించేవే. భవతీ = నీవు మాత్రం; ముకుంద పదపద్మతల + అనురూపం = ముకుందుని అడుగు తామరలకు తగిన ఆకృతికలిగిన; నిత్యం = మార్పును సహించలేని; నయన + అభిరామం = కనువిందైన; నైపథ్యం = మంచి ఆభరణం.

**తా॥** ఓ తల్లీ ! పాదుకా! భగవంతుని వేరే అవయవాలయందు ధరింపబడిన నగలు మార్పును సహిస్తాయి. కాని నీవు మాత్రం ముకుందుని అడుగుదమ్ములకు తగిన రూపం కలిగి, నీకు ప్రతినిధిగా మరొక అలంకారాన్ని సహించలేని, నయనాభిరామమైన ఆభరణంగా ఉంటావు.

వ్యాఖ్య :- పాదుక, ముకుందుని పాదపద్మాలకు ప్రాతినిధ్యంలేని ఆభరణం

నగలు పలురకాలు. శరీరావయవాలకు ఇష్టప్రకారంగా వేర్వేరు నగలను ధరించవచ్చు. భగవత్పాదాలకు మాత్రంపాదుకలే తగిన ఆభరణం.

*అంగాంతరేషు నిహితాని :-* రత్నకిరీటానికి మారుగా మయూరపింఛంతో కూడిన పుష్పకిరీటాన్ని తలకు ధరించవచ్చు. గళంలో ముక్తాహారానికి పర్యాయంగా మణిహారాన్ని లేదా ఈ రెండింటినీ ఒకే సమయంలో ధరించినా చూడముచ్చటగా ఉంటుంది. ఒక మూర్తికి సమర్పించిన కంఠహారంగానీ, వజ్రకిరీటంగానీ ఒకప్పుడు మరొక మూర్తికి అలంకరించినా, సహనశీలంగా ఉంటుంది.

*ముకుందపద పద్మతలానురూపం :-* పాదాలకు పర్యాయమైన భూషణమే లేదు. ముక్తి స్థానంలో రాణించే ఆభరణం మార్పును సహిస్తుందా? ముకుందుని పాదాలకు తగినట్లున్న పాదుకల జతలో కుడిది ఎడమకైననూ, ఎడమది కుడికైననూ సహన యోగ్యం కాదు.

*నయనాభిరామం నైపథ్యం :-* సేవించే భక్తులను అనుగ్రహించడానికి భగవంతుని దృష్టిని ప్రసరింపచేసి ఆనందాన్ని కూర్చే ఆభరణం పాదుక. ఆనందం - భోగలింగసామ్యం - దేవ జీవులకే కదా! ముకుంద పాద రక్షణకన్నా తత్పాదానురూపమైన తొడవుగా శోభిస్తూ సేవ్య సేవకులకు నయనాభిరామంగా వర్తించేది పాదుక అని కీర్తించారు. శ్రీ వేదాంతదేశికులు. వ్యతిరేకాలంకారం. వసంత తిలకావృత్తం.

793. యేనామ భక్తినియతై స్తవసంనివేశం
నిర్వీశ్య నేత్రయుగళై ర్నభజంతి తృప్తిమ్ ।
కాలక్రమేణ కమలేక్షణ పాదరక్షే
ప్రాయేణ తే పరిణమంతి సహస్రనేత్రాః ॥ 13

**అర్థం:-** హే కమలేక్షణ పాదరక్షే = ఓ సరోజనయనుపాదుకా! యే, నామ = ఎవరైతే; భక్తినియతైః = భక్తిచే స్థిరమైన; నేత్రయుగళైః = రెండేసి కన్నులచేత; తవ = నీయొక్క; సంనివేశం = చక్కని రూపాన్ని; నిర్వీశ్య = అనుభవించి; తృప్తిం = తృప్తిని; న, భజంతి = పొందలేరో; తే = ఆభక్తులు; కాలక్రమేణ = కొంతకాలానికి; ప్రాయేణ = బహుశః; సహస్ర నేత్రాః వేయికన్నులు కలవారుగా; పరిణమంతి = మారుతారు.

**తా॥** ఓ కమలేక్షణుపాదుకా! నిశ్చల భక్తి కలిగిన కందోయితో నీ సంనివేశాన్ని సేవించినప్పటికీ, 'ఇంకాసేవించాలి' అని ఆశపడి తృప్తిని పొందని వ్యక్తులు కొన్నాళ్ళకు వేయికన్నులు కలవారుగా పరిణమిస్తారు.

**వ్యాఖ్య :-** పాదుకా సంనివేశాన్ని అనుభవిస్తూ తృప్తి జెందని భక్తులు ఇంద్ర పదవిని పొందుతారని వర్ణన.

భక్తులు భగవత్పాదుకా సంనివేశాన్ని నిర్నిమేషంగా, నిరంతరం సేవిస్తున్నా 'అయ్యో! రెండుకండ్లు చాలవుకదా!' అని భక్తి పారవశ్యంతో తృప్తిని పొందలేరు. రెండుకండ్లేమి? వేయికండ్లున్న వారికైనా నయనాభిరామమైన సంనివేశాన్ని చూస్తున్న కొద్దీ, ఇంకా చూడాలనే ఆదరం, ఆపేక్ష అతిశయిస్తుందే కాని అంతం కాదు.

*కమలా+ఈక్షణ, పాదరక్ష :-* నిత్యం లక్ష్మిని కటాక్షించే భగవంతుని పాదాలను రక్షించే పాదుకను ఉపాసించే భక్తులకు లక్ష్మీ కటాక్షం కలుగుతుంది. ఇంద్ర పదవిని పొందుతారని భావం.

కావ్యలింగాలంకారం. వసంతతిలకావృత్తం.

794. పద మప్రమాణ మితి వాదినాం మతం
మధుజిత్పదే మహతి మాస్మభూదితి ।
వ్యుదపాది తస్య చరణావని! త్వయా
నిగమాత్మన స్తవ సమప్రమాణతా ॥ 14

**అర్థం:-** హే చరణావని = ఓ పాదుకాదేవీ! పదం = ప్రకృతి ప్రత్యయాత్మకమైన శబ్దం; అప్రమాణం = ప్రమితి జనకం కాదు; ఇతి = అని; వాదినాం = వాదించే తార్కికుల యొక్క; మతం = సిద్ధాంతం; మహతి = పూజ్యమైన; మధుజిత్+పదే = మధుసూదను పాదమందు; మాస్మభూత్ = వర్తించకూడదు; ఇతి = అని; త్వయా = నీ చేత; తస్య = ఆ భగవత్పాదానికి; నిగమ + ఆత్మనః = వేద స్వరూపవైన; తవ = నీతో; సమప్రమాణతా = సమానమైన ప్రమాణత్వం; వి + ఉదపాది = సంపాదింపబడింది.

**తా॥** ఓ పాదావనీ! పదం ప్రమాణం కాదు, అనే తర్కశాస్త్రజ్ఞుల సిద్ధాంతం భగవచ్చరణార్థకమైన 'పదం' అనే శబ్దానికి వర్తించకూడదనే బుద్ధితో నీవు, ఆపాదానికి నిగమాత్మవైన నీతో సమాన ప్రామాణ్యాన్ని సంపాదించావు.

వ్యాఖ్య :- పాదుకా సంనివేశం, భగవత్పాదానికి తనతో సమానప్రమాణత్వాన్ని కల్పించిందని చమత్కృతి

'పదం' అంటే ప్రకృతి ప్రత్యయాత్మకమైనశబ్దం. 'పదం' దాని సంకేతి తార్థాన్ని మాత్రమే బోధిస్తుంది. 'గోపాలుడు' అనే పదం ఒక వ్యక్తి పేరును తెల్పుతుంది. 'చదువును' అనే పదం ఒక వ్యక్తి చేసే 'క్రియ'ను తెల్పుతుంది. ఒక పదం యొక్క అర్థం తెలిసినంత మాత్రాన విషయం బోధపడదు.

'గోపాలుడు చదువును' - పదాల పరస్పరాన్వయం వల్ల ఏర్పడిన వాక్యం, విషయాన్ని సంపూర్ణంగా బోధిస్తుంది. కాబట్టి 'వాక్యం' ప్రమాణం. కాని 'పదం' ప్రమాణం కాదని తర్కమీమాంస కాదుల మతం.

తర్కశాస్త్రజ్ఞుల అభిప్రాయానుసారంగా భగవంతుని చరణమనే అర్థాన్ని బోధించే 'పదం' మాత్రం 'అప్రమాణం' (కొలతలేనిది) కాకూడదు. అనే భావనచేత పాదుక, తనతో సమానమైన ప్రమాణత్వాన్ని భగవత్పాదానికి కలిగించింది.

పాదుక నిగమాత్మ - వేదరూపిణి. నిగమః = నితరాంగంతా. బాగా ప్రచరించేది నిగమం. నిత్యం సంచరించే రూపం కలది పాదుక. 'పదం, అప్రమాణం' అనేవి శ్లిష్టపదాలు. పాదుక ఎంత ప్రమాణం - కొలత - కలిగి ఉందో, భగవత్పాదం అంతే కొలతకలిగి ఉంది. కాబట్టి పాదుకతో సమానమైన ప్రమాణం కలది భగవత్పదం, అని చమత్కారం.

పదమూ, పాదుకా - రెండూ నడిచే స్వభావం కలవి. కాబట్టి శబ్ద ప్రధానమైన వేదం చేత ప్రతిపాదింపబడే 'పద, పాదుకల' ప్రమాణం - కొలత - ఒకే విధంగా ఉండడం వల్ల 'పదం' అప్రమాణం కాదు. పదానికి పాదుకాతుల్య ప్రమాణత్వం ఉంది.

దేశికులు కవి సింహమే కాక, తార్కిక సింహమూ అవడం వల్ల, రమణీయ వర్ణనలోనూ శ్రద్ధతో ప్రామాణ్యాన్ని సంతరించారు. శ్లిష్ట రూపక హేతూత్ప్రేక్ష. వర్ణనకు తగిన వృత్తమిది - మంజుభాషిణి.

*795. అప్రభూత మభవ జ్జగత్త్రయం*
*యస్య మాతు ముదితస్య పాదుకే ।*
*అప్రమేయ మమితస్య తత్పదం*
*నిత్యమేవ ననుసంమితం త్వయా ॥* **15**

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! మాతుం = కొలువడానికి, ఉదితస్య = ఎత్తబడిన; యస్య = ఏపాదానికి; జగత్ + త్రయం = లోకత్రయం అప్రభూతం = అపర్యాప్తం; అభవత్ = అయినదో; అమితస్య = అనంతుని యొక్క; అప్రమేయం = కొలువరాని; తత్ = ఆప్రసిద్ధమైన; పదం = చరణం; త్వయా = నీ చేత; నిత్యం = ఎల్లప్పుడు; సంమితం, ఏవ, నను = చక్కగా కొలువబడినదే కదా!

**తా॥** ఓ పాదుకా! కొలువడానికి ఎత్తబడిన ఏ చరణానికి ముల్లోకాలు మించక ఇమిడినాయో, ఆత్రివిక్రముని అపరిచ్ఛేద్యమైన ప్రసిద్ధచరణం, నీచే సర్వకాలాల్లో పరిచ్ఛిన్నమే కదా!

వ్యాఖ్య :- అమితుని అప్రమేయ పాదం, పాదుకచేత మితమయిందని వర్ణితం

వామనమూర్తి అమితంగా పెరిగి త్రివిక్రముడై ముల్లోకాలను కొలిస్తే, ఆలోకాలుమూడూ ఆయన అడుగులో ఇమిడాయి. ఇంత పరిమాణం కలదని కొలిచి చూపరాని త్రివిక్రముని అడుగుకూడా అడుగులతొడగైన పాదుకలో ఇమిడింది. భగవత్పాదం ఎంత పెరిగితే, అంతకంటె కొంచెం ఎక్కువగా పెరిగి, పాదాన్ని పాదివింది పాదుక. ఎంత వృద్ధి చెందినా పాదం, పాదుకకుమించక మితంగానే ఉండిందని పాదుకా ఘనతను ప్రదర్శిస్తుందీ శ్లోకం. ఉత్తరోత్తరోత్కర్షను బట్టి ఇది సారాలంకారం. రథోద్ధతావృత్తం.

*796. ఆలవాలమివ భాతిపాదుకే, పాదపస్యభవతీ మధుద్విషః ।*
*యత్సమీప వినతస్య శూలినః సారణీ భవతి మౌళి నిమ్నగా ॥ 16*

**అర్థం:–** హే పాదుకే = ఓ పాదుకా! భవతీ = నీవు; మధుద్విషః = మధువైరియైన భగవంతుడనే; పాదపస్య = వృక్షం యొక్క; ఆలవాలం, ఇవ = పాదువలె; భాతి = ప్రకాశిస్తున్నావు. యత్, సమీప వినతస్య = ఆ చెట్టు పాదుదగ్గర ప్రణమిల్లే; శూలినః = శివుని యొక్క; మౌళినిమ్నగా = తలయందున్న గంగానది; సారణీ = కాలువగా ; భవతి = అవుతున్నది.

**తా॥** ఓ పాదుకా! భగవంతుడనే కల్పతరువు యొక్క పాదులాగా ప్రకాశిస్తున్నావు. ఆ పాదుసమీపంలో నమస్కరించే శివుని తలమీది గంగ కాలువగా ఉంటున్నది.

వ్యాఖ్య :- పాదుకా సంనివేశం వృక్షమూలంగానూ, ఫలంగానూ ఉత్ప్రేక్షితం

శ్రీరంగరాజే కల్పవృక్షం. ఆ చెట్టుకు అడుగున ఉన్నందువల్ల, పాదుక ఆలవాలం పరమ శివుడు వచ్చి నమస్కరిస్తుంటే, ఆయన తలమీది గంగానది, పాదుకకు నీరు పారించే కాలువగా సంభావింపబడింది. చెట్టు పాదుకు నీరు పెట్టి పోషించిన వ్యక్తి, ఆ చెట్టు ఇచ్చే ఫలాన్నీ పొందుతాడు.

అభిషేక ప్రియఃశివః - అన్నట్లు భగవత్పాదుకను పరమశివుడభిషేకించినందువల్ల, లోకులచే అభిషేకాన్ని పొందుతూ నిత్యం రుద్రుదానందజలధిలో ఓలలాడుతుంటాడు. రథోద్ధతావృత్తం.

*797. మోదమాన మునిబృందషట్ పదా ।*
*భాతిముక్తి మకరంద వర్షిణీ ।*
*కాఽపి రంగనృపతేః పదాంబుజే*
*కర్ణికా కనక పాదుకామయీ ॥ 17*

**అర్థం:-** మోద-షట్పదా । మోదమాన = సంతోషిస్తున్న; ముని బృంద = మునుల సమూహమనే; షట్ పదా = తుమ్మెదలు కలిగిన; ముక్తి - వర్షిణీ । ముక్తి మకరంద = మోక్షమనే పూదేనెను; వర్షిణీ = కురుస్తున్న; కనక పాదుకామయీ = కాంచన పాదుకామయమైన; కా, అపి = ఒక విలక్షణమైన, కర్ణికా = దుద్దు; రంగనృపతేః = శ్రీరంగప్రభువు యొక్క; పద + అంబుజే = పాదమనేకమలమందు; భాతి = ప్రకాశిస్తుంది.

తా॥ హర్షిస్తున్నమునుల బృందమనే తుమ్మెదలు కలిగిన, ముక్తి అనే మకరందాన్ని వర్షిస్తున్న స్వర్ణపాదుక అనే ఒక విలక్షణమైన కర్ణిక, శ్రీరంగరాజ చరణమనే సరోజమందు శోభిస్తుంది.

వ్యాఖ్య :- పాదుకా సంనివేశం భగవత్పాదకమల కర్ణికగా వర్ణితం

భగవత్పాదమే తామరపూవు. పాదుక తామరపూవు నడుమ పసుపుపచ్చగా శోభించే కర్ణిక. ఇక్కడికి వచ్చి సేవించి హర్షించే మహర్షులే తుమ్మెదలు. మోక్షమే మకరందం. రూపకాలంకారం.

పాదుకయే కర్ణికగా ఉన్న భగవత్పాద కమలం వర్షించే ముక్తి మకరందాన్ని ఆస్వాదించి మహర్షి బృందమనే షట్పదగణం బాగా హర్షిస్తుంది. రథోద్ధతా వృత్తం.

*798. యుగపదను విధాస్యన్ యౌవతం తుల్యరాగం*
*యదుపతి రధిచక్రే యావతో రూపభేదాన్ ।*
*తదిదమతి వికల్పం బిభ్రతీ సంనివేశం*
*తవఖలు పదరక్షే ! తావతీ మూర్తిరాసీత్ ॥* 18

అర్థం:- హే పదరక్షే = ఓ పాదుకాదేవీ! యదుపతిః = శ్రీకృష్ణుడు; తుల్యరాగం = సమానప్రేమ ఉన్న; యౌవతం = యువతుల సమూహాన్ని; యుగపత్ = ఒకే సమయంలో; అనువిధాస్యన్ = అనుసరిస్తున్న వాడై; యావతః = ఎన్ని; రూపభేదాన్ = వేర్వేరు రూపాలను; అధిచక్రే = ధరించాడో; తత్ = ప్రసిద్ధమైన; ఇదం = ఈ భగవల్లీలను; (అనువిధాస్యం త్యాః=అనుసరిస్తున్న) తవ = నీయొక్క; అతి వికల్పం = బహుప్రకారమైన; సంనివేశం = ఉనికిని; బిభ్రతీ = ధరిస్తూ; తావతీ = భగవత్పాద సంఖ్యతో సమాన సంఖ్యకలిగినంత; మూర్తిః = రూపం; ఆసీత్ = ఉండెను; ఖలు = కదా!

తా॥ ఓ పాదావనీ! శ్రీకృష్ణుడు తుల్యప్రేమగల యువతుల ఆశను పూర్తిచేయడానికి వేర్వేరు రూపాలను ధరించాడు. కృష్ణలీల ననుసరిస్తూ ఆయన రూప సంఖ్యకు మించిన సంనివేశాన్ని దాల్చిన నీరూపం, ఆయన పాద సంఖ్యకు తగినంత ఉండింది కదా!

వ్యాఖ్య :- పాదుకా సంనివేశం, శ్రీకృష్ణుని రూపసంఖ్యకు రెట్టింపు అయిందని వర్ణితం

యువతులకూ, శ్రీకృష్ణునికీ పరస్పర ప్రేమ సమానంగా ఉండింది. కాబట్టి పదహారు వేల పడుచులను తృప్తి పరచడానికి అన్ని రూపాలను ధరించాడు శ్రీకృష్ణుడు.

"షోడశ స్త్రీ సహస్రాణి శతమేకంతథా2ధికం ।
తావంతి చక్రేరూపాణి భగవాన్ దేవకీ సుతః ॥
ఏకైవాంశేన తాః కన్యా మేనిరే మధుసూదనమ్ ।
మమైవ పాణి గ్రహణం మైత్రేయ! కృతవానితి ॥"(వి-పు)

పదహారు వేలపైన నూటికి మించిన కన్యలకు సమాన సంఖ్యగల మూర్తులను ధరించాడు శ్రీకృష్ణుడు. ఒక్కొక్కకన్య "శ్రీకృష్ణుడే తనపతి" అంటూ అమందానందాన్ని పొందింది. అని శ్రీ పరాశర మహర్షిసూక్తి.

ఒక్కొక్క మూర్తికి రెండేసి పాదాలుండడం వల్ల పాదుకా సంఖ్య, ఆమూర్తులకు రెట్టింపు, తత్పాదసంఖ్యకు సమానంగా వెలసింది. సమాలంకారం. మాలినీ వృత్తం.

*799.* తత్తద్వృత్తే రనుగుణతయా వామనీం వ్యాపినీంవా
ప్రాప్తేరంగ ప్రథిత విభవే భూమికాం సూత్రధారే ।
మన్యే విశ్వస్థితిమయ మహానాటికాం నేతుకామా
నానాసంస్థాభవతి భవతీ పాదుకే! నర్తకీవ ॥ 19

**అర్థం:- హే పాదుకే** = ఓ పాదుకాదేవీ! రంగప్రథిత విభవే = శ్రీరంగమనే నాటకరంగమందు ప్రసిద్ధవైభవంగల; సూత్రధారే = నటశేఖరుడు; తత్ + తత్ + వృత్తేః = ఆయా కైశిక్యాది వృత్తికి; అనుగుణతయా = ఆనుగుణ్యంగా; వామనీం = చిన్నదో; మహతీం, వా = పెద్దదో అయిన; భూమికాం = వేషాన్ని; ప్రాప్తే = ధరించినప్పుడు; భవతీ =నీవు; విశ్వస్థితిమయ మహానాటికాం = లోకరక్షణార్థమైన గొప్పనాట్యాన్ని; నేతుకామా = ఆడి చూపగోరుతున్న; నర్తకీ, ఇవ = నాట్యకత్తె లాగా; నానాసంస్థా = అనేక రూపాలు కలదానివి; భవతి = అవుతున్నా వని; మన్యే = భావిస్తాను.

**తా॥** ఓ పాదుకాదేవీ! శ్రీరంగం ఒకనాటకరంగం. అందు ప్రసిద్ధ సంపదగల శ్రీరంగనాథుడు సూత్రధారుడు. మహానటుడు కైశిక్యాది వృత్తికి తగినట్లు చిన్నదో, పెద్దదో వేషాన్ని ధరించిన రీతిగా, భగవంతుడు వామనుని వృత్తికి, త్రివిక్రముని స్థితికి యోగ్యమైన చిన్న, పెద్ద శరీరాన్ని ధరిస్తాడు. అప్పుడు లోకస్థితికోసం గొప్ప లాస్యాన్ని ప్రదర్శింపగోరే నర్తకిగా నీవు బహువిధ సంనివేశ యుక్తవవుతా వనుకొంటాను.

వ్యాఖ్య :- పాదుకా సంనివేశం, ఒకే మూర్తియందు బాల్యాద్యవస్థలకు అనురూపమైన అనేక దశలను పొందుతుందని వర్ణితం.

జగన్నాటక సూత్రధారుడు శ్రీరంగనాథుడు, నాటకరంగమందు పాత్రోచితమైన నటనను ప్రదర్శించేవాడు మహానటుడు.

ఆంగికాభినయ రూపాలైన కైశికి, ఆరభటి, సాత్వతి, భారతి అనే నాలుగు విధాలైన వృత్తులు నటనను ఆశ్రయిస్తాయి. కాబట్టి వృత్తులు సాక్షాత్తుగా రసోపస్కారాలు, అంటే ప్రేక్షక లోకానికి రస స్ఫూర్తిని కలిగిస్తాయి.

నటునికి తగినట్లు ఒకనటి నర్తిస్తుంది. ఈ నర్తకి నటునితో పోటీపడి సామాజికులకు రసానుభవం కలిగించి వారిని రంజింప జేస్తుంది. ఈ నాట్యకత్తె తనలాస్య ప్రదర్శనలో పలురకాలవేషాలను మారుస్తుంది.

గత శ్లోకంలో, భగవంతుని అనేకరూపాల కనురూపంగా, పాదుకా రూపాలు ద్విగుణీకృతాలైనవని వర్ణితం కదా! ఈ శ్లోకం ఒక్కమూర్తి యందే, పాదుక నానాసంనివేశాలతో వర్తిస్తుందని వర్ణిస్తున్నది.

భగవంతుడు వామన మూర్తిగా ఉన్నప్పుడు, పాదుక చిన్నగా ఉంది. ఆ వామనుడే లోకాలను కొలువడానికి అమితంగా పెరుగుతున్న కొలది, తాను (పాదుక) కూడా అనురూప్యంగా పెరుగుతూ బహువిధ సంనివేశాలతో లోకరక్షణ కోసం సముచితంగా వర్తించింది.

వామన రూపానికీ, త్రివిక్రమ రూపానికీ అనుగుణంగా పాదుకా సంనివేశం మారుతూ వ్యాపించింది. శ్లేష రూపకాలంకారాలతో కూడిన ఉత్ప్రేక్షాలంకారం.

అభినయ స్ఫోరకంగా రచితమైనదీ మందాక్రాంతావృత్తం.

*800. మానే పరం సమానే ప్రత్యక్షేణాగమే నాపి ।*
*హరి చరణస్య తవాపితు వైషమ్యం రక్ష్య రక్షకత్వాభ్యామ్ ॥ 20*

**అర్థం:-** (హే పాదుకే = ఓ పాదుకాదేవీ!) హరి చరణస్య = భగవత్పాదానికి; తవ, అపి = నీకు కూడా; ప్రత్యక్షేణ = ప్రత్యక్ష ప్రమాణం చేత; ఆగమేన, అపి = శాస్త్ర ప్రమాణం చేతనూ; మానే = కొలత, విశదజ్ఞానము (రెండు) పరం = మిక్కిలి; సమానే = సమానమే; తు=కాని; రక్ష్యరక్షకత్వా భ్యాం = రక్షింపబడే ప్రయోజనంచేత, రక్షించే ధర్మంచేత; వైషమ్యం = భేదం, ఉంది.

**తా॥** ఓ పాదుకాదేవీ! భగవచ్చరణానికి తగినట్లున్ననీ పరిమాణం స్పష్టంగా కన్నులకు కనబడుతునే ఉంది. శబ్ద ప్రమాణంచేతనూ పాదానికీ, నీకు ఉన్న కొలత సమానమే అని తెలుస్తున్నది.

చాక్షుషాది ప్రమాణమూ, శాస్త్ర ప్రమాణమూ మీ పరిమాణాన్ని తెలుపడంలో సమానమే. కాని, రక్షింపదగింది పాదం, రక్షించేది నీవు. కాబట్టి పాదానికీ, నీకూ ఉన్న గౌరవంలో మాత్రం భేదం ఉంది.

వ్యాఖ్య :- భగవత్పాదరక్షకున్న కీర్తిగొప్పది అని వర్ణన

భగవంతుని పాదానికీ, పాదరక్షకూ కొలతలో భేదం లేదని సకల జనమనోనయనాలకు సాక్షాత్తుగా గోచరిస్తునే ఉంది. ఇది ప్రత్యక్ష ప్రమాణ సిద్ధం.

"పాదో ఽస్య విశ్వాభూతాని". "ఉరుక్రమస్య సహిబంధురిత్థా" భగవత్పాద మహిమకూ, పాదుకామహిమకూ వైషమ్యం లేదు, అని వేదశాస్త్ర ప్రమాణ సిద్ధం.

మానే, సమానే :- ఈ పదాలు ప్రథమాద్వివచనాంతాలు. కొలతలోనేమి? ఘనతలోనేమి? ఈ రెండు విషయాలు ప్రత్యక్షాగమ ప్రమాణాలచేత సమానాలే, అని, విశదమవుతుంది.

కానీ, రక్షించేది పాదుక, రక్షింపబడేది పాదం. సమత్వమున్నా, రక్ష్య రక్షక విషయాన్నిబట్టి పాద, పాదరక్షలకున్న భేదం అనితర సాధారణం. సరళ తరళ సుందరమయినది ఈ అభివ్యక్తి.

అందరి అంతరంగాల్లో అందచందాలనూ, ఆత్మీయతనూ ఉత్తరంగితం చేసి, అనన్య భక్తిని ఆవహింప జేసే విధమైన అధ్యవసాయంతో ఒక వస్తువును కాపాడే మరొక వస్తువు ఎల్లకాలం అడుగుననే పడి ఉంటుందన్న నగ్నసత్యాన్ని ఆవిష్కరించే పాదుక ప్రశంసనీయ కదా!

శిల్ప సుందరంగా సృష్టిస్థితిలయాలను చేస్తూ "సర్వం హరి" అనిపించే నవరస బంధురుడైన విశ్వంభరుని పాదపద్మకేళిని సహిస్తూ, వహిస్తూ, మరింత సోయగంతో నిస్తులమైన లాస్యం చేసె పాదుకాసంనివేశం, పాదం కంటె ఘనంగా గణనీయం, మాననీయం కదా! వ్యతిరేక చమత్కార భరితమయిన దీ శ్లోకం. ఆర్యాభేదవృత్తం.

సంనివేశ పద్ధతి సమాప్తం

# 26. యంత్రికాపద్ధతి

801. *ఉదగ్ర యంత్రికాం వందే పాదుకా యన్నివేశనాత్ ।*
*ఉపర్యపి పదం విష్ణోః ప్రత్యాదిష్ట ప్రసాధనమ్ ॥ 1*

**అర్థం:-** యత్ + నివేశనాత్ = ఏ పాదుకయందు ఉంచడం వల్ల; విష్ణోః = భగవంతునియొక్క; పదం = చరణం; ఉపరి, అపి = పైభాగమందుకూడా; ప్రత్యాదిష్ట ప్రసాధనం = తిరస్కరింపబడిన అలంకారం కలదై ఉంటున్నదో; ఉత్+అగ్ర, యంత్రికాం = మీదికి మొన ఉన్న బొడుసుగల; పాదుకాం = పాదుకను, వందే = సేవిస్తాను.

**తా॥** పాదుకకు ఊర్ధ్వాగ్రమై యంత్రిక ఉండడం వల్ల భగవత్పాదం యొక్క మీదీ భాగాన్ని కూడా భూషించే పాదుకను సేవిస్తాను.

వ్యాఖ్య :- పాదుకావయవ వర్ణన

యంత్రిక యొక్క ప్రాధాన్యాన్ని కీర్తించే పద్ధతి ఇది. పాదంనుంచి విడిపోకుండా కాలివ్రేళ్ళలో ఇమిడి నడువడానికి ఉపయోగపడే, మొగం మీది కున్న బొడుసులాగా ఉండే, పాదుకయొక్క ముఖ్యమైన అవయవమే యంత్రిక.

భగవంతుడు తన పాదాంగుష్ఠానికి, దాని ప్రక్కవేలికి నడుమ యంత్రికను ఇముడ్చుకొని పాదుకను ధరిస్తాడు. భగవత్పాదానికి క్రింది భాగాన పాదుక అలంకారంగా ఉంటే, పైభాగాన పాదుకావయవమైన యంత్రిక ఊర్ధ్వాగ్రంగా ప్రకాశిస్తూ, వేరొక ఆభరణావశ్యకత లేకుండా తానే అలంకారంగా ఉంటుంది.

యంత్రిక ఉపమేయం. ప్రసాధనం ఉపమానం. యంత్రిక చేత ప్రసాధనం ప్రత్యాదిష్టం. ఉపమానమైన ఆభరణం చేసే కార్యాన్ని ఉపమేయమైన యంత్రికయే నిర్వహిస్తుంది అని వర్ణించడం వల్ల ఇది ప్రతీపాలంకారం. అనుష్టుప్ ఛందం.

802. *ప్రసభంప్రతిరుధ్యకంటకాదీన్*
*భవతీ శౌరి పదాంబుజాద ధస్తాత్ ।*
*చరణావని! ధారయత్యముష్మిన్*
*ఉచితచ్ఛాయము పర్యపిప్రతీకమ్॥ 2*

**అర్థం:-** హే చరణావని = ఓ పాదరక్షిణీ! భవతీ = నీవు; శౌరి పద+అంబుజాత్ = భగవత్పాదకమలంనుంచి; అధస్తాత్ = (క్రింది) దిగువ స్థలమందు; (పాదతలమందు) కంటక + ఆదీన్ = ముండ్లు మొదలైన వాటిని; ప్రసభం = బలాత్కారంగా; ప్రతిరుధ్య = అడ్డగించి; అముష్మిన్ = దీనియందు - శౌరి పాదాంబుజమందు; ఉచిత+ఛాయం = తగిన నీడగల; ప్రతీకం = అంగమైన యంత్రికను; ఉపరి అపి = మీదికి కూడా; ధారయతి = ధరిస్తున్నావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీవు భగవత్పాదతలానికి రాళ్ళూ, ముళ్ళూ తగిలి బాధకలుగకుండా, బలంగా వాటిని అణచివేసి, ఆ పాదానికి సముచితమైన ఛాయనిచ్చే అవయవాన్ని - యంత్రికను పైకి వహిస్తున్నావు.

**వ్యాఖ్య :- పాదుక, యంత్రికవలన కలిగిన ఛాయతో భగవత్పాదాన్ని రక్షిస్తుంది**

పాదుకకు భగవత్పాదరక్షణం ప్రధానం. అలంకారం గౌణం. పరికరంగా ఉన్న పాదుక, భగవంతుడు సంచరిస్తున్నప్పుడు, దారిలో ఉండే వాడి మొనగల వస్తువులను మొగమెత్తకుండా మొత్తి, మెత్తని కాలి అడుగులకు ఒత్తిడి కలుగకుండా కాపాడుతూ, అడుగుదిగువభాగాన్ని అలంకరిస్తుంది. "ఛాయాకాంతిర్ద్యుతిశ్ఛవిః" (అమరం) నీడనిచ్చే ఛత్రం లాగా ఉన్న యంత్రిక అడుగుకు మీది భాగాన్ని కాంతిమంతం చేస్తుంది. 'ఛాయ' అంటే నీడ, కాంతి - శ్లిష్ట పదమిది. ఉత్తరార్థంలో శ్లేషతో ఛత్రం యంత్రికయందారోపితం. పాదుకాదేవి భగవత్పాదరక్షణకోసం ఉచిత చ్ఛాయగల ప్రతీకాన్ని ధరిస్తుందన్న చారుతాహేతువైన అభివ్యక్తి సమాసోక్తి. ఔపచ్ఛందసికం.

*803. మురభిన్మణి పాదుకేత్వదీయా*
*మనఘామంగుళి యంత్రికా మవైమి!*
*స్వయమున్నమితాం ప్రదేశినీం తే*
*పరమందైవత మేకమిత్యృచం తీమ్!!* 3

**అర్థం:-** హే మురభిత్ + మణిపాదుకే = ఓ మురహరి రత్నపాదుకా! త్వదీయాం = నీదైన; అనఘాం = మనోజ్ఞమైన; అంగుళియంత్రికాం = వ్రేళ్ళచే పట్టుకోవడానికున్న బొడుసుగలమేకును; స్వయం = తానే; ఉత్ + నమితాం = పైకి ఎత్తబడిన; "పరమం = ఉత్కృష్టమైన; దైవతం = దైవం; ఏకం = ఒక్కటే;" ఇతి = అని; ఋచంతీం = పొగడుతున్న; తే = నీ యొక్క; ప్రదేశినీం = చూపుడు వ్రేలుగా; అవైమి = భావిస్తాను.

**తా॥** ఓ మురారి పాదుకా! నీ మనోజ్ఞమైన అంగుళి యంత్రికను "పరముడైన దేవుడు ఒక్కడే" అని పొగడుతూ, ఎత్తి చూపుతున్న నీ తర్జన్యంగుళిగా తలుస్తాను.

**వ్యాఖ్య :- యంత్రిక, పాదుకా ప్రదేశినిగా ఉత్ప్రేక్షితం**

యంత్రిక యొక్క ప్రాధాన్యాన్ని కీర్తించే పద్ధతి ఇది. పాదంనుంచి విడిపోకుండా కాలివ్రేళ్ళలో ఇమిడి భగవత్పాదంతోనూ, పాదుకతోనూ విడిపోని సంబంధాన్ని ఏర్పరచుకొన్న యంత్రిక, పరతత్త్వనిర్ణయాన్ని నిర్దేశిస్తున్నది. 'దేవతలందరు ఒక్కటే' అంటారు కొందరు. 'బ్రహ్మవిష్ణు మహేశ్వరులు ముగ్గురు మూర్తులు సమానులే' అంటారు మరికొందరు. "అనిపుణ ఫణితీరాద్రియంతే నసంతః" అన్నట్లు నేర్పులేని ఇలాంటి మాటలను తత్త్వజ్ఞులు లక్ష్యపెట్టరు.

"శుద్ధో దేవ ఏకోనారాయణః, నద్వితీయో ऽస్తి కశ్చిత్, సవిష్ణురేవ భవతి" (శ్రుతి)' "నవిష్ణోః పరమోదేవోవిద్యతే' (స్మృతి) ఎల్లకాలం వెలుగుతూ అఖిల భువన జన్మస్థేమ భంగాది లీలలను స్వేచ్ఛగా జరిపే శ్రీమన్నారాయణుడు ఇతర దేవతల కన్న శ్రేష్ఠుడు. పరముడు కదా! "ఒన్రుం దేవుం" అనే దశకంలోని నమ్మాళ్వార్ల శ్రీసూక్తిని, పాదుకాదేవి తన ప్రదేశినితో ప్రకటిస్తున్నట్లుంది యంత్రిక, ఔపచ్ఛందసికం.

804. స్వదతే మణిపాదుకే! త్వదీయా
పదశాఖాయుగ యంత్రికా విచిత్రా
పరమం పురుషం ప్రకాశయంతీ
ప్రణవస్యేవ పరేయమర్ధమాత్రా!! 4

అర్థం:- హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! త్వదీయా = నీదైన; విచిత్రా = ఆశ్చర్యమైన; పదశాఖాయుగయంత్రికా = పాదానికి రెండువ్రేళ్ళనడుమ చేరిన బొడుసు; పరమం = శ్రేష్టమైన; పురుషం = జీవాత్మను / భగవంతుణ్ని; ప్రకాశయంతీ = ప్రదర్శిస్తున్న; ప్రణవస్య = ఓంకారానికి; పరా = అంతమందు (మీద) ఉన్న; ఇయం = ఈ; అర్ధమాత్రా, ఇవ = అర్ధమాత్ర-మ్-వలె; స్వదతే = రోచకంగా ఉంటుంది.

తా॥ ఓ మణిపాదుకా! భగవత్పాదం యొక్క రెండు వ్రేళ్ళమధ్య ఉన్న నీ యంత్రిక, పరమపురుషుణ్ని ప్రకాశింపజేసే ప్రణవపరమైన మకారంయొక్క అర్థమాత్రలాగా ప్రేక్షకులకు రోచకంగా ఉంటుంది. నీ యంత్రికా సంనివేశం విచిత్రమయింది.

వ్యాఖ్య :- యంత్రికా సంస్థానం ప్రణవాక్షరంలో ఉండే మకారలిపి లాగా విచిత్రంగా ఉంది

అక్షరాన్ని ఉచ్చరింపదగిన కాలావచ్ఛేదార్థకమే మాత్ర. "'ఏకమాత్రో భవేత్ హ్రస్వః" ఒక మాత్ర కలది హ్రస్వాక్షరం. ప్రణవాక్షరంలో మూడు వర్ణాలున్నాయి. అ, ఉ, మ. సమస్త వర్ణాలకు, శబ్దాలకు మూలమైన అకారం కంఠంయొక్క అధోభాగాన జనిస్తుంది అంటే, ప్రథమ స్థానజన్యం 'అకారం' ఓష్ఠాధర సంయోగరూపమైన చరమస్థానమందు జనించేది 'మకారం' అంటే సర్వవర్ణాలకు చివరిది 'మకార'మని గ్రాహ్యం.

అకారాది మకార పర్యంతం సర్వవర్ణ ప్రత్యాహారమైనందువల్ల, చతుర్వింశతి తత్త్వాది సర్వప్రపంచ వాచకమయింది 'ప్రణవం'.

"ఈ దృశః పరమాత్మాఽయం ప్రత్యగాత్మాతథేదృశః!
తత్సంబంధానుసంధానమితి యోగః ప్రకీర్తితః !!"

అకారం పరమాత్మ స్వరూపమిట్టిదని, మకారం ఆత్మస్వరూపమిట్టిదని, మధ్యన ఉన్న ఉకారం ఉభయులకు - జీవేశ్వరులకు - గల సంబంధమనే యోగాన్ని తెలిపేది ప్రణవం.

ప్రకృష్టమైన నవకం కలది ప్రణవం. అకార ఉకారమకారాలు (3). అభిధ, లక్షణ, వ్యంజనావృత్తులు(3). వాచ్య, లక్ష్య, వ్యంగ్యార్థాలు (3). ఈ నవకం శ్రుతిపేయమైన జ్ఞానద్రవ్యం. అనన్య భక్తిచేత ఉపాసించే దివ్యచక్షువైన మనస్సుకు భగవద్దర్శన సమానాకారం అవుతుంది.

"ఆద్యంతుత్ర్యక్షరం బ్రహ్మ, త్రయీ యత్ర ప్రతిష్ఠితా।
సగుహ్యోఽన్య స్త్రిప్పద్వేదో, యస్తం వేద స వేద విత్"॥

త్ర్యక్షరాత్మకమైన ప్రణవమే బ్రహ్మం. దీనిలో ఋగ్యజస్సామ వేదాలు అంతర్గతాలు. ప్రణవమే గుహ్యమైన వేదమని తెలిసినవాడే వేదవేత్త.

ప్రణవం ఏక మాత్రం, ద్విమాత్రం, త్రిమాత్రం, సార్ధమాత్రం అనీ (ఉచ్చరించే విధానాన్ని బట్టి) నానావిధాలుగా ఉంటుంది. దాని అర్థాలు నానావిధాలు గానూ ఉంటాయి. ముఖ్యంగా, కార్యకారణా వస్థలు గల పరబ్రహ్మను తెలిపేదే 'ప్రణవం'.

"అకార ఉకార మకారాః తిస్రోమాత్రాః బ్రహ్మవిష్ణురుద్రదేవత్యాః, యా
అవసానే చతుర్థీ అర్ధమాత్రా సాపురుషదేవత్యా" – (అధర్వశిఖోపనిషత్")

ప్రణవంలోని అ,ఉ,మ అనే మూడు మాత్రలు త్రిమూర్త్యాత్మకాలు. నాల్గవ అర్ధమాత్ర, సకలార్థ ప్రదమైన మూలదైవానికి సంబంధించదని అర్థం. సమష్టిగా, వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నా నిరుద్ధ వ్యూహాత్మకమైనదీ ప్రణవం, అని ఒక శాఖ.

"తతో ఽభూత్త్రివృదోంకారః". మూడువేదాలు భూః, భువః, సువః అనే మూడు వ్యాహృతులయ్యాయి. తర్వాత అవి అ, ఉ, మ అనే వర్ణత్రయంగా పరిణమించాయి. ప్రణయంతో పరవాసుదేవపరమైన వాచకంగా ప్రభవించిన ప్రణవం, ఇలా నానా శాఖలతో వ్యాపించింది.

వస్తుతః, నాదజన్యమై ధ్యానయోగ్యమయిందీ ప్రణవం.

ప్రణవాంతర్గతమైన మకారం, అచిద్వస్తువుకన్న విలక్షణమైన జీవాత్మకు సంకేతం. అయినా జగచ్ఛరీరుడైన పరమాత్మునికే అతిశయాన్ని కలిగిస్తూ, నాదాత్మకంగా పరమాత్మను ప్రకాశింపజేస్తుంది.

ముందుభాగం, మధ్యభాగం, వెనుక భాగంగా ఉన్న పాదుకాస్వరూపం, ప్రణవంలాగా త్రివర్ణాత్మకం. మూడు భాగాలకన్న వేరైన ఈ యంత్రిక ప్రణవానికి పరమైన అర్ధమాత్రను పోలి ఉంది.

గ్రంథలిపి ప్రణవస్వరూపాన్ని, (ఓం) ఇలా ప్రకాశింప చేస్తుంది. ప్రణవానికి నాదాతిశయాన్ని సమకూర్చే ప్రణవ పరార్థమాత్ర ( ँ ) ఇలా ఉన్నట్లే 'యంత్రిక' పాదుకపైన ఉంది.

పరా, ఇయం :- భౌతికంగా, ఆర్థికంగా, చతుర్థభాగంగా ఇమిడి ఉన్న ఈ 'పదశాఖాయుగ యంత్రిక' ఎంతో విచిత్రంగా ప్రేక్షకులను ఆకర్షిస్తుంది, ఉపమాలంకారం. ఔపచ్ఛందసికం.

*805. అనుయాతమనోరథా మురారే*
*ర్భవతీ కేళి రథశ్రియం దధాతి!*
*చరణావని! యంత్రికా తవైషా*
*తనుతే కూబర సంపదం పురస్తాత్!!* **5**

అర్థం:- హే చరణావని = ఓ పాదుకా! మురారేః = భగవంతునియొక్క; అనుయాత మనోరథా = అనుసరింపబడిన మనోరథంగల; భవతీ = నీవు; కేళి రథశ్రియం = క్రీడారథశోభను; దధాతి = ధరిస్తున్నావు, తవ = నీయొక్క; ఏషా = ఈ; యంత్రికా = బొడుసు; పురస్తాత్ = ముందర ఉన్న; కూబరసంపదం = నొగకూ కాణికీ సంబంధించిన కీలుయొక్క శోభను; తనుతే = విస్తరింపజేస్తుంది.

తా॥ ఓ పాదుకా! మురారి మనోరథాన్ని అనుసరించి పోయే నీవు; వినోదార్థమైన రథశోభలాగా శోభిస్తున్నావు. నీ యంత్రిక క్రీడారథానికి ముందు ఉండే యుగంధర సంపదను వ్యాపింపజేస్తున్నది.

వ్యాఖ్య :- యంత్రిక కూబర శోభలాంటి శోభను వ్యాపింపజేస్తున్నదని నిదర్శితం

ఆశ్రితులను రక్షించే అభిలాషకలవాడు భగవంతుడు. భగవంతుని మనోరథాన్ని అనుసరించి సంచరించేది పాదుక. ఆర్తులను కాపాడే తర్వతో కూడిన భగవంతుని చిత్తరూపమే పెద్దరథం. ఆ పెద్ద రథాన్ని వినోదంగా, విలాసంగా అనుగమిస్తున్న చిన్న పుష్యరథం పాదుక. 'కూబరం' అంటే నొగ. "కూబరస్తుయుగంధరః" (అమరం)

'కూబర సంపద' అంటే బండి నొగనుంచి కాణి విడిపోకుండా, ఆ రెండింటిని బంధించే కీలకం - చీల.

పాదుకాగ్రభాగమందున్న ఎత్తైన యంత్రిక, కేళిరథానికి ముందు భాగాన ఉండే కూబర సంపదలాంటి సంపదను వహిస్తుంది. పాదుకా సంచారానికి నిదర్శనగా ఈ చమత్కృతి. ఔపచ్ఛందసికం.

*806. శంకే భవత్యాః సుభగం ప్రతీకం*
*రంగేశపాదాంగుళి సంగ్రహార్థమ్ ।*
*త్రాణాయ పాదావని! విష్టపానా*
*మాజ్ఞాకరీ మంగుళి ముద్రికాం తే॥* 6

అర్థం:- హే పాదావని = ఓ పాదుకాదేవీ! రంగే-ర్థం! రంగేశ = శ్రీరంగపతియొక్క; పాద+అంగుళి = కాళ్ళవ్రేళ్ళను; సంగ్రహ + అర్థం = పట్టుకొనే ప్రయోజనం గల; భవత్యాః = నీ యొక్క; సుభగం = సుందరమైన; ప్రతీకం = అవయవాన్ని; (యంత్రికను); విష్టపానాం = లోకాలయొక్క; త్రాణాయ = రక్షణ కోసం; ఆజ్ఞాకరీం = ఆజ్ఞాపించే; తే = నీయొక్క; అంగుళి ముద్రికాం = వ్రేలిముద్రగా; శంకే = ఊహిస్తాను.

తా॥ ఓ పాదావనీ! శ్రీరంగనాయకుని పాదాంగుళులను పట్టుకొవడమే పనిగల నీ సుందరమైన యంత్రికను, లోకాల రక్షణార్థం విరోధులను బెదరించి, నియమాన్ని ఉల్లంఘించరాదని శాసించే అంగుళి ముద్రగా ఊహిస్తున్నాను.

వ్యాఖ్య :- యంత్రిక, శాసించే అంగుళిముద్రికగా ఉత్ప్రేక్షితం.

వ్రేళ్ళను ముడిచి, ఒక్క చూపుడు వ్రేలెత్తి ఎదుటివారిని 'జాగ్రత' అని ఎచ్చరించి ఆజ్ఞాపించే తర్జనీ విన్యాస విధానమే 'అంగుళిముద్ర'. యంత్రిక పాదుకాగ్రమందు ఉదగ్రమై భగవత్పాదాంగుళులను పట్టుకొనే బొడుసులాంటి అవయవం ఎంతో సుందరంగా ఉంది.

ఉపద్రవకారకులైన వ్యక్తులను కట్టడిలో ఉంచి, లోకరక్షణార్థం శాసించే తర్జన్యంగుళిని పోలియున్నదీ యంత్రిక. ఇంద్రవజ్రా వృత్తం.

> *807. అలంకృతం కర్ణిక యోపరిష్టా*
> *దుదగ్ర నాళం తవ యంత్రికాంశమ్*
> *పద్మాపతేః పాదసరోజ లక్ష్మ్యాః*
> *ప్రత్యేమి పాదావని! కేళిపద్మమ్॥ 7*

**అర్థం:-** హే పాదావని = ఓ పాదుకాదేవీ! ఉపరిష్టాత్ = పైభాగమందు; కర్ణికయా = పూవునడుమ ఉండే దుద్దుచేత; అలంకృతం = భూషింపబడిన; ఉత్ + అగ్ర, నాళం = మీదికి నిల్చిన కాడగల; తవ = నీ యొక్క; యంత్రికా + అంశం = బొడుసురూపమైన అవయవాన్ని; పద్మాపతేః = లక్ష్మీకాంతునియొక్క; పాద సరోజ లక్ష్మ్యాః = పాదకమల శోభారూపమైన లక్ష్మియొక్క; కేళిపద్మం = లీలారవిందంగా; ప్రత్యేమి = విశ్వసిస్తున్నాను.

**తా॥** పాదుకాదేవీ! పై భాగాన కర్ణికచే అలంకరించబడిన ఎత్తైన కాడగా ఉన్న నీ యంత్రికారూపం, లక్ష్మీకాంతుని పాదకమల శోభాత్మికయైన లక్ష్మీదేవి యొక్క లీలారవిందంగా ఉందని విశ్వసిస్తున్నాను.

వ్యాఖ్య :- కమల కర్ణికాభూషిత యంత్రిక, లక్ష్మీకేళికమలంగా ఉత్ప్రేక్షితం

భగవత్పాదకమల శోభయే లక్ష్మి. ఆమె విలాసంగా చేత పట్టుకొన్న తామరపూవు దుద్దును తలపించే విధంగా యంత్రిక ఉంది. పాదుకకున్న యంత్రిక, పైకి పొడవై నిల్చిన కాడతోకూడిన కర్ణికగా సంభావితం.

భగవత్పాదశోభ లక్ష్మితో తాదాత్మ్యంగా, శ్లేషచేత అధ్యవసింపబడింది. (పూర్వార్థం ఉపేంద్ర వజ్ర, ఉత్తరార్థం ఇంద్రవజ్రతో కూడిన) ఉపజాతివృత్తం.

> *808. ఉపరి వినిహితస్య కేశవాంఘ్రే*
> *రుపరిపదావని! యంత్రికాత్మికా త్వమ్!*
> *ఇతి తవ మహిమా లఘూకరోతి*
> *ప్రణత సురేశ్వర శేఖరాధిరోహమ్॥ 8*

**అర్థం:-** హే పదావని = ఓ పాదరక్షిణీ! ఉపరి = (నీ) మీద; వినిహితస్య = ఉంచబడిన; కేశవ+అంఘ్రేః = భగవంతుని పాదం యొక్క; ఉపరి = పై భాగమందు; త్వం = నీవు; యంత్రికా + ఆత్మికా = యంత్రికారూపమై ఉన్నావు; ఇతి = అని; తవ = నీ యొక్క; మహిమా = గొప్పతనం; ప్రణత-అధిరోహం / ప్రణత = నమస్కరించిన; సుర+ఈశ్వర = దేవాధిపతులు; శేఖర = మకుటాలయందు; అధిరోహం = ఎక్కుటను; లఘూకరోతి = చులకనచేస్తుంది.

**తా॥** ఓ పాదరక్షిణీ! నీ మీద ఉన్న భగవత్పాదం పైన యంత్రికారూపంలో ఉండే నీ మహిమ, భగవత్పాదాల క్రింద నమ్రతతో ఉండేదేవరాజుల కిరీటాలమీద నీవు అధిరోహించడాన్ని చాలా చులకనచేస్తుంది.

వ్యాఖ్య :- యంత్రికాత్మకయైన పాదుక, దేవరాజుల కిరీటాలను అధిరోహించడం ఆశ్చర్యంకాదని వర్ణితం

భగవత్పాదం కింద పాదుక ఉంటుంది. పాదుకయొక్క యంత్రిక భగవత్పాదం మీదనూ ఉంటుంది. బ్రహ్మరుద్రేంద్రాదులు భగవత్పాదుకలను సేవించి తమ తలల మీద ధరిస్తారు. కవికేసరి ఈ దృశ్యాన్ని వాక్యార్థ హేతుకమైన కావ్యలింగంగా చమత్కరించారు.

ఏ పాదం తన మీద అధిష్ఠించి ఉన్నదో ఆ పాదం మీదనే ఉన్నయంత్రి కావయవం గల పాదుకకు, నమస్కరిస్తూ అధః స్థానంలో ఉన్న సురేశ్వరుల శిరో భూషణాలైన కిరీటాలమీద ఉండడం ఒక గొప్ప విషయం కాదు.

తనకు శిరోభూషణమైన భగవత్పాదం మీదనే యంత్రికారూపంలో ఉండే పాదుక, తనకు నమస్కరించే వారి కిరీటాలమీద (అధిరోహించడం) ఎక్కడం చాలా తేలిక - స్వల్ప విషయమది. పుష్పితాగ్రా వృత్తం.

*809. నిత్యం పదావని! నిబద్ధకిరీట శోభం*
*పద్మాలయాపరిచితం పదముద్వహంత్యాః ।*
*అంగీకరోతి రుచి మంగుళియంత్రికా తే*
*సామ్రాజ్యసంప దనురూప మివాతపత్రమ్!! 9*

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకాదేవీ! నిత్యం = ఎల్లప్పుడు; నిబద్ధకిరీట శోభం = సంపాదింపబడిన కిరీట శోభగల; పద్మా+ఆలయాపరిచితం = కమల వాసినియైన లక్ష్మీదేవిచేత సేవింపబడిన; పదం= స్థానాన్ని / భగవచ్చరణాన్ని; ఉత్ + వహంత్యాః = పైన ధరిస్తున్న; తే = నీయొక్క; అంగుళియంత్రికా = వ్రేళ్ళనడుమనున్న బొడుసు; సామ్రాజ్య సంపత్ + అనురూపం = సార్వభౌమైశ్వర్యానికి యోగ్యమైన; ఆతపత్రం, ఇవ = గొడుగు వలె; రుచిం = దీప్తిని; అంగీకరోతి = అంగీకరిస్తుంది.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీకు ఎల్లకాలం అందమైన కిరీటం లాగా ఉండే, లక్ష్మీదేవి సేవించేస్థానమైన భగవంతుని చరణాన్ని వహిస్తున్నావు. నీ యంత్రిక, సామ్రాజ్య సంపదకు తగిన ఛత్రం లాగా అంతట వ్యాపించే కాంతిని పొందుతున్నది.

వ్యాఖ్య :- పాదుకాదేవి సమ్రాజ్ఞి అని వర్ణితం

శ్రీ రంగప్రభు చరణమే ఏకచక్రాధిపతిస్థానం. అది సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి చేత బాగా ఆదరింపబడుతుంది. ఆ గొప్పస్థానాన్ని వహిచండం వల్ల పాదుకాదేవి సమ్రాజ్ఞి.

భగవత్పాదం పాదుకాదేవి ధరించే కిరీటంలాగా ఉంది. ఈ సామ్రాజ్య సంపదకు యోగ్యమై సర్వత్రకాంతిని ప్రసరింపజేసే ఛత్రంలాగా పాదుకాయంత్రిక ప్రకాశిస్తున్నది.

భక్తులందరు ఇలా పాదుకా మాహాత్మ్యాన్ని ప్రశంసిస్తున్నారు. ఉపమాలంకారం. వసంత తిలకావృత్తం.

810. ప్రథమాకళేవ భవతీ చరణావని! భాతిరంగచంద్రమసః ।
శృంగోన్నతిరివ యత్రశ్రియం విభావయతియంత్రికాయోగః ॥ 10

**అర్థం:-** హే చరణావని = ఓ పాదుకాదేవీ! భవతీ = నీవు; రంగచంద్రమసః = శ్రీరంగమందలి చంద్రుని యొక్క; ప్రథమా = మొదటిదైన; కళా, ఇవ = కళవలె; భాతి = ప్రకాశిస్తున్నావు. యత్ర = ఏ నీయందు; యంత్రికాయోగః = యంత్రికల సంబంధం; శృంగ + ఉన్నతిః, ఇవ = కొమ్ములయొక్క ఎత్తువలె; శ్రియం శోభను; విభావయతి = ప్రకటిస్తున్నదో.

**తా॥** ఓ పాదుకాదేవీ ! నీవు శ్రీరంగమందు చంద్రుని మొదటి కళలాగా వెలుగుతున్నావు. నీయందు యంత్రికల సంబంధం చంద్రకళయొక్క కొమ్ముల ఎత్తువలె శోభిస్తుంది.

వ్యాఖ్య :- యంత్రిక ప్రతిపచ్చంద్రకళాగ్రంగా వర్ణితం

శ్రీరంగరాజు ప్రజలకు ఆహ్లాదకరుడైన చంద్రునిలాగా ఉన్నాడు. పాదుకాదేవి ప్రతిపచ్చంద్రకళగా శోభిస్తున్నది. పాదుకా యంత్రికలు ఎత్తుగా లేచిన ప్రథమ కళాగ్రాలలాగా శోభించడం శిల్పచమత్కారం. రూపకాతిశయోక్త్యను ప్రాణితమైన ఉపమాలంకారం. ఆర్యావృత్తం.

యంత్రికా పద్ధతి సమాప్తం.

# 27. రేఖాపద్ధతి

811. సూచయంతీం స్వరేఖాభిరనాలేఖ్యసరస్వతీమ్ !
అలేఖనీయ సౌందర్యామాశ్రయే శౌరి పాదుకామ్ !! 1

**అర్థం:-** స్వరేఖాభిః = తనరేఖలచేత; అనాలేఖ్యసరస్వతీం = వ్రాయతగని వేదసూక్తిని; సూచయంతీం = గుర్తుచేస్తున్న; అలేఖనీయ సౌందర్యాం = గీయరాని అందంకలిగిన; శౌరిపాదుకాం = భగవత్పాదుకను; ఆశ్రయే = ఆశ్రయిస్తాను.

**తా॥** తనలోన ఉన్నరేఖలచేత లిఖించడానికి అనర్హమైన శ్రుతి వాక్యాన్ని సూచిస్తూ, చిత్రించరాని ఆభిరూప్యం గల పాదుకా దేవిని సేవిస్తుంటాను.

వ్యాఖ్య :- అలేఖ్య తనూరేఖావిలాసిని పాదుక అని ప్రశంసితం

పాదుకపైన అనేక రేఖలు అలంకరింపబడి ఉన్నాయి. ఆ రేఖలు శ్రుతి వాక్కును స్మృతికి తెస్తాయి. అధ్యయన పరులు వేదాన్ని గురువు చెప్పగా విని ధారణ చేసి వల్లించడం శిష్టాచారం. కాని వ్రాసి చదువదగినది కాదు. కేవలం అధ్యయన మాత్రగ్రాహ్యం, వ్రాయడం దోషం అనే భావన తొలిపలుకులకు ఉండింది. కాబట్టి 'శ్రుతి' అని రూఢి అయింది.

ప్రసరించే స్వభావంగల నీటిని గ్రహిస్తాంకాని మూటగట్టవశమా!

"బ్రహ్మజలధారణ ప్రశ్చ్యోతనాభ్యాం వేదాః సరాంసి, తన్మ యత్వాత్, తద్వతీ సరస్వతీ"

"బ్రహ్మమనే జలాన్ని కలిగి ఉన్నందువల్ల, దాన్ని పొందే అధికారులకు ప్రవహింపజేయడం వల్లనూ వేదాలను సరస్సులంటారు. సరస్సులు కలది సరస్వతి" - అని భాష్యార్థం.

చాలా దగ్గరికి పోయి దర్శించి, సేవించే భక్తులకు పాదుకారేఖలు "ఇదేమిటి? ఏదో వ్రాత ఉంది. మనం ఎత్తి వ్రాసుకొని చదువకూడని వాక్కు ఇందున్నది. వేదమే ఈ రూపంతో వచ్చి పాదుకయందు విడిపోలేని మైత్రితో చేరిందే" అని శ్రుతిని స్మృతింపజేశాయి. తత్ఫలితంగా, పాదుకా సౌందర్యం చిత్రించరానిదై, చూచినా కొద్దీ ఇంకా చూడాలనే అనిపిస్తుంది.

"క్షణేక్షణేయన్నవతాము పైతి, తదేవ రూపం రమణీయతాయాః" - మాఘకవి డెందం చిందిన అందం.

క్షణం క్షణం - రెప్పపాటు అయినప్పుడు అదే రూపం గ్రొత్తగా కనబడుతుంటే ఇక ఆ రూపం కుంచెతో చిత్రింపతరమా! కాబట్టి, పాదుకా సౌందర్యం అలేఖనీయం. ఆభిరూప్యం ఆదరణీయం.

కమనీయరేఖ లెట్టివో తెలియనందువల్ల, తొలిపలుకుల వెలది తోడుగా ఉన్న కడు రమణీయ పాదుకను భక్తితో స్మరించడం ప్రేయోఽలంకార లక్షణం. అనుష్టుప్ ఛందం.

812. మణిమౌళి నిఘర్షణా త్సురాణాం
వహసే కాంచన పాదుకే! విచిత్రమ్ ।
కమలాపతి పాదపద్మయోగా
దపరం లక్షణ మాధిరాజ్యసారమ్ ॥ 2

**అర్థం:-** హే కాంచనపాదుకే = ఓ హాటకపాదుకా! సురాణాం = దేవతలయొక్క,; మణిమౌళినిఘర్షణాత్ = రత్నకిరీటాల ఒరపిడి వల్ల; విచిత్రం = నానావిధాలైన / ఆశ్చర్యమైన; కమలాపతిపాదపద్మయోగాత్ = శ్రీకాంతుని చరణకమలాల సంబంధం వల్ల: అపరం = వేరే - మరొక; ఆధిరాజ్యసారం = సామ్రాజ్య ఫలమైన; లక్షణం = గుర్తును; వహసే - వహిస్తున్నావు.

**తా॥** ఓ హాటకపాదుకా! అమరుల మణిమయమకుటాల రాపిడివల్ల నానా కారాలుగలదై ఆశ్చర్యం కలిగించే లక్ష్మీనాథుని పాద పద్మాల సంబంధంవల్ల విలక్షణ సామ్రాజ్యసారాన్ని వహిస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకారేఖలు భగవత్పాదరేఖలచే ముద్రితాలు

లక్ష్మీ పతిపాదాలకు దివ్యమైన రేఖలున్నాయి. దేవతలు వెంటవెంట వచ్చి నమస్కరించడం వల్ల, వారికిరీటాల్లో పొదుగుబడిన మగరాళ్ళ రాపిడి చేత భగవత్పాదాలకు నానాకార రేఖలేర్పడినాయి. ఈ విచిత్ర రేఖలతో ప్రకాశించే భగవత్పాద పద్మాలు, పాదుకలను ధరించడం వల్ల స్వచ్ఛగా పాదుకల మీద ముద్రింపబడినాయి. దర్శనం చేసుకొనే భక్తులకు సకల దేవతలను అనుగ్రహించిన లక్షణాన్ని ఈ రేఖలు తెల్పుతున్నాయి. తత్ఫలితంగా, పాదుకాదేవి అఖిలలోకాలనేలే 'సమ్రాజ్ఞి' అనదగిన రేఖల చిహ్నాన్ని వహిస్తున్నది. శ్రీరంగనాథుని పాదపద్మ యోగంలాగా, పాదుకా రేఖాచిహ్నం కూడా సామ్రాజ్య సూచకం. ఉత్ప్రేక్షాలంకారం. ఔపచ్ఛందసికం.

813. అభితో మణిపాదుకే! స్ఫురంత్యా
స్తవరేఖావితతే స్తథా విధాయాః ।
మురవైరి పదారవింద రూఢై
రనుకల్పాయిత మాధిరాజ్య చిహ్నైః ॥ 3

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! తథా విధాయాః = అటువంటి (దేవతల రత్నకిరీటాల ఒరపిడిచే ఏర్పడినట్టి); అభితః = ఇరు పక్కల స్ఫురంత్యాః = ప్రకాశించే; తవ = నీ యొక్క; రేఖా వితతేః = రేఖల విస్తారానికి; మురవైరి పద + అరవింద రూఢైః = మురారి పాదపద్మాల యందు ఉద్భవించిన; అధిరాజ్య చిహ్నైః = సామ్రాజ్య చిహ్నాలతో; అనుకల్పాయితం = తర్వాత ఏర్పడి సమానమయింది.

**తా॥** ఓ మణిపాదుకా! దేవతల శిరోభూషణాల రాపిడిచే ఏర్పడిన ఇరుప్రక్కల స్ఫురిస్తున్న నీ రేఖల వితతికి, భగవత్పాదాలయందు ఉద్భవించిన సామ్రాజ్య చిహ్నాలతో తర్వాత సమానస్థితి ఏర్పడింది.

వ్యాఖ్య :- భగవత్పాదరేఖలకంటె స్ఫుటంగా కనబడే పాదుకారేఖలు ఉత్కృష్టమైన వని ఉత్ప్రేక్షితం.

భగవత్పాదరేఖల చిహ్నాలూ, నిర్జరుల రత్నకిరీటాల సంఘర్షణచేత ఏర్పడిన రేఖల చిహ్నాలూ పాదుకలమీదనూ, ప్రక్కలయందూ ముద్రితాలు. పాదతలాన ఉన్న శంఖచక్ర వజ్రాంకుశాది రేఖలు సామ్రాజ్యలక్షణ రేఖలే. అయినా అవి, పాదుకా రేఖా చిహ్నాలవలె స్పష్టంగా గోచరించనందు వల్ల ప్రాభవ వైభవాలకు ఒక కొరత ఏర్పడుతున్నది.

భగవత్పాదరేఖలతో సమాన ప్రాతినిధ్యం పాదుకారేఖా వితతికి కల్పితం. అయితే పాదుకారేఖా వితతికి, అధి రాజ్య చిహ్నం స్పష్టంగా కనబడుతున్నందువల్ల, ఉత్కర్ష ఏర్పడింది. భక్తులకు ప్రభుత్వ చిహ్నం పాదుకలయందే మొదట గోచరిస్తుంది. కాబట్టి పాదుకారేఖా వితతి ప్రథమకల్పం. పాదుకా చిహ్నాన్ని బట్టి పాదచిహ్నానికి సాదృశ్యం తర్వాత కల్పితం. కాబట్టి పాదరేఖా చిహ్నం అనుకల్పం. రేఖా స్ఫురణం ముఖ్యం.

మొదట ఉపయోగానికి వచ్చే పాలు 'ముఖ్యకల్పం'. తర్వాత ఏర్పడే మజ్జిగ 'అనుకల్పం' అలాగే భగవంతుడు ఉపయోగించే పాదుకల యందలి సామ్రాజ్య లక్షణరేఖాచిహ్నం - Identification mark 'ముఖ్యకల్పం' - స్ఫుటంగా గోచరించడమే హేతువు. పాదుకారేఖా చిహ్నామే పాదమందు స్ఫురిస్తున్నదని సేవించే భక్తులు తర్వాత గమనిస్తారు. కాబట్టి పాదరేఖా చిహ్నం 'అనుకల్పం'. ఔపచ్ఛందసికం.

*814. రేఖయా వినమతాందివౌకసాం*
*మౌళిరత్నమకరీ ముఖోత్థయా ।*
*పాదుకే! వహసి నూనమద్భుతం*
*శౌరి పాదపరిభోగ లక్షణమ్ ॥* 4

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! వినమతాం = నమస్కరించే; దివౌకసాం = దేవతలయొక్క; మౌళి రత్నమకరీ ముఖ + ఉత్థయా = కిరీటాలయందున్న రత్నాలచే మలచబడిన మొసలి ప్రతిమయొక్క ముఖం వల్ల కలిగిన; రేఖయా = గీతచేత; అద్భుతం = ఆశ్చర్యమైన; శౌరిపాదపరిభోగ లక్షణం = భగవత్పాదం యొక్క సంశ్లేషవలని చిహ్నాన్ని; నూనం = నిశ్చయంగా; వహసి = వహిస్తున్నావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! నమస్కరించే దేవతలకిరీటాలయందున్న రత్నమకరీ ముఖం భగవత్పాదమందు రేఖగా ముద్రితం. నీవు భగవత్పాదమందున్న ఆ రేఖా చిహ్నాన్నీ వహిస్తున్నట్లున్నావు.

వ్యాఖ్య :- పాదసంశ్లేష వల్ల పాదుక భోగరేఖలను వహిస్తున్నట్లు ఉత్ప్రేక్షితం

రత్నాలను మొసలి రూపం లాగా భూషణాల్లో మల్చడం శిల్ప నైపుణ్యం. దేవతలు నమస్కరిస్తున్నప్పుడు వారికిరీటాల్లోని మణిమయ మకరీముఖరేఖ భగవత్పాదానికి ఏర్పడింది. పాదంతో పాటు ఆమకరీ ముఖరేఖా ముద్రనుకూడా పాదుక మోస్తున్నది.

పాదానికి ఏర్పడిన మకరీముఖ ముద్ర, పాదుకమీదనూ అచ్చుపడింది. భగవత్పాదం నాయకుడు. పాదుక నాయిక. నాయకుడు నాయికతో రమిస్తుంటే, నాయికాశరీరం మీద బాహ్యభోగం వల్ల కలిగిన దంత నఖక్షతాది రూప రేఖాచిహ్నాంగా, ఆ మకరీ ముఖరేఖా చిహ్నాన్ని సంభావించడం రాసిక్యం.

నాయికానాయకులు చుంబనాలింగనాది బాహ్యభోగమను భవిస్తున్నప్పుడు నఖ దంతక్షతాది రేఖలను సహించడమూ, వహించడమూ పరిపాటికదా! రథోద్ధతా వృత్తం.

*815. త్రిదశమకుట రత్నోల్లేఖరేఖాపదేశాత్*
*పరిణమయసి పుంసాం పాదుకే! మూర్ధ్నిలగ్నా,*
*నరకమథనసేవా సంపదం సాధయిత్రీ*
*నియతి విలిఖితానాం నిష్కృతిందుర్లిపీనామ్ ॥ 5*

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! పుంసాం = జనులయొక్క; మూర్ధ్ని = తలయందు; లగ్నా = చేరిన -తగిలిన దానవై; (నీవు) నరకమథన సేవాసంపదం = నరకాంతకునికి సేవ చేసే భాగ్యాన్ని; సాధయిత్రీ = సిద్ధింపచేస్తూ; త్రిదశ - దేశాత్ । త్రిదశ మకుట = దేవతల కిరీటాలయందలి; రత్న + ఉల్లేఖ = మణుల రాపిడివల్ల కలిగిన; రేఖా + అపదేశాత్ = గీతలనెపం వల్ల; నియతి విలిఖితానాం = విధిచే వ్రాయబడిన; దుర్లిపీనాం = దురితాక్షరాలకు; నిష్కృతిం = పరిహారాన్ని; పరిణమయసి - కలిగిస్తుంటావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! ప్రజల శిరస్సున చేరిన దానవై నీవు నరకాంతకుని సేవాభాగ్యాన్ని సిద్ధింపజేస్తూ అమరుల మకుటాల్లోని మణుల ఒరపిడిచే కలిగిన గీతల నెపంతో విధి లిఖిత దురితాక్షరాలను మార్చివేస్తుంటావు.

వ్యాఖ్య :- పాదుకారేఖ నొసటి వ్రాతను మార్చివేస్తుందని వర్ణితం.

ప్రజల నొసట వారు చేసిన కర్మల ఫలాన్ని అనుభవింపజేసే విధివ్రాత ఉంటుంది. దేవతలు నమస్కరించినప్పుడు వారి కిరీటాలలోని మణుల రాపిడివల్ల పాదుకలకు కొన్ని రేఖలు ఏర్పడుతాయి. ఈ పాదుకా రేఖలు పరమభక్తిచే ప్రణమిల్లే ప్రజల తలకు తగులుతాయి. తగులడం ఒక మిషయే. పాదుకారేఖ ప్రణతుల నొసట నరకానుభవాన్ని ప్రకటించే విధివ్రాతను చెరపి, నరకాంతకుడైన సర్వేశ్వరుని పాదకమలాలకు సేవ - కైంకర్యం చేసే భాగ్య రేఖను గీస్తుంది. శఠారిని శిరస్సున వహించిన వారు దివ్యసూరులవలె భగవత్కైంకర్య పరులవుతారు. అపహ్నవాలంకారం. మాలినీ వృత్తం.

*816. పదకమల తలాంతః సంశ్రితాన్యాత పత్ర*
*ధ్వజ సరసిజ ముఖ్యాన్యైశ్వరీ లక్షణాని ।*
*అవగమయసి శౌరేః పాదుకే మాదృశానా*
*ముపరి పరిణతైః స్వైః ర్దేవి! రేఖావిశేషైః ॥ 6*

**అర్థం:-** హే దేవి, పాదుకే = ఓ పాదుకాదేవీ! శౌరేః = భగవంతునియొక్క; పదకమలతల + అంతః సంశ్రితాని = పద్మాలవంటి పాదాల అడుగులోనడుమ చేరి ఉన్న; ఆతపత్ర ధ్వజ సరసిజ ముఖ్యాని = గొడుగు, టెక్కెం, కమలం మొదలైన; ఐశ్వరీ లక్షణాని = ఈశ్వరత్వ చిహ్నాలను; ఉపరి = (నీ) మీద; పరిణతైః = ముద్రింపబడిన; స్వైః = స్వీయమైన; రేఖావిశేషైః = పలురకాలరేఖలచేత; మా దృశానాం = మావంటి వాళ్ళకు; అవగమయసి = తెల్పుతున్నావు.

తా॥ ఓ పాదుకాదేవీ! నీవు భగవత్పాదతలాల మధ్యన ఉన్న ఛత్రం, ధ్వజం, పద్మం మొదలైన ఉభయ విభూతినాయకత్వ రేఖల చిహ్నాలను, నీ మీద అచ్చుపడిన స్వీయ రేఖా విశేషాలచేత మా బోటి వారికి తెలియ జేస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకారేఖ వల్ల భగవత్పాదరేఖలను ఊహించే వర్ణన

శాస్త్రాభ్యాసంచేసి, ఆచార్యోపదిష్టులైన పెద్దలు సర్వేశ్వరుని పాదపద్మ తలరేఖలను సేవించి ఆనందిస్తారు. ఇవి సామాన్యజనులకు తెలియవు. పామరజనులు పాదుకలను సేవిస్తున్నప్పుడు 'పాదుకలమీద శంఖం చక్రం , ఛత్రం, ధ్వజం, కమలం మొదలైన రేఖలున్నాయే. ఆహా! ఈ ప్రాభవలక్షణరేఖ లెలా చేరినాయి?' అనుకొంటారు. ఆ మాటలను విన్న మహానుభావులు వీరికి "ఉభయ విభూతినాయకుడైన శ్రీరంగనాథుని పాదకమలాల అడుగు భాగాల్లో ఛత్రధ్వజాది రేఖలున్నాయి. స్వామి ధరించే పాదరక్షల మీద ఈశ్వరత్వ లక్షణాలున్న ఈ రేఖలు ఉన్నవి ఉన్నట్లు ముద్రింపబడినాయి" అని తెలియజేస్తారు. కాబట్టి పాదుకల మీది రేఖలను దర్శించి భగవత్పాదరేఖలను అనుమానిస్తారు. అనుమానాలంకారం. మాలినీ వృత్తం.

*817. స్నాతా పదావని! చిరం పరిభుజ్య ముక్తా*
*పాదేన రంగనృపతేః శుభలక్షణేన।*
*రేఖాంతరై ర్నవనవై రుపశోభసే త్వం*
*సంస్కార చందన విలేపన పంకలగ్నైః ॥* 7

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకా! శుభ లక్షణేన = శుభచిహ్నాలుకలిగిన; రంగనృపతేః = శ్రీరంగరాజుయొక్క; పాదేన = చరణంచేత; చిరం = చాలకాలం; పరిభుజ్య = భోగమనుభవించి; ముక్తా = విడువబడి; స్నాతా = స్నానంచేసిన; త్వం = నీవు; సంస్కార చందన విలేపన పంకలగ్నైః = సంస్కారార్థమైన చందన మలదికొనడం చేత అంటుకొన్న; నవనవైః = కొత్త కొత్తవైన; రేఖా + అంతరైః = వేర్వేరు రేఖలచేత; ఉపశోభసే = ప్రకాశిస్తున్నావు.

తా॥ ఓ పాదుకా! శుభలాంచనాలు కలిగిన భగవత్పాద రూపనాయకుడు చిరకాల మనుభవించి విడిచిన తర్వాత స్నానం చేసిన నీవు చందనపు పూతతో సంస్కరించుకొంటే ఏర్పడిన కొత్త కొత్త వేర్వేరు రేఖలచే కడుశోభిస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకాదేవి, చందన లేపనం వలనిరేఖలచే శోభించే వర్ణన

శ్రీరంగనాయకుడు చిరకాలం సంచరించి వచ్చిన తరువాత పాదుకలను విడిచాడు. స్నానంచేశాడు. అంటే, భగవంతునికి అభిషేకం చేసి అర్చకులు అలంకార మంటపంలో శ్రీచందనం సమర్పించారు. అలాగే, శఠారి - పాదుకాదేవికి అభిషేకం చేయడమూ, శ్రీ చందనం సమర్పించడమూ పూజలో నియమితాంశం.

భగవత్పాదరూపనాయకుడు పాదుకానాయికను చాలాకాలం భోగించి విడిచాడు. ఆమె స్నానం చేసి చలువనిచ్చే చందనాన్ని చిక్కగా లేపనం చేసుకొన్నది. చందనపు పూతను గోళ్ళతో గోరుతూ సంస్కరించుకోవడం

ఆలరుబోడులకలవాటు. కాబట్టి నవనవ రేఖలతో, పాదాలకన్న మించి, శోభించే లావణ్యమిది. ఛత్రధ్వజాది రేఖాలక్షణాలకన్న విలక్షణమైనది. చందనం భగవత్పాదాలకూ, పాదుకలకూ, అలదిన తర్వాత అది ఆరిపోయి, తెల్లగా అందమైన రేఖ లేర్పడి శోభించే శ్లోకమిది. రసోక్తిగా అభివ్యక్తం.

ఇక్కడ స్నానానంతరం భోగమా? భోగానంతరం స్నానమా? చందన విలేపనం భోగానికి అంగమా? భోగం తర్వాత శోభకోసమా? ఇది వివాదాంశం. 'స్నాతా' అనే పదాన్ని మొదట అన్వయిస్తే బాగుంటుందా? కమనీయచందన చర్చిత రేఖావిలాసం - ఆచారాన్ని బట్టి యుక్తి యుక్తంగా స్వారస్యం - గమనీయం. ఇది సమాసోక్తి వైచిత్రి. వసంత తిలకావృత్తం.

*818. భక్త్యా ముహుః ప్రణమతాం త్రిదశేశ్వరాణాం*
*కోటీర కోటి కషణా దుపజాయ మానైః ।*
*ఆభాతి శౌరి చరణా దధికాను భావా*
*రేఖాశతై స్తవ పదావని! కాఽపిరేఖా ॥* 8

**అర్థం:-** హే పదావని - ఓ పాదుకాదేవీ! భక్త్యా = భక్తిచేత; ముహుః = మాటిమాటికి; ప్రణమతాం = నమస్కరించే; త్రిదశ + ఈశ్వరాణాం = అమరాధిపతుల యొక్క; కోటీరకోటి కషణాత్ = కిరీటాల అంచుల-కొనల-ఒరపిడి వల్ల; ఉపజాయమానైః = ఏర్పడుతున్న; రేఖాశతైః = వందల రేఖలచేత; శౌరిచరణాత్ = భగవత్పాదంకంటె; అధిక + అనుభావా = ఎక్కువ మహిమగల; కా, అపి, రేఖా = విలక్షణమైన ఏదో రేఖ; తవ = నీకు; ఆభాతి = ప్రకాశిస్తున్నది.

**తా॥** ఓపాదుకాదేవీ! భక్తిచే వెంట వెంట నమస్కరించే అమరేశుల కిరీటాగ్ర భాగాల ఘర్షణ వల్ల ఏర్పడుతున్న వందల కొలదిరేఖల చేత, భగవత్పాదం కన్న కడు పేర్మిగల అనిర్వచనీయరేఖ ఏదో నీకు భాసిస్తున్నది.

వ్యాఖ్య :- పాదుక కేర్పడిన రేఖా సమృద్ధి వర్ణన

కఠోర వజ్రాలతోకూడిన కిరీటాగ్ర భాగాల సంఘర్షణ హేతువుగా భగవత్పాదారవిందాలకు బాధకలుగకుండా దేవరాజులు, పాదాల ముందున్న పద్మపీఠాధిష్ఠితయైన పాదుకాదేవికి నమస్కరిస్తున్నారు.

ఒకరి తర్వాత మరొకరు తలలు వంచి ప్రణమిల్లుతున్నప్పుడు విబుధ వరుల కోటీరకోటుల కషణ వల్ల పాదుకల మీద అనేక రేఖలేర్పడుతున్నాయి. ఈ రేఖలు భగవత్పాదతల రేఖలకన్నా అధికమై, సాముద్రిక శాస్త్రం చేతనూ తెలసుకొనజాలనివి. బహురేఖాసమష్టి రూపమైన ఈ పాదుకా రేఖ సామ్రాజ్యానుభవ లాభం కలిగి ప్రశంసనీయంగా శోభిస్తున్నది. అతిశయోక్త్య లంకారం. వసంత తిలకావృత్తం.

*819. పాదావని! ప్రతిపదం పరమస్య పుంసః*
*పాదారవింద పరిభోగ విశేష యోగ్యా ।*
*స్వాభావికాన్ సుభగ భక్తి విశేషదృశ్యాన్*
*రేఖాత్మకాన్ వహసి పత్రలతా విశేషాన్ ॥* 9

అర్థం:- హే పాద + అవని = అడుగులతొడవైన ఓ పాదుకా! ప్రతిపదం = అడుగడుగున; పరమస్య, పుంసః = పరమ పురుషుని యొక్క; పాద+అరవింద, పరిభోగ విశేష యోగ్యా = పాదపద్మాల స్పర్శరూపమైన సంభోగానికి తగిన (నీవు); స్వాభావికాన్ = నైసర్గికాలైన; సుభగ భక్తి విశేషదృశ్యాన్ = అందమైన, విడివిడిగా ఉన్న వరుసలచే చూడముచ్చటగా ఉన్న / భాగ్యవంతుల భక్తి భేదాలచే చూడదగిన; రేఖా+ఆత్మకాన్ = రేఖా రూపాలైన; పత్రలతా విశేషాన్ = మకరికాది పత్ర వల్లీ భేదాలను; వహసి ధరిస్తున్నావు.

తా॥ ఓ పాదావనీ! అడుగడుగున భగవత్పాదకమలాల స్పర్శ రూపభోగానికి యోగ్యవైన నీవు, నిసర్గరమణీయాలైన అసంకీర్ణ పంక్తులతో భక్తి విశేషం చేత చూడదగిన రేఖా రూపాలైన మకరికాది పత్రాలనూ, తీగలనూ ధరిస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకా నైసర్గిక రేఖలను భోగాలంకారాలుగా వర్ణించే శ్లోకం

స్త్రీలు తమ పతులకు ప్రియమగునట్లు కుంకుమాది వర్ణాలతో మకరికాది పత్రాలను అవయవాలయందు దివ్యంగా చిత్రించుకొంటారు. నాయకునితో ఏకాంతభోగానికి అనుగుణంగా స్త్రీలు భుజశిఖరాల్లో, వక్షోజాలపైన, కంఠానికి కపోలాలమీదనూ రంగురంగుల ఆకులూ, తీగలూ లేపన రేఖలుగా కనబడే మాదిరి రచించుకొనే నేర్పు కలిగి ఉంటారు.

"భుజశిఖర స్తనమండల కపోల కంఠేషు విరచితాకుశలైః ।
ఆలేపన రేఖా నిగద్యతే పత్ర వల్లీ" ॥ (హలాయుధ నిఘంటువు)

పాదుకానిర్మాణ సమయాననే ఆకులు, తీగలు దాని స్వరూపాన సహజంగా తీర్చడం నైసర్గికం. ఒక రేఖతో మరొకరేఖ కలియకుండా విడి విడిగా ఉండడం వల్ల ఏకాంతులకూ, పరమైకాంతులకూ చూడ సొంపుగా ఉన్నాయి ఈ రేఖలు.

పరమ పురుషుని పాదాలు తామరపూలు. అయితే పాదుకానైసర్గిక స్వరూపరేఖలు పత్రలతా విశేషాలు. ఇది సౌభాగ్య దృశ్యం.

భగవత్పాదమనే నాయకునితో చేరి భోగమనుభవింపదగినట్లు పాదుకానాయిక, తన స్వరూపాన్ని సొబగుగా గోచరింపచేసే మకరికాది పత్రరేఖలను రచించుకొన్నది. అపహ్నవాలంకారం. వసంతతిలకావృత్తం.

*820. రేఖాపదేశతస్త్వం ప్రశమయితుం ప్రళయవిప్లవాశంకామ్ ।*
*వహసి మధుజిత్పదావని! మన్యే నిగమస్యమాతృకా లేఖ్యామ్ ॥ 10*

అర్థం:-హే మధుజిత్ పదావని = ఓ మధుసూదనుపాదుకా! త్వం = నీవు; నిగమస్య = వేదం యొక్క; ప్రళయ విప్లవ + ఆశంకాం = కల్పాంతమందు నాశనం యొక్క సందేహాన్ని; ప్రశమయితుం = తొలగించడానికి; రేఖా + అపదేశతః = రేఖావ్యాజం వల్ల; మాతృకా, లేఖ్యం = మూలరూపమైన అక్షరవిన్యాసాన్ని; వహసి = వహిస్తున్నావు; మన్యే = అనుకొంటాను.

తా॥ ఓ మధుజిత్పాదుకా! ప్రళయకాలంలో వేదం నశించి పోతుందేమో అనే అనుమానాన్ని పోగొట్టడానికి రేఖావ్యాజం వల్ల మూలగ్రంథంగా ఉన్నావని భావిస్తాను.

### వ్యాఖ్య :- పాదుకారేఖ శ్రుత్యక్షర రూపంగా ఉత్ప్రేక్షితం

పాదుకానైసర్గిక స్వరూపం రేఖామయం. ఆచార్య శిష్యపరంపరగా అధ్యయనం చేయబడే వేదం ప్రళయవేళలో నశిస్తుందని కొదరు సందేహిస్తారు.

"అలా అనుమానపడవద్దు. ఇదుగో! మూలప్రతి ఇక్కడే ఉన్నది. ప్రళయాంతంలో అంటే, మళ్ళీ సృష్టి ఆరంభంలో దీనియందున్న వేదం ప్రకటితమై, వేదాధ్యయనం చక్కగా సాగుతుంది" అని తెల్పడానికో అన్నట్లు, పాదుకాస్వరూపంలో అక్షరాలా రేఖాపద్ధతి ఉంది. 'మాతృక' అంటే మొదట ఆవిష్కృతమైన గ్రంథం. పరమపురుషుడు వ్రాసిన గ్రంథంలాగా పాదుకా స్వరూపముంది. ఆర్యావృత్తం.

### రేఖాపద్ధతి సమాప్తం

# 28. సుభాషిత పద్ధతి

*821. కళాసుకాష్ఠా మాతిష్ఠన్ భూమ్నే సంబంధినామపి ।*
*పాదుకారంగధుర్యస్య భరతారాధ్యతాంగతా*

**అర్థం:-** కళాసు = విద్యలయందు; కాష్ఠాం = ఉత్కర్షను; అతిష్ఠన్ = పొందిన వ్యక్తి; సంబంధినాం, అపి = సంబంధులకు కూడ; భూమ్నే = అభ్యుదయం కోసం; (భవతి=ఉంటాడు). రంగధుర్యస్య = శ్రీరంగనాథుని యొక్క / నాటకరంగమందు ఆరితేరినవానియొక్క; పాదుకా = పాదుక; భరత+ఆరాధ్యతాం = భరతునిచేత/ నటులచేత, పూజ్యభావాన్ని; గతా = పొందినది.

**తా॥** కళాపూర్ణుడు ఉండడం వల్ల అతని సంబంధులకూ గౌరవం లభిస్తుంది. శ్రీరంగనాథుని పాదుక భరతునిచేత పూజింపబడింది. భరతశాస్త్ర ప్రవీణునికి సంబంధించిన వ్యక్తి (పాదుక) నాటకకారులచేత పూజ్యభావాన్ని పొందడం లోకవృత్తం.

వ్యాఖ్య :- పాదుకావృత్తాంతాన్ని బట్టి సుభాషితం అభివ్యక్తం

రత్నసామాన్య పద్ధతి (15) మొదలుకొని రేఖాపద్ధతి (27) వరకు పదమూడు పద్ధతులచేత - మూడు వందల నలుభై (340) శ్లోకాలచేత - పాదుకామూర్తి నిరూపణం చేయబడింది.

ఈ పద్ధతిలో ధ్యాన, అర్చన, నిత్యకర్మాదులచే పాదుకారాధ్యత్వం నిరూపింపబడుతూ, పాదుకా సంబంధం కలిగిన విశేష ప్రదర్శనతో నానాలోకనీతులు ఉత్పాదింపబడుతున్నాయి.

కళాపారంగతుని ఆశ్రయించిన, ఆకళయందు నిష్ణకలవారిని ఆదరాభిమానాలతో లోకులు సమ్మానిస్తారు. (సంబంధం అంటే విద్వత్సంబంధం; చుట్టమని కాదు)

దశరథుని ద్వితీయ పుత్రుడైన భరతుడు పాదుకను ఆరాధించాడు. శ్రీరంగనాథుడు జగన్నాటక సూత్రాధారి. నటపరివృఢుడు. ఆయనను పాదుక ఆశ్రయించింది. ఆ పాదుకను భరత - నాట్య - శాస్త్ర నిపుణులు కీర్తించారు.

సుభాషితాలు కాబట్టి పాదుకను సంబోధించడం లేదు.

"కళాసు కాష్ఠమాతిష్ఠన్" అనడంవల్ల అనేకోదాహరణాలు గ్రాహ్య మవుతాయి. "ఏవం విత్పురుషః తస్య విత్తమేవ పంచదశకలా ఆత్మైవాస్యషోడశీకలా స విత్తేనైవా చపూర్యతే" (బృహదారణ్యకోపనిషత్)

జీవుడు షోడశకళా విశిష్టుడు. జీవాత్మ స్వరూపం ఒకకళ. విత్తం పదిహేనుకళలుగా కీర్తింపబడింది. పదహారు కళలతో కూడిన జీవుడు విత్తపూర్ణుడై తత్సంబంధుల భోగ సమృద్ధికి కారకుడవుతాడు.

కళా పూర్ణుడు చంద్రుడు, చంద్ర సంబంధం కలవి సముద్రాలు, కలువలు, కళా పూర్ణత్వమే ప్రయోజకం. కాబట్టి చంద్రుని చేత సముద్రాలు వృద్ధి పొందుతాయి; కలువలు వికసిస్తాయి.

కుల ప్రదీపకునిచేత కులానికంతటికి కీర్తి పులుముకొంటుంది. సమర్థుడైన ఏలికవల్ల దేశానికి గౌరవం లభిస్తుంది కదా!

భరతాగమప్రౌఢుని పాదుకకు భరతజనారాధ్యత్వం, అనే శ్లేషగమ్యమైన విశేషంచేత సామాన్య ధర్మమైన విద్వత్సంబంధం గల జనులకు కలిగే అభ్యుదయం సమర్థింపబడింది. కాబట్టి, విశేషవాక్యంతో సామాన్య వాక్యం సమర్థింపబడిన అర్థాంతరన్యాసాలంకారం. అనుష్టుప్ ఛందం.

*822. సంతః స్వదేశ పరదేశ విభాగశూన్యం*
*హంత స్వవృత్తి మనఘూంన పరిత్యజంతి!*
*రాజ్యే వనేచ రఘుపుంగవపాదరక్షా*
*నైజం జహౌ నఖలు కంటక శోధనం తత్ ॥* 2

**అర్థం:-** సంతః = మహాత్ములు; స్వదేశ పరదేశ విభాగశూన్యం = తన చోటు వేరేచోటు అనే భేదం లేకుండా; అనఘాం = దోషరహితమైన; స్వవృత్తిం = తమ పనిని; న, పరిత్యజంతి = విడువరు, హంత = ఆశ్చర్యం. రఘుపుంగవ పాదరక్షా = శ్రీరాముని పాదుక; రాజ్యే = కోసలదేశమందు; వనే, చ = చిత్రకూటాద్రి పరిసరారణ్యమందుకూడ; నైజం = తనదైన; కంటక శోధనం = ముండ్లను అణచివేయునట్టి; తత్ = అప్రసిద్ధమైన వృత్తిని; న, జహౌ, ఖలు = విడువలేదు కదా!

**తా॥** సత్పురుషులు తనదేశం, ఇతరదేశం అనే భేదం లేకుండా నిర్దుష్టమైన తమ వృత్తిని విడనాడరు. శ్రీరామచంద్ర స్వామి పాదుక అయోధ్యయందూ, అడవియందూ తన వృత్తియైన కంటకశోధనాన్ని విడనాడలేదుకదా!

వ్యాఖ్య :- పాదుకాదేవి ఏ చోటనైనా స్వధర్మాన్ని వీడలేదని వర్ణితం

సచ్ఛీలురు దేశకాలయోగ్యతలను లక్ష్యపెట్టకుండా తమ ధర్మాన్ని దోషరహితంగా నిర్వర్తించడం ఆశ్చర్యమే. దీనికి పాదుకయే ఉదాహరణం.

"సూచ్యగ్రే క్షుద్ర శత్రౌచ రోమహర్షేచకంటకః" (అమరం)

'కంటక' శబ్దానికి ముల్లు, పగవాడు, గగుర్పాటు - అని నానార్థాలు.

శ్రీరామ భద్రుడు చిత్రకూట ప్రాంతకాంతారంలో సంచరిస్తున్నప్పుడు కాలికి ముల్లునాటకుండా కంటక శోధన చేసి - ప్రభు పాదాలను పాదుకా దేవి పరిరక్షించింది. ఆ దేవి తన పట్టాభిషేకానంతరం కోసల రాజ్యంలో ఉపద్రవాలను కల్పించే క్షుద్ర శత్రువులను ప్రవేశింపనీయక అణచి వేసింది. పాదుక ఎక్కడైనా తన వృత్తిని ఆచరించక విడువలేదు కదా!

తత్త్వబోధకులు స్వపక్ష, పరపక్ష వైషమ్య రహితంగా, తాముగెలిచి కీర్తిని పొందాలనే వ్యసనంలేశమైనా లేకుండా, దోష నిరసన మనే వృత్తిని అనుష్ఠించక మానరు. విశేషవాక్యం చేత సామాన్య వాక్యాన్ని (పూర్వార్థాన్ని) సమర్థించే అర్థాంతర న్యాసాలంకారం. వసంతతిలకావృత్తం.

*823.* బ్రహ్మాస్త్రతా మధిజగామ తృణం ప్రయుక్తం
పుణ్యం శరవ్య మభవత్పయసాం నిధిర్వా!
పృథ్వీంశశాస పరిముక్త పదం పదత్రం
కిం వా నకింభవతి కేళి విధౌ విభూనామ్ ॥ 3

**అర్థం:-** ప్రయుక్తం = ప్రయోగింపబడిన, తృణం = గడ్డిపరక; బ్రహ్మాస్త్రతాం = బ్రహ్మాస్త్ర ధర్మాన్ని; అధిజగామ, పొందెను; పుణ్యం = సుకృతం; పయసాం, నిధిః, వా = సముద్రమైనా; శరవ్యం = బాణానికి ఎరగా; అభవత్ = ఆయెను. పరిముక్త పదం = వదలబడిన పాదంగల; పదత్రం = పాదుక; పృథ్వీం = భూమిని; శశాస = పాలించెను.; విభూనాం = ప్రభువుల యొక్క; కేళివిధౌ = వినోదకార్యమందు; కిం, వా = ఏదైనా; కిం, న, భవతి = ఏదికాదు?

**తా॥** శ్రీరాముడు ప్రయోగించిన దర్భపరక బ్రహ్మాస్త్రమయింది. ఆయన బాణానికి పరశురాముని పుణ్యమూ, పయోనిధి కూడా గురి అయింది. ఆయన పాదాలను వదలిన పాదుక రాజ్యమేలింది. సామర్థ్యం కలవారి లీలా కృత్యమందు ఏ వస్తువైనా ఏమి చేయదు?

వ్యాఖ్య :- ప్రభుసంబంధం కల వస్తువు, ఇష్టకార్యాలను నిర్వహించే వర్ణన

1) పాదాలను రక్షించే పాదుక పాదాలనుంచి విడివడినా మహారాజ్ఞియై పృథివిని పాలించింది. పాదుక కోసల రాజ్యమేలింది. "భూఃపాదౌయస్య" - భగవత్పాదరూపమే భూమికదా! కాబట్టి ప్రభు సంబంధంకల పాదుక పృథివిని శాసించడం ఆశ్చర్యం కాదు.

2) "వాయసే కృతవాన్ క్రూరాం మతిం మతిమతాం వరః!
సదర్భం సంస్తరాత్ గృహ్య బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్" ॥ (రా.సుం.38స.30 శ్లో.)

పచ్చినేరం చేసిన కాకిని శ్రీరాముడు చూచాడు. తన దర్భాసనం నుంచి ఒక దర్భ కర్రను తీసి, బ్రహ్మాస్త్రాన్ని దానిపై ఆరోపించి కాకిమీదికి విసిరాడు. ఆ ఎండు గడ్డిపోచ కాకిని తరిమి తరిమి, తుదకు కాకి వచ్చి శ్రీరాముని కాళ్ళమీద పడినా విడువక, దాని కుడి కన్నును పొడిచింది. దృష్టిలోనే దోషముంది. దానినే శిక్షించింది. ఒక వస్తువు వేరొక వస్తువై పని దీరుస్తుంది కదా!

3) "రామోదాశరథిః శ్రీమాం శ్చిక్షేపశరముత్తమమ్ !
సహతాన్ దృశ్య రామేణ స్వాన్‌లోకాన్ తపసార్జితాన్ !
జామదగ్న్యో జగామాశు మహేంద్రం పర్వతోత్తమమ్" (రా.బా.76 స.22)

విశ్వకర్మ రెండు ధనుస్సులను నిర్మించాడు. ఒక ధనుస్సును శివుడు గ్రహించి దేవరాతునికి ఇచ్చాడు. మరొక ధనుస్సును విష్ణుమూర్తి తీసుకొని, రుచీకమునికి ఇచ్చాడు. పౌత్రుడైనందువల్ల వారసత్వంగా ఆ విల్లు పరశురాముని హస్తగత మయింది.

శివధనుర్భంజనంతో సీతారాముల పాణిగ్రహణమయింది. సపరివారంగా అయోధ్యకు పోతున్న వారి దారిలో పరశురాముడు ఎదురై "ఇదిగో! విష్ణుధనువు నెక్కు పెట్టి బాణం సంధించగలిగితే నీతో ద్వంద్వయుద్ధం చేస్తా" నన్నాడు.

కల్యాణరాముడు పరశురాముడిచ్చిన విష్ణుధనుస్సు పైన బాణాన్ని సంధించి విడిచాడు. పూజనీయుడైన విశ్వామిత్రునికి మేనల్లుని కొడుకని శ్రీరామబాణం పరశురాముణ్ని తాకలేదు. భార్గవరాముడు తపస్సు చేసి పరలోకాలను సంపాదించిన పుణ్యాన్ని మాత్రం రామబాణం కొట్టివేసింది. పరశురాముడు మహేంద్రగిరికి పోయాడు. శ్రీరాముడావింటిని వరుణునికి ఇచ్చాడు.

1. పాదుక ఏలిక అయింది. 2. గరుక అస్త్రమయింది. 3. పుణ్యం బాణానికి బలి అయింది. 4. జలం స్థలంగా మారింది. ఏదికాదు?

4) "ఉత్తరేణావకాశో ఽస్తి కశ్చిత్ పుణ్యతమో మమ।
ద్రుమకుల్య ఇతిఖ్యాతో లోకేఖ్యాతో యథాభవాన్॥
ఉగ్రదర్శన కర్మాణో బహవస్త త్రదస్యవః ।
\- - - - - - - - - - - - - - - - - -
తైస్తు సంస్పర్శనం పాపై ర్న సహే పాపకర్మభిః ।
అమోఘః క్రియతాంరామ! తత్రతేషు శరోత్తమః॥ (రా.యు.22.స.31-33)

శ్రీరాముడు తనకు 'మరణమో, సముద్ర తరణమో! గతి' అని దర్భలు పరచుకొని సముద్రునికి నమస్కరించి మూడు రాత్రులు ప్రాయోపవేశం చేశాడు. ఫలితం శూన్యం. ఓర్పు గుణహీనుల దగ్గర పనికి రాదుకదా!

ఆగ్రహో దగ్రుడైన శ్రీరాముడు ఆశీవిషోపమమైన బాణాన్ని సంధించాడు. వెంటనే సముద్రుడు ప్రత్యక్షమై చేతులు జోడించాడు. కరుణాపయోనిధి దాశరథి 'అమోఘమైన బాణాన్ని దేనిమీద ప్రయోగించమంటా'వని అడిగాడు.

'రామా! ఇక్కడికి ఉత్తరాన 'ద్రుమకుల్య' అనే నా పుణ్యస్థలముంది. అక్కడ దస్యులనేకులుచేరి ఘోరకృత్యాలు చేస్తున్నారు. వారిమీద నీబాణం ప్రయోగించు'మని ప్రార్థించాడు సముద్రుడు.

ఆ పుణ్యస్థలాన రామబాణం చొచ్చుకొనిపోయి నందువల్ల పాతాళ జలం ఉబికి 'ప్రప' ఏర్పడింది. వాడి బాణపు వేడికిదస్యులు నశించారు. నీరు శుష్కించింది. ఆ ప్రాంతమంతా మరుకాంతారం (ఎడారి) అయింది.

ఈ విశేష నీతిని 'శక్తిమంతుల సంబంధం చేత వస్తువులకు కూడా అశక్యకార్య నిర్వహణశక్తి ఉంటుంది' అనే సామాన్య వాక్యం సమర్థించే అర్థాంతరన్యాసాలంకారం. వసంతతిలకావృత్తం.

*824. అన్యేషు సత్స్వపి నరేంద్ర సుతేషు దైవాత్*
*భ్రష్టః పదా దధికరోతి పదం పదార్హః ।*
*ప్రాయోనిదర్శయతి తత్ప్రథమోరఘూణాం*
*తత్పాదయోః ప్రతినిధీ మణి పాదుకే వా॥* 4

అర్థం:- దైవాత్ = అదృష్టం వల్ల; పదాత్ = స్థానం నుంచి / పాదం నుంచి; భ్రష్టః = విడిపోయిన; పద+అర్హః = స్థానానికి / పాదానికి యోగ్యతగల వ్యక్తి; అన్యేషు = వేరే; నరేంద్ర సుతేషు = రాజకుమారులు; సత్సు, అపి = ఉన్నప్పటికీ; పదం = స్థానాన్ని / రాజ్యపదవిని; అధికరోతి = పొందును / అధిష్ఠించును. తత్ = ఆ విషయాన్ని; రఘూణాం = రఘువంశపురాజులలో; ప్రథమః = శ్రేష్ఠుడైన శ్రీరాముడు; నిదర్శయతి = ఎత్తి చూపును; ప్రాయః = తరచుగా; తత్ + పాదయోః = ఆ శ్రీరాముని పాదాలకు; ప్రతినిధీ = ప్రతినిధులైన - సమానంగా ఉన్న; మణిపాదుకే, వా = మణిపాదుకలుగానీ; (నిదర్శయతః = ఎత్తి చూపుతాయి.)

తా॥ పదార్హుడైన వ్యక్తి దైవవశంవల్ల పదభ్రష్టుడై, రాజకుమారులెందరున్నా, తానే మళ్ళీ పదాధిష్ఠితుడవుతాడు. ఈ నీతికి రఘుకుల శ్రేష్ఠుడైన రాముడు గానీ, రామపాదాలకు ప్రతినిధులైన పాదుకలుగానీ నిదర్శనం.

వ్యాఖ్య :- రాముడూ, రామపాదుకలూ ఒకే నీతికి నిదర్శనం.

కైకేయీ వరం కారణంగా రాముడు రాజ్యభ్రష్టుడయ్యాడు. ఆయనకు అనుజులు ముగ్గురున్నా, వనవాసానంతరం మళ్ళీతానే రాజ్య పదవిని అధిష్ఠించాడు. రఘువంశంలో అగ్రజునికే రాజ్యపాలనాధికారం పరం పరగా సంక్రమిస్తున్న ఆచారం. కాబట్టి భరతాదులకు లేని పదార్హత శ్రీరామునికే ఉండింది.

పదార్హతకల పాదుక రాముని పాదాలనుంచి భ్రష్టయైనా, కోసల రాజ్య పదవిని అధిష్ఠించింది. భరతాదులకు పదార్హత లేనందువల్ల, రాముని పదాలకు ప్రాతినిధ్యం వహించిన పాదుకకు రాచరికపు గద్దెనెక్కే అదృష్టం ఉండింది.

పూర్వార్థంలో చెప్పిన నీతి వాక్యానికి తార్కాణంగా శ్రీరాముడూ, ఆయన పాదుకలూ ఎత్తిచూపబడినందు వల్ల నిదర్శనాలంకారం. వసంత తిలకావృత్తం.

*825. చరణమనఘవృత్తేః కస్య చిత్ప్రాప్య నిత్యం*
*సకల భువన గుప్త్యై సత్పథే వర్తతే యః ।*
*నరపతి బహుమానం పాదుకే వాధి గచ్ఛన్*
*న భవతి సమయేషు ప్రేక్షితజ్ఞై రుపాస్యః ॥* 5

**అర్థం:-** యః = ఎవడు; అనఘవృత్తేః = శుభచరితుడైన; కస్య చిత్ = ఒకని యొక్క, చరణం = పాదాన్ని; నిత్యం = ఎల్లప్పుడు; ప్రాప్య = పొంది; సకల భువన గుప్త్యై = అఖిలజగద్రక్షణకోసం; సత్పథే = మంచిదారిలో; వర్తతే = ఉండునో; సః = వాడు; పాదుకా, ఇవ = పాదుకవలె; నరపతి బహుమానం = రాజునకు తగిన పూజను/రాజుచేత చేయబడు బహుమానమును; అధిగచ్ఛన్ = పొందుతు; సమయేషు = కార్యసమయాల్లో/ ఆచార విషయాల్లో; ప్రేక్షితజ్ఞైః = చూడబడిన వెంటనే కర్తవ్యాన్ని తెలుసుకొనే వారిచేత/బుద్ధిమంతులైన శిష్యులచేత; ఉపాస్యః = ఉపాసింపదగినవాడు; భవతి = అవుతాడు.

**తా॥** పుణ్యవర్తనుడైన ఒక మహాపురుషుని పాదాలను ఆశ్రయించి ఎల్లప్పుడు సర్వలోక రక్షణార్థం సన్మార్గంలో నడచేవాడు, పాదుకవలె రాజార్హ పూజను పొందుతూ ఆయా సమయాల్లో ఇంగితజ్ఞులచేత సేవింపబడుతాడు.

వ్యాఖ్య :- సత్పథాచారుడు పాదుక వలె సేవింపబడే వర్ణన

మనోజ్ఞమైన ప్రవర్తన గల మహాపురుషుని పాదాలను ఆశ్రయించి లోకరక్షణకోసం సన్మార్గగామియైన వ్యక్తి రాజసన్మానమూ పొందుతాడు. ప్రజల చేతనూ సేవింపబడుతాడు. ఈ నీతికి పాదుకయే ఉపమానం.

శ్రీరాముడు నిర్దుష్టమైన ధర్మాన్ని ఆచరించిన మనోజ్ఞమూర్తి. పాదుక రాముని పాదాలను నిత్యమాశ్రయించింది. వనవాసానికి వెళ్ళినప్పుడు కంటక ముఖ భంగం చేసింది. లోక రక్షణకోసం సత్పథాచారిణియై శ్రీరామునిచే సమ్మానింపబడింది. వసిష్ఠాది మహర్షులూ, భరతాది పరమ భక్తులూ ప్రేక్షితజ్ఞులు, ప్రమాణ మూలమైన సత్పథాచారులు. వారి కోరిక ప్రకారం శ్రీరాముడు పాదుకను రాజపూజితగా చేశాడు. సింహాసన మధిష్ఠించి లోక త్రాణ పరాయణయైన పాదుకను కోసలదేశస్థులు శ్రద్ధాసక్తులతో ఉపాసించారు.

"ఇంగిత జ్ఞాస్తుకోసలాః". కోసలదేశ వాసులు చూపులతోనే మనోభావమెరిగి, కర్తవ్యోన్ముఖులయ్యే వారని ప్రసిద్ధి.

అలాగే, రాజుకు పరిచర్య చేసే సదాచారపరుడు పుత్రస్థానాన్ని పొంది భృత్యులచేత సేవింపబడుతాడు.

సదాచార్యుల నాశ్రయించి సర్వదా లోకానుగ్రహార్థం ధర్మ మార్గావలంబియైన శిష్యుడూ, ఆచార విషయంలో తానే ఆదర్శభూతుడై శిష్యప్రశిష్యులచేత సమ్మానితుడవుతాడు.

శ్లేషతోకూడిన ఉపమాలంకారం. మాలినీ వృత్తం.

*826. రామేరాజ్యం పితురభిమతం సమ్మతంచ ప్రజానాం*
*మాతావవ్రే తదిహ భరతే సత్యవాదీదదౌచ !*
*చింతాతీతః సమజని తదా పాదుకాగ్ర్యాభిషేకో*
*దుర్విజ్ఞాన స్వహృదయ మహోదైవ మత్రప్రమాణమ్॥ 6*

**అర్థం:-** రామే = రాముని విషయమై; రాజ్యం = రాజ్యం; పితుః = తండ్రియైన దశరథునికి; అభిమతం = ఇష్టం. ప్రజానాం, చ = ప్రజలకు కూడ; సమ్మతం = ఇష్టమే. మాతా = తల్లి కైకేయి; తత్ = ఆ రాజ్యాన్ని;

భరతే = భరతుని విషయమై; వవ్రే = వరించెను. ఇహ = ఈ విషయంలో; సత్యవాదీ = సత్యసంధుడైన దశరథుడు; దదౌ, చ = ఇచ్చినాడు కూడ. తదా = అప్పుడు; చింతా+అతీతః = ఊహించరాని; పాదుకా + అగ్ర్య + అభిషేకః = ఉత్తమమైన పాదుకా పట్టాభిషేకం; సమజని = జరిగింది. అత్ర = ఇక్కడ - లోకంలో; దుర్విజ్ఞాన స్వహృదయం = తెలుసుకోజాలని నిజాభిప్రాయంగల; దైవం = దైవమే; ప్రమాణం = హేతువు. అహో = ఆశ్చర్యం.

తా॥ దశరథమహారాజూ, ప్రజలూ రామునికి, కైకేయి మాత్రం భరతునికి రాజ్యాన్ని కోరగా, ఎవరికీ తెలియశక్యం కాని పద్ధతిలో పాదుకా పట్టాభిషేకం జరిగింది. లోకం విధిని తెలుసుకోజాలదు. దైవసంకల్పమే నెరవేరుతుంది. ఇదే ఆశ్చర్యం.

వ్యాఖ్య :- పాదుకాభిషేకం దైవ నిర్ణయమే

మనం ఒకటితలిస్తే దైవ మొకటి తలవడం లోకంలో కనబడుతుంది. "అన్యోహ్యన్యచ్చింతయతి స్వచ్ఛందం విదధామ్యహమ్" అన్నట్లు దైవ సంకల్పమే ప్రబల హేతువు.

జ్యేష్ఠ పుత్రుడైన రామునికి రాజ్య మర్పించాలని దశరథునికోరిక. రాముడే రాజుకావాలన్న కోరిక ప్రజలకూ ఉండింది. కాని కైకేయి తన పుత్రుడే రాజ్యమేలాలి, అని కోరితే దశరథుడు, ఒకప్పుడాడిన మాట తప్పకుండా, భరతుని పట్టాభిషేకానికి అంగీకరించాడు. అటు రామునికీ కాక, ఇటు భరతునికీకాక, అతర్కితంగా పాదుకకు పట్టాభిషేకం సంభవించింది. ఇది దైవ బలమే కదా!

అగ్ర్యాభిషేకః :- తల్లి భరతునికి పట్టాభిషేకాన్ని కోరినా, దాన్ని శాస్త్రం గానీ, వంశాచారంగానీ అనుమతించనందు వల్ల, అది సర్వశ్లాఘ్యం కాదు. రామాభిషేకం, పౌరులు కోరినా, మహారాజుకు అసత్యత్వాన్ని ఆపాదించే అవకాశం కలది. కాబట్టి ఇదీ శ్లాఘ్యం కాదు. పాదుకాభిషేకం మాత్రం ఆయాదోషాలను పరిహరించి, ఫలాధిక్యాన్ని ప్రసాదించేది కాబట్టి 'శ్రేష్ఠ' మయింది. రామునిది యౌవరాజ్యం. కానీ, పాదుక పొందింది సామ్రాజ్యమే.

వాస్తవంగా విధి బలీయం కదా! 'చింతాతీతమైనది దైవ' మని అసంభావ్యత్వాన్ని వర్ణించడం వల్ల అసంభవాలంకారం. మందాక్రాంత.

*827. నాతిక్రామే చ్చరణ వహనాత్ పాదుకా పాదపీఠం*
*యద్వాఽఽసన్నం పరమిహ సదాభాతి రాజాసనస్య!*
*పూర్వత్రైవ ప్రణిహిత మభూ ద్ధంత! రామేణ రాజ్యం*
*శంకే భర్తు ర్బహుమతిపదం విక్రమే సాహ చర్యమ్ ॥* 7

అర్థం:- పాదుకా = భగవత్పాదుక; చరణవహనాత్ = పాదాలనుమోయడం వల్ల; పాదపీఠం = పాదపీఠాన్ని; న+అతిక్రామేత్ = మించదు.; యత్, వా = ఎందుకంటే; ఇహ = ఈ రెండింటిలో; పరం = రెండవ దైన పాదపీఠం; సదా = ఎల్లప్పుడు; రాజ + ఆసనస్య = రాజుకూర్చుండే సింహ పీఠానికి; ఆసన్నం = సమీపమందున్నదై; భాతి = ప్రకాశిస్తుంది. రామేణ = రామునిచేత; రాజ్యం = రాజ్యం; పూర్వత్ర, ఏవ = మొదట చెప్పబడిన

పాదుకయందే; ప్రణిహితం = ఉంచబడినదై; అభూత్ = ఆయెను. హంత = ఆహా! భర్తుః = ప్రభువుకు; విక్రమే = పరాక్రమమందు/పాద విక్షేప-సంచార-మందు; సాహచర్యం = తోడ్పాటు; బహుమతి పదం = సమ్మానింపబడడానికి ఆస్పదం, అని; శంకే = ఊహిస్తున్నాను.

**తా॥** పాదుక, పాదపీఠం భగవత్పాదాలను వహిస్తాయి. పాదుక కన్న రాజసింహాసనానికి దగ్గరగా ఉండే పాదపీఠానికి ఉత్కర్షమిన్న. అయినా, శ్రీ రాముడు పాదుకకేరాజ్యమర్పించాడు. ఆశ్చర్యమే.

ప్రభువుకు విక్రమ విషయంలో తోడ్పడం రాజగౌరవం పొందడానికి ఆస్కారం, అనుకొంటాను.

వ్యాఖ్య :- విక్రమ సాహచర్య గుణమే ప్రాతినిధ్యమేర్పడడానికి కారణమని సుభాషితం.

ప్రభువు చరణాలను వహించడం పాదుకకూ, పాదపీఠానికీ సమానమే. కాబట్టి పాద పీఠంకంటె పాదుకకున్న గొప్పతనమేమి? రాముడు రాజుకాకముందే రాముని పాద పీఠం రాజాసనానికి దగ్గర ఉండడమెలా సమర్థనీయం? అంటే, దశరథుడు కాబోయే రాజు రాముడే అని సభలో సింహాసనం మీద తన దగ్గర కూర్చుండ బెట్టుకొనే వాడు. అప్పుడు సింహాసనానికి దగ్గరగా ఉన్న పాదపీఠం మీద రాముడు పాదాలను మోపడం వల్ల రామపాద పీఠమనే గ్రహించాలి. సర్వదాపాద పీఠం రాజాసనానికి దగ్గరనే ఉంటుంది. పాదుక మాత్రం రామునిసంచారవేళల్లో రాజాసనానికి దూరంగా ఉంటుంది. కాబట్టి చరణవహనం రెండింటికి సమానమే అయినా, రాజాసనానికి సమీపంలో ఉండడం వల్ల పాదుకకంటె పాదపీఠానికే అధికోత్కర్షకదా!

రామునితో అరణ్యంలో సంచరించే పాదుకలను తెచ్చే శ్రమను వహించడం కంటే, రాజాసనానికి సర్వకాలాల్లో దగ్గర ఉండే పాదపీఠాన్నే సింహాసన మెక్కించి అభిషేకించడమే సముచితం. శ్రీరాముడు పాదపీఠాన్ని ఆదరించక పాదుకనే తనకు ప్రతినిధిగా ఎంచి 'సింహాసనాన్ని అధిరోహించచే యోగ్యత పాదుకకే ఉంది,' అని గౌరవించడం ఆశ్చర్యమే. అన్యాయమే.

రాజులు శూరులనే బహుమానిస్తారు. పాదుక(ల)కు విక్రమ సాహచర్యం ఆజానజం. చమత్కారం 'విక్రమ' శబ్దంలో ఉంది. శ్లిష్టమిది. 'విక్రమం' అంటే, పగతురతోపోరాడే శౌర్యం; మరొక అర్థం 'అడుగులు వేయడం'.

రాముని వెంట ఉన్న లక్ష్మణుడు (ఆదిశేషుడు - పాదుకామూర్త్యంతరం) ఇంద్రజిత్తుతో యుద్ధం చేసి రామునిచే బహుమానితుడవడం గమనీయం.

రాముడెక్కడ సంచరించినా, అతని అడుగులకు తోడుగులై ప్రభుపాద సంరక్షణచేసే చొరవ పాదుక(ల)కే ఉంట. పాదపీఠానికి లేదు. కాబట్టి ప్రత్యర్థులతో పోరాడుతూ, ప్రభువుతో సహచరిస్తే గద్దెనెక్కి ప్రజారంజకంగా పాలించే గౌరవం లభిస్తుంది.

పాదపీఠం కన్న తక్కువ స్థాయి కలిగిన పాదుక సింహాసన మధిరోహించడం అన్యాయమని మొదట చెప్పి, తర్వాత దాన్ని ప్రతిషేధించడం వల్ల ఆక్షేపాలంకారం. మందాక్రాంతా వృత్తం.

828. ప్రతిపద చపలాऽపి పాదుకా
రఘుపతినా స్వపదే నివేశితా ।
సమజని నిభృత స్థితి స్తదా
భవతి గుణః శ్రియ మభ్యుపేయుషామ్ ॥ 8

అర్థం:- ప్రతిపదచపలా, అపి = అడుగడుగున చలించేదయినా; రఘుపతినా = శ్రీరామునిచేత; స్వపదే = తన స్థానమందు; నివేశితా = ఉంచబడిన; పాదుకా = పాదుకాదేవి; తదా = అధికారవేళలో; నిభృతస్థితిః = స్థిరమైన ఉనికి కలది; సమజని = అయింది. శ్రియం = ఐశ్వరాన్ని; అభి+ఉపేయుషాం = పొందిన వారికి; గుణః = మంచి ధర్మం; భవతి = ఉండును.

తా॥ పదే పదే చంచల స్వభావం కలదయినా, శ్రీరాముని సింహాసనమందు ఉంచగానే పాదుకాదేవికి నిశ్చలస్థితి కలిగింది. లోకంలో ఐశ్వర్యం కలిగిన వారికి మంచి గుణమేర్పడుతుంది.

వ్యాఖ్య :- చపలబుద్ధులకు సంపదకలిగినప్పుడు స్థిరబుద్ధి ఏర్పడుతుందని సుభాషితం.

పాదుక, సంచరించే స్వభావాన్ని పదేపదే చపల స్వభావం కలదిగా వర్ణించే శ్లోకం.

అడుగులు వేయడం, నడక ఒక చాంచల్యమే. చంచల స్వభావమున్న పాదుకాదేవికి రాజాసన మధిష్ఠించగనే స్థైర్యమేర్పడింది. ఇది ఉదాహరణం.

"చపలః పారదే కీ.శే. పుమాన్ త్రిషుతు చంచలే । దుర్వినీతేచ నీచే" (నానార్థరత్న మాల)

పద్నాల్గు సంవత్సరాలు పాదుకాదేవి సంచరించకుండా, సింహాసనాసీనయైనది. అధికారమూ, ఐశ్వర్యమూకలిగేసరికి ఇది వరకున్న చపలబుద్ధిపోయి స్థిరబుద్ధి ఏర్పడుతుంది. సామాన్య వాక్యం చేత విశేష వాక్యాన్ని సమర్థించడం వల్ల, అర్థాంతరన్యాసాలంకారం. (భద్రికా, మాలతీ వృత్తాల మిశ్రమం) ఉపజాతి వృత్తం.

829. గతిహేతు రభూత్ క్వచిత్పదే
స్థితిహేతుర్మణి పాదుకా క్వచిత్ ।
నహివస్తుషు శక్తినిశ్చయో
నియతిః కేవల మీశ్వరేచ్ఛయా ॥ 9

అర్థం:- మణిపాదుకా = రత్నపాదుక; క్వచిత్ = ఒకానొక; పదే = స్థానమందు; (ఒకప్పుడు భగవత్పాదమందు) గతిహేతుః = నడకకు కారణం; అభూత్ = ఆయెను. క్వచిత్ = ఒకానొకచోట (సింహాసనమందు) స్థితిహేతుః = ఉనికికి / రాజ్య రక్షణకు కారణం; (అభూత్ = ఆయెను) వస్తుషు = వస్తువులయందు; శక్తినిశ్చయః = సామర్థ్య నిర్ణయం; న = లేదు. హి = ఎందుకంటే; నియతిః = నియమం (వ్యవస్థ). కేవలం; ఈశ్వర+ఇచ్ఛయా = భగవంతుని సంకల్పంచేత మాత్రమే ఉండును.

తా॥ మణిపాదుక భగవత్పాదమందు నడకకుకారణమయింది. రాజ్య రక్షణార్థం రాజాసనమందు చలించక, స్థిరంగా ఉండగలిగింది.

ఒకే పాదుక, రెండుచోట్ల వేర్వేరు పనులను చేయగలిగింది. కాబట్టి, వస్తువులయందు శక్తి నిర్ణయం లేదు. ఈ వ్యవస్థ సర్వేశ్వరుని సంకల్పంతో మాత్రమే జరుగుతుంటుంది.

వ్యాఖ్య :- పాదుక స్థితిగతులకు హేతువని వర్ణితం

వస్తువులకు భిన్న భిన్న స్థలాలలో వేర్వేరు పనులకుపయోగపడే సామర్థ్యం ఉంది. గతి, స్థితి ఈ రెండు పరస్పర విరుద్ధ కార్యాలు. పాదుక ఈ రెండింటిని సాధించింది. భగవంతునికి పాదరక్షగా ఉండి, విహారానికి ఉపయోగపడింది. సింహాసనం మీద స్థిరంగా ఉండి రాజ్యపాలనకు ఉపయోగపడింది. పాదుక ఇది చేస్తుంది. అది చేయజాలదు అని ఇదమిత్థంగా చెప్పజాలం.

గతికీ, స్థితికీ హేతువయింది పాదుక. ఇది విశేష వాక్యం.

వస్తు సామర్థ్యాన్ని నిశ్చయించలేం కదా! ఇది సామాన్య వాక్యం. పాదుకా విషయాన్ని బట్టి సామాన్య వాక్యం సమర్థింపబడింది. కాని, కవికేసరికి ఈ సమర్థనం తృప్తిని కలిగించలేదు. కాబట్టి, నిమ్నోన్నతాలూ, ఎచ్చు తగ్గులూ లేకుండా, పదార్థాలు అనేక ప్రయోజనాలను సాధించే 'నియతి' కేవలం ఈశ్వరేచ్ఛ వల్ల ఏర్పడుతుంది అని మళ్ళీ ఒక విశేషవాక్యం - అర్థాంతరన్యాసం చేత సామాన్యమైన మాటను సమర్థించడం వల్ల, ఇది వికస్వరాలంకారం. అర్ధసమ వృత్తం.

*830.* *అధరీకృతోఽపిమహతా*
*తమేవ సేవేత సాదరం భూష్ణుః ।*
*అలభత సమయే రామాత్*
*పాదాక్రాంతాఽపి పాదుకారాజ్యమ్ ॥* *10*

**అర్థం:-** భూష్ణుః = వృద్ధినిగోరే వ్యక్తి; మహతా = మహాపురుషునిచేత; అధరీకృతః, అపి = క్రిందికీడ్వబడినను; తం, ఏవ = ఆ మహాపురుషుణ్నే; సాదరం = ప్రేమ పూర్వకంగా; సేవేత = సేవించవలెను. పాదుకా = పాదుక; పాద + ఆక్రాంతా, అపి = కాళ్ళచేత్రొక్కబడినను; సమయే = దండకారణ్యంలో ప్రవేశించే సమయాన; రామాత్ = సీతాపతినుంచి; రాజ్యం = రాజ్యాన్ని; అలభత = పొందెను.

తా॥ వృద్ధిని పొందగోరే వ్యక్తి మహాపురుషునిచేత న్యక్కారం పొందినా, ఆ మహాపురుషుణ్నే ఆదరంతో సేవించాలి. పాదుకాదేవి, రామచంద్రస్వామి అడుగులచేత అణచివేయబడినా, దండకాటవిలోకి చేరే వేళలో ఆయన నుంచి కోసలదేశరాజ్యాన్ని పొందింది.

వ్యాఖ్య :- మహాపురుషులు తిరస్కరించినా వారినే భక్తితో సేవించడం శ్రేయస్కరం

మానవుడు మహానుభావులైన పెద్దలను నమ్రతతో సేవిస్తుంటే వృద్ధిని పొందుతాడు. వర్ధిష్ణువు మహాపురుషునిచే ధిక్కరింపబడినా, ఆయన పాదాల దగ్గర పడియుండి, భక్తిశ్రద్ధలతో ఆయనకే సకల విధకైంకర్యం - సేవ చేయాలి. దీనికి పాదుకాదేవియే ఉదాహరణం.

పాదుక శ్రీరామ చంద్రస్వామిని ఆశ్రయించింది. ఆ ప్రభువు తన పాదాలతో పాదుక(ల)ను త్రొక్కినాడు. అయినా అణగియుండి పాదుక, ప్రభువు అడుగులకు మడుగు లొత్తింది. ఓర్పూ, నేర్పూ కలిగి ప్రభుపాద సేవయే పరమార్థంగా భావించింది. ఆదరాభిమానాలతో అనవరతం పాదసేవ చేయడం వల్ల, ఆ ప్రభువు దండకారణ్యంలో ప్రవేశించే ముందు పాదుక(ల) మీద ఎక్కి తొక్కినా, వెంటనే విడిచాడు. కోసల దేశవాసుల యోగక్షేమాలను చూడుమని పాదుక(ల)కు రాముడు అనుమతి ఇచ్చాడు. తత్ఫలితంగా, పద్నాలుగేండ్లు సింహాసన మధిష్ఠించి, పాదుక రామరాజ్యాన్ని శుభోదర్కంగా పాలించిన సౌభాగ్యవతి కదా!

విశేష వాక్యం సామాన్య వాక్యాన్ని సమర్థించినందువల్ల ఇది అర్థాంతరన్యాసాలంకారం. ఆర్యావృత్తం.

సుభాషిత పద్ధతి సమాప్తం

# 29. ప్రకీర్ణ పద్ధతి

*831.* *విధౌ ప్రవృత్తే యద్ద్రవ్యం గుణ సంస్కారనామభిః!*
*శ్రేయః సాధన మామ్నాతం తత్పదత్రంతథా౽స్తుమే!!*

1. **అర్థం:-** గుణ సంస్కార నామభిః=గుణాలతోనూ, సంస్కారాతోనూ, పేర్లతోనూ; యత్ = ఏ; ద్రవ్యం = భవ్యమైన వస్తువు; విధౌ = భగవంతుడు; ప్రవృత్తే = సంచరిస్తున్నప్పుడు; శ్రేయః = శ్రేయస్సుగానూ; సాధనం = గతిహేతువుగానూ; ఆమ్నాతం = వేదప్రోక్తమో; తత్ = అశ్రేష్ఠమైన; పదత్రం = పాదుక; మే = నాకు; తథా = ఉత్తమ పురుషార్థమిచ్చేదిగా; అస్తు = ఉండుగాక!

**తా॥** గుణ సంస్కార నామాలతోకూడి ఏశ్రేష్ఠ వస్తువును భగవానుడు పాదాలకు ధరించి సంచరిస్తుంటే ఉపేయంగానూ, ఉపాయంగానూ, వేదం ప్రతిపాదించిందో ఆ భవ్యపాదుక నాకు ఉత్తమ పురుషార్థమొసగుగాక.

2. **అర్థం:-** విధౌ = వేద విహితమైన క్రియ; ప్రవృత్తే = అనుష్ఠింప బడినప్పుడు; గుణ సంస్కారనామభిః = అరుణ్యశ్వేతి మాది గుణాలతో; ప్రోక్షణాది సంస్కారాలతో; ఉద్భిచ్ఛిత్రాదర్శాగ్ని హోత్రాది నామాలతో; యత్ = ఏ, ద్రవ్యం = యాగాది కర్మల యందు త్యాగం చేయబడే పదార్థం; శ్రేయస్సాధనం = సత్ఫలాన్ని పొందేకర్మగా; ఆమ్నాతం = వేదం చేత విధింపబడిందో; తత్ = అప్రసిద్ధమైన; పదత్రం = పాదుక; మే = నాకు; తథా = మోక్షసాధనంగా; అస్తు = ఉండుగాక.

**తా॥** శ్రుతిచే బోధింపబడిన కర్మను అనుష్ఠిస్తుంటే గుణ సంస్కార నామాలతో కూడిన యాగాది కర్మలయందు చేయబడే త్యాగ ద్రవ్యం శ్రేయస్సాధనంగా వేదోక్తమైనదో, అప్రసిద్ధపాదుక నాకు మోక్షసాధనమగు గాక.

వ్యాఖ్య :- పాదుక అభ్యుదయ నిశ్శ్రేయ స్సాధన మనిస్తుతి

ప్రస్తావ పద్ధతి మొదలుకొని సుభాషిత పద్ధతి వరకు ఒక్కొక్క విషయాన్ని నియమ సహితంగా దేశికులు వర్ణించారు. ఆ విషయాలనన్నీ కలిపి, ఇంక పలురకాల విషయాలను కూడా - ఒక నియతార్థాన్ని అవలంబించక - వర్ణించడం వల్ల ఈ పద్ధతి 'ప్రకీర్ణ' మనబడింది. ప్రభావ పద్ధతిలో పాదుకా గుణాలు, అభిషేక పద్ధతి, రత్నసామాన్యాది పద్ధతుల్లో సంస్కార విషయాలు, సమాఖ్యా పద్ధతి, శేష పద్ధతుల్లో పాదుకానామాలు వర్ణింపడినాయి. ఈ పద్ధతిలో ఇవే కాక వేరే విషయాలు కూడా వర్ణింపబడి పాదుక గుణ సంస్కారనామ' విశిష్టమైన ద్రవ్యంగా స్తుతింపబడింది.

'విధు' శబ్దానికి భగవంతు'డని అర్థం. "విధుఃశ్రీవత్సలాంఛనః" (అమరం). వేదమందు × మీ మాంసాశాస్త్రమందు చెప్పబడిన కర్మకలాపానికి 'విధి' అనిపేరు. 'విధు' శబ్దానికీ 'విధి' శబ్దానికే సప్తమీ విభక్త్యే కవచన రూపం ఒకే రీతిగా 'విధౌ' ఉంటుంది. ఇక్కడ 'విధౌ' అనేది విభక్తి శ్లేష.

'శ్రేయః, సాధనం' - పాదుకా పరంగా వ్యస్తపదాలు 'శ్రేయస్సాధనం' - కర్మపరంగా ఇది సమస్త పదం. సభంగశ్లేష ఇది. 'ద్రవ్యం' అంటే అత్యుత్కృష్టమై, క్షేమావహమైన, నానాదివ్య మణులచే పాదుగబడిన బంగారు పాదుక. క్రతు, యాగాదుల్లోనూ దాన ధర్మాదుల విషయమై త్యాగం చేయబడే పశు, ఆజ్య, ధాన్యాది సకల పదార్థమని మరొక ంఅర్థం. "ద్రవ్యం భవ్యేగుణాశ్రయే" (అమరం)

పాదుక గుణ విశిష్టమైన ద్రవ్యం :- భగవచ్చరణ సంబంధం, దేవతల శిరస్సంబంధం, సేవించే దాసులకు పరిశుద్ధిని కలిగించడం, భగవత్పాదాలకు సుఖస్పర్శ, లాఘవం కలిగించడం మొదలైనవి పాదుకకు శారీర గుణాలు; దయాక్షాంత్యాది ఆత్మగుణాలు నిసర్గధర్మాలు.

పాదుక సంస్కార లక్షిత ద్రవ్యం:- తప్తజాంబూనద ప్రభాప్రభావితం, బహు విధరత్న ఖచితం; సరసీరుహధ్వజ, శంఖ, చక్రాదిరేఖాసంస్కార చిహ్నితం, అధివాసార్చన స్నాపనాది గుణాధాన విశేషితం.

పాదుక నామ విశేషిత ద్రవ్యం :- రాఘవ పాదుక, శఠకోప, శేష, అనంతాది నామ సంజ్ఞితం, ఇదంతావేద ప్రతిపాదితం. కాబట్టి, ఇహ పరసుఖ సాధనమైన పాదుక సర్వదా ఆరాధింపదగినది.

మరొక విషయమూ అనువర్తితం :-

వేదంలో - మీ మాంసా శాస్త్రంలో - విధింపబడిన, మానవులాచరింపదగిన క్రియాకలాపం యజ్ఞం. యాగాది కర్మలను అనుష్ఠిస్తున్నప్పుడు 'ద్రవ్య' మనబడే ఉపయోగ వస్తువులను కూడా వేదం తెల్పింది. కర్మకలాపం శ్రేయస్సాధనమైన ధర్మం. ఆయా ప్రక్రియలకు ఉపయోగపడే పదార్థాలు ఈ గుణం కలవై ఉండాలి. ఈ సంస్కారాన్ని పొందాలి. వీటికి పేరు ఇది, అని వేదభాగంలో బోధింపబడింది. ద్రవ్య సంస్కార ఫలసంబంధ విధిని కూడా మీమాంసాశాస్త్రం బోధిస్తుంది. కాబట్టి గుణ సంస్కార నామ విశిష్టమైన ద్రవ్యం సద్గతికి సాధనమని వర్ణితం.

"శ్వేతమాలభేత భూతికామః" - ఐశ్వర్యం కోరే వ్యక్తి యాగాదికమైన ద్రవ్యాన్ని ఉపయోగిస్తున్నప్పుడు, ఆ ద్రవ్యం ఆరుణ్యశ్వేతిమాది గుణాలతోనూ, ప్రోక్షణాది సంస్కారంతోనూ, జ్యోతిష్టోమోద్భిచ్చిత్రా క్షామత్యాది సంజ్ఞలతో కూడినదై, సాక్షాత్తుగా అముకఫలసాధనమని వైదిక విధిభాగమందు చెప్పబడింది.

ధర్మజిజ్ఞాసువులు కర్మానుష్ఠాన రూపంతో భగవతారాధన చేస్తారు. భగవంతుని సంచార క్రియయందు ఉపయోగపడే శ్రేష్ఠమైన ద్రవ్యం పాదుకయే కదా! ఆ భగవత్పాదుకనే ఆరాధించే ధర్మానుష్ఠాన పరులకు ఉత్తమ పురుషార్థం - మోక్షం - లభిస్తుందని కవి హృదయం.

శ్లేషానుప్రాణిత ప్రేయోఽలంకారం. అనుష్టుప్ ఛందం.

*832. మధుర స్మిత రమ్య మౌక్తికశ్రీ*
*ర్విశసి వ్యంజిత మంజుల ప్రణాదా!*

*సహరంగ నృపేణ వాసగేహం*

*తనుమధ్యామణిపాదుకే! త్వమేకా॥* **2**

**అర్థం:-** హేమణిపాదుకే = ఓ రత్నపాదుకా! మధురస్మిత రమ్య మౌక్తిక శ్రీ+ = ఇంపైన చిరునవ్వులాగా అందమైన ముత్యాలకాంతికలిగిన; వ్యంజిత మంజుల ప్రణాదా = ప్రకటింపబడిన మధుర స్వరము / అనురాగ వాక్కు కలిగిన: తనుమధ్యా = సన్నని నడుముకల / కృశించిన మధ్యభాగము కలిగిన; త్వం = నీవు; ఏకా = అద్వితీయవై; రంగనృపేణ, సహ = రంగరాజుతోకూడ: వాసగేహం = శయ్యాగృహంలోకి; విశసి = ప్రవేశిస్తావు.

**తా॥** ఓ మణిపాదుకా! మందహాసంవలె అందమైన ముత్యాలశోభ, నీ రత్నాల సవ్వడియే కాళ్ళ ఆభరణాలధ్వని కలిగి; అనురాగపు మాటగా ప్రకటితమైన నాదం కలిగిన, నడిమి భాగం సన్నగిల్లియున్న, సన్నని నడుమున్న నీవు ఒక్కతెవే శ్రీరంగనాయకునితో కూడి పడక గదిలోకి ప్రవేశిస్తావు.

**వ్యాఖ్య :- పాదుక శ్రీరంగరాజుతో రమించే నాయికగా వర్ణితం**

శ్రీరంగనాయకుడు లీలగా విహరించివచ్చి, తనతో వచ్చిన వారందరిని వీడు కొల్పి, అంతఃపురంలో ప్రవేశిస్తున్నప్పుడు పాదుక మాత్రం నాయకుని వెంట వెళ్ళే రిరంసు నాయికగా కీర్తింపబడుతున్నది.

పాదుకకు ఉన్న ముత్యాలకాంతియే ఆ నాయిక యొక్క చిరునవ్వు. నూపురధ్వని లాగా ఉన్న రత్నాల ప్రణాదమే అనురాగంతో కూడిన మృదుమధుర వచనం.

"ప్రణాదస్తు శబ్దస్స్యా దనురాగజః" (అమరం)

పాదుకా మధ్య భాగం సన్నగా ఉంటుంది కాబట్టి ఆమె నడుము సన్ననిది.

తను మధ్యయైన పాదుకానాయిక చిరునవ్వు లొలుకుతూ, చాటూక్తులతో శ్రీరంగరాజు వెంట ఒక్కతె అంతఃపురంలోకి ప్రవేశిస్తుంటుంది. సమాసోక్త్యలంకారం. ఔపచ్ఛందసికం.

*833. శుభ శబ్ద విశేష సంశ్రితాభిర్భవతీశౌరి పదావని! క్రియాభిః!*

*అనుతిష్ఠతి నూనమాశ్రితానామభిలోప ద్రవశాంతికం నవీనమ్ !!* **3**

**అర్థం:-** హేశౌరిపదావని = ఓ భగవత్పాదుకా! భవతీ = నీవు; శుభశబ్ద విశేష సంశ్రితాభిః = సొబగైన నాదాలనే వేదమంత్రాలను కలిగియున్న; క్రియాభిః = సంచారాలనే వేద విహితకర్మలచేత; నవీనం = క్రొత్తదైన; ఆశ్రితానాం = ఆశ్రితుల యొక్క; అఖిల + ఉపద్రవశాంతికం = సకల బాధలను పొగొట్టే శాంతికర్మను; నూనం = నిశ్చయంగా; అనుతిష్ఠతి = ఆచరిస్తున్నట్లున్నావు.

**తా॥** ఓ శౌరి పాదుకా! నీవు మంజు నాదాలనే మంత్రాలు కలిగియున్న సంచార క్రియలనే వేద విహిత కర్మలచేత విలక్షణమైన, ఆశ్రితుల సమస్త పాపాలను తొలగించే శాంతికర్మను అనుష్ఠిస్తున్నట్లున్నావు.

**వ్యాఖ్య :- పాదుకానాదమూ, గతులూ అరిష్ఠ నిరాసక కర్మగా ఉత్ప్రేక్షితం**

శ్రీరంగనాయకునితో లీలగా సంచరిస్తున్నప్పుడు, వివిధ గతులచే కలిగే పాదుకా మంజులనాదం ఆశ్రితజనులకు వినిపిస్తుంది. తత్ఫలితంగా, ఆశ్రితుల సకల బాధలు తొలగిపోయి వారు సుఖంగా జీవించే లాగా చేస్తుంది పాదుక. ఇది ఆశ్రితుల క్షేమం కోసం మంత్రాలను పఠిస్తూ చేయబడే వేదోక్త శాంతి కర్మను పాదుక ఆచరిస్తున్నదో అన్నట్లున్నది. ఔపచ్ఛందసికం.

*834. మణిభి ర్మధువైరి పాదరక్షే!*
*భవతీ విక్రమణే ప్రవర్ధమానా!*
*యుగపద్భవతాం యుగాంతకాలే*
*దివి లక్ష్మీం విదధే దివాకరాణామ్ !!* 4

**అర్థం:-** హే మధువైరి పాదరక్షే = ఓ మధ్వరిపాదుకా! విక్రమణే = (భగవంతుడు) లోకాలను అడుగులతో కొలచినప్పుడు; ప్రవర్ధమానా = బాగా పెరుగుతున్న; భవతీ = నీవు; యుగ+అంతకాలే = ప్రళయ కాలమందు; యుగపత్ = ఒకే సమయాన; భవతాం = ఉదయించే; దివాకరాణాం = సూర్యుల యొక్క; లక్ష్మీం = కాంతిని: మణిభిః = మణులచేత; దివి = ఆకాశాన; విదధే = చేసితివి.

**తా॥** ఓ మధువైరి పాదుకా! త్రివిక్రమావతారంలో బాగా పెరుగుతూనీవు, ప్రళయకాలంలో అనేక సూర్యుల కాంతి ఒకే సారి వ్యాపించినట్లు, నీ మణుల చేత కాంతిని ఆకాశమంతా వ్యాపింపచేశావు.

వ్యాఖ్య :–పాదుకామణులకాంతి పలు వేవెలుగుల కాంతితో సమానమనే వర్ణన

త్రివిక్రమావతారంలో భగవానుడు లోకాలను కొలువడానికి పెరుగుతున్నప్పుడు భగవత్పాదుక కూడా బాగా వృద్ధి చెందుతూ ఉండింది. ప్రళయకాలంలో అనేక సూర్యులు ఏకకాలమందే ఉదయించి ప్రచండమైన తేజస్సును వ్యాపింప జేస్తారని పురాణ ప్రసిద్ధి. అయితే ఆ వెలుగు సర్వనాశనం కోసం కలుగుతుంది.

యుగ మధ్యకాలంలో అనేక సూర్యులకాంతితో సమానమైన కాంతి మాత్రం ప్రసరిస్తే అది భగవద్దివ్య కాంతియే. ఇది విశ్వశ్రేయస్సుకోసమే .

"దివి సూర్య సహస్రాణాం భవేద్యుగ పదుత్థితా !
యది భాః సదృశీ సాస్యా ద్భాస స్తస్య మహాత్మనః" !!

త్రివిక్ర మానుగుణంగా పెరుగుతున్న భగవత్పాదుకలో పొదుగబడిన ఒక్కొక్క మణి, ఒక్కొక్క సూర్యమండలంగా ప్రకాశిస్తూ ఆకాశంలో అనంత శోభను సమకూర్చడమూ, దివౌకసులకు స్వారాజ్యలక్ష్మిని చేకూర్చడమూ జరిగింది. ఉపమాలంకారం. ఔపచ్ఛందసికం.

*835. మంజుస్వనాం మణి మయూఖ కలాపినీం త్వాం*
*దృష్ట్వాకపర్ద సవిధే వినివేశ్యమానామ్!*

*గూఢీభవంతి గరుడధ్వజ పాదరక్షే!*

*ఫూత్కారవంతి పురవైరి విభూషణాని !!* 5

**అర్థం:-** హే గరుడధ్వజ పాదరక్షే = ఓ గరుడ ధ్వజ పాదుకా! పురవైరి విభూషణాని = పురాంతకుడైన శివుని ఆభరణాలుగా ఉన్న పాములు; కపర్ద సవిధే = (శివుని) జటాజూటం దగ్గర; విని వేశ్యమానాం = ఉంచుకోబడుతున్న; మంజు స్వనాం = మధురనాదంగల (కేకానాదంగల): మణిమయూఖ కలాపినీం = మణికిరణసముదాయం కలిగిన (మయూర పింఛం కలిగిన); త్వాం = నిన్ను; దృష్ట్వా = చూచి; ఫూత్కారవంతి = బుసకొట్టుతున్నవై; గూఢీ భవంతి = దాగుకొంటాయి.

**తా॥** ఓ విష్ణు రథ ధ్వజ పాదుకా! పరమ శివుడు తలవంచి నీకు నమస్కరిస్తున్నప్పుడు ఆయన ఆభరణాలైన సర్పాలు, మధురనాదం కలిగి మణుల కిరణాల సమూహమనే పింఛం కలిగిన నిన్నుచూచి బుసకొడుతూ దాగుకొంటాయి.

వ్యాఖ్య :–పాదుక మయూరంగా కల్పితం

అది పక్షిరాజ ధ్వజుని పాదుకకదా! రకరకాల రంగుల రత్నాల కాంతుల నెమిలి పింఛంగా ఉండడం వల్ల పాదుక మయూరంగా కనిపిస్తుంది. పాదుకామంజుల నాదం నెమిలికేకను పోలి ఉంది. కపర్ది భగవంతుణ్ని సేవించి, పాదుక(ల)ను శిరస్సున ధరిస్తున్నప్పుడు ఆయనకు అలంకారంగా ఉన్న పాములు పాదుకను చూచి నెమిలి అని భ్రమ పడ్డాయి. మయూరం భుజంగ భుక్కు కాబట్టి సర్పాలు భయంతో బుసుకొడుతూ మహాదేవుని మెడలోనూ, చంకల్లోనూ, జడల్లోనూ దాగుకొన్నాయి.

'గాఢీ భవంతి' అనే పాఠం ఉంటే, సర్పాలు ఆత్మరక్షణ కోసం బుసకొడుతూ, దృఢంగా బిగుసుకొంటాయి అని అర్థం.

భ్రమాలంకారంతో కూడిన స్వభావోక్త్యలంకారం. వసంత తిలక.

*836. మధ్యే పరిస్ఫురిత నిర్మల చంద్రతారా*

*ప్రాంతేషు రత్ననికరేణ విచిత్రవర్ణా!*

*పుష్ణాసి రంగనృపతే ర్మణి పాదుకే! త్వం*

*చక్షుర్వశీకరణ యంత్ర విశేషశంకామ్ !!* 6

**అర్థం:-** హే రంగనృపతేః మణిపాదుకా = ఓ రంగరాజ మణిపాదుకా! మధ్యే = నడుమ; పరిస్ఫురిత నిర్మల చంద్రతారా = ప్రకాశిస్తున్న విశుద్ధమైన బంగారమూ, ముత్యాలూ కలిగిన / మధ్యేపరిస్ఫురిత నిర్మల చంద్రతారా = ప్రకాశిస్తున్న అభ్రకం నడుమ చంద్ర మండలం లాగా వర్తులాకార రేఖయందు ప్రణవం కలిగిన; ప్రాంతేషు = ప్రక్క భాగాల్లో; రత్ననికరేణ = రత్నాల సమూహంచేత; విచిత్ర వర్ణా = నానారూపాలుగల / బహువిధాలైన అక్షరాలు గల; త్వం = నీవు; చక్షుర్వశీకరణ యంత్ర విశేషశంకాం = కన్నులను వశం చేసుకొనే ఒక విధమైన యంత్రమో అనే సందేహాన్ని; పుష్ణాసి = పోషిస్తున్నావు.

తా॥ ఓ రంగరాజు మణిపాదుకా! నీ మధ్యన మంచి బంగారమూ, ముత్యాలూ కలిగి, ప్రాంత భాగాల్లో రత్న సముదాయంచేత నానా కాంతులు కలిగిన నీవు, ప్రకాశిస్తున్న అభ్రకం మధ్యన ఉండే చంద్ర బింబంలాగా గుండ్రని రేఖయందు ప్రణవం కలిగి ప్రక్కలకు పలురకాల మంత్రాక్షరాలు కలిగిన, చూచే వారి కన్నులను వశీకరించే ఒక రకమైన యంత్రమనే శంకను కలిగిస్తున్నావు.

వ్యాఖ్య :-పాదుక వశీకరణ యంత్రమని ఉత్ప్రేక్షితం

శ్రీ రంగనాథుడు వీథిలో సంచరిస్తున్నప్పుడు ప్రజలు రెప్ప కొట్టకుండా సేవిస్తారు. కాంచన పాదుకకు నడుమ మంచి ముత్యాలు ప్రకాశిస్తుంటాయి. పార్శ్వభాగాల్లో మణుల కిరణాలు రంగు రంగులుగా ప్రసరిస్తుంటాయి. కాబట్టి ఈ పాదుక, తనను సేవించే ప్రజల కన్నులను మరొకవైపుచూడకుండా, వశపరచుకొనే యంత్రమన్నట్లు కనిపిస్తుంది.

ఈ శ్లోకంలోని పూర్వార్థం శ్లిష్ట పదభూయిష్టం. 'నిర్మల' శబ్దానికి 'విశదమైన' అర్థమే కాక 'అభ్రకం' అనే ధాతు విశేషమనే అర్థముంది. 'చంద్ర' శబ్దానికి బంగారమనే అర్థమూ ఉంది. 'నిర్మలం విమలే విద్యాన్నిర్మాల్యాభ్రకయోరపి' (విశ్వనిఘంటువు) "చంద్రః సుధాంశుకర్పూర కంపీల (కాపిల) స్వర్ణవారిషు" (వి.ని) 'తార' శబ్దం పుంలింగమైతే 'మంచిముత్య'మనీ, నపుంసకలింగ మైతే 'ప్రణవ'మని అర్థం.

"తారో ముక్తాది సంశుద్ధౌ తరళే శుద్ధమౌక్తికే" (వి.ని)

అభ్రకపు రేకుమీద చంద్రమండలాన్ని పోలిన వృత్తరేఖలో (ఓంకారం) ప్రణవం వ్రాయబడుతుంది. చుట్టూరా మంత్రాక్షరాలూ వ్రాయబడుతాయి. చిన్న ఆకృతిగా ఏర్పరచిన ఈ వశీకరణ యంత్రాన్ని (నొసట తిలకంగా) ధరిస్తే ప్రేక్షక జనులు విడువకుండా తన చుట్టే తిరుగుతుంటారని తద్జ్ఞులంటారు.

పాదుకా మధ్యగతావయవం వశీకరణయంత్ర మనిపించే లాగా ఉంది. రంగరాజు యంత్ర విశేషాన్ని ధరించాడా, అన్నట్లు పాదుక ప్రకాశిస్తూ ప్రేక్షకులను ఆకర్షిస్తున్నదని కవికేసరి హృదయం. శ్లేషమూలకోత్ప్రేక్షాలంకారం. వసంతతిలకావృత్తం.

*837. పాదేన రంగనృపతేః పరిభుజ్యమానా*
*ముక్తాఫల ప్రకటిత శ్రమవారి బిందుః !*
*ఉత్కంటకామణి మయూఖశతైరుదగ్రైః*
*సీత్కారిణీవ చరణావని! శింజితైస్త్వమ్ 5*

అర్థం:- హే చరణావని = ఓ పాదరక్షిణి! రంగనృపతేః = రంగరాజుయొక్క; పాదేన = చరణంచేత; పరిభుజ్యమానా = అనుభవింపబడుతున్న; ముక్తాఫల ప్రకటిత శ్రమవారిబిందుః = ముత్యాల చేత వ్యక్తమైన చెమట చుక్కలు గల; ఉత్ + అగ్రైః = పైకి లేచిన; మణిమయూఖశతైః = మణులనూర్లకిరణాలచేత; ఉత్కంటకా = పులకలు వచ్చిన; త్వం = నీవు; శింజితైః = నాదాలచేత; సీత్కారిణీ, ఇవ = 'ఉస్సు' అని ఊసలు కొడుతున్నట్లున్నావు.

**తా॥** ఓ పాదావనీ! శ్రీరంగరాజు పాదమనే నాయకునిచే అనుభవింపబడుతూ ముత్యాలచే ప్రకటింపబడే చెమట చుక్కలు కలిగి, పైకి ఎగసిన అనేక మణులకిరణాలచేత పులకరించిన నీవు నాదాల చేత సీత్కారం కలనాయికగా ఉన్నావు.

వ్యాఖ్య :- నాయకునితో రమించిన నాయికగా పాదుక ఉత్ప్రేక్షితం

శ్రీరంగనాథుడు సంచారంచేసివచ్చి అంతఃపురంలో ప్రవేశించిన ప్రకరణమని భావించాలి.

భగవత్పాదమే నాయకుడు. పాదుక నాయిక. నాయకునితో రమించిన నాయికకు ఏయే లక్షణాలుంటాయో అవన్నీ పాదుకానాయికకు సంభవించినవని వర్ణితం.

ముత్యాలు చెమట బొట్టులను ప్రకటిస్తే, మీదికెగసిన రత్నాల కాంతులు దేహం మీద అంకురించిన పులకలను వ్యక్తం చేస్తున్నాయి. పాదుకాంతర్గత మణుల నాదాలు అధర దంశనాదులవల్ల కలిగిన సీత్కారాలను వెల్లడిస్తున్నాయి.

పాదుకను నాయికగా వర్ణించడం వల్ల సమాసోక్త్యలంకారం. అది ఉత్ప్రేక్షాలంకారానికి అంగంగా భాసిస్తున్నది. వసంతతిలకావృత్తం.

838. *దూరప్రసారితకరా నినదైర్మణీ నా*
*మాయాతి దైత్యరిపు రిత్య సకృత్ బ్రువాణా!*
*దైత్యేశ్వరా నభిముఖాన్ జనితా నుకంపా*
*మన్యే నివారయసి మాధవ పాదుకే! త్వమ్ !!* 8

**అర్థం:-** హే మాధవ పాదుకే = ఓ లక్ష్మీపతి పాదుకా! దూరప్రసారితకరా = దూరంగా చాచబడి రత్నకిరణాలనే చేతులు కలిగిన; జనిత+అనుకంపా = దయకలిగిన; త్వం = నీవు; మణీనాం = మణుల యొక్క; నినదైః = నాదాలచేత; దైత్యరిపుః = రాక్షసాంతకుడు; (హే దైత్య = ఓ రక్కసుడా! రిపుః = (నీయొక్క) శత్రువు); ఆయాతి = వస్తున్నాడు; ఇతి = అని; అసకృత్ = పలుసార్లు; బ్రువాణా = చెబుతున్నదానివై; అభిముఖాన్ = ఎదుట ఉన్న? దైత్య+ఈశ్వరాన్ = రాక్షస రాజులను; నివారయసి = తొలగిస్తున్నావు; మన్యే = అనుకొంటున్నాను.

**తా॥** ఓ మాధవ పాదుకా! దూరంగా వ్యాపించిన కిరణాలే చాచిన చేతులు గాగల దయావతివైన నీ మణుల నాదాలచేత, అసురవైరి వస్తున్నాడని అనేక పర్యాయాలు చెబుతూ ఎదురుగా ఉన్న దైత్య వీరవరులను ప్రతిషేధిస్తున్నావను కొంటాను.

వ్యాఖ్య :-పాదుక దైత్యవీరులను హెచ్చరించే వర్ణన

శ్రీరంగ నాథుడు రాక్షసులను సంహరించడానికి బయల్దేరాడు. పాదుకామణుల కిరణాలు దూరం వ్యాపిస్తున్నాయి. మణులనాదంకమనీయంగా ఉంది. రాక్షసులు శ్రీహరితో యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నారే! అయ్యో! వీరికి జయమా! కలుగదు. వ్యర్థంగా వీరు మడియకూడదు. అని పాదుకకు అపారమైన దయ పొంగి పారలింది.

"ఓ దైత్యప్రభూ! నీ శత్రువు వస్తున్నాడు. ఓ రాక్షసరాజా! ఇదిగో భగవంతుడు నీ ప్రాణాలను దీస్తాడు. ఎదుటికి రాకండి! పలాయనం చిత్తగించండి, పొండి" అంటూ తన చేతులు దీర్ఘంగా చాపి పాదుక, రాక్షసరాజులను తొలగిపొమ్మని పలుసార్లు ఎలుగెత్తి చాటుతున్నదో అన్నట్లుంది. ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలకావృత్తం.

*839. అచ్ఛేద్యరశ్మినియతక్రమ రత్నధుర్యా*
*నిష్కంప కూబరనిభం దధతీ ప్రతీకమ్!*
*క్రీడాగతేషు మధుజిత్పద పద్మలక్ష్మ్యాః*
*కర్ణీరథస్త్వమసి కాంచన పాదరక్షే!! 9*

**అర్థం:-** హే కాంచన పాదరక్షే = ఓ బంగారు పాదుకా! అచ్ఛేద్యరశ్మి, నియతక్రమ, రత్నధుర్యా = అభంగురకిరణాలు, అసంకీర్ణపంక్తులుగల, శ్రేష్ఠమణులు కలిగియున్న / శిథిలంకాని పగ్గాలచే, నియమంగా అడుగులు వేసే, శ్రేష్ఠమైన గుఱ్ఱాలు కలిగిన; నిష్కంప కూబరనిభం = స్థిరమైన నొగచీలకుసమానమైన; ప్రతీకం = బొడుసు (యంత్రిక)ను; దధతీ = ధరించే; త్వం = నీవు; క్రీడాగతేషు = లీలాసంచారాల్లో; మధుజిత్ పద పద్మలక్ష్మ్యాః = మధుసూదనుని పాదకమలాల శోభ అనే లక్ష్మీదేవి యొక్క; కర్ణీరథః = యాత్రారథంగా; అసి = ఉన్నావు.

**తా॥** ఓ కాంచన పాదుకా! ఎడతెగనికిరణాలను ప్రసరింపజేస్తూ, వేర్వేరు వరుసల్లో శ్రేష్ఠమైన మణులు కలిగి, యంత్రికావయవంగల నీవు, గట్టి పగ్గాలచే క్రమగతులతో నడచే అశ్వాలు కలిగి, స్థిరమైన నొగ చీలకలిగిన భగవత్పాద పద్మశోభ అనే లక్ష్మి ఉల్లాసంగా సంచరించే యాత్రారథంగా ఉన్నావు.

వ్యాఖ్య :-పాదుక విహారార్థమైన చిన్నరథంగా శ్లేషతో ఉత్ప్రేక్షితం

పాదుక ఒక యాత్రారథం. పాదుకలో వేర్వేరు పంక్తుల్లో పొదుగబడిన మంచిరత్నాలు క్రమపద్ధతిలో నడిచే తురంగాలు. రత్నాలు ఎడతెగక దీర్ఘంగా ప్రసరింపజేసే కిరణాలే పగ్గాలు.

కదలకుండా ఉన్న యంత్రికావయవం రథానికి ముందు ఉండే యుగంధరం - నొగతో కాడిని బంధించే మేకు. శ్రీరంగరాజ చరణకమల శోభయే లక్ష్మీదేవి. భగవత్పాదపద్మశోభ అనే లక్ష్మికి వినోదంగా విహరించడానికి ఉపయోగపడే కర్ణీరథంగా పాదుక వర్ణింపబడింది. ఈ భావన శ్లేషమూలకంగా కల్పింపబడిండి

"కంఠీరథః ప్రవహణం డయనంచ సమంత్రయమ్" (అమరం)

కంఠీరథానికి, 'కంఠీరథ' మనే పాఠాంతరమున్నది. వసంతతిలక.

*840. మంజూస్వ నా మరకతోపల మేచకాంగీ*
*శోణాశ్మతుండరుచిరా మణిపాదుకే! త్వమ్!*
*పద్మావిహారరసికస్య పరస్యయూనః*
*పర్యాయతాం భజసి పంజరశారికాణామ్ ॥ 10*

**అర్థం:**-హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! మంజుస్వనా = ఇంపైన శబ్దం కల; మరకత+ఉపల, మేచక+అంగీ = మరకతమణుల్లాగా పచ్చని శరీరంగల; శోణ + అశ్మతుండరుచిరా = పద్మరాగమణిఖండం లాగా ఎఱ్ఱని ముక్కుచే అందమైన; త్వం = నీవు; పద్మావిహార రసికస్య = లక్ష్మీలీల యందు రసానుభవంగల; పరస్య = పరమాత్ముడైన; యూనః = యువకునికి; పంజరశారికాణాం = పంజరమందున్న ఆడ చిలుకల; పర్యాయతాం = సాదృశ్యాన్ని; భజసి = పొందుతున్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! మనోజ్ఞనాదంకలిగి పచ్చలవలె పచ్చని ఆకారం కలిగి, పద్మరాగ మణిఖండం వలె ఉన్న అరుణ వదనంచేత అందమైన నీవు లక్ష్మీ విహార రసిక యువకుడైన శ్రీరంగరాజుకు పంజరంలో ఉండే చిలుకల సాదృశ్యాన్ని పొందుతున్నావు.

వ్యాఖ్య :-దివ్యదంపతుల శుద్ధాంతంలోని పంజరంలో ఉండే పచ్చని చిలుకలాగా పాదుక శోభించే వర్ణన

లక్ష్మదేవి వాసస్థానంలో లీలగా సంచరించే ఆదివ్యదంపతులు అక్కడున్న పంజరంలోని చిలుకల హృద్యాలాపాలతో వినోదిస్తారు. పాదుకలు ఆ చిలుకల్లా ఉన్నాయి. రత్నాల నాదాలే చిలుకల మధురాలాపాలు. చిలుక పచ్చని వలె కలిగి పాదుకల్లోని పద్మరాగమణులు చిలుకముక్కు మాదిరి ఎఱ్ఱగా ప్రకాశిస్తూ, పాదుక అనే చిలుక రసికయువకుడైన రంగపతికి లీలారసానుభవాన్ని కలిగిస్తుంది. ఉపమాలంకారం. వసంతతిలకావృత్తం.

*841. శోణో పలైశ్చరణ రక్షిణి! సంశ్రితేషు*
*ఛ్ఛాయాత్మనా మరకతేషు తవావగాఢః!*
*అన్వేతి శౌరిరభితః ఫలపంక్తి శోభి*
*న్యాత్మానమేవ శయితం వటపత్ర మధ్యే ॥ 11*

**అర్థం:**- హే చరణ రక్షిణి = ఓ పాదుకాదేవీ! శోణ+ఉపలైః = పద్మరాగ మణులతో; సంశ్రితేషు = కూడియున్న; తవ = నీ యొక్క; మరకతేషు = మరకత మణులయందు; ఛాయా+ఆత్మనా = ప్రతిబింబశరీరం చేత; అవగాఢః = ప్రవేశించియున్న; శౌరిః = భగవంతుడు; అభితః = ఇరుపక్కలయందు; ఫలపంక్తి శోభిని = ఫలాలవరుస చేతప్రకాశించే; వటపత్రమధ్యే = మఱ్ఱియాకునడుమ; శయితం = పవళించిన; ఆత్మానం, ఏవ = తననే; అన్వేతి = అనుకరిస్తున్నాడు.

**తా॥** ఓ పాదుకాదేవీ! పద్మరాగమణులతో కూడియున్న నీ మరకత మణులయందు ప్రతిబింబంగా ప్రవేశించిన భగవానుడు, ఇరువైపుల మఱ్ఱిపండ్ల వరుసలచే శోభించే మఱ్ఱియాకునడుమ పడుకొన్న తన పోలికనే అనుకరిస్తున్నాడు.

వ్యాఖ్య :-మణిపాదుకలను ధరించిన భగవంతుడు వటపత్రశాయిగా వర్ణితం

శ్రీరంగనాథుని దివ్యమంగళ విగ్రహం పాదుకయందు ప్రతిబింబిస్తుంది. పద్మరాగమణులు మఱ్ఱి పండ్లను పోలియున్నాయి. మరకతమణులతో కూడిన పాదుక పచ్చని వటపత్రంలాగా శోభిస్తుంది. పాదుకపై నున్న భగవానుడు వటపత్రశాయిగా ప్రతిబింబిస్తున్నాడు.

బింబప్రతిబింబ పద్ధతిలో "పాదార్పణాత్ - రూపమ్' అనే (717) శ్లోకంలో వటపత్రశాయిగా వర్ణితం. ఈ శ్లోకంలో వటపత్రానికి చుట్టూ వటఫలాలున్నట్లు పద్మరాగమణులు ఎఱ్ఱగా ప్రకాశించడం విశేషం. ఉపమాలంకారం. వసన్త తిలకావృత్తం.

*842. స్ఫీతం పదావని! తవస్నపనార్ద్రమూర్తే*
*రాసాగరం తతమభూన్మణి రశ్మి జాలమ్ !*
*లీలోచితం రఘుసుతస్య శరవ్యమాసన్*
*యాతూని యస్యవలయేన వివేష్టితాని !!* 12

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకా! స్నపన + ఆర్ద్రమూర్తేః = అభిషేకముచేత తడిసిన ఆకృతిగల; తవ = నీయొక్క; స్ఫీతం = విరివిగా ఉన్న; మణిరశ్మిజాలం = రత్నాలకిరణాల సమూహమనే వల; ఆసాగరం = సముద్రం వరకు; తతం = వ్యాపించినది. అభూత్ = ఆయెను; యస్య = ఏకిరణసమూహంయొక్క; వలయేన = మండల భావంచేత; వివేష్టితాని = క్రోడీకరింపబడిన; యాతూని = రాక్షసులు; రఘునుతస్య = శ్రీరామునియొక్క; లీలా + ఉచితం = వేటకు యోగ్యమైన; శరవ్యం = బాణానికి ల్యక్షమై; ఆసన్ = ఉండిరి.

**తా॥** ఓ పాదుకాదేవీ! నీకు రాజ్యాభిషేక మయినందువల్ల ఆర్ద్రాకృతి గల నీ యొక్క గొప్ప మణుల వరుణ సముదాయమనే వల సముద్ర పర్యంతం వ్యాపించింది. ఆ కిరణ సమూహం గుండ్రంగా వ్యాపించినందువల్ల ఆవలలో చిక్కిన రాక్షసుల వేటాడడానికి యోగ్యమైన శ్రీరాముని బాణానికి గురి అయ్యారు.

వ్యాఖ్య:- పాదుకా మణికిరణజాలం రాక్షసమృగాలను పట్టుకొన్న వలగా వర్ణితం

కోసల రాజ్య సింహాసనంపైన పాదుకాభిషేకం జరిగింది. పాదుక గుండె, రాళ్ళతో పాదుగబడి ఎంతో కఠినమైనదయినా, అభిషేక తీర్థంతో తడిసి ఉబ్బిపోయింది. పాదుకలో ప్రవేశించే రత్నాలు తమ నైసర్గిక స్వరూపాన్ని పెంచుకొని రాజ్య సంరక్షణార్థం తమ కిరణ సముదాయాన్ని సముద్ర పర్యంతం వల పరచినట్లు వ్యాపింపజేశాయి. వలయాకారంగా పరచుకొన్న ఆవలలో రాక్షసులందరు చిక్కుకొన్నారు. కాబట్టి వీరరాఘవుడు ఆరాక్ష సమృగాలను అవలీలగా తన శరీరానికి ఎరగా చేశాడు. "యాతురక్షసీ" (అమరం)

శ్రీరంగనాథుడు ఉత్సవంలో కావేరీ తీరాన చేరి, తిరిగి దశావతార సన్నిధికి వేంచేసినప్పుడు, ఆయా అవతారస్వరూపస్వ భావాలు వర్ణింపబడినట్లే, ఇప్పుడు శ్రీరాముని గూర్చి దేశికులు. ఇలా వర్ణించడం లీలోచితం.

శ్లిషరూపకాలంకారం, ఉత్తరార్థంలో ఉదాత్తాలంకారం. మృగత్వాన్ని బట్టి సమాసోక్తి. వసంతతిలకావృత్తం.

ఇక్కడినుంచి రామపాదుకా విషయం కొన్ని శ్లోకాల్లో వర్ణితం.

*843. రత్నాంశుభి స్త్రవతదా మణిపాదరక్షే!*
*సంరజ్యమానవపుషాం రజనీ ముఖేషు!*
*ఆకస్మికాగత మదర్శి మహౌషధిత్వం*
*సాకేత పత్తన సమీపరుహాంద్రుమాణామ్ ॥* 13

అర్థం:- హే మణిపాదరక్షే = ఓ మణిపదుకా! తదా = అధికారకాల మందు; తవ = నీ యొక్క; రత్న + అంశుభిః = రత్నాల కిరణాలచేత; సంరజ్యమాన వపుషాం = రంగాయింపబడుతున్న ఆకృతులుగల; సాకేతపత్తన సమీపరుహాం = అయోధ్యానగర సమీపానమొలచిన; ద్రుమాణాం = వృక్షాలలో; రజనీ ముఖేషు = సాయంకాలాల్లో; మహా + ఓషధిత్వం = మహౌషధి ధర్మం; అకస్మిక + ఆగతం = అతర్కితంగా చేరినట్లు; అదర్శి = చూడబడినది.

తా॥ ఓ పాదుకా! నీ అధికారకాలాన నీ రత్నకాంతులచే ప్రకాశించే అయోధ్యాప్రాంత భూములందున్న వృక్షాలకు సాయంసమయాల్లో హఠాత్తు గా చేరిన మహౌషధి భావం జనులచే చూడబడింది.

వ్యాఖ్య:- పాదుకా పద్మరాగమణులకాంతిచే వృక్షాలు మహౌషధులైన వర్ణన

రాత్రివేళల్లో ప్రజ్వలించే తరుగుల్మలతాలను మహౌషధులంటారు. పాదుకా పరిపాలనలో పాదుకా పద్మరాగమణులకిరణాలకాంతులు దూర దూరంగా వ్యాపించాయి. సాకేత నగరానికి చేరువలో ఉన్న చెట్లన్నీ సాయం సమయాల్లో పద్మరాగమణులకాంతులతో ప్రకాశిస్తూ మహౌషధి భావాన్ని పొందినాయి.

సూర్యుని వెలుగువల్ల చెట్ల కాంతి పగలు కనబడలేదు. రాత్రికాగానే వృక్షాలు ఉజ్జ్వలంగా ప్రజ్వలించడం సాకేతవాసులకు గోచరించింది.

'అకేతం' అంటే సుఖనివాసం. అకేతంతో కూడింది సాకేతం. సుఖనివాస యోగ్య నగరం సాకేత పత్తనం.

సాకేత పత్తన పౌరుల మహౌషధులైన వృక్షాలను ఆశ్చర్యంతో చూచారు. పగలును మహౌషధులుకాని చెట్లనే రాత్రి మహౌషధులుగా, కాలభేదంచేత - పర్యాయంగా - చెప్పడంవల్ల పర్యాయాలంకారం. వసన్తతిలకావృత్తం.

*844. రామేవనం దశరథేచ దివంప్రయాతే*
*నిర్ధూత విశ్వతిమిరా సహసాబభూవ!*
*భూయిష్ఠ రత్నకిరణా భవతీ రఘూణాం*
*భూయః ప్రతాప తపనోదయ పూర్వ సంధ్యా !!* 14

అర్థం:- రామే = రాముడు; వనం = అడవికి; చ = మరియు; దశరథే = దశరథుడు; దివం = స్వర్గానికి; ప్రయాతే = వెళ్ళగా; సహసా = త్వరలోనే; నిర్ధూత విశ్వతిమిరా = తొలగింపబడిన లోకాల చీకట్లుగల; భూయిష్ఠ రత్నకిరణా = అధిక రత్నాల కాంతులు కలిగిన; భవతీ = నీవు; భూయః = మళ్ళీ; రఘూణాం = రఘువంశ మహారాజులయొక్క; భూయః ప్రతాప తపన + ఉదయ పూర్వ సంధ్యా = అధిక పరాక్రమ మనే సూర్యుని యొక్క ఉదయంచేత తూర్పు సంజగా; బభూవ = ఉంటివి.

తా॥ ఓ రత్న పాదుకా! శ్రీరాముడు అడవికి, దశరథుడు స్వర్గానికి పోయినప్పుడు కమ్ముకొన్న లోకాల శోకాల చీకట్లను శ్రీఘ్రంగా చిమ్మివేయ గలిగిన, అధిక రత్నకాంతులు గల నీవు, రఘువంశ రాజుల అధిక పరాక్రమమనే సూర్యుని ఆవిర్భావం చేత తూర్పు సంజవయ్యావు.

వ్యాఖ్య:- రఘువంశ పరాక్రమ భానూదయంచేత పాదుక పూర్వ సంధ్యగా వర్ణితం

మను మహారాజుకాలంనుంచి రఘువంశ పరాక్రమ భానుడు ప్రచండంగా వెలగడం వల్ల అయోధ్య అపరాజితగా - చీకట్లకూ. దుంభాలకూ తావు లేక - ప్రకాశించింది. శ్రీరాముడు నగరం విడిచి అడవికీ, దశరథుడు దేహం విడిచి ఊర్ధ్వలోకానికీ వెళ్ళిపోగానే అయోధ్యలో శోకాల చీకట్లు ముసురుకొన్నాయి. మళ్ళీ అయోధ్యలో పాదుక ప్రవేశించగానే తద్రత్నాలకాంతి ప్రసరించడం వల్ల, పాదుక ప్రాచీసంధ్యగా భాసించింది. గతశ్లోకంలో - 'రజనీముఖ'మని మలిసంజలోపాదుకను వర్ణిస్తే, ఈ శ్లోకంలో - దినముఖాన ఉండే పాదుకాస్వరూపంతొలి సంజగా వర్ణితం. రూపకాలంకారం. వసంతతిలకావృత్తం.

*845. ప్రీతేన దేవి! విభునా ప్రతిపాదనీయాం*
*పాదావని! ప్రతిపదోదిత మంజునాదామ్ !*
*విద్యాం విదుర్భగవతః ప్రతిపాదనార్హాం*
*పారాయణాగమ పయోనిధి పారగా స్త్వామ్ !!* 15

**అర్థం:-** హే దేవి, పాదావని = ఓ పాదుకాదేవీ! ప్రీతేన = ప్రసన్నుడైన; విభునా = భగవంతునిచేత / గురువుచేత: ప్రతిపాదనీయాం = అనుగ్రహింపదగిన; ప్రతి పద + ఉదిత మంజునాదాం = వేసే ఒక్కొక్క అడుగునందు / సుబ్తిఙన్త పదమందు ఉదయించి ఇంపైన నాదంగల; భగవతః = భగవంతునియొక్క; ప్రతిపాదన + అర్హాం సంచారానికి యోగ్యమైన భగవంతుణ్ని ప్రతిపాదించదగిన; త్వాం = నిన్ను; పారాయణ + ఆగమపయోనిధి పారగాః = సకలవేద సముద్రం యొక్క ఆవలి దరిని చేరినవారు - విద్వాంసులు; విద్యాం - విద్యగా: విదుః - తెలిసికొందురు.

**తా॥** ఓ పాదుకాదేవీ! ప్రసన్నుడైన భగవంతునిచే అనుగ్రహింపదగిన, ఒక్కొక్క అడుగున ఇంపుగా నినదించే, భగవంతుని సంచారానికి యోగ్యమైన నిన్ను; సకల వేదసాగర పారంగతులు గురువు ప్రసన్నుడై కృపజేసే, స్వర యుక్తంగా ఉచ్చరించబడే మంత్రాలలోని ప్రతిపదమందు మనోజ్ఞనాదంగల, శ్రియఃపతిని ప్రతిపాదించే వేదవిద్యగా తెలుసుకొంటారు.

వ్యాఖ్య:- పాదుక బ్రహ్మవిద్యగా ఉత్ప్రేక్షితం

త్రయీ తనువైన సూర్యుడు ఉదయించే ప్రాక్సంధ్యగా పాదుక వర్ణింపబడింది. సంధ్యోపాసనను బట్టి, ఇప్పుడు పాదుకను ఉపాసన అనే విద్యగా దేశికులు వర్ణించారు.

పారాయణ కాలమందు ఆదినుంచి అంతంవరకు (వేదం) సమస్తం అధ్యయనం చేయవలసి ఉంటుంది. "సాకల్యాసంగవచనే పారాయణ పరాయణే" (అమరం) 'పారాయణ' శబ్దానికి 'సమస్తం, సాకల్యం' అని అర్థం (పారం అయంతే అనేన, పారయణం. రామాయణ పారాయణం. 'పరాయణ' మంటే ఆసక్తికి ఉత్కృష్ట స్థానమైనది. 'పరం ఆసక్తేః అయనం; పరాయణం. ధర్మపరాయణుడు)

పరబ్రహ్మను ప్రతిపాదించే వేదాలకూ, పాంచరాత్ర శాస్త్రాలకు 'ఆగమాలు' అని ప్రసిద్ధి. అగాధమూ, అనంతమూ అయిన వేదశాస్త్రాలు గంభీరార్థం కలవి. కాబట్టి వాటికి 'శ్రుతిసాగరం' అన్వర్థ నామధేయం. 'పారం' అంటే దరి. ఈ దరినుంచి ఆవలి దరిని చేరుకొన్న వారు 'పారగులు' సకల వేదశాస్త్రార్థాలనెరిగిన వారు, అని అర్థం.

ఈ పారాయణాగమ పయోనిధి పారగులు పాదుకను బ్రహ్మవిద్యగా భావించి ఉపాసన చేసి తరిస్తారు. ఇందుకు మూడు విశేషణాలు ఉపయోగించబడినాయి. ఇవి శ్లిష్టపదాలు.

*1. ప్రీతేన విభునాప్రతిపాదనీయా :-*

ప్రసన్నుడైన భగవంతుడు ప్రసాదిస్తే లభించేది 'పాదుక' శ్రీరామచంద్రస్వామి పాదుకలను ధరించి, విడిచి ప్రసాదించాడు. కాబట్టి, భరతుడు పాదుక(ల)ను శిరసావహించి ఉపాసించాడు.

"దదామి ప్రీతిపూర్వకం" అన్నాడు గీతాచార్యుడు

"ఆత్మనా విందతే వీర్యం" అన్నది ఉపనిషద్వాణి.

బ్రహ్మ నిష్ఠుడైన ఆచార్యుడు దయాళుడై శిష్యులకు బోధిస్తే బ్రహ్మ విద్యలభిస్తుంది. "శిరియనాన్మఱై చ్చెంబొరుళ్ అళిత్త". ప్రశస్తమైన నాలుగువేదాల రమణీయార్థాలను కృపజేస్తాడు ఆచార్యుడు.

*2. ప్రతిపదోదితమంజునాదా :-*

భగవంతుడు పాదుకలను ధరించి విహరించినప్పుడు ఒక్కొక్క అడుగున పాదుకామణుల నాదం మనోజ్ఞంగా ఉంటుంది.

విద్యోపాసనలో అంగంగా విధింపబడిన మంత్రాలను స్వరయుక్తంగా పఠిస్తుంటే ప్రతిపదమందలి నాదం శ్రుతివేయంగా ఉంటుంది.

*3. భగవతః ప్రతిపాదనార్హా :-*

భగవంతుణ్ని తానువహించి మనమున్న చోటికి తీసుకొని వచ్చి 'ఇదిగో! మోక్షదాత, భక్తితో సేవించి తరించండి'! అని మనకు ప్రదర్శించే యోగ్యత కలది పాదుక.

"సర్వే వేదా యత్పదమామనంతి" - ఉపనిషత్తు. "వేదియర్ ముళు వేదత్తముదత్తై" శ్రీశఠకోపసూక్తి సుధ. సకలవేద శాస్త్రాలు భగవంతుడు 'అమృత స్వరూపుడు' అని భగవంతుని గుణ విభూతులను ప్రతిపాదిస్తుంటాయి. కాబట్టి మనం భక్తినీ, ప్రపత్తినీ, భగవంతుణ్నీ పొందే విధంగా చేసేది విద్య. బ్రహ్మ విద్యోపాసకులకు పరబ్రహ్మసాన్నిధ్యం లభిస్తుంది. "బ్రహ్మవిదాప్నోతి పరం" అని కదా! ఉపనిషద్వాణి.

ప్రభావ పద్ధతిలో "పరస్యధామ్నః ప్రతిపాదనార్హాం, వదంతి విద్యాం మణిపాదుకేత్వామ్" (95) అని వర్ణితం. దానికి ఇది పునరుక్తి అనుకొనరాదు. విశేషణ పదప్రయోగం భిన్నమనీ గమనించాలి. అక్కడ విద్య "సకల పాపహరం, ముక్తి ప్రదం."

ఇక్కడ 'విద్య' కేవలం మంత్ర పరం కదా!

శ్లేషాను ప్రాణితో ఉత్ప్రేక్షాలంకారం. వసంత తిలకావృత్తం.

*846. ముక్తాంశు కేసరవతీ స్థిరవజ్రదంష్ట్రా*
*ప్రహ్లాద సంపదనురూప హిరణ్యభేదా!*
*మూర్తిఃశ్రియోభవసి మాధవ పాదరక్షే !*
*నాథస్య నూనముచితా నరసింహమూర్తేః ః 16*

**అర్థం:-** హే మాధవ పాదరక్షే = ఓ శ్రీపతి పాదుకా! ముక్తా + అంశుకే సరవతీ = ముత్యాలకిరణాలనే కేసరాలు (జాలు) గల; స్థిర వజ్ర దంష్ట్రా = కఠిన వజ్రాలనే కోరపండ్లుగల; ప్రహ్లాద సంపత్ + అనురూప హిరణ్యభేదా = ఆనందసంతృప్తికి - సమృద్ధికి - తగిన మంచి బంగారంగల / ప్రహ్లాదుని భక్తి సంపదకుయోగ్యమైన హిరణ్యకశిపుని చీల్చకలిగిన; (నీవు) నరసింహమూర్తేః = నరుని యొక్క సింహం యొక్క ఆకృతిగల; నాథస్య - స్వామికి; ఉచితా = తగిన; శ్రియః = లక్ష్మీదేవి యొక్క; మూర్తిః = దేహం; నూనం = నిశ్చయంగా = భవసి = అవుతున్నావు.

**తా॥** ఓ మాధవ పాదుకా! ముత్యాలకిరణాలనే కేసరాలూ, గట్టి వజ్రాలు అనే దంష్ట్రలూ కలిగి, ఆనంద సమృద్ధికి అనురూపమైన మేలిబంగారు లోహం కలిగిన నీవు, ప్రహ్లాదుని భక్తి సంపదకనుగుణంగా హిరణ్యకశిపుని వధించిన వానివై నరసింహమూర్తికి తగిన లక్ష్మీదేవి మూర్తివిగా ఉన్నావు.

వ్యాఖ్య:- నరసింహావతారంలో లక్ష్మీరూపమే పాదుక అని ఉత్ప్రేక్ష

శ్రీపతి నరసింహమూర్తిగా ఆవిర్భవిస్తే లక్ష్మీదేవి ఆడసింహంగా పాదుకా రూపాన్ని ధరించింది.

"దేవత్వే దేవ దేహేయం మనుష్యత్వేచమానుషీ!
విష్ణోర్దేహానురూపాంవైకరోత్యేషా ఒత్మనస్తనూమ్" !! (వి.పు)

దేవతామూర్తిగానో, మానవ మూర్తిగానో అవతరించే శ్రీమహావిష్ణురూపానికి అనురూపమైన స్వరూపాన్ని లక్ష్మీదేవి ధరిస్తుంది.

పాదుకలో ఉన్న ముత్యాలంకాతులే సింహానికి మెడమీద ఉన్న వెంట్రుకలు, కఠిన వజ్రాలే సింగపుకోరలు. భగవంతుడు ధరించడానికీ, భక్తులు ఆనందించడానికీ పుత్తడి గల పాదుకా రూపంలో, లక్ష్మి ఆడసింహమై ప్రహ్లాదుని భక్తి ననుసరించి హిరణ్యకశిపుని వధించింది. నరసింహమూర్తి కనురూపమైన లక్ష్మీదేవిమూర్తియే పాదుక. లక్ష్మికి నృసింహమూర్తియందు ఆదరం అధికం.

అవతారాల్లో 'లక్ష్మీరామ, లక్ష్మీకృష్ణ' పదాలు ప్రయోగింపబడలేదు. రామకృష్ణావతారల్లో మానవ ధర్మాలు అతిశయించడం వల్ల లక్ష్మీ పదం ప్రయుక్తం కాలేదు. హిరణ్యకశిపుడు "ఎక్కడ హరి"? అని ప్రహ్లాదుణ్ని అడిగినప్పుడు స్తంబోద్భవుడైన స్వామి 'నృసింహు'డని ప్రత్యేకంగా వాడడం వల్ల ప్రజలు భయపడుతారని, ఈ ఒక్క అవతారంలోమాత్రం, 'లక్ష్మీనృసింహ' పదం ప్రయుక్తమని విజ్ఞులంటారు. ముఖ్యంగా స్వామికి అనురూప్యాన్ని కల్పించడం శిల్పి చమత్కారం. శ్లేష రూపకోత్ప్రేక్ష సంకీర్ణం. వసంతతిలకావృత్తం.

*847. సంభావయంతి కవయ శ్చతురప్రచారాం*
*మంజుస్వనాం మహితమౌక్తిక పత్రలాంగీమ్ !*
*స్వాధీన సర్వభువనాం మణిపాదుకే! త్వాం*
*రంగాధిరాజ పదపంకజ రాజహంసీమ్ !!* 17

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! కవయః = కవులు / జలపక్షులు; చతురప్రచారాం = రమణీయమైన నడక కలిగిన; మంజు స్వనాం = ఇంపైన నాదంగల; మహితమౌక్తిక పత్రల+అంగీం = శ్రేష్ఠమైన ముత్యాలనే రెక్కలోకూడిన శరీరం కలిగిన; స్వ + అధీన సర్వభువనాం = తన వశమైన సమస్తలోకాలు / జలంకలిగిన; త్వాం = నిన్ను; రంగ + అధిరాజ పదపంకజ రాజహంసీం = శ్రీరంగరాజు యొక్క పాదకమలాల యందలి ఆడమాంసగా; సంభావయంతి = భావిస్తుంటారు.

**తా॥** ఓ రత్నపాదుకా! కవులు అనే నీటి పక్షులు, ఆకర్షణీయమైన నడక, మధురమైన ధ్వని, ఆణిముత్యాలనే రెక్కలు కలిగినదేహమూ కలిగి లోకాలన్నిటిని / జలాన్నంతటిని వశంచేసుకొన్న నిన్ను శ్రీరంగరాజపాదరసీరుహాలయందు విహరించే రాజహంసిగా ఊహిస్తాయి.

వ్యాఖ్య:- పాదుక రాజహంసిగా, శ్లేషరూపకాలతో ఉత్ప్రేక్షితం

కవులు క్రాంతదర్శులు. పదాలను ఏర్చికూర్చే ప్రతిభావంతులు,

'క' అంటే 'నీరు'. 'వి' అంటే పక్షి. "కంశిరో ఒంబునోః" (అమరం) '

"వి శ్చక్షుషి వ్యోమ్ని వాతే పరమాత్మని పక్షిణి" (విశ్వ.ని.)

సమానస్వరూప స్వభావాలను బట్టి పాదుక, రాజహంసిగా వర్ణితం.

1. రమణీయ గమనం కలది పాదుక. ఒయ్యారంగా నడిచేది రాజహంసి.
2. పాదుకాంతర్గత మణులనాదం శ్రవణానందంగా ఉంటుంది. రాయంచకులుకుతుంటె డెందం స్పందిస్తుంది.
3. పాదుక ఆకృతి, ఆణిముత్యాల పంక్తులచేత తెల్లగా ఉంది. రాయంచ మేను తెల్లని రెక్కలచేత ధవళంగా ఉంది.

4. పాదుకకూ. రాయంచకూ 'భువన' మంతాస్వాధీన మయిఉంది. భువనమంటే 'జగత్తు', 'జలం' అని కూడా అర్థం.

"విష్టపం భువనం జగత్" "జీవనం భువనం వనమ్" (ఉభయత్ర అమరం) నీటియందు తామర పూవుల్లో విహరించే రాజహంసిని జలపక్షులన్నీ గౌరవిస్తాయి. అలాగే కవులు శ్రీరంగరాజ పదపంకజాల్లోన డయాడే పాదుకాదేవిని ప్రతిభతో, భక్తి ప్రపత్తులచేత, ప్రస్తుతిస్తారు. భగవత్పాదాలే తామరపూవులు. వాటి నాశ్రయించి ఉండే పాదుక, స్త్రీ వాచక మైనందువల్ల, రాజహంసియే, అని సంభావన – వసంతతిలకావృత్తం.

*848. ముక్తామయూఖరుచిరాం మణిపాదరక్షే!*
*మంజుస్వనాం మణిభి రాహిత వర్ణవర్గామ్ !*
*మన్యేముకుంద పదపద్మ మధువ్రతీనా*
*మన్యా మకృత్రిమగిరా మధిదేవతాంత్వామ్ ॥ 18*

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! ముక్తామయూఖరుచిరాం = ముత్యాలకాంతులచే ప్రకాశించే ముక్త+అనుమయూఖ రచిరాం = వదలబడిన కాంతిలేమి (చీకటి) కల్గి, శుద్ధమైన; మంజుస్వనాం = ఇంపైన నాదంగల; మణిభిః = రత్నాలచేత; అహిత వర్ణవర్గాం = సంపాదింపబడిన, వన్నెలసముదాయం గల / అక్షర సమూహం గల; త్వాం = నిన్ను; ముకుంద పదపద్మమధు ప్రతీనాం = భగవత్పాదాలనే తామరపూవులందున్న తుమ్మెదలను పోలిన; అకృత్రిమ గిరాం = అపౌరుషేయ వాక్కులు గల వేదాల యొక్క; అన్యాం = మరొక; అధి దేవతాం = అధిష్ఠాన దేవతగా; మన్యే = తలుస్తాను.

**తా॥** ఓ మణిపాదుకా! ముత్యాలకాంతులచే శోభించే, మధురనాదంగల, అనేక మణులచే కలిగిన వన్నెల సమూహంగల నిన్ను; కాంతిలేమిని విడిచిన శుద్ధమైన అక్షర సముదాయంగల, భగవత్పాదకమలాల్లో ఉన్న తుమ్మెదలను పోలిన శ్రుతులయొక్క విలక్షణమైన అధిదేవతగా అనుకొంటాను.

వ్యాఖ్య:– పాదుక వేదవిద్యాధిష్ఠాన దేవతగా, శ్లేషతో ఉత్ప్రేక్షితం

1. పాదుక ముత్యాలకాంతులచే శోభిస్తుంది.
   వేద వాగ్దేవత కాంతిలేమిని విడిచినట్టిది, అంటే అజ్ఞానాంధకారాన్ని తొలగించే జ్ఞాన తేజస్సుతో ఎల్లప్పుడు ప్రకాశిస్తుంది.

2. మణిపాదుక మధుర నాదం కలది
   వాగ్దేవి హంసధ్వనిలాగా రమణీయ శబ్దం కలది.

3. పాదుక మణులు కూర్చే వన్నెల చిన్నెలతో రాణిస్తుంది.
   విద్యాధిదేవత వర్ణసమామ్నాయంలోని కవర్గ, చవర్గాదులచే భాసిస్తుంది.

4. తామరపూల తేనెను ఆస్వాదించే మధువ్రతుల - తుమ్మెదల - వలె ముకుందుని పాదారవింద మకరందాన్ని అనవరతం ఆస్వాదిస్తుంది పాదుక. 'రసోవైసః' - "విష్ణోఃపదే పరమే మధ్వ ఉత్సః" శ్రుతిరీత్యా రంగనాథుడు రసమయుడుకదా!

అకృత్రిమ వాక్కులే శరీరావయవాలుగా గలిగి, వేద విద్యాధిదేవతకున్న గుణాలన్ని ఉండడం వల్ల, ఈ పాదుక ఆ ప్రసిద్ధ అధి దేవతకంటె విలక్షణమైన వేదవిద్యాధిష్ఠాన దేవత, అని ఉక్తి చమత్కృతి.

"ప్రీతేన దేవి విభునా ప్రతిపాదనీయాం" (845) అనే శ్లోకం మంత్రపరమైన విద్యను కీర్తించింది. ఈ శ్లోకం వేద విద్యాధిదేవతామూర్తిని సంభావించింది. వసన్త తిలకావృత్తం.

*849. ఆసాద్య కేకయసుతా వరదానమూలం*
*కాలం ప్రదోషమనిరీక్ష్య రమాసహాయమ్ ।*
*మంజుప్రణాదరహితా మణిపాదరక్షే ।*
*మౌన వ్రతం కిమపి నూన మవర్తయస్త్వమ్ ॥* 19

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! కేకయసుతా వరదానమూలం = కైకేయికి వరమిచ్చిన కారణమైన; అనిరీక్ష్య రమాసహాయం = కనబడని సీతా సమేతుడైన రాముడుగల; ప్రదోషం = మిక్కిలి దోషమున్న ప్రదోషమనబడే; కాలం = వేళను; ఆసాద్య = పొంది; మంజు ప్రణాద రహితా = మధురనాదశూన్యవై ఇంపుగా మాటాడకున్న; త్వం = నీవు; కిం, అపి = ఏదో విలక్షణమైన; మౌనవ్రతం = మౌనవ్రతాన్ని; నూనం = నిశ్చయంగా; అవర్తయః = అనుష్ఠించి నట్లున్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! కైకేయికి వరమిచ్చిన కారణంగా సీతారాములను సేవించరాని దోషభూయిష్ఠమైన ఒక ప్రదోషకాలం వచ్చినప్పుడు నీవు, మధుర నాదాలాపన లేకుండా ఏదో విలక్షణమైన మౌనవ్రతాన్ని అనుషించినట్లున్నావు.

వ్యాఖ్య:- పాదుక ప్రదోష కాలాన మౌనవ్రతాన్ని పాటించినట్లు ఉత్ప్రేక్ష

కేకయదేశపు రాజకూతురు కైకేయి. (కేకయ శబ్దానికి అపత్యార్థకం 'అణ్' చేరి, స్త్రీ ప్రత్యయం రాగా, 'కైకయీ' రూపం సిద్ధిస్తుంది. వైకల్పికమైన 'ఇయాదేశం' వల్ల కైకేయీ' శబ్దం ఏర్పడుతుంది. "ప్రాక్ కైకయీతో భరత స్తథా ఽభూత్" భట్టి కావ్యం)

దశరథుడు కైకేయికి వరమిచ్చాడు. తత్ఫలితంగా శ్రీరాముడు సీతాసమేతుడై వనవాసం చేశాడు. కోసల దేశ వాసులకు సీతా రామసందర్శన భాగ్యం లేని కాలం దోషభరితమయింది. కాబట్టి, పాదుకాదేవి అయోధ్యానగర రాజ సింహాసనమందు నిశ్చలంగా, నాదరహితంగా ఉండడానికి కారణం అది 'ప్రదోష కాలం' అవడమే. ప్రదోషం శ్లిష్టపదం. "ప్రదోషా రజనీ ముఖమ్' (అమరం) సూర్యుడు అస్తమించే సమయాన్ని 'ప్రదోష' మంటారు.

"అనిరీక్ష్య రమాసహాయమ్" - శ్రియః పతిని ప్రదోషకాలాన 'త్రయోదశి' తిథి ఉన్నప్పుడు సేవించకూడదు.

"నప్రదోషే హరింపశ్యేత్" అని నిషేధముంది. కాబట్టి ఆ సమయంలో ఏ వ్యవహారంచేయకుండా, మౌన దీక్షను పాటించాలి. అని శాస్త్రం విధించింది.

పాదుక శాస్త్ర మర్యాదను అనుసరించి ప్రదోషకాలంలో మౌన వ్రతాన్ని అనుష్ఠించడం, భగవద్దర్శనం చేయరాని మహాదోషకాలం దాపురించిందని చింతతో మాటాడకుండడం ఉక్తివైచిత్రి.

'నాద పద్ధతి'లో నాదం లేకపోవడమూ (442 నుంచి 444) నాదపద్ధతి విశేషమయినట్లే ఈ ప్రకీర్ణ పద్ధతిలోనూ అలాంటి నాదపద్ధతిని శాస్త్రపద్ధతిలో వర్ణించడం రమణీయం. వసంత తిలకావృత్తం.

*850. వైడూర్య రమ్యసలిలామహితా మరుద్భి*
*శ్ఛాయావతీమరకతోపల రశ్మి జాలైః*
*అశ్రాంతమోహపదవీ పధికస్యజంతో*
*ర్విశ్రాంతి భూమిరివ శౌరి పదావని! త్వమ్!!* 20

**అర్థం:-** హే శౌరి పదావని = ఓ భగవత్పాదుకా! వైడూర్యరమ్య సలిలా = వైడూర్య రత్నాలనే స్వచ్ఛమైన జలంకలిగిన; మరుద్భిః = దేవతలచేత / గాలులచేత; మహితా = పూజింపబడే / సేవింపబడే! మరకత + పల రశ్మిజాలైః = పచ్చల (రాళ్ళ) కిరణసముదాయాలచేత; ఛాయా వతీ = కాంతి కలిగిన / నీడకలిగిన; త్వం = నీవు; అశ్రాంత మోహ పదవీ పధికస్య = ఎప్పుప్పుడు మోహమార్గమందు సంచరించే; జంతోః = శరీరి యొక్క; విశ్రాంతి భూమిః ఇవ = విశ్రమస్థల మన్నట్లున్నావు.

**తా॥** ఓ భగవత్పాదుకా! వైడూర్యాల్లాగా శుభ్రంగా ఉండే, దేవతలచే పూజింపబడే, మరకతమణులకిరణ సముదాయాలచేత కాంతి కలిగిన నీవు, ఎల్లప్పుడు విషయాసక్తమైన దారిలో నడిచే దేహధారికి వైడూర్యాలనే తేటనీరు, గాలులువీచే, పచ్చలకాంతి అనే నీడ కలిగిన విశ్రాంతి స్థలమన్నట్లున్నావు.

వ్యాఖ్య:- పాదుక, తెరువరి విశ్రమించే స్థానంగా శ్లేషతో ఉత్ప్రేక్షితం

వేడూర్యాలే రమ్యసలిలాలు "వైడూర్యం వాలవాయజమ్" (వి.ని.) తెల్లని అందమైన మగరాయి వైడూర్యం. 'మరుత్' పదానికి దేవతలనీ, గాలి అనీ అర్థం. "మరుద్దేవే సమీరే స్యాత్" (వి.ని.)

'అశ్రాంత' పదం 'సంతత' పదానికి పర్యాయపదం.

"సతతానారతాశ్రాంత సంతతావిరతానిశమ్" (అమరం)

దూరమార్గసంచారం చేసిన బాటసారి నీరు, గాలి, నీడ ఉన్న స్థలంలో విశ్రమిస్తే, అతని బడలిక సడలిపోతుంది. సుఖం కలుగుతుంది. దేహమే ఆత్మ అని భ్రమించి అజ్ఞాన మార్గంలో పయనించే సంసారులకు విశ్రమస్థానమైన పాదుక వారికి సుఖాన్ని చేకూరుస్తుంది.

ఏకాంత, పరమైకాంత భక్తులు పాదుకాదేవి సన్నిధిలో ముక్తికోసం ప్రార్థిస్తారు. సంసారులకు శాశ్వతానందాన్ని - జన్మరాహిత్యాన్ని - ప్రసాదిస్తుంది పాదుకాదేవి. వసన్త తిలకావృత్తం.

*851.* ఆద్యోరఘుక్షితి భుజా మభిషేక దీప్తై
రాప్యాయిత స్తవ పదావని! రశ్మిజాలైః !
మందీచకార తపనో వ్యపనీత భీతి
ర్మండోదరీ వదన చంద్రమసో మయూఖాన్ !! 21

**అర్థం:-** హే పదావని = ఓ పాదుకా! రఘుక్షితి భుజాం = రఘు వంశ రాజులకు; ఆద్యః = మూలపురుషడైన; తపనః = సూర్యుడు: అభిషేక దీప్తైః = అభిషేకంచేత బాగా ప్రకాశించిన; తవ = నీ యొక్క; రశ్మిజాలైః - కిరణ సమూహాలచేత: ఆప్యాయితః = పుష్టినొందినవాడై: వ్యపనీత భీతిః = తొలగిన భయంకలవాడై: మండోదరీ వదన చంద్ర మసః = రావణుని పత్నియైన మండోదరి ముఖమనే చంద్రుని యొక్క: మయూఖాన్ = కిరణాలను: మందీచకార = తగ్గించెను.

**తా॥** ఓపాదుకా! రఘువంశ మూలపురుషుడైన సూర్యుడు, అభిషేకం చేత బాగా ప్రకాశించిన నీ కాంతిపుంజం చేత పుష్టిని పొంది, భయం వీడి మండోదరీ ముఖ చంద్రకాంతులను మందగింపజేశాడు.

వ్యాఖ్య:- అభిషిక్తమణి పాదుకా కిరణాలచేత సూర్యుడు తపనుడయ్యాడు

రాత్రి చంద్రకాంతి బాగా ఉంటుంది. పగలు వెలిగే సూర్యుని కాంతి చేత చంద్రకాంతి తగ్గుతుంది. ఈ ప్రాకృతిక విషయాన్ని పాదుకా మహిమగా చిత్రీకరించడం కావ్య శిల్పనైపుణ్యం.

పాదుకకు పట్టాభిషేకమయింది. శ్రీరాముని వనవాసం నిరాటంకంగా సాగింది. రాక్షసులకు భీతి పెరిగింది. రఘువంశ కూటస్థుడైన సూర్యునికి భయం తొలగింది.

పాదుకా పట్టాభిషేకానంతరం పాదుకా రత్నాలకాంతి ఉజ్వలంగా పలుదెసల ప్రసరించడం వల్ల సూర్యునికీ శక్తి పెరిగింది. వంశాభిమానం పెల్లుబికింది. సూర్యుడు ప్రచండ ప్రతాపంతో లంకేశుని ధర్మపత్నియైన మండోదరి యొక్క ముఖమనే చంద్రుని కాంతిని పాలిపోయే లాగా చేశాడు.

"తమేవ భాంతమను భాతి సర్వం, తస్యభాసా సర్వమిదం విభాతి". శ్రుతి పలికినట్లు భగవత్పాదుకారత్నాలకాంతి కిరణాలు ప్రసరించిన (Charged) కారణంగా సౌరశక్తి పెరగడం గమనీయం ముఖాన్ని చంద్రునితో తాదాత్మ్యం చేయడం రూపకం. రావణుడు నశించిన తర్వాత మండోదరి వదనంలో కలిగిన దైన్యమే చంద్ర కిరణాల కాంతి తగ్గినట్లుగా అధ్యవసింపబడింది. ఆకాంతి కిరణాల్నీ భావనకు పాదుకా రత్నకాంతి కిరణాల ప్రసారం వల్ల పుష్టిని పొందిన సూర్యుడే హేతు వనడం, హేతూత్ప్రేక్ష. వసంతతిలకావృత్తం.

852. మాన్యా సమస్త జగతాం మణి భంగనీలా
పాదే నిసర్గ ఘటితా మణి పాదుకే! త్వమ్
అంతః పురేషు లలితాని గతాగతాని
ఛాయేవ రంగనృపతే రనువర్తసే త్వమ్ 22

**అర్థం:-** హే మణి పాదుకే = ఓ రత్నపాదుకా! సమస్త జగతాం = సొకలలోకాలకు; మాన్యా = పొగడదగిన; మణిభంగనీలా = మణిఖండాలచేత మణుల శకలాల్లాగా, నల్లనైన; పాదే = శ్రీరంగరాజ పాద మందు; నిసర్గ ఘటితా = స్వభావం చేత బద్ధమైన; త్వం = నీవు; అంతఃపురేషు = శుద్ధాంతాల్లో; లలితాని = రమ్యమైన; రంగనృపతేః = రంగభూపతియొక్క; గత + ఆగతాని = పోరాములను; ఛాయా, ఇవ = నీడవలె; త్వం = నీవు; అనువర్తసే = అనుసరిస్తున్నావు.

**తా॥** ఓ మణి పాదుకా! సమస్త లోకాలచే పొగడదగిన దానవై నీవు శ్రీ రంగపతి పాదాలకు సంఘటితవై ఇంద్ర నీలమణి శకలాల్లాగా స్వభావం చేతనే నల్లగా ఉన్నావు. శ్రీరంగరాజు అంతఃపురాల్లో అటూ ఇటూ సంచరిస్తుంటే నీవు ఆయన నీడవలె అనుసరిస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుక, శ్రీరంగనాథుని ఛాయవలె అనువర్తించే వర్ణన

శ్రీరంగనాథుని పాదాలను విడువకుండా పాదుక, ఇంద్ర నీలమణి ఖండాలచేత నల్లగా ఉండి స్వామి నీడ లాగా కనబడుతుంది. స్వామి యొక్క ఇతరావయవాల నీడకూడ నల్లగా ఉంది. కేవలం పాదాలకే పాదుక ప్రతినిధి కాక మొత్తం దివ్య మంగళమూర్తికే నీడలాగా ఉంది. ఆ రాజు అంతఃపురాల్లో సంచరిస్తున్నప్పుడు కూడా పాదుక ఆయన ఛాయ లాగా అనువర్తిస్తున్నది. శ్లేష సంకీర్ణోపమాలంకారం. వసన్త తిలక వృత్తం.

853. రంగాధిరాజ పదపంకజమాశ్రయంతీ
హైమీ స్వయం పరిగతా హరినీలరత్నైః !
సంభావ్యసే సుకృతిభి ర్మణి పాదుకే! త్వం
సామాన్య మూర్తి రివ సింధు సుతా ధరణ్యోః !! 23

**అర్థం:-** హే మణి పాదుకే = ఓ రత్నపాదుకే = ఓ రత్నపాదుకా! రంగ + అధిరాజ పదపంకజం = శ్రీరంగరాజ పాదకమలాన్ని; ఆశ్రయంతీ = ఆశ్రయిస్తూ; స్వయం = స్వయంగా; హైమీ = స్వర్ణమయమైన; హరినీల రత్నైః = ఇంద్రనీల భాగ్యవంతులచేత; సింధుసుతా ధరణ్యోః = శ్రీభూపిరాట్టులయొక్క; సామాన్యమూర్తిః, ఇవ = సాధారణ ఆకృతి వన్నట్లు; సంభావ్యసే = ఊహింపబడుతున్నావు.

**తా॥** ఓ మణి పాదుకా! శ్రీ రంగపతి పాదకమలాల నాశ్రయిస్తూ కాంచనమయిలై ఇంద్రనీలమణులతో పరివ్యాప్తమైన నీవు, లక్ష్మీదేవి మరియు భూదేవి యొక్క (ఇరువురి) శరీరాలను సమానంగా పోలియున్న ఒకే మూర్తి వన్నట్లు ధన్యాత్ములచే భావింపబడుతున్నావు.

వ్యాఖ్య:- పాదుక, శ్రీ భూదేవ్యు భయాధిష్ఠితైక మూర్తి అని ఉత్ప్రేక్షితం.

శ్రీ భూదేవతలు ఇర్వురు శ్రీరంగనాథుని పాదకమలాలకు ఉపచారం చేస్తుంటారు. పాదుకాదేవి స్వయంగా కాంచనమయి కాబట్టి స్వర్ణకాంతితో ప్రకాశించే లక్ష్మీదేవి రూపాన్ని పోలింది. శతమఖమణి దీప్తులతో శోభించే పాదుక తమోమయియైన భూదేవి రూపాన్నీ పోలింది. లక్ష్మీ ధరణుల మూర్తులను సమానంగా ధరించిన ఒకే మూర్తిగా పాదుకాదేవి ప్రకాశిస్తున్నది. 'అఘటిత ఘటన'ను 'ఇవ' స్ఫురింప జేస్తుంది. వసన్త తిలకావృత్తం.

*854. అభ్యర్చితా సుమనసాం నివహై రజస్రం*
*ముక్తారుణోపల నఖాంగుళి పల్లవ శ్రీః!*
*శ్రేయస్కరీం మురభిదశ్చరణ ద్వయీవ*
*కాంతిం సమాశ్రయసి కాంచన పాదుకే! త్వమ్!!* 24

**అర్థం:-** హే కాంచన పాదుకే = ఓ స్వర్ణపాదుకా! అజస్రం = ఎల్లప్పుడు; సుమనసాం = దేవతల యొక్క / పూవుల యొక్క; నివహైః = సమూహాలచేత; అభ్యర్చితా = పూజింపబడిన / అర్చింపబడిన; ముక్తా + అరుణ + ఉపలనఖ + అంగుళి పల్లవశ్రీః = ముత్యాలచేత, పద్మరాగమణులచేత, గోళ్ళ చిగుళ్ళ లాంటి వ్రేళ్ళ శోభకలిగిన; త్వం - నీవు; మురభిదః = మురాంతకుని యొక్క; చరణద్వయీ, ఇవ = రెండు పాదాలవలె; శ్రేయస్కరీం సకల ఫలాలనిచ్చే / మోక్షహేతువైన; కాంతిం = తేజస్సును; సమాశ్రయసి = పొంది ఉన్నావు.

**తా॥** ఓ చాంపేయ పాదుకా! సదా దేవతలచేత పూజింపబడుతూ ముత్యాలచే, కెంపులచే శోభించేనీవు, పూలచే అర్చింపబడుతూ గోళ్ళచేతనూ చిగుళ్ళలాంటి వ్రేళ్ళచే శోభించే మురాంతకుని పాదద్వయి లాగా శ్రేయస్కరమైన తేజస్సును కలిగి ఉన్నావు.

వ్యాఖ్య:- భగవత్పాదద్వయి వలె పాదుక శ్రేయస్కరిగా వర్ణితం

భగవత్పాదాలూ, పాదుకలూ దేవతలచేత పూలచేతనూ పూజింప బడుతూ సకల ఫలాలను ప్రసాదిస్తాయి. పాదాలకూ, పాదుకలకూ శ్లేషతో మనోహర సాదృశ్యం కల్పితం.

పాదుకల(ల)కు గోళ్ళను పోలిన తెల్లని ముత్యాలూ, వ్రేళ్లను పోలిన పద్మరాగమణులూ ఉన్నాయి. పాద్వయికీ ముత్యాలవలె తెల్లని గోళ్లు కెంపులవలె అంగుళి పల్లవాలున్నాయి. చరణావనికీ, చరణద్వయికీ ఉన్న కాంతికి అభ్యర్చితత్వమూ శ్రీ మత్త్వమూ శ్రేయస్కరత్వమూ సమానంగా సంపన్నమయినవి. ఉపమాలంకారం అభ్యర్చితత్వమూ, శ్రీమత్త్వమూ శ్రేయస్కరత్వమూ సమానంగా సంపన్నమయినవి. ఉపమాలంకారం. వసంతతిలకావృత్తం.

*855. నిర్ఘృష్ట గాత్ర రుచిరా మణి పాదుకే! త్వం*
*స్నాతానులేప సురభి ర్నవమాల్యచిత్రా!*
*ప్రాప్తే విహారసమయే భజసే మురారేః*
*పాదారవింద పరిభోగ మనన్య లభ్యమ్ ॥* 25

అర్థం:-హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! నిర్మృష్టగాత్ర రుచిరా = శోధింపబడి నిర్మలమైన శరీరంచేత అందమైన; స్నాతా = అభిషిక్తయైన / స్నాం చేసిన; అనులేపసురభిః = చందనలేపనం చేత పరిమళించే; నవమాల్యచిత్రా = కొత్త మాలికలచేత ఆశ్చర్యమైన; త్వం = నీవు; విహారసమయే = విహరించే క్రీడించే సమయం; ప్రాప్తే = పొందినప్పుడు; అనన్యలభ్యం = ఇతరులకెవ్వరికీ పొందరాని; మురారేః = మురవైరియొక్క; పాదారవింద పరిభోగం = కమలాల వంటి పాదద్వయి యొక్క, / స్పర్శజన్య / రతిజన్యసుఖాన్ని; భజసే = పొందుతున్నావు.

తా॥ ఓ మణి పాదుకా! శోధింపండి శుభ్రమైన శరీరంతో అందమైన, అభిషిక్తవై చందన చర్చచేత సౌగంధ్యం కలిగి కొత్త మాలికలచే చిత్రంగా ఉన్న నీవు, తుడిచి శుభ్రంచేసి దేహం చేత అందమై, స్నానంచేసి గంధపు పూతచే సువాసన కలిగి నూతన మాలికలచే అకర్షణీయమైన నాయికలాగా ఉన్నావు.

నీవు సంచార వేళలో భగవత్పాదారవింద స్పర్శజన్య సుఖాన్ని, క్రీడావేళలో ఇతరులకు పొందరాని మురారి పాదకమలమనే పురుషుని రతి వల్ల కలిగిన సుఖాన్ని పొందే నాయిక వలె ఉన్నావు.

వ్యాఖ్య:- పాదుక క్రీడాసక్త నాయికగా, సమాసోక్తిచే వర్ణితం

భగవత్పాదంతో కూడి భోగాన్ని అనుభవించే ప్రియతమ నాయిక పాదుక భోగం కంటె ముందే శరీరాన్ని అలంకరించుకొన్న నాయిక, క్రీడాసమయంలో పాదస్పర్శ అనే రతిజన్య సౌఖ్యాన్ని పొందుతున్న వృత్తాంతం వర్ణితం. వసన్త తిలక.

*856. నాదే పదావని! తథాతవ సన్నివేశే*
*నిర్వేశన క్రమ మసహ్యమపాచికీర్షుః !*
*యై రేవ లోచనశతై రభివీక్షతే త్వాం*
*తై రేవ పన్నగ పతిః శ్రుతిమాన్ బభూవ ॥ 26*

అర్థం:- హే పదావని = ఓ పాదుకా! తవ = నీ యొక్క, నాదే = నాదమందు; తథా = అలాగే; సన్నివేశే = ఉనికి యందు; అసహ్యం = ఓర్చుకోరాని; నిర్వేశన క్రమం = అనుభవం యొక్క పద్ధతిని; అపాచికీర్షుః తొలిగింపకోరిన; పన్నగ పతిః = సర్పరాజు; యైః, ఏవ, లోచన శతైః = ఏ వందల కన్నుల చేతనే; త్వాం = నిన్ను; అభివక్షతే = చూస్తాడో; తైః+, ఏవ = ఆ కన్నులతోనే; శ్రుతిమాన్ = చెవులుకలవాడు; బభూవ = ఆయెను.

తా॥ ఓ పాదుకాః నీ నాద విషయమై, అలాగే విగ్రహ సంస్థాన విషయమై సహించరాని అనుభవ క్రమాన్ని తొలగింప కోరిన శేషుడనే సర్పరాజు ఏ రెండు వేల కన్నులచే నిన్ను భక్తితో దర్శిస్తాడో ఆ కన్నులే చెవులుగాకల వాడైనాడు.

వ్యాఖ్య:- పాదుక, ఆదిశేషుని మనో రథాన్ని సిద్ధింపజేసిన వర్ణన

చెవులకు నాదమాధుర్యం, కన్నులకు రూపసౌందర్యం గోచరిస్తుంది. ఏ ఇంద్రియం మీద మనస్సు సమాహిత మవుతుందో, ఆ ఇంద్రియం తన విషయాన్ని చక్కగా గ్రహిస్తుంది. కాబట్టి రెండు ఇంద్రియాలు తమ విషయాలను ఏకకాలంలో అనుభవించి తృప్తి పొందజాలవు. ఈ నాదరూప సౌందర్యాలను, ఒకదాని తర్వాత మరొక్కటిని అనుభవించే క్రమం - కాలవ్యవధానం - భరించరానిది.

సహస్ర ఫణామణిమండల మండితుడైన ఆదిశేషునికి నాద సన్నివేశాలను ఒకే సపమయంలో అనుభవించాలనే కోరిక కలిగింది. అయితే ముందు వెనుక అనే కాల వ్యవధితో అనుభవించే సహించరాని పరిపాటి పాదుకాను గ్రహంవల్లనే తొలగి పోతుందని తెలిసి, రెండువేల కన్నులతో పాదుకాదేవిని కడు భక్తి ప్రపత్తులచే సేవించాడు. పాదుకను దర్శించిన పన్నగపతి కన్నులే చెవులయ్యాయి. రూపు సౌందర్యాన్నీ పాదుకాంతర్మణుల రవళినీ ఏకకాలంలో అనుభవించే శక్తి సర్పరాజుకు కలిగింది. పాదుకానుగ్రహం వల్ల ఆశక్తి సర్పజాతి కంతటికీ ప్రభవించింది. కాబట్టి, సర్పాలకు 'చక్షుశ్రవసు'లన్న పేరు అన్వర్థమయింది.

సహజమైన 'చక్షుశ్రవస్త్వా'నికి ఆదిశేషుడు పాదుకానాద, రూపసంని వేశాలనేకకాలంలో అనుభవింపగోరడం హేతువుగా సంభావింపబడింది. వసంతతిలకావృత్తం.

*857. పాదావని! స్ఫుటమయూఖ సహస్ర దృశ్యా*
*విష్ణోః పదేన భవతీ విహిత ప్రచారా!*
*త్వద్భక్తి యంత్రిత జన ప్రథమస్య శంభో*
*ర్వైకర్తనీ మనుకరోతి విహారమూర్తిమ్!!* 27

**అర్థం:-** పాదావని = ఓ పాదుకా! స్ఫుటమయూఖ సహస్ర దృశ్యా = బాగా ప్రకాశించే వేయికిరణాలచే చూడముచ్చటగా ఉన్న; విష్ణోః, పదేన = విష్ణువు యొక్క చరణం చేత / ఆకాశం చేత; విహిత ప్రచారా = చేయబడిన సంచారం గల; భవతీ = నీవు; త్వత్ + భక్తియంత్రిత జన ప్రథమస్య = నీయందలి భక్తిచే పశులైన జనులలో శ్రేష్ఠుడైన; శంభోః = పరమశివునియొక్క; వైకర్తనీం = వికర్తను - సూర్యు-నికి సంబంధించిన; విహారమూర్తిం = లీలావిగ్రహాన్ని; అనుకరోతి = అనుకరిస్తున్నావు.

**తా॥** ఓ పాదుకా! ప్రకాశించే కిరణ సహస్రంచే రమ్యమైన, విష్ణుపదంచేత సంచరించే నీవు, నీ పట్ల భక్తి పరవశులైన జనులలో అగ్రేసరుడైన పరమశివుని సూర్యమండలాత్మకమైన లీలా మూర్తిని పోలి ఉన్నావు.

వ్యాఖ్య:- పాదుక, అష్టమూర్తిలోని సూర్యమండలాకృతితో సదృశమని వర్ణితం

పాదుక అనేక మణుల కిరణాలతో స్ఫుటంగా ప్రకాశిస్తుంది.

సూర్యమండలం సహస్ర కిరణాలతో వెలుగుతుంది.

విష్ణుపాదాలతో సంచరించేది పాదుకామూర్తి

ఆకాశంలో పయనించేది వికర్తన మూర్తి. సామ్యంమనోహరం. గత శ్లోకంలో శేషవృత్తి - కైంకర్యాసక్తి - వర్ణింపబడింది కదా!

భగవద్భక్తులలో మొదట ఎన్నదగిన దేవతామూర్తి పరమశివుడు.

"నిమ్నగానాం యథా గంగా దేవానా మచ్యుతోయథా!

వైష్ణవానాం యథాశంభుః పురాణానా మిదంతథా !! (భాగవతం, 12 స్కం.)

నదులలో గంగ, దేవతలలో విష్ణువు, విష్ణు భక్తులలో శంభుడు, పురాణాలలో శ్రీమద్భాగవతం శ్రేష్ఠం. "యథా సరిద్వరాగంగా వైష్ణవానామహం తథా" (శ్రీరంగమాహాత్మ్యం) నదులలో కెల్ల గంగ శ్రేష్ఠమైనట్లే నేను వైష్ణవుల్లో ప్రథముడను" నారదునితో శివుడన్న మాట.

భగవత్పాద కైంకర్య రతిని - శేషవృత్తిని - అనుగ్రహించడం కోసం పాదుక, శివుని లీలా మూర్తులైన ఎనమండుగురిలో ఒకడైన సహస్రకిరణుని సామ్యాన్ని పొందింది. అష్టమూర్తి రహిర్బుధ్న్యో మహాకాలో మహానటః' (అమరం)

"జలం వహ్నిస్తథా యష్టా సూర్యాచంద్ర మసౌతథా !

ఆకాశం వాయురవని ర్మూర్తయో ఽ ష్టౌ పినాకినః !!

భూమి, అగ్ని, జలం, వాయువు, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, యజమానుడు, అనే (8) ఎనమిది మూర్తులు శివునిలో అంతర్భవించి ఉన్నాయి.

శివుడు నమస్కరిస్తున్నప్పుడు 'నీవు నీ సూర్య రూపంతో భగవత్పాదాలను స్థిరంగా ఆశ్రయించావు. నేనూ సూర్యమూర్తినే సుమా!' అని పాదుక, పరమశివుని శేష తైక రతిని ఆశ్వాసిస్తున్నది. ఉపమాలంకారం. వసంత తిలకావృత్తం.

*858. రాజ్యేవనే ఽపి రఘువీర పదోచితాయాః*
*సంస్మృత్య గౌతమవధూ పరిరక్షణం తే!*
*మన్యే సమాహితధియో మణిపాదుకే! త్వాం*
*మూర్ధ్నా భజం త్యనుదినం మునిధర్మదారాః !! 28*

అర్థం:- హే మణి పాదుకే = ఓ మణి పాదుకా! మునిధర్మదారాః = ఋషుల ధర్మపత్నులు; రాజ్యే = రాజ్యమందు; వనే, అపి = అడవియందుకూడ; రఘువీర పద + ఉచితాయాః = శ్రీరాముని స్థానానికి / చరణానికి తగిన; తే = నీ యొక్క; గౌతమ వధూ పరిరక్షణం = గౌతముని పత్నియైన అహ్యలయొక్క ఉజ్జీవనాన్ని; సంస్మృత్య = స్మరించి; సమాహితధియః = నిశ్చలమనస్సుకలవారై; త్వాం = నిన్ను; అనుదినం = ప్రతిదినం; మూర్ధ్నా = శిరస్సుచేత; భజంతి = సేవిస్తున్నారు; మన్యే = అనుకొంటాను.

తా॥ ఓ రత్నపాదుకా! మునుల పత్నులు రాజ్యమందుగానీ, వనమందుగానీ శ్రీరాముని పదసంబంధ యోగ్యతగల నీవు గౌతమహర్షి భార్యయైన అహల్యను రక్షించిన ప్రవృత్తిని తలచి సమాహితమనస్కలై నిన్ను ప్రతిదినం పూజిస్తుంటారని భావిస్తాను.

వ్యాఖ్య:- అహల్యను ఉజ్జీవింప జేసిన పాదుకకు ముని పత్నులు ప్రణమిల్లే వర్ణన

శ్రీరామపద సంబంధం వల్ల పాదుకకు ప్రజలను రక్షించే యోగ్యత కలిగింది. కోసల రాజ్యాన్ని రక్షింప దగియున్నట్లు, అడవిలో కూడా శ్రీరాముని చరణమందు ఉండి అహల్యను కాపాడింది పాదుక. కాబట్టి మునుల ధర్మపత్నులు అహల్యా రక్షణ వృత్తాంతాన్ని స్మరిస్తూ పాదుకాదేవికి ప్రతిదినం తలవంచి నమస్కరిస్తుంటారు.

ముని పత్నులు సావధాన చిత్తలై భక్తితో శిరసాభజించడానికి, పాదుక అహల్యను పరిరక్షించిన చింతనయే హేతువుగా ఉత్ప్రేక్షింపబడినది. వసన్త తిలకావృత్తం.

*859 త్వా మాశ్రితో మణిమయూఖ సహస్ర దృశ్యాం*
*త్వచ్ఛింజితేన సహరంగపతిః సముద్యన్ !*
*ఆశంక్యతే సుమతిభి ర్మణిపాదరక్షే*
*విద్యాసఖః సవితృమండలమధ్య వర్తీ!! 29*

అర్థం:- హే మణి పాదరక్షే = ఓ మణిపాదుకా! సుమతిభిః = ప్రాజ్ఞులచేత; మణి యమూఖ సహస్ర దృశ్యాం = మణులకిరణాల బాహుళ్యం చేత దర్శనీయమైన; త్వాం = నిన్ను; ఆశ్రితః = ఆశ్రయించిన; త్వత్+శింజితేన, సహ = నీ నాదం చేతనే; సముద్యన్ = ఆవిర్భవించే; రంగపతిః = రంగరాజు; విద్యాసఖః = వేదవిద్యతోకూడిన; సవితృమండల మధ్యవర్తీ = సూర్యమండలం నడుమ ఉండే వాడుగా; ఆశంక్యతే = భావింప బడుతున్నాడు.

తా॥ ఓ మణి పాదుకా! సుధీమణులు, మణులకిరణాల బాహుళ్యంచే ప్రకాశించే నిన్ను ఆశ్రయించిన నీనాదం చేతనే ఆవిర్భవించే శ్రీరంగపతిని, త్రై విద్యతోకూడిన సూర్యమండల మధ్యవర్తిగా భావిస్తుంటారు.

వ్యాఖ్య:- పాదుకను సూర్యమండలంతో సమానంగా అనుభవించే వర్ణన

పాదుకాంతర్మణులకిరణ సహస్రానికీ, సూర్యకిరణ సహస్రానికీ సామ్యం కనబడుతుంది. పాదుకానాదం మూడుకాలాల్లో ప్రసరించే మూడు వేదాలఘోష.

“ఋగ్భిః పూర్వాహ్ణేదివిదేవ ఈయతే
యజుర్వేదేతిష్ఠతి మధ్యే అహ్నః !
సామవేదేనాస్తమయే మహీయతే
వేదైరశూన్యస్త్రి భిరేతి సూర్యః!!” శ్రుతి.

సూర్యభగవానుడు ఉదయాన ఋగ్వేదం చేత ఆకాశంలో సంచరిస్తాడు. మధ్యాహ్నకాలాన యజుర్వేదంతో ప్రకాశిస్తాడు. అస్తమానవేళలో సామవేదంచే గౌరవింపబడుతాడు. గగనంలో వేదత్రయనాదం చేత సూర్యుడు పరిక్రమిస్తాడు.

"య ఏషో ఉంతరాది త్యే హిర్మణయః పురుషోదృశ్యతే" శ్రుతి. హిరణ్మయ పురుషుడైన శ్రీమన్నారాయణుడు ఆదిత్యమండలం నడుమ దర్శనీయుడు. సూర్యుడు శూన్యుడు కాడు. కాబట్టి పాదుకయందున్న శ్రీరంగనాథుడు, సూర్యబింబంలో ప్రకాశించే పరమపురుషుడే, అని సుకృతాత్ములు ఉపాసిస్తారు. ఉపమాలంకారం. వసంతతిలకావృత్తం.

*860. రత్నాశ్రితైర్హరిపదం మణిపాదుకే! త్వం*
*స్పృష్ట్వా కరైః శ్రుతిరసాయన మంజునాదా!*
*తత్త్వం తదేతదితి బోధయసీవ సమ్యక్*
*వేదాన్ ప్రతారితవతో వివిధాన్ కుదృష్టీన్॥ 30*

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! రత్న+ఆశ్రితైః = మణుల సంబంధమైన రత్నాలతో కూడిన; కరైః = కిరణాలనే చేతులచే; హరిపదం = శ్రీరంగపతి చరణాన్ని; స్పృష్ట్వా = స్పృశించి; శ్రుతిరస + ఆయన, మంజునాదా = చెవుల సుఖానుభవానికి కారణమూ / వేదాలసారానికి కేంద్రస్థానమూ అయిన మనోజ్ఞనాదం కలిగిన దానివై; త్వం = నీవు; వేదాన్ = వేదాలను; ప్రతారితవతః = వంచించే; వివిధాన్ = పలుదారులు పట్టే; కుదృష్టీన్ = దుర్వాదులను గూర్చి; తత్ = వేద ప్రసిద్ధమైన; తత్త్వం = జీవులతోనూ, ప్రకృతితోనూ కూడియుండే యథార్థవస్తువే; ఏతత్ = ఇది - ఎదుట కనబడుతున్న దివ్యవిగ్రహం; ఇతి = అని; సమ్యక్ = బాగుగా; బోధయసి, ఇవ = ఉపదేశిస్తున్నట్లున్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! నీవు మణుల కిరణాలనే మంగళ ద్రవ్యాలతో కూడిన చేతులతో శ్రీరంగపతి పాదాలను స్పృశించ, కర్ణరసాయనంలాగా భోగ్యమైన వేదసారమొలికే మనోజ్ఞ నాదం కలదానివై శపథం చేసిన దానివై; వేదాలకు పెడ అర్థాలను చెప్పి ప్రలోభపరచే, పరస్పర వ్యాఘాతవచస్కులైన కుదృష్టులకు, వేదంలో ప్రసిద్ధమైన జగచ్ఛరీరం గల పరమాత్మయే ఇక్కడ కనబడుతున్న శ్రీరంగనాథస్వామి అని మనస్సుకునాటునట్లుగా బోధిస్తున్నట్లున్నావు.

వ్యాఖ్య:- పాదుక, భగవత్పాదాలను ముట్టి శపథంచేసి తత్త్వబోధచేస్తున్నట్లు వర్ణితం

'కుదృష్టులు' - వేదశాస్త్రార్థాలను యథార్థంగా దర్శించనివారు. భగవంతునికి గుణంలేదు, విగ్రహంలేదు, విభూతిలేదు అనేవారు. పరబ్రహ్మకు నిర్గుణత్వాన్ని, నిరాకారతనూ ఘటింపజేస్తూ , రుద్రపారమ్యంగా వేదార్థాలకు ఇష్టంవచ్చినట్లు, పెడార్థాలను కల్పించి ఒండొంటితో కలియని మాటలతో దుర్వాదంచేసే, దురుత్ప్రేక్షామూలక సిద్ధాంతపరులు.

దుర్మతులకు శపథం - ప్రమాణం - చేసి చెప్పకపోతే నమ్మకముండదు.

"మంగళ ద్రవ్యయుక్త పాణిః పురుషోదివ్యంకుర్యాత్"

'రత్నాలు, పచ్చిగరుక, అక్షతలు మొదలైన మంగళద్రవ్యాలను చేతబట్టుకొని దైవసంబంధమైన శపథం చేయాలి' అని స్మృతి శాసిస్తుంది.

మణికిరణాలచే ప్రకాశిస్తూ మంజునాదం కలిగిన పాదుక, రత్నాలను చేతబట్టుకొని కర్ణరసాయనంగా ఆలపిస్తూ భగవత్పాదాలను తాకి ప్రమాణం చేస్తూ కుదృష్టులకు విశ్వాసాన్ని కల్పిస్తూ 'పరదైవం ఇదే' అని నిర్దేశిస్తూ తత్త్వాన్ని బోధిస్తున్నట్లున్నది.

"య ఆత్మా, యస్య పృథివీ శరీరం, యం పృథివీన వేద"

'పరమాత్మకు పృథివి శరీరం. శరీరమైన పృథివి తన ఆత్మనెరుగదు.' ఇత్యాది శ్రుతుల రీత్యా చేతనాచేతనాత్మక ప్రపంచమంతా శరీరంగా కలవాడు పరబ్రహ్మ అని ఆదిశేషావతారుడైన శ్రీ భాష్య కారుల శ్రీ సూక్తులు పర తత్త్వాన్ని ప్రబోధిస్తాయి.

తత్త్వం తదేతత్ :- అన్యోన్యంగా బాధింపబడక, అన్వయించే శ్రుతుల తాత్పర్యానికి ఆస్పదమైన వస్తువు "తత్త్వం'.

"తత్త్వ శబ్దానురోధా త్తదేతదితి క్లీబనిర్దేశః

నిత్యసిద్ధే తదాకారే తత్పరత్వే చ పౌష్కర !

యస్యాస్తి సత్తా(క్తిః) హృదయే తస్యా సౌసన్నిధింవ్రజేత్ "

తత్త్వ శబ్ద సాహచర్యం వల్ల "తత్, ఏతత్' - అదే ఇది - అని నిర్దిష్టమైన నపుంసకలిగం పదం, నిత్యసిద్ధుడైన సగుణుడైన సాకారుడైన విష్ణువే పరదైవ మని ప్రబోధిస్తున్నది.

సవితృ మండల మధ్య వర్తియైన పుండరీకాక్షుడే ఈ శ్రీరంగనాథుడని పాదుకాదేవి ప్రామాణికంగా కుదృష్టులకు ప్రదర్శిస్తున్నది. శ్రీ శఠకోపదివ్యసూరులు 'అణల్లన్, పెణ్ణల్లన్' - అని భక్తులకూ; శ్రీరామమిశ్రులు శ్రీ యామున మునులకూ, శ్రీ భాష్యకారులు కామియైన ధనుర్దాసుకూ, పరదైవమే ఈ శ్రీరంగధాముడు' అని ప్రదర్శించారు.

ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలకావృత్తం.

*861. ఆనందసూః ప్రణయినా మనఘప్రసాదా*
*రంగాధిరాజ పదరక్షిణి ! రత్నభాసా!*
*న్యస్తే ముహుర్నిజభరే స్థిరతాంభజంత్యా*
*వర్ణాంశుకం వితరసీ సేవ వసుంధరాయాః !!* **31**

**అర్థం**:- హే రంగాధిరాజ పదరక్షిణి = ఓ రంగభూపతి పాదుకా: ప్రణయినాం = భక్తులకు; ఆనందసూః = ఆనందాన్ని కలిగించే; అనఘ ప్రసాదా = రమణీయమైన స్వచ్ఛత / సౌముఖ్యం కలిగిన నీవు; నిజభరే = స్వీయ

భారం; న్యస్తే = ఉంచబడినప్పుడు; స్థిరతాం = స్థైర్యాన్ని; భజం త్యాః = పొందుతున్న; వసుంధరాయాః = భూదేవికి: రత్నభాసా = రత్నాలకాంతిచేత; ముహుః = పదే పదే; వర్ణ + అంశుకం = పలువన్నెల వస్త్రాన్ని; వితరసి. ఇవ = దానంచేస్తున్నట్లున్నావు.

తా॥ ఓ రంగభూమీ శపాదుకా! భక్తులకానందాన్ని కలిగిస్తూ మనోజ్ఞమైన స్వచ్ఛత, అనుగ్రహం కలిగియున్న నీవు, అడుగడుగున నీ భారాన్ని వహిస్తున్నా, చలించక స్థిరత్వాన్ని పొందుతున్న భూదేవికి నీ రత్నాలకాంతి చేత పదేపదే పలు రంగులచే ముద్రితమైన వస్త్రాన్ని బహూకరిస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుక, తన భారాన్ని స్థైర్యంతో నిర్వర్తించే వసుంధరను, పారితోషిక మిచ్చి ఆనందపరచే వర్ణన

విశ్వంభరుణ్ని మోస్తున్న మణిపాదుక, తన భారాన్ని భూమి మీద అడుగడుగున మోపుతుంది. అయినా భూదేవి ఆయాసమనుకోకుండా ఆ భారాన్ని నిర్వహిస్తున్నది. భూదేవి సర్వసహత్వాన్ని సమీక్షించిన పాదుకకు అప్పుడు కలిగిన అనుగ్రహం కమనీయం.

న్యస్తే నిజభరే :- కౌరవసభలో ద్రౌపది, వస్త్రాపహరణ సమయాన "శంఖచక్రగ గదా పాణే" అని శ్రీకృష్ణుడే తనను కాపాడాలని ఆత్మస్థైర్యంతో భరన్యాసం చేసింది. అట్లే భూదేవి ఎంత భారాన్నైనా, వంత చింతలేక విశ్వంభరుని మీద భారముంచి, వహిస్తున్నదని స్వచ్ఛమైన అనుగ్రహం పాదుకాదేవికి కలిగింది.

'ముహుః' - శ్రీకృష్ణుడు ద్రౌపదికి వెంట వెంట, మీది మీద అఖండ వస్త్రాన్నిచ్చి సంతోష పరచినట్లే, పాదుకాదేవి అడుగడుగునా రత్నాలంకాంతిచే అద్దబడిన అనర్ఘ వసనాన్ని భూదేవికి సమర్పించి ఆనందాన్ని కలిగించింది.

సర్వవేద బాహ్యులచేత, కుదృష్టులచేత కలిగింపబడే భూభారాన్ని పాదుకాదేవికి తొలగించింది, వసుంధర హర్షించింది.

"భిక్షాపర్యటన క్షణేషు బిభరాం చక్రే గల త్కిల్బిషా

యద్విన్యాస మిషేణ పత్రమకరీ ముద్రాం సముద్రాంబరా"!! (64)

భగవద్రామానుజులవారు భిక్షార్థం రథ్యలో సంచరిస్తుంటే, వారిపత్ర మకరీ పాద ద్వయిని అచ్చుగా భరించి భూదేవి 'సముద్రాంబర' అయింది. వారి పాదధూళిసోకగనే పాపాలన్నిపోయి భూమి పావన మయిందని 'యతిరాజసప్తతి' లో వర్ణింపబడింది. పాదుక వసుంధరారంగనాథులకు భోగానందాన్ని కలిగించిన సన్నివేశాన్ని సేవించిన ప్రేక్షకులకూ ఆనందంకలిగింది. శ్లేష మూలకమైన ఉత్ప్రేక్ష. వసంత తిలకావృత్తం.

*862.* త్వంచిత్రభానురసి రత్నవిశేషయోగాత్
భూమ్నానిజేన పరిపుష్యసి పావకత్వమ్ !
స్వేనైవ శౌరిచరణావని! చంద్రరూపా
తేజస్త్రయీవ మిళితాఽసి తమోఽపహా నః !! *32*

**అర్థం:-** హే శౌరి చరణావని = ఓ భగవత్పాదుకా! రత్న విశేషయోగాత్ = రకరకాల రత్నాల సంబంధం వల్ల; చిత్రభానుః = నానాకాంతికిరణాలు కలదానవు / సూర్యుడుగా; అసి = ఉన్నావు; త్వం = నీవు; నిజేన = స్వకీయమైన; భూమ్నా = మహిమచేత; పావకత్వం = పావనత్వాన్ని / అగ్నిత్వాన్ని; పరిపుష్యసి = బాగా పోషిస్తున్నావు; స్వేన, ఏవ = స్వీయ ఆకృతి చేతనే; చంద్రరూపా = స్వర్ణరూపవు / చంద్రుడుగా: అసి = ఉన్నావు. మిళితా = కలిసియున్న; తేజః + త్రయీ, ఇవ = మూడు కాంతులవలె; నః = మాయొక్క; తమః + అపహా = చీకటినీ / శోకాన్నీ / అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తున్నావు.

**తా॥** ఓ శౌరి పాదుకా! నీవు వేర్వేరు రత్నాలకలయికవల్ల నానాకాంతికిరణాలు కలిగిన చిత్రభానుడుగా ఉన్నావు. నీ మహిమ చేత శుచిత్వాన్ని పోషిస్తున్నావు. ఆకృతిచే చంద్రరూపవు. కాబట్టి ఈ మూడు తేజస్సులు కలిసిన ఏక రూపం లాగా ఉండి మా తమస్సును పోగొట్టుతున్నావు.

### వ్యాఖ్య:- తేజస్త్రయి వలె ఉన్న పాదుక తమో ఉపహంత్రి

పద్మరాగ మరకతాది మణుల అనేక కిరణాలచే ప్రకాశించే పాదుక సూర్యుడుగా వెలుగుతున్నది. 'చిత్రభానుర్విరోచనః' (అమరం)

పాదుకామహిమ పావన మయింది కాబట్టి అగ్ని ధర్మాన్ని పోషిస్తుంది. 'చంద్ర' శబ్దానికి బంగారం, జాబిల్లి అని అనేకార్థాలున్నాయి. కాబట్టి కనకమయిమైన పాదుక చంద్రరూప. ఈ మూడుతేజస్సు లేక భవించిన రూపవతి పాదుకాదేవి. కాబట్టి లోకంలో బాహ్యాంతరాంధ కారాన్ని చేదరగొట్లే విచిత్ర భానుమతి పాదుక.

సూర్యాగ్ని చంద్రులతే జస్త్రయ సమ్మేళనం కవిప్రౌఢోక్తియే కాని వాస్తవంగా జరుగదు. అందువల్ల ఇది అభూతోపమాలంకారం, శ్లేషతో సంకీర్ణం. వసంతతిలకావృత్తం.

*863. ప్రౌఢప్రవాళరుచిరా భువనైక వంద్యా*
*రంగాధిరాజ చరణావని! రమ్యచంద్రా!*
*సంభిన్న మౌక్తిక రుచిః సతతం ప్రజానాం*
*తాపాత్యయం దిశసి తారకితేవ సంధ్యా ॥ 33*

**అర్థం:-** హే రంగాధిరాజ చరణావని = ఓ శ్రీరంగరాజ పాదుకా! ప్రౌఢప్రవాళ రచిరా = శ్రేష్ఠమైన పవడాలచే / ముదిరిన తలిరులవలె రమ్యమైన; భువన + ఏకవంద్యా = లోకాలచే ముఖ్యంగా నమస్కరించదగిన; రమ్యచంద్రా = మేలి బంగారమూ / అందమైన చంద్రుడూ కలిగిన; సంభిన్నమౌక్తిక రుచిః = వేర్వేరు ముత్యాలకాంతులు కలదానివై; తారకితా = చుక్కలతో కూడిన; సంధ్యా, ఇవ = సంధ్యాకాలంవలె; ప్రజానాం = జనులకు; సతతం = ఎల్లప్పుడు; తాప + అత్యయం = తాపశాంతిని; దిశసి = కలిగిస్తున్నావు.

**తా॥** ఓ రంగరాజపాదుకా! మంచి పగడాలచేత ముదిరిన చిగురుటాకుల వలె ప్రకాశించే, లోకాలన్నిటికీ అసాధారణంగా వందనీయవై, మేలిమి బంగారం / చంద్రుడు కలిగిన, అనేక ముత్యాలతో కూడిన నీవు

చుక్కలతో కూడిన మలిసంజలాగా ఎల్లప్పుడు జనులకు తాపశాంతిని కలిగిస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుక, సాయం సంధ్యవలె తాప శాంతిని కలిగించే వర్ణన

1. పాదుక, పగడాలకాంతిచే రమ్యంగా ఉంది.
సంధ్య, చిగురుటాకులు ముదిరినట్లు అరుణకాంతితో మనోహరంగా ఉంది.

2. ముల్లోకాలు పాదుకాదేవికి వందనం చేస్తాయి.
లోకులు కమనీయంగా సంధ్యావందనం చేస్తారు.

3. బంగారంతో చేయబడి హృద్యంగా ఉండేది పాదుక.
చంద్రకాంతితో ఆహ్లాదకరంగా ఉండేది మలిసంజ

4. రకరకాలముత్యాలతో శోభించేది పాదుక
అనేక నక్షత్రాలతో ప్రకాశించేది సాయంసంధ్య

పాదుక, సాయంసంధ్యలాగా ప్రజల ఆధిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిదైవికాలనే తాపత్రయాన్ని శమింపజేసి, విశ్రాంతిని కల్పిస్తుంది. శ్లేషతోఊడిన ఉపమాలంకారం, వసన్త తిలకావృత్తం.

*864. రంగేశ్వరస్య పురతో మణిపాదుకే! త్వం*
*రత్నాంశుభి ర్వికిరసి స్ఫుటభక్తి బంధా!*
*పాదౌ విహారయితు మద్భుతసౌకుమార్యౌ*
*ప్రాయః సరోజ కుముదోత్పల పత్ర పంక్తిమ్ ॥* 34

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! స్ఫుటభక్తి బంధా = స్పష్టమైన మిక్కిలి ప్రేమగల / రత్నాల వరుసల కూర్పుగల; త్వం = నీవు; అద్భుత సౌకుమార్యౌ = ఆశ్చర్యం కలిగించే మృదుత్వం కల; రంగేశ్వరస్య, పాదౌ = రంగరాజు పాదాలను; విహారయితుం = సంచరింప జేయడం కోసం; పురతః = ముందరి స్థలంలో; రత్న + అంశుభిః = రత్నాల కిరణాలచేత; సరోజ, కుముద + ఉత్పల; పత్రపంక్తిం = కమలాల, తెల్లకలువల, నల్లకలువల ఆకుల వరుసను; ప్రాయః = తరచుగా; వికిరసి = పరుస్తున్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! వ్యక్తమవుతున్న దృఢమైన భక్తి, రత్నపంక్తి సంనివేశమూ కలిగిన నీవు, అద్భుత మార్దవం కలిగిన శ్రీ రంగపతి పాదాలను ఉల్లాసంగా నడిపించడానికి పాదాలకుముందు భాగంలో రత్నకిరణాలచే తామరాకులకూ, తెల్ల, నల్ల కలువలాకులనూ వరుసలుగా పరుస్తున్నట్లున్నావు.

వ్యాఖ్య:- భగవత్పాద సంచారం కోసం పాదుక అబ్జపత్రాలను దారిలో పరుస్తున్నట్లు ఉత్ప్రేక్షితం

భగవంతుడు విహరిస్తుంటే భగవత్పాదుకల్లో పొదుగబడిన ముత్యాలు, కెంపులు, పచ్చలు, నీలాలు మొదలైన రత్నాలకాంతులు పాదాలముందు ప్రసరిస్తుంటాయి. ప్రేమ, భక్తి కలవారు అన్నివిధాలా సేవ చేస్తారు

కద! స్వామి శ్రీచరణాలు అతి సుకుమారమైనవి. కాబట్టి కఠినమైన భూమి మీద నడుస్తుంటే పాదాలు కందిపోకుండా ముందుదారిలో ఆకులనూ పూలనూ పరుస్తున్నట్లున్నాయి. పాదుకామణులు కాంతులు. 'కుముద' శబ్దం తెల్లకలుకలకూ, 'ఉత్పల' శబ్దం నల్లకలువలకూ ప్రసిద్ధం. "సితే కుముదకైరవే" - (అమరం)

పద్మరాగమణులు సరోజదళాలుగానూ, ముత్యాలు కుముద పత్రాలుగానూ, మరకతమణులు, ఇంద్రనీలాలు నీలోత్పలదళాలు గానూ కల్పితాలు

అడుగులకు మడుగులొత్తడం కైంకర్య నిరతుల భాగధేయం. శ్లేషానుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలకావృత్తం.

*865. ఆసన్నవృత్తి రవరోధ గృహేషు శౌరే*
*రాపాదయ స్యనుపదం వరవర్ణినీనామ్ !*
*ఆలగ్న రత్నకిరణా మణి పాదుకే! త్వం*
*మంజుస్వనా మదన బాణ నిఘర్షశంకామ్!!* 35

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ మణిపాదుకా! ఆలగ్న రత్నకిరణా = అంతట తగిలియున్న రత్నాల కిరణాలుగల: మంజు స్వనా = మధుర నాదంగల: త్వం = నీవు; శౌరేః = భగవంతుని యొక్క; అవరోధ గృహేషు = అంతఃపుర సదనాల్లో; ఆసన్నవృత్తిః = సమీపమందున్నదానివై; వరవర్ణినీనాం = దేవేరులకు; అనుపదం = అడుగడుగునా/ ప్రతిక్షణం: మదన బాణనిఘర్షశంకాం = కాముని బాణాన్ని సానబడుతున్న సందేహాన్ని; ఆపాదయసి = కలిగిస్తున్నావు.

**తా॥** ఓ రత్నపాదుకా! ఆసక్తమైన మణులూ, మధురనాదమూకల నీవు శ్రీరంగనాయకుని అంతః పురభవనాల్లో దగ్గర ఉన్నప్పుడు, దేవేరులకు పదే పదే మన్మథబాణం సానమీద పెట్టి రాపిడిచేయబడుతున్నదో అనే అనుమానాన్ని కల్పిస్తున్నావు.

వ్యాఖ్య:- భగవత్పాదుక, దేవేరులకు కామోద్దీపికగా శోభించే వర్ణన

భగవంతుడు అంతఃపురంలో ప్రవేశించినా, పాదుక వెంటనే - సమీపంలోనే ఉంటుంది. పాదుక మీద ప్రకాశించే మణులకాంతి మన్మథ బాణాన్ని పోలి ఉంది. పాదుకాంతర్మణులనాదం చెవిసోకినప్పుడు, మదనబాణం దేవేరుల మీద ప్రయోగించడానికి సన్నకల్లు మీద నూరబడుతున్నదో అన్నట్లున్నది. పాదుక - ఆయుధాలను పదును పెట్టడానికి సానమీద ఒరపిడి పెడితే, కాంతి, ధ్వని - రెండూ - కల్గడం సాధారణం కదా!

పాదుక, తన మణులకాంతి నాదాలచేత, శ్రీ భూనీళాది మహిషీ మణులకు కామోద్దీప్తిని కలిగిస్తున్నట్లున్నది.

అంతఃపురంలోనూ పాదుక భగవత్సన్నిధిలోనే ఉండడం, మహిషీమణుల ఉద్దీపనానికి హేతువు. ఉత్ప్రేక్షాలంకారం. వసన్తతిలకావృత్తం.

*866. పర్యాప్త మౌక్తిక నఖాస్ఫుట పద్మరాగా*
*రేఖా విశేషరుచిరా లలితప్రచారా!*

*రంగాధిరాజ పదయోర్మణి పాదుకే! త్వం*
*సాయుజ్య మాశ్రితవతీవ సమస్త వంద్యా !!* 36

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! పర్యాప్తమౌక్తిక నఖా = నిండు ముత్యాలేగోళ్ళుగా గల; స్ఫుట పద్మరాగా = స్పష్టమైన పద్మరాగమే పద్మం యొక్క ఎరుపుదనంగా గల; రేఖా విశేషరుచిరా = వజ్రశంఖాది లాంఛనరేఖలచే అందమైన; లలితప్రచారా = హృదయ్మైన సంచారంగల; సమస్త వంద్యా = అందరిచే నమస్కరింపదగిన; త్వం = నీవు; రంగాధిరాజ పదయోః = శ్రీరంగరాజ పాదాలయొక్క; సాయుజ్యం = పరమ సామ్యాన్ని; ఆశ్రితవతీ, ఇవ = పొందినట్లున్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! నిండుముత్యాలను పోలిన కాలిగోళ్ళు; పద్మరాగమే పద్మం యొక్క అరుణిమకలిగిన; రథాంగకల్పకాది లక్షణరేఖలచే మనోజ్ఞవైన; హృద్యమైన సంచారం కలిగిన; సమస్త జనులచే నమస్కరింపదగిన నీవు ఎరంగపతి చరణాల సామ్యాన్ని పొందినట్లున్నావు.

వ్యాఖ్య:- పాదుకకు, భగవత్పాదసామ్యం ఉత్ప్రేక్షితం

1. భగవత్పాదాలు తామరపూవులవలె అందమైనవి.

భగవత్పాదుకలు పద్మరాగాలచే తామరపూల అరుణిమ కలిగినవి.

2. భగవచ్చరణాలకు తెల్లని గోళ్ళు ఉన్నాయి.

పాదుకల్లోని ముత్యాలు గోళ్ళను పోలి ధవళంగా ఉన్నాయి.

3. లలిత ప్రచారత్వం. 4. రేఖారుచిరత్వం 5. సమస్త వందనీయత సమానంగా అమరియుండడం వల్ల పాదుక, భగవత్పాద సాయుజ్యాన్ని పొందింది. 'సాయుజ్యం' అంటే తనతో సమానమైన శ్రేష్ఠవస్తువును కలిగియుండడం. పరిశుద్ధాత్ముడు ఏకాంతియై పొందే భగవత్పాదసాన్నిధ్యం - 'ముక్తి' "నిరంజనః పరమం సామ్య ముపైతి" (శ్రుతి)

శ్లేష రూపకాలంకారాలతో కూడిన ఉత్ప్రేక. వసన్త తిలకావృత్తం.

*867. ప్రాప్తాభిషేకా మణిపాదుకే! త్వం*
*ప్రదీప్తరత్నా రఘురాజధాన్యాః !*
*ప్రదక్షిణ ప్రక్రమణాదకార్షీః*
*ప్రాకార మాగ్నేయ మివ ప్రభాభిః !!* 37

**అర్థం:-** హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! ప్రాప్త + అభిషేకా = పొందిన పట్టాభిషేకం కల; త్వం = నీవు; ప్రదీప్త రత్నా = ప్రకాశించే రత్నాలు కలదానవై; ప్రదక్షిణ ప్రక్రమణాత్ = ప్రదక్షిణగా సంచరించడం వల్ల; రఘు

రాజ ధ్యాన్యాః = అయోధ్యానగరానికి; ప్రభాభిః = కాంతులచేత; ఆగ్నేయం = అగ్నియమయమైన; ప్రాకారం = కోటగోడను; ఆకార్షీః, ఇవ = చేసినవో అన్నట్లున్నావు.

తా॥ ఓ మణిపాదుకా! అభిషేకజలంచే అధికంగా దీపించే రత్నాలు కలిగిన నీవు పట్టాభిషేకానంతరం రఘుకుల రాజధాని వీథుల్లో ప్రదక్షిణగా సంచరించడం వల్ల అయోధ్యా నగరానికి నీ రత్నాలకాంతులచే అగ్నిమయమైన ప్రాకారాన్ని అమర్చినట్లున్నావు.

వ్యాఖ్య:- పాదుక అయోధ్యకు ఆవరణకుడ్యాన్ని నిర్మించిందని ఉత్ప్రేక్ష

పాదుక, అభిషేకజల ప్రభావం వల్ల రత్నాలతో అధికంగా ప్రకాశించింది. అయోధ్యలో శుభసూచకమైన ప్రదక్షిణరూపంగా ఉరేగింది. కెంపులకాంతితో పాదుక, నగరంలో ఊరేగుతుంటే అగ్నిశిఖలు ప్రదక్షిణగా ప్రజ్వలించినట్లుంది. అంతేకాదు, నగర రక్షణకోసం అగ్నిమయ ప్రాకారాన్ని నిర్మించిదన్నట్లు వెలిగింది. "ప్రాకారో వరణస్సాలః" (అమరం). 'శాలా' అనే ఉపజాతి వృత్తం.

868. రత్నాసనే రాఘవపాదరక్షే
ప్రదీప్యమానాస్తవ పద్మరాగాః ।
ప్రాయో నరేంద్రాన్ భరతస్యజేతుః
ప్రతాపవహ్నేరభవన్ ప్రరోహాః ॥ 38

అర్థం:- హే రాఘవపాదరక్షే = ఓ శ్రీరాఘవపాదుకా! రత్నాసనే = రత్నసింహాసనమందు; ప్రదీప్యమానాః = మిక్కిలి ప్రకాశిస్తున్న; తవ = నీ యొక్క; పద్మరాగాః = కెంపులు; నరేంద్రాన్ = రాజులను; జేతుః = జయించిన; భరతస్య = భరతునియొక్క; ప్రతాపవహ్నేః = పరాక్రమాగ్నియొక్క; ప్రరోహాః = చిన్నమొక్కలు; ప్రాయః = బహుశః; అభవన్ = అయెను.

తా॥ ఓ శ్రీరామపాదుకా! రత్నసింహాసనంమీద ప్రకాశిస్తున్న నీ పద్మరాగమణులు రాజులను జయించిన భరతుని ప్రతాపాగ్నియొక్క అంకురాలయ్యాయి.

వ్యాఖ్య:- పాదుకా పద్మరాగాలు అగ్నిమొలకలుగా ఉత్ప్రేక్షితం

పాదుక రత్నసింహాసనాన్ని అధిష్ఠించి వైభవంగా పాలిస్తున్నప్పుడు పద్మరాగమణులు అగ్నిహోత్రుని చిన్న జ్వాలలుగా వెలిగాయి. భరతుడు పాదుకానుగ్రహం వల్ల రాజులనందరిని జయించే ప్రతాపాగ్ని లాగా ప్రకాశిస్తుంటే, పాదుకల్లోని కెంపులు ఆయగ్ని మొలకలన్నట్లు ప్రజ్వలించాయి.

పాదుకాప్రతాపందుర్నిరీక్ష్యమని భావం. ఉత్ప్రేక్ష. 'భద్రా' అనే ఉపజాతి.

869. శుభప్రణాదా భవతీశ్రుతీనాం
కంఠేషు వైకుంఠ పతింవరాణామ్!
బధ్నాసి నూనం మణిపాదరక్షే!
మాంగల్య సూత్రం మణిరశ్మిజాలైః !! 39

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! భవతీ = నీవు; శుభప్రణాదా = మంగళ శబ్దం కలదానివై; వైకుంఠపతిం వరాణాం = శ్రీరంగధాముణ్ని పతిగా వరించే; శ్రుతీనాం = వేదాలయొక్క; కంఠేషు = గళసీమలయందు; మణి రశ్మిజాలైః = రత్నకిరణ సమూహాలచేత; మాంగల్య సూత్రం = పుస్తెల తాడును; నూనం, బధ్నాసి = కట్టుతున్నట్లున్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! నీవు మంగళ ధ్వని కలదానివై శ్రీరంగనాథుణ్ని భర్తగా వరించే శ్రుతికాంతల గళసీమలందు రత్నకిరణ జాలాలచేత మంగళ సూత్రాన్ని సంయోగపరుస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుకామణి కిరణజాలం మాంగల్య సూత్రంగా ఉత్ప్రేక్షితం.

శ్రుతులు భగవంతుణ్ని భర్తగా వరించే వధువులు. శబ్దశరీరలైన శ్రుతికాంతలు భగవంతుణ్ని సేవిస్తూ సన్నిధిలోనే ఉన్నాయి. పాదుకాదేవి తన మణులనాదం చేత 'మాంగల్యం తంతునానేన' మంత్రోచ్చారణ చేస్తున్నది. పాదుకా మణులకిరణజాలమే మంగళసూత్రమయింది. భగవంతుని అనుమతిచేత పాదుకయే మంత్రపఠనం చేస్తూ శ్రుతికాంతల కంఠసీమలో మంగళ సూత్రాన్ని కట్టివేస్తున్నట్లు రాణించడం గమనీయం.

'కీర్తి' అనే ఉపజాతి వృత్తం.

870. విచిత్ర వర్ణా శ్రుతిరమ్యశబ్దా
నిషేవ్యసే నాకసదాం శిరోభిః !
మధుద్విషస్త్వం మణిపాదరక్షే
శ్రేయస్కరీ శాసన పత్రికేవ !! 40

**అర్థం:-** హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! విచిత్ర వర్ణా = వింతవింత రంగులుగల / నానావిధాలైన అక్షరాలుగల; శ్రుతిరమ్యశబ్దా = వీనులవిందైన నాదంగల; శ్రేయస్కరీ మోక్షహేతువైన / శ్రేయస్సును కలిగించే; త్వం = నీవు; నాకసదాం = దేవతలయొక్క; శిరోభిః = శిరస్సులచేత; మధుద్విషః = మధువైరియొక్క; శాసన పత్రికా, ఇవ = ఆజ్ఞారూపమైన పత్రికలాగా; నిషేవ్యసే = సేవింపబడుతున్నావు.

**తా॥** ఓ మణిపాదుకా! శబలరూపవై శ్రవణసుభగమైన నాదం కలిగి మోక్షహేతువైన నీవు, నానావిధాక్షరాలుగల ప్రామాణికంగా అంగీకరింపబడే శ్రేయస్కార్యాలను తలపించే భగవదాజ్ఞా పత్రంలాగా దేవతలచే శిరసావహింపబడుతున్నావు.

వ్యాఖ్య:- దేవతలు పాదుకాదేవిని భగవచ్ఛాసన పత్రం వలె శిరసావహించే వర్ణన

1. పాదుక, అనేక మణులకాంతులచే విచిత్రమైన రంగులు కలది.
శాసన పత్రిక, వివిధాక్షరాలతో శోభించేది

2. పాదుక, చెవులకు చవులూరించే నాదం కలది.
శాసన పత్రిక, శ్రుతిరమ్యశబ్దాలు కలిగి ప్రామాణికంగా అంగీకరింపబడేది.

3. పాదుక, మోక్ష హేతువుగా రాణించేది
శాసన పత్రిక, ప్రజలకు సుఖకరమైన కార్యాలను ఆచరణలోకి తెచ్చేది.

4. పాదుక, దేవతలచేత సేవింపబడేది.
శాసన పత్రిక, భృత్యుల చేతనూ, పౌరుల చేతనూ శిరసావహింపబడేది.

శ్లేషమూలకమైన ఉపమాలంకారం. 'జాయా' అనే ఉపజాతివృత్తం.

*871. స్థిరా స్వభావా న్మణిపాదుకే! త్వం*
*సర్వం సహాస్వాదు ఫలప్రసూతిః !*
*పృథ్వీవ పద్భ్యాం పరమస్య పుంసః*
*సంసృజ్యసే దేవి! విభజ్యసే చ॥* *41*

**అర్థం:-** హే దేవి! మణిపాదుకే = ఓ మణిపాదుకాదేవీ! స్వభావాత్ = సహజగుణం వల్ల; స్థిరా = దృఢమైన / అచలయైన; సర్వం సహా = అన్నిటిని భరించే; స్వాదుఫల ప్రసూతిః = రుచిగల ఫలాలను, పంటను ఉత్పత్తి చేసే; త్వం = నీవు; పృథ్వీ, ఇవ = భూమివలె; పరమస్య, పుంసః = పరమ పురుషుని యొక్క; పద్భ్యాం = చరణాలతో / చేత; సంసృజ్యసే = చేరుతున్నావు / సృజింపబడుతున్నావు. చ = మరియు; విభజ్యసే = విడువబడుతున్నావు / లయింపబడుతున్నావు.

**తా॥** ఓ మణి పాదుకాదేవీ! నీవు స్వభావం వల్ల స్థిరమైన సర్వం సహిస్తూ, సరసమైన ఫలాలనూ, పంటనూ ఉత్పత్తి చేసే భూమిలాగా పరమపురుషుని పాదాలచేత సంసర్గమవుతున్నావు. అంతేకాదు; విడువబడుతూ ఉన్నావు.

**వ్యాఖ్య:- పాదుకాదేవికి భూదేవితో సాదృశ్య కల్పన**

1. పాదుకాదేవి దృఢంగా ఉంది.
భూదేవి నిశ్చలంగా ఉంది.

2. పాదుక, ఆశ్రితుల అపరాధాలను సహిస్తుంది.
భూదేవి, చేతనాచేతన వస్తువులను ధరించి భారాన్ని సహిస్తుంది.

3. పాదుకాదేవి, స్వర్గాపవర్గాలను ప్రసాదిస్తుంది.
భూదేవి, భోగ్యమైన పంటలనూ, సరసఫలాలనూ ఉత్పత్తి చేస్తుంది.

4. పాదుకాదేవి శ్రీరంగనాథుని పాదాలతో చేరుతుంది.
భూదేవి భగవత్పాదాలచే సృజింపబడుతుంది.

5. పాదుక, శ్రీరంగపతి విశ్రమించినప్పుడు పాదాలచే వేరే చేయబడుతుంది.
భూమి, ప్రళయకాలంలో భగవత్పాదాల్లో లయమవుతుంది

పాదుకాదేవి, భూదేవి స్వభావ సామ్యం మనోహరంగా వర్ణితం.

ప్రభావ పద్ధతిలో 'భూమిఃశ్రుతీనాం భువనస్య ధాత్రీ" (85) శ్లోకం 'పాదుకాదేవి భూదేవియే' అని రూపకాలంకృతం. ఈ శ్లోకం ముఖ్యంగా ద్వితీయ, చతుర్థ చరణాలతో విశేషంగా వర్ణిస్తూ, శ్లేషాను ప్రాణితో సమాలంకారాలంకృతం. 'కీర్తి' అనే ఉపజాతి వృత్తం.

*872. పశ్యంతి రంగేశ్వర పాదరక్షే !*
*పూజాసు తే సంహితపుష్పజాలామ్ ।*
*మృగీదృశో వాసవరత్న రేఖాం*
*సచిత్ర పుంఖామివ మన్మథజ్యామ్ ॥ 42*

**అర్థం:-** హే రంగేశ్వర పాదరక్షే = ఓ రంగరాజపాదుకా! పూజాసు = పూజయందు; సంహిత పుష్పజాలాం = కూర్చబడిన పువ్వుల సమూహంగల: తే = నీయొక్క; వాసవరత్న రేఖాం = ఇంద్రనీలమణుల పంక్తిని; మృగీదృశః = స్త్రీలు; సచిత్ర పుంఖాం = అందమైన పిడిగల బాణంతో కూడిన; మన్మథ జ్యాం, ఇవ = కాముని వింటినారిని పోలినట్లు; పశ్యంతి = చూస్తుంటారు.

**తా॥** ఓ రంగేశ్వర పాదుకా! పూజార్పిత పుష్పజాలతో కూడిన నీ హరినీల పంక్తిని, బాణ విశిష్టమైన మన్మథ ధనుర్గుణాన్ని వలె స్త్రీలు చూస్తుంటారు.

**వ్యాఖ్య:-** పూలతో కూడిన శతమఖ మణులపంక్తి, పూలబాణంతో కూడిన తుమ్మెదల నారిగా ఉత్ప్రేక్షితం

చెరకు విల్కానికి పువ్వులే అమ్ములు. తుమ్మెదలు మౌర్వి-వింటినారి 'చిత్ర పుంఖ విశిఖేషు కలంబాః" (హలాయుధని)

అలంకారమంటపంలో శ్రీరంగధామునికి షోడశోపచార పూజచేసినప్పుడు ఆయన పాదుకలకు తులసీ పుష్పార్చన చేస్తారు అర్చకులు. ఆ పాదుక(ల)కు నైసర్గికంగా ఇంద్రనీలమణులు వరుసదీరి ఉన్నాయి. 'మృగీదృశః' అంటే లేడిచూపులవంటి చూపులుగల స్త్రీలు. "మానేయ్ నోక్కిమడవాళై" అన్నారు శ్రీ శఠకోపమునులు. పాదుకార్చనను సేవిస్తున్న ఏణీలోచనలు, శ్రీభూనీళలు కూడా పుష్పయుక్తహరి నీలమణి రేఖను, బాణాన్ని సంధించిన మన్మథుని అల్లె త్రాడును చూస్తున్నట్లు సంభావించడం ఉక్తివైచిత్రి. 'రామా' అనే ఉపజాతివృత్తం.

873. కరై రుదగ్రైః స్ఫురతాం మణీనాం
మంజుస్వనా మాధవ పాదుకే! త్వమ్ ।
అనూపదేశే కనకాపగాయాః
కలేః ప్రవేశం ప్రతిషేధసేవ॥" 43

అర్థం:- హే మాధవ పాదుకే = ఓ శ్రీపతిపాదూ! మంజుస్వనా = మధుర నాదంగల; త్వం = నీవు; స్ఫురతాం = దీపించే; మణీనాం = మణులయొక్క; ఉత్+అగ్రైః = పైకి ప్రసరించే; కరైః = కిరణాలనే చేతులచేత; కనకాపగా యాః = కావేరీనదియొక్క; అనూపదేశే = తీరప్రదేశమందు; కలేః = కలిపురుషుని యొక్క; ప్రవేశం = రాకడను; ప్రతిషేధసి, ఇవ = నిషేధిస్తున్నట్లున్నావు.

తా॥ ఓ మాధవపాదుకా! మధురనాదంగల నీవు మీదికి వ్యాపించే మణులకిరణాలనే చేతులనెత్తి కావేరీ నదీ తీరప్రాంతంలో కలి(యుగ) ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లున్నావు.

వ్యాఖ్య:- పాదుకాదేవి, శ్రీరంగనగరంలో కృతయుగ ధర్మాన్ని ప్రవర్తింప జేసే వర్ణన.

గత శ్లోకంలో కామవిచారం కలిగింది కదా! శాస్త్ర విరుద్ధ కామాన్ని నివారించడానికి పాదుక అధికంగా శ్రద్ధ వహించింది. శ్రీరంగనాథుడు కావేరీ తీర భూముల్లో విహరిస్తున్నప్పుడు మంజునాదమూ పుంజుకొంటుంది. మణులకిరణాలూ దీర్ఘంగా ఊర్ధ్వంగా ప్రసరిస్తూ ప్రకాశిస్తాయి.

ప్రవేశిస్తున్న కలి పురుషుణ్ని దూరంనుంచి చూచి, పాదుకాదేవి తన ఉదగ్ర కరాలనుచాచి ఎత్తి "నీ ఆటలు ఇక్కడ సాగవు, నీవీతీర ప్రాంతంలోకి ప్రవేశించకూడదు" అంటూ కలియుగధర్మం చేరకుండా నిషేధిస్తున్నట్లున్నది. ఉత్ప్రేక్షాలంకారం. 'బుద్ధి' అనే ఉపజాతి.

874. ఆక్రాంతవేది ర్భవతీ తదానీ
మదర్శి ముక్తాన్విత శోణరత్నా!
కరగ్రహార్థం భరతేన భూమ్యాః
లాజోత్కరై ర్వహ్ని శిఖేవ కీర్ణా ॥ 44

అర్థం:- ఓ పాదుకా! ఆక్రాంతవేదిః = ఆక్రమించిన సింహాసనమనే హోమకుండం కలిగిన; ముక్తా + అన్విత శోణరత్నా = ముత్యాలతో కూడిన పద్మ రాగమణులు కలిగిన; భవతీ = నీవు; తదానీం = అధికారం పొందినప్పుడు; భరతేన = భరతునిచేత; భూమ్యాః = భూమియొక్క; కరగ్రహార్థం = పన్నుగ్రహించడానికి / పాణిగ్రహణంకోసం; లాజ + ఉత్కరైః = పరిపేలాల సముదాయంచేత; కీర్ణా = కూడియున్న; వహ్నిశిఖా, ఇవ = అగ్ని జ్వాలవలె; ఆదర్శి = చూడబడినావు.

తా॥ ఓ పాదుకా! సింహాసన రూపమైన అగ్న్యాధారస్థం మీద ఉన్న, ముత్యాలతో కూడిన కెంపులు కలిగిన నీవు, భరతునిచే భూమియొక్క పన్నును / పాణిని గ్రహించడం కోసం వరిపేలాలు చల్లిన అగ్ని జ్వాలవలె కనబడి నావు.

వ్యాఖ్య:- పాదుక అగ్నిజ్వాలగా ఉత్ప్రేక్షితం

పాదుక అధికారం నిర్వహించే సమయంలో సామంతరాజులు భూమి పన్నును, కప్పము నీయగా భరతుడు దాన్ని గ్రహించి పాదుకాదేవికి నివేదించడం సుశ్లోకితం. 'కర' మంటె పన్ను, హస్తం.

'కరగ్రహం' :- పాణిగ్రహణం. భూదేవి పాణిగ్రహణోత్సవం. వివాహవేళలో అగ్నికుండంలో లాజలు చల్లి హోమం చేయడం వైదికాచారం.

"ఇయం నార్యుపబ్రూతే కుల్పాన్యావపంతికా !
దీర్ఘాయురస్తుమేపతి ర్జీవాతుశరదశ్శతం !! . శ్రుతి.

కుల్పాని = లాజలు - వరిపేలాలను; ఆవపంతికా = హోమం చేసే వధువు.

భర్తకు దీర్ఘాయుష్యమే ఆక్రియకు ఫలం.
ముత్యాలే లాజలు. పద్మరాగమణులే అగ్నికణాలు. సింహాసనమే అగ్నివేదిక. భరతుడు భూమి కరగ్రహణం చేసే సమయంలో ముత్యాలతో కూడిన కెంపులతో ప్రకాశించే పాదుక, లాజహోమంతో ప్రసరించే అగ్నిజ్వాలగా కనబడుతున్నది. శ్లేషరూపకాలతో కూడిన ఉత్ప్రేక్ష. 'శాలా' అనే ఉపజాతి వృత్తం.

*875. పత్రలా మణిగణై ర్హిరణ్మయీ*
*భాసి రంగపతి రత్నపాదుకే*
*కేళిమండప గతాగతోచితా*
*భూమికేవ గరుడేన కల్పితా !!* 45

అర్థం:- హే రంగపతి రత్నపాదుకే = ఓ రంగరాజ రత్న పాదుకా! మణిగణైః = మణుల సమూహాలచేత; పత్రలా = రెక్కలతో కూడిన; హిరణ్మయీ = కాంచనమయువైన నీవు; కేళిమండపగత + ఆగత + ఉచితా = విలాస మంటపాలకు పోయిరావడానికి తగిన; గరుడేన = పక్షిరాజుచేత; కల్పితా = ధరించబడిన; భూమికా, ఇవ = వేషం వలె; భాసి = ప్రకాశిస్తున్నావు.

తా॥ ఓ శ్రీరంగరాజ పాదుకా! మణి సముదాయం చేత రెక్కలు కలిగి కనకమయివైన నీవు, భగవంతుడు కేళీమంటపాలకు పోయిరావడానికి యోగ్యమైన గరుత్మంతుడు ధరించిన వేషమన్నట్లు భాసిస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుక గరుడుడు ధరించిన రూపంగా ఉత్ప్రేక్షితం

గరుత్మంతుడు హిరణ్య వర్ణుడు, సుపర్ణుడు. శ్రీరంగనాథుడు ఆకాశ యానం చేయడానికి తగిన వాహనం గరుత్మంతుడు. ఉల్లాసంగా ఒక మంటపం నుంచి మరొక మంటపానికి భగవంతుడు సంచరించడం కోసం గరుడుడు, తన గొప్ప రూపంతో ఉండడం కుదురదు. కాబట్టి గరుత్మంతుడు పాదుకా రూపాన్ని ధరించాడు.

"దాసః సఖావాహన మాసనం ధ్వజః" (స్తోత్రరత్నం) ఆదిశేషుని స్వరూపం భగవంతుని శయ్యకు, గరుడుని స్వరూపం సముచితంగా ఉంటుంది. శ్రీరంగరాజును వహించి దగ్గర దగ్గరున్న కేళీమండపాల్లోకి పోయిరావడానికి యోగ్యమైన రూపమని తలచి, పక్షిరాజు తన దేహాన్ని పాదుకాకృతిగా మార్చుకొన్నాడని సంభావన. పాదుక స్వర్ణమయి. రత్నకాంతులచేత రెక్కలున్న దానిగా ప్రకాశిస్తున్నది. రథోద్ధతావృత్తం

*876. ఉన్నతం బలి విరోధినస్తదా*
*పాదుకే! పదసరోజమాశ్రితా !*
*మౌక్తిక స్తబక మధ్య సమ్మితం*
*వ్యోమషట్పద తులా మలంభయః !! 46*

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! ఉన్నతం = పైకి ఎత్తబడిన; బలివిరోధినః = బలిచక్రవర్తికి విరోధియైన త్రివిక్రముని యొక్క: పదసరోజం = పాదకమలాన్ని; ఆశ్రితా = ఆశ్రయించిన నీవు; తదా = నింగిలో ఉన్నప్పుడు; మౌక్తిక స్తబక మధ్యసమ్మితం = ముత్యాలగుత్తి నడుమ ఎడంగా ఉన్న; వ్యోమ = ఆకాశాన్ని; షట్ పదతులాం = తుమ్మెద సమానంగా: అలంభయః = పొందినావు.

**తా॥** ఓ పాదుకా! ఉన్నతమైన త్రివిక్రముని పాదసరోజాన్ని ఆశ్రయించియున్న నీవు ఆకాశంలో ముత్యాలగుత్తి నడుమ ఎడంగా ఉన్న ఆకాశాన్ని భ్రమర సదృశంగా పొందినావు.

వ్యాఖ్య:- పాదుక, ఆకాశాన్ని షట్పద సదృశంగా పొందిన వర్ణన

త్రివిక్రముడు, తన పాదంతో ఊర్ధ్వలోకాన్ని కొలిచినప్పుడు, పాదంతో పాటు పాదుకకూడా బాగా వృద్ధి చెందింది.

త్రివిక్రముడు సరస్సు ఆయన పాదమే ఆసరస్సులో అంకురించినతామర. పాదుక ఉన్నతంగా, విశాలంగా వ్యాపించిన తామర తీగ - పాదుకల్లోఉన్న ముత్యాల సముదాయమే తామరపూలగుత్తి - ఆపూలగుత్తిలోని మధ్య భాగంలో ఉన్న ఆకాశం భృంగం లాగా శోభించింది. ఉపమాలంకారం. రథోద్ధతావృత్తం.

*877. కోమలాంగుళి నివేశయంత్రికా*
*న్యస్త మౌక్తిక మయూఖదంతురా!*
*మంగళాని వమసీవ దేహినాం*
*రంగరాజ మణిపాదుకే! స్వయమ్ !! 47*

**అర్థం:-** హే రంగరాజ మణిపాదుకే = ఓ రంగప్రభుపాదుకా! కోమల + అంగుళ నివేశ యంత్రికాన్యస్త మౌక్తిక మయూఖదంతురా = మృదువైన వ్రేళ్ళలో చొరడానికి ఉన్న బొడుసుమీద ఉంచబడిన ముత్యాల కాంతిచే పైకి ప్రసరించే నీవు, స్వయం = స్వయంగా; దేహినాం = జీవులకు; మంగళాని = శుభాలను; వమసి, ఇవ = కురిపిస్తున్నట్లున్నావు.

తా॥ ఓ రంగ ప్రభు మణిపాదుకా! భగవంతుని కోమలాంగుళాల్లో ప్రవేశించే యంత్రిక యందున్న ముత్యాలకాంతిచే ఉదగ్రవైన నీవు. ప్రజలకు మంగళాశాసనలను వర్షిస్తున్నట్లున్నావు.

వ్యాఖ్య:-పాదుక భక్తులకు యంత్రికయందలి ముత్యాలకాంతిచే మంగళా శాసనం చేస్తున్న వర్ణన

భగవంతుడు నిజపాదాంగుళలచే పట్టకోవడానికి తగినట్లు పాదుకాయంత్రిక ఉంది. ఆ యంత్రికామౌక్తిక కిరణాలచే తెల్లగా కాంతి ప్రసరిస్తుంది. ఆకాంతిచేత పాదుక, తన భక్తులకు సత్త్వ గుణాన్ని సమృద్ధిచేసే సకల కల్యాణాలను కురిపిస్తున్నదో అన్నట్లు రాణిస్తున్నది. పాదుకవర్షించే శ్రేయస్సు పరిశుద్ధతకు కారణమై సర్వసుఖాలను కలిగిస్తుంది. ఉత్ప్రేక్షాలంకారం. రథోద్ధతా వృత్తం.

*878. పంకజా సహచరస్య రంగిణః*
*పాదుకే ! నిజపదాదనంతరమ్ !*
*న్యస్యత స్త్వయిజగంతి జాయతే*
*నాగభోగశయనం నిరంకుశమ్ !!* 48

అర్థం:-హే పాదుకే = ఓ పాదుకా! నిజపదాత్ = తన చరణంనుంచి; అనంతరం = వ్యవధిలేకుండా, వెంటనే: జగంతి = లోకాలను; త్వయి = నీయందు; న్యస్యతః = ఉంచినట్టి; పంకజా సహచరస్య = లక్ష్మితోకూడి సంచరించే: రంగిణః = శ్రీరంగ నాథునికి; నాగభోగ శయనం = పాముమేను యందు పవళించడం: నిరంకుశం = ప్రతిబంధకం లేకుండా: జాయతే = కలుగుతున్నది.

తా॥ ఓ పాదుకా! లోక రక్షణార్థం లక్ష్మీదేవితోకూడి సంచరించి వచ్చిన రంగనాథుడు, వెంటనే తన పాదం నుంచి లోకరక్షణ భారాన్ని తీసి నీయందు మోపి, లక్ష్మి సనాథుడై శేషశయ్యయందు సుఖంగా పవళిస్తాడు.

వ్యాఖ్య:- శేషశాయికి విశ్రాంతి ఉంది, పాదుకకు విశ్రాంతి లేదని పర్యాయాలంకృతం

"పాదో2స్య విశ్వాభూతాని". చరాచర ప్రపంచం భగవత్పాదమందు ఉంటుందని శ్రుతి ప్రతిపాదిస్తుంది. శ్రీరంగనాథుడు లోకరక్షణకోసం లక్ష్మి దేవితో కూడి సంచరిస్తాడు. సంచారం ముగిసిన తర్వాత తన పాదాలనుంచి విడిచిన పాదుక(ల)పైన జగద్రక్షణ భారాన్ని మోపుతాడు. శేషశయ్యమీద లక్ష్మీదేవితో కూడి సుఖంగా శయనిస్తాడు.

భగవంతుడు సంచార సమయంలో పాదుకయందు స్వీయ పాదాన్ని, శయన వేళలో లోకభారాన్ని పర్యాయంగా అర్పిస్తాడని వర్ణించడం వల్ల, పర్యాయాలంకారం. రథోద్ధతావృత్తం.

*879. సాధయంతి మధువైరిపాదుకే!*
*సాధవః స్థిరముపాయ మంతిమమ్!*
*త్వత్ప్రవృత్తి వినివర్తనోచిత*
*స్వప్రవృత్తి వినివర్తనాన్వితమ్ !!* 49

**అర్థం:-** హే మధువైరి పాదుకే = ఓ మధ్వరిపాదుకా! సాధవః = సత్పురుషులు; త్వత్, ప్రవృత్తి వినివర్తన + ఉచిత స్వప్రవృత్తి వినివర్తన + అన్వితం = నీ రక్షణ ప్రయత్నాన్ని మాన్పదగిన తమ ప్రయత్నాన్ని మానుకొనుటతో కూడియున్న; స్థిరం, దృఢమైన; అంతిమం = చివరిదైన; ఉపాయం = మోక్షో పాయాన్ని; సాధయంతి = అనుష్ఠిస్తారు.

**తా॥** ఓ మధువైరి పాదుకా! నీ రక్షణ ప్రవృత్తి విరమింజేసే తమ ప్రవృత్తి విరమించుకోవడమే యుక్తమైన, దృఢమైన, ప్రపత్తి రూపమైన మోక్ష ఫలసాధనాన్ని సాధువులు అనుష్ఠిస్తారు.

వ్యాఖ్య:- జీవుల విషయమై పాదుకా ప్రభావం వర్ణితం.

శాస్త్రంలో పలురకాల ఫలాలకు పలుదారుల విధిగా చూపబడినాయి. జీవునికి అనాది కర్మవల్ల మోక్షఫల ప్రాప్తికి ప్రతిబంధకం ఉంటుంది. మోక్షం పొందడానికి కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తుల ననుష్ఠించాలి. ప్రపత్తి కంటె ముందు భక్తి యోగమవసరం. భక్తి యోగానుష్ఠానానికి సహకరించే కర్మానుష్ఠానమును కర్మమూలకమైన జ్ఞానయోగమునూ అనుష్ఠించి జీవాత్మ స్వరూపా ధర్మాన్ని కాపాడుకోవాలి. మొదటి మూడు మార్గాల వల్ల మోక్షమవశ్యంగా లభిస్తుందని నిర్ణయింపవలను పడదు.

భక్తి యోగాధికారి అవడంకంటె పూర్వమే భగవంతుడు మోక్షమీయ ప్రవర్తిస్తాడనుకొంటే, భక్తియోగాన్ని ఎందుకు విధించాడు? భక్తియోగాన్ని అనుష్టించని వారి పట్ల భగవంతుని రక్షణ ప్రవృత్తి ఉండదు. నన్ను నేను రక్షించు కోగలనని ప్రయత్నించే వారి విషయంలో భగవంతుడు తటస్థుడుగా ఉంటాడు.

ప్రపత్తి, శరణాగతి, భరన్యాసం పర్యాయ పదాలు. "ఓ భగవంతుడా! నా కర్మజ్ఞానాద్యనుష్ఠానాల చేత నిన్ను పొందగలనని నీల్గలేను. అనుష్ఠానాలన్నీ నీ కృపను పొందడానికి సాధనాలు మాత్రమే. ఆసాధనానుష్ఠానం జీవుని స్వరూప ధర్మం కాబట్టి. నీ కృపకు పాత్రులైన వారే మోక్షం పొందుతారు. స్వామీ! నీవు రక్షకుడవు". అని దృఢాధ్యవసాయంతో ప్రార్థిస్తూ, తన రక్షణ భారం భగవంతుని మీద మోపడమే భరన్యాసం, ప్రపత్తి అనబడుతుంది.

ప్రపన్నులకు మోక్షాన్ని ప్రసాదించడం భగవంతుని ప్రవృత్తి. "భగవత్ప్రవృత్తిని నిరోధించే తమ ప్రవృత్తిని మానుకోవడమే ప్రపత్తి" ఇది ప్రపత్తి నిర్వచనం.

ఒక వేళ ఏదో కారణం వల్ల ఉపాయాంతరం - వేరే సాధనాన్ని, వేరే దేవతా పూజను - అనుష్ఠించే జీవుని ప్రవృత్తి - ప్రవర్తన, ప్రయత్నం - మోక్ష మీయ సిద్ధపడిన భగవంతుని ప్రవృత్తిని మరల్చే లాగా చేస్తుంది. భగవత్ప్రవృత్తిని నివారింప జాలని తమ వర్ణాశ్రమ ధర్మ ప్రవృత్తిని నిర్వర్తించడమూ ఆవశ్యక మని తాత్పర్యం.

పాదుకాదేవి, స్వరక్షణకై స్వప్రవృత్తి కల జీవులను చూచి ఉదాసీనయై ఉంటుంది. స్వప్రవృత్తిని వదలి భరన్యాసం - శరణాగతి - చేసే ప్రపన్నులను పాదుకాదేవి యే రక్షిండానికి సిద్ధపడుతుంది.

స్థిరం :- తన ధర్మాన్ని పూర్ణ విశ్వాసంతో స్వల్పంగా ఆచరించినా దోష మంటదు. "నేహాభిక్రమనాశో ఽస్తి" అని గీతా చార్యసూక్తి ప్రతిబంధకాలనన్నింటిని తొలగించి ఫలాన్ని సాధింప సమర్థమైనది. 'అంతిమోపాయం'.

సాధువులు తమను తాము రక్షించుకొనే వ్యాపారాన్ని వదలుకొని భగవత్పాదుకాదేవి మీద భారముంచి కృతకృత్యులవుతారు. పాదుకాదేవి కూడా తాటస్థ్యాన్ని వదలి సాధువులను రక్షించే భారాన్ని అంగీకరిస్తుంది.

పాదుకా మాహాత్మ్యానికి అంగంగా సాధు చరిత్రను వర్ణించడం ఉదాత్తాలంకార లక్షణం. రథోద్ధతావృత్తం.

*880. నందసూను పదపద్మమిందిరా*
*పాణిపల్లవ నిపీడనా సహమ్ !*
*పాదుకే! తవ బలేన పర్యభూ*
*దూష్మలా మురగ మౌళిశర్కరామ్ !!* 50

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! ఇందిరా పాణిపల్లవ నిపీడన + అసహం = లక్ష్మీదేవియొక్క చిగుళ్ళలాంటి కెంగేళ్ళ చేత ఒత్తడాన్ని ఓర్వలేని; నందసూను పద పద్మం = శ్రీకృష్ణుని కమల సదృశమైన పాదం; తవ = నీయొక్క; బలేన = శక్తిచేత; ఊష్మలాం = వేడిమితో కూడిన; ఉరగమౌళి శర్కరాం = కాళియసర్పం యొక్క తలయందలి రాళ్ళ ప్రదేశాన్ని; పర్యభూత్ = పరాభవించెను.

**తా॥** ఓ పాదుకా! లక్ష్మీదేవి చిగురుటాకులవంటి చేతులతో ఒత్తడాన్ని కూడా సమీంచలేని నందనందనుని పాదారవిందం నీ బలంతోనే గరళోష్ణం చేత కూడియున్న కాళియసర్పం యొక్క ఫణాలమీది మణిమయ స్థలాన్ని మెత్తగా మెదిపింది.

వ్యాఖ్య:- భగవంతుని విషయమైన పాదుకా ప్రభావం వర్ణితం

జీవాత్మల పట్ల పాదుకా ప్రభావాన్ని వర్ణించిన తర్వాత పరమాత్మ పట్ల పాదుకా ప్రభాన్ని వర్ణిస్తున్నారు. దేశికులు.

శ్రీమహాలక్ష్మి పుష్పవాసిని. ఆమె చేతులు తలిరులవలె అతి సుకుమారమైనవి. లక్ష్మీదేవి ప్రేమతో పతిపాద పద్మాలను మెత్తగా ఒత్తినా, భగవత్పాదాలకు బాధకలిగి నొప్పి పుట్టునట.

అంత సౌకుమార్యాతిశయం కలిగిన నంద నందను పాదారవిందం, విషజ్వాలలనెగ జిమ్మే కాళియ నాగుని తలమీది వేడి వేడి రాళ్ళను ఎలా పాడి పాడి చేయకలిగిందో? అంటే, భగవత్పాదాలను లేశమైనా కందిపోకుండా కాపాడే శక్తి కలిగిన పాదుకాదేవి, పాదతలాన ఉండడం వల్ల కాళియ ఫణాగ్ర మణిమండలాన్ని మర్దించి మృదువుగా చేసిందట.

'శర్కర' అంటే మణి విశేషం, మణులుగల స్థలం, మొరపుమన్నుగలనేల మొదలైన అర్థాలున్నాయి.

"శర్కరాన్విత దేశేచ" -- (విశ్వ.ని.)

మృదువైన పాదం కఠినమైన కాళియ శిరోమణులను చూర్ణం చేయడం వ్యాఘాతం. కావ్యలింగాలంకారం. రథోద్ధతావృత్తం.

881. మణి నికరసముత్థైః సర్వవర్ణామయూఖైః
ప్రకటిత శుభనాదా పాదుకే! రంగభర్తుః !
నిఖిల నిగమసూతేర్బ్రహ్మణ స్తత్సనాథా
మవగమయసి హృద్యామర్ధమాత్రాంచతుర్థీమ్ !! 51

**అర్థం:-** హే రంగభర్తుః, పాదుకే = ఓరంగరాజ పాదుకా! మణినికరసముత్థైః = మణుల సముదాయం నుంచి ఎగసిన; మయూఖైః= కిరణాలచేత: సర్వవర్ణా = సమస్త వర్ణాలుకలిగిన; ప్రకటిత శుభనాదా = వెల్లడింపబడిన మంగళ ధ్వనిగల నీవు: నిఖిల నిగమసూతేః = సర్వవేదాలకు కారణమైన; బ్రహ్మణః = వేదం - ప్రణవం యొక్క; తత్, సనాథాం = ఆ రంగనాథునితోకూడి యున్న: హృద్యాం = అందమైన / హృదయోత్పన్నమైన; చతుర్థీం = నాల్గవదైన: అర్థమాత్రాం = సగం మాత్రను: అవగమయసి = తలపింపజేస్తున్నావు.

**తా॥** ఓ శ్రీ రంగేశపాదుకా! మణులనుంచి ఎగసిన కిరణాలచే తెలుపుమొదలైన అన్ని వర్ణాలుగల శుభనాదాన్ని ప్రకటించే నీవు, సమస్త వేదాలకు మూలమైన ఓంకారం యొక్క, ప్రణవ స్వరూపుడైన పరమ పురుషునితో కూడిన, హృద్యమైన: నాల్గవదైన నాదరూపమైన అర్థమాత్రనుస్మరింప జేస్తున్నావు.

వ్యాఖ్య:- సర్వవర్ణమణులనాదంతో పాదుక, ప్రణవ నాదాన్ని స్మరింపజేసే వర్ణన

సమస్త వేదాలు పరబ్రహ్మ వల్ల ప్రకటింపబడినాయి.

"తస్యహవా ఏతస్యమహతోభూతస్య నిశ్వసితమే తద్య దృగ్వేదో యజుర్వేదః సామవేదః" - శ్రుతి.

స్వరూపరూప గుణ విభూతులచేత అనవధిక వృద్ధి కలిగిన పరబ్రహ్మ శ్రీ రంగపతి. మణులకాంతులచేత శుక్లాది సమస్త రూపాలుకల పాదుక సర్వవర్ణ కాబట్టి మంగళకరమైన నాదాన్ని ప్రకటిస్తుంది.

ప్రణవంలో అకార ఉకారమకారాలున్నాయి. ఈ మూడే కాక నాల్గవ భాగమైన అర్థమాత్ర నాదాత్మికంగా ఉంటుంది. పాదుకా నాదం హృద్యమైనది, హృదయంలో ఉత్పన్న మవుతుంది.

"ఓంకార ప్రభవావేదాః" వేదాలకు మూలం ఓంకారం. ఓంకారంలోని వర్ణత్రయ రూపవిశేషాలనూ, వాటికి సంబంధించి దేవతా విశేషాలను చెప్పిన తరువాత అధర్వశిఖోపనిషత్తు -

"యూ అవసానే ౭స్య చతుర్థీ అర్థమాత్రా, సావిద్యుమతీ సర్వవర్ణా పురుష దేవత్యా" అని చెబుతుంది.

'ప్రణవం చివరనాల్గవదైన అర్థమాత్ర నాదాత్మికం, శుక్లాది సమస్త రూపాలుకలిగిన పరవాసుదేవుడనే పురుష దేవతాకం' అని అర్థం.

శ్రీ రంగనాథునితో కూడిన నాదాత్మికయైన పాదుక, పరమ పరుషదేవతాకమై, తాల్వాద్యభివ్యక్త నాదాత్మికమైన నాల్గవ అర్థమాత్రను స్మృతి పథాన ప్రకాశింపజేస్తుంది. కాబట్టి హృద్యమైనది.

శ్రీరంగధాముణ్ని సేవింపవచ్చిన భక్తులు ప్రణవాకారవిమానాన్నీ సేవిస్తుంటారు. పాదుక, నాద బ్రహ్మోపాసనాన్ని స్మరింప జేస్తుంది. శ్లేషతోకూడి సాదృశ్యమూలకమైన స్మృత్యలంకారం. మాలినీ వృత్తం.

882. *శ్రుతి విషయ గుణాత్వం పాదుకే! దైత్యహంతుః*
*సతతగతి మనోజ్ఞా స్వేనధామ్నా జ్వలంతీ!*
*జనిత భువన వృద్ధి ర్దృశ్యసే స్థైర్య యుక్తా*
*విధృత నిఖిల భూతా వైజయంతీవ మాలా !!* 52

**అర్థం:-** హే దైత్యహంతుః, పాదుకే = ఓ రాక్షసాంతకుని పాదుకా! = ఓ రాక్షసాంతకుని పాదుకా! శ్రుతి విషయగుణా = వేదాలకు / చెవులకు విషయమైన గుణం కలిగిన; సతతగతి మనోజ్ఞా = ఎల్లప్పుడు సంచరించడం చేత / వాయువుచేత, ఇంపైన; స్వేన = తనదైన; ధామ్నా = కాంతిచేత / తేజస్సుచేత; జ్వలంతీ = ప్రకాశిస్తున్న; జనిత భువన వృద్ధిః = లోకాలకు; జలాలకు సంపత్తును పెంచుతున్న; స్థైర్య యుక్తా = దృఢచింతనతో / స్థిర-భూమి-తో కూడియున్న; త్వం = నీవు; విధృత నిఖిల భూతా = ధరింపబడిన సమస్త భూతాలుగల: వైజయంతీ = వైజయంతి అనే మాలా, ఇవ = మాలికలాగా; దృశ్యసే = కనబడుతున్నావు.

**తా॥** ఓ దైత్య మర్ధను పాదుకా! వేద ప్రతిపాద్య గుణం కలిగిన, సతత సంచారం చేత మనోజ్ఞమైన, స్వీయకాంతిచే ప్రకాశిస్తున్న, భువనాలకు వృద్ధిని కలిగిస్తూ స్థిర భావనతో ఉండే నీవు, శబ్ద గుణమున్న ఆకాశం కలిగిన, వాయు దేవతచే మనోజ్ఞమైన, స్వీయ తేజస్సుచే అగ్ని దేవతాకమైన, భువన వృద్ధిచేసే జలతత్త్వం కలిగిన, పృథ్వీయుక్తమైన వైజయంతిమాలవలె కనబడుతున్నావు.

వ్యాఖ్య:- పాదుక, పంచభూతాత్మికమైన వైజయంతిమాలగా వర్ణితం

యోగులకు హృద్యమయింది నాదం. భగవంతునికి వైజయంతి హృద్యం. గర్భగృహంలోకి వెళ్ళి శ్రీరంగనాధుణ్ని సేవించే భక్తులు ఆస్వామి వక్షః స్థలంలో అలంకృతమైన వైజయంతి మాలను సేవిస్తారు. పాదుకను వైజయంతి సదృశంగా దేశికులు వర్ణించారు.

1. పాదుక శ్రుతులకు, ప్రతిపాద్యమైన జ్ఞాన శక్త్యాదిగుణం కలది.
   వైజయంతి చెవులకు గ్రహింపదగిన శబ్ద గుణమున్న ఆకాశం కలది.

2. పాదుక సదాసంచారం చేత మనోజ్ఞమైనది
   వైజయంతి సదాగతి గల వాయ్వాత్మకమై మనోజ్ఞంగా ఉంటుంది.
   "మాతరిశ్వా సదాగతిః" (అమరం). (వాయుపర్యాయ పదాలివి)

3. పాదుక స్వీయ ప్రభతో ప్రకాశిస్తుంది.
   వైజయంతి స్వీయ జ్వాలతో అగ్ని రూపం కలది.

4 పాదుక జగత్తుకు, జలానికి వృద్ధి కలిగిస్తుంది.

వైజయంతి భువన వృద్ధిని చేసే జల రూపం కలది.

'జీవనం భువనం వనం' - నీటి పర్యాయ పదాలు.

'లోకోవిష్టపం భువనం జగత్' - జగత్పర్యాయపదాలు.

5. పాదుక స్థిర భావనతో కూడింది.

వైజయంతి స్థిరంగా ఉండే భూమి రూపంతో కూడింది.

'భూర్భూమిరచలానన్తా రసా విశ్వంభరా స్థిరా' (అమరం) పృథివ్యా పస్తే జో వాయు రాకాశాలనే పంచ భూతాత్మకమైన వైజయంతి 'భూత మాల'గా పేరుపొందింది.

"పంచరూపాతు యామాలా వైజయంతీ గదాభృతః !
సా భూత హేతు తన్మాత్రా భూతమాలా చవై ద్విజ!!" (వి.పు)

పాదుక సమస్త భూతాలకు - ప్రాణులకు - శ్రేయోదాయకమైనది. శ్లేషతో కూడిన ఉపమాలంకారం. మాలినీ వృత్తం.

*883. రఘుపతి పదసంగా ద్రాజ్యఖేదం త్యజంతీ*
*పునరపి భవతీస్వాన్ దర్శయంతీ విహారాన్ !*
*అభిసమధితవృద్ధిం హర్షకోలాహలానాం*
*జనపదజనితానాం జ్యాయసా శింజితేన !!* *53*

**అర్థం:-** హేపాదుకే! రఘుపతి పదసంగాత్ = రామునిపాద సంసర్గం వల్ల; రాజ్యభేదం = రాజ్యపాలన వల్ల కలిగిన శ్రమను; త్యజంతీ = వదలుతున్న; పునః, అపి = మళ్ళీ, వెంటనే, స్వాన్ = తనవైన; విహారాన్ = ఉల్లాస సంచారాలను; దర్శయంతీ = చూపుతున్న; భవతీ = నీవు; జ్యాయసా = అధికమైన, ఉత్తమమైన; శింజితేన = నాదం చేత; జనపదజనితానాం = గ్రామాల్లో కలిగిన; హర్షకోలాహలానాం = ఆనందమయమైన కలకలధ్వనుల; వృద్ధిం = పెరుగుదలను; అభిసమధిత = సంపాదించావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! శ్రీరామచంద్రస్వామి వనవాసం నుంచి తిరిగి వచ్చిన తర్వాత పాదాలకు ధరించడంవల్ల కోసల రాజ్యాధిపత్యం వల్ల కలిగిన ఆయాసాన్ని వదలి, మళ్ళీ నీ లీలాసంచారాలను ప్రదర్శిస్తున్న నీవు శ్రేష్ఠమైన నాదం చేత లోకుల ఆనందకోలాహలాన్ని వృద్ధి చేశావు.

వ్యాఖ్య:- శ్రీరాముని పాద సంగం వల్ల మళ్ళీ ప్రజల ఆనందాన్ని పాదుక వృద్ధి చేసిన వర్ణన

రాజ్యపాలనకన్న భగవత్సేవ చేయడం మిన్న గత శ్లోకంలో గతిమనోజ్ఞత్వం, సింహాసన మధిష్ఠించిన పాదుక స్థైర్యాన్ని పొంది భువన వృద్ధిచేసిందని అయోధ్యాధిరాజ్యం సూచితం. ఈ శ్లోకంలో శ్రీరామచంద్రస్వామి

లంక నుంచి అయోధ్యకు రాగానే పాదాలకు ధరించడం వల్ల పాదుక అమితానందాన్ని పొందింది.

శ్రీ రాముని పాద స్పర్శవల్ల పాదుక(ల)కు రాజ్యమేలడం వల్ల కలిగిన క్లేశం పటాపంచలయింది. నూతనోత్సాహంతో లీలా సంచారాలను ప్రదర్శిస్తూ. పాదుకాదేవి శ్రేష్ఠమైన నాదంచేత ప్రజలకు నాదానుభవాన్ని కలిగించింది. ఆనందకోలాహలాన్ని పెంచింది.

"కోలాహలః కలకలః" (అమరం)

ప్రజలకు ఇంతకు ముందున్న ఆనందం పాదుకానాదంచేత ఇతోధికంగా వృద్ధి అయింది. అనడం వల్ల 'అనుగుణాలంకారం' మాలినీ వృత్తం.

*884. హరిచరణముపఘ్నం పాదుకే! సంశ్రితాయా*
*మధిగత బహూశాఖం వైభవం దర్శయంత్యామ్ !*
*అభజతవిధి హస్త న్యస్త ధర్మద్రవాయాం*
*త్వయిముకుల సమృద్ధిం మౌక్తిక శ్రీస్తదానీమ్ !! 54*

**అర్థం:-** హే పాదుకే = ఓపాదుకాదేవీ! హరిచరణం = త్రివిక్రముని పాదాన్ని; ఉపఘ్నం = గడగా: సంశ్రితాయాం = ఆశ్రయించిన: అధిగత బహుశాఖం = పొందబడిన అనేక(వేద)శాఖలుకల: వైభవం = సంపదను: దర్శయంత్యాం = చూపుతున్న; విధిహస్తన్యస్త ధర్మద్రవాయాం = బ్రహ్మ చేతితో ఉంచిన పుణ్య జలంకలిగిన: త్వయి = నీయందు: మౌక్తికశ్రీః = ముత్యాలశోభ: తదా = త్రివిక్రమావతారమప్పుడు; ముకుళ సమృద్ధిం = మొగ్గల సంపదను; అభజత = పొందెను.

**తా॥** ఓ పాదుకాదేవీ! భగవచ్చరణమనే గడను ఆశ్రయించి వేదశాఖలనే కొమ్మలుగా పొందిన వైభవాన్ని ప్రదర్శిస్తూ, బ్రహ్మ తన చేతులతో నీరు పోసిన నీ యందలి ముత్యాల శోభ త్రివిక్రమావతారసమాయన కుట్మలశోభను పొందింది.

వ్యాఖ్య:- పాదుక(ల) యందలి ముత్యాలు, మొగ్గలుగా ఉత్ప్రేక్షితం

శ్రీరామపాదపునస్సంగమ విషయం ప్రాసంగికం. అంతకుముందున్న వైజయంతీమాలావృత్తాంతాన్నిబట్టి, పాదుక తీగగా వర్ణింపబడింది.

తీగకు ఆశ్రయస్తంభాన్ని కల్పించి నీరు పోస్తే కొమ్మలు రెమ్మలు వేసి ననలు తొడుగుతుంది కదా! అలాగే పాదుకాలతకు ఆధారమైన గడ త్రివిక్రముని చరణం, కాబట్టి ఏపుగా ఎదిగింది. బహు వేదశాఖలనే కొమ్మలతో చిలువలు పలువలుగా పెరిగింది. నలువ నీరు పోయడం గమనీయం.

అది ధర్మద్రవం. 'ఈశ్వర సంహిత'లో పుణ్యమే నీరుగా మారికారగా బ్రహ్మ త్రివిక్రముని పాదాన్ని ప్రక్షాళనం చేశాడని చెప్పబడింది.

"ద్రవీభూతస్తతో ధర్మో హరిభక్త్యామహామునే !
గృహీత్వా ధర్మపానీయం పాదంనాథస్య తుష్టయే !!
క్షాళితం పరయాభక్త్యా పాద్యార్ఘ్యాదిభిరర్చితమ్ !
తదంబు పతతితం దృష్ట్వా దధార శిరసాహరః !!" (ఈ.సం)

బ్రహ్మదేవుడు నీరు పోశాడు. పాదుకాలత మొగ్గలు తొడిగి చూడముచ్చటగా ఉంది. సమాసోక్త్యలంకారం. మాలినీ వృత్తం.

*885. కనక రుచిరకాంతిః కల్పితాశోక భారా*
*కృతపదకమలశ్రీః క్రీడతా మాధవేన !*
*దిశి దిశి సుమనోభి ర్దర్శనీయానుభావా*
*సురభి సమయలక్ష్మీం పాదుకే! పుష్యసిత్వమ్!!* 55

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! కనక రుచిరకాంతిః = బంగారం చేత అందమైన కాంతి గల; కల్పిత + అశోక భారా = కల్పింపబడిన శోక భారం లేని; క్రీడతా = విహరించే; మాధవేన = శ్రీరంగనాథునితో; కృతపదకమలశ్రీః = జనించిన పాదకమలాలశోభగల; దిశిదిశి = అన్ని దిక్కులయందు; సుమనోభిః = దేవతలచేత; దర్శనీయ + అనుభావా = చూడదగిన ప్రభావం గల; త్వం = నీవు;

కనక రుచిర కాంతిః = చంపక వృక్షాలచే అందమైన శోభగల; కల్పితా శోక భారా = కల్పింపబడిన అశోక పుష్ప సంపదగల; క్రీడతా ఉల్లసించే; మాధవేన = వైఖాఖ మాసం చేత; కృతపద కమలశ్రీః = ఏర్పడిన కమలాలశోభగల; దిశిధిశి = ప్రతిదిక్కున; దర్శనీయానుభావా = చూడదగిన మహిమగల; సురభి సమయ లక్ష్మీం = వసంతకాలశోభను; పుష్యసి = పెంచుతున్నావు.

**తా॥** ఓ పాదుకా! స్వర్ణకాంతికలిగి శోకభారం లేకుండా విహరించే శ్రీరంగపతి పాదకమలాలశోభగల, సర్వత్ర దేవతలు చూచే ప్రభావం గల నీవు, చంపక తరుల శోభ అశోక పుష్పసంపద కలిగి, ఉల్లసించే వైఖామాసం చేత ఏర్పడిన తామర పూల శోభకలిగిన, అన్ని దిక్కుల దర్శించదగిన మహిమగల వసంతర్తు శోభను వృద్ధి పరుస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుకాదేవి, వసంతలక్ష్మిగా వర్ణితం

1. పాదుక కనక భూషితయై మనోజ్ఞంగా ఉంది.
   వసంతలక్ష్మి సంపెంగ చెట్లచే శోభాయమానంగా ఉంది
2. పాదుక శోకభారాన్ని తొలగించి, యోగ క్షేమాలను కల్పించింది.
   వసంతలక్ష్మి అశోక పుష్పసంపత్తిని కల్పించింది.
3. పాదుక మాధవుని పాదకమలాలతో శోభిస్తుంది.

వసంతలక్ష్మి మాధవ-వైశాఖ-మాసంలో తామర కమలాలతో శోభిస్తుంది.

4. పాదుక దేవతలు సర్వత్ర దర్శించే మాహాత్మ్యం కలది.
వసంతలక్ష్మి అన్ని దిక్కుల పూలతో వ్యాపించి చూడదగిన ప్రభావం కలది.

శ్రీరామచంద్రస్వామి వనవాసానికి వెళ్ళుతుంటే "అపి వృక్షాః పరిమ్లానాః" అన్నట్లు చెట్లన్నీ విషాదంతో వాడిపోయినాయి. పాదుక వైశాఖ మాసంలో చిత్రకూటాద్రినుంచి తిరిగి వచ్చి, చేతనాచేతనాల శోకదశను తొలగించింది. జంగమ స్థావరాలకూ నిత్య నూతన వికాసం కల్పించి పాదుక వసన్త శోభను పెంచింది. శ్లేషతోకూడిన ఉపమాలంకారం. మాలినీ వృత్తం.

*886. ప్రణిహిత పదపద్మాపాదుకే! రంగభర్తుః*
*శుభతరగతి హేతుశ్చారు ముక్తాప్రవాళా!*
*స్థిర పరిణతరాగాం శుద్ధబోధానుబద్ధాం*
*స్వజనయసి మునీనాం త్వన్మయీం చిత్తవృత్తిమ్॥ 56*

**అర్థం:-** హే రంగభర్తుః పాదుకే = ఓరంగరాజపాదుకా! ప్రణిహిత పదపద్మా = సావధానంగా ఉంచబడిన / ధ్యానం చేయబడిన పాదపద్మాలుకల; శుభతరగతి హేతుః = మిక్కిలి భవ్యమైన సంచారానికి / పరలోకగమనానికి కారణమైన; చారుముక్తా ప్రవాళా = అందమైన ముత్యాలు, పవడాలు కల్గిన; అందంగా ముత్యాల్లాగా పలువరుస, పవడం లాగా అధరం కలిగిన; నీవు; స్థిరపరిణతరాగాం = శాశ్వతంగా పరిణమించిన ప్రేమగల దృఢంగా ఏర్పడిన (పద్మరాగాల) రక్తిమగల; శుద్ధబోధ + అనుబద్ధాం = సంశయం లేని జ్ఞానంతో కూడియున్న శుద్ధబుద్ధిగల వారిచే అనుబంధం కలిగిన; త్వన్మయీం = నీమీద భక్తి నిల్పిన / నీవుగోచరించే; మునీనాం = యోగులయొక్క; చిత్తవృత్తిం = మనోవ్యాపారాన్ని; స్వజనయసి = నీదానిగా చేసుకొంటున్నావు.

**తా॥** ఓ రంగపతి పాదుకా! నెమ్మదిగా ఉంచబడిన పాదపద్మాలు కలిగిన, ఉల్లాసకరమైన సంచారానికి హేతువైన, రమ్యమైన ముత్యాలూ పవడాలూ కలిగిన నీవు, ధ్యానం చేయబడిన పాదకమలాలు కలిగిన పరలోక గమనానికి కారణమైన, తెల్లని దంపంక్తి ఎర్రని మోవిగల భగవంతుని మందహాస విషయకమైన ధ్యానం వంటిదానవు.

స్థిరంగా ఉన్న పద్మరాగమణులరక్తిమగల, నిష్కళంక ప్రేమగల భరతాది భక్తుల అనుబంధం కలిగి అంతట గోచరించే నీ మనోవ్యాపారం శాశ్వతంగా పరిణమించిన ప్రేమగల, సంశయ రహితమైన జ్ఞానంతో కూడిన, నీ పట్ల భక్తి నిల్పినమునులమనోవ్యాపారాన్ని నీతో సమానం చేసుకొంటుంది.

### వ్యాఖ్య:- పాదుకాదేవి, ధ్యాన సదృశమూర్తిగా వర్ణితం

భరతుని ప్రార్థనానంతరం భరతుని చిత్తవృత్తి, చిత్రకూట ప్రాంతమందున్న మునులచిత్తవృత్తి కూడా పాదుకామయమైంది. భంగ్యంతరంగా, పాదుకాచిత్త వృత్తి యొక్క సామ్యమూ అనుసంధింప బడింది. 'స్వజనయసి' అనే క్రియాపదం, పరస్పర విశేషణాల, పరస్పర స్వీకారం వల్ల సాదృశ్యంగా కల్పింబడింది.

చిత్త వృత్తి పాదుకావిషయమై ఉండగా, పాదుకాదేవి ఆ చిత్త వృత్తిని భగవద్విషయకంగా ఆపాదింపజేస్తుంది. అలాగే సద్గతికి హేతువవుతుంది. భగవంతుని మందస్మిత విషయం కూడా చిత్త వృత్తియందు పాదారవిందాల్లాగా నెలకొని ఉంటుంది.

పద్మరాగాధీనమైన రక్తిమ ఎలా స్థిరమయిందో, అలాగే ధ్యానించే మునుల ప్రేమ పాదుకయందు, పాదుకానురాగం ధ్యాతృజనులు విషయంలోనూ స్థిరంగా ఉంటుంది. అంతేకాదు, పాదుకయందలి ముత్యాల్లాగా శుద్ధజ్ఞానమూ, పవడాల్లాగా శాశ్వతమైన (అను)రాగమూ బింబప్రతిబింబ భావంగా ఉంటుందన్న ధర్మమూ, ఆలంకారికంగా చమత్కరింపబడింది.

'స్వజనీకరణం' అంటే స్వధర్మాన్ని పాదుకాచిత్త వృత్తి యందు స్థాపించడం - పాదుక, మునుల మనోవృత్తి - రెండింటికి సామ్యం శ్లేషతో కూడిన ఉపమాలంకారం. మాలినీ వృత్తం.

*887. విరచిత నవభాగా రత్నభేదై ర్విచిత్రై*
*ర్వివిధ వితతరేఖా వ్యక్త సీమావిభాగా!*
*హరిచరణ సరోజం ప్రేప్సతా మర్చనీయం*
*ప్రథయసి నవనాభం మండలం పాదుకే! త్వమ్ !!* 57

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకాదేవీ! విచిత్రైః = నానారూపాలుగల; రత్నభేదైః = వేర్వేరు రత్నాలచేత; విరచితనవభాగా = ఏర్పరచబడిన తొమ్మిది అంశాలుగల; వివిధ వితత రేఖా వ్యక్త సీమావిభాగా = పలురకాలైన విస్తృత రేఖల చేత స్ఫుటమైన ఎల్లల విభాగంలగల; త్వం = నీవు; హరిచరణ సరోజం = భగవత్పాదారవిందాలను; ప్ర+ఈప్సితాం = పొందగోరే వారికి; అర్చనీయం = పూజింపదగిన; నవనాభం = నవనాభమనేపేరుగల; మండలం = మండలాన్ని; ప్రథయసి = ప్రకటిస్తున్నావు.

**తా॥** ఓ పాదుకా! చిత్రవిచిత్రాలైన నవరత్నాలచేత రచింపబడిన నవభాగాలుకలిగి వివిధ విస్తృత రేఖలచే వెల్లడియైన ఎల్లల విభాగం గలనీవు, భగవచ్చరణ కమలప్రాప్తిని గోరే వారికి అర్చింపదగిన నవనాభమండలాన్ని స్మరింప జేస్తున్నావు.

**వ్యాఖ్య:- పాదుక నవనాభ మండలంగా వర్ణితం**

పాదుక(ల)లో నవరత్నాలు పొదుగబడినాయి.

"ముక్తామాణిక్యవైడూర్య గోమేధాన్ వజ్రవిద్రుమౌ!
పద్మరాగం మరకతం నీలంచేతి యథాక్రమమ్ !!"

ముత్యాలు, మాణిక్యాలు, వైడూర్యాలు, గోమేధాలు, వజ్రాలు, పవడాలు, పద్మరాగాలు, మరకతాలు, ఇంద్రనీలాలు అనే నవరత్నాలు ఖచితమవడంవల్ల, పాదుకయందు తొమ్మిదిరేఖలేర్పడి తొమ్మిది మండలాలు స్ఫుటంగా కనబడుతున్నాయి.

భగవత్పాద కమలసేవ చేయగోరే వారు - మోక్షఫలాన్ని పొందే వాంఛ కలవారు - తొమ్మిది చక్రాలతో నేర్పరచిన నవనాభమండలాన్ని పూజించాలని పాంచరాత్రాగమమందు చెప్పబడింది.

'నాభి' అనే చక్రవర్తి వంశమందు జన్మించిన వారు 'నాభులు' - వారు తొమ్మండుగురు. నవనాభులచే భారత వర్షం తొమ్మిది భాగాలుగా విభజింపబడింది. కాబట్టి భారత వర్షానికి 'నవనాభ మండల' మని పేరు.

"హేమాహ్వాయంతువై వర్షం నాభే రాసీన్మహాత్మనః" - (వి.పు)

"నాభి" చక్రర్తికి ఋషభుడు పుత్రుడు. అతని సంతతివారు నవనాభులు. వారు అప్పటి భారతదేశాన్ని నవధా విభజించారు. (మండలం = భారత భూ భాగం) "భారతస్యాస్య వర్షస్య నవభేదాన్ నిశామయ ఇంద్రద్వీపః కేశభూ శ్చ తామ్రపర్ణో గభస్తిమాన్! నాగద్వీప స్థథా సౌమ్యో గంధర్వస్వథ వారుణః! అయంతు నవమస్తేషాం ద్వీప స్సాగర సంయుతః!!" (వి.పు)

అని, భారతదేశం 'నవ ద్వీప'గా పేర్కొనబడింది. భరతుడు తెచ్చిన పాదుకలకు చేసే అర్చన భూమండలమంతటా వ్యాప్తి చెందింది. "కర్మభూమి మిమాం ప్రాప్యకర్తవ్యం కర్మయచ్ఛుభమ్" (వాల్మీకి) "కర్మభూమింజయం స్వర్గ మపవర్గంచ గచ్ఛతామ్" - అన్నట్లు ముక్తిని పొందగోరే వారైనా కర్మభూమియందే ధర్మాన్ని అనుష్ఠించాలి కదా! కాబట్టి, పాదుకాదేవి ప్రశస్త భూమండలంగా వర్ణించబడింది. దేశికుల దేశభక్తి ప్రశంసనీయం కదా! ఉపమాలంకారం. మాలినీ వృత్తం.

*888. పరిణత గుణజాలా పంక్తిభి ర్మౌక్తికానాం*
*బహువిధ మణిరశ్మి గ్రంథి బంధాభిరామా!*
*రఘుపతి పదరక్షే! రాజవాహ్యాస్యకుంభే*
*కలిత రుచిర భూస్త్వం కాఽపిన క్షత్రమాలా !!* 58

**అర్థం:-** హే రఘుపతి పదరక్షే -ఓ రాఘవపాదుకా! మౌక్తికానాం = ముత్యాల యొక్క, పంక్తిభిః = వరుసలచేత: పరిణత గుణజాలా = ఏర్పడిన ఉత్కర్ష బాహుళ్యమనే సూత్ర సమూహంగల; బహు విధ మణిరశ్మి గ్రంథి బంధ + అభిరామా = పలురకాలమణుల కిరణాలయొక్క దట్టమైన అల్లిక లనే త్రాళ్ళముడులచేత అందమైన; త్వం = నీవు; రాజవాహ్యాస్య = శత్రుంజయమనే పట్టపు టేనుగు యొక్క; కుంభే = కుంభస్థలమందు; కలిత రుచిః = విస్తరించిన ప్రకాశం కలిగిన; అపి = ఒకానొక (విలక్షణమైన) నక్షత్రమాలా = నక్షత్రమాల - చుక్కల బంతి-గా; అభూః = అయ్యావు.

**తా॥** ఓ రఘుపతి పాదుకా! ముత్యాల పంక్తులచే పరిణమించిన గుణబాహుళ్యమనే సూత్రసముదాయంగల, అనేక మణుల కిరణాల నిబిడ సంవలనమనే త్రాళ్ళముడులచేత అందమైన నీవు, శత్రుంజయమనే పట్టంపు టేనుగు కుంభస్థలమందు ప్రకాశించే ఒక విలక్షణమైన నక్షత్రమాలగా అయ్యావు.

వ్యాఖ్య:- పాదుక, గజ కుంభమందు ప్రకాశించే నక్షత్ర మాలగా వర్ణితం

అయోధ్యానగర రాజుల పట్టపు టేనుగు - శత్రుంజయం - యొక్క తలయందు అలంకరించే హారం పేరు 'నక్షత్రమాల'. ఇంద్రుని వాహనమైన ఐరావతానికీ నక్షత్రమాలనలంకరించడం పరిపాటి.

'గుణజాల, రశ్మిగ్రంథి' పదాలు శ్లిష్టరూపకాలు.

రంగు రంగుల త్రాళ్ళచే కొన్ని ముడులువేసి ఏనుగు తలకు అందంగా చుట్టే హారం 'నక్షత్రమాల' - 'యాదవాభ్యుదయం' లో (18వ సర్గ 21 శ్లోకం)

"అముష్య దీప్తోన్నదంత భూమ్నో నక్షత్రమాలాంచిత తుంగ మౌళేః !
పాదేషు భాంతి స్పటికాః ప్రభూతాః, నాకద్విపస్యేవ నఖేందు బింభాః !!"

'ఐరావతం నక్షత్ర మాలాంచితం' అన్న పోలిక గమనీయం.

పాదుకలయందు ముత్యాల పంక్తులు దారాల వరుసవలె తీర్చబడియుండడం, పలురంగుల మణుల కిరణకాంతులు దట్టంగా చుట్టుకోవడం, ముడులు ముడులు గల నక్షత్ర మాలారూపంగా రంజితం. "సైవ నక్షత్ర మాలాస్యాత్ సప్త వింశతి మౌక్తికైః" (అమరం)

ఇరువయ్యేడు ముత్యాలు కూర్చబడిన ఒంటి సరమున్నహారం 'నక్షత్రమాల'. శ్లేషతోకూడిన రూపకాలంకారం. మాలినీ వృత్తం.

*889. చరిత నిఖిల వృత్తి శ్చారుపద్మాసనస్థా*
*గుణనిబిడితముక్తా పంక్తి బద్ధాక్షమాలా!*
*సవిధమధివ సంతీ పాదుకే! రంగభర్తు*
*శ్చరణకమల మంతర్బింబితం ధ్యాయసేవ !! 59*

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! చరితనిఖిల వృత్తిః = సంచారమేసకల వృత్తిగాగల/అనుష్ఠించబడిన యమనియమసర్వ వ్యాపారంగల; చారుపద్మ+ఆసనస్థా = అందమైన కమలాకృతి పీఠమందున్న పద్మాసనమయే యోగాసనమందున్న; గుణ నిబిడిత ముక్తాపంక్తి బద్ధ అక్షమాలా = పవిత్ర సూత్రాలతోకూర్చిన ముత్యాల పంక్తిచే కట్టబడిన జపమాలకలిగిన కుంభకం చేత స్థాపింపబడిన ప్రాణవాయువును (ముక్+తా, పంక్తి) అన-వరతం వదలడం చేత (ప్రత్యాహారంచేత) వశీకరింపబడిన; అక్షమాలా = ఇంద్రియ సమూహంగల; రంగభర్తుః = శ్రీరంగనాథుని యొక్క; సవిధం = సమీపాన; అధివసంతీ = నివసించే / ధారణచేసే, నీవు; అంతః = లోపల; బింబితం = ప్రతిఫలించిన / సమాధి దశలో అంతఃకరణమందు ధ్యానం చేత విషయీ కరింపబడిన; చరణకమలం = భగవత్పాదారవిందాన్ని; ధ్యాయసి, ఇవ = ధ్యానిస్తున్నట్లున్నావు.

తా॥ ఓ పాదుకాదేవీ! సంచారమేజీవన వ్యాపారం గల, పద్మపీఠమందుండి దట్టంగా బిగించిన ముత్యాలచే కూర్చబడిన జపమాలగల, శ్రీరంగపతిసన్నిధిలో నివసించే నీవు, నీలోన ప్రతిబింబించే భగవత్పాదపద్మాలను, అష్టాంగ యోగమను భవిస్తున్నట్లు, ధ్యానిస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుకాదేవి అష్టాంగయోగినిగా శ్లేషతో ఉత్ప్రేక్షితం

ధ్యానప్రసక్తిని బట్టి అష్టాంగయోగం ఈ శ్లోకంలో వర్ణితం.

"యోగాశ్చిత్త వృత్తినిరోధః" చిత్తవృత్తినిగ్రహమే యోగం, అని నిర్వచనం. యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి - అష్టాంగ యోగం.

1. యమం :- అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం, అని పంచశీలగా అభివ్యంజితం.

2. నియమం:- శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం, అని పంచలీలగా రూపొందింది. సౌశీల్య సంబంధకాలైన యమనియమాలు 'చరితనిఖిలవృత్తిః' అనే పదంలో సూచితాలు.

3. ఆసనం:- శీర్షం, కంఠం, వక్షఃస్థలం నిడివిగా ఒకే ఋజురేఖలో ఉండే రీతిగా కూర్చొవడం పద్మాసనం. 'చారుపద్మాసనస్థా' సూచిస్తుంది.

4. ప్రాణాయామం :- ఉచ్ఛ్వాస నిశ్వాసాలను క్రమబద్ధం చేయడం. దీని వల్ల మనస్సు నిర్మలమై బ్రహ్మ నిష్ఠమవుతుంది.

5. ప్రత్యాహారం:- మనోనిగ్రహం ద్వారా ఇంద్రియ నిగ్రహాన్ని సాధించడం. 'గుణనిబిడిత - అక్షమాలా' అనే ద్వితీయ చరణం వల్ల 'ప్రాణాయామ ప్రత్యాహార' యోగాంగాలు రెండు సూచింపబడినాయి.

6. ధారణ:- తామస ప్రవృత్తిని విసర్జించి, రాజసవాసనలను పరిహరించి సాత్త్వికత్వాన్ని సమృద్ధి చేసుకోవడానికి చిత్త వృత్తిని ఏకాగ్రం చేయడం. ఇది సులభసాధ్యం కాదు. కాబట్టి, గురువు లేదా దైవసాన్నిధ్యంలో అనుష్ఠించ వలసిందే - 'రంగ భర్తుః సవిధమధి వసంతీ' వాక్యం సూచిస్తుంది.

7. ధ్యానం:- సమ్యక్ స్ఫూర్తిని కలిగించేది.

8. సమాధి :- (సమ+అధి) అంతరంగంలో ధ్యేయమూర్తిని ప్రతిబింబింప చేసుకొని, బాహ్య స్పృహ లేకుండా ఉండే శుద్ధజ్ఞానానందమయస్థితి. ఇది ధ్యాన యోగానికి అతీతమైన దశ.

'ధ్యాన ధారణ సమాధులు' అనే మూడింటికీ 'సంయమం' అని పేరు. 'చరణకమల మంతర్బింబితం ధ్యాయ సీవ' అనే తురీయచరణంలో 'ధ్యాన, సమాధి' దశలు సూచింపబడినాయి.

క్లిష్టమైన శ్లిష్టపద రచన చేత పాదుకాదేవి అష్టాంగయోగనిష్ఠలో ఉన్నట్లు ప్రస్తుతింపబడింది. మాలినీ వృత్తం.

890. అనుపధి పరిరక్షన్ ఏక పుత్రాభిమానాత్
భువన మిద మశేషం పాదుకే! రంగనాథః!
నిజపదనిహితా యాందేవి! తిష్ఠన్ వ్రజన్ వా
త్వయి నిహితభరోఽభూత్ కింపునః స్వాపమృచ్ఛన్ 60

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! అశేషం = సమస్తమైన; ఇదం = ఈ; భువనం = జగత్తును; ఏక పుత్ర+అభిమానాత్ = ఒక్క పుత్రుడు కలవాని వంటి ప్రేమవల్ల; అనుపధి = కపటం లేకుండా; పరిరక్షన్ = పాలించే; రంగనాథః = శ్రీ రంగనాథుడు; తిష్ఠన్ = నిలిచినప్పుడు; వ్రజన్, వా = నడచి నప్పుడైనా; దేవి = ఓ రాజ్యధురంధరురాలా! నిజపద నిహితాయాం = తనపాదమందు / స్థానమందు (సింహాసనమందు) ఉంచబడిన; త్వయి = నీయందు; నిహిత భరః = మోపబడిన తనభారమూ, రాజ్యభారమూ కలవాడై; అభూత్ = ఆయెను. స్వాపం = నిద్రకు; ఋచ్ఛన్ = పోతున్నప్పుడు; కిం, పునః = మరి చెప్పవలసిందేమి?

**తా॥** ఓ పాదుకాదేవీ! తండ్రి కపటంలేని ప్రేమతో పుత్రుణ్ని పాలించినట్లు ఈ జగత్తునంతా పాలించే శ్రీరంగనాథుడు నిలుచున్నా, నడుస్తున్నా తనపాదాలయందు, సింహాసనమందు నిన్ను ఉంచి, నీయందు తన భారాన్నీ, రాజ్యభారాన్నీ మోపినవాడయ్యాడు. ఇక నిద్రాళుడైనప్పుడు తన భారాన్ని మోపినాడని చెప్పనక్కరలేదుకదా!

వ్యాఖ్య:- విశ్వభారవాహిని పాదుకాదేవియే అని వర్ణన.

లోక రక్షణ భారాన్ని వహించే వాడొక్కడుండక తప్పదు. 'పితాచ రక్షకః శేషీ' అన్నట్లూ తండ్రికి కన్న కొడుకుమీద ఎంత ప్రేమ ఉంటుందో, అంత అవ్యాజప్రేమతో భగవంతుడు ఈ పరిదృశ్యమాన జగత్తును రక్షిస్తున్నాడు. ఆయన తన పాదాలకు పాదుకలను ధరించి నిలుచున్నా, నడుస్తున్నా తన భారాన్ని పాదుకలపైన మోపుతాడు. రామావతారంలో తన సింహాసనమందు స్థాపించి రాజ్యభారాన్నీ మోపినాడుకదా!

విశ్వంభరుడైన శ్రీరంగనాథుడు జాగరూకుడైనప్పుడే పాదుక జగద్రక్షణ భారాన్ని వహిస్తుంటే, ఆయన నిద్రపోతున్నప్పుడు కూడా ఆభారాన్ని వహిస్తుందని చెప్పడమెందుకు? ఇది కైముత్య సిద్ధం.

"ఉపధిశ్ఛద్మకైతవే" (అమరం) న ఉపధిఃయథాతథా = అనుపధి. శ్రీరంగనాథుని పదరక్షణభారాన్ని వహిస్తూ, పాదుక స్వామికి సర్వదా విశ్రాంతిని కలిగిస్తుంది. 878వ శ్లోకంలో శ్రీ రంగనాథుడు నిజ భారాన్ని పాదుక యందు మోపి, నిరంకుశంగా భోగి భోగంమీద శయనిస్తాడని మాత్రమే చెప్పిన విషయం గమనీయం. కావ్యార్థాపత్త్యలంకారం. మాలినీవృత్తం.

891. త్వరిత ముపగతానాం శ్రీమతోరంగభర్తు
స్త్వ దుపహిత పదస్య స్వైరయాత్రోత్సవేషు ।
ముఖరయతి ది గంతా న్మహ్యతాం త్వత్ప్రశస్తౌ
విహిత కుసుమవృష్టి ర్వ్యావఘోషీ సురాణామ్ ॥ 61

**అర్థం:-** హే పాదుకే! త్వత్ + ఉపహిత పదస్య = నీయందు ఉంచబడిన పాదంగల; శ్రీమతః = శ్రీమంతుడైన; రంగభర్తుః = రంగపతియొక్క; స్వైరయాత్రా + ఉత్సవేషు = స్వేచ్ఛా సంచారంతో కూడిన ఉత్సవాలయందు; త్వరితం = శీఘ్రంగా; ఉపగతానాం = దగ్గరకు వచ్చినట్టి; త్వత్ = ప్రశస్తౌ = నీ స్తుతియందు; ముహ్యతాం = వ్యామోహపడుతున్న; సురాణాం = దేవతలయొక్క; విహిత కుసుమవృష్టిః = చేయబడిన పూలవాన గల; వ్యావఘోషీ = (కలిసి స్తుతించిన) ధ్వని; దిక్+అంతాన్ = దిక్కుల ఎల్లలను; ముఖరయతి = ధ్వనింపజేస్తున్నది.

**తా॥** ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాథుడు నీయందు తన పాదాలనుంచి ఉత్సవాల్లో వీథులవెంట స్వేచ్ఛగా తిరుగుతాడు. అప్పుడు దేవతలు వేగంగా వచ్చి నీ గుణాలనే పొగడుతారు. నీమీది వ్యామోహంవల్ల వారు పూలవానకురిపిస్తారు. అందరు కలిసి నిన్ను స్తుతించే ధ్వని దిగంతాల్లో ప్రతిధ్వనిస్తుంది.

వ్యాఖ్య:- దేవతలు పాదుకాదేవిని దర్శించి స్తుతిస్తారని వర్ణన.

శ్రీరంగనాథుడు పాదుకలను ధరించకుండా అడుగు బయటపెట్టడు. పాదరక్షణభారం పాదుకదేకదా! కాబట్టి, శ్రీరంగనాథుని యాత్రోత్సవాల్లో పాదుకలను ధరించే స్వామిని దర్శించడానికి దేవతలు పరుగెత్తుకొని వస్తారు. పాదుకా దర్శనంచేసుకొని స్తుతిచేయడమూ వారి ముఖ్యాశయం.

దేవతలు ఏమని స్తుతిస్తున్నారో నిర్ణయింపవలను పడదు, కాని వారు భక్తి శ్రద్ధలతో కురిపించిన పుష్పరాశి స్వామి నుంచి పాదుకలమీద చేరి ఆగిపోతుంది. పూలవాన పాదుకలమీద పడుతున్నప్పుడు, దేవతలు ఒకరి మొగం మరొకరు చూస్తూ, ఆనందంతో స్తోత్రం చేస్తారు. ఆస్తోత్రధ్వని దిగంతాలకు వ్యాపించి ప్రతిధ్వనిస్తుంది. ఇదంతా అమరులకు పాదుకయందున్న భక్తి గౌరవాలకు నిదర్శనంకదా! ఉదాత్తాలంకారం. మాలినీవృత్తం.

*892.* *మనసి నియమయుక్తే వర్తమానా మునీనాం*
*ప్రతి పదముపయాంతీ భావనీయక్రమత్వమ్ ।*
*శ్రుతిరివ నిజశబ్దైః పాదుకే! రంగభర్తుః*
*పదమనితరగమ్యం వ్యంక్తుమర్హా త్వమేవ ॥* 62

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! మునీనాం = యోగులయొక్క; నియమ యుక్తే = నియమంతో కూడిన; మనసి = చిత్తమందు; వర్తమానా = ధ్యానింపబడుతున్న; ప్రతిపదం = ఒక్కొక్క అడుగున సుబ్తిఙన్తమైన పదాన; భావనీయక్రమత్వం = దర్శనీయమైన క్రమభావాన్ని గణనీయమైన క్రమపారాయణభావాన్ని; ఉపయాంతీ = దగ్గరకువచ్చి సేవించే; త్వం, ఏవ = నీవే; శ్రుతిః ఇవ = వేదంవలె; అనితరగమ్యం = ఇతరులచే పొందరాని / వేరే ప్రమాణాలకు గోచరం కానట్టి; రంగభర్తుః = శ్రీరంగపతి యొక్క; పదం = చరణాన్ని స్వరూపాన్ని; నిజశబ్దైః = తన నాదాలచేత స్వీయ శబ్దాలచేత; వ్యంక్తుం = స్పష్టంచేయడానికి; అర్హా = యోగ్యవు.

**తా॥** ఓ పాదుకా! నియమ యుక్తమైన యోగుల మనస్సున చింతింపబడే ప్రతిపాదమందు చూడదగిన, ఆనుపూర్విని భజించే నీవే; నీకంటెవేరే వారిచేత పొందరాని శ్రీరంగనాథుని పాదాన్ని స్వీయనాదాలచేత, ప్రతి

సుబ్జన్త పదమందు గణనీయమైన వేదక్రమపాఠం యొక్క అధ్యయన భావాన్ని ఆశ్రయించే వేదంవలె, వేదవ్యతిరిక్త ప్రమాణాలకు గోచరంకాని శ్రీరంగనాథుని స్వరూపాన్ని స్వీయ శబ్దాలచేత తెలియజేయడానికి యోగ్యురాలవయ్యావు.

**వ్యాఖ్య:- భగవత్స్వరూపాన్ని తెలిపే వేదంవలె, పాదుకాదేవి భగవచ్చరణాలను గమనింపజేసే యోగ్యురాలు అని వర్ణన.**

దైవభక్తి, ఆచార్య భక్తి, సత్యం, సర్వభూతదయ, కామక్రోధాసూయాది రాహిత్యం, బ్రహ్మచర్యం ఇత్యాది నియమాలతో కూడియున్న మునీశ్వరుల మనస్సున వేదం చింతన చేయబడుతుంది. పాదుక ధ్యానింపబడుతుంది. అట్టి మునీశ్వరుల ననుగ్రహింప స్వామిబయల్దేరుతాడు.

మరో విధంగా, కాంచరాని భగవచ్చరణాలను తానాశ్రయించి కనిపింపజేసేది పాదుక. సంచారసమయంలో అడుగుదీసి మరొక్క అడుగు పెట్టే భగవంతుని చరణ విక్షేపంతోపాటు పాదుకా విక్షేపమూ చూడముచ్చటగా ఉంటుంది. యాత్రోత్సవంలో మహానుభావులైన విద్వాంసులు వేదక్రమపాఠాన్ని అధ్యయనం చేస్తారు. పాదుకా క్రమ పాఠంతో కూడిన శ్రుతివలె భాసిస్తుంది.

వేదమంత్ర క్రమపాఠం పదనిర్ధారణ మూలకమై సంప్రదాయంగా ప్రవర్తిస్తుంది. 'ఇషేత్వోర్జేత్వా' అనే సంహితలో 'ఇషే, త్వా, ఊర్జే, త్వా' అనేది పదవిభాగం. క్రమంలో రెండేసి పదాలు అధ్యయనం చేయబడుతాయి. అయితే మొదట చెప్పిన పదాన్ని త్యజిస్తూ, ఉత్తర పదాన్ని స్వీకరిస్తూ అధ్యయనం చేయడం క్రమపద్ధతి. ఉదాహరణకు :- "ఇషేత్వా; త్వోర్జే; ఊర్జేత్వా" అని గృహీతముక్త రీత్యా క్రమపాఠం పారాయణం చేయబడుతుంది.

వేదం శబ్ద ప్రధానం. ఆశబ్ద ప్రమాణంచేత "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని శ్రీమన్నారాయణుని యొక్క, పరమపదం యొక్క స్వరూపాన్ని వేదం తెలియజేస్తుంది. తన మంజులనాదంచేత "ఇదిగో! భగవంతుని చరణారవిందం" అని పాదుక 'క్రమపద్ధతి'లో పాదయుగళాన్ని ప్రదర్శిస్తుంది.

'క్రమం'గా పాదుకా నాదశ్రవణం వల్ల శ్రీరంగనాథుని రాకడ తెలిసి, ప్రజలకు దర్శనం చేసుకొనే భాగ్యం కలుగుతుంది. శ్లేషతో కూడిన ఉపమాలంకారం. మాలినీ వృత్తం.

*893. అవికలనిజచంద్రాలోక సందర్శనీయా*
*ప్రతికలము పభోగ్యా పాదుకే! రంగభర్తుః !*
*ముకుళయితు మశేషం మౌక్తిక జ్యోత్స్నయానః*
*ప్రభవసి తిమిరౌఘం పౌర్ణమాసీ నిశేవ !! 63*

**అర్థం:-** హే రంగభర్తుః, పాదుకే = ఓరంగరాజ పాదుకా! అవికల నిజచంద్ర+ఆలోక సందర్శనీయా = దోషం లేని తన బంగారపు కాంతిచే బాగా కనబడే / నిండైన తన చంద్రకాంతిచే చూడసొబగైన; ప్రతికలం = ప్రతిక్షణం / ప్రతికళ; ఉపభోగ్యా = అనుభవింపదగిన; నీవు; పౌర్ణమాసీ = పూర్ణిమకు సంబంధించిన; నిశా, ఇవ = రాత్రివలె; మౌక్తిక జ్యోత్స్నయా = ముత్యాల ధవళకాంతిచేత / ముత్యాలవంటి చల్లని తెల్లని వెన్నెలచేత; నః =

మా యొక్క; అశేషం = సంపూర్ణమైన; తిమిర + ఓ ఘం = అజ్ఞాన / అంధకార సముదాయాన్ని: ముకుళయితుం = ముడుచుకొనే రీతి జేయ - పోగొట్టడానికి, ప్రభవసి = సమర్థురాలవు.

**తా॥** ఓ శ్రీరంగ ప్రభుపాదుకా! చొక్కపుబంగారపు కాంతిచే బాగా కనబడునట్టి, ప్రతిక్షణం అనుభవం చేత సుఖాన్ని కలిగించేనీవు.పూర్ణమైన తన చంద్రకాంతిచే చూడసొంపైన, ప్రతికళ అనుభవింపదగిన పున్నమరేయి లాగా ముత్యాలవంటి స్వచ్ఛమైన వెన్నెలచేత మా అజ్ఞానాంధకార సముదాయాన్ని నివారింప శక్తిమతివి.

వ్యాఖ్య:- పాదుకాదేవి పున్నమరాత్రివలె ప్రకాశించే వర్ణన

నానార్థాలుగల చంద్ర, కళ, జ్యోత్స్న, తిమిర పదాల రచన చేత పాదుకను, ముత్యాల కాంతివలె అహ్లాదకరమైన చంద్రచంద్రికలచేత అజ్ఞానాంధకారాన్ని అణచివేసే పున్నమ రాత్రితోపోల్చినాడు కవి. శ్లేషాను ప్రాణితోపమాలంకారం, మాలినీ వృత్తం.

*894. హంసశ్రేణీ పరిచితగతి ర్హారిణీ కల్మషాణాం*
*మౌళౌశంభోః స్థితి మధిగతా ముగ్ధచంద్రానుబద్ధా !*
*రాజ్ఞామేకా రఘుకుల భువాం సమ్యగుత్తారి కాత్వం*
*కాలే తస్మిన్ క్షితిమధిగతా పాదుకే! జాహ్నవీవ !!* **64**

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! హంసశ్రేణీ పరిచిత గతిః = పరమ హంసల సమూహంచేత సేవింపబడే సంచారం కలిగిన / అంచలగుంపుచేత అలవాటుపడిన ప్రవహంకలిగిన; కల్మషాణాం = పాపాలను / శరీర మలినాలను; హారిణీ = పోగొట్టే; శంభోః = శివునియొక్క; మౌళౌ = శిరస్సున; స్థితిం = ఉనికిని: అధిగతా = పొందిన, ముగ్ధచంద్ర+అనుబద్ధా = అందమైన బంగారంతో కూడియున్న / బాలచంద్రునితో కూడియున్న; రఘుకుల భువాం = ఇక్ష్వాకు వంశమందుజనించిన; రాజ్ఞాం = రాజులను /సగర పుత్రులను; ఏకా = అసహాయవై; సమ్యక్ = బాగుగా; ఉత్తారికా = ఉద్ధరించిన / ఊర్ధ్వలోకానికి చేర్చిన; త్వం = నీవు; జాహ్నవీ, ఇవ = గంగవలె; తస్మిన్, కాలే = సత్యలోకంనుంచి అయోధ్యకు వచ్చిన సమయమందు / భగీరథుని తపఃకాలమందు; క్షితిం = భూమిని; అధిగతా = పొందినావు/చేరినావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! పరమ హంసలనే యోగులు సేవించే సంచారం కలిగి, పాపాలను తొలగిస్తూ, పరమశివుని తలమీద ధరింపబడిన, చొక్కంబంగారంతో కూడిన, ఇక్ష్వాకు ప్రభృతులైన రాజులను సంసార సముద్రంనుంచి తరింప జేసిన నీవు, సత్యలోకంనుంచి బయల్దేరి అంచలబారు దీరియున్న ప్రవాహంకల్గి, కాలుష్యాన్ని తొలగిస్తూ, శంభుని శిరస్సున చేరి, బాలచంద్రునితో కలిసి యుండి, కపిలమహాముని కోపాగ్నికి గురియైన సగరపుత్రులకు సద్గతిని కలిగించడానికి భగీరథుడు తపస్సు చేసిన కాలమందు భూలోకానికి చేరుకొన్న గంగాదేవి వలె, అయోధ్యకు చేరుకొన్నావు.

వ్యాఖ్య:- పాదుకాదేవి జాహ్నవి లాగా ఇక్ష్వాకువంశరాజులచే భూలోకానికి చేరుకొన్నదన్న ప్రస్తుతి

"హంసోవిహంగ భేదేస్యాత్ హంసే విష్ణౌ హయాంతరే!
యోగిమంత్రాది భేదేషు పరమాత్మని" - (విశ్వనిఘంటువు.)

1. పాదుక పరమహంసలచే సేవింపబడుతుంది
జాహ్నవి హంస పక్షులున్న ప్రవాహంచేత శోభించేది.

2. పాదుక పాపాలను ప్రక్షాళనంచేసి పావనం చేస్తుంది.
జాహ్నవి మురికిని పోగొట్టి పరిశుద్ధిని కలిగిస్తుంది.

3. పాదుక మంచి బంగారంతో కూడియున్నది.
జాహ్నవి శంభుని శిరస్సున బాలచంద్రునితో కూడియున్నది.

4. పాదుక తపస్సుచేసిన ఇక్ష్వాకు మహారాజుచే (అంతకుముందే రంగ విమానాన్ని పూజించే బ్రహ్మతో పరవాసుదేవుడు ఇక్ష్వాకుని కిమ్మని ఆజ్ఞాపించినందువల్ల) సత్యలోకంనుంచి అయోధ్యకు చేరింది.
జాహ్నవి ఘోర తపస్సుచేసిన భగీరథుని చేత (సగరపుత్రులకు సద్గతిని కలిగించడానికి) సత్యలోకంనుంచి భూలోకానికి జారింది.

ఉపమేయమైన పాదుకకు ఉపమానమైన జాహ్నవి యొక్క ధర్మాలన్నీ సాధారణ మైనందువల్ల, పాదుకాదేవికి గంగాదేవితో మనోహరంగా సాదృశ్యం కల్పితం. శ్లేషతో కూడిన ఉపమాలంకారం. మందాక్రాంతావృత్తం.

*895. స్వచ్ఛాకారాం శ్రుతిసురభితాం స్వాదుభావోపపన్నాం*
*మార్గే మార్గే మహితవిభవాం పాదుకే! తీర్థభేదైః !*
*శీతస్పర్శాం శ్రమవినయనీం గాహతే మందమందం*
*క్రీడాలోలః కమలనిలయా దత్తహస్తోయువాత్వామ్ !! 65*

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకా! స్వచ్ఛ+ఆకారం = పరిశుద్ధమైన ఆకృతి కల; శ్రుతి సురభితాం = వేదం చేత పరిమళింపబడుతున్న; స్వాదు భావ + ఉపపన్నాం = భోగ్యగుణం చేత / మధుర రసంతో కూడిన; మార్గే మార్గే = అక్కడక్కడ మార్గమందు; తీర్థభేదైః = ఆచార్య పురుషులచేత / రేవుల చేత; మహిత విభవాం = ప్రశంసింబడిన సంపదగల; శీత స్పర్శాం = చల్లని స్పర్శగల; శ్రమవినయనీం = సాంసారికమైన బడలికను / తాపంవలని ఆయాసాన్ని పోగొట్టే; త్వాం = నిన్ను; (కావేరీనదిని) క్రీడాలోలః = సంచారమందు ప్రీతిగల / జలక్రీడయందాసక్తిగల; కమల నిలయా దత్తహస్తః = మహాలక్ష్మిచేత ఈయబడిన చేయగల; యువా = యువకుడైన శ్రీరంగనాథుడు; మందం మందం = సావధానంగా / మెల్లమెల్లగా; గాహతే = దగ్గరికి చేరుతాడు / స్నానంకోసం ప్రవేశిస్తాడు.

తా॥ ఓ పాదుకాదేవీ! అణిముత్యాలచే శుభ్రమైన ఆకారం కలిగి, వేద ప్రతి పాదితమై, ఇంపైన గుణంతోకూడిన, అక్కడక్కడ దారిలో ఆచార్య పురుషులతో బహుమానింపబడిన మహిమ కలిగి, సంసారజన్యమైన శ్రమను నివారించే నిన్ను,- విహరించే ఆసక్తి కలిగి లక్ష్మీదేవికేలు పట్టుకొని యువకుడైన శ్రీరంగ నాయకుడు; తేట నీటితో స్వచ్ఛమైన ఆకృతి కలిగి వేద బోధ్యమైన మాధుర్య గుణంతోకూడిన, దారిలో అక్కడక్కడ రేవుల చేత కీర్తింపబడిన సంపదకలిగి, చల్లని స్పర్శతో సర్వేంద్రియాలకు భోగ్యానుభవం కలిగించి తాపాన్ని శమింపజేసే కావేరీ మహానదిలో జలక్రీడాలోలుడై లక్ష్మీ సమేతుడైన నిత్యయువకుడు శ్రీరంగనాథుడు మెల్లమెల్లగా ప్రవేశించినట్లు,- సావధానంగా చేరి తనపాదాలకు ధరిస్తాడు.

వ్యాఖ్య :- పాదుక, జలక్రీడకు యోగ్యమైన తీర్థరూపంగా వర్ణితం

1 భగవత్పాదుక,అణిముత్యాలచే శుభ్రమైన ఆకారంకలది.
కావేరీతీర్థం. తేటనీటిచే స్వచ్ఛమైన ఆకృతికలది.

2. పాదుక 'చరణం పవిత్రం వితతం పురాణ' మనివేద ప్రతిపాదితం.
తీర్థం 'నర్మదా సింధూకావేరి' అని స్మృతి బోధితం.

3. పాదుక ప్రశస్తగుణం కలది.
తీర్థం మధురగుణం కలది.

4. పాదుక పరాంకుశ పరకాలాది మునులచే బహుమానితం
తీర్థం పరీవాహ ప్రదేశంలో అనేకమైన రేవులచే సంకీర్తితం, సంపూజితం.

"నిపానాగమయో స్తీర్థ మృషిజుష్టజలేగురౌ" (అమరం)

"తీర్థం శస్త్రాధ్వరక్షేత్రోపాయోపాధ్యాయమంత్రిషు ।

అవతారర్షిజుష్టాంభః స్త్రీ రజస్సుచ" (విశ్వనిఘంటువు)

5. పాదుక శీతల స్పర్శతో సంసారజన్య శ్రమను, ఖేదాన్ని నివారిస్తుంది.
తీర్థం శైత్య గుణంతో గ్రీష్మజన్య తాపాన్ని శమింపజేస్తుంది.

6. లక్ష్మీసమేతుడైన శ్రీరంగనాథుడు సంచారార్థం సావధానంగా పాదుక(ల)ను ధరిస్తాడు.

నిత్యయువకుడైన శ్రీరంగనాయకుడు లక్ష్మి కెంగేలునుపట్టుకొని జలక్రీడార్థం నెమ్మదిగా కావేరీ సలిలంలోకి ప్రవేశిస్తాడు.

శ్లేషతో కూడిన సమాసోక్త్యలంకారం. మందాక్రాంతావృత్తం.

896. అభ్యస్యంత్యోః క్రమ మనుపమం రంగభర్తుర్విహారే
స్థానేస్థానే స్వరపరిణతిం లంభితస్తత్తదర్హాం ।
పర్యాయేన ప్రహితపదయోః పాదుకే! శ్రుత్యుదార
శింజానాదః స్ఫురతి యువయోః శృంఖలాబంధరమ్యః!! 66

**అర్థం:-** హేపాదుకే = ఓ పాదుకలారా! రంగభర్తుః = శ్రీరంగరాజుయొక్క; విహారే = సంచారమందు; అనుపమం = నిస్తులమైన / అందమైన; క్రమం = అడుగులువేయడాన్ని / రెండు పదాలను ఉచ్చరించే వేదక్రమ పాఠాన్ని; అభ్యస్యంత్యోః = పునః పునః అనుశీలిస్తున్న; పర్యాయేణ = ఒకటి తర్వాత మరొకటిగా; ప్రహితపదయోః = వేయబడిన అడుగుగల / ఉచ్చరింపబడిన శబ్దాలుగల; యువయోః = మీరెండింటికి; స్థానే స్థానే = ఒక్కొక్క స్థానమందు / స్వరయుక్త పదాలయందు; తత్+తత్+అర్హాం = దానికిదానికి తగిన; స్వరపరిణతిం = నాదంయొక్క / స్వరం యొక్క మార్పును; లంభితః = పొందిన; శ్రుతి+ఉదారః =వీనులవిందైన / వేదమందు ఉత్కృష్టమైన; శింజానాదః = అంతర్మణుల రవళి / స్వరనాదం; శృంఖలా బంధరమ్యః = గొలుసుకట్టు లాగా కూర్చడం వల్ల మనోజ్ఞమై; స్ఫురతి = శోభిస్తుంది.

**తా॥** ఓ పాదుకలారా! శ్రీరంగరాజు సంచారంలో అందమైన పాదవిక్షేపాన్ని అభ్యసిస్తూ, పర్యాయంగా అడుగులు వేసే మీ రెండింటికి ఒక్కొక్కస్థానమందు దానికి తగిన నాద పరిణామాన్ని పొందిన, అంతర్మణుల నాదం - నిస్తులమైన వేద క్రమాధ్యయనాన్ని అభ్యసిస్తూ, ఒకటి తర్వాత మరొకటిగా ఉచ్చరింపబడే స్వరయుక్తమైన రెండు పదాలయందు ఆయా పదోచ్చారణకు యోగ్యమైన స్వరం యొక్క మార్పును పొందిన శ్రుతి సుభగమైన క్రమాధ్యయన నాదమూ - గొలుసులాగా అల్లడం చేత రమణీయంగా స్ఫురిస్తుంది.

వ్యాఖ్య:- మణిపాదుకలనాదం, వేద క్రమాధ్యయనం లాగా శ్రుతిపేయమని వర్ణితం

త్వగింద్రియానికి భోగ్యానుభవ విషయాన్ని చెప్పిన తర్వాత ఈ శ్లోకంలో శ్రవణేంద్రియానికి భోగ్యమైన పాదుకానాదం శ్రుతి హితంగా ప్రశంసితం. 'పాదుకే' - ఇది సంబోధన ప్రథమావిభక్తి ద్వివచనాంతపదం. '892' శ్లోకంలో క్రమాధ్యయన పద్ధతి విశదీకృతం. ఈ శ్లోకంలో క్రమపాఠంలోని స్వరపరిణామం ప్రకటితం.

1. **అభ్యాసం:-** పునః పునరనుశీలనం. సంహితలోని రెండు పదాలను మొదట గ్రహించాలి. ఇందులో పూర్వపదాన్ని వదలివేసి రెండ పదానికి మూడవ పదాన్ని స్వీకరించి జత చేయాలి. వీటికి విధింపబడిన స్వరాలను స్పష్టంగా ఉచ్చరిస్తూ క్రమంగా అధ్యయనం చేయడం క్రమాధ్యయన పద్ధతి.
2. స్వర పరిణతి:- వేదంలోని పదాలు ఉదాత్తానుదాత్త స్వరితాలతో ఉచ్చరింపబడుతాయి. 'ఊర్జేత్వా వాయవస్థ' అనే చోట పదవిభాగంలో 'త్వా' అనే పదం అనుదాత్త స్వరంతో ఉచ్చరింపబడుతుంది. ఈ పదమే క్రమపాఠంలో స్వరం మార్చి ఉచ్చరింపబడడంగమనీయం. అనుదాత్తంగా ఉన్న 'త్వా' అనే పదాన్ని క్రమాధ్యయనంలో "ఊర్జే త్వా" అని స్వరిత స్వరంతో ఉచ్చరించాలి.

"ఉచ్చాత్ పరో ఽనుదాత్తోయః స్వరితత్వమవాప్నుయాత్" అని శాస్త్రం 'అగ్నిం, ఈళే' - విడిగా నున్న ఈ

రెండు పదాలను కలిపి 'క్రమపాఠం'గా చదివితే "అగ్ని "మీళే" అని ఈకారం స్వరితమై, దాని మీది వర్ణం 'ళే' 'ప్రచయ'మనే స్వరంతో ఉచ్చరింపబడుతుంది.

"స్వరితాత్ సంహితా యామనుదాత్తానాం ప్రచయ ఉదాత్త శ్రుతిః" అని స్వరోచ్చారణ విధివిహితం. పదపాఠానికి క్రమపాఠానికి స్వరాల మార్పు ఉంటుంది.

3. శృంఖలా బంధం:- గొలుసుకట్టు. విడిగా ఉన్న చిన్న బంగారు కడియాలరాశిలో నుంచి రెండు కడియాలను తీసుకొని ఒండొంటి జతపరచి, ఒకటిగా చేసిన దీనిలోని రెండవ కడియానికి మూడకవడియాన్ని గ్రహించి జతపరుస్తే ఇలాగే విడి కడియాలనన్నింటినీ ఒకటి తర్వాత మరొక కడియాన్ని సమకూర్చి - పొడవైన గొలుసు అల్లబడుతుంది. క్రమాధ్యయన మిలాగే ఉంటుంది. ఈ శ్లోక పదాలనే అనుశీలిద్దాం:- అభ్యస్యంత్యోః క్రమం, క్రమమనుపమం; అనుపమం రంగ భర్తుః, రంగభర్తుర్విహారే. ఇది క్రమ పాఠానికి ఉదాహృతం.

4. చర్చారూపక్రమాధ్యయనం :- వీథిలో భగవత్సేవ జరుగుతున్నప్పుడు వేద విద్వాంసులు ఆసేవకు వెనుక భాగంలో (వేద) క్రమాధ్యయనం చేస్తారు. ఆ విద్వాంసులు రెండు వర్గాలుగా విభజింపబడి ఎదురెదురుగా నిల్చి క్రమంగా పారాయణం చేస్తారు. ఉదా:- ఒక వర్గం - 'అభ్యస్యంతోః క్రమం' అని ఆరంభిస్తారు.

రెండవ వర్గం- 'క్రమ మనుపదం' అని అందుకొంటారు.

వెంటనే మొదటి వర్గం - అనుపదం రంగభర్తుః' అనగానే

రెండవ వర్గం - 'రంగభర్తుర్విహారే' అని ఇలా గొలుసు అల్లినట్లే చర్చారూపంగా, క్రమాధ్యయనం మనోజ్ఞంగా కొనసాగుతుంది.

5. రమ్యనాదం:- పాదుకలు రెండు భగవత్పాద ద్వంద్వాన్ని ఆశ్రయించి అడుగు తర్వాత మరొక అడుగువేస్తూ, లేపుతూ, నడుస్తుంటే పాదుకా సంచార క్రమం అభ్యస్యమాన మవుతుంది.

మిట్ట పల్లాలతో వ్యత్యస్తంగా ఉన్న దారిలో నడుస్తుంటే, నడవడిలో వేగమూ, నాదమూ మారుతుంది. నిమ్నోన్నత ప్రదేశాలలో పునః పునః అడుగులను వేస్తున్న కొలది ఆరోహణావరోహణలతో, క్రమాధ్యయనంలో స్వరపరిణతి లాగా, అడుగుల మార్పుతో పాటు పాదుకానాదమూ మార్పులను పొందుతుంది.

క్రమయుక్తమైన వేదనాదం వలె సంచార క్రమంలో పాదుకానాదం వీనుల విందుగా ఉంటుంది. సమాసోక్త్యలంకారం. మందాక్రాంతం.

*897. ఆసన్నానాం దివసమపున ర్నక్తమాపాదయంతీ*
*స్ఫీతాలోకా మణిభి రభితః ప్రాణినామస్తదోషా!*
*ప్రహ్వైర్జుష్టా విబుధనివహైః పాదుకే! రంగభర్తుః*
*పాదాంభోజే దిశతి భవతీ పూర్వ సంధ్యేవకాంతిమ్!!* 67

అర్థం:- హేపాదుకే = ఓ పాదుకాదేవీ! ఆసన్నానాం = దగ్గర ఉండేవారికి; దివసం = పగలును; అపునర్నక్తం

= మళ్ళీ రాత్రి లేకుండా; ఆపాదయంతీ = కల్పిస్తున్న; మణిభిః = మణుల చేత; అభితః = అన్నివైపుల; స్ఫీత+ఆలోకా = నిండువెలుగు గల; ప్రాణినాం = జనులకు; అస్తదోషా = పాపాలను / రాత్రిని పోగొట్టుతున్న; ప్రహ్వైః = నమ్రులైన; విబుధ నివహైః = దేవతల / విద్వాంసుల బృందాల చేత; జుష్టా = సేవింపబడే; భవతీ = నీవు; పూర్వ సంధ్యా, ఇవ = ప్రాతః సంధ్యవలె; రంగభర్తుః = శ్రీరంగరాజు యొక్క; పాద+అంభోజే = చరణకమలమందు; కాంతిం+శోభను - దిశతి = ఇస్తున్నావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! ఆశ్రితులకు మళ్ళీ రాత్రిరాకుండా దినమే ఉండేరీతిగా చేస్తావు. మణులచేత పలుదెసల అధిక ప్రకాశం కలదానవు, జనుల పాపాలను పోగొడ్తావు. నమ్రులైన దేవతలచేత సేవింపబడే నీవు, అంతట వెలుగుల జిమ్ముతూ, ప్రాణులకు కలిగిన రాత్రిని తొలగించి అహస్సును కలిగిస్తూ, వందారు విద్వద్బృందాలచే సేవింపబడే ఉదయకాల సంధ్య లాగా శ్రీరంగరాజ చరణకమలాలయందు శోభను కలుగజేస్తున్నావు.

వ్యాఖ్య:- పాదుక ప్రాతస్సంధ్యవలె ప్రకాశించే వర్ణన

ప్రాతః సంధ్య రాత్రిని తరిమివేసి పగలును కల్పిస్తుంది. పాదుక తననాశ్రయించిన వారికి పాపాలనే చీకట్లను చీల్చివేసి ఎల్లప్పుడు ఒక్కపగలే ఉండునట్లు చేస్తుంది. 'దివసం' అంటే ప్రకాశకాలం. కాబట్టి మోక్షజ్ఞాన వికాస హేతువైన పగలును కలిగిస్తుంది. 'అపునర్నక్తం' - మళ్ళీ సంసారం - పునర్జన్మ - లేకుండా చేస్తుంది. పాదుక తొలిసంజ సూర్యకాంతితో పలుదెసలను తెలతెల్లజేస్తుంది. పాదుక మణులకాంతితో దిక్కుల నన్నిటినీ జగజగమనిపిస్తుంది. దేవతలు పాదుకను నమ్రులై సేవిస్తారు. భూదేవతలు సంధ్యా వందనం చేస్తారు. పూర్వ సంధ్య తామరకమలాలను వికసింపజేస్తుంది.

పూర్వశ్లోకంలోని పద సంధిని బట్టి, కాలసంధి మనసున తట్టి, పాదుక పూర్వసంధ్యలాగా కవితలలో వన్నెవాసిగాంచింది. శ్లేషానుప్రాణితమైన ఉపమాలంకారం. మందాక్రాంతావృత్తం.

*898. రమ్యాలోకాలలితగమనా పద్మరాగాధరోష్ఠీ*
*మధ్యేక్షామా మణివలయినీ మౌక్తికవ్యక్తహాసా !*
*శ్యామానిత్యం హరిత మణిభిః శార్ఙ్గిణః పాదరక్షే !*
*మన్యేధాతుర్భవసి మహిళా నిర్మితౌ మాతృకాత్వమ్ ॥ 68*

**అర్థం:-** హే శార్ఙ్గిణః పాదరక్షే = ఓ భగవత్పాదుకా! రమ్య+ఆలోకా = అందమైన ప్రకాశం / వీక్షణం కల; లలితగమనా = ఒయ్యారపు నడకకలిగిన; పద్మరాగ+అధరోష్ఠీ = పద్మరాగమనే అధరోష్ఠంగల / పద్మరాగం వంటిమోవిగల; మధ్యేక్షామా = నడుమ కృశించియున్న / నడుము సన్నగా ఉన్న; మణివలయినీ = రత్నాల సముదాయం గల/రత్నఖచిత కంకణాలు కలిగిన; మౌక్తిక వ్యక్తహాసా = ముత్యాలచేత స్ఫుటమైన వికాసం గల/ముత్యాల వలె చిరునవ్వుగల; హరిత మణిభిః = మరకతమణులచే; నిత్యం = ఎల్లప్పుడు; శ్యామా = శ్యామలవర్ణంకల/యువతిగా ఉన్న; త్వం = నీవు; ధాతుః = బ్రహ్మ దేవునియొక్క; మహిళానిర్మితౌ = ఉత్తమ

స్త్రీలను సృజించడం మందు; మాతృకా = మొదటి స్వరూపం (Model); భవసి = అవుతున్నావు. మన్యే = భావిస్తాను.

**తా॥** ఓ శార్ఙ్గి పాదుకా! రమణీయ శోభగల, ఒయ్యారపు నడక కలిగిన పద్మరాగమే అధరోష్ఠం కలిగిన, మధ్యన సన్నగా ఉన్న, రత్న సముదాయంగల, ముత్యాలచే ప్రకటిత వికాసం గల, మరకతమణుల చేత నిత్యం పచ్చ పచ్చగా ఉన్న నీవు - అందమైన చూపులు, ఒయ్యారపు నడక, పద్మరాగం వంటి మోవి, సన్నని నడుము, రత్నఖచిత కంకణాలు కలిగి, ముత్యాల్లాగా ధవళహాసం కలిగి నిత్యయువతిగా ఉండే ఉత్తమ స్త్రీలను బ్రహ్మదేవుడు సృజించడానికి మాతృకగా ఉన్నావు.

వ్యాఖ్య:- ధాత పాదుకను చూచి ఉత్తమ స్త్రీలను సృజించాడని ఉత్ప్రేక్షితం

శిల్పి మొదట ఒక రూపాన్ని చూచి దాని వలె ఉండే రూపాలను నిర్మిస్తాడు. అలాగే బ్రహ్మదేవుడు పాదుకాదేవి రూపసంపదను చూచి స్త్రీ రత్నాలను సృజించాడని ఉక్తివైచిత్రి శ్లేషతో కూడిన ఉత్ప్రేక్ష. మందాక్రాంతావృత్తం.

*899. స్థిత్వాపూర్వం క్వచన భవతీ భద్రపీఠస్య మధ్యే*
*రత్నోదంచత్కిరణనికరా రంగిణః పాదరక్షే!*
*వ్యాకీర్ణానాం నృపతివిరహాద్దేవి! వర్ణాశ్రమాణాం*
*నూనంసీమావిభజనసహం నిర్మమే సూత్రపాతమ్ !! 69*

**అర్థం:-** హే దేవి! రంగిణః పాదరక్షే = ఓ రంగధాముని పాదుకాదేవీ! రత్న+ఉదంచత్ + కిరణనికరా = మణులనుంచి పైకి ప్రసరించే కిరణ సముదాయంగల; భవతీ = నీవు; పూర్వం = మునుపు; క్వచన = ఒకప్పుడు; భద్రపీఠస్య = సింహాసనం యొక్క; మధ్యే = నడుమ; స్థిత్వా = ఉండి; నృపతేః = రాజుయొక్క, పురుషశ్రేష్ఠునియొక్క; విరహాత్ = ఎడబాటువల్ల, అభావంవల్ల; వ్యాకీర్ణానాం = పరస్పరంగా సంకీర్ణమవుతున్న / ఒండొంటితో కలుస్తున్న; వర్ణ + ఆశ్రమాణాం = బ్రాహ్మణాది వర్ణాల, బ్రహ్మచర్యాద్యాశ్రమాల / తెలుపు మొదలైన వర్ణాల యొక్క, బ్రాహ్మణాదుల గృహాల యొక్క; సీమా విభజన సహం = కట్టుబాట్లను / మర్యాదను / ఎల్లలను విభజించడానికి తగిన; సూత్రపాతం = వ్యవస్థాపనను / చట్టాని / త్రాడుతో కొలిచే ఏర్పాటును; నూనం = నిశ్చయంగా; నిర్మమే = నిర్మించినట్లున్నావు.

**తా॥** ఓ రంగధాముని పాదుకాదేవీ! పైకి ప్రసరించే మణుల కిరణాలు కలిగిన నీవు తొలుత ఒకప్పుడు పవిత్ర సింహాసనం మీద కూర్చుండి, రాజులేనందు వల్ల సంకీర్ణమవుతున్న వర్ణాశ్రమాల మర్యాదను కాపాడడానికి ఆయా అతి వ్యవస్థను తెలియజేసే శుక్లాదివర్ణ యుక్తమైన రకరకాల గృహనిర్మాణాల సీమా విభజనను ఏర్పరచే సూత్రపాతాన్ని / చట్టాన్ని నిర్మించినట్లున్నావు.

వ్యాఖ్య:- పాదుకాకిరణాలు, రేఖలుగా త్రాళ్ళుగా సంభావితం

లోక క్షేమం కోసం ఏర్పడిన సమాజంలో బ్రాహ్మణాది వర్ణాల, బ్రహ్మ చర్యా ద్యాశ్రమాల మర్యాదలు,

ఆచార నియమాలు పరస్పరంగా కలిసి పోతుంటే వర్ణాశ్రమ వ్యవస్థను సంకీర్ణం కాకుండా కాపాడే బాధ్యత రాజుకు లేదా దేశనాయకునికి ఉంటుంది.

శ్రీరాముడు అడవికి పోయాడు. దశరథుడు మరణించాడు. కోసల దేశం అరాజకస్థితికి వచ్చింది. వర్ణాశ్రమాల వ్యవస్థ అవకతవకలవుతుంది. పాదుకాదేవి సింహాసన మధిష్ఠించిన పిమ్మట తన రత్నకిరణాలనే శ్రుతి స్మృతి నియమ సూత్రాలను / చట్టాలను ప్రసరింప జేసింది. ఇవి వర్ణ చాతుర్వర్ణ వ్యవస్థ నియమాలు, ఇవి నాలుగు ఆశ్రమాలకు తగిన కట్టుబాట్లు, అని ప్రకటించింది. ఆయా తెగలవారి వ్యవస్థను సులభంగా తెలియజేసే శుక్ల, రక్త, నీల, కర్బుర వర్ణాల - రంగులతో కూడిన గృహనిర్మాణ పథకాన్ని ఏర్పరచింది. శిల్పులతో సూత్ర పాతంగా నివేశస్థలాలకు ఎల్లలను - హద్దులను - ఏర్పాటు చేసి, శాసన పత్రాలను దేశమంతట వ్యాపింపజేసి నట్లున్నది పాదుకాదేవి.

'సూత్రపాతం' అనేది ఈ శ్లోకంలో కీలకం. మూడర్థాలు గోచరిస్తున్నాయి. "సూత్రంతు సూచనం గ్రంథే సూత్రంతంతు వ్యవస్థయోః" (విశ్వని.)

1. సింహాసనస్థుడైన రాజు ఆజ్ఞచేత వర్ణాశ్రమ వ్యవస్థను ప్రకటిస్తాడు.

2. ఋషులు / మేధావులు ప్రాచీనాగ్రదర్భాసనా సీనులై వర్ణాశ్రమవ్యవస్థను వెల్లడిచేసే సూత్రాలను రచిస్తారు.

3. శిల్పి (Engineer) ప్రత్యేక స్థలంలో ఏకాగ్రచిత్తుడై యుండి, ఒండొంటితో కలియకుండా, వేర్వేరు రంగులతో చిత్రించిన పటాన్ని (Plan or Design) ఆధారంగా గ్రహించి, గృహనిర్మాణాలకోసం స్థలాన్ని సూత్రం - త్రాడుతో కొలతలను ప్రవేశపెట్టి, విభజిస్తాడు. సమాసోక్తితో సంకీర్ణమైన ఉత్ప్రేక్షాలంకారం. మందాక్రాంతా వృత్తం.

*900. మాతర్మంజు స్వనపరిణతప్రార్థనా వాక్యపూర్వం*
*నిక్షిప్తాయాం త్వయి చరణయోః పాదుకే! రంగభర్తుః !*
*త్వయ్యాయత్తం కిమపికుశలం జానతీనాం ప్రజానాం*
*పర్యాప్తం తన్నఖలు నభవత్యాత్మ నిక్షేప కృత్యమ్ !! 70*

**అర్థం:**-హే మాతః, పాదుకే = ఓ తల్లీ! పాదుకా! త్వయి = నీవు; మంజు స్వన పరిణత ప్రార్థనా వాక్యపూర్వం = మధురనాదం చేత ఏర్పడిన ప్రార్థనా వాక్యం మొదట ఉండునట్లుగా; రంగభర్తుః = శ్రీరంగపతి యొక్క; చరణయోః = పాదాలయందు; నిక్షిప్తాయాం = సమర్పించబడినప్పుడు; తత్ = ఆ (నీవనుష్ఠించిన), ఆత్మనిక్షేపకృత్యం = ఆత్మసమర్పణకార్యం; కిం, అపి, కుశలం = ఏ క్షేమమైనా; త్వయి+ఆయత్తం = నీ అధీనమైనదే, అని; జానతీనాం = తెలిసియున్న; ప్రజానాం = జనులకు; పర్యాప్తం = చాలును; న, భవతి, న, ఖలు = కాదనేది కాదుకాదా!

**తా॥** ఓ జననీ! పాదుకా! నీవు, మంజులనాదం చేత ఏర్పడిన ప్రార్థనా వాక్యాన్ని మొదట విన్నవించి భగవత్పాదాలయందు సమర్పించబడినప్పుడు, నీ వాచరించిన ఆత్మ సమర్పణమనే ప్రపత్యనుష్ఠానం, ఏక్షేమమైనా నీ అధీనమని

నమ్మిన ప్రజలకు పర్యాప్తం కాదనేది కాదుకదా!

## వ్యాఖ్య:- పాదుక యొక్క ఆత్మనిక్షేపకృత్య వర్ణన

అర్చకులు శ్రీరంగనాథుని చరణాలయందు పాదుకలను ప్రార్థనా పూర్వకంగా సమర్పిస్తారు. నాదమయియైన పాదుక నన్ను కాపాడే భారం నీదే, నాకు వేరేగతి లేదు, రక్షణ భారం అంగీకరించండి, స్వామీ!" అని ప్రార్థిస్తూ భగవత్పాదాలయందు ప్రవేశిస్తున్నదని గ్రాహ్యమవుతుంది.

తనను భగవచ్చరణాలయందు సమర్పించుకొని భరన్యాసం చేయడమే ప్రపత్తి, ఆత్మనిక్షేపం లేదా శరణాగతి అనబడుతుంది.

"రక్షాపేక్షా స్వసాహ్యప్రణయవతి భరన్యాస అజ్ఞాదిదక్షే
నాత్రపపత్తి వ్యవహృతిరిహతన్మేలనే లక్షణం స్యాత్ !!" (న్యాసవింశతి)

అన్నట్లు ఇది ప్రార్థనా పూర్వక భరన్యాసం. పాదుకానాదమే ప్రార్థన. తన స్వరూపాన్ని సమర్పించుకొన్న పాదుకలను అధిరోహించి సంచరిస్తున్న శ్రీరంగ విభునికి ప్రజలు ప్రణమిల్లి ధన్యాత్ములవుతారు.

"యోగక్షేమం సకల జగతాం త్వయ్యధీనం సజానన్" - (4వ శ్లోకం) అని చెప్పినట్లు, ప్రజలయోగక్షేమం పాదుకాదేవి చేతనే సాధింపబడుతుంది. కాబట్టి పాదుకాదేవి చేసిన, 'ఆత్మనిక్షేపకృత్యం' ప్రజలకు కూడా పర్యాప్తం కాదనేది లేదు కదా! పాదుకనాశ్రయించిన భక్తులు, తమకు మోక్షం కలుగాలని ప్రత్యేకంగా ప్రపత్తి చేయనవసరం లేదు, అని సమాసోక్త్యలంకారం వల్ల గ్రాహ్యవవుతుంది.

"ఆత్మాత్మీయ భరన్యాసోహ్యాత్మనిక్షేప ఉచ్యతే" తాను చేసిన, తన ఆశ్రితులకోసం చేసిన భరన్యాసం 'ఆత్మనిక్షేప' మన బడుతుంది.

"మాం మదీయం చ నిఖిలంచేతనాచేతనాత్మకమ్ !
స్వకైంకర్యోపకరణం వరద! స్వీకురు స్వయమ్"!! అని

ఇలా ప్రార్థనతో కూడిన శరణాగతి యందు పాదుకాభక్తుల శరణాగతి కూడా అంతర్భవిస్తుంది.

"పశుర్మనుష్యః పక్షీవా యే చ వైష్ణవసంశ్రయాః !
తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమం పదమ్"!! అనే

స్మృతి ప్రకారం, ఆచార్యులు చేసిన ప్రపత్తి, వారి నాశ్రయించిన పశుపక్ష్యాదులకు కూడా మోక్షహేతువు.

పాదుకా భరన్యాస మనే కారణాంతర సన్నిధానం చేత పాదుకా సంచారాన్ని సేవించే సర్వ ప్రజలకు పురుషార్థసిద్ధి అనే కార్య సౌకర్యాన్ని వర్ణించడం వల్ల 'సమాధి' అలంకారం. మందాక్రాంతా వృత్తం.

*901. నిత్యం రంగక్షితిపతి పదన్యాస ధన్యాత్మనస్తే*
*శింజానాదం శ్రవణమధురం పాదుకే! దీర్ఘ (ద్రాఘ) యన్తః !*

*కాలే తస్మిన్ కరణవిగమక్లేశ జాతం విహన్యుః*
*సంతాపం నస్తరుణ తులసీ గంధినో గంధవాహాః !!* 71

**అర్థం:-** హే పాదుకే = ఓపాదుకా! నిత్యం = ఎల్లప్పుడు; రంగక్షితిపతి పదన్యాస ధన్య + ఆత్మనః = శ్రీరంగరాజు పాదాలకు ధరించడంచేత సుకృత శరీరం గల; తే = నీ యొక్క; శ్రవణ మధురం = చెవులకింపైన; శింజానాదం = అంతర్మణులనాదాన్ని; దీర్ఘ (ద్రాఘ) యంతః = విస్తరింపజేస్తున్న; తరుణ తులసీగంధినః = సుకుమారమైన తులసీ దళాల పరిమళం గల; గంధవాహాః = వాయువులు; తస్మిన్, కాలే = మరణ సమయంలో; కరణ విగమక్లేశ జాతం = ఇంద్రియాల నాశం వలని క్లేశం వలన కలిగిన; నః = మాయొక్క; సంతాపం = పీడను; విహన్యుః = నశింపజేయవలెను.

**తా॥** ఓ పాదుకాదేవీ! సర్వదాశ్రీరంగపతి యొక్క పాదన్యాసం చేత ధన్యాత్మవైననీ వినసొంపైన మణులనాదాన్ని దూరదూరంగా వ్యాపింపచేస్తున్న, సుకుమార తులసీ పల్లవాల పరిమళంగల పిల్లగాలులు, మరణకాలంలో ఇంద్రియాలన్నీ నశించడం వల్ల కలిగే మా బాధను పోగొట్టవలెను.

**వ్యాఖ్య:-** పాదుకానాదం, తులసీ పరిమళం మరణ దశలోకలిగే తాపాన్ని శమింపజేయాలని ప్రార్థన

కావేరీ నది యొక్క రెండు పాయల నడుమనున్న నేలమీద శ్రీరంగనాథుడు సంచరిస్తుంటే చల్లని పిల్ల తెమ్మెరలు అనుకూలంగా వీస్తుంటాయి. పాదుకానాదం కర్ణామృతంగా ఉంటుంది. దివ్యతులసీ గంధం సంతాప ప్రశమనౌషధం.

చరమ దశలో కరణకళేబరాలు శిథిలమై దుఃఖం కలుగకుండా - పాదుకానాదం చెవులకు, తులసీ గంధం ముక్కుకు, శీల స్పర్శత్వక్కుకు సోకునట్లు - మందవాయువులను దీర్ఘంగా ప్రసరింపజేయుపని పాదుకను ప్రార్థించడం ప్రశంసనీయం.

వాసన ఆధ్యాత్మికం. స్పర్శ ఆధిభౌతికం. నాదం ఆధి దైవికం. "ఆకాశాద్వాయుః" (శ్రుతి). శబ్ద స్పర్శలు రెండే గాలికి ప్రధాన విషయాలు. గంధం (వాసన) అనుషంగికం.

స్వయంకృతా పరాధం చేత కరణత్రయం అంత్యకాలంలో తాప త్రయ పడకుండా, సత్పులోపాయమైన పాదుకా దేవ్యనుగ్రహం అత్యావశ్యకం - ప్రేయోఽలంకారం. మందాక్రాంతావృత్తం.

*902. సంసారాధ్వశ్రమ పరిణతం సంశ్రితానాంజనానాం*
*తాపం సద్యః శమయితుమలం శార్ఙ్గిణః పాదుకే! త్వమ్!*
*చంద్రాపీడే ప్రణమతి నవాంచంద్రికామాపిబద్భి*
*ర్ధారానిర్యత్సలిల కణికాశీభ(క)రైశ్చంద్రకాంతైః !!* 72

**అర్థం:-** హే శార్ఙ్గిణః పాదుకే = ఓ భగవత్పాదుకా! చంద్ర + ఆపీడే = చంద్ర శేఖరుడు; ప్రణమతి = నమస్కరిస్తున్నప్పుడు.; నవాం = కొత్తదైన; చంద్రికాం = చంద్రకళను; ఆపిబద్భిః = తాగుతున్న; ధారా నిర్యత్

సలిలకణికాశీభరైః = ధారగా జారుతున్న నీటి చుక్కలచే సాంద్రమైన; చంద్రకాంతైః = చంద్రకాంతమణులచేత; సంశ్రితానాం = ఆశ్రితులైన; జనానాం = ప్రాణులకు; సంసార+అధ్వశ్రమ పరిణతం = సాంసారిక మార్గమందలి బడలికచేత ఏర్పడిన; తాపం = తాపాన్ని; సద్యః = అప్పుడే; శమయితుం = తీర్చడానికి; త్వం = నీవు; అలం = వలంతివి.

**తా॥** ఓ భగవత్పాదుకా! చంద్రశేఖరుడు నీకు నమస్కరిస్తుంటే ఆయన తలమీది చంద్రకళను గ్రహించడం వల్లనే ధారగా స్రవించే జలబిందువులచేత సాంద్రంగా స్ఫురించే చంద్రకాంతమణులచేత ఆశ్రిత జనులకు సంసార మార్గమందు కలిగిన శ్రమవల్ల ఉత్పన్నమైన ఆధ్యాత్మికాది తాపాన్ని నిన్ను సేవిస్తున్నప్పుడే నీవు తీర్చే సమర్థవు.

వ్యాఖ్య:- చంద్రకాంతమణులనుంచి స్రవించే జలంతాపాన్ని శమించే వర్ణన

చంద్రశేఖరుడు పాదుకాదేవికి తలవంచి నమస్కరించాడు. పాదుకల్లోని చంద్రకాంత మణులకు శివుని తలమీది చంద్రునికిరణాలు సోకినాయి. వెంటనే ఆమణులు కరిగి నీటి బొట్ల ధారగా జారినాయి.

మరుభూమి - ఎడారిలో పయనించే వారి తాపాన్ని జలధార తీర్చే రీతిగా పాదుకల్లోని చంద్రకాంత శిలలనుంచి ధారగా కారే నీరు సంసారుల తాపాన్ని శమింపచేస్తుంది.

'సలిల కణిక, శీకర' అనే పదాలకు 'జలబిందువులు' అని ఒకే అర్థం. కాబట్టి 'పునరుక్తి' ఏర్పడుతుంది. 'శీకర' అనే చోట 'శీభర' పదం సముచితంగాఉంది.

'శీభృ' కత్థనే - అనే ధాతువుకు 'అరన్' ప్రత్యయం ఔణాదికం చేరగా 'శీభర' శబ్దమేర్పడింది. 'శీభరః స్ఫారరమ్యయోః' - నిఘంటువు. రమ్యార్థకం. 'యతిరాజసప్తతి'లో 'స్థితిమవధీరయంతి' అనే శ్లోకంలో 'ఘననీశకర శీభః తాం' అని ఉంది. 'యాదవాభ్యుదయం'లోనూ (3 సర్గ-4వ శ్లోకం)

"అనతివేల సమీకరణ చోదితైః శిశిర శీకర శీభరితాంబరైః" అని ఉంది. 'శీభరితం = స్ఫారీకృతం, రమణీయీ కృతం వా' అని అప్పయదీక్షితుల వారి వ్యాఖ్యానం.

పాదుకకు సంబంధించిన గాలి తాపాన్ని ఆర్పుతుందని పూర్వశ్లోకంలో చెప్పిన తర్వాత, ఈ శ్లోకంలో నీరు భవమార్గాయాస జన్యమైన తాపాన్ని ఉపశమింపజేస్తుందని వర్ణించారు దేశికులు.

పదార్థహేతుక కావ్యలింగాలంకారం. మందాక్రాంతావృత్తం.

*903.* వజ్రోపేతాం బలభిదుపలశ్యామలాంమంజుఘోషాం
ముక్తాసారాం మధుర చపలాం వీక్ష్య విష్ణోః పదేత్వామ్ !
హర్షోత్కర్షాదుపరిచలయన్ పాదుకే ! చంద్రకాంతం
ధత్తే నిత్యం ధృతఘన రుచిస్తాండవం నీలకంఠః !! 73

**అర్థం:-** హే పాదుకే = ఓ పాదుకా! వజ్ర+ఉపేతాం = వజ్రాలతోకూడిన; పిడుగులతో కూడిన; బలభిత్+ఉపలశ్యామలాం = ఇంద్రనీలమణుల చేత/వలె నీలవర్ణంగల; మంజుఘోషాం = మంజుల నాదంగల / గర్జన గల; ముక్తా సారాం = ముత్యాలచే శ్రేష్ఠమైన; ముక్త+ఆసారాం = వదలబడిన జడివానగల; మధుర చపలాం = రమ్యంగా చలించే / అందమైన మెరుపుగల; త్వాం = (మేఘమాలను పోలిన) నిన్ను; విష్ణోః పదే = భగవంతుని చరణమందు / ఆకాశమందు; వీక్ష్య = చూచి; ధృతఘనరుచిః = ధరింపబడిన మిక్కిలి ప్రేమగల / పొందిన మేఘమందలి ప్రీతిగల; నీలకంఠః = శివుడు/ నెమిలి; హర్ష + ఉత్కర్షాత్ = సంతోషాతిశయం వల్ల; ఉపరి = పైభాగమందు; చంద్రక+అంతం = బాలచంద్రుని మొనను / పింఛంయొక్క కొనను; చలయన్ = కదిలిస్తు; నిత్యం = ఎల్లప్పుడు; తాండవం = నర్తనాన్ని; ధత్తే = చేయును.

**తా॥** ఓ పాదుకాదేవీ! వజ్రాలతో కూడి ఇంద్రనీలమణులచేత నీలవర్ణం కలిగి, మంజులనాదం కలిగి, ముత్యాలచే ఉత్కృష్టమై రమ్యంగా సంచరించే నిన్ను శ్రీరంగపతి పాదమందు చూచి మిక్కిలి భక్తికలిగిన నీలకంఠుడు సంతోషాతిశయం వల్ల తన తలమీద ఉన్న చంద్రకళాభాగాన్ని ఇంచుక సంచలింపజేస్తూ -

పిడుగులతో కూడి ఇంద్రనీలమణులవలె నీలవర్ణం కలిగి, మనోజ్ఞ గర్జనకలిగి జడివానను కురిపిస్తూ అందమైన మేఘమాలను ఆకాశమందు చూచి, మేఘమందు ప్రీతిని పొందిన మయూరం సంతోషం పొంగి పింఛపు కొనను మెల్లగా కదిలించి విప్పుతు ఆడుతున్నట్లు - నిత్యం తాండవం చేస్తాడు.

వ్యాఖ్య:- పాదుకను సేవించిన పరమశివుడు, మేఘమాలను జూచిన మయూరంవలె తాండవ నృత్యం చేస్తాడని వర్ణితం

(కాదంబినికి) మేఘమాలకు, పాదుకాదేవికి అభేదాధ్యవ్యవసాయం

కాదంబిని పిడుగులతో కూడింది. పాదుక వజ్రాలతోకూడింది.

కాదంబిని గర్జన కలది. పాదుక పాదం కలది.

కాదంబిని వర్షంచేతనూ, పాదుక ముత్యాలచేతనూ శోభిస్తుంది.

కాదంబిని ఆకాశాన, పాదుక విష్ణుపదాన సంచలిస్తుంది.

(కేకి) నీలకంఠ పక్షికి, నీలకంఠునికి అభేదాధ్యవసాయం.

కేకికి కాదంబిని యందు ప్రీతి. పినాకికి పాదుకయందు భక్తి

కేకి కాదంబిని చూచి తోకను మెల్లగా విప్పుతుంది. పినాకి పాదుకను సేవించి చంద్రరేఖాగ్రాన్ని కదిలిస్తాడు.

కేకి నృత్యం చేస్తుంది. పినాకి తాండవం చేస్తాడు.

శ్లేషాను ప్రాణితరూపకాలంకారం. 'కాదంబినీ' వాచకం లేనందువల్ల ఏక దేశ వృత్తం మందాక్రాంతం.

904. *శ్రీరంగేందో శ్చరణకమలం తాదృశంధారయింతీ*
*కాలే కాలే సహకమలయా క్లప్తయాత్రోత్సవ శ్రీః !*
*గత్వా గత్వా స్వయమనుగృహ ద్వారమున్నిద్రనాదా*
*పౌరాన్నిత్యం కిమపికుశలం పాదుకే! పృచ్ఛసీవ !!* 74

**అర్థం:-** హే పాదుకే = ఓపాదుకాదేవీ! శ్రీరంగ+ఇందోః = శ్రీరంగచంద్రుని యొక్క; తాదృశం = అటువంటి (సర్వలోకశరణ్యమైన); చరణకమలం = పాదారవిందాన్ని; ధారయంతీ = మోస్తున్న; క్లప్త యాత్రా + ఉత్సవ శ్రీః = చేయబడిన యాత్రోత్సవశో భగల; నీవు; స్వయం = స్వయంగా; అనుగృహద్వారం = ఒక్కొక్క ఇంటివాకిలికి; గత్వా, గత్వా = పోయి, పోయి; ఉన్నిద్ర నాదా = మేల్కొలిపే నాదం కలదానివై; పౌరాన్ = శ్రీరంగనగరజనులను; నిత్యం = ఎల్లప్పుడు; కిం, అపి, కుశలం = ఏదోక్షేమాన్ని; పృచ్ఛసి, ఇవ = అడుగుతున్నట్లున్నావు.

**తా॥** ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాథుని సర్వలోకశరణ్యమైన పాదారవింద యుగళాన్ని వహిస్తూ ఉచితసమయాల్లో లక్ష్మీదేవితో కూడా విహితమైన యాత్రోత్సవ వైభవం గల నీవు స్వయంగా ప్రతిగృహద్వారం ముందుకు పోయి ప్రబోధించే నాదం కలదానివై శ్రీరంగనగరసౌరులను ఎల్లప్పుడు ఏదో క్షేమసమాచారాన్ని అడుగుతున్నట్లున్నావు.

